# Andhra Maha Bharatam: Samajikamshala Pariseelana

(Aadi Parvam nundi Virata Parvam varaku)

**A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the degree of**

**Doctor of Philosophy**
**In**
**Telugu**

**Researcher**
**GARIKIPATI GURAJADA**
**(15HTPH03)**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad- 500046**
**Telangana, India**
**June- 2020**

# Andhra Maha Bharatam: Samajikamshala Pariseelana

(Aadi Parvam nundi Virata Parvam varaku)

**A Thesis submitted to the University of Hyderabad in partial fulfilment of the degree of**

**Doctor of Philosophy**
**In**
**Telugu**


**Researcher**
**GARIKIPATI GURAJADA**
**(15HTPH03)**

**Supervisor**
**Prof. Pillalamarri Ramulu.**

**Department of Telugu**
**School of Humanities**
**University of Hyderabad**
**Hyderabad- 500046**
**Telangana, India**


**June- 2020**

# ఆంధ్ర మహాభారతం : సామాజికాంశాల పరిశీలన

## (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు)

పిహెచ్. డి పట్టం కోసం హైదరాబాదు విశ్వవిద్యాలయానికి సమర్పించిన పరిశోధన గ్రంథం


పరిశోధన

**గరికిపాటి గురజాడ**

(15HTPH 03)

పర్యవేక్షణ

**ఆచార్య పిల్లలమర్రి రాములు**

తెలుగుశాఖ

మానవీయ శాస్త్రాల విభాగం

హైదరాబాదు విశ్వవిద్యాలయం

హైదరాబాదు – 500046



జూన్– 2020

# DECLARATION

I, **Garikipati Gurajada** hereby declare that this Thesis **Andhra Maha Bharatam: samajikamshala pariseelana** (Aadi Parvam nundi Virata Parvam varaku) submitted by me under the guidance and supervision of **Prof**. **P. Ramulu** is my bonafide research work. I also declare that it has not been submitted previously in part or in full to this University or any other University or Institution for the award of any degree or diploma. I hereby agree that this Thesis can be deposited in Shodhganga/INFLIBNET.

Signature of the Student

Date:

Name: Garikipati Gurajada

Registration No. 15HTPH03

## CERTIFICATE

This is to certify that the thesis entitled **"Andhra Maha Bharatam: Samajikamshala Pariseelana** (Aadi Parvam nundi Virata Parvam varaku)" submitted by **Garikipati Gurajada** bearing the registration No. **15HTPH03** in partial fulfilment of the requirements for the award of the degree of Doctor of Philosophy in Telugu is a bona fide work carried out by him under my supervision and guidance.

This thesis is free from plagiarism and has not been submitted previously in part or in full to this or any other University or institution for the award of any degree.

**Part of this thesis have been:**

**A. Published in the following publications:**

1. Published a Research Paper entitled **Shakunthalopakhyanam: manava sambandhaalu** in **Bhavaveena**, an **UGC approved International Journal** published by Sri krishna Rao, Guntur **ISSN- 2456- 4702,** vol: 16, issue. 8 (2), August 2019.
2. Published a Research paper entitled **Andhra Mahabharatamlo yaksha prashnalu: Manasika paripakvatha** in *Parishodhana: Ninna, Nedu, Repu*, edited by Prof. M. Sampath kumar, Department of Telugu, University of Madras, Madras **ISBN – 978- 93- 81992- 32- 6.**
3. Published a Research article entitled **Andhra Mahabharatam: Adhunika Jeevitam** in Anekam, published by Bhukya Publications, Guntur in 2017, **ISBN – 978- 81- 927315- 9-9**.

**B. Presented papers in the following conferences:**

1. Presented and published a Research Paper entitled **Shakunthalopakhyanam: samskarana Drikpatham** in an **International Conference** organised by Sir C. R. Reddy College, Eluru and Department of Language and culture, Government of Andhra Pradesh on 14th and 15th December 2018. **ISSN – 2456- 4702.**
2. Presented and published a Research Paper entitled **Andhra Mahabharatam: Vyaktitva vikasam** in an **International Seminar** organised by S. V. K. P& Dr. k. S. Raju Arts & Science College in collaboration with Adikavi Nannaya University, Rajamahendravaram on 2nd & 3rd April, 2018. **ISBN – 978- 93- 5300- 753.**

Further, The Student has passed the following courses towards fulfilment of course work requirement for Ph.D.

| **Course Code** | **Name** | **Credits** | **Pass/fail** |
|---|---|---|---|
| 1. HT700 | Research Methodology | 4.00 | PASS |
| 2. HT701 | History of Telugu Research | 4.00 | PASS |
| 3. HT702 | Studies in Literature | 4.00 | PASS |
| 4. HT703 | Studies in Specialized Area | 4.00 | PASS |

**Research Supervisor** **Head, Telugu** **Dean, Humanities**

# విషయ సూచిక

పుటసంఖ్య

i. **కృతజ్ఞతలు**

ii. **సంకేతాలు: వివరణ**

## 0. ప్రవేశిక (i – vi)

| | |
|---|---|
| 0.1 పరిశోధనాంశ వివరణ. | i |
| 0.2 పరిశోధనకు మూల ఆకరం | i |
| 0.3. పూర్వ పరిశోధనలు | ii |
| 0.3.1. ఎం. ఫిల్. పరిశోధనలు | ii |
| 0.3.2. పిహెచ్. డి. పరిశోధనలు | ii |
| 0.4. పరిశోధన ఆవశ్యకత | iii |
| 0.5. పరిశోధన పరిధి | v |
| 0.6. పరిశోధన లక్ష్యం | v |
| 0.7. పరిశోధన గ్రంథ రచనాపద్ధతి. | v |

## అధ్యాయం – 1

## ఆంధ్ర మహాభారతం : వైశిష్ట్యం (01 – 25)


| | |
|---|---|
| 1.1. ఉపోద్ఘాతం | 01 |
| 1.2. జయ కావ్యం | 02 |
| 1.3. వేదవ్యాస మహర్షి | 03 |
| 1.4. జయ కావ్యం– మహాభారతం: పరిణామ క్రమం | 04 |
| 1.5. ఆంధ్ర మహాభారతం: అనువాద విధానం | 05 |
| 1.6. కవిత్రయం | 07 |
| 1.6.1. నన్నయ | 07 |
| 1.6.2. తిక్కన | 08 |
| 1.6.3. ఎఱ్ఱన | 09 |
| 1.7. మహాభారత యజ్ఞం: కవిత్రయం | 10 |
| 1.8. ఆంధ్ర మహాభారతం: ప్రత్యేకత | 18 |
| 1.9. తింటే గారెలే తినాలి; వింటే భారతమే వినాలి | 20 |
| 1.10. అమృతత్వ సాధనం | 20 |
| 1.11. యుగాచారవర్తనం – యుగధర్మాల ప్రస్తావన | 22 |
| 1.12. విజ్ఞాన సర్వస్వం | 23 |

## అధ్యాయం – 2

## ఆంధ్ర మహాభారతం: ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాంశాలు (26 – 78)


**2.1. ఉపోద్ఘాతం** 26

**2.2. ఆంధ్ర మహాభారతం: ఆర్థికాంశాలు** 26

2.2.1. నారదుడి ఆర్థిక సూత్రాలు 27

2.2.2. రాజసూయయాగం – ఆర్థిక విశేషాలు 31

2.2.3. మాయాద్యూతం: ఆర్థిక విశేషాలు 34

2.2.4. నలదమయంతుల కథ: ఆర్థిక విశేషాలు 36

2.2.5. ఉత్తరాభిమన్యుల వివాహం: ఆర్థిక విశేషాలు 37

**2.3. ఆంధ్ర మహాభారతం: రాజకీయాంశాలు** 38

2.3.1. లాక్షాగృహదహనం 39

2.3.2. దుర్యోధనుడి పాండవపాంచాలవిభేదనోపాయం 40

2.3.3. నారదుడి రాజనీతి సూత్రాలు 43

2.3.4. మాయాద్యూతం 46

2.3.5. దుర్యోధనుని ఘోషయాత్ర 47

2.3.6. కీచకవధ ఘట్టం: దండనీతి 49

2.3.7. గోగ్రహణ యుద్ధ వ్యూహం 51

2.3.8. ధర్మరాజు ప్రతివ్యూహం 53

2.3.9. భీష్ముడి రాజనీతి 55

2.3.10. ద్రోణాచార్యుల యుద్ధవ్యూహం 56

2.3.11. అర్జునుడి ఛేదన 58

**2.4. ఆంధ్ర మహాభారతం: సాంస్కృతికాంశాలు 61**

2.4.1. ఇంద్రోత్సవం 62

2.4.2. కౌముది ఉత్సవం 64

2.4.3. వివాహ సంప్రదాయం 64

2.4.3.1. యయాతి కథ 65

2.4.3.2. ప్రతీపుడి కథ 66

2.4.3.3. తపతీసంవరణోపాఖ్యానం 67

2.4.3.4. ద్రౌపది వివాహమహోత్సవం 68

2.4.3.5. ఉతరాభిమన్యుల వివాహం 70

2.4.4. కుమారాస్త్రవిద్యాసందర్శనము 71

2.4.5. మయసభ నిర్మాణం: శిల్పకళానైపుణ్యం 73

2.4.6. రాజసూయయాగం: సాంస్కృతిక విశేషాలు 75

2.4.7. రాజాస్థానాల్లో మల్లయుద్ధాలు 77

2.5. ముగింపు 78

## అధ్యాయం – 3

## ఆంధ్ర మహాభారతం: మానవ సంబంధాలు (79 - 120)


3.1. ఉపోద్ఘాతం 79

3.2. సర్పయాగం 80

3.3. గరుడోపాఖ్యానం 84

3.4. కురుక్షేత్ర సంగ్రామానికి బీజం 87

3.5. కచ దేవయానుల కథ 88

3.6. యయాతి వృత్తాంతం: మానవ సంబంధాలు 90

3.7. శకుంతలోపాఖ్యానం 92

3.8. గాంధారి వృత్తాంతం 100

3.9. ద్రోణ, ద్రుపదుల కథ 101

3.10. భీమ హిడింబల సంవాదం 102

3.11. సుందోపసుందుల కథ 103

3.12. రాజసూయయాగం: మానవ సంబంధాలు 103

3.13. మాయాద్యూతం: మానవ సంబంధాలు 104

3.14. పాండవుల అరణ్యవాసం 107

3.15. నలోపాఖ్యానం 108

3.16. ధర్మవ్యాధోపాఖ్యానం 109

3.17. సావిత్రీసత్యవంతుల కథ 110

3.18. యక్ష ప్రశ్నలు 111

3.19. కీచకవధ ఘట్టం 115

3.20. ఉత్తరగోగ్రహణం 117

3.21. ముగింపు 119

## అధ్యాయం – 4

## ఆంధ్ర మహాభారతం: నాయకత్వ లక్షణాలు (121 - 152)

4.1. ఉపోద్ఘాతం 121

4.2. రాజరాజ నరేంద్రుడి నాయకత్వ లక్షణాలు 122

4.3. పరీక్షిన్మహారాజు గుణగణాలు 125

4.4. కురువంశ మహారాజుల ప్రశస్తి 126

4.5. నాయకత్వ సూత్రాలు: యయాతి బోధన 128

4.6. దుష్యంతుడి నాయకత్వ లక్షణాలు 131

4.7. బాల్యంలోనే నాయకత్వ లక్షణాలు 133

4.8. భీష్ముడి నాయకత్వం 134

4.9. వసిష్ఠ, విశ్వామిత్రుల సంవాదం 136

4.10. అర్జునుని కర్తవ్యనిష్ఠ 137

4.11. పద్నాలుగు (14) రాజదోషాలు 137

4.12. బలి చక్రవర్తి పేర్కొన్న నాయకత్వ సూత్రాలు 139

4.13. నలుడి నాయకత్వ లక్షణాలు 140

4.14. కుబేరుడు పేర్కొన్న పంచ లక్షణాలు 141

4.15. మార్కండేయ మహర్షి నాయకత్వ సూత్రాలు 142

4.16. కీచకవధ ఘట్టం: నాయకత్వ లక్షణాలు 143

4.17. చక్రవర్తికి ఉండవలసిన లక్షణాలు 145

4.18. ఆదర్శ పరిపాలన 146

4.19. ఉత్తమ నాయకుడి వ్యక్తిత్వం 148

4.20. యోధుడికి ఉండవలసిన లక్షణాలు 150

4.21. ముగింపు 152

## అధ్యాయం – 5

## ఆంధ్ర మహాభారతం: ధర్మాధర్మ వివేచన (153 - 187)

5.1. ఉపోద్ఘాతం 153

5.2. సరమ వృత్తాంతం 154

5.3. గరుత్మంతుని కథ 155

5.4. కచదేవయానుల సంవాదం 157

5.5. లాక్షాగృహదహనం: ధర్మాధర్మవివేచన 158

5.6. శకుంతలాదుష్యంతుల కథ 159

5.7. అణి మాండవ్యుడి కథ 164

5.8. ధర్మాధర్మ వివేచన: విదురుడి బోధన 165

5.9. భీష్ముడి ధర్మ ప్రబోధం 166

5.10. ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టం 167

5.11. అర్జునౌర్వశీ వృత్తాంతం 172

5.12. కౌశిక ధర్మవ్యాధ సంవాదం 173

5.13. సింహబలీయం: ధర్మాధర్మ వివేచన 175

5.14. ధర్మ సంఘర్షణ 179

5.14.1. జరత్కారుడి కథ 179

5.14.2. అర్జునుడి ధర్మాధర్మవివేచన 182

5.14.3. శిబి చక్రవర్తి కథ 183

5.14.4. ధర్మవ్యాధుడి కథ 184

5.14.5. యుద్ధరంగంలో ధర్మాధర్మవివేచన 185

5.15. ముగింపు 187

## అధ్యాయం – 6

## ఆంధ్ర మహాభారతం: నిర్వహణ సామర్థ్యం (188 - 215)


6.1. ఉపోద్ఘాతం 188

6.2. గరుత్మంతుడి కార్యనిర్వహణ 189

6.3. మానవ ప్రయత్నం 191

6.4. శకుంతల సహనం, ధైర్యం 193

6.5. లావుక పిట్టల సమయస్ఫూర్తి 195

6.6. రాజసూయయాగ నిర్వహణ 196

6.7. దమయంతి కార్యనిర్వహణ వ్యూహం 198

6.8. నలుడి ప్రతిభ 200

6.9. అష్టావక్రుడి కథ 202

6.10. కార్యసిద్ధి: హనుమంతుడి బోధన 203

6.11. సత్యాద్రౌపదీ సంవాదం 205

6.12. సంక్షోభ నివారణ: యక్ష ప్రశ్నల ఘట్టం 206

6.13. ధౌమ్యుడి సందేశం: సర్దుబాటు తత్వం 208

6.14. కీచకవధ ఘట్టం: వ్యూహ నైపుణ్యం 212

6.15. ముగింపు 215

## అధ్యాయం – 7

## ఆంధ్ర మహాభారతం: సంభాషణానైపుణ్యం (216 - 253)


| | |
|---|---|
| 7.1. ఉపోద్ఘాతం | 216 |
| 7.2. ఉదంకుడి నాగలోక స్తుతి | 217 |
| 7.3. పరీక్షిత్తు కథ | 221 |
| 7.4. ఆస్తీకుడి జనమేజయ యాగస్తుతి | 222 |
| 7.5. శకుంతలోపాఖ్యానం: సంభాషణాచారిమ | 228 |
| 7.6. విదురుడి సంభాషణానైపుణ్యం | 233 |
| 7.7. జరాసంధుడి వధ | 235 |
| 7.8. రాజసూయయాగం: వాక్చాతుర్యం | 236 |
| 7.9. దుర్యోధనుడి ఘోషయాత్ర | 238 |
| 7.10. సావిత్రీసత్యవంతుల కథ | 241 |
| 7.11. కీచకవధ ఘట్టం: సంభాషణానైపుణ్యం | 244 |
| 7.12. ఉత్తరగోగ్రహణం: వాక్చతురత | 248 |
| 7.13. ముగింపు | 253 |

## అధ్యాయం – 8

## ఆంధ్ర మహాభారతం: వ్యక్తిత్వ వికాసం (254 - 295)


8.1. ఉపోద్ఘాతం 254

8.2. ఉదంకుడి గురుభక్తి 255

8.3. కద్రూవినతల కథ 256

8.4. క్షీరసాగర మథనం 258

8.5. పరీక్షిత్తు కథ: వ్యక్తిత్వ వికాసం 260

8.6. యయాతి వృత్తాంతం 264

8.7. భీష్మ ప్రతిజ్ఞ 266

8.8. కణ్వమహర్షి ఆశ్రమ వాతావరణం 267

8.9. శకుంతల ధర్మసూక్ష్మ దర్శనం 269

8.10. బకాసుర వధ 272

8.11. ఔర్వుడి వృత్తాంతం 273

8.12. భీమార్జునుల ఆత్మస్థైర్యం 274

8.13. ద్రౌపది వ్యక్తిత్వం 275

8.14. గృహస్థాశ్రమ ధర్మం: ఔన్నత్యం 276

8.15. పాండవులు – కౌరవులు: వ్యత్యాసం 278

8.16. దమయంతి సౌశీల్యం 279

8.17. సంపూర్ణమైన వ్యక్తిత్వం 280

8.18. యువక్రీత చరిత్ర 281

8.19. తార్క్ష్య మహర్షి కథ 282

8.20. సత్యనిష్ఠ 284

8.21. జీవన విధానం 286

8.22. ఇంద్రియ నిగ్రహం 288

8.23. యక్ష ప్రశ్నలు: ఉన్నత వ్యక్తిత్వం 289

8.24. కీచకవధ ఘట్టం: సంపూర్ణ వికాసం 290

8.25. ఉత్తరగోగ్రహణం 292

8.26. ముగింపు 295

9. ముక్తాయింపు

10. పరిశోధన ఫలితాలు

11. ఉపయుక్త గ్రంథాలు

ప్రచురించబడిన పరిశోధన పత్రాలు

సదస్సులలో సమర్పించిన పరిశోధన పత్రాలు

# కృతజ్ఞతలు

'ఆ పుణ్య దంపతులని ఒక్కసారి చూసినా చాలు' అని ఎంతోమంది కల కంటూ ఉంటారు. అటువంటిది, ఏ జన్మలో చేసుకున్న పుణ్యమో ఫలించి, మంచి వ్యక్తిత్వం కలిగిన అమ్మానాన్నలకి బిడ్డగా పుట్టే భాగ్యం నాకు వరంగా సిద్ధించింది. చిన్ననాటి నుండి తెలుగు భాషలోని మాధుర్యాన్ని కొద్దికొద్దిగా రుచి చూపిస్తూ, దైవభక్తినీ, దేశభక్తినీ నా గుండెల నిండా నింపి, వారి పెంపకం ద్వారా నన్ను బాధ్యత కలిగిన యువకుడిగా తీర్చిదిద్దిన అమ్మానాన్నలు **శ్రీమతి గరికిపాటి శారద**, మహాసహస్రావధాని, ధారణా బ్రహ్మరాక్షసుడు **డా. గరికిపాటి నరసింహారావు** దంపతులకి, ఇంతటి భాగ్యాన్ని ప్రసాదించిన నా ఆరాధ్య దైవం, ఆది దైవం పరమ శివుడికీ సభక్తికంగా సాష్టాంగ నమస్కారాలు సమర్పించుకుంటున్నాను.

ప్రాచీన సాహిత్యం పట్ల ఆసక్తి సన్నగిల్లుతున్న ఈ రోజుల్లో, పద్య సాహిత్యం పట్ల నాకున్న మక్కువని 2011లోనే గుర్తించి, ఎం. ఫిల్ లో మనుచరిత్రపై నేను చేసిన పరిశోధనకి పర్యవేక్షకుడిగా వ్యవహరించి, నాలో ఉన్న సృజనాత్మకతని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ, మహాభారతం పట్ల నాకున్న ప్రత్యేక ఆసక్తిని పరిశోధన దిశగా మరల్చిన పరిశోధన పర్యవేక్షకులు, మా గురువుగారు **ఆచార్య పిల్లలమర్రి రాములు**గారికి, సవినయంగా, సభక్తికంగా నమస్కారాలు.

నన్ను ఎప్పుడూ ప్రోత్సహిస్తూ, పరిశోధనలో మెళకువలు నేర్పిస్తూ, నాపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించే మాతృమూర్తి, తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జి. అరుణ కుమారి గారికి, నేను ఏ పని చేసినా కృతకృత్యుడిని అవుతానని విశ్వసించి, నాలో నాయకత్వ లక్షణాలను గుర్తించిన మానవీయ శాస్త్రాల పీఠాధిపతి, ఆచార్య ఎస్. శరత్ జ్యోత్స్నారాణి గారికి నమస్సులు.

ఆంధ్ర మహాభారతంపై పరిశోధన చేస్తాను అనగానే, నన్ను మెచ్చుకొని, పరిశోధన విషయంలో ఎన్నో విలువైన సలహాలు ఇచ్చి, నా పరిశోధనని నిరంతరం సమీక్షిస్తూ, ఒక్క చిరునవ్వుతో కోటి సమస్యలని తరిమేయగల సౌమ్యశీలి, ఆచార్య రేమిల్ల వేంకట రామకృష్ణ శాస్త్రి గారికి (డాక్టోరల్ కమిటీ సభ్యులు), ఎం. ఫిల్ లో నేను చేసిన పరిశోధన చూసి, అభినందించి,

వ్యక్తిగతంగా నా ఎదుగుదలని ఎప్పుడూ కాంక్షిస్తూ, విద్యార్థుల సంక్షేమం కోసం అహర్నిశలూ శ్రమించే డెప్యుటీ డీన్, స్టూడెంట్స్ వెల్ఫేర్, ఆచార్య దార్ల వేంకటేశ్వర రావు గారికీ (డాక్టోరల్ కమిటీ సభ్యులు), కేవలం పుస్తకాల్లో చెప్పేదే ప్రపంచం కాదని, జీవితానుభవాల ద్వారా విద్యార్థులు పాఠాలు నేర్చుకోవాలని విశ్వసించే సృజనశీలి ఆచార్య తుమ్మల రామకృష్ణగారికి, కవిత్వాన్నే ఊపిరిగా చేసుకుని బ్రతుకుతున్న ఆధునిక కవి, సహృదయతకి చిరునామా ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారికి, 11 ఏళ్లు నాకు పాఠాలు చెప్పి, అనుక్షణం నా పురోగతిని మనసారా కాంక్షించే గురువులు ఆచార్య గోనానాయక్ గారికి, ఆచార్య పమ్మి పవన్ కుమార్ గారికీ, ఆచార్య డి. విజయలక్ష్మిగారికీ, డా. బాణాల భుజంగరెడ్డిగారికీ, డా. డి. విజయ కుమారి గారికి అయిదు పది చేస్తున్నాను.

ఇంటర్ పూర్తయ్యే సమయానికి, తోటి మిత్రులంతా ఇంజనీరింగ్, మెడిసిన్ అంటూ బయలుదేరితే, తెలుగంటే ఉన్న విపరీతమైన అభిమానంతో ఏం చేయాలో తెలియక అయోమయంలో పడ్డ నాకు, తెలుగులో అద్భుతమైన కోర్సు ఉందని చెప్పి, నా అడుగులు హైదరాబాదు విశ్వవిద్యాలయం వైపు పడేలా దిశానిర్దేశం చేసిన తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య బేతవోలు రామబ్రహ్మం గారికి ఏమిచ్చి ఋణం తీర్చుకోగలను? ఏమిచ్చినా తక్కువే అవుతుంది. వారికి శతకోటి ప్రణామాలు.

పరిశోధన పూర్తి చేసుకొని, నేను వీలైనంత త్వరగా జీవితంలో స్థిరపడాలని కోరుకునే అన్నయ్య శ్రీశ్రీకీ, వదిన మధులతలకీ, నన్ను సొంత తమ్ముడిగా భావించి, విశ్వవిద్యాలయంలో నాకు ఎదురైన సమస్యలని తన భుజాలపై వేసుకుని, నేను ఎప్పుడూ సరైన మార్గంలో నడిచేలా అనుక్షణం నా వెన్నంటి నిలబడి, వినయవిధేయతలను అలవర్చి, నన్ను ప్రాణానికి ప్రాణంగా చూసుకునే యువ ప్రవచనకర్త, కవి, వ్యాఖ్యాత డా. గంగిశెట్టి లక్ష్మీనారాయణ అన్నయ్యకీ, నా పై ఎనలేని అభిమానంతో, వల్లమాలిన ప్రేమతో, నన్ను చేరదీసి పరిశోధనలో మూలాలు బోధించి, నన్ను వారి కుటుంబంలో ఒక్కడిగా భావించే యువ ప్రవచనకర్త, కవి, గాయకుడు డా. మల్లిపూడి రవిచంద్ర అన్నయ్యకీ, అప్పుడప్పుడూ ఇంటి రుచులని ఆస్వాదించే భాగ్యాన్ని ప్రసాదించిన వదిన శ్రీమతి ఆశాజ్యోతికీ జీవితాంతం ఋణపడి ఉంటాను.

పరిచయం అయ్యింది మొదలు, ఎటువంటి పరిస్థితులు ఎదురైనా సరే నన్ను విడిచిపెట్టని నా తమ్ముడు, నా మనస్సుకి బాగా దగ్గరైనవాడు, గౌతమకీ, నాతో సంభాషించడం కోసమే తెలుగు

నేర్చుకున్న మలయాళ సోదరుడు, విద్యార్థి నాయకుడు, అప్పుడు ప్రణవ్ కీ, తన నాయకత్వ లక్షణాలతో, వినూత్నమైన ఆలోచనలతో, వ్యూహాలతో నన్ను ఆశ్చర్యపరచి, నాలో గొప్ప మార్పుని తీసుకువచ్చిన సోదరుడు, విద్యార్థి నాయకుడు, ఉద్యమ కెరటం ఉదయ్ కీ, ఒత్తిడికి లోనైన ప్రతీసారి నన్ను మనసారా నవ్వించే తమ్ముడు అభిమన్యుకి, విశేషమైన కృతజ్ఞతలు.

పరిశోధనలో ఎంతగానో సహకరించిన ప్రాణ స్నేహితుడు సింహాచలంకీ, ఆప్త మిత్రులు వంశీ, నవీన్, కిరణ్, సునీల్, బాలా, యోగిలకు, నాలో ఉన్న నాయకుడిని గుర్తించి నాకు గొప్ప జీవితానుభవాలను అందించిన సోదరులు సుశీల్, సందీప్, రంగ సాయి కృష్ణ, శ్రేయోభిలాషి ఆనంద్, భవానీ శంకర్ అన్నయ్యలకి ప్రత్యేకమైన కృతజ్ఞతలు.

ఆంధ్ర మహాభారతానికి భావితరాలకి ఉపయోగపడే విధంగా సమగ్రమైన, సరళమైన వ్యాఖ్యానాన్ని అందించిన వ్యాఖ్యాతలకి, తి. తి. దే. కార్యవర్గానికి, కవిత్రయ భారత మృదు ప్రతిని అందించిన వాడపల్లి శేషతల్పశాయిగారికి, నా పరిశోధనకి ఆర్థిక సహకారాన్ని అందించిన యు. జి. సి వారికి, చిన్ననాటి నుండి పాఠాలు నేర్పిన గురువులకు ప్రత్యేకమైన నమస్కారాలు. తెలుగు శాఖ బోధనేతర సిబ్బంది భవానీ శంకర్ గారికి, బాలాజీ గారికి, మధు, కృష్ణ, సంజీవయ్యలకు కృతజ్ఞతలు.

ఇక కొంతమంది పేర్లు తలుచుకుంటే వారి గురించి మరొక పుస్తకం రాసినా సరిపోదు. అందుకే, నా పరిశోధనకి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతీ ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుకుంటూ చుక్కపెడుతున్నాను.

గరికిపాటి గురజాడ

(15HTPH03)

# ii. సంకేతాలు: వివరణ

| సంకేతము | వివరణ |
|---|---|
| ఆం. మ. | = ఆంధ్ర మహాభారతోపన్యాసములు |
| ఆంధ్ర | = ఆంధ్ర మహాభారతం |
| ఆది | = ఆది పర్వం |
| అను. | = అనుశాసనిక పర్వం |
| ఆరణ్య | = ఆరణ్య పర్వం |
| క. భా. జ్యో | = కవిత్రయ భారత జ్యోత్స్న |
| చూ. | = చూడండి |
| న. దర్శ. | = నన్నయ దర్శనము |
| ప. ప. | = పద్యకవితా పరిచయం |
| పీ. | = పీఠిక |
| ప్రా. సా. మం. | = ప్రాచీన సాహిత్య మంజూషిక |
| భా. చి. క | = భారతంలో చిన్న కథలు |
| మ. ప్ర | = మహాభారత ప్రమదావలోకనం |
| మ. సా. ప్ర | = మహాభారతం: సామాజిక ప్రబోధం |
| విరాట | = విరాట పర్వం |

| | |
|---|---|
| వేదాంత | = వేదాంత డిండిమ స్తోత్రం |
| శ్లో. | = శ్లోకం |
| సం. మ. భా | = సంస్కృత మహాభారతం |
| సభా | = సభా పర్వం |
| సౌ. | = సౌందర్య లహరి |

# 0. ప్రవేశిక

## 0.1 పరిశోధనాంశ వివరణ.

ఆంధ్ర మహాభారతం ఒక కల్పతరువు. మహాభారతంలో ఏది వెతికితే అది దొరుకుతుందని స్వయంగా వ్యాస భగవానుడే సంస్కృత మహాభారత ప్రారంభంలో చెప్పారు. దీన్ని బట్టీ చూస్తే, వెతికే ఆసక్తి ఉండాలే కాని, మహాభారతంలో అన్ని సమస్యలకీ పరిష్కారాలు ఉన్నాయి. అన్ని ప్రశ్నలకీ సమాధానాలు కనిపిస్తాయనే విషయం స్పష్టమౌతోంది. సహజంగా ప్రాచీన సాహిత్యంపై ఉన్న ఆసక్తి, ఎం. ఫిల్ లో మనుచరిత్ర పై నేను చేసిన పరిశోధన, నన్ను పద్య సాహిత్యం పట్ల మరింత ఆకర్షితుడిని చేశాయి. క్రమంగా, కవిత్రయ భారతం పై పరిశోధన చేయాలని ఆసక్తి కలిగింది.

ఆంధ్ర మహాభారతం మానవుని నిజ జీవితానికి ప్రతిఫలనమే. సగటు మానవుడి దైనందిన జీవితంలో ఎదురయ్యే సంఘటనల సమాహారమే మహాభారతం. అటువంటి ఆంధ్ర మహాభారతం పై సామాజిక కోణంలో పరిశోధన చేయాలనే తపనకి కార్యరూపమే ఈ పరిశోధన. ***"ఆంధ్ర మహాభారతం: సామాజికాంశాల పరిశీలన (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు)"*** అనేది ఈ సిద్ధాంత గ్రంథ శీర్షిక.

## 0.2 పరిశోధనకు మూల ఆకరం

ఆంధ్ర మహాభారతం పై సామజిక కోణంలో పరిశోధన చేసే క్రమంలో పరిశోధనకి ప్రధాన ఆకరంగా తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముద్రించిన 15 సంపుటాల ఆంధ్ర మహాభారతాన్ని స్వీకరించాను. నా పరిశోధన ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు కనుక, మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాలు 6 సంపుటాలుగా వెలువడ్డాయి. ఈ 6 సంపుటాలు ***"ఆంధ్ర మహాభారతం: సామాజికాంశాల పరిశీలన (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు)"*** అన్న నా పరిశోధనకి ప్రధాన ఆకరాలు. ఆంధ్ర మహాభారతం ఎన్నో విధాలుగా లభ్యమౌతున్నా, తిరుమల తిరుపతి దేవస్థానం వారు ముద్రించిన 15 సంపుటాల ప్రతిపదార్థ తాత్పర్యాలతో, విశేషమైన

వ్యాఖ్యానంతో అత్యంత సమగ్రంగా ముద్రించారు. పరిశోధన దృష్ట్యా ఇవి అత్యంత ఉపయుక్తం, ప్రామాణికం. అందుకే, ఈ ప్రతిని ప్రధాన ఆకరంగా స్వీకరించాను.

## 0.3. పూర్వ పరిశోధనలు

ఆంధ్ర మహాభారతంపై 170 పైచిలుకు పరిశోధనలు జరిగాయి. వీటిలో సాహిత్య సంబంధమైనవి, శాస్త్ర సంబంధమైనవి కొన్నైతే పాత్ర చిత్రణ సంబంధితమైనవి, తులనాత్మక పరిశోధనలు మరి కొన్ని. వాటిలో సామాజిక కోణంలో జరిగిన పరిశోధనలు, ఆధునిక కాలాన్ని దృష్టిలో ఉంచుకొని అన్వయ దృష్టితో జరిగిన కొన్ని పరిశోధనల వివరాలు మాత్రమే ఇక్కడ పొందుపరుస్తున్నాను.

### 0.3.1. ఎం. ఫిల్. పరిశోధనలు

1. ఆంధ్ర మహాభారతోపాఖ్యానాలు – ఆదర్శ దాంపత్య చిత్రణ, ఎన్. విజయకుమార్ (పరిశోధన), 2010, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

2. నన్నయ భారతంలో గురుశిష్య సంబంధాలు, పి. శారద (పరిశోధన), ఎ. భూమయ్య (పర్యవేక్షణ), 2000, కాకతీయ విశ్వవిద్యాలయం.

3. భారత కాలం నాటి విద్యావిధానం, ఎం. సరస్వతీ దేవి (పరిశోధన), ఎస్. శమంతకమణి (పర్యవేక్షణ), 1990, మద్రాసు విశ్వవిద్యాలయం.

4. నన్నయ భారతం – ఉపదేశాంశం, ఎం. సావిత్రి (పరిశోధన), వి. సీతాకల్యాణి (పర్యవేక్షణ), 1978, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

### 0.3.2. పిహెచ్. డి. పరిశోధనలు

1. ఆంధ్ర మహాభారతం – సూక్తి రత్నాకరం, జి. సురేష్ బాబు (పరిశోధన), ఎల్. బి. శంకర్రావు (పర్యవేక్షణ), 1990, మద్రాసు విశ్వవిద్యాలయం.
2. నన్నయ భారతము – వివాహ ధర్మ నిరూపణము, డి. గోపాలాచార్యులు (పరిశోధన), టి. సత్యవతమ్మ (పర్యవేక్షణ), 2007, నాగార్జున విశ్వవిద్యాలయం.

3. ఆంధ్ర మహాభారతం – ధర్మతత్త్వము, డి. విద్యేశ్వరి (పరిశోధన), నాయని కృష్ణకుమారి, 1996, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
4. మహాభారతం – మానవ స్వభావ చిత్రణ, ఎ. వెంకట సుబ్బయ్య (పరిశోధన), దివాకర్ల వేంకటావధాని (పర్యవేక్షణ), 1971, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
5. ఆంధ్ర మహాభారతములో యుద్ధ షట్కము - నీతి, ఎం. అరుంధతి (పరిశోధన), బి. కేశవులు (పర్యవేక్షణ), 2008, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
6. ఆంధ్ర మహాభారతం: సామాజిక వ్యవస్థ, బొప్పంగి సుభద్ర (పరిశోధన), ఎల్లండ రఘుమన్న (పర్యవేక్షణ), 2015, ఉస్మానియా విశ్వవిద్యాలయం.
7. ఆంధ్ర మహాభారతం – మానవ సంబంధాలు, కె. చంద్రశేఖరం (పరిశోధన), పి. సుబ్బారావు (పర్యవేక్షణ), 2009, ఆంధ్ర విశ్వవిద్యాలయం.
8. తిక్కన భారతం – ధర్మాద్వైతం – వ్యాస దర్శనం – తిక్కన సందర్శనం, ఎం. కృష్ణస్వామి (పరిశోధన), సి. సుబ్రహ్మణ్యశాస్త్రి (పర్యవేక్షణ), 1981, ఆంధ్ర విశ్వవిద్యాలయం.

## 0.4. పరిశోధన ఆవశ్యకత

ఆంధ్ర మహాభారతం పై నేటి వరకు సుమారుగా 170 పై చిలుకు పరిశోధనలు జరిగాయి. ఇంకా మరెన్నో జరుగుతూనే ఉన్నాయి. అయితే, ఆ పరిశోధనల్లో సామాజిక దృష్టి కోణంలో జరిగినవి తక్కువని చెప్పక తప్పదు. సామజిక దృష్టికోణంలో ఆంధ్ర మహాభారతంపై జరిగిన పరిశోధనల్లో కూడా ప్రత్యేకించి ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు ఉన్న సాహిత్యం పై సామాజిక దృష్టిలో సమగ్రమైన పరిశోధనలు జరగలేదు. అందునా, ఆంధ్ర మహాభారతాన్ని సామాజిక దృష్టి కోణంలో పరిశీలించిన పరిశోధనల్లో ఆయా పరిశోధకులు ఎంచుకున్న సామాజికాంశాల కంటే భిన్నమైన, నూతనమైన సామాజికాంశాలను నా పరిశోధనలో ఎన్నుకోవడం జరిగింది.

2015లో డా. బొప్పంగి సుభద్రగారు ఆచార్య ఎల్లండ రఘుమన్నగారి పర్యవేక్షణలో "ఆంధ్ర మహాభారతం సామాజిక వ్యవస్థ" అనే అంశంపై పరిశోధన (పిహెచ్. డి) చేసి సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనలో 11 అధ్యాయాలు ఉన్నాయి. అయితే, ఈ పరిశోధనలో ప్రధానంగా మహాభారత కాలం నాటి కుల వ్యవస్థ, ఆచారాలు, నమ్మకాలు, కుటుంబ వ్యవస్థ, వివాహ వ్యవస్థ,

విద్యా వ్యవస్థ, రాజ్య వ్యవస్థ, దండనీతి మొత్తంగా ఆనాటి సామాజిక వ్యవస్థ ఎలా ఉండేదో కవిత్రయ భారతం ఆధారంగా సమీక్షించారు.

*ఆంధ్ర మహాభారతం: సామాజికాంశాల పరిశీలన (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు)* అనే ఈ పరిశోధనలో మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాలను మాత్రమే సమీక్షించడం జరిగింది. ఈ పరిశోధనలో అధ్యాయ విభజన సైతం పూర్వ పరిశోధనలను దృష్టిలో ఉంచుకొని వినూత్న కోణంలో చేయడం జరిగింది. పూర్వ పరిశోధనల్లోని అంశాలు పునరావృతం కాకుండా జాగ్రత్త పడుతూనే, కొత్తగా కొన్ని అంశాలను ప్రతిపాదించడం జరిగింది. అన్నింటినీ మించి, ఈ పరిశోధనలో భాగంగా ఆనాటి సామాజికాంశాలను గుర్తిస్తూనే, ఆయా అంశాల నుంచి, పరిస్థితుల నుంచి, వ్యక్తుల నుంచి నేటి తరం గ్రహించవలసిన విషయాలను ప్రత్యేకంగా ప్రస్తావించడం జరిగింది. మొత్తంగా నాటి భారతాన్ని నేటి తరం అర్థం చేసుకొని, తమ తమ జీవితాలకు అన్వయించుకొని, ఆచరణయోగ్యమైన విషయాలను ఆచరించే విధంగా ఈ పరిశోధనని సూత్రీకరించడం జరిగింది.

ఆంధ్ర మహాభారతంలో పరిశోధించడానికి ఇంకా ఎన్నో విశేషాలు ఉన్నాయని శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారు అభిప్రాయపడ్డారు. వారి మాటలు నా పరిశోధనకి మరింత ప్రోత్సాహాన్ని అందించాయి.

“it is only proper that a critical and historical appreciation of the Telugu Language and Literature should begin with a study of that great work. Critics are prone to remark that the last word on Telugu Bharata has already been said, and that there is nothing more to be worked on that subject. But it may be said that they have to realise that Mahabharata is a diamond with many facts still demanding the view and appreciation of the critics of Andhra” *(ఆం. మ. 2007: 98)*.

## 0.5. పరిశోధన పరిధి

ఆంధ్ర మహాభారతంలో మొత్తంగా 21,497 పద్య గద్యాలు ఉన్నాయి. అయితే, నా పరిశోధన మొదటి నాలుగు పర్వాల వరకే పరిమితం. ఆది పర్వం నుండి నాల్గవ పర్వమైన విరాట పర్వం వరకు మొత్తం 7220 పద్యగద్యాలు ఉన్నాయి. నేను చేసుకున్న అధ్యాయ విభజన ఆధారంగా సామాజిక దృష్టి కోణంలో పరిశీలించదగిన పద్యాలను, గద్యాలను, తత్సంబంధితమైన సమాచారాన్ని చర్చించడం నా పరిశోధన పరిధి.

## 0.6. పరిశోధన లక్ష్యం

ఆంధ్ర మహాభారతం తరాలు మారినా తరగని విలువలని అందించే గ్రంథం, ఏ కాలానికైనా అన్వయించుకోదగిన గ్రంథం. సమకాలీన సమాజంలో సగటు మానవుడు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలు, సంఘటనలు మహాభారతంలో వివిధ పాత్రలకి ఎదురయ్యాయి. అందుకే, మహాభారత కాలం నాటి సామజిక విశేషాలను, స్థితిగతులను, సామాజికమైన విలువలను కవిత్రయం అందించిన సాహిత్యం ద్వారా పరిశీలించి, నేటి కాలానికి ఉపయుక్తమైన విషయాలను సమీకరించి, వాటిని నిత్యజీవితంలో అన్వయించుకొని, ఆచరించేందుకు వీలుగా క్రోడీకరించడమే నా పరిశోధన లక్ష్యం.

## 0.7. పరిశోధన గ్రంథ రచనాపద్ధతి.

ఆంధ్ర మహాభారతం: సామాజికాంశాల పరిశీలన (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు) అన్న ఈ సిద్ధాంత గ్రంథాన్ని 8 అధ్యాయాలుగా విభజించడం జరిగింది. వాటి వివరాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

అధ్యాయం – 1 ఆంధ్ర మహాభారతం : వైశిష్ట్యం.

అధ్యాయం – 2 ఆంధ్ర మహాభారతం : ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాంశాలు.

అధ్యాయం – 3 ఆంధ్ర మహాభారతం : మానవ సంబంధాలు.

అధ్యాయం – 4 ఆంధ్ర మహాభారతం : నాయకత్వ లక్షణాలు.

అధ్యాయం – 5 ఆంధ్ర మహాభారతం : ధర్మాధర్మ వివేచన.

అధ్యాయం – 6 ఆంధ్ర మహాభారతం : నిర్వహణ సామర్థ్యం.

అధ్యాయం – 7 ఆంధ్ర మహాభారతం : సంభాషణానైపుణ్యం.

అధ్యాయం – 8 ఆంధ్ర మహాభారతం : వ్యక్తిత్వ వికాసం.

ముగింపు.

ఆంధ్ర మహాభారతం పై సామాజిక దృష్టి కోణంలో జరిగిన పరిశోధనల్లో ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాంశాలు ప్రధానమైన సామాజికాంశాలుగా చర్చించబడ్డాయి. ఆంధ్ర మహాభారతంలోని కుటుంబ వ్యవస్థ పై కూడా కొన్ని పరిశోధనల్లో చర్చ కనిపిస్తుంది. అయితే, ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాలలోని సాహిత్యం ఆధారంగా, ఇంతకు ముందు జరిగిన పరిశోధనల్లో చర్చించని కోణంలో కవిత్రయ భారతంలోని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాంశాలను నా పరిశోధనలో రెండవ అధ్యాయంలో ప్రస్తావించాను. కవిత్రయ భారతంలోని సాహిత్యం ఆధారంగా, పరిశోధన దృష్టిని అవలంబించి, ధర్మాధర్మ వివేచన, నిర్వహణ సామర్థ్యం, సంభాషణా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం వంటి విభిన్నమైన సామాజికాంశాలను నా పరిశోధనలో ప్రస్తావించి, వాటి గురించి పైన పేర్కొన్న విధంగా, సమగ్రంగా ఆయా అధ్యాయాల్లో చర్చించాను.

# అధ్యాయం – 1

# ఆంధ్ర మహాభారతం : వైశిష్ట్యం

## 1.1. ఉపోద్ఘాతం

"హితేన సహితం సాహిత్యం". హితాన్ని చేకూర్చేది సాహిత్యం, సమాజ హితానికి దోహదపడేది సాహిత్యం. సాహిత్యం యొక్క ప్రయోజనమూ అనంతమే, పరిధీ అనంతమే. ఒక కాలం నాటి సాహిత్యం మరొక కాలానికి ఉపయోగపడదు అనుకుంటే పొరపాటు. తరాలు మారినా, యుగాలు మారినా సాహిత్యం ఎప్పుడూ హితాన్నే కోరుకుంటుంది. సాహిత్యం యొక్క ప్రాథమిక లక్ష్యమూ అదే, పరమార్థం కూడా అదే. ఈరోజు ఆధునికం అనుకున్నది కొంతకాలానికి ప్రాచీనమవ్వక తప్పదు. ఒక కాలంలో వెలువడిన సాహిత్యం ఆ కాలం నాటి పరిస్థితులకు అద్దం పట్టినా, ఎన్నో కాలాలకు అది మార్గదర్శకమే అవుతుంది.

కాలంతో పాటు కలం ఎప్పుడూ ప్రయాణిస్తూనే ఉంటుంది. భౌతిక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక, భౌగోళిక పరిస్థితులు ఆ కలం యొక్క కదలికని ఎప్పటికప్పుడు ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆ పరిస్థితులకి అనుగుణంగా కలం గళమెత్తుతుంటుంది. అయితే, ఒక నాటి అనుభవాలకు, చరిత్రకు సాక్షిగా నిలుస్తూ, విలువలను అందిస్తున్న సాహిత్యాన్ని ఆధునికత పేరుతో విస్మరిస్తే మనిషి తాను కూర్చున్న చెట్టు కొమ్మని తానే నరికేసుకున్నట్టే అవుతుంది. "పాత క్రొత్తల మేలు కలయిక క్రొమ్మెరంగులు చిమ్మగా..." అని మహాకవి గురజాడ పలికినట్టు సాహిత్యంలో కూడా పాత కొత్తల మేళవింపు అవసరం.

ప్రాచీన తెలుగు సాహిత్యం అత్యాధునిక సమాజానికి సైతం ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. సృష్టిలో ఎటువంటి లోపం లేదు. మనిషి దృష్టిలోనే లోపం ఉంది. మనిషి ఏ కోణంలో సృష్టిని దర్శిస్తే ఆ కోణంలో సృష్టి ఆవిష్కృతమౌతుంది. ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అత్యాధునిక దృక్పథంతో వీక్షించడం అవసరం. ఆ సాహిత్యంలో ఉన్న మౌలికమైన విషయాలు,

నైతికపు విలువలు, ఒత్తిడికి తలొగ్గి జీవితాలను ఛిన్నాభిన్నం చేసుకుంటున్న నేటి తరానికి మానసిక వైద్యం చేయగలవు. ఎన్నో శిక్షణా కేంద్రాలు చేయలేని పని ఒక చిన్న తెలుగు పద్యం చేయగలదు. చిన్న వయస్సులోనే పిల్లలకి తెలుగు పద్యాలు చదవడం, చదివించడం చేయగలిగితే ప్రతీ మనిషి జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు ఆ పద్యాలే పరిష్కార మార్గాలను సూచిస్తాయి.

ప్రాచీన తెలుగు సాహిత్యం అనగానే మనకి ప్రాథమికంగా గుర్తుకువచ్చేవి మూడు. అవి, శ్రీమద్రామాయణం, ఆంధ్ర మహాభారతం, శ్రీమద్భాగవతం. ఎన్నో ప్రాచీన తెలుగు కావ్యాలు ఈ మూడింటిలోని కథనే వస్తువుగా చేసుకున్నాయి. ముఖ్యంగా *ఆంధ్ర మహాభారతం*తో మన తెలుగు సాహిత్యం ప్రారంభమయ్యింది అని చెప్పుకోవచ్చు.

ఆంధ్ర మహాభారతం కంటే ముందు కూడా సాహిత్యం ఉందనడానికి తగిన ఆధారాలు ఉన్నప్పటికీ, ఆంధ్ర మహాభారతానికి తెలుగు సాహిత్యంలో ఉన్న స్థానం విశిష్టమైనది. మొత్తం తెలుగు సాహిత్యానికి ఒక దిశానిర్దేశం చేసింది ఆంధ్ర మహాభారతమే. ఆంధ్ర మహాభారతంలోని పర్వాలు 18. అష్టాదశ పర్వాలు అష్టాదశ పురాణాలకి సమానంగా ప్రఖ్యాతిగాంచాయి.

## 1.2. జయ కావ్యం

భారత జాతి సంస్కృతిని, సంప్రదాయాలని, భారతీయ న్యాయ, రాజకీయ, ఆర్థిక, భౌగోళిక, సాంఘిక, చారిత్రక వైభవాన్ని యావత్ప్రపంచానికి చాటి చెప్పిన ఇతిహాసం మహాభారతం. అటువంటి మహాభారత గాథ, దేవభాషగా పిలువబడే సంస్కృత భాషలో మొట్ట మొదటిసారి గ్రంథ రూపంలో వెలువడింది. తర్వాత ఎన్నో భారతీయ భాషల్లోకి అనువదించబడింది, అనుసృజించబడింది. మహాభారతాన్ని అనాదిగా భారతీయులు ఆదరిస్తూ వచ్చారు. కథల రూపంలో, పాటల రూపంలో, యక్షగానాల రూపంలో, వీధి నాటకాల రూపంలో, తోలుబొమ్మలాటల రూపంలో మహాభారతం ప్రజలకి ఎంతో చేరువయ్యింది. మహా భారతం నాలుగు వేదాల సారంగా, పంచమ వేదంగా ప్రసిద్ధిగాంచింది. మూల భారతమైన సంస్కృత మహాభారతం జయ కావ్యంగా పేరు పొందింది.

## 1.3. వేదవ్యాస మహర్షి

జయ కావ్యాన్ని (మహాభారతాన్ని) సాహిత్య లోకానికి అందించిన ఘనుడు వ్యాస మహర్షి. వ్యాసుడికి కృష్ణద్వైపాయనుడు అని మరొక పేరు కూడా ఉంది. ఆయన వేదాలని వర్గీకరించాడు, బ్రహ్మసూత్రాలని ప్రపంచించాడు. భారతీయ విజ్ఞాన సంపదలైన అష్టాదశ పురాణాలని రచించాడు. చతుర్వేద సారంగా, పంచమ వేదమైన మహాభారతాన్ని నిర్మించాడు. వ్యాసుడు సాక్షాత్తు నారాయణుడిగా కీర్తించబడ్డాడు.

మ. పరమబ్రహ్మనిధిం, బరాశరసుతున్, బ్రహ్మర్షిముఖ్యున్, దయా
పరుఁ, గౌరవ్యపితామహున్, జనహితప్రారంభుఁ, గృష్ణాజినాం
బరు, నీలాంబుదవర్ణదేహు, ననురూపప్రాంశు, నుద్యద్దివా
కర రుక్పింగజటాకలాపు, గతరాగద్వేషు, నిర్మత్సరున్. (*ఆంధ్ర. ఆది. 3: 3*)

'పరమతపోనిధిని, పరాశరకుమారుడిని, బ్రహ్మర్షులలో అగ్రగణ్యుడిని. దయామయుడిని, కురుకులపితామహుడిని, లోకకల్యాణకారకుడిని, కృష్ణాజినాంబరధారిని, నల్లని మేఘం యొక్క వర్ణం వంటి వర్ణం కల దేహం కలవాడిని, తగిన ఎత్తు కలవాడిని, ఉదయభానుడి కాంతిగల రాగిరంగుజడల సముదాయం కలవాడిని, రాగద్వేషాలు లేనివాడిని, మాత్సర్యరహితుడిని, వైశంపాయనుడు మొదలైన శిష్యుల సమూహంతో, పెక్కుమంది మునులతో చుట్టబడినవాడై బంగారంతో, మణులతో చేయబడిన ఉన్నతమైన ఆసనమందు కూర్చొన్న వ్యాసభగవానుడిని' గురించి నన్నయ వర్ణించిన పద్యం ఇది.

నన్నయ గుండెల్లో మూలభారతాన్ని రచించిన వ్యాసభగవానుడి పట్ల ఇంత విశేషమైన గౌరవం ఉంది. వ్యాసుడి వ్యక్తిత్వం అంత ఉన్నతమైంది. వ్యాసుడిని భగవానుడిగా భావించడం వల్ల కవిత్రయం భారతంలోని ఆ ముద్రను ఎంతో చక్కగా అందుకోగలిగింది. అనువాదాల్లో అత్యంత ఉన్నతమైన, విశేషమైన అనువాదంగా కవిత్రయ భారతం ఖ్యాతి గడించింది.

వ. అని యిట్లు పాండవధార్తరాష్ట్రవిభేదనకథాశ్రవణకుతూహలపరుం డయి యడిగిన జనమేజయునకుం గరుణించి, కృష్ణద్వైపాయనుండు వైశంపాయనమునింజూచి 'శ్రీమహాభారతకథాఖ్యానంబాద్యంతంబితనికి సవిస్తరంబుగాఁ జెప్పు' మని పంచిచనిన. (*ఆంధ్ర. ఆది. 3: 6*)

వ్యాసుడి వ్యక్తిత్వం ఎంత ఉన్నతమో తెలుసుకోవడానికి ఈ ఒక్క సందర్భం చాలు. "జనమేజయుడు అడిగిన ప్రశ్నలో భారతయుద్ధానికి వ్యాసుడి బాధ్యత ఎంత అనే అంశం అంతర్గర్భితంగా ఉన్నది. అందువలన భారతకథను తానే చెప్పి తనను తాను సమర్థించుకొన్నట్లు కాకుండా, తన శిష్యుడైన వైశంపాయనుడిని మహాభారతకథను విస్తరించి చెప్పుమన్నాడు. విస్తరించటమంటే శ్రోత అడిగే ప్రశ్నలకూ, వెలిబుచ్చే అనుమానాలకూ తగిన వివరాలతో కథను పెంచిచెప్పటమన్నమాట. తాను రచించిన భారతాన్ని మానవలోకంలో ప్రచారం చేయటానికి వ్యాసుడు వైశంపాయనుడిని నియోగించాడు". (*ఆంధ్ర. ఆది. 3. పుట: 206*)

## 1.4. జయ కావ్యం – మహాభారతం: పరిణామ క్రమం

వ్యాస సంకల్పమైన మహాభారతం మూడంచెలుగా విస్తరిల్లి లోకంలో వ్యాపించింది. వ్యాసుడు దీక్ష పూని భరతవంశ కథను 'జయ'మనే కావ్యంగా మొదట రచించాడు. అది మహాభారతానికి మొదటి రూపం. జయ కావ్యాన్ని వివిధ లోకాలలో ప్రచారం చేయడానికి వ్యాసుడు తన శిష్యులను నియోగించాడు. నారదుడు దేవలోకంలో, దేవలుడు పితృలోకంలో, వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పడం ద్వారా మానవలోకంలో జయకావ్యానికి వ్యాప్తిని కలిగించారు.

వైశంపాయనుడు జనమేజయుడికి చెప్పేటప్పుడు కలిగిన అనుమానాలను, అడిగిన విశేషాలను, వ్యాస తాత్పర్యానికి అనుగుణంగా వివరించాడు. ఆ విశేషాలతో కలిపి వ్యాసుడి జయ కావ్యం మహాభారతంగా ప్రసిద్ధి పొందింది. దానిని వైశంపాయనుడు చెప్పగా రోమహర్షణుని ద్వారా ఉగ్రశ్రవసుడనే సూతుడు విన్నాడు.

ఒకసారి నైమిశారణ్యంలో శౌనకుడనే మహర్షి బ్రహ్మర్షిగణాలతో కలిసి లోకహితార్థం పన్నెండు సంవత్సరాలు సత్ర యాగాన్ని నిర్వహించాడు. అందులో సూత మహర్షి పాల్గొని శౌనకాది మహామునులకు, వారి కోరిక మీద భారతాన్ని వినిపించాడు. అప్పుడు శౌనకాదులు ఎన్నో అనుమానాలను, వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని సూతుడు వేదవ్యాసుడి అభిప్రాయానికి అనువుగా వివరించాడు. ఆ వివరణతో గ్రంథం విస్తరించింది. అదంతా కలిసి మహాభారతంగా ప్రసిద్ధి పొందింది. జయ కావ్యం మహాభారతంగా ఏర్పడి ఒక మహేతిహాసంగా విస్తరించబడింది.

భారతం అంటే భరతవంశీయుల కథ. వారు చంద్రవంశానికి చెందినవారు. సూర్యచంద్రాది వంశాలలో పుట్టి వేదధర్మాన్ని, వేదవిహిత కర్మని ఆచరిస్తూ, ప్రజలచేత ఆచరింపజేసే ప్రభువుల చరిత్రలు పురాణాలలో ఉంటాయి. వాటిని వంశానుచరితాలుగా పిలుస్తారు. అవి స్వతంత్రకావ్యాలుగా రచింపబడితే ఇతిహాసాలౌతాయి. భరతవంశ రాజుల చరిత్ర చెప్పే భారతం వస్తుతః వంశానుచరితం. అయితే, అది పురాణ భాగంగా కాక స్వతంత్ర గ్రంథంగా వెలువడింది కాబట్టి ఇతిహాసం అనబడింది.

## 1.5. ఆంధ్ర మహాభారతం: అనువాద విధానం

సంస్కృత మహాభారతం గొప్ప శాస్త్రేతిహాసం, ఆంధ్ర మహాభారతం అష్టాదశ పర్వాల కావ్యేతిహాసం. ఆంధ్ర మహాభారతం సంస్కృత భారతానికి అనువాదమా? కాదా? అనే విషయమై వాదోపవాదాలున్నాయి. అయితే, కవిత్రయ భారతం అనువాద గ్రంథమే అయినప్పటికీ పూర్తిగా అనువాదం చేయకుండా, కవిత్రయం చక్కటి అనుసృజన చేశారనడం సమంజసం.

క. జననుత కృష్ణద్వైపా
యనమునివృషభాభిహిత మహాభారతబ
ద్ధనిరూపితార్థ మేర్పడఁ,
దెనుఁగున రచియింపు మధికధీయుక్తిమెయిన్. (*ఆంధ్ర. ఆది.1: 16*)

‘రాజరాజ నరేంద్రుడు నన్నయని భారతాన్ని తెలుగులో రచించమని అన్నాడే కాని, మూలానికి నకలుగా తెలుగు చేయమని, అనువదించమని కోరలేదు’ (*ఆంధ్ర. పీ: xxxii*).

‘ఆనందవర్ధనుని అన్వయం ప్రకారం వ్యాసమహాభారతంలో రసం శాంతం. కవిత్రయ భారతంలో రసం ధర్మవీరం. రససమన్వయ సూత్రం మూలభారతానికి ఒక విధం, ఆంధ్ర మహాభారతానికి మరొక విధం. ఈరకంగా రసనిర్వహణలో స్వతంత్ర దృష్టి సారించిన నన్నయ చేసింది అనుసృజనం అవుతుంది.’ (*ఆంధ్ర. పీ: xxxii*)

“వేదం శబ్ద ప్రధానం. ఇతిహాస పురాణాలు అర్థప్రధానాలు. కావ్యం ఉభయ ప్రధానం. వ్యాసభారతం అర్థప్రధానమైన శాస్త్రేతిహాసం. కవిత్రయభారతం ఉభయప్రధానమైన కావ్యేతిహాసం. కావ్య స్వభావాన్ని ఇతిహాసానికి జోడించి ఉత్తమ మిశ్రప్రక్రియగా రూపొందించాడు నన్నయ. నన్నయ

చూపించిన మిశ్రప్రక్రియాపరికల్పనం తెలుగు సాహిత్య ప్రయోగాలకు ఒక విశిష్ట ప్రస్థానాన్నే ప్రసాదించింది. ప్రాచీనాంధ్ర సాహిత్యవికాస చరిత్రమంతా దానికి సజీవసాక్ష్యం. అందుకే, మహాకవులు మహాభారతాన్ని మహాకావ్యమంటారు. అర్థప్రధానమైన రచనను ఉభయ ప్రధానంగా మార్చడం అనువాద ధోరణి కాదు. పునస్సృష్టి వైఖరి. (*ఆంధ్ర. పీ: xxxii*)

- ఆంధ్ర మహాభారతం అనువాదమే అని భావించేవారు కూడా నన్నయది కథానువాదమని, స్వతంత్రానువాదమని వివేచించడం గమనించదగిన విషయం.
- ఆంధ్ర మహాభారతంలో పాండవులు నాయకులుగా చిత్రించబడ్డారు. ఇది వ్యాస భారతంకంటే విభిన్నం.
- మూలంలోని హరివంశాన్ని తెలుగులోకి తీసుకురాకుండా, ఆదిపర్వం మొదలుకొని స్వర్గారోహణ పర్వం వరకు ఉన్న కథనే ఇతిహాస రూపంగా సంఘటితం చేయడం ఈ వాదాన్ని బలపరుస్తోంది.
- సంస్కృతంలో 1,00,700 శ్లోకాలలో ఉన్న వ్యాసభారతాన్ని తెలుగులో కవిత్రయం 21,697 గద్యపద్యాలలోకి అనువదించారు. శ్లోకాల – పద్యాల సంఖ్యని పరిగణలోకి తీసుకుంటే కవిత్రయ భారతం సంస్కృత భారతానికి అనువాదంగా కనిపించదు.
- వ్యాసుడి శైలికీ, నన్నయ శైలికీ సామ్యం లేదు. నన్నయ పద్య శిల్పం మూలం కంటే విలక్షణమైనది. నన్నయ శైలి స్వయంప్రకాశమైన దేశీయ వ్యక్తిత్వం కలిగినది. కాబట్టి, శైలిలో స్వతంత్ర ముద్ర వేసుకున్న రచన అనువాదం కాదు, అనుసృజనమే అవుతుంది.
- కవిత్రయం తెలుగు జాతికి భారతాన్ని అందించే క్రమంలో ఒక నూతన ఒరవడికి నాంది పలికారనే చెప్పాలి. ఆంధ్ర మహాభారతాన్ని రచించే క్రమంలో నన్నయ, తిక్కన, ఎఱ్ఱన శైలిలోను, అనువాద విధానంలోను ఎంతో వైవిధ్యాన్ని పాటించారు. ఆ విధానాలు తర్వాతి కాలంలో ఎంతోమంది కవులకి మార్గదర్శకంగా నిలిచాయి.

## 1.6. కవిత్రయం

ఆంధ్ర మహాభారతాన్ని కవిత్రయ భారతం అని కూడా అంటారు. ఈరోజు శాఖోపశాఖలుగా విస్తరించి ప్రక్రియావైవిధ్యంతో, నిత్యనూతనమైన ఒరవడితో, ప్రపంచంలో మరే భాషలో లేని పదవిన్యాసంతో విరాజిల్లుతున్న తెలుగు సాహిత్య మహావృక్షానికి బీజం వేసింది కవిత్రయమే. నన్నయ, తిక్కన, ఎఱ్ఱన తెలుగు సాహిత్యంలో కవిత్రయంగా గణతికెక్కారు.

నన్నయ ఆది, సభాపర్వాలను, ఆరణ్య పర్వంలోని నాలుగో ఆశ్వాసంలో కొంత భాగాన్ని రచించి పరమపదించారు. ఆ తర్వాత 13వ శతాబ్దంలో తిక్కన విరాట పర్వం నుండి స్వర్గారోహణ పర్వం వరకు పదిహేను పర్వాలను ప్రబంధమండలిగా సంతరించాడు. ఆ తర్వాత 14వ శతాబ్దంలో ఎర్రాప్రగడ ఆరణ్యపర్వ శేషాన్ని పూరించాడు. ముగ్గురు కవులు విభిన్నకాలాలలో రచించినా ఒకే మహాకవి ఏకకాలంలో రచించిన కావ్యాన్ని చదివినప్పుడు కలిగే అనుభూతిని ఆంధ్ర మహాభారతం అందించించడం తెలుగు జాతి అదృష్టమనే చెప్పాలి.

### 1.6.1. నన్నయ

తెలుగు సాహిత్యంలో ఆదికవిగా ప్రసిద్ధికెక్కినవారు నన్నయ. నన్నయ (నన్నయభట్టు) కాలం 11వ శతాబ్దం. ఆ యుగాన్ని నన్నయ యుగంగా, ఆయనకు ముందున్న కాలాన్ని ప్రాఙ్నన్నయ యుగంగా సాహిత్యకారులు అభివర్ణిస్తారు. నన్నయ రాజరాజనరేంద్రుని ఆస్థానకవిగా ఉండేవాడు. నన్నయ ఆంధ్ర మహాభారతమే కాకుండా చాముండికా విలాసం, ఇంద్ర విజయం అనే కావ్యాలు, ఆంధ్ర శబ్ద చింతామణి అనే వ్యాకరణ గ్రంథాన్ని రచించాడని చెప్తారు. అయితే ఆంధ్ర శబ్దచింతామణి ఎవరి రచన అనేది వివాదాస్పదం. మిగిలిన రెండు కావ్యాలు నన్నయవే అనడానికి తగిన ఆధారాలు లేవు. నన్నయ తన కవితారీతుల గురించి తానే సారమతిం...(*ఆంధ్ర. ఆది. 1:26* ) అనే పద్యంలో చెప్పుకున్నాడు. నన్నయ కవితారీతులు ప్రధానంగా మూడు. అవి, ప్రసన్నకథాకలితార్థయుక్తి, అక్షర రమ్యత, నానారుచిరార్థ సూక్తి నిధిత్వం.

నన్నయకి ఆదికవి అని, వాగనుశాసనుడు అని బిరుదులున్నాయి. నన్నయకు తర్వాతి కాలంలో వచ్చిన ఎంతోమంది కవులు ఆయనను రకరకాల బిరుదులతో గౌరవించారు. మారన "ఆంధ్ర కవితాగురుడు" అని, గణపతి దేవుడనే కవి "ఆంధ్ర కావ్యపథము తీర్చినవాడు" అని, "మహిమన్ వాగనుశాసనుడు సృజయింపన్.." అని రామరాజ భూషణుడు, భాషింతు నన్నయభట్టు మార్గంబున నుభయ వాక్ప్రౌఢి నొక్కొక్కమాటు.." అని శ్రీనాథుడు, మూడు కృతులాంధ్ర కవిత్వ

విశారదుండు విద్యాదయితుం డొనర్చె మహితాత్ముడు నన్నయభట్టు దక్షతన్..” అని తిక్కన నన్నయని కీర్తించారు.

నన్నయకు పూర్వం కూడా తెలుగు సాహిత్యం ఉందనడానికి ఆధారాలున్నాయి. అలాంటప్పుడు నన్నయ అది కవి ఎలా అవుతాడనేది చర్చనీయాంశం. అయితే, ఆ బిరుదు కాలాన్ని పరిగణలోకి తీసుకుని వచ్చినది కాదని గమనించాలి. నన్నయకు ముందు ప్రతిభావంతులైన కవులు ఉన్నప్పటికీ, నన్నయ ఒక మహాకావ్యానికి శ్రీకారం చుట్టిన కవిగా, ఒక శైలీ సంప్రదాయానికి నాంది పలికిన కవిగా, తెలుగు సాహిత్యానికి ఒక దిశానిర్దేశం చేసిన మహాకవిగా, తర్వాతి కాలంలో ఎంతో మంది సుప్రసిద్ధులైన కవులు నన్నయని అనుసరించడం వల్ల నన్నయని ఆదికవిగా సాహిత్యకారులు అభివర్ణించడం సమంజసమే అవుతుంది.

## 1.6.2. తిక్కన

కవిత్రయంలో రెండవవాడు తిక్కన. తిక్కన కాలం 13వ శతాబ్దం. తిక్కన మనుమసిద్ధి అనే రాజు వద్ద ఆస్థానకవిగా, మంత్రిగా పనిచేశాడు. తిక్కన యజ్ఞం చేయడం వల్ల ‘సోమయాజి’గా పేరు పొందాడు. తిక్కన ఇంటిపేరు కొట్టరువు. తిక్కన తండ్రి కొమ్మన దండనాథుడు. తిక్కన తాత భాస్కరుడు. తిక్కన రచనలో నాటకీయత ప్రధానమైన లక్షణం. “భాషింతు తిక్కయజ్వ ప్రకారము రసాభ్యుచిత బంధముగ నొక్కొక్కమాటు...” అంటూ శ్రీనాథుడు తిక్కన రసాభ్యుచిత బంధ లక్షణాన్ని కొనియాడాడు.

తిక్కన విరాటపర్వం మొదల్కొని స్వర్గారోహణపర్వం వరకు ఏకబిగిన ఆంధ్ర మహాభారతంలోని 15 పర్వాలను రచించిన ప్రతిభాశాలి. తిక్కన తన భారతభాగాన్ని హరిహరనాథునికి అంకితమిచ్చి హరిహరాద్వైతాన్ని ప్రతిపాదించాడు. తిక్కన నిర్వచనోత్తర రామాయణం అనే గ్రంథాన్ని కూడా రచించాడు. ఆంధ్ర మహాభారతం, నిర్వచనోత్తర రామాయణమే కాక తిక్కన విజయసేనం, కృష్ణ శతకం, కవిసార్వభౌమఛందస్సు కూడా రచించినట్లు చెప్తారు. కవిసార్వభౌమఛందస్సుకే కవివాగ్బంధనం అని పేరు. అయితే, విజయసేనంలోని కొన్ని పద్యాలు మాత్రమే లభ్యమౌతున్నాయి. మిగిలినవి అలభ్య రచనలు.

తిక్కన ఆంధ్ర మహాభారతాన్ని రచించే క్రమంలో నన్నయ అనుసరించిన స్వతంత్రానువాద పద్ధతినే అనుసరించాడు. ఒక కవి కొంత భాగాన్ని రచించి మధ్యలో విడిచిన రచనని స్వీకరించి ఆ

కవి స్థాయిని, గ్రంథ వైశిష్ట్యాన్ని అర్థం చేసుకుని అంతకంటే మెరుగైన స్థాయిలో రచించడం మామూలు విషయం కాదు. ఆ సాహసాన్ని తిక్కన దిగ్విజయంగా పూర్తిచేశాడు.

ఇతిహాస స్వరూపమైన మహాభారతాన్ని కావ్యేతిహాసంగా మలిచే క్రమంలో తిక్కన పాత్ర ఎంతో క్రియాశీలకమని చెప్పాలి. తిక్కన తన కళాదృష్టిని, తన రాజకీయనుభావాన్ని రంగరించి ఆంధ్ర మహాభారతాన్ని నవరసభరితమైన తెలుగు కావ్యంగా మలిచాడు. తిక్కనకి నన్నయపట్ల, మహాభారతం పట్ల అపారమైన గౌరవం ఉంది. ఆ గౌరవాన్ని తిక్కన ఆంధ్ర మహాభారతంలో చాలా సందర్భాల్లో చాటుకున్నాడు. నన్నయ శైలికి ఎటువంటి భంగం కలగకుండా తనదైన శైలితో కవిత్రయ భారతాన్ని రసరమ్యంగా తీర్చిదిద్దాడు. నన్నయ తనమీద ఉంచిన బృహత్తరమైన బాధ్యతని తిక్కన భక్తిశ్రద్ధలతో నెరవేర్చాడు. మహాభారత రచనాయజ్ఞాన్ని తన సహాయంతో నిర్విఘ్నంగా పూర్తి చేశాడు.

నన్నయ ఆరణ్యపర్వంలో సగభాగాన్ని రచించి పరమపదించాడు. తిక్కన ఆరణ్యపర్వ శేషాన్ని రచించాడని, అది ఖిలమయిపోయిందని కొందరు, ఆరణ్యపర్వ శేషాన్ని విడిచిపెట్టి విరాటపర్వంతో తన రచనని ప్రారంభించాడని కొందరు వాదించారు. సాహిత్య చరిత్రకారులు మాత్రం తిక్కన రచన విరాట పర్వం నుంచి స్వర్గారోహణ పర్వం వరకు సాగిందని, ఎఱ్ఱన, నన్నయ విడిచిపెట్టిన ఆరణ్యపర్వ శేషాన్ని రచించి తెలుగు జాతికి ఆంధ్ర మహాభారతాన్ని అందించాడని నిర్ధారించారు.

తిక్కన ఆంధ్రావళిమోదం కోసం మహాకవిత్వదీక్షావిధినొంది 15 పర్వాలు ఏకధాటిగా రచించి, యుగకర్తగా, మహాకవిగా కీర్తిని గడించాడు. తిక్కనని కవిబ్రహ్మగా, ఉభయకవిమిత్రుడిగా సాహిత్యలోకం కీర్తించింది.

## 1.6.3. ఎఱ్ఱన

కవిత్రయంలో మూడవవాడు ఎఱ్ఱన. ఎఱ్ఱన కాలం క్రీ.శ.1280– 1360 ప్రాంతంగా సాహిత్యచరిత్రకారులు నిర్ణయించారు. ఎఱ్ఱన ప్రోలయ వేమారెడ్డి అనే రాజు ఆస్థానకవిగా స్థిరపడ్డాడు. ఎఱ్ఱనకి శంభుదాసుడు అని, ప్రబంధ పరమేశ్వరుడు అని బిరుదులు ఉన్నాయి. ఎఱ్ఱన నన్నయ విడిచిపెట్టిన ఆరణ్యపర్వ శేషభాగాన్ని పూరించి ఆంధ్ర మహాభారతాన్ని తెలుగు జాతికి అంకితం చేసిన ఘనుడు. 11వ శతాబ్దంలో ప్రారంభమైన భారత రచన ఎఱ్ఱన పూరణతో 14వ శతాబ్దానికి పూర్తి రూపాన్ని సంతరించుకుంది.

ఎఱ్ఱన ఆరణ్యపర్వ శేషాన్నే కాకుండా రామాయాణం, హరివంశం, నృసింహ పురాణాలని కూడా రచించాడు. అయితే ఎఱ్ఱన రామాయణంలో కొన్ని పద్యాలు మాత్రమే లభ్యమౌతున్నాయి. ఆరణ్యపర్వంలో శారదరాత్రులుజ్జ్వల...(*ఆంధ్ర. ఆరణ్య. 4: 142*) అనే పద్యంతో శరత్కాల వెన్నెలను వర్ణిస్తూ నన్నయ రచన ముగుస్తుంది. ఉదయం సంధ్యా సమయాన్ని వర్ణిస్తూ, స్ఫురదరుణాంశు...(*ఆంధ్ర. ఆరణ్య. 4: 143*) అనే పద్యంతో ఎఱ్ఱన రచన ప్రారంభమౌతుంది. ఎఱ్ఱన ఆరణ్యపర్వ శేషాన్ని తద్రచనయకా రచిస్తానని ప్రకటించుకున్నాడు.

నన్నయ రచనలాగా రచిస్తానని చెప్పడం వల్ల ఎఱ్ఱన రచనలో కూడా అక్షర రమ్యత, నానారుచిరార్థసూక్తినిధిత్వం, ప్రసన్నకథాకలితార్థయుక్తి ధ్వనిస్తాయి. నన్నయ శైలిలో రచిస్తూనే, ఎఱ్ఱన ఆంధ్ర మహాభారతంపై తనదైన ముద్రను వేశాడు. ఎఱ్ఱన ప్రధానమైన కవితా లక్షణం సూక్తి వైచిత్రి. "పరిఢవింతు ప్రబంధ పరమేశ్వరుని తేవ, సూక్తి వైచిత్రి నొక్కొక్కమాటు..." అంటూ శ్రీనాథ కవిసార్వభౌముడు ఎఱ్ఱన కవిత్వాన్ని స్తుతించాడు.

తిక్కన భారత భాగాన్ని ప్రబంధ మండలిగా పేర్కొన్న ఎఱ్ఱన, తన శైలీవిన్యాసంతో కవిత్రయ భారతానికి ప్రబంధ పరమేశ్వరత్వాన్ని ఆపాదించాడు.

ఆరణ్యపర్వ శేషాన్ని ఎవరు పూరించారు అనే విషయమై వాదోపవాదాలున్నాయి.

- నన్నయ మూడు పర్వాలు సంపూర్ణంగా రచించాడని, ఆరణ్యపర్వంలో కొంత భాగం ఖిలమైపోయిందని ఒక వాదన.
- తిక్కన ఆరణ్యపర్వ శేష భాగాన్ని రచించాడని, అది ఖిలమైపోయిందని, దానిని ఎఱ్ఱన పూరించాడని ఒక వాదన.
- నన్నయ, తిక్కన విడివిడిగా రచించిన ఆరణ్యపర్వ శేష భాగాలు ఖిలమైపోవడం వల్ల ఎఱ్ఱన ఆ భాగాన్ని పూరించాడని మరొక వాదన.

సాహిత్యచరిత్రకారులు నన్నయ ఆరణ్యపర్వంలో కొంత భాగాన్ని రచించి పరమపదించాడని, తిక్కన విరాట పర్వం మొదల్కొని స్వర్గారోహణపర్వం వరకు రచించాడని, ఎఱ్ఱన ఆరణ్యపర్వ శేష భాగాన్ని పూరించి ఆంధ్ర మహాభారత రచనాయజ్ఞాన్ని పూర్తి చేశాడని నిర్ధారించారు.

## 1.7. మహాభారత యజ్ఞం: కవిత్రయం

వ్యాస విరచితమైన సంస్కృత మహాభారతాన్ని తెలుగు జాతికి అందించాలనే తపనతో దీక్ష పూని, కవిత్రయం శాస్త్రేతిహాసంగా ఉన్న భారతాన్ని కావ్యేతిహాసంగా మలిచి, ఒక బృహత్తరమైన బాధ్యతని నెరవేర్చారు. మహాభారత రచనని ఒక యజ్ఞంగా భావించిన కవిత్రయం, ఆ అక్షర యజ్ఞాన్ని

నిర్వహించే క్రమంలో తమకి ఎదురైన సవాళ్ల గురించి, మహాభారత వైశిష్ట్యాన్ని గురించి ప్రస్తావించారు.

నన్నయ ఆంధ్ర మహాభారత అవతారికలో తాను భారతాన్ని తెలుగులోకి అనుసృజన చేయడానికి ఎవరు ప్రేరణగా నిలిచారో, ఎవరు ఆయనని రచించమని కోరారో పద్యాల రూపంలో తెలియజేశారు. నన్నయ, 11వ శతాబ్దంలో రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలన చేస్తున్న రాజరాజ నరేంద్రుడు అనే రాజు ఆస్థానంలో కవిగా ఉండేవాడు. ఆయన కోరిక మేరకే తాను భారత రచనకు శ్రీకారం చుట్టానని నన్నయ చెప్పుకున్నాడు. జననుత...( *ఆంధ్ర. ఆది. 1: 16*).

రాజరాజ నరేంద్రుడి పరిపాలన గురించి, రాజనీతిజ్ఞత గురించి, పరాక్రమం గురించి భారతావతారికలో నన్నయ చాలా గొప్పగా వర్ణించాడు.

చ. విమలమతిం బురాణములు వింటి ననేకము, లర్థధర్మశా
స్త్రములతెఱం గెఱింగితి, నుదాత్తరసాన్వితకావ్యనాటక
క్రమములు పెక్కుసూచితి, జగత్పరిపూజ్యము లైన యీశ్వరా
గమములయందు నిల్పితిఁ బ్రకాశముగా హృదయంబు భక్తితోన్. (*ఆంధ్ర. ఆది. 1: 10*)

వ. అయినను నాకు ననవరతంబును శ్రీమహాభారతంబునందుల యభిప్రాయంబు పెద్దదై యుండు. (*ఆంధ్ర. ఆది. 1: 11*)

'నిర్మలమైన మనస్సుతో పెక్కు పురాణాలు విన్నాను. అర్థ శాస్త్రాల, ధర్మ శాస్త్రాల పద్ధతి తెలుసుకున్నాను. రఘువంశం, శృంగార శాకుంతలం వంటి రసభరితమైన, ప్రౌఢమైన నాటకాల తీరు చూశాను. లోకానికి మిక్కిలి పూజనీయాలైన శైవాగమశాస్త్రాలయందు భక్తితో నా హృదయాన్ని లగ్నం చేశాను. అయినా, నాకు శ్రీమహాభారతంలోని తత్త్వం వాటన్నింటికంటే గొప్పగా కనిపిస్తోంది' అని రాజరాజ నరేంద్రుడు నన్నయతో భారతంపట్ల తనకున్న ప్రత్యేకాభిమానాన్ని చాటుకున్నాడు.

ఈ పద్యంలో రాజరాజ నరేంద్రుడి విజ్ఞాన సంపద ఆవిష్కృతమయ్యింది. అప్పట్లో మహారాజులకి కూడా ఇంత జ్ఞానం ఉండేది. రాజరాజ నరేంద్రుడు పురాణాలను, అర్థ ధర్మశాస్త్రాలను, శైవాగమ శాస్త్రాలను, కావ్య నాటకాలను భక్తి శ్రద్ధలతో చదివాడని స్పష్టమౌతోంది. విజ్ఞానవంతులైన మహారాజులు దేశాన్ని పాలిస్తే ఎలా ఉంటుందో అవతారికలో నన్నయ రాజరాజ నరేంద్రుడి గురించి చెప్పిన పద్యాల్లో స్పష్టం చేశాడు.

రాజరాజ నరేంద్రుడు అన్ని పురాణాలను, ఆధ్యాత్మిక గ్రంథాలను చదివినా కూడా అతడికి భారతం అన్నింటికంటే గొప్పగా అనిపించడం భారతానికి సారస్వత లోకంలో ఉన్న ఖ్యాతిని

తెలియజేస్తోంది. ఒకరకంగా చెప్పాలంటే రాజరాజ నరేంద్రుడికి భారతం ఆ గ్రంథాలన్నింటి సమాహారంగా కనిపించింది. అందుకే వ్యాసుడు, 'భారతంలో ఉన్నదే లోకమంతటా ఉంది. భారతంలో లేనిది లోకంలో ఎక్కడా లేదు' అని భారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

చ. హిమకరుఁ దొట్టి పూరుభరతేశకురుప్రభుపాండుభూపతుల్
క్రమమున వంశకర్త లనఁగా మహి నొప్పిన యస్మదీయవం
శమునఁ బ్రసిద్ధులై, విమలసద్గుణశోభితు లైన పాండవో
త్తములచరిత్ర నాకు సతతంబు వినంగ నభీష్ట మెంతయున్. (*ఆంధ్ర. ఆది. 1: 14*)

'చంద్రుడు మొదల్కొని పూరువు, భరతుడు, కురురాజు, పాండురాజు అనేవారు వరుసగా వంశాన్ని స్థాపించి, కొనసాగించినవారు కాగా భూమియందు అలరారిన మావంశంలో మిక్కిలి ప్రఖ్యాతులై, స్వచ్ఛమైన యోగ్యమైన గుణాలతో ప్రకాశించిన సజ్జనులైన పాండవులయొక్క చరిత్ర వినడం నాకెల్లప్పుడూ ప్రీతికరమై ఉంటుంది' అని రాజరాజ నరేంద్రుడు నన్నయతో పలికాడు.

చంద్రవంశ ఖ్యాతిని దశ దిశలా వ్యాపింపజేసినవారు పూరువు, భరతుడు, కురురాజు, పాండు రాజు మొదలైనవారు. అటువంటి వంశంలో పుట్టిన యోగ్యులు, సజ్జనులు అయిన పాండవుల కథని తెలియజేసే మహాభారతాన్ని తెలుగులో రచించమని రాజరాజ నరేంద్రుడు నన్నాయని కోరాడు. మహాభారతగాథని విని, చదివి, తన జన్మ సార్థకం చేసుకోవాలని రాజరాజ నరేంద్రుడి అభిలాష.

"విమలాదిత్యుని జ్యేష్ఠ పుత్రుడైన రాజరాజుపై అతని సవతి తమ్ముడైన విజయాదిత్యుడు పలుమార్లు దండెత్తి రాజ్యభ్రష్టుని కావించాడు. సోదరుని కారణంగా రాజరాజు దీర్ఘకాలం వనవాసం చేయవలసి వచ్చింది. అన్నదమ్ములైన కౌరవ పాండవుల మధ్య రాజ్యం కొరకు చెలరేగిన యుద్ధగాథలో రాజరాజు తన జీవిత దృశ్యాలను చూసుకున్నాడు.తనవలెనే అన్యాయానికి గురైన విమల సద్గుణులైన పాండవులంటే ఆయనకు అమితమైన అభిమానం. మహాభారత రచనకు ప్రేరేపించిన అసలైన కీలకం అది" *(న. దర్శ. 1998: 8).*

మహాభారతాన్ని చదవడం, శ్రవణం చేయడం ఎంతో గొప్ప ప్రేరణని, ఫలాన్ని ఇస్తుందో రాజరాజ నరేంద్రుడు చెప్పిన విధానాన్ని నన్నయ పద్యంలో ఇలా వివరించాడు.

చ. అమలసువర్ణశృంగఖుర మై కపిలం బగు గోశతంబు ను
త్తమబహువేదవిప్రులకు దానము సేసిన తత్ఫలంబు త
థ్యము సమకూరు భారతకథాశ్రవణాభిరతిన్, మదీయచి
త్తము ననిశంబు భారతకథాశ్రవణప్రవణంబ కావునన్. (*ఆంధ్ర. ఆది. 1: 15*)

‘పరిశుద్ధమైన, బంగారపు తొడుగుతో కూడి, కొమ్ములు, గిట్టలు కలిగి, కపిలవర్ణంలో ఉండే వంద ఆవులను యోగ్యులు, వేదాధ్యయనతత్పరులు అయిన పలువురు బ్రాహ్మణులకు దానం చేసిన ఆ ఫలితం, భారతకథను వినే ఆసక్తి చేతనే తప్పకుండా కలుగుతుంది. నా హృదయం ఎప్పుడూ అదే ఆసక్తిని కలిగి ఉంది’ అని రాజరాజ నరేంద్రుడు పలికాడు.

దానాలలో గోదానం చాలా విశిష్టమైనది. నిత్యవేదాధ్యయన తత్పరులైన, విజ్ఞులైన బ్రాహ్మణులకు గోదానం చేయడం విశేషం. గోవులనన్నింటిలోకి కపిలగోవు చాలా విశిష్టమైనది. కపిల గోవుని బ్రాహ్మణులకు దానం చేయడం మరింత విశేషం. అటువంటి కపిల గోవులు ఒక వంద బ్రాహ్మణులకు దానం చేయడం అత్యంత విశేషం. అది ఎంత విశేషమో, భారతకథని చదవడం, శ్రవణం చేయడం అంత విశేషమని రాజరాజ నరేంద్రుడి మాటల్లో నన్నయ వివరించాడు.

అంతే కాదు, అనేకభాషలలో, అనేక ప్రక్రియలలో పలువురు జనుల వల్ల భారతకథను వింటూ, అందులో అధికమైన ఆసక్తిని పెంచుకున్నవారికి అనేక యజ్ఞయాగాదులు చేయడం వల్ల కలిగే ఫలం సమకూరుతుందని రాజరాజ నరేంద్రుడు మహాభారత విశిష్టతని వివరించాడు.

రాజరాజ నరేంద్రుడి కోరిక మేరకు నన్నయ సంస్కృత మహాభారతం ఆధారంగా, తెలుగులో ఆంధ్ర మహాభారతాన్ని అనుసృజన చేసే బాధ్యతని తన భుజస్కంధాలపై వేసుకున్నాడు. అలా, మహాభారత యజ్ఞానికి శ్రీకారం చుట్టిన నన్నయ ఆది, సభా పర్వాలను, ఆరణ్య పర్వంలోని కొంత భాగాన్ని రచించి కైవల్యాన్ని పొందాడు. రాజరాజ నరేంద్రుడి కోరిక మేరకు ఆంధ్ర మహాభారత రచనకి శ్రీకారం చుట్టిన నన్నయ, అది ఎంతటి సాహసమో తన పద్యంలో వివరించాడు.

చ. అమలినతారకాసముదయంబుల నెన్నను, సర్వవేదశా
స్త్రముల యశేషసారము ముదంబునఁ బొందను, బుద్ధిబాహువి
క్రమమున దుర్గమార్థజలగౌరవభారతభారతీసము
ద్రముఁ దఱియంగ నీఁదను, విధాతృన కైనను నేరఁబోలునే. (*ఆంధ్ర. ఆది. 1: 19*)

‘ఆకాశంలోని నక్షత్రాలను లెక్కించడానికి, అన్ని వేదశాస్త్రాల సంపూర్ణసారాన్ని సంతోషంతో గ్రహించడానికి, బుద్ధి అనే భుజబలంతో, అర్థమనే నీటియొక్క విస్తృతితో కూడిన భారతవాఙ్మయ సముద్రాన్ని ఈదడం బ్రహ్మకైనా సాధ్యమేనా!’ అని నన్నయ భారతం విశిష్టతని వివరించాడు.

భారతాన్ని సర్వ వేదశాస్త్రాల సంపూర్ణసారంగా, అనంతమైన సాగరంతో పోల్చాడు నన్నయ. భారత రచన చేయడం బ్రహ్మకి కూడా సాధ్యపడే విషయమేనా! అంటూ ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశాడు నన్నయ. అలా చెప్పుకోవడం నన్నయకి ఉన్న వినయాన్ని సూచిస్తుంది. అసాధ్యమైన ఇన్ని

విషయాలతో భారత రచనని పోల్చాడు నన్నయ. మహాభారత రచనని ఒక సాహసంగా, సవాల్ గా స్వీకరించాడు నన్నయ. అసాధ్యాన్ని సుసాధ్యం చేసే క్రమంలో నన్నయ తొలి అడుగు వేస్తే, తిక్కన, ఎఱ్ఱన యజ్ఞాన్ని సంపూర్ణం చేశారు.

సీ. ఆయురర్థులకు దీర్ఘాయు రవాప్తియు / నర్థార్థులకు విపులార్థములును

ధర్మార్థులకు నిత్యధర్మసంప్రాప్తియు / వినయార్థులకు మహావినయమతియుఁ

బుత్త్రార్థులకు బహుపుత్త్రసమృద్ధియు / సంపదర్థుల కిష్టసంపదలును

గావించు నెప్పుడు భావించి వినుచుండు / వారికి నిమ్మహాభారతంబు

ఆ. భక్తియుక్తులైన భాగవతులకు శ్రీ

వల్లభుండు భక్తవత్సలుండు

భవభయంబు లెల్లఁ బాచి యిష్టార్థసం

సిద్ధిఁ గరుణతోడఁ జేయునట్లు. (*ఆంధ్ర. ఆది. 1: 34*)

'మహాభారతాన్ని ఎవరైతే ఎప్పుడూ చదువుతూ, శ్రవణం చేస్తూ ఉంటారో, అటువంటి భక్తులకు లక్ష్మీప్రియుడైన విష్ణువు వల్ల సంసార భయాలన్నీ పోయి, కోరిన కోరికలు సిద్ధిస్తాయి. మహాభారతం, ఆయుర్దాయాన్ని కోరేవారికి దీర్ఘాయువుని, ధనాన్ని కోరుకున్నవారికి అధిక సంపదని, ధర్మంగా జీవించాలనుకునేవారికి ధర్మ సంప్రాప్తిని, వినయాన్ని కోరుకునేవారికి వినయంతో కూడిన బుద్ధిని, సంతానాన్ని కోరుకునేవారికి సంతానప్రాప్తిని, ఐశ్వర్యాన్ని కోరుకునేవారికి అభీష్ట సంపదలని సిద్ధింపజేస్తుంది. మొత్తంగా మహాభారతం పాఠకుల పాలిట కామధేనువువంటిది' అని నన్నయ మహాభారత ప్రాశస్త్యాన్ని వివరించాడు.

మ. అమితాఖ్యానకశాఖలం బొలిచి, వేదార్థామలచ్ఛాయ మై,

సుమహద్వర్గచతుష్కపుష్పవితతిన్ శోభిల్లి, కృష్ణార్జునో

త్తమనానాగుణకీర్తనార్థఫలమై, ద్వైపాయనోద్యానజా

త మహాభారత పారిజాత మమరున్ ధాత్రీసురప్రార్థ్య మై. (*ఆంధ్ర. ఆది. 1: 66*)

'అనేక ఉపాఖ్యానాలనే కొమ్మలతో ఒప్పి, వేదాలలోని అర్థమనే నిర్మలమైన నీడ కలదై, నాలుగు పురుషార్థాలనే పూవుల సముదాయంతో ప్రకాశించి, కృష్ణార్జునుల సద్గుణాలను కీర్తించడం వల్ల మేలు (ఉద్దేశం) అనే పండ్లు కలదై, వ్యాసుడనే ఉద్యానవనంలో పుట్టిన మహాభారతేతిహాసం కల్పవృక్షమై అందరికీ పూజనీయంగా తోస్తోంది' అంటూ నన్నయ ఈ పద్యంలో మహాభారతేతిహాసాన్ని కల్పవృక్షంగా తలచి కీర్తించాడు. మహాభారతాన్ని పారిజాతం అనడం వల్ల

సర్వపురుషార్థ విజ్ఞానఫల ప్రదానం చేయగలదని తాత్పర్యం. ఇలా నన్నయ మరెన్నో సందర్భాల్లో మహాభారత వైశిష్ట్యాన్ని కొనియాడాడు.

కవిబ్రహ్మ, ఉభయకవిమిత్రుడు, మహాభారత రచనలో అత్యంత కీలకమైన పాత్ర పోషించిన తిక్కన మహాభారత ప్రాశస్త్యాన్ని గురించి ఎన్నో సందర్భాల్లో వర్ణించాడు. తిక్కన రచన విరాటపర్వంతో మొదలయ్యింది. రామాయణంలో సుందరకాండకి ఎంత ప్రాశస్త్యం ఉందో, ఆంధ్ర మహాభారతంలో విరాటపర్వానికి అంత ప్రాధాన్యత ఉంది. తిక్కన విరాటపర్వం ఆధారంగా ఆంధ్ర మహాభారతం యొక్క ధర్మాద్వైత స్వరూపాన్ని ఆవిష్కరించాడు.

క. వేదములకు నఖిల స్మృతి
వాదములకు బహు పురాణ వర్గంబులకున్
వా దైన చోటులను దా
మూదల ధర్మార్థ కామ మోక్ష స్థితికిన్. (*ఆంధ్ర. విరాట. 1: 4*)

'వేదాలకు, స్మృతులకు, పురాణాలకు, ధర్మార్థ కామ మోక్షాల విషయంలో వివాదం ఏర్పడితే ఆయా సందర్భాల్లో మహాభారతం పురుషార్థ నిర్ణాయక గ్రంథంగా నిలుస్తుంది' అని మహాభారత ప్రాముఖ్యతని తెలియజేశాడు. వేదాలు అపౌరుషేయాలైతే, శాస్త్రకారులు, మహాకవులు రాసినవి స్మృతులు, పురాణాలు. వీటిలో కొన్ని చోట్ల పరస్పర వైరుధ్యాలు కనిపించవచ్చు. అటువంటి సమయంలో భారతం మాత్రమే ప్రామాణికం అని తిక్కన బోధించాడు.

"మహాభారతం ఎలా తేల్చగలదు అంటే జగత్తంత విస్తృతమైన త్రైకాలికమైన సృష్టితత్త్వం తెలుపుతుంది కనుక. ఇతిహాసం కనుక. మానవ సమాజంలోని వైవిధ్యం, స్థాయి భేదాలు, పుణ్యపాపములు, అనంతమైన సంవాద వివాదాలు మహాభారతంలో ఉన్నాయి కనుక" *(సుప్రసాన్నాచార్య, కోవెల. 2012: 41).*

ఉ. కావున భారతామృతముఁ గర్ణపుటంబుల నారఁగ్రోలి యాం
ధ్రావళి మోదముం బొరయునట్లుగ సాత్యవతేయ సంస్కృతి
శ్రీ విభవాస్పదం బయిన చిత్తముతోడ మహాకవిత్వ దీ
క్షావిధి నొంది పద్యముల గద్యములన్ రచియించెదన్ గృతుల్. *(ఆంధ్ర. విరాట. 1: 30)*

'ఆంధ్రులందరూ దొప్పల వంటి చెవులతో మహాభారతమనే అమృతాన్ని తనివి తీరా తాగి, ఆహ్లాదాన్ని పొందేటట్లుగా, వ్యాసమహర్షి భావన అయిన ఈ సంపద యొక్క వైభవంతో నిండిన మనస్సుతో, భారతపర్వాలను ఉత్తమకవిత్వంతో మహాకవ్యంలా రచించాలనే గొప్పదీక్షను పూని,

నియమంతో చంపూ రచనగా రచిస్తాను' అని తిక్కన తన భారత భాగాన్ని రచించడానికి ముందు పలికాడు.

తిక్కన పై పద్యంలో భారతాన్ని అమృతంతో పోల్చడం విశేషం. అలా చెప్పడం వల్ల భారతం యొక్క నిత్యత్వాన్ని, ఆస్వాదనీయత్వాన్ని, విశ్వజనీనత్వాన్ని తిక్కన మరొక సారి స్పష్టం చేశాడు. అమృతం ఎంత ఆస్వాదించినా ఇంకా ఆశ్వాదించాలని అని అనిపిస్తుంది. మహాభారతం కూడా అటువంటిదే అని చెప్పడం తిక్కన ఉద్దేశం. అమృతం నిత్యం, విశ్వజనీనం. భారతం కూడా నిత్యమై, నిఖిలమై విశ్వజనీనమైనది.

మహాభారతాన్ని తెలుగు వారికి అందించాలనే తపనతో ఆంధ్ర మహాభారత రచనకి పూనుకున్నవాడు నన్నయ. ఆరణ్యపర్వంలో సుమారుగా సగభాగాన్ని రచించిన కొంత కాలానికి నన్నయ శివైక్యం చెందారు. తిక్కన ఆరణ్యపర్వశేషభాగాన్ని విడిచిపెట్టి, విరాట పర్వం మొదలుకొని స్వర్గారోహణ పర్వం వరకు 15 పర్వాలు రచించాడు. అయినా ఆరణ్యపర్వ శేషం అలాగే మిగిలిపోవడంతో ఆంధ్ర మహాభారత యజ్ఞం అసంపూర్ణంగానే మిగిలిపోయింది. ఆ యజ్ఞానికి సంపూర్ణత్వాన్ని సిద్ధింపజేస్తూ ప్రబంధ పరమేశ్వరుడు, శంభుదాసుడు ఎఱ్ఱన మహాకవి ఆరణ్య పర్వ శేషాన్ని పూరించి, తెలుగువారికి చిరకాలం నిలిచిపోయే కానుకనిచ్చాడు.

ఎఱ్ఱన ఆరణ్యపర్వ శేషాన్ని రచించే ముందు ఒక్క పద్యంలో కూడా తన పేర పేర్కొనలేదు. నన్నయ మహాకవి పేరనే ఆరణ్యపర్వ శేషాన్ని ఎఱ్ఱన పూరించాడు. దీన్ని బట్టీ ఎఱ్ఱన వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైనదో అర్థం చేసుకోవచ్చు. మొత్తం ఆరణ్య పర్వ శేషాన్ని రచించాక, ఆశ్వాసాంతంలో ఎఱ్ఱన కొన్ని విశేషాలను పొందుపరిచాడు. ఆరణ్య పర్వ శేషాన్ని ఎఱ్ఱన పూరించాడని చెప్పడానికి ఉన్న కేవలమైన ఆధారాలు ఈ పద్యాలు. కవిత్రయ మహాభారత యజ్ఞంలో నన్నయ సారస్వత మహిమలో పాలుపంచుకోవడం తన అదృష్టమని ఎఱ్ఱన వ్యక్తం చేశాడు.

సీ. భవ్యచరిత్రుఁ డాపస్తంబసూత్రుండు, / శ్రీవత్సగోత్రుండు, శివపదాబ్జ
సంతతధ్యాన సంసక్తచిత్తుఁడు, సూర / నార్యునకును బోతమాంబికకును
నందనుఁ, డిలఁ బాకనాటిలో నీలకం / ఠేశ్వరస్థానమై యెసకమెసఁగు
గుడ్లూరు నెలవుగ గుణగరిష్ఠత నొప్పు / ధన్యుండు ధర్మైకతత్పరాత్ముఁ

తే. డెట్టనార్యుండు సకలలోకైక విదితుఁ
దయిన నన్నయభట్టమహాకవీంద్రు
సరససారస్వతాంశప్రశస్తి దన్నుఁ
జెందుటయు సాధుజనహర్షసిద్ధిఁ గోరి. *(ఆంధ్ర. ఆరణ్య. 7: 469)*

క. ధీరవిచారుఁడు తత్కవి
తారీతియుఁ గొంతదోఁపఁ దద్రచనయకా
నారణ్యపర్వశేషము
పూరించెఁ గవీంద్రకర్ణపుటపేయముగాన్. *(ఆంధ్ర. ఆరణ్య. 7: 470)*

'యోగ్యమైన ప్రవర్తన కలవాడు, ఆపస్తంబసూత్రుల వంశంలో జన్మించినవాడు, శివుడి పాదపద్మాలను ఆరాధించే మనస్సు కలవాడు, సూరనార్యుడికీ, పోతమాంబికకీ కొడుకు అయినవాడు పాకనాటిలో శివుడి ఆలయం గల గుడ్లూరు అనే ఊరిలో నివసించేవాడు, మంచి గుణములే తన గొప్పతనానికి ఆధారమై జీవితం ధన్యమైనవాడు, ధర్మంలో మాత్రమే తాత్పర్యం కలవాడు అయిన ఎఱ్ఱన జగద్విదితుడు అయిన నన్నయభట్ట మహాకవి సారస్వత మహిమలో పాలుపంచుకొన్నట్లు పేరు పొందడం చేత సుజనసంతోషసిద్ధిని కోరి, గంభీరమైన యోచన చేసినవాడైన నన్నయభట్టు యొక్క కవితాశిల్పరీతి కొంత ప్రతిఫలించేటట్లుగా ఆతని రచనయే అయ్యేటట్లుగా ఆరణ్యపర్వశేషాన్ని కవిపండితులకు ప్రీతి ఘటించేటట్లుగా ఎఱ్ఱన పూరించాడు'.

ఎఱ్ఱన జీవిత విశేషాలు, కవిత్రయ మహాభారత యజ్ఞంలో తాను భాగస్వామిగా ఉన్నందుకు తనపై ఉన్న భగవత్కృప గురించి ఈ పద్యాల్లో వివరించాడు. ఆరణ్యపర్వ శేషాన్ని పూరించే క్రమంలో ప్రతీ క్షణం, ప్రతీ అక్షరం నన్నయ రచనలానే ఉండాలని ఎఱ్ఱన తపించాడు. ఎఱ్ఱన మహాకవి చొరవ వల్ల ఆంధ్ర మహాభారతం యొక్క విరాట్ స్వరూపం ఆవిష్కరించబడింది. తరతరాలకీ వెలుగు బాటని చూపిస్తూ అత్యంత అరుదైన, అపురూపమైన ప్రయత్నంగా చరిత్రలో నిలిచిపోయింది.

డా. కేతవరపు రామకోటిశాస్త్రిగారి మాటలు ఇక్కడ పేర్కొనదగినవి, "భారత కవులు నన్నయ తిక్కనాదులు తమ సాహిత్యానికి ఒక ప్రజా ప్రయోజనం ఆశించిన వాళ్లు కావడం చేత ముగ్గురు ఒకరి తరువాత ఒకరు వచ్చి ఎక్కడ నుండి మొదలు పెట్టి రచించినా మొత్తం ఒకరే రచించినంత పకడ్బందీగా ఉంటుంది భారతం. తెలుగు మహాభారత నిర్మాణానికి పునాది వేశాడు నన్నయభట్టు. పునాది బలం తెలుసుకొని ఉపరితలం సౌధ నిర్మాణం చేశారు తిక్కన, ఎఱ్ఱన" *(ప్రా. సా. మం. 2014: 17).*

## 1.8. ఆంధ్ర మహాభారతం: ప్రత్యేకత

శ్లో. యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న కుత్రచిత్
ధర్మేచార్థే చ కామేచ మోక్షేచ భరతర్షభ. (*సం. మ. భా. ఆది. 56: 33*).

'పురుషార్థాలైన ధర్మ, అర్థ, కామ మోక్షాల విషయంలో భారతంలో ఉన్నదే లోకంలో అంతటా ఉంది. భారతంలో లేనిది ఈ లోకంలో ఎక్కడా లేదు' అని వ్యాస మహర్షి భారతం ప్రారంభంలోనే చెప్పాడు. ఆ మాట ఆకాలానికే కాదు, ఏ కాలానికైనా వర్తిస్తుంది. భారతంలో ఉన్న రకరకాల పాత్రలు ఆయా పరిస్థితులలో ప్రవర్తించిన తీరు, తరతరాలకు మార్గనిర్దేశం చేస్తాయి. ధర్మంగా జీవించి, తద్వారా సిద్ధించిన అర్థంతో కోరికలను నెరవేర్చుకుని మోక్ష సిద్ధి కోసం ప్రయత్నించడమే మానవుడి అంతిమ లక్ష్యం అని మన తాత్త్విక గ్రంథాలు బోధిస్తున్నాయి. ఆంధ్ర మహాభారతం అటువంటి విలువలకు, మూలాలకు కట్టుబడిన గ్రంథమే.

ముఖ్యంగా, పసితనం నుండి పట్టభద్రులయ్యే వరకు ఆంగ్ల మాధ్యమంలోనే చదువుకుని, భారతీయ సంప్రదాయాలకు, సంస్కృతికి, సాహిత్యానికి, ప్రత్యేకించి తెలుగు సాహిత్యానికి దూరమైపోతున్న యువతరానికి ఆంధ్ర మహాభారతం గొప్ప జీవిత పాఠంగా నిలుస్తుంది.

*History of Indian Literature* అనే గ్రంథంలో వింటర్ నిడ్జ్ గారి మాటలు ఇక్కడ ప్రస్తావించదగినవి. "It is only in a very restricted sense that we may speak of the *Mahabharat* as an "Epic" and a "Poem. Indeed in a certain sense the *Mahabharat* is not one poetic production as all, but rather a whole Literature".

'మనం ఒకానొక దృష్టితో భారతాన్ని కేవలం ఒక ఇతిహాసంగానో, కావ్యంగానో చూస్తుంటాం. కానీ, భారతం కేవలం ఒక కావ్యేతిహాసం మాత్రమే కాదు. అంతకు మించి అది యావత్ప్రపంచ సాహిత్యం'. సమాజాన్ని ప్రతిబింబించేదే సాహిత్యం. భారతం మొత్తం సాహిత్యానికి సరితూగేదే అయితే, దాంట్లో ఉండే సామాజికాంశాలు అన్ని కాలాలకి వర్తిస్తాయి అనడంలో సందేహం లేదు.

"In its comprehensiveness the Mahabharata compares with, and owes its existence to, the Vedas. Economics, sociology, politics, accountancy, the art of war, chemistry, astronomy – all is included, along with philosophy and spirituality" *(Sitansu S, Chakravarti. 2006: 125)*

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రం బని, / యధ్యాత్మవిదులు వేదాంత మనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రం బని, / కవివృషభులు మహాకావ్య మనియు,
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహ మని, / యైతిహాసికు లితిహాస మనియుఁ,
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చ / యం బని, మహిఁ గొనియాడుచుండ.

ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ
డాదిముని పరాశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీన మై
పరఁగుచుండఁ జేసె భారతంబు. *(ఆంధ్ర. ఆది. 1: 32)*

'ధర్మస్వభావం తెలిసినవారు భారతం ధర్మశాస్త్రమని, ఆధ్యాత్మికవేత్తలు భారతం వేదాంత గ్రంథమని, నీతి విచక్షణ కలిగినవారు భారతం గొప్ప నీతిశాస్త్ర గ్రంథమని, కవులు, పండితులు భారతం ఒక మహాకావ్యమని, లాక్షణికులు, వ్యాకరణశాస్త్ర పండితులు భారతం గొప్ప లాక్షణిక గ్రంథమని, పూర్వ కథలు తెలిసినవారు భారతం ఒక ఇతిహాసమని, ఉత్తమ పౌరాణికులు భారతం పెక్కు పురాణాలు సమూహమని ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా భావిస్తారు. అటువంటి భారతాన్ని, వేదవ్యాసుడు సర్వజనహితార్థం సంస్కృత మహాభారతాన్ని రచించాడు'.

ఈ పద్యం, యదిహాస్తి తదన్యత్ర.. (*సం. మ. భా. ఆది. 56: 33*) అంటూ వ్యాసమహర్షి సంస్కృత భారతంలో చెప్పిన శ్లోకం యొక్క ఆత్మని ఆవిష్కరిస్తుంది.

భారతం ఒక్కొక్కరికి ఒక్కొక్క విధంగా కనిపిస్తుంది. మనం ఏ దృష్టితో వెతికితే అలాగే కనిపిస్తుంది. ప్రతీ మనిషి తనని తాను భారతంలో చూసుకోవచ్చు. భారతానికి ఉన్న ప్రత్యేకత అటువంటిది. యావత్ప్రపంచ సాహిత్యంలో ఇటువంటి గ్రంథం లేదు అనడం అతిశయోక్తి కాదు. ఆంధ్ర మహాభారతంపై నేటికి 170 పరిశోధనలు వచ్చినా ఇంకా కొత్త పరిశోధనలు వస్తున్నాయి. ప్రతీ పరిశోధకుడు ఒక వినూత్న కోణంలో భారతాన్ని పరిశీలించడం వల్ల భారతం ఆయా కోణాల్లో ఆవిష్కృతమౌతోంది.

## 1.9. తింటే గారెలే తినాలి; వింటే భారతమే వినాలి

'తింటే గారెలే తినాలి; వింటే భారతమే వినాలి' అని ఒక ప్రసిద్ధమైన తెలుగు సామెత ఉంది. ఈ మాట చాలా మంది అంటుంటారు. కానీ, దాని వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో చాలా మందికి తెలియదు. ఈ మాటకి కొంత మంది 'గారెలు ఎంత తిన్నా ఇంకా తినాలనిపిస్తుంది. భారతం కూడా అటువంటిదే, ఎన్ని సార్లు విన్నా ఇంకా వినాలనిపిస్తుంది' అని అర్థం చెబుతుంటారు. నిజానికి గారెలు ఎంత ఇష్టమైన వారికైనా ఎక్కువ తింటే చిరాకు వస్తుంది. అందుకే, 'తినగా తినగా గారెలు గండరెక్కాయి' అంటారు. అసలు ఉద్దేశ్యం అది కాదు. గారెలకి ప్రత్యేకమైన రుచి అంటూ ఉండదు. గారెలు కమ్మగా ఉన్నాయి అంటాం. కానీ, కమ్మదనం షడ్రుచులలో ఒకటి కాదు. గారెలు ఏ పదార్థంతో కలుపుకొని తింటే ఆ పదార్థంలానే రుచిస్తాయి. పైగా గారెలను పెరుగు, చారు, బెల్లం, తేనె, చెరుకు రసం వంటి ఎన్నో పదార్థాలలో కలుపుకుని తింటారు. గారెలు నంచుకున్న పదార్థాన్నీ బట్టి రుచించినట్టే, భారతం కూడా ఏ కోణంలో చూస్తే ఆ కోణంలో కనిపిస్తుంది. భారతంలో ఏది వెతికితే అది దొరుకుతుంది.

సంస్కృత మహాభారతమైనా, ఆంధ్ర మహాభారతమైనా, మరే ఇతర భాషలలోకి అనువదించబడిన భారతమైన సరే భారతం సామాజిక చైతన్యం కోసం రచించబడింది అనేది సుస్పష్టం. అందునా సంస్కృత భారతాన్ని తెలుగు జాతికి అందించే క్రమంలో కవిత్రయం భారతాన్ని రచించిన తీరు, భారతంలోని సామాజిక కోణం ఎంతో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. ఈరోజు, ఆత్మవిశ్వాసం కోసం, మనోనిగ్రహం కోసం, వ్యక్తిత్వ వికాసం కోసం శిక్షణాకేంద్రాలను ఆశ్రయిస్తున్న వారందరికీ ఆంధ్ర మహాభారతం సాహిత్య రూపంలో ధైర్యాన్ని అందిస్తుంది.

## 1.10. అమృతత్వ సాధనం

నన్నయ రచించిన ఆదిపర్వంలో వర్ణించబడిన 'సర్పయాగం' కథలో మహాభారతం యొక్క ప్రత్యేకత ధ్వనిస్తుంది. ప్రతీ కథలోనూ పాఠకులను ప్రసన్నం చేసే లక్షణాలు ఒక్క మహాభారతంలోనే ఉన్నాయని స్పష్టమౌతోంది. మహాభారత కథాపరమార్థాన్ని ఆఖ్యానాలు సైతం పరిపూర్ణం చేస్తున్నాయి.

క. ఒనర జరత్కారు మునీం
ద్రునకు జరత్కారునకు సుతుం డైన మహా
మునివరు నాస్తీకుని ముద
మునఁ దలఁచిన నురగభయముఁ బొందదు జనులన్ .(*ఆంధ్ర. ఆది. 2: 234*)

'ఒప్పగా జరత్కారువు అనే మునిశ్రేష్ఠునికి, జరత్కారువు అనే వాసుకి చెల్లెలికి కుమారుడైన ఆస్తీకమహామునిని స్మరిస్తే జనులకు పాముల వలన భయం కలగదు. అదీ కాక, ఆస్తీక మహామునివర్యుని కథ విన్న జనులకు సకల పాపాలు తొలగిపోతాయి'.

ఈ పద్యంలో ఆస్తీక మహామునిని స్మరించినవారికి కలిగే ఫలం చెప్పబడింది. మహాభారత కథాపరమార్థం అమృతత్వసాధనం. దీనికి సంబంధించిన మహార్థాలను చెప్పే ఆఖ్యానాలు కూడా ఫలశ్రుతులు చెప్పడం గమనించదగిన అంశం. 'గరుడోపాఖ్యానం అమృతం తాగకుండానే అమరుడైనవాడి కథ. అమృతాన్ని అందించినా అందుకోలేని ఉరగుల కథ. సర్పయాగ వృత్తాంతంలో ఆస్తీకుడు పాములని మృతి నుండి తప్పించి, అదే అమృతత్వమని అందించాడు. దయాగుణమే అమృతత్వమని తేల్చిన కథ ఇది. ప్రధాన కథ మధ్యలో వచ్చే ఈ ఆఖ్యానాలు కూడా మహాభారత కథాపరమార్థాన్ని ఆవిష్కరిస్తుండడం చాలా గొప్ప విషయం'. మహాభారతం యొక్క ప్రత్యేకతని వివరించేందుకు ఇదొక సాధనం.

నన్నయ రచించిన ఆరణ్యపర్వం ఆంధ్ర మహాభారతంలోని అతి పెద్ద పర్వాలలో ఒకటి. ఇందులోని ప్రధానమైన కథ పెద్దది కాకపోయినా, ఉపాఖ్యానాలు ఎక్కువ ఉండడం వల్ల పర్వం పెరిగింది. అరణ్యవాసంలో ఉన్న పాండవులని ఈ పర్వంలో ఎంతో మంది మునులు, మహర్షులు సందర్శించి ఎన్నో కథలు చెప్పి, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆ మహర్షులు రాజనీతి గురించి, నాయకత్వ లక్షణాల గురించి, ఆర్థిక సూత్రాల గురించి వివరంగా ప్రస్తావించారు. అవి కేవలం పాండవులకే కాదు, కలియుగంలో మానవులకి సైతం వర్తిస్తాయి. మహాభారత కథలో ఉన్న సార్వకాలికత, కవిత్రయ రచనా సంవిధానంలో ఉన్న ముద్ర అందుకు ప్రధానమైన కారణాలు.

ఆరణ్యపర్వంలో వచ్చే ఉపాఖ్యానాలలో అతి పెద్దది నలోపాఖ్యానం. "పాశ్చాత్యుల దృష్టిలో విషాదాత్మక కృతులకు విలువ అధికం. భారతీయ సాహిత్యంలో విషాదవృత్తాలైన రచనలు లేవని కొందరు అధిక్షేపిస్తుంటారు. నలోపాఖ్యానం విషాదాంత గాథ కాదు కానీ, విషాదాత్మక కృతి అని చెప్పవచ్చు. మిక్కిలి పురాతన కాలంలో మహాభారతం 'జయం' రచింపబడడానికి చాలాకాలం

పూర్వమే నలచక్రవర్తి గాథ భారతదేశంలో యుగ యుగాంతరాలలో బహుళవ్యాప్తి పొందినట్లు, తదుపరి ప్రాచీనతమమైన ఇతిహాసం మహాభారతంలో లీనమైనట్లు ఊహించడం సత్యదూరం కాదు. ఇంకొక విశేషం. భారతంలోని ధర్మరాజుకు, నలోపాఖ్యానంలోని కథానాయకుడైన నలుడికి గల సామాన్య వ్యసనం జూదం. ఇక, బృహదశ్వుడు ప్రస్ఫుటంగా వచించినట్లు ధర్మరాజు కంటే విషాదాత్మక నాయకుడిగా నలుడు నిర్వహించిన భూమిక ఎక్కువ హృదయవిదారకమైనది. అందుచేత నలోపాఖ్యానం చదివినవారికి దుఃఖభూయిష్ఠమైన కలియుగబాధ నుంచి నిష్కృతి లభిస్తుందన్న పెద్దల ప్రవచనంలో అంతరార్థం ఉన్నదని అంగీకరించవచ్చును" *(ఆంధ్ర. ఆరణ్య. 2. పుట: 169).*

## 1.11. యుగాచారవర్తనం – యుగధర్మాల ప్రస్తావన

ఆంధ్ర మహాభారతంలో శాస్త్రపరంగా ఏర్పడే ఎన్నో సందేహాలకు అత్యంత ప్రామాణికమైన సమాధానాలు కనిపిస్తాయి. సంస్కృత భారతం శాస్త్రేతిహాసంగా ప్రసిద్ధికెక్కింది. ఆంధ్ర మహాభారతం కావ్యేతిహాసంగా ప్రసిద్ధికెక్కినా మహాభారతంలో ఉన్న శాస్త్ర నిష్పత్తిని నిలుపుకుంది. నన్నయ రచించిన ఆరణ్యపర్వ భాగంలో యుగధర్మాల గురించి, యుగాచారాల గురించి, ఆయా యుగాల్లో భగవంతుడి అవతారాల గురించి హనుమంతుడు భీముడికి వివరించిన విశేషాల ప్రస్తావన కనిపిస్తుంది.

హనుమంతుడు భీముడికి వివరించిన క్రమంగా –

కృతయుగంలో చేయడమే కాని, చేయవలసినటువంటిది లేదు. ధర్మం నాలుగు పాదాలలో వర్తిస్తుంది. విష్ణుదేవుడు ఆ యుగంలో తెల్లటిరంగు కలవాడై ప్రజలను కాపాడుతూ వెలుగొందుతుంటాడు. అంటే, కృతయుగంలో ప్రజలు అంతా ఎవరి కర్తవ్యం వారు నిర్వర్తిస్తారు. యుగధర్మానికి కట్టుబడి ఉంటారని చెప్పబడింది. ఆ కృత యుగం శాశ్వత స్వరూపమైన ధర్మంతో కూడి ఉంటుంది. అందరూ ఒకే విధమైన వేదం ఆదేశించే కార్యాలను ఆచరించే యోగ్యత కలవారై ఉంటారు. వారికి కోరికలు లేకుండానే సంక్రమించే ఫలాల వల్ల ఉత్తమగతులు ప్రాప్తిస్తాయి. ఆ యుగంలో సద్గుణ సంపన్నత కనిపిస్తుంది. శత్రువులపై పగ తీర్చుకోవడానికి మంత్ర, తంత్ర కర్మలు

జరగవు. డాబు, పిసినిగొట్టుతనం, కలహస్వభావం, కోపం, గర్వం, ఓర్వలేనితనం, దుఃఖం, రోగం, ప్రజానాశనం, ఇంద్రియ పటుత్వం తగ్గడం ఉండవు.

త్రేతాయుగంలో ధర్మం మూడు పాదాలలో ప్రవర్తిల్లుతుంది. అందులో జనులు ఎల్లప్పుడూ నిజం చెప్పడం అనే నిష్ఠతో ఉంటారు. యజ్ఞాలు, తపస్సు, దానం మొదలైన పుణ్యకార్యాలను చేయడంలో ప్రజలు ఆసక్తి కలవారౌతారు. ఆ యుగంలో పూజనీయుడైన విష్ణుదేవుడు ఎర్రటిరంగు కలవాడై ప్రజలను కాపాడుతాడు.

ద్వాపరయుగంలో ధర్మం రెండు పాదాలలో ప్రవర్తిల్లుతుంది. వేదాలు నాలుగు తెరగులుగా ప్రవర్తిల్లుతాయి. వేదాలలోనూ, శాస్త్రాలలోను ప్రతిపాదించబడిన భావాల చేత నడుపబడి ధర్మకామాలు విలసిల్లుతాయి. ద్వాపరయుగంలో ప్రజలు నిజాన్ని మాట్లాడడం తప్పుతారు. అంతరింద్రియ నిగ్రహాన్ని కోల్పోతారు. కోరికల పట్ల ఆసక్తి కలవారై ఎన్నో యజ్ఞాలు నిర్వహిస్తారు.ఆ యుగంలో విష్ణుదేవుడు నీలవర్ణుడై జగత్తును కాపాడతాడు.

కలియుగంలో ధర్మం శక్తి తగ్గి ఒకే చరణాన నడుస్తుంది. అప్పుడు విష్ణుదేవుడు పసుపురంగు కలవాడై ప్రపంచాన్ని కాపాడతాడు. కలియుగంలో జనులు కోరికలు, కోపం మొదలైన ఆరు దుర్గుణాలను (అరిషడ్వర్గాలను) పెంచుకొని, తమను తాము తెలుసుకోలేని ఆవేశం కలిగి అధర్మమార్గంలో వర్తిల్లుతారు. కానీ, **కలి యుగంలో చేసిన తపం, దానం మొదలైన సత్కార్యాలు స్వల్పమైనా హెచ్చు ఫలాలను ఇస్తాయి**.

## 1.12. విజ్ఞాన సర్వస్వం

మహాభారతం గొప్ప విజ్ఞాన సర్వస్వం. ఏ శాస్త్ర పండితులకి ఆ శాస్త్రంలా దర్శనమిచ్చే లక్షణం ఒక మహాభారతానికే ఉంది. ఆ ముద్ర ఆంధ్ర మహాభారతంలో కూడా కనిపించేలా కవిత్రయం సర్వలక్షణ సంగ్రహంగా ఆంధ్ర మహాభారతాన్ని తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఎన్నో విజ్ఞానిక విశేషాలు ఆంధ్ర మహాభారతంలో కనిపిస్తాయి.

నన్నయ రచించిన ఆదిపర్వంలో ఉదంకోపాఖ్యానం ఎన్నో వైజ్ఞానిక విశేషాలను ఆవిష్కరించింది. సనాతన ధర్మం ఆ వైజ్ఞానిక విశేషాలను ఎలా ప్రతీకాత్మకంగా చిత్రించిందో వివరించింది. ఉదంకుడి గురువైన పైలుడు, ఉదంకుడి కోరిక మేరకు గురుదక్షిణ స్వీకరించడానికి

సిద్ధపడతాడు. పౌష్యమహారాజు దేవేరి కర్ణకుండలాలు గురుదక్షిణగా ఇమ్మని పైలుడు ఉదంకుడిని నియోగించాడు. అయితే, పౌష్యుడి మన్నన పొంది కర్ణ కుండలాలను తెచ్చే మార్గంలో ఉదంకుడికి ఎదురైన విచిత్రమైన పరిస్థితులు అతడిని ఆశ్చర్యపరుస్తాయి. ఆ పరిస్థితులని పైలుడికి వర్ణించి, అతడికి ఏర్పడిన సందేహాలను ఉదంకుడు పైలుడి ముందు ఉంచుతాడు. పైలుడు చెప్పిన సమాధానాలు ఆంధ్ర మహాభారతం విజ్ఞాన సర్వస్వంగా ఎందుకు పిలవబడిందో ఆవిష్కరిస్తాయి.

ఉదంకుడు పౌష్యుడి వద్దకి వెళ్లే ముందు ఎద్దునెక్కి వస్తున్న ఒక దేవతాపురుషుడిని చూశాడు. అతడు ఏర్పరచిన పేడ తిన్నాడు. పౌష్యుడి వద్ద కుండలాలు పుచ్చుకొని వస్తుంటే తక్షకుడు వాటిని అపహరించాడు. తక్షకుడిని వెంబడిస్తూ ఉదంకుడు నాగలోకానికి వెళ్లాడు. అక్కడ కొన్ని విచిత్రాలు చూశాడు. సర్పరాజులందరినీ తన సంభాషణానైపుణ్యంతో మెప్పించాడు. ఉదంకుడు ఆ పాతాళలోకంలో తెల్లని, నల్లని దారాలతో కూడిన వస్త్రం నేస్తున్న ఇద్దరు స్త్రీలను, పన్నెండు ఆకులు గల చక్రాన్ని తిప్పుతున్న ఆరుగురు యువకులను, మిక్కిలి ఎత్తైన గుర్రాన్ని ఎక్కిన ఒక దివ్యపురుషుడిని చూశాడు. అతడి అనుగ్రహం వల్ల కుండలాలను తిరిగి పొందాడు. ఆ దివ్య పురుషుడి ఆజ్ఞ మేరకు ఆ గుర్రాన్ని ఎక్కి వచ్చాడు. ఉదంకుడికి ఇదంతా అర్థం కాలేదు. అందుకే, సందేహనివృత్తి కోసం గురువైన పైలుడిని ఆశ్రయించాడు. పైలుడు చెప్పిన వివరణ ఎన్నో వైజ్ఞానిక విశేషాలను ఆవిష్కరించింది.

సీ. అప్పురుషుం డింద్రుఁ, డయ్యుక్ష మైరావ / తంబు, గోమయ మమృతంబు, నాగ
భువనంబులోఁ గన్న పొలఁతు లిద్దఱు ధాత / యును విధాతయు, వారి యనువయించు
సితకృష్ణతంతురాజిత తంత్ర మది యహో / రాత్రంబు, ద్వాదశారములు గలుగు
చక్రంబు మాసాత్మ సంవత్సరంబు, కు / మారు లయ్యార్వురు మహితఋతువు,

ఆ. లత్తురంగ మగ్ని, యప్పురుషుండు ప
ర్జన్యుఁ డింద్రసఖుఁడు సన్మునీంద్ర
యాది నింద్రుఁ గాంచి యమృతాశి వగుట నీ
కభిమతార్థ సిద్ధి యయ్యెనయ్య! (*ఆంధ్ర. ఆది. 1: 118*)

‘ఓ మునిశ్రేష్ఠా! ఉదంకా! ఆ దివ్య పురుషుడు ఇంద్రుడు. అతడు ఎక్కిన ఎద్దు దేవతల ఏనుగైన ఐరావతం. పేడ అమృతం. నాగలోకంలో ఉన్న ఇద్దరు స్త్రీలు ధాత, విధాత అనేవారు. వారు నేసే

తెల్లని, నల్లని దారాల మగ్గం దినరాత్రి రూపం. పన్నెండాకులు గల చక్రం నెలల రూపమైన సంవత్సరం. ఆ చక్రాన్ని తిప్పే ఆరుగురు యువకులు గొప్పవైన ఆరు ఋతువులు (వసంతం, గ్రీష్మం, వర్షం, శరత్తు, హేమంతం, శిశిరం). ఆ గుర్రం అగ్ని. దానిని ఎక్కిన దివ్య పురుషుడు ఇంద్రుడి మిత్రుడైన పర్జన్యుడు (వర్షాధి దేవత, మేఘుడు, విష్ణువు, ఇంద్రుడు అని అర్థాలు ఉన్నాయి). మొదట ఇంద్రుడిని చూసి అమృతం తిన్నవాడివి అగుట చేత నీకు వాంఛితార్థసిద్ధి కలిగింది. కుండలాలు లభించాయి'.

పైలుడి సమాధానంలో ఎన్నో విశేషాలు వివరించబడ్డాయి. ప్రతీకాత్మకంగా సనాతన ధర్మంలో ఎన్ని సూక్ష్మాలు/ వైజ్ఞానిక విశేషాలు వివరించబడ్డాయో పైలుడి మాటలు గమనిస్తే చాలు. కేవలం విజ్ఞానమే కాదు, ఆచారాలు, సంప్రదాయాలు ఎన్నో ఇలా ప్రతీకాత్మకంగానే ఆంధ్ర మహాభారతంలో వివరించబడ్డాయి.

సునిశిత బుద్ధితో పరిశీలిస్తే ఆంధ్ర మహాభారతంలో ఎన్నో విశేషాలు, ప్రత్యేకతలు కనిపిస్తాయి. కవిత్రయ భారతంలో మరిన్ని ప్రత్యేకతలు, విశేషాలు, సామాజికాంశాలు, విలువలు, నైపుణ్యాలు తరువాతి అధ్యాయాల్లో విపులంగా చర్చించబడ్డాయి.

# అధ్యాయం – 2

# ఆంధ్ర మహాభారతం: ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాంశాలు

## 2.1. ఉపోద్ఘాతం

ఏ మనిషి జీవితం మీదనైనా ఆర్థికస్థితి, సాంస్కృతిక వాతావరణం, రాజకీయ వ్యవస్థ తమ ప్రభావాన్ని చూపిస్తాయి. సమాజం అంటే వ్యక్తుల కలయికే కదా. ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితలు స్థూలంగా సమాజం మీద, సూక్ష్మంగా వ్యక్తి మీద ప్రభావాన్ని చూపించి తీరతాయి. మహాభారత కాలం నాటి ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులు భారతంలోని పాత్రలన్నింటి మీద ప్రభావాన్ని చూపించాయి. ఆ ప్రభావం కొన్ని సందర్భాల్లో తక్కువగా ఉండచ్చు, మరికొన్ని సందర్భాల్లో ఎక్కువగా ఉండచ్చు. ఈ మూడు రకాల పరిస్థితులు వ్యక్తి జీవితాన్ని, సమాజ జీవితాన్ని కూడా శాసిస్తాయి. కాబట్టి ఆంధ్ర మహాభారతంలో సామజిక అంశాలు విశ్లేషించేటప్పుడు ఆనాటి ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ పరిస్థితులను కూడా పరిగణలోకి తీసుకోవలసి ఉంటుంది.

## 2.2. ఆంధ్ర మహాభారతం: ఆర్థికాంశాలు

మానవుడు వేటే వృత్తిగా కలిగిననాడు ప్రాథమిక అవసరం మాత్రమే తీరేది. కానీ, పరిణామ క్రమంలో సంచార జీవనం నుండి వ్యవసాయాధారిత జీవనానికి మారిన నాటి నుండి ఒక ప్రణాళికాబద్ధమైన జీవన విధానాన్ని అవలంబించడం నేర్చుకున్నాడు. పంట చేతికొచ్చినప్పుడే సంవత్సరానికి సరిపడా ఆహారాన్ని దాచుకోవడం ప్రారంభించాడు. మానవుని అవసరం ఆహారమైతే, మొదటి ఆస్తి పశు సంపద. ఇక రెండవ ఆస్తి భూమి, దాని నుండి ఉత్పత్తి కాబడిన పంట.

అర్థానికి సంబంధించింది ఆర్థికం. అర్థం అంటే ప్రయోజనం, కోరిక, పురుషార్థం, డబ్బు అనే అర్థాలున్నాయి. కానీ, ఆధునిక కాలంలో ఆర్థికం అనే దాన్ని ధన సంబంధమైనది అనే అర్థంలోనే ఎక్కువగా వాడుతున్నారు. 'ధన మూలం ఇదం జగత్' అన్నట్లే మనిషి జీవితం మీద, సమాజ జీవితం

మీద కూడా ధన ప్రభావం చాలా ఎక్కువ. అందువల్ల భారత కాలం నాటి ఆర్థిక పరిస్థితి, అందులోని పాత్రల కష్ట సుఖాలకి ప్రధాన కారణం అవుతుంది. మానవుని క్రమబద్ధమైన జీవనానికి సోపానంగా నిలిచిన సంపద/ ఆస్తి క్రమంగా మానవుల మధ్య తగాదాలకి దారి తీసింది. చరిత్రలో అందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. నిజానికి కురుక్షేత్ర సంగ్రామానికి దారి తీసింది, అన్నదమ్ముల మధ్య ఆస్తి విషయంలో ఏర్పడిన తగాదాలే కదా.

మహాభారత కాలం నాటికి గోవులు, గుర్రాలు, ఏనుగులు, ఒంటెలు మహారాజుల వద్ద ప్రధానమైన సంపదలుగా పరిగణించబడ్డాయి. విరాట మహారాజు గోవులను సుశర్మ, దుర్యోధనుడు అపహరించడం వల్లనే తర్వాత యుద్ధానికి రంగం సిద్ధమైంది. ఇదొక్కటే కాదు, మహాభారతంలో మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి. కాబట్టి, భారత కాలం నాటి ఆర్థిక వ్యవస్థని కవిత్రయ భారత సాహిత్యం ద్వారా పరిశీలిస్తే నాటి ఆర్థిక స్థితిగతులను తెలుసుకోవడమే కాదు. నాటి అర్థిక వ్యవస్థలోని విశేషాంశాల ద్వారా నేటి ఆర్థిక వ్యవస్థని సైతం బలోపేతం చేసుకోవచ్చు.

## 2.2.1. నారదుడి ఆర్థిక సూత్రాలు

నన్నయ రచించిన సభాపర్వంలో ధర్మరాజుకి పరిపాలనకి ఉపయోగపడేవిధంగా ఎన్నో సూత్రాలను, సూచనలు వివరించాడు. వాటిలో విద్య, వైద్య, ఆర్థిక, సాంస్కృతిక, రాజనీతి సంబంధితమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా నారదుడు బోధించిన ఆర్థిక సూత్రాలు నేటి తరం నాయకులకి సైతం ఉపయోగపడే విధంగా ఉన్నాయి.

క. ఉపధాశుద్ధులఁ బాప
  వ్యపగతబుద్ధుల వినీతివర్తుల సములన్
  సుపరీక్ష నియోగించితె
  నిపుణుల నర్థార్జనాదినృపకార్యములన్. *(ఆంధ్ర. సభా. 1: 36)*

'పన్నులు వసూలు చేయడం వంటి ధనార్జన రూపమైన రాచకార్యాలలో ధర్మపరీక్షలచే పరిశుద్ధులైన వాళ్లని, పాపరహితమైన చిత్తవృత్తి కలవాళ్లని, విశేషంగా నీతిమార్గంలో నడుచుకునేవాళ్లని, రాగద్వేషరహితమైన సమబుద్ధితో వ్యవహరించేవాళ్లని, నైపుణ్యం కలవాళ్లని చక్కగా నియమించావు కదా!'

పన్నులు వసూలు చేయడం లాంటి ధనార్జనరూపమైన రాచకార్యాలలో అవినీతిపరులు, లంచగొండులు, పక్షపాత బుద్ధి కలవారు నియమితులైతే ప్రభుత్వకోశానికి నష్టం వాటిల్లుతుంది. అది ప్రజల్లో ప్రభుత్వం పట్ల వ్యక్తిరేకతని సృష్టిస్తుంది. అందుకే, అటువంటి ఉద్యోగనియామకాల్లో ఎంతో జాగ్రత్త వహించాలని నారదుడు ధర్మరాజుకి సూచించాడు.

నారదుడు ధర్మరాజుకి కోశాగారం విషయంలో, ప్రభుత్వ కొలువుల విషయంలో సంక్షేమ పథకాల విషయంలో కూడా ఎన్నో సూచనలు చేశాడు.

'ఓ ధర్మరాజా! వ్యక్తుల ఉత్తమ మధ్యమాధమ యోగ్యతలను తెలుసుకొని వాళ్లను ఉత్తమ మధ్యమాధమ ఉద్యోగాల్లో నియమించావు కదా! సేవకులందరికీ కొరతలేకుండా తగుజీతాలు దయతో సకాలంలో అందజేస్తున్నావు కదా!

పుణ్యాత్ముడవైన ఓ ధర్మరాజా! నీ కొరకు యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలకు కూడుగుడ్డలు లోటు లేకుండా ఇచ్చి, వాళ్ల సంతోషం తగ్గకుండా పోషిస్తున్నావు కదా!

ఓ ధర్మరాజా! దానం పట్ల లోబుద్ధి కలవాళ్లని, దొంగల్ని, స్నేహానికి యోగ్యులు కానివాళ్లని, శత్రువుల పట్ల పక్షపాతం కలవాళ్లని, ధైర్యం చాలనివాళ్లని, దుర్మార్గులైన వాళ్లని రాజకార్యాలు నిర్వహించడానికి పంపడం లేదు కదా!

ధర్మరాజా! దొంగభయం లేకుండా నీవు రాజ్యాన్ని ఏలుతున్నావు కదా! నీ ప్రభుత్వోద్యోగుల్లో ముఖ్యులైనవాళ్లు ధనాశాపరులై ఆ దొంగల దగ్గర డబ్బు పుచ్చుకొని వాళ్లకు రక్షణ కల్పించడం లేదు కదా!

ఓ ధర్మరాజా! భుజబలంతో నీవు పరిపాలిస్తున్న ఈ భూమిలో అనావృష్టి భయం లేకుండా చెరువులు నిండి కనులపండువుగా ఉన్నాయి కదా!

ఓ ధర్మరాజా! ఉదారబుద్ధితో పేద రైతులకు ధాన్యపు విత్తనాలూ, వర్తకులకు నూటికి ఒక రూపాయి వడ్డీ వంతున అప్పులు ఇస్తున్నావు కదా!

కుంటివాళ్లను, మూగవాళ్లను, గ్రుడ్డివాళ్లను, అంగవిహీనులైన వాళ్లను, బంధువులు లేని వాళ్లను దయతో పోషిస్తున్నావు కదా! భయంతో దుఃఖిస్తూ శరణువేడిన పెద్దశత్రువునైనా యుద్ధభూమిలో కాపాడుతున్నావు కదా! *(ఆంధ్ర. సభా. 1: 37 – 45).*

వ్యక్తుల యోగ్యతని బట్టీ వారికి ఉద్యోగాలు ఇవ్వాలని నారదుడు ధర్మరాజుకి సూచించాడు. ఆ విషయంలో ఎటువంటి పక్షపాతధోరణికి పోవద్దని, బంధుత్వాలు, సిఫార్సులు పట్టించుకోవద్దని నారదుడు ధర్మరాజుని హెచ్చరించాడు. ఈ సూచన ఈ కాలానికి కూడా చక్కగా వర్తిస్తుంది.

యుద్ధంలో మరణించిన వీరసైనికుల కుటుంబాలను ఆదుకోవడం రాజధర్మం. దీన్ని బట్టే చూస్తే, నేడు భారతీయ సైనిక దళంలో పనిచేస్తున్న సైనికుల కుటుంబాలకి ఉన్న రాయితీలు, సంక్షేమ పథకాలు మహాభారత కాలంలో కూడా ఉన్నట్టు స్పష్టమౌతోంది.

ప్రభుత్వకొలువుల్లో ఉన్నవారు అత్యంత నిజాయితీపరులై ఉండాలని నారదుడు ఉద్ఘాటించాడు. లేకపోతే, ధనానికి ఆశపడి వారు ఆర్థిక నేరస్థులకు, మోసగాళ్లకు రక్షణ కల్పించే అవకాశం ఉంది. 'నవనాగరక యుగంలో – వ్యక్తుల జేబుల్ని, ఇండ్లను, బ్యాంకుల్నీ, బస్సుల్నీ, రైళ్లని దోచుకునే వాళ్లు మాత్రమే కాదు, 'స్మగ్లింగ్' చేసేవాళ్లు, 'బ్లాక్ మార్కెట్' చేసేవాళ్లు, పెక్కు విధాల పన్నులు ఎగవేసేవాళ్లు, అనేక కారణాలు చెప్పి చందాలు వసూలు చేసి దిగమ్రింగేవాళ్లు – వీళ్లంతా ఆర్థిక నేరస్థులే' *(ఆంధ్ర. సభా. 1. పుట: 20).*

వ్యవసాయం, వ్యాపారం ఏ కాలంలోనైనా మనుషుల ప్రధాన జీవనాధారాలు. నారదుడి మాటల బట్టీ మహాభారత కాలంలోనే అధికాహారోత్పత్తికి విత్తనాలు, అధికాభివృద్ధికి తక్కువ వడ్డీతో ఋణాలు ప్రభువులు ఇస్తున్నట్లు తెలుస్తోంది. వికలాంగులకు సంక్షేమ పథకాలు కూడా ఆ కాలంలో ఉన్నట్టుగా స్పష్టమౌతోంది.

సీ. ఆయంబునందు నాలవ భాగమొండె మూఁ ./ దవ భాగమొండె, నం దర్ధమొండె
గాని మిక్కిలి సేయఁగాదు వ్యయం బని / యవధరించితె బుద్ధి నవనినాథ!
యాయుధాగారధనాధ్యక్ష్యములయందు / వరవాజివారణావళులయందు
బండారములయందుఁ బరమవిశ్వాసుల / భక్తుల దక్షులఁ బంచితయ్య?
ఆ. గురుల వృద్ధశిల్పివరవణి గ్బాంధవ
జనుల నాశ్రితులను సాధుజనులఁ
గరుణఁ బేదటికము వొరయకుండఁగఁ బ్రోతె
సకలజనులు నిన్ను సంస్తుతింప. *(ఆంధ్ర. సభా. 1: 47)*

‘ధర్మరాజా! ఆదాయంలో నాల్గవ భాగాన్ని లేదా మూడవ భాగాన్ని లేదా సగభాగాన్ని మాత్రమే ఖర్చు చెయ్యాలి కానీ, అంతకుమించి చేయకూడదని గ్రహించావు కదా! ఆయుధశాలలు, ధనాగారాలు, అశ్వశాలలు, గజశాలలు, కోశాగారాలు – వీటి పాలనలో ఎంతో నమ్మదగిన వాళ్లను, నీపట్ల భక్తి గల వాళ్లను, సమర్థులైన వాళ్లను నియమించావు కదా! ప్రజలంతా నిన్ను ప్రశంసించేటట్లుగా గురువుల్ని, వృద్ధశిల్పుల్ని, గొప్ప వ్యాపారుల్ని, బంధువుల్ని, ఆశ్రితుల్ని, సజ్జనుల్ని పేదరికం రాకుండా దయతో పోషిస్తున్నావు కదా!’

మహాభారత కాలం నాటి ఆర్థిక విధివిధానాలను చక్కగా వివరించిన పద్యం ఇది. కోశాగారంలో ఉన్న సంపదలో నాల్గవ భాగాన్ని లేదా మూడవ భాగాన్ని, తప్పనిసరి అయితే సగభాగాన్ని మాత్రమే రాజు ఖర్చు చేయాలి. ఆయుధ, ధన, అశ్వ, గజ, కోశాగారాలు అన్నింటిలో రాజుకి అత్యంత ఆప్తులు, నిజాయితీపరులు, సమర్థులు మాత్రమే పర్యవేక్షించాలి. లేకపోతే అది ఎన్నో సమస్యలని తెచ్చిపెడుతుంది. మొత్తంగా రాజు/ నాయకుడు, తన ఆర్థిక విధి విధానాల ద్వారా, సంక్షేమ పథకాల ద్వారా అత్యంత జనరంజకంగా తన పాలనని కొనసాగించాలి. నారదుడు చేసిన సూచనలు తరతరాలకి ఎంతగానో ఉపయోగపడే ప్రామాణికమైన సూత్రాలుగా కనిపిస్తాయి.

చ. బహుధనధాన్యసంగ్రహము బాణశరాసనయోధవీరసం
గ్రహము నిరంతరాంతరుదకంబులు ఘాసరసేంధనౌఘ సం
గ్రహము ననేకయంత్రములుఁ గల్గి యసాధ్యములై ద్విషద్భయా
వహు లగుచుండ నొప్పునె భవత్పరిరక్ష్యములైన దుర్గముల్. *(ఆంధ్ర. సభా. 1: 53)*

‘ఓ ధర్మరాజా! నీ రక్షణలో నున్న కోటలన్నీ – ఎక్కువగా ధనధాన్యాల్ని, ధనుర్బాణాలని, యుద్ధవీరులని, ఎప్పుడూ తరగని నీళ్లని, పశువుల గడ్డిని, ఉప్పు, పులుపు, కారం వంటి ఆహార పదార్థాలని, వివిధ పానీయాలని, వంట కట్టెలని సమృద్ధిగా కలిగి అనేక యంత్ర సాధనాలతో కూడి దుర్భేద్యాలై శత్రుభయంకరాలై ఒప్పుతున్నాయి కదా!’

రాజ్యానికి ఎప్పుడైనా ఆత్యయిక పరిస్థితి వస్తే ఏం చేయాలో నారదుడు ధర్మరాజుకి వివరించాడు. ఆదాయంలో అత్యధికంగా సగభాగం కంటే వెచ్చించవద్దని నారదుడు చెప్పడంలో ఆంతర్యం ఇదే. రాజ్యం అన్నాక అనుకోని కష్టాలు వస్తాయి. ఏవైనా ప్రకృతి విపత్తులు రావచ్చు, శత్రు రాజ్యాలు దండెత్తవచ్చు. ఎటువంటి ప్రమాదం వచ్చినా సాధారణ జీవనానికి అవసరమైన

ధనధాన్యాలు ఎప్పుడూ రాజు ఏర్పాటు చేసుకోవాలి. విపత్తులను ఎదుర్కొనేందుకు అన్నిరకాలుగా సిద్ధంగా ఉండాలి. ప్రజలని ఆదుకోవడానికి తగిన ఆహార పదార్థాలు నిల్వ ఉండేలా రాజు ఏర్పాటు చేసుకోవాలి. ఆదాయంలో కొంత భాగం ఈ విపత్తులను ముందే ఊహించి, వాటి నిమిత్తం పొదుపు చేసుకోవాలి.

## 2.2.2. రాజసూయయాగం – ఆర్థిక విశేషాలు

ధర్మరాజు నారదమహర్షి ప్రబోధంతో రాజసూయయాగం చేయాలని సంకల్పిస్తాడు. నన్నయ రచించిన సభా పర్వంలో ఈ ఘట్టం అత్యంత రమణీయంగా వర్ణింపబడింది. రాజసూయయాగ నిర్వహణలో భాగంగా పాండవులు పాటించిన ఎన్నో ఆర్థికపరమైన పద్ధతులను, సూక్ష్మాలను నన్నయ స్పృశించారు.

ధర్మరాజు రాజసూయయాగం చేసే నిమిత్తం భీమార్జుననకులసహదేవులను వరుసగా తూర్పు, ఉత్తరం, పశ్చిమం, దక్షిణం ఇలా నాలుగు దిక్కులనీ జయించి రమ్మని పంపించాడు.

అర్జునుడు అనితరసాధ్యమైన పరాక్రమంతో ఉత్తర దిక్కుని జయించాడు. తనతో పోరాటం చేసి ఓడిపోయిన రాజులవద్ద కప్పం వసూలు చేసి, వారిని రాజసూయయాగానికి ఆహ్వానించాడు. ఉత్తర దిక్కున అర్జునుడు దిగ్విజయంగా పోరాటం చేసి ఆ ప్రాంత రాజులవద్ద రాజసూయయాగం నిమిత్తం అమూల్యాలు, అసంఖ్యాలు అయిన రత్నాభరణాలను తెచ్చాడు.
ఉత్సాహము.

అతులశౌర్యుఁ డనిలతనయుఁ డమిత వాహినీ పదా
హతి ధరిత్రి దలర నిట్టు లరిగి పూర్వ దిఙ్మహీ
పతులచేత రత్నరజత భర్మతతులఁ గొనియె భూ
నుతయశుండు వేఱు వేఱ నూఱు కోట్ల సంఖ్యలన్. *(ఆంధ్ర. సభా. 1: 245)*

'సాటిలేని పరాక్రమశాలి, లోకం కొనియాడిన కీర్తిమంతుడు అయిన వాయుపుత్రుడు భీముడు, అపారసైన్యపాదఘట్టనతో భూమి అదిరేటట్లు దండయాత్ర చేసి, తూర్పు దిక్కులోని రాజులచేత వేర్వేరుగా వంద కోట్ల రత్నరజతకాంచన రాసులను కప్పంగా తీసుకున్నాడు'.

శత్రుజనభయంకరుడైన నకులుడు పశ్చిమ దిక్కుని అప్రతిహితంగా జయించాడు. ఆ దిక్కున ఉన్న రాజుల వద్ద అనేక వస్తు, వాహనాలను గ్రహించాడు. ఈ క్రమంలో సాధించిన ధన్నాన్నంతా పదివేల ఒంటెల చేత మోయించుకుని అంతులేని సైన్య పాదఘట్టనతో భూతలం దద్దరిల్లేటట్లు వచ్చాడు.

దేవసమానుడైన సహదేవునికి ఎంతో ప్రీతితో దక్షిణ దిక్కులో ఉన్న రాజులు గుర్రాలని, మదపుటేనుగులని, మంచి వస్త్రాలని, నానావిధరత్నాభరణాలని, గంధపు చెక్కలని, అగరు కొయ్యలని తెచ్చి ఇచ్చారు.

ధర్మరాజు నలుగురు తమ్ముళ్లు ఈ విధంగా నలుదిక్కులా తమ జైత్రయాత్రని ముగించుకుని, అనేక విధాలైన రత్నాలతో, ధనంతో, వస్తువాహనాలతో తిరిగి వచ్చారు.

పాండవులు రాజసూయయాగం నిమిత్తం చేసిన జైత్రయాత్ర చూస్తే ఎన్నో ఆర్థికమైన విశేషాలు అర్థమౌతాయి. మహాభారత కాలం నాటి ఆర్థిక పద్ధతులు ఈ ఘట్టంలో వివరించబడ్డాయి. రాజసూయయాగ నిర్వహణ అసాధారణమైన విషయం. ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. ఒక సామ్రాజ్యపు ఏలుబడికి సూచకం రాజసూయయాగం. రాజులు ధర్మారాజు ఏలుబడిని అంగీకరించి కప్పమైనా చెల్లించాలి (ధన, కనక, రత్న, వస్తు, వాహన రూపేణా), లేదా ధర్మరాజు సోదరులైన భీమార్జుననకుల సహదేవులను యుద్ధంలో ఓడించాలి. రెండవది అసాధ్యమని తేలిపోయింది. అందుకే, రాజులంతా ఏదో ఒక రూపంలో ధర్మరాజుకి తమ మద్దతుని తెలియజేశారు.

క్షత్రియ ధర్మాన్ని అనుసరించి ఆర్జించి, రక్షించి, లెస్సగా వృద్ధి చెందిన మహాధనసమూహాన్నంతా చూసి, తగిన రీతిగా దాని వినియోగాన్ని ఆజ్ఞాపించడానికి పూనుకొని, రాజసూయయాగ ప్రారంభాన్ని గురించి గట్టిగా ఆలోచిస్తున్న ధర్మరాజు అభిప్రాయానికి తగినట్లు అతని ఆప్తమంత్రులు ఈ విధంగా అన్నారు.

సీ. కురువీర నీ ధర్మపరిపాలనంబున !/ నీ గుణసంపద నీ విశుద్ధ
చారిత్రమునఁ జేసి ధారుణి ప్రజ కెల్ల / నభివృద్ధియయ్యె నెయ్యంబుతోడ;
రాజవంచకులయు రాజవల్లభులయుఁ / దస్కరులయు బాధ దఱిఁగె; రుజయుఁ
బగయును భయమును వగయును వెఱపును / నాదిగాఁ గల యెగ్గు లడఁగెఁ బుడమి;

ఆ. నర్థు లోలిఁ బెరిఁగె; నవనీశులెల్ల నీ

యనుజవీర్యవిజితు లయి త్వదీయ

శాసనస్థు లయిరి జగతీశ యిదియ నీ !

యజ్ఞ కార్యమునకు నవసరంబు. *(ఆంధ్ర. సభా. 1: 272)*

వ. 'మఱియు నపరిమిత పరార్ఘ్యరత్న రజత సువర్ణ పరిపూర్ణంబయి మహామేరుశైలంబు సన్నిహితంబైన యట్లు యక్షేశ్వరు నక్షయనిధులు ప్రత్యక్షంబైన యట్లు భాండాగారంబు సమృద్ధంబైన యది; ఘృతలవణతైల తండుల ధాన్యాది సమస్త వస్తు విస్తృతంబయి కోష్ఠాగారంబు సకల సంకల్ప సిద్ధి కరంబై కల్పద్రుమంబు ననుకరించుచున్న యది; వేదంబు లన్నియు మూర్తిమంతంబులయిన యట్లు మహాయాజ్ఞికు లయిన మహీసురవరులు నీ యభ్యుదయంబు గోరుచున్నవారు గావున రాజసూయాధ్వరం బెడసేయక చేయు'మని పలుకుచున్న యవసరంబున. *(ఆంధ్ర. సభా. 1: 273)*

'కురువంశ వీరుడివైన ఓ ధర్మరాజా! నీ ధర్మపరిపాలనచేత, నీ సుగుణసంపద చేత, నీ నిష్కళంక ప్రవర్తన చేత ఈ భూమి మీద ప్రజలందరికీ ప్రియమార అభివృద్ధి కలిగింది. రాజును మోసం చేసే వారి వల్ల, దొంగల వల్ల బాధ తగ్గిపోయింది. రోగం, పగ, దుఃఖం మొదలైన కష్టాలు తొలగిపోయాయి. వెలలు క్రమంగా పెరిగాయి. పరాక్రమంలో నీ తమ్ములు రాజులందరినీ జయించారు. అందరు రాజులు నీ ఆజ్ఞకి లోబడి ఉన్నారు. నీవు రాజసూయం చేయడానికి ఇదే తగిన సమయం.

అపరిమితమైన శ్రేష్ఠత, విలువ ఉన్న రత్నాలతో, వెండితో, బంగారంతో, మహామేరుపర్వతం సమీపించినట్లు, కుబేరుని అక్షయ నిధులు ప్రత్యక్షమైనట్లు ధనాగారం పూర్తిగా నిండుగా ఉంది. వస్తువుల్ని నిలువ ఉంచే గృహం నెయ్యి, ఉప్పు, నూనె, బియ్యం, పప్పులు మొదలైన సమస్త వస్తువులతో నిండి అన్ని కోర్కెలను తీర్చే కల్పవృక్షంలా ఉంది'.

ధర్మరాజు పరిపాలనలో పాటించిన ఆర్థిక విధివిధానాల వల్ల, సంక్షేమ పథకాల వల్ల ప్రజలందరికీ అభివృద్ధి కలిగింది. మోసం, దొంగతనం, రోగం, దుఃఖం, పగ, భయం పూర్తిగా నశించాయి. వెలలు క్రమంగా పెరిగాయి. అంటే ధర్మరాజు పాటించిన ఆర్థిక విధానాల వల్ల వస్తువులకి తగిన గిట్టుబాటు ధర లభించింది. వర్తకులంతా లాభాల బాట పట్టారు. రైతులు, వ్యవసాయం మీద ఆధారపడిన ప్రజలకు సరుకుకి తగిన వెల లభించింది.

పాండవులు రాజసూయయాగం నిమిత్తం లెక్కించడానికి అసాధ్యమైన ధనరాసులను సమకూర్చారు. అది వారు అనుభవించడానికి కాదు. రాజసూయయాగ నియమం/ సంప్రదాయం ప్రకారం సమకూర్చిన ధనాన్ని మొత్తం అర్హులైనవారికి దానం చేయాలి.

'పరాక్రమార్జితమైన సంపదను యజ్ఞం చేసి ప్రభువు యోగ్యులకు పంచిపెట్టడం భారతీయ సంప్రదాయం. దానంతోనే ధనం రాణిస్తుందని భారతీయ భావన. అర్థం ధర్మబద్ధం కాకపోతే, పురుషప్రయత్నం దైవానుకూల్యాన్ని పొందకపోతే వ్యర్థాలౌతాయి' *(ఆంధ్ర. సభా. 1. పుట: 116).*

## 2.2.3. మాయాద్యూతం: ఆర్థిక విశేషాలు

ధర్మరాజుని దెబ్బతీయడానికి దుర్యోధనుడు, శకుని పన్నిన వ్యూహంలో అతడు చిక్కుకున్నాడు. శకునితో మయద్యూతంలో పాల్గొని ఎంతో నష్టపోయాడు. ఈ సందర్భంలో ధర్మరాజు కోల్పోయిన సంపదలను, జూదంలో పందెంగా పెట్టిన వస్తువులను, ఆస్తులను గమనిస్తే ఆనాటి ఆర్థిక వ్యవస్థపై ఒక అవగాహనకి రావచ్చు. మహాభారత కాలంలో డబ్బుని ఏ రూపంలో కొలిచేవారు? కేవలం ధనం రూపంలోనే కాకుండా వేటిని ఆస్తులుగా భావించేవారు? ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరుకుతాయి.

వ. ఇట్లు యుధిష్ఠిరుండు బద్ధమత్సరుండయి పెఱిఁగి యొండొండ యొడ్డుచు నిష్కసహస్రభరితానేకాయుత కుండమండితంబు లయిన సువర్ణభాండాగారంబులును, వజ్రవైదూర్యమరకతమౌక్తికనీలప్రవాళ పద్మరాగాది వివిధ శుద్ధ విపుల రత్న పరిపూర్ణంబు లైన రత్నభాండాగారంబులుం, బ్రత్యేకంబ పంచద్రోణ కాంచన సంచితంబు లయిన చతుశ్శతనిధులును, మణికింకిణీ జాలాలంకృతంబు లయిన యసంఖ్యాత హయ యూథంబులును, జాతరూప వరూథంబులుం గనక కక్ష్యాకుథ సనాథంబు లయిన మదాంధ గంధ సింధుర సందోహంబులుం, బరార్థ్య రత్న భూషణ భూషితంబు లయిన యోషిత్సహస్రంబులును, ననుదినాతిథి జన భోజనపాత్రహస్తులయిన శతసహస్రపరిచారకులును, నర్జునునకుఁ జిత్రరథుం డిచ్చిన గంధర్వ హయంబులం దొట్టి దుగ్ధపానశాలి తండుల ఖాదనంబులం బెరుఁగుచున్న జాత్యశ్వానేకాయుతంబులు, నజావి గో మహిష ఖర రాసభ నివహంబులు నొక్కొక్క యొడ్డునన

యొడ్డి యోటుపడినం జూచి విదురుండు ధృతరాష్ట్రునకు రహస్యంబున ని ట్లనియె. *(ఆంధ్ర. సభా. 2: 177).*

‘ఈ విధంగా ధర్మరాజు క్రోధంతో పెచ్చుపెరిగి ఒకదాని వెంట ఒకటి ఒడ్డుతూ – వేల కొలది వరహాలతో నిండి పదివేల సంఖ్యలు గల పెక్కు కుండలతో ఒప్పుతున్న బంగారు భాండాగారాలను, వజ్ర వైదూర్యమరకతాది పలువిధ స్వచ్ఛ విస్తార రత్నాలతో నిండిన రత్న భాండాగారాలను, ప్రత్యేకంగా ఐదు తూముల బంగారంతో కూడుకున్న నాలుగువందల నిధులను, మణుల సమూహాలతో, చిరుగజ్జెల సమూహాలతో అలంకరించబడిన లెక్కలేనన్ని గుర్రాల సమూహాలను, బంగారు కవచాలతో, నడుముకు కట్టే బంగారు మోకులతో, మీద పరిచే బంగారు చిత్రకంబళాలతో కూడుకున్న మదపుటేనుగుల సమూహాలను, శ్రేష్ఠమైన రత్నాల సొమ్ములతో అలంకరించబడిన వేలకొలది స్త్రీలను, ప్రతిదినం అతిథిజనుల భోజన పాత్రలను హస్తాల్లో ధరించిన నూరువేలమంది సేవకులను, అర్జునుడికి గంధర్వరాజు బహూకరించిన గంధర్వాశ్వాలను మొదలుకొని పాలు త్రాగడం చేత, వరిబియ్యం తినడం చేత పెరుగుతున్న పెక్కు పదివేల సంఖ్యల మేలు జాతి గుర్రాలను, మేకల, గుర్రాల, గోవుల, గేదెల, గాడిదల, కంచరగాడిదల సమూహాలను ఒక్కొక్క ఒడ్డున ఒడ్డి ఓడిపోవడం చూసి విదురుడు ధృతరాష్ట్రునితో రహస్యంగా ఇలా అన్నాడు’.

మహాభారత కాలం నాటికి, బంగారాన్ని తూములలో కొలిచేవారు. ధర్మరాజు ఐదు తూముల బంగారాన్ని జూదంలో కోల్పోయాడు. వరహాల ప్రస్తావన కూడా ఇక్కడ కనిపిస్తుంది. ధర్మరాజు వేలసంఖ్యలో వరహాలను పందెంలో పెట్టాడు. వజ్రవైదూర్యమరకతాది నవరత్నాలు ఆ కాలంలో ప్రధానమైన సంపదలుగా ఉండేవి. ధర్మరాజు వేలసంఖ్యలో సేవకులను సైతం పందెంలో ఓడిపోయాడు. గుర్రాలు, గోవులు, ఏనుగులు, మేకలు, గేదెలు, గాడిదలు, కంచర గాడిదలు సైతం ఆస్తులుగా భావించబడేవి. వాటిని వేల సంఖ్యలో మహారాజులు కలిగి ఉండేవారు. ముఖ్యంగా ఏనుగులు, గుర్రాలు యుద్ధంలో ఉపయోగపడేవి. ఒంటెలు రవాణా విషయంలో ఉపయోగపడేవి. రాజసూయయాగంలో భాగంగా దక్షిణ దిక్కున జైత్రయాత్ర చేయడానికి వచ్చిన సహదేవుడు అక్కడి మహారాజులు ఇచ్చిన సంపదని పదివేల ఒంటెలపై వేసుకుని తిరిగి వచ్చాడు. గోవులు, గేదెలు, మేకలు మొదలైన జంతువులు పాడి నిమిత్తం ఉపయోగపడేవి. ఆ కాలంలో పాలు, పాల పదార్థాలు ప్రధానమైన జీవనాధారంగా ఉండేవి. వాటి క్రయవిక్రయాల ద్వారా వర్తకులు సంపదని గడించేవారు.

ధర్మరాజు జూదంలో ఒడ్డిన ఆస్తులు లెక్కింపశక్యం కానివి అని వర్ణించడాన్ని బట్టీ అతడు ఎంతటి సంపన్నుడో అర్థం చేసుకోవచ్చు.

### 2.2.4. నలదమయంతుల కథ: ఆర్థిక విశేషాలు

నన్నయ రచించిన ఆరణ్యపర్వ భాగంలో వచ్చే నలదమయంతుల కథలో నలుడి కాలంలో చలామణి అయిన కొన్ని నాణాల ప్రస్తావన కనపడుతుంది. వీటి ప్రస్తావన ద్వారా ధర్మరాజు కాలానికీ, నలమహారాజు కాలానికీ ఆర్థికంగా ఉన్న వ్యత్యాసాలను గమనించవచ్చు. నలుడు పుష్కరుడితో ఆడిన జూదం వల్ల, కలి ప్రభావం తనపై ఉండడం వల్ల జూదంలో సర్వం కోల్పోయి, దమయంతితో సహా అడవుల పాలయ్యాడు. నలుడు దమయంతి క్షేమం కోరి ఆమెని తండ్రి వద్దకి వెళ్లిపోమని చెప్పి, తాను వెళ్లిపోయాడు. తండ్రి వద్దకి చేరుకున్న దమయంతి విదర్భరాజైన భీమరాజు (దమయంతి తండ్రి) చేత చాటింపు వేయించింది.

వ. మఱియు నలదమయంతు లున్నచో టెఱింగి వచ్చిన వారికి వెయ్యేసి గద్యాణంబు లిత్తు ననియు, వారలం దోడ్కొని వచ్చినవారికి గోసహస్రంబులు నగ్రహారంబులు నిత్తు ననియుఁ బలికి పంచిన. *(ఆంధ్ర. ఆరణ్య. 2: 140).*

'విదర్భరాజు బ్రాహ్మణులకు చెప్పిన మాటలు : 1. నలదమయంతులు ఉన్నచోటు తెలుసుకొని వచ్చిన వారికి ఒక్కొకరికి వేయి గద్యాణాలు పారితోషికంగా ఇవ్వబడతాయి.
2. నలదమయంతులను తమతోపాటు వెంటబెట్టుకుని వచ్చినవారికి వేలకొలది గోవులు, అగ్రహారాలు బహుమానాలుగా ఇవ్వబడతాయి'.

విదర్భరాజు నలుడి ఆచూకీ తెలుసుకునేందుకు వేయించిన చాటింపు ఆధారంగా ఆనాటి కాలంలో ఉన్న ఆర్థిక విశేషాలను తెలుసుకోవచ్చు. గద్యాణం నలదమయంతుల కాలంలో చలామణిలో లేకపోయినా, నన్నయ కాలంలో పాఠకులకి అర్థమయ్యే విధంగా నన్నయ వాటిని ప్రస్తావించి ఉండవచ్చు. ఇక అగ్రహారాలను బ్రాహ్మణులకు దానం చేసే సంప్రదాయం నలుడి కాలంలో సైతం ఉన్నట్టు ఈ చాటింపు బట్టీ స్పష్టమౌతోంది.

'గద్యాణం తెలుగుదేశంలో అంటే వేంగీ విషయంలో చాళుక్యుల కాలంలో చలామణిలో ఉన్న బంగారు నాణెం. గద్యాణ ప్రసక్తి సంస్కృత మూలభారతంలో లేదు. నన్నయభట్టు సమకాలీనమైన

నాణెమును పేర్కొనడం సహజమే. కానీ, గద్యాణాలు వ్యాసుడి కాలంలో గాని, నలదమయంతుల కాలంలో కాని ఉన్నట్టివి కావు.

అగ్రహారం అనే శబ్దం చాళుక్యుల కాలంలో విశేష ప్రాచుర్యం పొందింది. అగ్రహారం అంటే వేదవేదాంగపారంగతులైన బ్రాహ్మణులకు రాజుగారు సమర్పించే బహుమానగ్రామం. చాళుక్యులు బ్రాహ్మణులకు అగ్రహారాలను సర్వకర పరిహారంగా అంటే పన్నులు అన్నీ తీసివేసి దానం చేసేవారు. నన్నయకి ఆంధ్ర మహాభారత రచనలో సహకరించిన నారాయణభట్టుకి నందంపూడి గ్రామాన్ని అగ్రహారంగా చేసి 4/11/1054 తేదీన రాజరాజనరేంద్రుడు దానం చేశాడు. అగ్రహార ప్రసక్తి మూల సంస్కృత మహాభారతంలో లేదు' *(ఆంధ్ర. ఆరణ్య. 2. పుట: 225).*

## 2.2.5. ఉత్తరాభిమన్యుల వివాహం: ఆర్థిక విశేషాలు

తిక్కన రచించిన విరాట పర్వంలో యుద్ధానంతరం జరిగిన ఉత్తరాభిమన్యుల వివాహం అత్యంత రమణీయంగా వర్ణించబడింది. ఆ వివాహ వర్ణనలో భాగంగా కొన్ని ఆర్థిక విశేషాలు ప్రస్తావనకి వచ్చాయి. అవి మహాభారత కాలం నాటి వివాహ సంప్రదాయాలలో ఒక భాగంగా కనిపిస్తాయి.

వ. ఇవ్విధంబున వివాహంబు నిర్వహించి మత్స్యమహీనాథుండు మణిభూషణంబులు రుచిరాంబరంబులుఁ గర్పూరాది సుగంధ ద్రవ్యంబులుఁ దాంబూలంబుల తోడి పళ్లెరంబులఁ బచరించి పాండవులకు వాసుదేవ పూర్వకంబుగాఁ గట్టనిచ్చి, పురోహిత ప్రకరంబునకు నిప్పించి, యాజ్ఞసేనీ సుభద్రలకు సనురూపాభరణ పరిధానంబు లంతఃపురవర్తు లైన యర్హ జనంబులచేతం బుచ్చి, సౌభద్రునకు భద్రసామజసప్తశతియును, లోకోత్తర తురంగ దశ సహస్రంబును, సలక్షణ గోపంచలక్షయు, రథంబులు రెండు వేలును, దాసదాసీ జనంబు లక్షయు, మఱియు నానా ప్రకారంబు లగు ధనంబులు నరణం బిచ్చె; *(ఆంధ్ర. విరాట. 5: 403).*

'విరాటరాజు ఈరీతిగా ఉత్తరాభిమన్యుల వివాహం నిర్వహించాడు. మణిభూషణాలు, మంచి వస్త్రాలు, కర్పూరం మొదలైన పరిమళ ద్రవ్యాలు, తాంబూలాలు పెట్టిన పళ్లెంలో పెట్టి ముందుగా శ్రీకృష్ణుడికి ఇచ్చి, తరువాత పాండవులకిచ్చాడు. పురోహితులందరికీ ఇచ్చాడు. ద్రౌపదికి, సుభద్రకి తగిన ఆభరణాలు, వస్త్రాలు అంతఃపుర జనులచేత ఇప్పించాడు. ఇక అభిమన్యుడికి భద్రగజాలు ఏడు

వందలు, జాతిగుర్రాలు పదివేలు, సలక్షణమైన గోవులు అయిదు లక్షలు, రథాలు రెండువేలు, దాసదాసీ జనం లక్ష – ఇవిగాక ఇంకా రకరకాల ధనాలు అరణంగా ఇచ్చాడు'.

మహాభారత కాలం నాటి వివాహ సంస్కృతిలో అరణం ఇచ్చే వస్తువులని, పద్ధతిని ఇక్కడ గమనించవచ్చు. ఆ కాలంలో మగపెళ్లివారి తరపున ఆడపడుచులకి ఎన్నో మర్యాదలు చేసేవారని స్పష్టమౌతోంది. ప్రత్యేకించి అభిమన్యుడికి ఇచ్చిన అరణాన్ని గమనిస్తే, రత్నాలు, బంగారం, వజ్ర, వైదూర్యాలను ప్రధానంగా ప్రస్తావించకపోవడం గమనిస్తే, ఆనాటి క్షత్రియ వంశాల్లో ప్రధాన ఆస్తులు, ధనాలు గోవులు, ఏనుగులు, మేలుజాతి గుర్రాలు, రథాలు అని స్పష్టమౌతోంది. రథాలు, ఏనుగులు, గుర్రాలు రాజులకి యుద్ధాల్లో ఉపయోగపడతాయి. ఇక గోసంపద ఆ కాలంలో ఎంతో ఉన్నతమైనది. పాలు, పాల ఉత్పత్తులని ఆధారంగా చేసుకొని ఎన్నో క్రయవిక్రయాలు జరిగేవి.

## 2.3. ఆంధ్ర మహాభారతం: రాజకీయాంశాలు

రజో గుణం నుండి పుట్టిందే రాజకీయం. పంతాలు, పట్టింపులు, క్రియలు, ప్రతి క్రియలు, రాగ ద్వేషాలు, ఉత్థాన పతనాలు అన్నీ రాజకీయం కిందికే వస్తాయి. వ్యక్తి ఒక్కడుగా జీవిస్తే తన జీవిత సామ్రాజ్యానికి తానే మహారాజు. కానీ, మానవుడు సంఘ జీవి కదా. కొన్ని లక్షల కోట్ల మంది మానవులు కలిసి జీవిస్తున్నప్పుడు రాజ్యం, రాజు, పరిపాలన, చట్టాలు, దండనలు, యుద్ధాలు అన్నీ ఉంటాయి. అందుకే, మన ప్రాచీన శాస్త్రవేత్తలు 'నీతి వేరు; రాజనీతి వేరు' అన్నారు. ఉదాహరణకి, వ్యక్తిగత జీవితంలో క్షమాగుణం చాలా గొప్పది. క్షమా గుణం ఎంత ఉంటే మనిషి అంత ప్రశాంతంగా ఉంటాడు. కానీ, రాజ్యం విషయంలో క్షమాగుణానికి పరిమితులు విధించుకోక తప్పదు. ఒక పరిమితి దాటితే రాజు క్షమాగుణం ఆయనకి కీర్తిని తెచ్చిపెట్టచ్చు కానీ, రాజ్యాన్ని నాశనం చేసేస్తుంది. ధర్మరాజు క్షమాగుణం కొన్ని సందర్భాల్లో పరిమితులు దాటి పాండవులకి లేని పోని కష్టాలు తీసుకువచ్చింది. అదే క్షమాగుణం యుద్ధంలో కూడా చాలా చిక్కులు తెచ్చిపెట్టింది. ఇది అప్పటికీ, ఇప్పటికీ పాలకులకి ఒక గుణపాఠం. అందుచేత, భారత కాలం నాటి సామాజికాంశాల పరిశీలనలో రాజకీయ పరిస్థితులని పరిగణలోకి తీసుకోవలసి ఉంటుంది.

## 2.3.1. లాక్షాగృహదహనం

కుమారాస్త్రవిద్యాప్రదర్శనలో పాండవుల పరాక్రమం చూసి ప్రజలంతా జేజేలు పలికారు. దుర్యోధనుడికి తాను పాండవులను యుద్ధరంగంలో గెలవలేడని అర్థమయ్యింది. అందుకే, వారిని హస్తినాపురం నుండి తప్పించేందుకు ఎన్నో కుయుక్తులు పన్నాడు. నేరుగా పాండవులను ఎదుర్కొనే దమ్ము లేక, ఆఖరికి వారిని రహస్యంగా చంపించడానికి సైతం సిద్ధపడ్డాడు. వంశపారంపర్యంగా తాతతండ్రుల నుండి వచ్చే రాజ్యసంపదను ఇదివరకు పాండురాజు చేపట్టి ఉండడం చేత ఇప్పుడు ధర్మరాజు చేపడితే, తరువాత అతని తనయుడు చేపడతాడు. ఈ విధంగా పాండురాజు వంశం వాళ్లే రాజ్యార్హులౌతారు. కౌరవులు రాజ్యాధికారానికి దూరమైతే వారి కొడుకులు, మనుమలు కూడా దూరమౌతారు. ఇదంతా మనస్సులో ఊహించుకుని దుర్యోధనుడు పాండవులను నాశనం చేయడానికి పూనుకున్నాడు.

పాండురాజు జనరంజకమైన పాలన చేసి ఉండడం వల్ల ప్రజలు పాండురాజు తర్వాత ధర్మరాజు రాజవ్వాలని సహజంగా ఆశిస్తారు. అందుకే, పాండవులని కొంత కాలం వారణావతానికి పంపిస్తే, ఇక్కడ తాను దానధర్మాలు చేసి ప్రజల మనస్సుని గెలుచుకుంటానని దుర్యోధనుడు ధృతరాష్ట్రుడికి నచ్చజెప్పాడు. ఆశ్చర్యకరంగా ధృతరాష్ట్రుడి మనస్సులో కూడా పాండవులని ఎలాగైనా తప్పించాలని ఉంది. కానీ, సరైన సాకు దొరకక ఊరుకున్నాడు. పైగా కురువంశపితామహుడైన భీష్ముడు మొదలైన పెద్దలు ఏమంటారో అని భయపడ్డాడు. ధృతరాష్ట్రుడి మనస్సులో ఈ విషయమై ఉన్న భయాన్ని పోగొట్టేందుకు దుర్యోధనుడు ఒక పన్నాగం పన్నాడు.

వ. 'భవదనుజ్ఞాగౌరవంబున గాంగేయాదులు దీనికి నొడంబడుదురు; వారు కౌరవులకెల్ల సము లై యుండియు నావారల; యెట్లనిన; నశ్వత్థామ నా కిష్టుం డగుట నన్నుఁ బాయకుండు; పుత్త్రస్నేహంబున ద్రోణుండును భారద్వాజుని భాగినేయునిం బాయనేరమింజేసి కృపాచార్యుండును నాయొద్దన యుందురు; మఱి భీష్ముండు మధ్యస్థుం డగుటఁ బాండవులం బరిగ్రహింపఁడు; విదురుండు పాండవపక్షపాతి యయ్యును నొక్కరుండు నా కహితంబు సేయనోపండు; గావున నిక్కార్యంబున దోషంబు లేదు; వినిద్రకరణం బయిన నాహృదయశల్యంబు బాచి న న్నుద్ధరింపు' మని ధృతరాష్ట్రు నెట్టకేలకు నొడంబఱిచి దుర్యోధనుం డప్పుడు. *(ఆంధ్ర. ఆది. 6: 131).*

‘మీ ఆజ్ఞ మీది గౌరవం చేత భీష్ముడు, ద్రోణుడు మొదలైనవాళ్లు దీనికి ఒప్పుకుంటారు. వాళ్లు కురుపాండవుల పట్ల సమభావం కలవాళ్లే అయినా నా వాళ్లే. ఎట్లనగా: అశ్వత్థామ నాకు ఇష్టమైనవాడు. అందుచేత నన్ను వదిలిపోడు. కొడుకు మీది ప్రేమచేత ద్రోణుడు, చెల్లెలి భర్త అయిన ద్రోణుడిని వదలలేక కృపుడు నావైపే ఉంటారు. భీష్ముడు మధ్యస్థుడు, కనుక పాండవుల వైపు వెళ్లడు. విదురుడు పాండవపక్షపాతియే. కానీ, అతడొక్కడు నాకు కీడు చేయలేడు. అందుచేత ఈ కార్యక్రమంలో ఏ లోపం లేదు. నాకు నిద్రలేకుండా చేసే ఈ గుండెలోని ముల్లును తొలగించి, నన్ను జీవితంలో పైకి తీసుకొని రమ్ము’ – అని చిట్టచివరకు ధృతరాష్ట్రుడిని ఒప్పించాడు దుర్యోధనుడు.

దుర్యోధనుడి కుయుక్తి ఇంతటితో ఆగలేదు. మహాభారతం ఆసాంతం దుర్యోధనుడి కుయుక్తులు, దుష్ట రాజకీయం కనపడుతూనే ఉంటాయి. అశ్వత్థామని తాను అభిమానించడం ద్వారా తనవైపు తిప్పుకున్న దుర్యోధనుడు, అతడి ద్వారా ద్రోణుడినీ, కృపుడునీ తనవైపు తిప్పుకోవడం అతడి కుయుక్తికి ఒక ఉదాహరణ మాత్రమే.

నేర్పరులు, మంచివాళ్లు అయిన మంత్రులని పిలిపించి పాండవులు ఆశపడేవిధంగా వారణావతాన్ని పొగడమని నియమించాడు దుర్యోధనుడు. పాండవులు ధృతరాష్ట్రుడి అభీష్టం మేరకు వారణావతానికి బయలుదేరాక, దుర్యోధనుడు పురోచనుడిని పిలిపించి, పాండవులకంటే ముందే అతడిని అక్కడికి పంపించి, లక్క, మద్దిబంక కలిపిన నేతితో నూనెతో తడిసిన మట్టితో ఒక నాలుగిండ్ల భవంతిని నిర్మింపజేశాడు. పాండవులు కొంత కాలం ఆ ప్రాంత సౌందర్యాన్ని ఆశ్వాదించాక, వారు ఏమరపాటుగా ఉన్న సమయంలో ఆ భవనానికి నిప్పు పెట్టాలని దుర్యోధనుడు పురోచనుడికి సూచించాడు. లాక్షాగృహదహనం వెనక దుర్యోధనుడు కుయుక్తులతో ఇంతటి వ్యూహాన్ని అమలుచేశాడు.

## 2.3.2. దుర్యోధనుడి పాండవపాంచాలవిభేదనోపాయం

పాండవుల మీద పైచేయి సాధించడానికి దుర్యోధనుడు ఎప్పటికప్పుడు కుయుక్తులు పన్నుతూనే ఉన్నాడు. లాక్షాగృహదహనం ద్వారా పాండవులని మట్టుపెట్టాలని దుర్యోధనుడు పన్నిన పన్నాగం విఫలమయ్యింది. పాండవుల వివాహం ద్రౌపదితో ఘనంగా జరిగింది. ఇప్పుడు

పాండవులకి పాంచాలదేశ ప్రభువైన ద్రుపదుడి మద్దతు కూడా తోడయ్యింది. పాండవులు రోజురోజుకీ బలవంతులు అవుతుండడంతో దుర్యోధనుడిలో భయం, అసూయ మరింతగా పెరిగిపోతున్నాయి. అందుకే, మరొక వ్యూహం పన్ని పాండవులని, పాంచాలమహారాజైన ద్రుపదుడి నుండి దూరం చేయాలని నిర్ణయించుకున్నాడు. తన వ్యూహాన్ని ధృతరాష్ట్రుడితో పంచుకున్నాడు.

వ. అది యె ట్లనినం బుత్త్ర మిత్త్ర బాంధవ బలసంపన్నుం డైన ద్రుపదునొద్దఁ బాండవు లుండువా 'రైన వారలం గృష్ణబలదేవులు యదువృష్ణిభోజాంధకవర్గములతో వచ్చి కూడిన నెవ్వరు సాధింపనోపరు; గావున, నెడసేయక ద్రుపదుండు పాండవుల విడుచునట్లుగా భేదింత; మొండె, వలనుగలవారలం బంచి కౌంతేయమాద్రేయులను దమలో విరక్తు లగునట్లుగాఁ జేయింత; మొండె నతిలలితప్రమదాజనంబులఁ బ్రత్యేకంబ యేవురకుం బ్రయోగించి ద్రౌపదివలన విరక్తిఁ బుట్టింత; మొండె, నేవురకు నొక్కతియ యా లగుట కష్టం బని ద్రోవదిఁ బాండవులవలన విగత స్నేహఁ గావింత; మొండె, నుపాంశుప్రయోగంబుల భీము వధియించి తక్కినవారల బలహీనులం జేయుదము. *(ఆంధ్ర. ఆది. 8: 22).*

'అది ఎట్లాగంటే, పుత్ర మిత్ర బంధు బలం సమృద్ధిగా కల ద్రుపదుని దగ్గర పాండవులుండి, వాళ్లకు తోడుగా శ్రీకృష్ణబలరాములు యదువృష్ణి భోజాంధక వర్గాలతో వచ్చి చేరితే ఇక వాళ్లను జయించటం ఎవ్వరికీ సాధ్యం కాదు. అందువలన ఆలస్యం చేయక ద్రుపదుడు పాండవులను వదిలేటట్లుగా చీలిక కలిగిద్దాం. లేకుంటే, నేర్పరులైన వాళ్లను పంపి కుంతికొడుకులకు, మాద్రి కొడుకులకు తమలో ప్రేమలేని వాళ్లయ్యేటట్లు చేద్దాం. అట్లా కాకుంటే, మిక్కిలి అందగత్తెలైన ఆడవాళ్లను పాండవులైదుగురి పై ప్రయోగించి, ద్రౌపది పట్ల ఏవగింపు పుట్టిద్దాం. కాకుంటే, ఐదుగురికి ఒక్కత్తే భార్య కావడం కష్టం అని ద్రౌపదిని పాండవుల మీద ప్రేమ లేనిది అయ్యేటట్లుగా చేద్దాం. లేకుంటే చాటుమాటు మంత్ర తంత్రాలు నడిపి భీముడిని చంపి మిగిలినవాళ్లను బలహీనులుగా చేద్దాం'.

పాండవులకి బంధు మిత్రుల బలం మెండుగా ఉంది. శ్రీకృష్ణ బలరాములు పాండవుల పక్షానే ఉన్నారు. యాదవ, వృష్ణి, భోజ, కులోత్తములు అంతా పాండవ పక్షపాతులు. చేదిరాజైన శిశుపాలుడు కూడా పాండవ పక్షం వహించేవాడే. పాంచాల రాజైన ద్రుపదుడు కూడా ఇప్పుడు పాండవపక్షాన పోరాడడానికి ఎప్పుడూ సిద్ధమే. అందుకే, ఒక్కొక్కరిగా వారందరినీ తప్పించి, వాళ్ల

మధ్య విభేదాలు పెట్టాలని దుర్యోధనుడి కుయుక్తి. అదీ కుదరకపోతే కుంతి కొడుకులకి, మాద్రి కొడుకులకి విభేదాలు సృష్టించి వారిని శత్రువులుగా మలచాలని మరొక ఆలోచన. అదీ కుదరకపోతే పాండవులు ఐదుగురికీ ద్రోపది భార్య కాబట్టి, ఆమె ద్వారా వారి మధ్య గొడవలు పెట్టాలని దుర్యోధనుడు యోచించాడు.

'సామదానాలు ఫలించనప్పుడు భేదోపాయాన్ని ప్రయోగించడం రాజనీతి. అవసరాన్ని బట్టి దుర్యోధనుడు ముందుగానే ప్రయోగిస్తున్నాడు. ఇందులో ఆరు రకాల భేదోపాయాలను తండ్రి ముందు ప్రతిపాదించాడు. ఈ ఉపాయాలు దుర్యోధనుని దుర్విదగ్ధత దుర్మార్గ ప్రవృత్తి, ప్రతిఫలించే ప్రతిపాదనలు' *(ఆంధ్ర. ఆది. 8. పుట: 776).*

దుర్యోధనుడు ప్రతిపాదించిన భేదోపాయంతో కర్ణుడు ఏకీభవించలేదు. 'పాండవులను ఐదుగురినీ భర్తలుగా పొందాలని ద్రౌపది తపస్సు చేసింది. అందువల్ల పాండవులకి, ద్రౌపదికి మధ్య గొడవలు రావడం అసాధ్యం. పాండవుల విషయంలో భేదోపాయం ఫలించదు' అని కర్ణుడి ఉద్దేశ్యం.

చ. ఘన మగు విక్రమంబునన కాదె జగత్త్రితయంబుఁ బాకశా
సనుఁడు జయించె; భూతలము సర్వము మున్ భరతుండు విక్రమం
బునన జయించె; విక్రమము భూరి యశఃప్రియు లైన రాజనం
దనులకు సర్వసాధనము, ధర్మువు శత్రునిబర్హణంబులన్. *(ఆంధ్ర. ఆది. 8: 27).*

'దేవేంద్రుడు ముల్లోకాలను గొప్ప పరక్రామం చేతనే కదా జయించాడు. భరతుడు భూమండలాన్నంతా పూర్వం జయించింది పరాక్రమం చేతనే కదా! గొప్పకీర్తిని కోరుకునే రాజకుమారులకు పరాక్రమమే సర్వసాధానం. శత్రు వధలలో ధర్మం'.

దుర్యోధనుడు భేదోపాయాన్ని ప్రతిపాదిస్తే కర్ణుడు దండోపాయాన్ని ప్రతిపాదించాడు. సామదానభేదోపాయాలు ఫలించనప్పుడు దండోపాయాన్ని ప్రయోగించడం రాజనీతి. కర్ణుడు గొప్ప వీరుడు. అందుకే, యుద్ధమే వీరధర్మమని ప్రతిపాదించాడు. దుర్యోధనుడికి తాను పాండవుల మీద యుద్ధంలో గెలవలేను అని మనస్సులో భయం ఉంది. రెండు పాత్రల్లో రాజనీతి పరంగా ఉన్న వైచిత్రిని ఈ ఘట్టం ద్వారా గమనించవచ్చు.

## 2.3.3. నారదుడి రాజనీతి సూత్రాలు

నన్నయ రచించిన సభాపర్వంలో పాండవులను ఆశీర్వదించడానికి వచ్చిన నారదుడు ధర్మరాజుకి ఎన్నో రాజనీతి సూత్రాలను బోధించాడు. ధర్మరాజు వద్ద ఒక సుదీర్ఘ ఉపన్యాసం చేసిన నారదుడు, పాలకులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి ఎన్నో ధర్మసూక్ష్మాలను తరతరాలకి ఉపయోగపడేవిధంగా వివరించాడు.

సీ. మీ వంశమున నరదేవోత్తములదైన / సద్ధర్మమార్గంబు సలుపుదయ్య?
ధర్మవిదుండవై ధర్మార్థకామంబు / లొండొంటి బాధింపకుండ నుచిత
కాల విభక్తముల్ గా లీల సేవింతె? / ధర్మువునంద చిత్తంబు నిలిపి
యిమ్ముల నపరరాత్రమ్ములం దెప్పుడుఁ / జింతింతె నిజబుద్ధిఁ జేయఁదగిన
ఆ. రాజకృత్యములఁ? దిరంబుగా నిఖిల ని
యోగ వృత్తులందు యోగ్యులయిన
వారిఁ గరము గారవమ్మునఁ బంచితె
నీవు వారిదైన నే ర్పెఱింగి. *(ఆంధ్ర. సభా. 1: 26).*

'మీ వంశంలో జన్మించిన రాజశ్రేష్ఠులు ఏర్పరచిన ధర్మపద్ధతిని తప్పక ఆచరిస్తున్నావు కదా! ధర్మాన్ని తెలుసుకుని, ధర్మార్థకామాలు ఒకదాని నొకటి బాధించకుండా, కాలోచితాలుగా వాటిని విభజించుకొని సేవిస్తున్నావు కదా! ధర్మమందే మనస్సు నిలిపి, చేయదగిన రాజకార్యాలని స్వబుద్ధితో ఎల్లప్పుడూ అర్ధరాత్రి దాటిన తరువాతే ఆలోచిస్తున్నావు కదా! ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరంగా యోగ్యులైన వాళ్లను, వాళ్ల వాళ్ల శక్తి సామర్థ్యాల్ని గుర్తించి గౌరవభావంగా, స్థిరంగా నియమించావు కదా!'

మనిషి పురుషార్థాలు నాలుగింటికీ లోబడి జీవితాన్ని సాగించాలి. ప్రతీ మనిషి ధర్మబద్ధంగా సంపాదించుకున్న అర్థంతో (సంపద) కోరికలు (కామం) నెరవేర్చుకుని, మోక్షం దిశగా ప్రయాణించాలి. పురుషార్థాలు నాలుగింటిలో ప్రధానమైనది ధర్మం. ధర్మాన్ని అనుసరించి అర్థ, కామాలు ఉండాలి. లేకపోతే లోకంలో అధర్మం తాండవిస్తుంది. ప్రజలు ధర్మార్థకామమొక్షాలకి లోబడి జీవించేలా నాయకుడు పరిపాలించాలి. అప్పుడే రాజ్యం సుభిక్షంగా ఉంటుంది.

రాజకార్యాలను రాజు/పాలకుడు ఎప్పుడూ అర్ధరాత్రి దాటిన తర్వాతే ఆలోచించాలని నారదుడి సూచన. ఎందుకంటే రాజ్యాన్ని నడిపించే క్రమంలో రాజుకి ఎన్నో ప్రణాళికలు ఉంటాయి. వాటిని అవసరమైతే తప్ప, ఎవ్వరితోనూ చర్చించకూడదు. రహస్యంగా తర్కించుకుని, అవసరమైనవారిని సంప్రదించి, రాజు నిర్ణయాన్ని అమలుపరచాలి. అర్ధరాత్రి దాటాక సహజంగా రాజు/ నాయకుడు ఏకాంతంగా ఉంటాడు. అప్పుడు రాజకార్యాలని తర్కించుకోవడం వల్ల ఎటువంటి సమస్య తలెత్తే అవకాశం ఉండదు. అందుకే, నారదుడు ధర్మరాజుకి ఈ సూచన చేశాడు.

నారదుడు ధర్మరాజుకి న్యాయపరమైన, రాజనీతిపరమైన, దౌత్య సంబంధితమైన ఎన్నో జాగ్రత్తలు, సూచనలు చేశాడు.

'ఓ ధర్మరాజా! నీవు యజ్ఞాలలో నియమించిన యాజ్ఞికుడు యజ్ఞం చేయించడంలో నిపుణుడై, రాగద్వేషరహితమైన సమబుద్ధితో తన కర్తవ్యాలను విస్మరిచకుండా ఉన్నాడు కదా!

పలువిధాలైన యుద్ధాల్లో విజయాన్ని సాధించడంలో నిపుణులైన వాళ్లను, ఎదిరించ సాధ్యం కాని పరాక్రమం కలవాళ్లను, విశ్వాసపాత్రులైనవాళ్లను, గౌరవానికి అర్హులైన వాళ్లను, నీ మేలు కోరే వాళ్లను, సైన్యాధ్యక్షులుగా నియమించావు కదా!

ఎక్కువ పలుకుబడి కలిగి, క్రియాశీలి, సమర్థుడు అయిన మంత్రి – తన పరిధిమీరి, ఇతర రాజపుత్రుల్ని మహాధనవంతులుగా చేసి, వాళ్లతో చేతులు కలిపి, నీకు వ్యతిరేకవర్గంగా ఏర్పడేటట్లుగా ఉండడం లేదు కదా! ధర్మరాజా! ధనం ఎటువంటి వాళ్లకైనా దురాశనూ, గర్వాన్ని కలిగిస్తుంది.

ఓ ధర్మరాజా! నీ ఆస్థాన జ్యోతిషులు శాస్త్రపాండిత్యం చేత, స్వీయప్రతిభచేత దేవతా సంబంధాలు, అంతరిక్ష సంబంధాలు, భూ సంబంధాలు అయిన ఉత్పాతాలను కనిపెట్టి వాటికి విరుగుడుగా శాంతి క్రియాదులు నీచేత జరిపించి, సన్మానాలు పొందుతున్నారు కదా!

ఓ పుణ్యాత్మా! ఆయుర్వేదంలో సమర్థులైన వైద్యులు లోకానికి మేలు చేసే బుద్ధితో ప్రజలమీద ప్రేమతో ఎనిమిది శాఖలుగా వ్యాపించిన ఆ వైద్య విధానంలో సేవలు చేస్తున్నారా?' *(ఆంధ్ర. సభా. 1: 30 – 34).*

మహాభారత కాలం నాటికి యజ్ఞయాగాలకి ఎంతో ప్రాముఖ్యత ఉండేది. యజ్ఞయాగాదులు చేయడం వల్ల మేఘమథనం జరిగి వర్షాలు సకాలంలో కురుస్తాయి. తద్వారా పంటలు బాగా పండి, ధనధాన్యాలకు లోటు ఉండదు. ఆ కాలంలో మనుషుల ప్రధాన జీవనాధారం వ్యవసాయమే కాబట్టి

యజ్ఞయాగాదులు విషయంలో రాజులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించేవారు. యాజ్ఞికుడు సత్ప్రవర్తన కలవాడు కాకపోతే దుష్ఫలితాలు వెలువడే అవకాశం ఉంది. అందుకే ఈ విషయంలో నారదుడు ధర్మరాజుని ప్రత్యేకంగా హెచ్చరించాడు.

రాజ్యవ్యవస్థలో సైన్యాధ్యక్ష పదవి చాలా కీలకమైనది. అతడే దేశానికి ప్రధానమైన రక్షకుడు. సైన్యాధ్యక్షుడు సమర్థుడు, విశ్వాసపాత్రుడు కాకపోతే రాజ్యం ప్రమాదంలో పడుతుంది. అన్నింటినీ మించి అతడి వ్యక్తిత్వం మంచిది కాకపోతే అది రాజుకే ముప్పు. అందుకే, ఆ విషయంలో జాగ్రత్త వహించాలని నారదుడు ధర్మరాజుకి సూచించాడు.

ఎక్కువ డబ్బుకి ఆశపడి, లేదా మరింత ఉన్నతమైన పదవికి ఆశపడి, మంత్రి శత్రురాజ్యాలతో చేతులు కలిపే అవకాశం ఉంది. అందుకే, మంత్రి సమర్థుడై, రాజుకి అత్యంత నమ్మకమైన వాడై ఉండాలి. కలియుగంలో సంప్రదాయంగా మారిన, 'పార్టీలు మారే సంస్కృతి' గురించి దార్శనికతతో ఆ కాలం వారు ఇటువంటి సూత్రాలను సూచించారని అనిపిస్తుంది. డబ్బుకి, ఉన్నతమైన, పదవికి, మంత్రిత్వానికి ఆశపడి పార్టీలు మారేవారు నేటికాలంలో కోకొల్లలు. అందుకే, ఈ విషయమై జాగ్రత్త వహించమని ఆ కాలంలోనే ధర్మరాజుని హెచ్చరించాడు నారదుడు.

మహాభారత కాలంలో రాజులు దేవతా, భూ, అంతరిక్ష సంబంధిత ఉత్పాతాలను జ్యోతిష్యం ద్వారా ముందే గ్రహించి, దానికి తగిన జాగ్రత్తలు, పరిహారాలు చేయించేవారని నారదుడి మాటల ద్వారా స్పష్టమౌతోంది.

'ఉత్పాతాలు మూడు రకాలు. అవి దివ్యాలు, అంతరిక్షాలు, భౌమాలు. దివ్యాలంటే – అపూర్వ గ్రహనక్షత్రాదులు పుట్టడం. అంతరిక్షాలు అంటే – పరివేషాలు ఏర్పడడం, పిడుగులు పడడం మొదలైనవి. భౌమాలంటే – అపూర్వ చరాచర వస్తువులు పుట్టడం, ఉప్పెనలు, భూకంపాలు మొదలైనవి రావడం. ఇవి ప్రజలకు దుఃఖాన్ని, రోగాన్ని కలిగిస్తాయి. అంతరిక్ష భూవాతావరణ పరిశోధకులైన పండితుల సాయంతో సాధ్యమైనంత ముందుగా వీటి రాకను కనిపెట్టి ప్రతిక్రియలు చేయడం ప్రభుధర్మం' *(ఆంధ్ర. సభా. 1. పుట: 17)*.

ప్రజలు ఎప్పుడూ ఆరోగ్యవంతులుగా ఉండేలా చూసుకోవడం రాజు బాధ్యత. ఎప్పటికప్పుడు వ్యాధులు ప్రబలకుండా రాజు తగిన చర్యలు తీసుకోవాలి. అందు నిమిత్తం వైద్యరంగంలో నిష్ణాతులైన వైద్యులను నియమించుకోవాలి. అది రాజు కర్తవ్యమని నారదుడు ధర్మరాజుకి వివరించాడు.

'భారతీయ వైద్య విధానంలో (ఆయుర్వేదం) ఎనిమిది శాఖలు ఉన్నాయి. అవి- శల్యం, శాలాక్యం, కాయచికిత్స, భూతవిద్య, కౌమారభృత్యం, ఆగదతంత్రం, రసాయన తంత్రం, వాజీకరణ తంత్రం' *(ఆంధ్ర. సభా. 1. పుట: 17).*

## 2.3.4. మాయాద్యూతం

ధర్మరాజు తన తమ్ముళ్ల సహాయసహకారాలతో, శ్రీకృష్ణుని ఆశీస్సులతో, అంగరంగ వైభవంగా, రాజసూయయాగాన్ని దిగ్విజయంగా నిర్వహించాడు. యాగం ముగిశాక దుర్యోధనుడికి మయుడు చారిత్రాత్మకంగా నిర్మించిన మయసభని మొత్తం చూపించాడు. అక్కడ ఒక చోట దుర్యోధనుడు నీళ్లు లేవు అనుకొని ముందుకి వెళ్లడంతో నీటిలో పడ్డాడు. అది చూసి ద్రౌపది, పాండవులు నవ్వారు. అసలే, పాండవులు రాజసూయయాగ నిర్వహణ ద్వారా గడించిన కీర్తి ప్రతిష్టలు చూసి అసూయతో రగిలిపోయిన దుర్యోధనుడికి ఈ అవమానం పుండు మీద కారం చల్లినట్లైంది. ఈ అవమాన భారం దుర్యోధనుడి పై చాలా రోజులు ఉండిపోయింది. దుర్యోధనుడు ఎప్పుడూ అన్యమనస్కంగా ఉండడం చూసి, ధృతరాష్ట్రుడు, శకుని, సోదరులు అతడిని అనేకరకాలుగా ఓదారుస్తూ ఉండే వారు. దుర్యోధనుడు మాత్రం నిరంతరం తనకి జరిగిన అవమానాన్ని మనస్సులో తలుచుకుంటూ బాధ పడుతూ ఉండేవాడు. ఈ విధంగా పాండవుల పై ఎలా పైచేయి సాధించాలని ఉబలాటపడుతున్న దుర్యోధనుడి వద్ద శకుని తన మనస్సులో ఉన్న కుయుక్తిని వివరించాడు.

క. భానుప్రభుఁ లగు పాండుమ
   హీనాథాత్మజులలక్ష్మియెల్లను నీకున్
   నే నపహరించి యిత్తు ధ
   రానుత.మాయాదురోదరవ్యాజమునన్ ! *(ఆంధ్ర. సభా. 2: 122).*

వ. 'ధర్మతనయుండు జూదంబునకుఁ బ్రియుండు గాని యందుల యుక్కివం బెఱుంగం; దే నక్షవిద్యయం దతి దక్షుండ; నాతని నశ్రమంబున నోడించి తదీయ రాజ్యవిభూతి నీ కిచ్చెద; వగవకుండు' మని పలికిన శకుని పలుకులకు సంతసిల్లి దుర్యోధనుండు దండ్రిపాదంబులపయిం

బడి మ్రొక్కి 'యీ శకునిమతంబున కొడంబడవలయు' ననినఁ గొడుకునకు ధృతరాష్ట్రుం డి ట్లనియె. *(ఆంధ్ర. సభా. 2: 123).*

'లోకం కొనియాడే ఓ దుర్యోధనా! సూర్యునితో సమానమైన తేజస్సు కల ఆ ధర్మరాజు ఐశ్వర్యాన్నంతా మాయాద్యూతం నెపంతో నీకు అపహరించి ఇస్తాను. ధర్మరాజుకి జూదం అంటే ఎంతో ఇష్టం. కానీ, అందులో ఎంత మోసం ఉంటుందో అతనికి తెలియదు. నేను ద్యూతవిద్యలో చాలా నేర్పరిని. ఆ ధర్మరాజును సులభంగా ఓడించి, అతని రాజ్యసంపదనంతా నీకిస్తా. ఎందుకు అలా దుఃఖిస్తావు' – అని శకుని అనగానే సుయోధనుడు సంతోషించాడు. తండ్రి పాదాల మీద వ్రాలాడు. 'ఈ శకుని అభిప్రాయాన్ని అంగీకరించు' అన్నాడు. అందుకు ధృతరాష్ట్రుడు ఇలా అన్నాడు'.

ధర్మరాజు సద్గుణసంపన్నుడే అయినప్పటికీ అతడికి ఉన్న ఒకే ఒక్క ఆసక్తి జూదం. శకుని జూదంలో నేర్పరి. పరాక్రమంలో కానీ, రాజ్యసంపద విషయంలో కానీ, ప్రజాభిమానంలో కానీ, కీర్తిపరంగా కానీ, రాజనీతి విషయంలో కానీ ధర్మరాజుకి తాను ఏ విధంగా కూడా పోటీ ఇవ్వలేను అని భావించిన దుర్యోధనుడిని ఊరడిస్తూ శకుని మాయద్యూతం ద్వారా ధర్మరాజుని ఓడించే పన్నాగం గురించి వివరించాడు. ఇక ధృతరాష్ట్రుడిని అంగీకరింపజేసి, ధర్మరాజుని జూదమాడడానికి ఆహ్వానించడమే తరువాయి. దుర్యోధనుడి దురాలోచన, శకుని కుయుక్తి, ధృతరాష్ట్రుడి పుత్రవ్యామోహం కలిసి ధర్మరాజుకి జూదం పట్ల ఉన్న ఆసక్తిని బలహీనతగా చేసుకుని మాయద్యూత వ్యూహం అమలు కావడానికి కారణమయ్యాయి. 'జూదాన్ని సప్తవ్యసనాలలో ఒకటిగా ప్రాచీనులు చేర్చారు. సప్తవ్యసనాలు – 1. మృగయ (వేట) 2. మద్యం 3. మహిళ 4. ద్యూతం 5. వాక్పారుష్యం 6. దండపారుష్యం 7. అర్థ దూషణం' *(ఆంధ్ర. ఆరణ్య. 2. పుట: 191).* జూదం ఆనాటి క్షత్రియ సంప్రదాయం. వినోదం నిమిత్తం క్షత్రియులు జూదం ఆడేవారు. అయితే, ధర్మారాజుకి జూదం పట్ల ఉన్న అమితాసక్తి దుర్యోధనుడి పాలిట వరమయ్యింది.

## 2.3.5. దుర్యోధనుని ఘోషయాత్ర

అరణ్యవాసంలో భాగంగా పాండవులు ద్వైతవనంలో నివసిస్తున్నారు. మాయాద్యూతంలో పాండవులను అడవుల పాలు చేసినా దుర్యోధనుడికి పాండవుల పట్ల ద్వేషం తగ్గలేదు. అరణ్యవాసంలో పాండవులు ఎంత దయనీయ పరిస్థితుల్లో ఉన్నారో కళ్లారా చూడాలని దుర్యోధనుడు

ఆశపడ్డాడు. అందుకే, ద్వైతవనానికి విహార యాత్రకి వెళ్లాలని దుర్యోధనుడు భావించాడు. పాండవులు ఉంటున్న అదే వనానికి వెళ్లడానికి ధృతరాష్ట్రుడు అంగీకరించే అవకాశం తక్కువ. నిజానికి పాండవులు అక్కడ ఉన్నారని ధృతరాష్ట్రుడికి తెలియకపోయినా విదురుడు చెబుతాడని దుర్యోధనుడు ఊహించాడు. ఈ విధంగా దుర్యోధనుడు, శకుని, కర్ణుడు సాధ్యాసాధ్యాలు చర్చిస్తుండగా కర్ణుడికి ఒక ఉపాయం తట్టింది.

ఉ. 'భూతలనాథయే నొకటి పోల నుపాయము గంటి !; నిప్పు డా
ద్వైతవనంబునందు విదితంబుగ నున్నవి గో కదంబముల్;
ప్రీతిగఁ దద్విలోకనము పేరఁ జనం దగు; ధారుణీశ్వరుం
డీతెఱఁ గైనఁ బొమ్మను; నభీష్టముఁ జేకుఱు నెల్లభంగులన్'. *(ఆంధ్ర. ఆరణ్య. 5: 357).*

'ఓ సుయోధన మహారాజా! నాకు సరైన ఒక మంచి ఉపాయం తట్టింది. ఈ సమయంలో ఆ ద్వైతవనంలో మన ఆవులమందలు ఉన్న సంగతి అందరికీ తెలిసిందే కదా. ఆ ఆవులమందను చూడడం కొరకై మనం ద్వైతవన విహారయాత్రకి వెళ్తున్నట్లు ప్రకటిస్తే ధృతరాష్ట్ర మహారాజు అంగీకరించగలడు. ఎవ్వరూ అనుమానించడానికి ఎట్టి ఆస్కారమూ ఉండదు. ఈ విధంగా మన కోరిక ఈడేరగలదు'.

కర్ణుడికి తట్టిన ఉపాయమే శకునికి కూడా తట్టింది. దుర్యోధనుడు కూడా కర్ణుడి ఉపాయానికి ఎంతో సంతోషించాడు. దుర్యోధనుడు వెంటనే సుమంగుడు అనే గొల్లవాడిని పిలిపించి, ధృతరాష్ట్రుడు కొలువై ఉండగా వచ్చి, 'ద్వైతవనంలో ఉన్న మన ఆవులమందలు క్రూరమృగాల వల్ల ఆపదలో ఉన్నాయని' చెప్పమని తర్ఫీదు ఇచ్చాడు. సుమంగుడు దుర్యోధనుడు చెప్పినట్టుగానే ధృతరాష్ట్రుడికి ఈ విషయాన్ని విన్నవించాడు. ముందు ధృతరాష్ట్రుడు దుర్యోధనుడి ఘోషయాత్రకి అంగీకరించకపోయినా, శకుని, కర్ణుడు రకరకాలుగా చెప్పి ఒప్పించారు. ధృతరాష్ట్రుడి అనుమతితో దుర్యోధనుడు ద్వైతవనానికి సపరివారసమేతంగా బయలుదేరాడు.

రకరకాల ఉపాయాలు ఆలోచించి, దుర్యోధనుడు శకుని, కర్ణుల కుయుక్తుల సహాయంతో అనుకున్న పని నెరవేరేలా పథకం పన్నాడు. పాండవులపై పైచేయి సాధించడానికి దుర్యోధనుడు తాను బ్రతికున్నంత కాలం ఏవేవో ప్రయత్నాలు చేస్తూనే ఉన్నాడు. తదనంతర కథలో దుర్యోధనుడు

చేసిన ఘోషయాత్ర వ్యూహం బెడిసికొట్టింది. దుర్యోధనుడు చిత్రసేనుడనే గంధర్వ రాజు చేతిలో ఓడిపోయి, పాండవుల చేత రక్షించబడి, ఘోర అవమానంతో తిరిగి వస్తాడు.

## 2.3.6. కీచకవధ ఘట్టం: దండనీతి

తిక్కన రచించిన విరాట పర్వంలో వివరించబడిన కీచకవధ ఘట్టం ఎన్నో సామాజికాంశాలకు నిలయం. కీచకవధ ఘట్టంలో భీముడు కీచకుడిని చంపిన తీరు అత్యంత భయానకమైనది. ద్రౌపది పట్ల కీచకుడి ప్రవర్తన ఎంత అమానవీయంగా ఉందో, అంతకి రెట్టింపు అమానవీయంగా, క్రూరాతి క్రూరంగా భీముడు కీచకుడిని సంహరించాడు. శక్తి స్వరూపమైన స్త్రీని అవమానించినందుకు, అత్యాచార ప్రయత్నం చేసినందుకు కీచకుడు తగిన శిక్షని అనుభవించాడు. విరాటుడి పట్టణంలోని జనులు సైరంధ్రిని చూసి పొందిన అదురుపాటు ఈ పద్యంలో వర్ణించబడింది. కీచకుడు మరణించిన తరువాత ద్రౌపది నగరంలోకి ప్రవేశించి రాజవీథిలోకి వచ్చినప్పుడు ఆ పరిసరాలని, చుట్టపక్కల వారి ప్రవర్తనని తిక్కన వర్ణించిన తీరు గొప్ప చర్చకి తెర తీస్తుంది.

సీ. 'మన కీచకుల కెల్ల మారియై పుట్టిన / సుదతి పోయెడు' నని చూచువారు;
'నద్దిరానీకుఁ గ్రొ వ్వఱుగదేఁ జూతుగా !' / కని తలసూపక యడఁగువారు;
నలవోకఁ గనుఁగొని యంతరంగము బిట్టు / బెదర మాఱుమొగంబు పెట్టువారు;
నెదురుగా వచ్చిన నెంతయేనియు దవ్వు / గలుగ వేఱొక త్రోవఁ దొలఁగువారు
తే. ముట్టఁబడి మేనఁ గంపంబు పుట్ట నొదిగి
యుండువారుఁ, గరంబున నుదర మప్పళించి 'యమ్మరొరక్కసి !' యంచు నుల్ల
ములుకువారునై పురజనంబులు తలంకి. *(ఆంధ్ర. విరాట. 3: 37).*

' 'మన కీచకులందరికీ మృత్యువై పుట్టిన ఆ అందగత్తె ఈమె' అని చూసేవారు కొంతమంది; 'నీ కొవ్వు కరగకపోతే ఆమె దిక్కు చూడు' అని చూసేవారిని వారిస్తూ మొగం తప్పించి దాగి ఉండిపోయేవారు కొంతమంది; అలవోకగా చూసి మనస్సులో మిక్కిలి బెదిరి మారుమొగం పెట్టేవారు కొంతమంది; ఎదురు వస్తే ఎంత దూరం అయినప్పటికినీ తొలగి మరొక బాటలో పోయేవారు కొందరు; పొరపాటున ఆమె శరీరం తగులగా ఒడలిలో వణుకు పుట్టి అణగి ఉండేవారు

కొంతమంది; 'అమ్మో! ఈమె రాక్షసి' అని పొట్టబాదుకుని గుండెలదిరిపోయేటట్లు భయపడేవారు కొంతమంది; ఈ విధంగా ఆ నగర ప్రజలు హడలిపోయారు.

కీచకుడు ద్రౌపది ఎంత వద్దని వారించినా వెంటపడ్డాడని ఆ నగరంలో అందరికీ తెలుసు. ద్రౌపది కీచకుని వారించే క్రమంలో పరాక్రమవంతులైన తన ఐదుగురు భర్తల గురించి చెప్పిన విషయం కూడా ఆ చెవిన, ఈ చెవిన పడి అందరికీ తెలిసింది. ఇప్పుడు నర్తనశాలలో కీచకుడు చనిపోయి, ముద్దగా పడి ఉన్న తీరు చూసి, నగరంలో వణుకు పుట్టింది. ద్రౌపది జోలికి ఎవరైనా వస్తే, వారి చావు ఎంత క్రూరంగా ఉంటుందో అర్థమైపోయింది. అందుకే, ద్రౌపదిని చూడగానే అందరూ భయపడుతున్నారు. రకరకాల వ్యక్తులు ద్రౌపదిని చూసి భయపడిన విధానాన్ని తిక్కన అత్యంత సహజంగా వర్ణించి, పాఠకులని సైతం భయపెట్టారు.

కలియుగంలో ఆడవాళ్లపై అత్యాచారాలు బాగా ఎక్కువైన తరుణంలో కీచకవధ ఘట్టం పాఠ్యపుస్తకాల్లో మొదటి పాఠం కావాలి. శిక్షాస్మృతి గట్టిగా ఉంటే తప్పు చేసేవారి వెన్నులో వణుకు పుడుతుందని తిక్కన ఈ పద్యం ద్వారా నాటకీయంగా వర్ణించి నిరూపించారు. కీచకుడికి భీముడు విధించిన మరణ శిక్ష అంత భయానకంగా ఉండబట్టే, ద్రౌపది వైపు పొరపాటున చూడడానికి కూడా ఆ నగరంలో ఎవ్వరూ సాహసించలేదు. దీన్ని బట్టీ చూస్తే, కీచకవధ ఘట్టం నేటి తరానికి శిక్షాస్మృతి విషయంలో గొప్ప సందేశాన్నిస్తోంది. న్యాయ వ్యవస్థ మరింతగా బలోపేతమై, అత్యంత వేగంగా, అత్యంత కఠినంగా అత్యాచారాలకు పాల్పడుతున్న మృగాళ్లను శిక్షిస్తే, ఆ తప్పు చేయాలనే ఆలోచన కూడా ఎవ్వరికీ రాదు. ఆడవాళ్ల మానానికి తగిన రక్షణ అప్పుడు ఏర్పడుతుంది.

తిక్కన చేసిన ఈ వర్ణన, మహాభారత కాలం నాటి శిక్షాస్మృతిని నేటి కాలంలో సైతం అనుసరించాలని సూచిస్తోంది. తద్వారా మహిళలపై జరిగే అత్యాచారాలను అరికట్టవచ్చని ఋజువు చేస్తోంది.

"రాజు, అమాత్యుడు, రాష్ట్రం, దుర్గం, కోశాగారం, స్నేహితులు, బలం అనే ఏడింటినీ ప్రకృతులంటారు. సప్తాంగాలని కూడా పిలుస్తారు. వీటికి హాని రాకుండా ప్రభువు చూసుకోవాలి. సత్ప్రవర్తన కలిగి ఉంటేనే అది సాధ్యపడుతుంది. వీటన్నిటికీ రక్ష దండనీతి. దుష్టశిక్షణ, శిష్టరక్షణ అవసరం" *(రామకృష్ణ, ప్రయాగ. 2017: 108).*

## 2.3.7. గోగ్రహణ యుద్ధ వ్యూహం

పాండవుల అజ్ఞాతవాస గడువు ముగిసే సమయం దగ్గర పడుతూ ఉండగా దుర్యోధనుడిలో వారిని ఎలాగైనా వెతికి పట్టుకోవాలనే ఉబలాటం ఎక్కువైంది. చాలా రకాలుగా ప్రయత్నించాక, పాండవుల ఆచూకీ తెలియక దుర్యోధనుడు, భీష్ముడిని సమీపించాడు. పాండవులు ఉండే చోట రాజ్యం ఎలా ఉంటుందో భీష్మపితామహుడు అత్యంత సహజంగా వర్ణించాడు. ఈ లక్షణాలను దృష్టిలో ఉంచుకుని పాండవుల ఆచూకీ తెలుసుకోవడానికి దుర్యోధనుడు సన్నాహాలు మొదలుపెట్టాడు.

దుర్యోధనుడి ప్రధాన మంత్రాంగం అంతా ఆలోచనలో ఉండగా, దుర్యోధనుడికి ఒక ఉపాయం తట్టింది.

ఉ. తక్కినవార లాతనికి దవ్వుల చోటులవారు; వాయుజుం
  డొక్కఁడ యింక సింహబలు నుద్ధతి మాన్చిన మాన్చువాఁ; డతం
  డక్కడ నిల్చెఁ గావలయు; నాసతి ద్రౌపది గాఁగ నోపు; వే
  ఱొక్కరుఁ డాజిఁ గీచకుల నోర్వఁగఁ జాలమి మీ రెఱుంగరే? *(ఆంధ్ర. విరాట. 3: 116).*

'శల్యబలరాములు ఆ సింహబలుడికి సుదూర ప్రాంతాలలో ఉన్నారు. భీమసేనుడొక్కడే ఆ సింహబలుడి గర్వాన్ని అవసరం వస్తే అణచగలడు. అతడు ఆ విరాటుడి పట్టణంలో ఉండి ఉంటాడు. ఆ ఇల్లాలు ద్రౌపది అయ్యుంటుంది. భీముడు కాక మరొక్కడు యుద్ధంలో కీచకులందరినీ ఒక్కసారిగా మట్టుపెట్టలేడన్న సంగతి మీకూ తెలుసు'.

సింహబలుడు (కీచకుడు), భీమసేనుడు, శల్యుడు, బలరాముడు ఈ నలుగురూ సమానమైన బలం కలవారు. ఒకరినొకరు జయించాలని ఉత్సాహపడే గర్వం కలవారు. మల్లయుద్ధప్రియులు. ఈ నలుగురి భుజబలంతో సరితూగే భుజబలం ఎక్కడా కనపడలేదు. కాబట్టి యుద్ధంలో ఈ నలుగురిలో ఒకరిమీద ఒకరు గెలవడం మాత్రమే సాధ్యమౌతుంది. ఈ తర్కాన్ని అందరి దృష్టికీ తీసుకువచ్చి, దుర్యోధనుడు గొప్ప కీలకాన్ని ప్రతిపాదించాడు. కీచకవధ జరిగిన చోటుకి శల్యబలరాములు చాలా దూరంగా ఉన్నారు. అందువల్ల వారు సింహబలుడైన కీచకుడిని చంపే అవకాశం లేదు. భీముడే చంపి ఉండాలి. అందుకు కారణం ద్రౌపది అయ్యుండాలి. ఇదీ దుర్యోధనుడి ఆలోచన (యుక్తి).

దుర్యోధనుడు తన ఆలోచనకి పదును పెట్టి, ఒక ప్రమాణాన్ని కురువంశయోధుల ముందు ప్రతిపాదించాడు. ఇప్పుడు మరొక ప్రమాణం చెప్తున్నాడు. కీచకుడు మరణించిన ప్రాంతం మత్స్యదేశం. దానికి అధిపతి విరాటమహారాజు (కీచకుడికి బావగారు). పాండవులు అందరూ విరాటుడి కొలువులోనే మారు వేషాల్లో కొలువులు సంపాదించి ఉంటారు. ఆపైన, భీష్ముడు చెప్పిన లక్షణాలు అన్నీ మత్స్యదేశంలో కనిపిస్తున్నాయి. దీన్ని ఆధారంగా చేసుకొని దుర్యోధనుడు గొప్ప వ్యూహాన్ని రచించాడు. విరాట మహారాజు రాజ్యంపై కౌరవసేన దండెత్తితే, అతడిని రక్షించడానికి పాండవులు ముందుకి వస్తారు. వారిని గుర్తించి, అజ్ఞాతవాసవ్రాత భంగం చేసి, వారిని తిరిగి 12 ఏళ్లు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసానికి పంపవచ్చు. ఒకవేళ పాండవులు అక్కడ లేకపోతే మత్స్యదేశాన్ని స్వాధీనం చేసుకోవచ్చు. కీచకుడి మరణాన్ని రంగంగా చేసుకొని, ఇంతటి వ్యూహాన్ని రచించాడు దుర్యోధనుడు. ఏ రకంగా చూసిన తనకి లాభం వచ్చేలా దుర్యోధనుడు ప్రణాళికని సిద్ధం చేసుకున్నాడు.

ఉ. 'మున్ను సుశర్మ దాను బలముం జని గోవులఁ బట్టుఁ; బట్టినన్
వెన్నడి వచ్చు మత్స్య పృథివీపతి సేనల నెల్లఁ గొంచు శౌ
ర్యోన్నతి సూపువాఁడయి; సముద్ధతిమై నిట వేఱ కౌరవుల్
కొన్నిటిఁ బట్టఁ గయ్యమునకుం బఱతెంతురు పాండునందనుల్. *(ఆంధ్ర. విరాట. 3: 126).*

'ముందుగా సుశర్మ తన బలంతో వెళ్లి గోవులను పట్టుకుంటే విరాటుడు తన సైన్యమంతటినీ తీసుకొని తన పరాక్రమాతిశయాన్ని ప్రకటించాలని వెనువెంటనే కయ్యానికి వస్తాడు. అప్పుడు మన కౌరవులు ఆర్భాటంగా వేరుగా ఇక్కడ కొన్ని గోవులను ముట్టడి చేస్తే పాండవులే యుద్ధానికి తరలివస్తారు'.

దుర్యోధనుడు రచించిన వ్యూహం తెలుసుకున్నాక, త్రిగర్తదేశాధిపతి అయిన సుశర్మ మరొక ప్రతిపాదన చేశాడు, 'కేకయ సాళ్వుల సహాయంతో కీచకుడు యుద్ధంలో నన్ను ఓడించాడు. కానీ, నేను ప్రతీకారం తీర్చుకునేలోగానే అతడు చచ్చాడు. ఓటమితో క్రుంగిపోయిన నన్ను విరాటుడి మీదకి పంపండి' అని ఆవేశంగా పలికాడు.

సుశర్మ ప్రతిపాదన కురువంశయోధులందరి ఆమోదం పొందింది. తదనుగుణంగా దుర్యోధనుడు మొత్తం వ్యూహాన్ని అందరి ముందుంచాడు. సుశర్మ తన సేనలతో విరాట మహారాజు

రాజ్యంలోని గోవులని మరలిస్తాడు. గోసంపదని రక్షించడానికి విరాట మహారాజు తన సైన్యాన్నంతటినీ తీసుకుని సుశర్మపై దండెత్తుతాడు. అప్పుడు కౌరవసేన మత్స్యదేశంపై దండెత్తుతుంది. సైన్యమంతా విరాటుడి వెంట ఉండడంతో రాజ్యసంరక్షణ నిమిత్తం పాండవులు బయటకి రాక తప్పదు. ఇదీ దుర్యోధనుడి గోగ్రహణ యుద్ధ వ్యూహం. ఇంతటి వ్యూహాన్ని రచించిన దుర్యోధనుడు, పాండవుల అజ్ఞాతవాస గడువు పూర్తికావచ్చిందని తెలుసుకోలేకపోవడం కొసమెరుపు.

## 2.3.8. ధర్మరాజు ప్రతివ్యూహం

సుశర్మ తన సేనలతో విరాటుడి గోవులని దక్షిణ దిక్కుగా మరలించాడు. ఆ వార్త తెలుసుకుని విరాట మహారాజు వాటి సంరక్షణార్థం యుద్ధానికి సన్నద్ధుడయ్యాడు. యుద్ధ సన్నాహాలను గమనించిన కంకుభట్టు (ధర్మరాజు) విరాట మహారాజు వద్దకి చేరి ఇలా అన్నాడు.

చ. 'ఒక ఋషిచేత నాయుధ సముత్కర మెల్లను సప్రయోగమం
క్రకముగ నభ్యసించి సమరంబునకుం గొఱయైనవాఁడ; గో
ప్రకరములన్ మరల్చుటకు బంధులు నీవును బోవ నాకు నిం
టికడన యున్కిపాడియె? ఘటింపఁగఁ బంపు రథంబు సయ్యనన్.' *(ఆంధ్ర. విరాట. 3: 151).*

'ఓ రాజా! ఒకానొక ఋషి మూలాన శస్త్రాస్త్ర ఆయుధ ప్రయోగాదులను మంత్ర సహితంగా అభ్యసించాను. యుద్ధానికి సమర్థుడైనవాడను. ఆలమందలను మరల్చుటకు బంధువులతో నీవు వెళ్లగా నేనిచ్చటనే ఉండడం న్యాయమా? కనుక వేగమే నా కొరకు రథాన్ని సన్నద్ధం చేయించుము'.

విరాట మహారాజు యుద్ధంలో ఓడిపోతే అజ్ఞాతవాస వ్రతాన్ని అతడి కొలువులో గడుపుతున్న పాండవులు బయటపడవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అజ్ఞాతవాస వ్రతానికి భంగం అవుతుంది. అందుకే, విరాటుడి రాజ్యాన్ని రక్షించుకోవడం ధర్మరాజుకి కేవలం రాజధర్మమే కాదు, అనివార్యం, ఆవశ్యకం. కంకుభట్టు సన్యాసి వేషంలో విరాటమహారాజు కొలువులో చేరాడు. కాబట్టి ఒక ఋషి వల్ల శస్త్రాస్త్రాలను సమంత్రకంగా అభ్యసించానని చెప్పడం బాగా సరిపోయింది. విరాటుడు మొదటిసారి ధర్మరాజుని సన్యాసిగా చూసినప్పుడే అతడి పట్ల ఎంతో గౌరవభావాన్ని పెంచుకున్నాడు. ఇప్పుడు రాజ్యం ఆపదలో ఉన్నప్పుడు తోడుగా నిలబడి పోరాడతానని కంకుభట్టు (ధర్మరాజు) ధర్మనీతిని చాటుకోవడంతో విరాట మహారాజుకి అతడిపై మరింత గౌరవం పెరిగింది.

ధర్మరాజు మనస్సులో భీమ, నకుల, సహదేవులని సైతం యుద్ధానికి తీసుకువెళ్లాలని ఆలోచన ఉంది. అందుకే, మరొక్క మాటగా విరాటుడితో ఇలా అన్నాడు.

సీ. 'మన వలలుండు లావున బంటుతనమున / జను లెఱుంగఁగ సడిసన్నవాఁడు;
మంచిమగండు దామగ్రంథి యసమసం / గ్రామకేళీ గాఢ కౌతుకుండు,
వినుము, తంత్రీపాలుఁడును దుర్దమారాతి / మర్దనచాతుర్య మహిత భుజుఁడు;
మున్నును వీరలు మువ్వుర కడఁకల / కొలఁదు లే నెఱుఁగుదుఁ గొంతకొంత;
తే. యెక్కఁదగునట్టి యరదంబు లిచ్చి వీరి
నరికిఁ దోకొనిపోక కార్యంబు నాకుఁ
జూడ!' ననవుడు మేదినీశుండు హర్ష
నిర్భరాత్మకుఁ డై శతానీకుఁ జూచి. *(ఆంధ్ర. విరాట. 3: 153).*

'ఓ రాజా! మన వలలుడు బలంలోనూ, పరాక్రమంలోనూ మహావీరుడు. ప్రజల పొగడ్తలందినవాడు. మేటివీరుడైన దామగ్రంథి సాటిలేని యుద్ధక్రీడలో ఆసక్తి కలవాడు. వినుము. తంత్రీపాలుడు శత్రుసంహార చాతుర్యం గల భుజబలం కలవాడు. ఇదివరకు ఈ మువ్వురకున్న శక్తులను ఇంచించుక నే నెరుగుదును. వీరధిష్ఠించదగిన రథాలను ఒసగి యుద్ధానికి వీరిని పిలుచుకొనిపోవడం తగినపనిగా నాకు తోస్తున్నది' అని కంకుడు (ధర్మరాజు) అనగా విరాటుడు సంతసం నిండిన మనస్సుతో శతానీకుడిని చూసి ఆజ్ఞ జారీ చేశాడు'.

విరాట మహారాజుకి ఎదురైన ఆపద, నిజానికి పాండవుల పాలిట ఆపద. ఈ విషయమై ధర్మరాజు ఒక్కడే కాదు, భీమార్జుననకులసహదేవులు సైతం అత్యంత జాగ్రత్త వహించి ఈ విపత్తుని నివారించాలి. వలలుడు (భీముడు) మత్స్యదేశంలో అత్యంత బలవంతుడిగా రాజ్యంలో మంచి పేరు తెచ్చుకున్నాడు. విరాటుడి మన్నన పొందినవాడు. దామగ్రంథి (నకులుడు) అశ్వశిక్షకుడు. అశ్వాలకు అంత చక్కటి శిక్షణ ఇవ్వగలిగినవాడు, యుద్ధంలో అందుబాటులో ఉండడం ఎంతో అవసరం. అలాగే, తంత్రీపాలుడు (సహదేవుడు) గోరక్షకుడు. శత్రువులను మర్దించడంలో గొప్ప నేర్పు కలవాడు. అంతకంటే ముందు, శత్రువులు ఆక్రమించింది గోగణాన్ని. అవి తంత్రీపాలుడి అధీనంలో ఉంటాయి. కాబట్టి వాటిని తిరిగి దక్కించుకునే క్రమంలో అతడి సహాయం ఎంతో విలువైనది. మొత్తంగా చూసుకుంటే, ధర్మరాజు చెప్పిన ప్రతీ మాట వెనక గొప్ప అంతరార్థం దాగి ఉంది.

దుర్యోధనుడి వ్యూహాన్ని తిప్పికొట్టే ఆలోచన, ప్రతివ్యూహం తన సొంతమని ధర్మరాజు తన ప్రతిక్రియ ద్వారా నిరూపించుకున్నాడు. విరాట మహారాజుకి ఎటువంటి అనుమానం కలగకుండా అనువైన మాటలు చెప్పి, జాగ్రత్తపడ్డాడు. కంకుభట్టు ఇచ్చిన సలహాలు విరాటుడికి నచ్చడంతో ధర్మరాజు వ్యూహానికి ఇక ఎదురే లేకుండా పోయింది.

## 2.3.9. భీష్ముడి రాజనీతి

దక్షిణ దిక్కున తన సేనలతో విరుచుకుపడి, విరాటుడి గోసంపదని మరల్చిన సుశర్మపై విరాటుడు ధర్మరాజు, భీమ, నకుల సహదేవుల సహాయంతో దండెత్తాడు. ధర్మరాజు, సోదరులు సుశర్మని అవలీలగా ఓడించి విరాటుడి ముందు నిలిచారు. మరొక పక్క ఉత్తర దిక్కున కౌరవసేన మత్స్యదేశంపై దండెత్తింది. ఉత్తరుడికి తానెవరో తెలియజేసి బృహన్నల (అర్జునుడు), అతడిని రథసారధిగా చేసుకొని, 13 ఏళ్ల తర్వాత అర్జునుడిగా యుద్ధరంగంలో కౌరవుల ఎదుట నిలిచాడు. అయితే, అజ్ఞాతవాస గడువు ఇంకా పూర్తికాలేదని దుర్యోధనుడు భావించాడు. కురువంశయోధులంతా ఈ విషయమై చర్చిస్తుండగా, దుర్యోధనుడు తీర్పు చెప్పమని భీష్మపితామహుడిని కోరాడు.

ఉ. వచ్చినవాఁడు ఫల్గునుఁ డవశ్యము గెల్తు మనంగరాదు; రా
లచ్చికినై పెనంగిన బలంబులు రెండును గెల్వ నేర్చునే?
హెచ్చుగుఁ గుందగుం దొడరు టెల్ల విధంబుల కోర్చు; టట్లుగా
కిచ్చఁ దలంచి యొక్కమెయి నిత్తఱిఁ బొందగు చేఁతయుం దగున్.' *(ఆంధ్ర. విరాట. 4: 234).*

'ఇప్పుడు మనపైకి దండెత్తి వచ్చినవాడు అర్జునుడు. మనమే తప్పక జయిస్తామని చెప్పలేము. రాజ్యలక్ష్మి కొరకు పెనగులాడితే రెండు బలాలూ గెలువలేవు కదా! జయం కలుగవచ్చును, కలుగకపోవచ్చును. ఇప్పుడు మనం చేయగలిగిందల్లా ఏమి వచ్చినా ఓర్చుకోవడమే. అంతేకాక ఒకరకంగా ఇప్పుడు సంధి చేసుకోవడం కూడా మంచి పనే'.

కౌరవుల మీమాంసకి భీష్ముడు తెరదించాడు. రెండేళ్లకి ఒకసారి వచ్చే అధిక మాసాలని లెక్కించుకుంటే, నిన్నటికి 13ఏళ్ల గడువు ముగిసినట్లేనని భీష్ముడు నిష్కర్షించాడు. 'పాండవులు

ధర్మనిష్ఠ కలిగినవారు. గడువుని అతిక్రమించరు' అని భీష్ముడు వివరించాడు. గడువు పూర్తయ్యిందని తెలిసే అర్జునుడు బయటకి వచ్చి ధైర్యంగా కౌరవసేన ముందు నిలిచాడు.

దుర్యోధనుడు అర్జునుడిని చూసి ఒక్కడే వచ్చాడని సంబరపడతాడేమోనని భావించి, భీష్ముడు అర్జునుడి పరాక్రమాన్ని గుర్తు చేసి దుర్యోధనుడిని హెచ్చరించాడు. భీష్ముడి కంటే ముందే అర్జునుడిని చూసిన వెంటనే అతడి పరాక్రమం గురించి కృపాచార్యుడు మరొక్కసారి కౌరవసేనకి గుర్తుచేశాడు. అర్జునుడు ఒక్కడే ఇంద్రాది దేవతలను యుద్ధంలో ఓడించి ఖాండవ వనాన్ని దహించాడు. అర్జునుడు ఒక్కడే యాదవ సైన్యాన్ని ఆపి, సుభద్రని తీసుకువచ్చాడు. అర్జునుడు ఒక్కడే నాలుగు దిక్కులూ జయించి కురువంశానికి ఎనలేని ఖ్యాతిని సంపాదించి పెట్టాడు. అర్జునుడు ఒక్కడే చిత్రసేనుడనే గంధర్వరాజును, అతడి సైన్యాన్ని మట్టి కరిపించి, దుర్యోధనుడిని అతడి చెర నుండి విడిపించాడు. అర్జునుడు ఒక్కడే భయంకరమైన యుద్ధం చేసి నివాతకవచులను నాశనం చేశాడు. అర్జునుడు ఒక్కడే దేవతలకి సైతం సాధ్యపడని కాలకేయులనే దానవులను సంహరించాడు. అందుకే, ఇంతటి పరాక్రమం కలిగిన అర్జునుడితో యుద్ధం చేయడం కంటే సంధి చేసుకోవడం మేలు అని భీష్ముడు ప్రతిపాదించాడు. రాజనీతిలో భాగమైన సామదానభేదదండోపాయాలలో మొదటి దానిని ఎంచుకోవడం ఉత్తమమని రాజనీతికోవిదుడైన భీష్ముడు ప్రతిపాదించాడు.

## 2.3.10. ద్రోణాచార్యుల యుద్ధవ్యూహం

భీష్ముడి ప్రతిపాదన దుర్యోధనుడికి రుచించలేదు. అతడు దండోపాయాన్నే ఎంచుకున్నాడు. యుద్ధరంగంలో మహారాజు నిర్ణయమే అంతిమం. దుర్యోధనుడి నిర్ణయానికి అనుగుణంగా ద్రోణాచార్యుడు ఒక కొత్త వ్యూహాన్ని రచించాడు.

వ. అనిన నయ్యిరువుర వచనంబు లాకర్ణించి గురుం డిట్లనుఁ, 'గార్యగతియును గయ్యంబు భంగియు భూపతి కంటె మిగులం గనియెడు వారులే, రయినను నా యెఱింగిన యంత నొక్క తెఱంగు సెప్పెద; నీ బలంబున నాలవ పాలుగొని మహీపాలుండు సత్వరంబుగా ముందర పోవలయు; నంతియసేన తదనంతరంబ కదుపులం బొదివికొని చనవలయుఁ; దక్కటి సగంబుతో మనము నిలిచి మోహరించి యల్లనల్ల నరుగవలయుఁ; గవ్వడి యెయ్యెడం గవిసె నయ్యెడన తలపడ వలయు; నిట్లైన మానవేశ్వరుండు సురక్షితంబుగా సందడింబడక నడచు; గోవులు నిన్నేలం గడచు;

మనమును ధనంజయునకుం జాలిన యప్పుడ యటఁ దోడుపడ నెవ్వరు గలిగినను వారికిం జాలి నిలుత' మనిన, విని, సురనదీసూనుండు దాని కియ్యకొని రాజన్యునకు సైన్యంబుఁ బంచి యిచ్చి, పుచ్చి, పసులకుం దోడగు భాగంబునుం బంచి, యున్నంత వట్టు చతురంగంబుల నియతి సేసికొని, యాచార్యుండు నడుమను, గృపాచార్యుండు వలపటను, నాచార్యపుత్త్రుండు దాపటం, గర్ణుండు ముందట, వికర్ణ దుశ్శాసన శకుని సైంధవ సోమదత్త బాహ్లిక భూరిశ్రవః ప్రభృతి యోధ వీరులెల్ల నెడనెడం గలయ నిలుచునట్లుగా మోహరించి, మహోత్సాహంబున సన్నాహ సౌందర్యంబు నొంది, తాలధ్వజం బెత్తించి, మెఱసి తాను వెనుకయయి నడిపించుచుండె; నట్టి సమయంబున. *(ఆంధ్ర. విరాట. 4: 237).*

'భీష్మ దుర్యోధనుల మాటలను విన్న ద్రోణుడు ఇలా అన్నాడు. 'పనితీరు, యుద్ధవిధానం రాజుకంటే ఎక్కువగా తెలిసినవాళ్లు లేరు. కానీ, నాకు తోచినంతలో ఒక మార్గాన్ని చెబుతాను. మనసైన్యంలో నాలుగో భాగాన్ని తీసుకొని రాజు ముందు నడవాలి. అంతే సేన (అంటే నాలుగోవంతు) ఆవులను చుట్టి తరువాత నడవాలి. తక్కిన సగంతో, మనం ఒక వ్యూహంగా ఏర్పడి పోతూఉందాం. ఎక్కడ అర్జునుడు ఎదిరిస్తే అక్కడే మనమూ ఎదిరిద్దాం. ఇలాగైతే, రాజు ఇబ్బందిపడకుండా ముందుకు పోతాడు. ఆవులూ ఈ నెలవు దాటిపోతాయి.

అర్జునుడిని ఎదిరించడానికి మనం సమర్థులమైనప్పుడే, అతడికి తోడుపడడానికి ఎవరు ఉన్నా, వారిని కూడా ఎదుర్కోవడానికి సామర్థ్యం ఉన్నప్పుడే మనం అందరం కలిసి నిలబడాలి' అని అనగా, భీష్ముడు విని అంగీకరించి, గురుడు చెప్పినట్లు, రాజైన దుర్యోధనునికి నాలుగోవంతు సైన్యాన్నిచ్చి పంపించి, ఆవుల వెంట రక్షణగా ఉండవలసిన నాలుగోవంతు సైన్యాన్నీ పంచి, తక్కిన అర్ధభాగం సైన్యాన్ని, చతురంగ బలాలతో ఉన్నదానిని, ఎక్కడెక్కడ ఉండాలో నియమించి, ఏర్పరచి, మధ్యలో గురుడూ, కుడివైపు కృపుడూ, ఎడంవైపు గురుసుతుడైన అశ్వత్థామ, ముందర కర్ణుడు ఉండగా, వికర్ణుడు, దుశ్శాసనుడు, శకుని, సైంధవుడు, సోమదత్తుడు, బాహ్లికుడు, భూరిశ్రవుడు మొదలైన యోధులందరూ అక్కడక్కడ నిలబడేటట్లుగా వ్యూహాన్ని నిర్మించి, నిలిచి, ఉత్సాహంతో అంతా సిద్ధం చేసి, తన యొక్క తాలధ్వజాన్ని నిలిపి, వీరసౌందర్యమూర్తిగా భీష్ముడు వెనక ఉండి సైన్యాన్ని నడుపుతుండే సమయంలో...'

ద్రోణాచార్యుడు అర్జునుడికి ధనుర్విద్య నేర్పిన గురువు. యుద్ధనీతిలో ప్రావీణ్యుడు. దుర్యోధనుడు భీష్ముడి ప్రతిపాదనని తిరస్కరించాక, మహారాజు అభీష్టం మేరకు ఒక యుద్ధ వ్యూహాన్ని సిద్ధం చేశాడు. అర్జునుడు అసాధారణ పరాక్రమం కలవాడు. అయినా ఒక్కడే ఉన్నాడు. ఒక్క అర్జునుడిని ఎదుర్కోవడానికి మొత్తం కౌరవసేన అప్రమత్తమవ్వడం, స్వయంగా అర్జునుడి గురువైన ద్రోణాచార్యుడే ఇంతటి వ్యూహాన్ని సిద్ధం చేయడం చూస్తే, అర్జునుడు ఎంతటి పరాక్రమ సంపన్నుడో తెలుస్తూనే ఉంది.

ద్రోణాచార్యుడి వ్యూహం ప్రకారం సైన్యాన్ని నాలుగు భాగాలుగా చేసి, నాలుగో వంతు సైన్యంతో దుర్యోధనుడి ముందుకి వెళ్లాలి. మరొక వంతు (నాలుగోవంతు) ఆవులను చుట్టి, తర్వాత నడవాలి. మిగతా సైన్యం (అర్ధభాగం) కురువంశయోధులైన ద్రోణ, కృప, కర్ణ, వికర్ణ, అశ్వత్థామ, దుశ్శాసన, సోమదత్త, శకుని, సైంధవులతో ఒక సమూహంగా ఏర్పడి, అర్జునుడు దాడి చేస్తే, ప్రతిదాడికి సిద్ధంగా ఉంటుంది. ఈ సగభాగాన్ని (సైన్యాన్ని) భీష్ముడు వెనక నుండి పర్యవేక్షిస్తాడు. మొత్తంగా రాజైన దుర్యోధనుడిని సంరక్షించుకునే విధంగా ద్రోణుడు వ్యూహం పన్నాడు. ఇది బయటి నుండి చూసేవారెవ్వరికీ అర్థమవ్వదు.

ద్రోణాచార్యుడు పన్నిన వ్యూహం ప్రకారం, అర్జునుడు ఎలాగో ఒక్కడే ఉన్నాడు కాబట్టి, అతడు గోవులను మత్స్యదేశానికి తరలించాలని చూస్తే, గోవుల చుట్టూ ఉన్న నాలుగోవంతు సైన్యం ప్రతిఘటిస్తుంది. దుర్యోధనుడితో మరొక నాలుగోవంతు సైన్యం ఉండనే ఉంది. సగభాగం సైన్యం భీష్ముడి పర్యవేక్షణలో ఎటువైపు నుండైనా అర్జునుడిపై ప్రతిదాడి చేయడానికి సిద్ధంగా ఉంది. ఈ విధంగా దుర్భేద్యమైన వ్యూహాన్ని ద్రోణాచార్యుడు అమలు చేశాడు.

## 2.3.11. అర్జునుడి ఛేదన

అర్జునుడు దేవదత్తాన్ని పూరించి, మహాభీకరంగా కనిపిస్తున్న కౌరవసేనని సమీపించాడు. అర్జునుడు ఆకారం చూసి కౌరవసేన బెదిరిపోయింది. కానీ, అర్జునుడి గురువైన ద్రోణాచార్యులు ఏర్పరచిన వ్యూహం ఆర్జునుడిని ఆలోచింపజేసింది. అప్పుడు అర్జునుడు కౌరవసేనని రెండు కోసుల దూరం నుండి తల పైకెత్తి చూసి, ఉత్తరుడితో ఈ వ్యూహాన్ని ఛేదించే ఉపాయాన్ని వివరించాడు.

చ. 'ఇది యొక పెద్ద గట్టిమొన; యీ మొనముందట గోగణంబుతో
నది యొక యల్పసైన్య; మట యాతల వేఱొక కొంతసేన య
ల్లదె; యిటు పంచిపెట్టఁ జను నంతటిలోన వృధాభిమాన దు
ర్మద బహుభాషియైన కురురా జెచటం జనుచున్నవాఁడొకో! *(ఆంధ్ర. విరాట. 4: 245).*

'(ఓ ఉత్తరా!) ఇది ఒక పెద్ద బలమైన సైన్యం. దానికి ముందు ఆవులమందతో కొద్దిపాటి సేన నడుస్తున్నది. దానికి అవతల తట్టు ఇంకా కొంత సైన్యం ఉన్నది. ఈ రకంగా భాగాలుగా చేయబడి సాగుతూ ఉండే సేనలలో, మిక్కిలి దురభిమానీ, అధిక ప్రసంగీ, అయిన ఆ సుయోధనుడు ఎక్కడ ఉన్నాడో!'

సైన్యం మొత్తం మహారాజు వెనకే ఉంటే రాజుని ప్రత్యేకించి గుర్తించనవసరం లేదు. అందుకే, ద్రోణాచార్యులు అర్జునుడిని తికమక పెట్టే విధంగా సైన్యాన్ని విభాగాలుగా చేశాడు. ఎవరైతే యుద్ధంలో వ్యూహాన్ని నిర్మించగలరో, వారే వ్యూహంలోకి ప్రవేశించగలుగుతారు. ఇది యుద్ధవిద్యలో ఉండే రహస్యం. అయితే, అర్జునుడు రెండు కోసుల దూరం నుండి సూక్ష్మాన్ని పట్టేశాడు. ఎంతైనా అర్జునుడు ద్రోణుడి ప్రియశిష్యుడు. తనని పెడదోవ పట్టించడానికి ద్రోణుడు పన్నిన వ్యూహంలో అర్జునుడు చిక్కుకోలేదు. ఆ వ్యూహాన్ని నేరుగా ఎదుర్కొని సమయాన్ని వృథా చేయవద్దనుకున్నాడు. వ్యూహాన్ని పరోక్షంగా ఛేదించాలని అనుకున్నాడు. అందుకే, 'ఈ సేనకి ఎడమవైపుగా రథాన్ని పోనీ' అని అర్జునుడు ఉత్తరుడికి సూచించాడు. బాగా ఆలోచించి ద్రోణాచార్యుడి వ్యూహంలో ఉన్న కీలకాన్ని పట్టుకున్నాడు.

'ఒకవేళ రాజైన దుర్యోధనుడు చిక్కితే సైన్యం అంతా విచ్చిపోతుంది. ఆవుల్ని మరలించవచ్చు. వచ్చిన పని తేలికగా అయిపోతుంది. ఇంత పెద్ద సైన్యంలో రాజుని కనుక్కోలేకపోతే, ఈ సైన్యాన్ని వదిలేసి మందను చేరడానికి పోదాం' అని అర్జునుడు వ్యూహానికి పరిష్కారాన్ని సూచించాడు.

ఎదురుగా ఉన్న సైన్యం పెద్దది. కురువంశయోధులు అంతా ఆ సైన్యాన్ని నడిపిస్తున్నారు. కానీ, ఈ సైన్య భాగంలో రాజైన దుర్యోధనుడు లేడు. అందుకే, అర్జునుడు భీష్మ, ద్రోణులకు నమస్కార, కుశల బాణాలు వేసి వారికి కుడి వైపు నుండి దారి ఇచ్చి తాను ఆవులమంద వైపు

సాగిపోయాడు. చాకచక్యంగా తన రథాన్ని గోవులమందకి, సైన్యానికి మధ్య పోనిమ్మని ఉత్తరుడికి సైగ చేసి, ఒకవైపు బాణాలు గుప్పిస్తూ, మరొకవైపు నుండి గోవులను మరలించేశాడు.

గోవులని మరలించాక అర్జునుడు కురువంశయోధులను ఎదుర్కొన్న తీరులో గొప్ప యుక్తి, రాజనీతి, యుద్ధ నీతి కనిపిస్తాయి. గురువైన ద్రోణాచార్యుడి పట్ల ముందే నమస్కార, కుశల బాణాలు వేసిన అర్జునుడు, ద్రోణుడు వేసేవరకు గురువుపై బాణం వేయలేదు. ఉచితంగా నడుచుకున్నాడు. ద్రోణుడికి యుద్ధరంగంలో ఆగ్రహం వస్తే అది అర్జునుడు భరించలేడు. అందుకే, వినయంగా వ్యవహరించి దాటివేశాడు. ద్రోణుడు యుద్ధానికి ఆహ్వానించినప్పుడు మాత్రం తన ప్రతిభని నిరూపించాడు.

క. శంతనునందను నరదము
పొంతం బోవలవ; దలుక పుట్టి యతఁడు భూ
కాంతునకు సైన్యమునకుం
జెంతలఁ జేరంగనీక సిలుగులఁ బెట్టున్.' *(ఆంధ్ర. విరాట. 5: 20).*

'భీష్ముడి రథం ఉన్న ప్రాంతానికి మన రథం పోనీయకుము. అతడికి కోపం వచ్చిందా – మనల్ని దుర్యోధనుడికి గాని, అతడి సైన్యానికి గాని దరిదాపులకు చేరనియ్యడు'.

భీష్ముడు కురువంశపితామహుడు, ఆలోచనలో అగ్రగణ్యుడు, అసమాన శస్త్రాస్త్ర ప్రావీణ్యం కలవాడు, పరశురాముడి శిష్యుడు, అనితరసాధ్యమైన పరాక్రమం, ధర్మనిష్ఠ కలవాడు, ఆయుధ రహస్యాలు బాగా తెలిసినవాడు. అర్జునుడు అతడికి ఆగ్రహం తెప్పిస్తే, కొరివితో తల గోక్కున్నట్టే అవుతుంది. అందుకే, భీష్ముడితో పోరాడి అలిసిపోవడం కంటే అతడికి దూరంగా ఉండడం మంచిదని అర్జునుడు భావించాడు. ఎలాగో భీష్ముడిపై నమస్కార, కుశల బాణాలు వేశాడు కాబట్టి, ఆశీస్సులు ఎలాగో ఉండనే ఉంటాయని అర్జునుడు భావించాడు.

తదనంతరం యుద్ధంలో అర్జునుడు కురువంశయోధులలో తనకి ఎదురైన ప్రతీ వీరుడికీ తన పరాక్రమాన్ని చూపించి, వారిని బలహీనపరచి, కొందరిని పారిపోయేలా చేసి, ముందుకు సాగాడు. చివరికి తాను అనుకున్న విధంగా దుర్యోధనుడిని సమీపించి, భీకరమైన యుద్ధం చేశాడు. అర్జునుడి పరాక్రమానికి తాళలేక దుర్యోధనుడు సైతం యుద్ధరంగంలో వెన్ను చూపాడు. దుర్యోధనుడిపై అర్జునుడు దాడి చేయడం చూసి, భీష్మ, ద్రోణాదులు అర్జునుడి రథాన్ని చుట్టుముట్టారు. అనేకసేనలు

అర్జునుడిపై దండెత్తాయి. అర్జునుడు ఒక్కడే వీరుడిలా ఇంతమందినీ ఎదుర్కొన్నాడు. ఇంతలో అర్జునుడికి భీముడి ప్రతిజ్ఞ (దుర్యోధనుడి తొడలు పగిలేలా చంపుతాను) గుర్తు వచ్చింది. అందుకే, ఉపాయాన్ని ఆలోచించి, కౌరవులను సపరివారంగా అవమానించాలని భావించి, తనకి వరంగా సిద్ధించిన సమ్మోహనాస్త్రాన్ని సంధించాడు. ఇంద్రుడు ఆ అస్త్రానికి దేవత. ప్రయోగిస్తే విఫలం కాని దివ్యాస్త్రమది.  ఈ విధంగా అర్జునుడు తన శక్తితో, యుక్తితో, రాజనీతిజ్ఞతతో, యుద్ధనీతితో, వినయంతో కౌరవసేనని ఎదుర్కొని లక్ష్యాన్ని సాధించాడు. కార్యసాధకుడు అనిపించుకున్నాడు.

## 2.4. ఆంధ్ర మహాభారతం: సాంస్కృతికాంశాలు

సంస్కృతికి సంబంధించిన అంశాలే సాంస్కృతిక అంశాలు. వ్యక్తి విషయంలో సంస్కారం అని దేన్ని అంటారో, దాన్నే సమాజం విషయంలో సంస్కృతి అంటారు. వ్యక్తికి బహువచనమే సమాజం. ఈ సంస్కృతి వారి వారి కులాచారాలను బట్టీ, మాతాచారాలను బట్టీ, ప్రాంతీయాచారాలను బట్టీ వేరు వేరుగా ఉంటుంది. వ్యక్తులుగా, సమూహాలుగా ప్రజలు వివిధ సంస్కారాలు కలిగి ఉన్నప్పటికీ మొత్తం జాతికి వర్తించే సంస్కృతి కూడా ఉంటుంది. వ్యక్తి సంస్కారం, సమాజ సంస్కృతికి పునాది అవుతుంది. మళ్లీ సమాజ సంస్కృతి వ్యక్తి సంస్కారాన్ని నిర్ణయిస్తుంది కూడా. ఈ పరస్పర ప్రభావాలు, మహాభారత కాలం నాటి పాత్రల వృత్తులలో, ప్రవృత్తులలో కనపడతాయి.

ఉదాహరణకి, అజ్ఞాతవాసంలో భీముడు విరాట రాజు కొలువులో వంటవాడిగా చేరాలని ప్రయత్నించినప్పుడు, తనని తాను పరిచయం చేసుకుంటూ 'దేవా! నాలవ జాతివాడ' అంటాడు. అలా చెప్పుకోకపోతే వంటవాడి ఉద్యోగం అతడికి ఇవ్వరు. ఆరోజుల్లో నాల్గవ జాతివారు రాజ మందిరాల్లో వంట చేసేవారు. అయితే, ధర్మరాజు తమ్ముడిగా భీముడు అబద్ధమాడడానికి ఇష్టపడే మనిషి కాదు. అందుకే, ఆయన తాను క్షత్రియుడై ఉండి నాల్గవ జాతి వాడినని చెప్పి, ఆత్మవంచన చేసుకోవలసిన పరిస్థితి రాకుండా పంచ భూతాలలో నాల్గవది అయిన వాయువు కుమారుడినని నిజమే చెప్పినట్లు అయ్యింది. ఒక పక్క సమాజం ప్రభావం, మరో పక్క సత్యప్రభావం భీముడిపై పనిచేశాయి. అందువల్ల భారత కాలం నాటి సామాజికాంశాల పరిశీలనలో ఇటువంటి సాంస్కృతిక అంశాలు ఎన్నింటినో విశ్లేషించవలసి ఉంటుంది.

సంస్కృతి అనేది ఆచారవ్యవహారాలు, కట్టుబాట్లు, పండుగలు, పబ్బాలు, వేడుకలు, వేషధారణ, ఆహారవిహారాదులు ఇలా ఎన్నో అంశాల సమాహారం. అయితే, ఆంధ్ర మహాభారతం ఆధారంగా భారత కాలం నాటి ఆచార వ్యవహారాలు, వేషధారణ, ఆహార విహారాదుల మొదలైన అంశాలపై చాలా పరిశోధనల్లో విపులంగా చర్చించబడింది. అందుకే, పునరావృత్తి కాకుండా, భారత కాలం నాటి మరికొన్ని సాంస్కృతిక విశేషాలను, వినూత్నమైన దృష్టితో పరిశీలించి, ఈ అధ్యాయంలో (ఉపవిభాగంలో) చర్చిస్తున్నాను.

## 2.4.1. ఇంద్రోత్సవం

నన్నయ రచించిన ఆదిపర్వంలో ఉపరిచరవసుమహారాజు వృత్తాంతం వర్ణించబడింది. ఆ వృత్తాంతంలో భాగంగా అప్పట్లో మహారాజులు సంప్రదాయంగా జరిపిన ఇంద్రోత్సవాన్ని గురించి, దాని ప్రారంభ సంప్రదాయం గురించి వివరించబడింది.

చేది దేశానికి ప్రభువు వసువు. అతడు దేవేంద్రతుల్యుడు. గొప్ప ధర్మనిష్ఠ కలవాడు. ఒకరోజు ఒక మున్యాశ్రమాన్ని దర్శించిన సందర్భంలో అతడికి నిర్వేదం కలిగి తపస్సులో నిమగ్నమైపోయాడు. అతడి దీక్షకి మెచ్చి ఇంద్రుడు దర్శనమిచ్చాడు.

వ. 'నీవర్ణధర్మప్రతిపాలనంబునకుఁ దపంబునకు మెచ్చితి; నీవు నాతోడం జెలిమిసేసి నాయొద్దకువచ్చుచుంబోవుచు మహీరాజ్యంబు సేయుచు నుండు' మని వానికి దేవత్వంబును గనకరత్నమయం బైన దివ్యవిమానంబును నెద్దాని నేని తాల్చిన నాయుధంబులు దాఁక నోడు నట్టి వాడని వనజంబులు గలిగిన యింద్రమాల యను కమలమాలికయును, దుష్టనిగ్రహశిష్టపరిపాలనక్షమం బైన యొక్కవేణుయష్టియు నిచ్చిన, నవ్వసువును దద్విమానారూఢుం డై యుపరిలోకంబునం జరించుటంజేసి యుపరిచరుండు నాఁ బరఁగి, యక్కమల మాలికయుఁ దనకుం జిహ్నంబుగా నవ్వేణుయష్టికి మహావిభవంబు సేయుచు, మెఱసి యేఁటేఁట నింద్రోత్సవం బను నుత్సవంబు సేయుచు నీశ్వరునకు నింద్రాదిదేవతలకు నతిప్రీతి సేసె; నది మొదలుగా రాజులెల్లం బ్రతిసంవత్సరంబు నింద్రోత్సవంబు సేయుచుండుదురు. *(ఆంధ్ర. ఆది. 3: 24)*

క. ఘనముగ నయ్యింద్రోత్సవ
మొనరించు మహీపతులకు నొగి నాయుర్వ
ర్ధనము నగుఁ, బెరుఁగు సంతతి,
యనవరతము ధరణిఁ బ్రజకు నభివృద్ధి యగున్. *(ఆంధ్ర. ఆది. 3: 25)*

'నీ వర్ణాశ్రమధర్మపరిపాలనకు, తపస్సుకు మెచ్చుకుంటున్నాను. నీవు నాతో స్నేహం చేసి నావద్దకు వస్తూ పోతూ రాజ్యపాలనం చేస్తూ ఉండు'మని పలికి అతనికి దివ్యత్వాన్నీ, మణిమయమైన దివ్య విమానాన్నీ, ఎటువంటి ఆయుధాలను తాకనివ్వని వాడిపోని పద్మాలు కల ఇంద్రమాల అనే పద్మాలనూ, దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు సమర్థమైన వేణుయష్టినీ ఇచ్చాడు. ఆ వసురాజు ఆ విమానాన్ని ఎక్కి పైలోకంలో చరిస్తుండడం చేత ఉపరిచరుడు, అనే పేరుతో ఒప్పి, ఆ ఇంద్రమాలిక తనకు గుర్తుగా, వేణుయష్టికి గొప్ప వైభవంతో ఏటేటా ఇంద్రోత్సవాన్ని జరిపిస్తూ ఈశ్వరుడికి, ఇంద్రాది దేవతలకు సంతోషాన్ని చేకూర్చాడు. నాటి నుండి రాజులందరూ ప్రతీ సంవత్సరం ఇంద్రోత్సవాన్ని జరుపుతున్నారు.

ఆ ఇంద్రోత్సవాన్ని వైభవంగా చేసే రాజులకు ఆయువు పెరుగుతుంది; సంతతి వృద్ధి చెందుతుంది. అతని రాజ్యంలో ప్రజలకు ఎల్లప్పుడూ అభివృద్ధి జరుగుతుంది'.

ఉపరిచరవసువు గొప్ప ధర్మనిష్ఠ, సత్యనిష్ఠ కలిగిన మహారాజు. వర్ణాశ్రమధర్మాలను సంరక్షిస్తూ ప్రజలను కన్నబిడ్డల్లా చూసుకునేవాడు. ఈ లక్షణాలకి, అతడి తపస్సుకీ మెచ్చి ఇంద్రుడు ఎన్నో వరాలు ఇచ్చాడు. ఇంద్రోత్సవానికి ప్రసన్నుడైన ఇంద్రుడు వసువుకి బృహద్రథుడు, మణివాహనుడు, సౌబలుడు, యదువు, రాజన్యుడు అనే ఐదుగురు కుమారులను వరంగా ప్రసాదించాడు. వారు అనేక దేశాలకు అధిపతులయ్యారు. వంశం వృద్ధి చెందింది. అప్పటి నుండి మహారాజులంతా ఏటేటా ఈ ఇంద్రోత్సవాన్ని సంబరంగా జరిపేవారని, అది తదనంతర కాలంలో సంప్రదాయంగా స్థిరపడిందని ఈ కథ ద్వారా తెలుస్తోంది.

## 2.4.2. కౌముది ఉత్సవం

నన్నయ రచించిన ఆదిపర్వంలో వివరించబడిన సుందోపసుందుల కథలో మహాభారత కాలం నాటి ఉత్సవం ఒక దాని గురించి ప్రస్తావన వచ్చింది. ఆ ఉత్సవం పేరు 'కౌముది'. లోకాన్ని జయించి, అజేయులుగా నిలిచిపోవాలనే కోరికతో ఈ ఉత్సవాన్ని చేసేవారు. 'ఈ ఉత్సవాన్ని ఆశ్వయుజ పౌర్ణమి నాడు లేదా కార్తీక పౌర్ణమి నాడు జరుపుతారు' (ఆంధ్ర. ఆది. 8. పుట: 807).

క. అనుపమరాజ్యవిభూతిం
దనరి జగద్విజయకాంక్ష దైత్యులకు ముదం
బొనరఁగ నకాలకౌముది
యను నుత్సవ మొప్పఁ జేసి రగణితబలు లై. *(ఆంధ్ర. ఆది. 8: 99)*

'సాటిలేని రాజ్యవైభవంతో వెలిగి, లోకాన్ని జయించాలనే కోరికతో, రాక్షసులకు ఆనందం కలిగేటట్లు అకాలకౌముది అనే ఉత్సవాన్ని చేసి, లెక్కింప సాధ్యంకానంత బలం కలవారయ్యారు'.

సుందోపసుందులకు బ్రహ్మదేవుడు 'చావు లేకుండడం' అనే వరం తప్ప తక్కినవాటినన్నింటినీ అనుగ్రహించాడు. ఆ విధంగా వాళ్లు బ్రహ్మ వల్ల వరాలు పొంది చెలరేగిపోయారు. ఆనందంతో 'కౌముది' ఉత్సవాన్ని చేశారు. అయితే, కౌముది ఉత్సవాన్ని ఆశ్వయుజ పౌర్ణమి నాడు లేదా కార్తీక పౌర్ణమి నాడు చేయాలి. సుందోపసుందులు ఆ ఉత్సవాన్ని ఇతరకాలంలో చేయడం వల్ల వారిరువురూ చేసిన ఉత్సవానికి 'అకాలకౌముది ఉత్సవం' అని పేరు వచ్చింది.

## 2.4.3. వివాహ సంప్రదాయం

ఆంధ్ర మహాభారతంలో వివాహ సంప్రదాయం గురించి చాలా సందర్భాల్లో ప్రస్తావన కనిపిస్తుంది. ఆ కాలంలో వివాహాలు జరిగిన పద్ధతి, ఆ సందర్భంలో వారి వేషధారణ, అరణం ఇచ్చుకునే సంప్రదాయం మొదలైన విశేషాలను కవిత్రయం ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా వర్ణించారు. ముగ్గురూ మూలవిధేయంగానే వర్ణించినప్పటికీ, వారి వారి కాలాల (శతాబ్దాల)లోని సంప్రదాయాలను వివాహ సందర్భంలో ప్రతిబింబింప చేశారు.

## 2.4.3.1. యయాతి కథ

నన్నయ రచించిన ఆదిపర్వంలో వర్ణించబడిన యయాతి కథలో భాగంగా మహాభారత కాలానికి వివాహ సంప్రదాయంలో ఉన్న ఒక ఆచారం గురించి ప్రస్తావించబడింది. శుక్రాచార్యుడి కుమార్తె అయిన దేవయాని యయాతి మహారాజుని చూసి మనసుపడుతుంది. యయాతి మాత్రం శర్మిష్ఠని చూసి మోహితుడౌతాడు. కానీ, దేవయానిని నూతిలో నుండి రక్షించే క్రమంలో అతడి కుడిచేతితో ఆమె కుడిముంజేతిని గ్రహించాడు. అందువల్ల పాణిగ్రహణం అయినట్టేనని దేవయాని మనోధర్మాన్ని ప్రతిపాదించింది. తద్వారా శర్మిష్ఠకి దక్కవలసిన అవకాశాన్ని తాను గ్రహించింది దేవయాని. అయితే, దేవయాని ప్రతిపాదనని అప్పటి ఆచార సంప్రదాయాలను ఉటంకించి సున్నితంగా తిరస్కరించే ప్రయత్నం చేస్తాడు యయాతి.

వ. 'క్షత్త్రియకన్యకల బ్రాహ్మణులు వివాహం బగుదురు గాక; యధర్మోత్తరంబుగా క్షత్త్రియులు బ్రాహ్మణకన్యకల వివాహం బగుదురే? నీపలుకులు ధర్మ విరుద్ధంబులు; మఱియు సర్వవర్ణాశ్రమధర్మంబులు సంకరంబులు గాకుండ రక్షించుచున్న యేన యిట్టి యధర్మంబున కొడంబడితినేని జగత్ప్రవృత్తి విపరీతం బగు' ననిన నయ్యయాతికి దేవయాని యి ట్లనియె. *(ఆంధ్ర. ఆది. 3: 162)*

'క్షత్రియుల కూతుళ్లను బ్రాహ్మణులు పెళ్లాడుతారు. కానీ, అధర్మం మీదిదయ్యేటట్లుగా క్షత్రియులు విప్రులకూతుళ్లను పెళ్లాడతారా? నీ మాటలు ధర్మానికి వ్యతిరిక్తాలు. అదిగాక అన్నివర్ణాలయొక్క ఆశ్రమాల యొక్క ధర్మాలు సంకీర్ణాలు కాకుండా కాపాడుతున్న రాజునైన నేనే ఇటువంటి అధర్మానికి అంగీకరిస్తే లోకవ్యాపారం వ్యత్యస్తమైపోతుంది' అని పలుకగా యయాతికి దేవయాని ఇట్లన్నది'.

మహాభారత కాలం నాటికి క్షత్రియుల కూతుళ్లను బ్రాహ్మణులు పెళ్లాడే సంప్రదాయం ఉన్నట్టుగా యయాతి మాటల ద్వారా స్పష్టమయ్యింది. ఇదే సందర్భంలో, మనోధర్మం వివాహం విషయంలో అన్నింటికంటే ప్రధానమైనదని తెలుస్తోంది. ఒక మహారాజుగా వర్ణాశ్రమధర్మాలను కట్టు తప్పకుండా పరిపాలించవలసిన బాధ్యత యయాతిపై ఉంది. అందుకే, తాను ఆ ధర్మానికి కట్టుబడి

ఉంటానని దేవయానికి స్పష్టం చేశాడు. అయితే, శాస్త్ర ప్రమాణం కోసం రాక్షసుల ఆచార్యుడైన తన తండ్రి శుక్రాచార్యుడి సమ్మతి స్వీకరిద్దామని దేవయాని ప్రతిపాదించడంతో యయాతికి వేరే మార్గం లేకపోయింది.

## 2.4.3.2. ప్రతీపుడి కథ

భరతకులంలో పుట్టి వీరుడైన ప్రతీపుడు సమస్త రాజ్యభోగాలను తనివితీరా అనుభవించి ధర్మపరుడై దీక్షపట్టి గొప్ప తపస్సు చేశాడు. అటువంటి ప్రతీపుడికి ఒకరోజు గంగాదేవి ప్రత్యక్షమై అతడిని చూసి మోహించి, ప్రతీపుడి కుడితోడపై కూర్చుంది. ఆశ్చర్యంతో ప్రతీపుడు గంగాదేవి చర్యకి కారణమడగగా తన మనస్సులో ఉన్న మాట చెప్పింది. అప్పుడు ప్రతీపుడు చెప్పిన సమాధానం నేటికీ అత్యంత ప్రామాణికంగా స్థిరపడిన ఒక ఆచారాన్ని వివరించింది.

వ. 'మఱి యదియునుంగాక స్త్రీభాగం బయిన డాపలికుఱువెక్కక పురుషభాగంబై పుత్త్రారోహణ యోగ్యం బైన నావలపలికుఱు వెక్కితిగావున నాపుత్త్రునకు భార్య వగు' మనిన నదియునట్ల చేయుదునని యదృశ్యయయ్యె; నంతం బ్రతీపుఁడును బుత్త్రార్థియై సకలతీర్థంబులయందు సునందాదేవియుం దాను వేదవిహితవ్రతంబులు సలుపుచుఁ బెద్దకాలంబు దపంబు సేసిన. *(ఆంధ్ర. ఆది. 4: 139).*

"అంతేకాకుండా నీవు స్త్రీలు కూర్చుండేవైపు ఎడమతొడపై ఎక్కకుండా, పురుషులు కూర్చుండేవైపైనది, పుత్రులు ఎక్కదగినది అయిన కుడితొడపై ఎక్కావు కాబట్టి నాకొడుకు ఇల్లాలివగుము' అనగా, ఆమె అట్లే చేస్తానని చెప్పి మాయమైపోయింది. ఆ తర్వాత ప్రతీపుడు పుత్త్రుడి కోసం సహధర్మచారిణియైన సునందాదేవితో కూడి సమస్త పుణ్యతీర్థాలలోను వేదధర్మోచితమైన వ్రతాలను నిర్వహిస్తూ చాలాకాలం తపస్సు చేసింది'.

ప్రతీపుడు గంగాదేవి అతడిని సమీపించిన సమయానికే వివాహితుడు. అగ్ని సాక్షిగా పెళ్లాడిన భార్యని తప్ప వేరొకరిని పెళ్లి చేసుకోనని గంగాదేవికి స్పష్టం చేశాడు. ఆ పైన ఇక్కడ పేర్కొనబడిన ఆచారాన్ని సమర్థనగా ప్రతిపాదించాడు.

సనాతన ధర్మం ప్రకారం భార్య ఎప్పుడూ భర్తకి ఎడమవైపున ఉండాలి. కుడివైపు తల్లి, సోదరి వంటి వారికి స్థానం. అందుకే వివాహ సందర్భంలో సైతం సనాతన ధర్మాన్ని అనుసరించి భార్య

భర్తకి ఎడమవైపునే కూర్చోవాలి. అనాదిగా వస్తున్న ఈ ఆచారాన్ని నేటికీ అనుసరించడం గమనించవచ్చు.

## 2.4.3.3. తపతీసంవరణోపాఖ్యానం

నన్నయ రచించిన ఆదిపర్వంలో వర్ణించబడిన ఒక చక్కటి కథ తపతీసంవరణోపాఖ్యానం. సంవరణుడు వేటకి వెళ్లిన సందర్భంలో ఒక ప్రాంతంలో సూర్యుడి కుమార్తె అయిన తపతి అనే పేరుకల దేవకన్యని చూసి మనసుపడతాడు. తన మనస్సులో ఉన్న విషయాన్ని ఆమెకి వ్యక్తం చేస్తాడు. సంవరణుడు ఆమెపై ఉప్పొంగుతున్న ప్రేమతో, గాంధర్వ వివాహ ప్రతిపాదన చేస్తాడు.

వ. 'నన్ను గాంధర్వవివాహంబున వరియింపు' మనిన సంవరణునకుఁ దపతి యి ట్లనియె. *(ఆంధ్ర. ఆది. 7: 80).*

సంవరణుడు సూర్యుడి కుమార్తె అయిన తపతికి గాంధర్వ వివాహ ప్రతిపాదన చేసిన సందర్భంగా, ఆ వివాహ నియమాన్ని ఇక్కడ ప్రస్తావించారు.

"గాంధర్వ వివాహం – వధూవరులు పరస్పరం ప్రేమించుకుని పెద్దలతో అవసరం లేకుండా రహస్యంగా, ఆమంత్రకంగా చేసుకునే వివాహం. వివాహాలు ఎనిమిది విధాలు. 1. బ్రాహ్మం 2. దైవం 3. ఆర్షం 4. ప్రాజాపత్యం 5. రాక్షసం 6. ఆసురం 7. గాంధర్వం 8. పైశాచం" *(ఆంధ్ర. ఆది. 7. పుట: 679)*

నన్నయ రచించిన శకుంతలోపాఖ్యాన ఘట్టంలో సైతం గాంధర్వ వివాహ ప్రస్తావన కనిపిస్తుంది. దుష్యంతుడు కూడా శకుంతలకి గాంధర్వ వివాహ ప్రతిపాదన చేశాడు.

'అష్టవిధ వివాహాలలో మొదటి నాలుగూ బ్రాహ్మణులకు ఉచితమైనవి. గాంధర్వరాక్షస వివాహాలు క్షత్రియులకు, ఆసురం వైశ్యసూద్రాదులకు యోగ్యమైనవి. పైశాచికం ఎవరూ అనుసరించదగినది కాదు అని శాస్త్రాలు చెబుతున్నాయి.

తిక్కన ఆనుశాసనిక పర్వంలో (2 – 226) బ్రాహ్మ, క్షాత్ర, గాంధర్వ, రాక్షస, ఆసుర వివాహాలను ఐదింటిని పేర్కొన్నాడు. ఇందులో క్షాత్రం కొత్తది. ఒకరినొకరు వలచినారని తెలుసుకుని

పెద్దలు వధూవరులకు చేసే వివాహం క్షాత్రం. ఇది సంస్కృత భారతంలోనే ప్రస్తావించబడి ఉన్నది. (సం. మ. భా. అను. 44: 9). దాన్ని తిక్కన యథాతథంగా గ్రహించాడు. అయితే రాక్షస, ఆసుర వివాహాలు ధర్మదూషితాలని పేర్కొన్నాడు' *(ఆంధ్ర. ఆది. 4. పుట: 332).*

## 2.4.3.4. ద్రౌపది వివాహమహోత్సవం

నన్నయ రచించిన ఆదిపర్వంలో ద్రౌపది వివాహం పాండవులతో జరిగిన విధానాన్ని కళ్లకి కట్టినట్టు వివరించారు. చంద్రుడు రోహిణీ నక్షత్రంలో ఉన్న సమయంలో మంత్రయుక్తంగా ద్రౌపది వివాహం జరిగింది.

వ. అని నిశ్చయించి పంచినం బాంచాలపతియును గరం బనురాగంబునఁ బురం బప్టశోభనంబు సేయించి, సమారబ్ధవివాహమహోత్సవుం డయ్యె; నంత నిరంతర క్రముకకదళీస్తంభ శుంభత్సంభృత నవామ్రాశ్వత్థ పల్లవ మాలాలంకృత ద్వారతోరణంబులను, జందనోదక సంస్తిక ప్రాంగణ రంగవల్లీ కృత కర్పూరమౌక్తిక ప్రకరంబులను, గౌతుకోత్సవమంగళశృంగార వారాంగనా ప్రవర్త్యమాన స్వనియోగకృత్యంబులను, నుత్సవ సందర్శనాగతానేకరాజన్య సుహృద్బాంధవబ్రాహ్మణ సంకులంబుననుం జేసి యొప్పుచున్న ద్రుపదరాజ మందిరంబునం బూర్వోత్తర దిగ్భాగంబున విచిత్రనేత్ర వితత వితాన ముక్త మౌక్తిక కుసుమ మాలాలంబనాభిరామంబును, సమీచీన చీనాంశుక విరచితస్తంభ వేష్టనంబును, బ్రత్యగ్ర పల్లవ శాల్యక్షతాంచిత కాంచన పూర్ణ కలశోపశోభితంబును, లాజాజ్య సంపూర్ణ సౌవర్ణ పాత్ర నవసౌరభ బహువిధపుష్ప సమిత్కుశాశ్మశమ్యాభిరమ్యంబును, నవగోమయ శ్యామ మరకత మణి ప్రభాపటల విలిప్త హిరణ్మయవేదీమధ్యసమిద్ధాగ్నికుండమండితంబును, సర్వాలంకారసుందరంబును నయిన వివాహ మంటపంబునకుం జని నిజ పురోహితుం డయిన ధౌమ్యుం డాదిగా ననేకవిద్వన్మహీసుర నివహంబుతోఁ గరం బొప్పి. *(ఆంధ్ర. ఆది. 7: 283).*

'అని నిర్ణయించి వ్యాసమహర్షి ఆజ్ఞాపించగా, ద్రుపదరాజు కూడా మిక్కిలి ప్రీతితో పురానికి ఎనిమిది విధాలైన మంగళాలంకారాలు చేయించి వివాహమహోత్సవాన్ని చక్కగా ప్రారంభించాడు. అప్పుడు ఎడతెగని పోక, అరటి స్తంభాలతో నిండుగా ధరించిన క్రొత్త మామిడి, రావి చివుళ్ల దండలతో

అలంకరించబడిన లోపలి వెలుపల ద్వారాలతోను, మంచిగంధపు నీటితో చక్కగా తడుపబడిన ముంగిళ్లలో ముగ్గులుగా చేయబడిన పచ్చకర్పూరాల, ముత్యాల సమూహాలతో, వివాహమహోత్సవం కొరకు కావించుకున్న మంగళాలంకారాలు కల వేశ్యలు చేస్తున్న నియమిత కార్యాలతో, వివాహమహోత్సవం చూడవచ్చిన పెక్కుమంది రాజులతో, మిత్రులతో, బంధువులతో, బ్రాహ్మణులతో కిక్కిరిసి శోభిల్లుతున్న ద్రుపదుని ఇంట్లో – ఈశాన్య దిక్కున – రంగు రంగుల వస్త్రాలతో నిర్మించబడిన విశాలమైన మేల్కట్లనుండి క్రిందికి విడువబడిన ముత్యాల పూలదండలు వ్రేలాడడం చేత మనోహరమైనది, చక్కని పట్టు వస్త్రాలతో కల్పింపబడిన స్తంభపుచుట్లు కలది, క్రొత్తచివుళ్లతో, బియ్యపు అక్షతలతో ఒప్పుతున్న బంగారుపూర్ణకలశాలతో ప్రకాశిస్తున్నది, పేలాలతో నేతితో నిండిన బంగారు పాత్రలతో, క్రొత్త వాసనలతో కూడిన పెక్కు విధాలైన పువ్వులతో సమిధలతో, దర్భలతో, సన్నెకల్లుతో, యజ్ఞపాత్రలతో మనోహరమైనది, అప్పుడే పెట్టిన ఆవుపేడవలె నల్లని మరకత మణుల కాంతి సమూహంతో అలుకబడిన బంగారు వివాహ వేదిక నడుమ మండుతున్న హోమకుండం చేత అలంకరింపబడినది, అన్ని అలంకారాలతో అందమైనది అయిన కల్యాణ మంటపానికి వెళ్లి, తమ పురోహితుడైన ధౌమ్యుడు మొదలైన పెక్కు మంది పండిత బ్రాహ్మణసమూహంతో మిక్కిలి ఒప్పి'.

పాండవులతో ద్రౌపదికి జరిగిన వివాహాన్ని ఇంత వివరంగా వర్ణించారు నన్నయ. ఈ వర్ణన బట్టే, మహాభారత కాలం నాటికి, రాజవంశాలలో వివాహం జరిగే పద్ధతి, అందు నిమిత్తం చేసే ఏర్పాట్లు ఎలా ఉండేవో గమనించవచ్చు. వివాహం నిమిత్తం ఉపయోగించిన సామాగ్రి గురించిన సమగ్రమైన సమాచారం ఈ వచనంలో లభిస్తోంది. ముఖ్యంగా వివాహ నిమిత్తం ఉపయోగించిన సామాగ్రి అంతా ప్రకృతివనరుల నుండి మాత్రమే స్వీకరించబడింది. ఆ కాలంలో వివాహం రాజవంశీకులదైనా, సాధారణ ప్రజానీకానిదైనా వివాహంలో ఏ సందర్భంలోనైనా ప్రకృతికి హాని చేసే వస్తువులని వినియోగించలేదు. అరటి, రావి, మామిడి మొదలైన చెట్ల ఉత్పత్తులను వివాహంలో వినియోగించారు. ద్రౌపది వివాహం అంగరంగవైభవంగా, పర్యావరణహితంగా, అతిథులు అచ్చెరువొందేలా జరిగింది.

## 2.4.3.5. ఉతరాభిమన్యుల వివాహం

తిక్కన రచించిన విరాట పర్వంలో ఉత్తరాభిమన్యుల వివాహం అత్యంత హృద్యంగా వర్ణించబడింది. తిక్కన తనకి సహజంగా ఉన్న తెలుగు భాషాభిమానాన్ని ఈ సందర్భంగా చాటుకున్నాడు. ఈ వివాహ వర్ణనలో తెలుగు సువాసనలు కనిపిస్తాయి.

వ. ఇట్లు వైవాహిక వర్తన సంవిధాన సావధానుం డగు మత్స్యమహీనాథుండు మౌహూర్తికాది శిష్టజనులు పరివేష్టింప నుండి 'లగ్నం బాసన్నం బగుచు వచ్చె' నని ధర్మతనయున కెఱింగింపం బనిచిన, నతండు ననుజతనుజసహితంబుగా నలంకృతుండై, వివిధ ప్రసాధన శోభితులగు సమస్తబంధు జనంబులం గూర్చికొని యభిమన్యునకు శృంగారంబు సేయించి భద్రగజారూఢుం జేసికొని యేనుంగులం బేరుగలవారువంబులను మట్టపుదట్టంబు సేసికొని పుణ్యాంగనా జనంబులతోడం గూడి, మణిగణంబులు నంబర నికరంబులు పుష్పపుంజంబులు ఫలప్రచయంబులు లోనుగాఁ గల యోగ్యవస్తువుల విస్తరిల్లిన క్రంత నడవ మంగళతూర్య నాదంబులు విప్రాశీర్వాదంబులు మాగధ గానంబులు వందిజన వాక్య సంతానంబులుఁ జెలంగ వాసుదేవ పురస్సరంబుగా విరాటుమందిరంబున కేతెంచి శంఖజయ ఘంటా పణవాది నిక్వణంబులతోడ నెదుర్కొని చల్లుసేసలు గైకొనుచుం జొత్తెంచిన. *(ఆంధ్ర. విరాట. 5: 389).*

'ఈ విధంగా విరాటరాజు వివాహానికి కావాలసిన వస్తువులను సేకరించడానికి మొదలైన పనులలో శ్రద్ధగా ఉండి జ్యోతిష్కులు మొదలైన శిష్టులు చుట్టూరా ఉండగా, లగ్నం సమీపిస్తున్నది రమ్మని కబురంపగా ధర్మరాజు తమ్ములు అలంకరించుకొని, అభిమన్యుడిని అలంకరింపజేసి, బంధువులంతా అలంకరించుకొని కలిసి రాగా, అభిమన్యుడిని భద్రగజంపై కూర్చోబెట్టి, ఏనుగులను గుర్రాలను పరిమితంగా వెంటబెట్టుకొని, పుణ్యాంగనలసమూహం వెంట రాగా, మణులు, వస్త్రాలు, పండ్లు, మొదలైన వస్తువుల్ని వెంటబెట్టుకుని, ఆ సారెముందు శ్రీకృష్ణుడు నడుస్తూ ఉండగా మంగళవాద్య ధ్వనులు, బ్రాహ్మణుల యొక్క ఆశీర్వాదాలు, వంది మాగధుల జయ జయ ధ్వనులు, స్తుతి పాఠాలు హోరెత్తగా విరాటుడి మందిరానికి వచ్చారు. ఇక్కడ శంఖాలు, జయ గంటలు, పణవం మొదలైనవి సేసలు అక్షతలు చల్లుతూ పెళ్లివారు ఎదురు వచ్చారు. రాజోచిత సంప్రదాయంతో, విప్రులూ వృద్ధులూ పుణ్యక్రియా కలాపం నిర్వర్తించగా, కృష్ణుడు, ధర్మరాజు, అర్జునుడు, విరాటుడి తెర దగ్గర వధూవరులను నిలిపారు'.

తెలుగువారి వివాహ సంప్రదాయాన్ని తిక్కన గారు చక్కగా ఇక్కడ బంధించారు. తెలుగు వారి వివాహ సంప్రదాయంలో మర్యాదలు ఎక్కువే. మగపెళ్లివారు విడిదిలో ఉంటారు. ముహూర్త పత్రికను/ లగ్న పత్రికను కన్యాదాత పెళ్లికొడుకు తండ్రికి లేదా వారి ఇంటి పెద్దకి సవినయంగా పంపుతాడు. దాన్ని ఆహ్వానంగా భావించి, మగపెళ్లివారు బృందంగా బయలుదేరి వస్తారు. ఇది తెలుగు నాట ప్రతీ పెళ్లిలో కనిపించే సంప్రదాయం. విరాట మహారాజు అదే పద్ధతిని అనుసరించినట్టుగా తిక్కన వర్ణించారు. తెలుగు నాట పెళ్లిళ్లలో ప్రసిద్ధమైన మంగళవాద్యాల ధ్వని ఈ వర్ణనలో సైతం వినిపించింది.

తెలుగు వారి వివాహ సంప్రదాయంలో తెర పట్టడం, జీలకర్రాబెల్లం పెట్టడం విశిష్ట ఆచారాలు. 'వధూవరులు వివాహంలో మొదట స్పర్శనం, ఆ తరువాత దర్శనం చేయాలని ఆచారం. వారిరువురి బ్రహ్మరంధ్రస్థానాలను జీలకర్ర బెల్లంతో కలిపిన మంగళద్రవ్యంతో స్పృశిస్తారు. అది సజాతీయ స్పర్శగా వారి తనువులకు జీవితాంతం సుఖాన్ని కలిగించే ఉత్తేజాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తుంది. ఈ కార్యం జరిగేటప్పుడు తెర అడ్డంగా ఉంటుంది. ఆ తెర పట్టేవారు పెద్దవారు' *(ఆంధ్ర. విరాట. 5. పుట: 713)*. తిక్కన జీలకర్రా బెల్లం పెట్టించలేదు కానీ, పెద్దవారి చేత తెర పట్టించాడు. మొత్తంగా మగపెళ్లివారి వైభవం, రాజసం తిక్కన కవిత్వంలో ఆవిష్కృతమయ్యాయి.

## 2.4.4. కుమారాస్త్రవిద్యాసందర్శనము

ద్రోణాచార్యుడు కౌరవులకీ, పాండవులకీ సమానంగా విద్యాభ్యాసం చేయించారు. ముఖ్యంగా అస్త్ర, శస్త్రవిద్యలలో ప్రత్యేక శిక్షణనిచ్చారు. కురువంశయోధులైన భీష్మ, ధృతరాష్ట్ర, పాండురాజుల ముందు వారి అస్త్రవిద్యా ప్రావీణ్యాన్ని ప్రదర్శించాలని ద్రోణాచార్యులు నిర్ణయించారు. ఆ సమయంలో అదొక ఉత్సవంలా జరిగింది. హస్తినాపుర ప్రజలు కురుకుమారుల శాస్త్రాస్త్ర ప్రావీణ్యాన్ని వీక్షించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు.

వ. అనిన నట్ల చేయుదు నని ధృతరాష్ట్రుండు 'గుమారుల విద్యాసందర్శనరంగంబు రమ్యంబుగాఁ జేయింపు' మని విదురుం బంచిన, నతండును దాని శాస్త్రవిహిత ప్రమాణోపేత వృత్తాయామంబును, నపాకృత వృక్ష గుల్మ వల్మీకంబును, నంగీకృత పూర్వోత్తరప్లవంబును, సమీకృత నిమ్నోన్నత ప్రదేశంబును, దూరీకృత కంటక పాషాణ శల్య శకలంబును, విరజీకృత రజోధూసర స్థలంబును,

విరచిత బహువిధ ప్రేక్షాగారాంచిత మణిమయమంచ ప్రపంచంబును,నానాధ్వజనవపల్లవరంభాస్తంభమాలాలంకృతద్వారతోరణంబును, బ్రతిదిశనిర్వర్తిత శాంతిక బలి విధానంబునుంగాఁ జేయించినం, బంచాంగశుద్ధదినశుభముహూర్తంబున ధృతరాష్ట్రుండు గాంధారీ పురస్కృత దేవీశతపరివృతుం డై, వివిధభూషణ భూషితానేక విలాసినీనివహంబుతోఁ జనుదెంచి, విలంబిత కదంబక స్థూలముక్తాఫలదామ రమణీయం బై, యాబద్ధమరకత వజ్రవైదూర్య పద్మరాగప్రభాప్రకర వ్యతికర విరచితా పూర్వ సురచాపచారుగౌరవం బై, యతిమనోహరం బైన శాతకుంభమయ ప్రేక్షాగారంబున నున్న. *(ఆంధ్ర. ఆది. 6: 4).*

'ఆ విధంగా ద్రోణాచార్యుడు చెప్పగా, అట్లే చేస్తానని ధృతరాష్ట్రుడు 'కురుకుమారుల శాస్త్రాస్త్ర విద్య ప్రదర్శనకు అందమైన రంగస్థలాన్ని సిద్ధం చేయించు' మని విదురుడిని ఆజ్ఞాపించాడు. విదురుడు శాస్త్ర ప్రకారం చుట్టుకొలత, పొడవు ఉండేటట్లు చెట్లను, పొదలను, పుట్టలను తీసివేయించి, అవయవాలవలె అంటి ఉండేటట్లు తూర్పుభాగంలో, ఉత్తరభాగంలో వాటమైన పల్లపు ప్రదేశాలను ఏర్పాటు చేయించి, మిట్టపల్లాలను చదునుచేయించి, ముళ్లను, రాళ్లను, ఎముక ముక్కల్నీ ఏరివేయించి, దుమ్మును అణగగొట్టించి, ప్రేక్షకులు కూర్చొని చూడడానికి పలువిధాలైన ఇండ్లను, మణులతో అలంకరించిన మంచెలను నిర్మింపజేశాడు. లోపలి వాకిళ్లను, వెలుపలవాకిళ్లను జెండాలతో, క్రొత్తచిగుళ్లతో, అరటిస్తంభాలతో, పూలమాలలతో అలంకరింపజేసి, అన్ని దిక్కులలో శాంతి పూజలు జరిపించాడు. రంగస్థలాన్ని సర్వాంగసుందరంగా సిద్ధం చేయించాడు. పంచాంగం ప్రకారం మంచిరోజున, శుభ ముహూర్తంలో ధృతరాష్ట్రుడు గాంధారీదేవి ముందు నడుస్తుండగా వందమంది భార్యలతో, పలువిధాలైన సొమ్ములు అలంకరించుకున్న పెక్కుమంది స్త్రీలతో వచ్చి, వ్రేలాడే కడిమిమొగ్గలవలె పెద్దవైన ముత్యాలతో కూర్చిన దండలతో చూడముచ్చటైనదీ, అమర్చిన మరకత వజ్ర, వైదూర్య పద్మరాగ ప్రవాళకాంతుల కలయికతో అపూర్వమైన ఇంద్రధనుస్సు అందాన్ని మించినదీ, మనోహరమైనదీ, బంగారుతో నిర్మించిందీ అయిన ఇంటిలో – కురుకుమారాస్త్రవిద్యాప్రదర్శనను లోపల కూర్చొని చూడడానికి నిర్మించిన ఇంటిలో ఉండగా'

కుమారాస్త్రవిద్యాసందర్శనానికి విదురుడు ఎంతో ఘనమైన ఏర్పాట్లు చేశాడు. ఈ ప్రదర్శనని ఒక సాంస్కృతికోత్సవంగా మలిచాడు. ఆ ప్రదర్శనని తిలకించడానికి వచ్చే మహారాజుల నుండి ప్రజలవరకు అందరికీ కావలసిన ఏర్పాట్లు అన్నీ చేశాడు. ఆ ప్రదర్శన సుమారుగా ఒక

ఘనమైన వివాహాన్ని తలపించింది. తరచి చూస్తే, మహాభారత కాలం నాటికి ప్రతీ రాజ్యంలోనూ ఇటువంటి ఉత్సవం చేయడం సంప్రదాయంగా కనిపిస్తుంది. సర్వాంగసుందరంగా ముస్తాబు చేయబడిన రంగస్థలంలో యువరాజులు వారి శస్త్రాస్త్రవిద్యానైపుణ్యాన్ని తిలకంచడం మహారాజులకి ఆ కాలంలో ఒక వినోదంగా ఉండేది. ఈ ప్రదర్శనకి చేసిన ఏర్పాట్లను గమనిస్తే అప్పట్లో రాజవంశాల్లో, క్షత్రియ వంశాల్లో ఆచార, సంప్రదాయాలు ఎలా ఉండేవో అర్థం చేసుకోవచ్చు.

## 2.4.5. మయసభ నిర్మాణం: శిల్పకళానైపుణ్యం

నన్నయ రచించిన సభాపర్వంలో మయుడు పాండవులకి బహుమతిగా అందించిన మయసభ నిర్మాణం జరిగిన విధానాన్ని ఆనాటి శిల్పకళానైపుణ్యం ఉట్టిపడే విధంగా నన్నయ వర్ణించారు. తన ప్రాణాలు కాపాడిన అర్జునుడి కోసం మయుడు ఏదైనా మేలు చేయాలని తపించాడు. కృష్ణార్జునుల అభీష్టం మేరకు దేవతలు సైతం అచ్చెరువొందేలా ఒక భవనాన్ని నిర్మించడానికి మయుడు పూనుకున్నాడు.

పూర్వం వృషపర్వుడనే రాక్షసరాజు కోరిక మేరకు సభానిర్మాణం చేయదలచి, మయుడు నిర్మాణ సామాగ్రిని బిందుసరం అనే సరోవరంలో భద్రపరిచాడు. ఆ సామగ్రిని ఉపయోగించి పాండవులకి అపూర్వమైన సభని ఒకదానిని నిర్మించి బహూకరించాలని సంకల్పించాడు.

సీ. సురుచిరహరినీలకిరణజలంబులఁ / బద్మరాగారుణపద్మములను
రాజితరాజీవరాజహంసావళి / నిర్మలసౌవర్ణకూర్మములను
గమనీయవైదూర్యకుముదంబులను వజ్ర / మీనమౌక్తికనవఫేనములను
మరకతశైవలోత్కరముల విలసిల్లఁ / గొల నని సన్మణిస్థలము చూచి

ఆ. పలుఁగురాలకుడ్యముల రుచుల్ గప్పిన
జలము లున్నయెడల వెలయఁ జూచి
యనుపస్థలంబు లని జను లెఱుఁగక
యుండునట్లుగా మయుండు సేసె. *(ఆంధ్ర. సభా. 1: 13)*

‘ఇంద్రనీలమణుల కిరణాలనే నీళ్లతో, పద్మరాగమణులతో చెక్కిన ఎర్రనిపద్మాలతో, వెండితో చేసిన తెల్లతామరలతో, రాజహంసలతో, మేలిమి బంగారుతో పోతపోసిన తాబేళ్లతో, మనోహరవైదూర్యాలతో మలచిన కలువలతో, వజ్రాలతో చేసిన చేపలతో, ముత్యాలతో కల్పించిన కొంగ్రొత్త నురుగులతో, మరకతాలతో రూపొందించిన నాచులతో ప్రకాశించే మణిమయప్రదేశాలు చూచి అవి నీటి మడుగులని – స్ఫటికపురాళ్లగోడల కాంతులు కప్పడం చేత నీళ్లు ఉండే చోట్లను చూచి నీళ్లు లేని చోట్లనీ – జనులు భ్రమపడేటట్లుగా మయుడు సభను నిర్మించాడు’.

మయుని శిల్పచాతుర్యం అంతా ఆ వర్ణనలో ధ్వనిస్తుంది. మయుడు నిర్మించిన సభ నిర్మల మణిమయాలైన దూలాలతో, స్తంభాలతో, గోడలతో, అరుగులతో, రాతికట్టడపు ప్రదేశాలతో, ప్రహరీగోడలతో ఎంతో అందంగా రూపుదిద్దుకుంది. అపురూపమైన ఆ సభాభవనంలో మయుడు మనోహరాలైన అనేక యంత్రాలను అమర్చాడు. ఎప్పుడూ పూలతో, పండ్లతో కన్నులపండుగగా కనిపించే చెట్లతోపులను రూపొందించాడు. పూసిన తామరలతో, విచ్చిన కలువలతో కళకళలాడే కొలనులు ఏర్పాటు చేశాడు. చూడముచ్చటగా వ్రేలాడే రకరకాల పతాకాల తోరణాలతో కూడి గువ్వల గూళ్లున్న ప్రదేశాలు ఏర్పాటు చేశాడు. పదివేల మూరల చుట్టుకొలతతో సువిశాలమై, సూర్యకిరణప్రసారంతో వైభవోపేతమై, వివిధరత్న కాంతులతో శోభిల్లే ఆ సభాభవనాన్ని బిందుసరం దగ్గర పదునాలుగు నెలలు శ్రమించి నిర్మించాడు. మయసభ నిర్మాణంలో నవరత్నాలను (ఇంద్రనీలం, పద్మరాగం, వైదూర్యం, వజ్రం, మౌక్తికం, గోమేధికం, మరకతం, పుష్యరాగం, ప్రవాళం) వినియోగించారు.

మయసభలో మరకతాలతో రూపొందించిన నాచులతో ప్రకాశించే మణిమయ ప్రదేశాలు చూస్తే అవి నీటి మడుగులలా కనిపిస్తాయి. అలాగే, స్ఫటికపురాళ్లగోడల కాంతులు కప్పడం వల్ల నీళ్లు ఉండే చోట్లు నీళ్లు లేని చోట్లలా కనిపిస్తాయి. అంతటి శిల్పకళానైపుణ్యం మయుడి సొంతం. కళ్ల ముందు మాయాప్రపంచాన్ని ఆవిష్కరించే మయసభ నిర్మాణమే దుర్యోధనుడి భంగపాటుకి కారణమయ్యింది. ద్రౌపది దుర్యోధనుడిని చూసి నవ్వడం, దుర్యోధనుడి మనస్సులో అప్పటికే గూడు కట్టుకున్న అసూయాద్వేషాలు మరింతగా పెరగడానికి పరోక్ష కారణమయ్యింది.

## 2.4.6. రాజసూయయాగం: సాంస్కృతిక విశేషాలు

నారదమహర్షి ప్రబోధం మేరకు ధర్మరాజు రాజసూయయాగాన్ని చేశాడు. తన సోదరులైన భీమార్జుననకులసహదేవులను వరుసగా తూర్పు, ఉత్తరం, పశ్చిమం, దక్షిణ దిక్కులకి పంపి జైత్రయాత్ర చేయించాడు. ఎన్నో ధన, కనక, వస్తు, వాహనాలను కప్పంగా ఆయా రాజుల నుండి గ్రహించాడు. ధర్మరాజు చేసిన కష్టసాధ్యమైన రాజసూయయాగాన్ని నన్నయ చాలా గొప్పగా వర్ణించారు. మహాభారత కాలం నాటికి రాజులు యజ్ఞయాగాదులు చేయడం పరిపాటి. అది అప్పటి సంస్కృతిలో ఒక భాగం. ఆనాటి ఆచారాలకి, సంప్రదాయాలకి యజ్ఞయాగాదులు సాక్ష్యాలుగా నిలుస్తాయి.

ధర్మరాజు చేసిన రాజసూయయాగం చరిత్రలో నిలిచిపోయింది. అందుకే, నన్నయ ఆ యాగాన్ని ఒక సాంస్కృతిక విశేషంగా, ఆ కాలం నాటి వైభవంగా వర్ణించారు. రాజసూయయాగానికి పాండవులు చేసిన ఏర్పాట్లు గగనాన్ని తలపించాయి.

సీ. శాస్త్రోపదిష్ట ప్రశస్త ప్రమాణల / క్షణముల యజ్ఞోపకరణ తతుల
యజ్ఞాయతనమున నతిరమణీయంబు / లయి యుండ నొనరించి, యందు సర్వ
సంభారములు నించి, సకలదిక్కుల హరి / ప్రస్థంబుచుట్టు నపార భూరి
బహువిధాగారముల్ ప్రమదవనంబుల / వాపుల దీర్ఘికావలుల వెలసి

ఆ. యాజ్య తైల తండులాది నానా వస్తు
పూరితంబులయి విభూతిఁ దనర
జననుతుండు సేసె సహదేవుఁ డపర భూ
తలముఁ బోలి యొప్పెఁ దత్పురంబు. *(ఆంధ్ర. సభా. 1: 283)*

వ. మఱియు సహదేవానుశాసనంబునఁ బుత్త్ర మిత్త్ర భ్రాతృసమేతులై విరాట ద్రుపద శిశుపాల గాంధార రాజులును బ్రాగ్జ్యోతిషంబున భగదత్తుండును, శక సాల్వ బృహద్బల చంద్రసేన సముద్రసేన కుంతిభోజ పౌండ్రకవాసుదేవులును, వసుదేవ బలదేవ ప్రద్యుమ్న శూరసేనాది యదు వృష్ణి భోజాంధకవరులును, నంగ వంగ కళింగ కాశ్మీర కాంభోజ గౌడాంధ్ర సింహళ కేరళ కుంతల ద్రవిడ మరు యవనపతులును, బార్వతేయులును సాగరానూపవాసులును నాదిగాఁ జతుస్సముద్ర

ముద్రిత వసుంధరా చక్రంబునం గల రాజచక్రంబును, సమగ్ర వేద వేదాంగవిదు లైన యగ్రజన్ములును, స్వకర్మ నిరతులైన వైశ్యశూద్రులును వచ్చి యథాపరికల్పిత సన్నివేశంబుల నుండి; రంత ధర్మపుత్త్రుండు భీష్మాదులం దోడ్కొని తేర గజపురంబునకు నకులుం బంచిన. *(ఆంధ్ర. సభా. 1: 284).*

'శాస్త్రోక్తాలైన ఉన్నత ప్రమాణ లక్షణాలున్న యజ్ఞ సాధన సామగ్రినంతా యజ్ఞశాలలో అతిరమణీయంగా అమర్చాడు. అవసరమైన పదార్థాలనన్నింటినీ నింపాడు. ఇంద్రప్రస్థానికి అన్ని వైపులా ఉద్యానవనాలతో, కోనేరులతో, దిగుడుబావులతో, అవసరమైన నెయ్యి, నూనె, బియ్యం వంటి ఆహారపదార్థాలు సమృద్ధిగా ఉండేటట్లు అతిథిగృహ సముదాయాన్ని తన ఐశ్వర్యం శోభిల్లేటట్లు ఏర్పరచాడు. అప్పుడు ఇంద్రప్రస్థపురం అపరభూమండలంలా ప్రకాశించింది.

సహదేవుని పిలుపు మేరకు, పుత్రులతో, మిత్రులతో, సోదరులతో కలిసి భూమండలంలో ఉండే అందరు రాజులు, వేదవేదంగ పారంగతులైన బ్రాహ్మణులు, తమ తమ ధర్మాలను నిర్వర్తించే వైశ్యులు, శూద్రులు వచ్చి విడిది చేశారు. తరువాత భీష్ముడు మొదలైన పెద్దలను తోడ్కొని రావడానికి ధర్మరాజు నకులుణ్ణి హస్తినాపురానికి పంపాడు'.

ధర్మరాజు, ధౌమ్యులవారు చెప్పిన విధంగా యాగానికి అవసరమైన సాధన సామగ్రిని సమకూర్చే పనిని ఇంద్రసేనుడు మొదలైన ప్రముఖులకు, అర్జున రథసారథి అయిన రుక్మకి అప్పగించమని సహదేవుడిని నియోగించాడు. భూమండలంలో ఉండే బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులనందరినీ రాజసూయయాగానికి ఆహ్వానించాడు.

రాజసూయయాగాన్ని తన తమ్ముళ్ల సహకారంతో ధర్మరాజు అప్రతిహితంగా, దిగ్విజయంగా, అంగరంగవైభవంగా, అంబరాన్నంటే సంబరంగా నిర్వహించాడు. ఆ యాగ నిర్వహణని వర్ణిస్తూ నన్నయ చేసిన రచన భూమండలంలో ఇటువంటి సాంస్కృతికోత్సవం మరెక్కడా జరగలేదని తెలియజేస్తోంది. ఇంతటి మహాయాగాన్ని నిర్వహించిన ధర్మరాజు దేశానికి చక్రవర్తి అయితే ఎలా ఉంటుందో చెప్పడానికి రాజసూయయాగం ఒక గొప్ప ఉదాహరణగా నిలిచిపోయింది.

## 2.4.7. రాజాస్థానాల్లో మల్లయుద్ధాలు

పాండవులు ఆరణ్యవాసాన్ని ముగించుకుని అజ్ఞాతవాసంలోకి ప్రవేశించారు. పాండవులు, ద్రౌపది ఎవరికి వారుగా వచ్చి మత్స్యదేశానికి రాజైన విరాటమహారాజు ఆస్థానంలో చేరారు. భీముడు 'వలలుడు' అనే పేరుతో వంటవాడిగా (భీముడు, నలుడు వంట విషయంలో జగత్ప్రసిద్ధం. వారి వంటని నలభీమపాకం అంటారు), మల్లయోధుడిగా ఉంటానని విరాటమహారాజుని ఆశ్రయించాడు. ఈ సందర్భంలో తిక్కన మహాభారత కాలంలో రాజుల కొలువుల్లో జరిగే వినోదాల ప్రస్తావన తీసుకువచ్చారు.

చ. వలసిన నేలు; మేను బలవంతుఁడఁ; గారెనుబోతు దంతి బె
 బ్బులి మృగనాథునిం దొడరి పోరుదు శూరత యుల్లసిల్లఁగా
దలమును లావు విద్య మెయిదర్పముఁ బేర్చి పెనంగు జెట్టి మ
ల్లుల విఱుతున్ వడిన్ గడియలోనన చూడ్కికి వేడ్కసేయుదున్. *(ఆంధ్ర. విరాట. 1: 223)*

'నేను బలవంతుడిని. అడివి దున్నలతో, ఏనుగులతో, పెద్దపులులతో, సింహాలతో పోరాడతాను. బలవంతులూ, మల్లవిద్యావంతులూ, కండకావరం కలిగినవారైన మల్లులతో కనుపండువుగా పోరాడతాను. వాళ్లందరినీ ఒక్క గడియలో విరిచి పారేస్తాను. ఇట్లాంటివాడినైన నన్ను నీ కిష్టమైతే ఏలుకొమ్ము'.

వలలుడు అనే పేరుతో విరాటమహారాజు కొలువుకి విచ్చేసిన భీముడు పాకశాస్త్రంలో తనకున్న నైపుణ్యం గురించి చెప్పాడు. అంతే కాకుండా, తనకి మల్లవిద్య కూడా వచ్చునని ఈ పద్యం ద్వారా స్పష్టం చేశాడు. ఎప్పుడూ పరిపాలనతో, యుద్ధాలతో విసుగెత్తిన రాజులు వినోదాలని ఎంతగానో ఇష్టపడతారు. ఈ సూక్ష్మాన్ని గ్రహించి భీముడు తాను మల్లయోధుడినని ప్రకటించాడు.

మహాభారత కాలం నాటికి రాజులకి మల్లయుద్ధాలు ఆస్వాదించడం గొప్ప వినోదంగా ఉండేది. యోధులు జంతువులతో పోటీ పడడం సైతం అప్పటి వినోదాల్లో ఒక భాగం. ఈ మొత్తం సంబరాన్ని వీక్షించడానికి ప్రజలకి రాజులు ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసేవారు. ఈ వేదికని రంగంగా చేసుకొని రాజులు తమ సైన్యంలో మేలైన యోధుల్ని, వారి పరాక్రమాన్ని అందరికీ పరిచయం చేసేవారు. అంతే కాకుండా, రాజుల అభిమానాన్ని చూరగొనాలి అనుకునేవారు ఈ పోటీల్లో పాల్గొని తమ విద్యని ప్రదర్శించి, రాజు మెప్పు పొందేవారు. రాజులు వేటకి వెళ్లినప్పుడు కొన్నిసార్లు స్వయంగా

క్రూరమృగాలను ఎదుర్కోవలసిన పరిస్థితులు ఏర్పడతాయి. వాటిని లోబరుచుకుని, జయించి, చంపే మెలుకువలు రాజుకి కూడా అవసరం. ఆ కాలంలో ఇటువంటి పోటీలు గొప్ప క్రీడా సంబరంగా జరిగేవి.

'మల్లయుద్ధం మనుషులతో చేసేది, క్రూరమృగాలతో చేసేది, బలవంతమైన పశువులతో చేసేది అని మూడు రాలుగా ఉంటుంది. వాటిని రాజ సభల్లో (ప్రాచ్య పాశ్చాత్య దేశాలలో కూడా) పౌరుష వినోద క్రీడలుగా పరిగణిస్తారు. వాటిల్లో విజేతలకు బిరుదాలూ, బహుమతులూ ఇస్తారు. *(ఆంధ్ర. విరాట. 1. పుట: 100).*

## 2.5. ముగింపు

మహాభారత కాలం నాటి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులని కళ్లకి కట్టే అంశాలు, ఉదాహరణలు మరెన్నో ఉన్నాయి. చాలా భాగం పరిశోధనల్లో ఈ పాటికే చర్చించబడ్డాయి. ఇంకా మరికొన్ని అంశాలు పరిశీలనకి నోచుకోవలసి ఉన్నాయి.

మహాభారత కాలం నాటి ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక పరిస్థితులను పరిశీలించడం ద్వారా ఆనాటి విశేషాలను తెలుసుకోవడమే కాదు, నేటి పరిస్థితులకు ఉపయోగపడే ఎన్నో సూత్రాలను అన్వయించుకోవచ్చు. ముఖ్యంగా ఆర్థిక, రాజకీయ అంశాల విషయంలో మహాభారత కాలం నాడు ఆచరించిన సూత్రాలు, అవలంబించిన విధివిధానాలు నేటికే కాదు, రాబోయే తరాలకి కూడా దిశానిర్దేశం చేయగలవు. ఒక భయంకరమైన విపత్తు ఏర్పడితే ఆర్థికంగా, రాజకీయంగా ఒక దేశం/ సామ్రాజ్యం ఎటువంటి చర్యలు తీసుకుంటే విపత్తు ప్రభావం నుండి బయట పడవచ్చో మహాభారతంలో కనిపిస్తుంది. అటువంటి విపత్కర పరిస్థితుల్లో సైతం నాయకుడు/ రాజు దేశ సంస్కృతిపై, ఆర్థిక వ్యవస్థపై, రాజకీయ స్థితిగతులపై దుష్ప్రభావం పడకుండా ఎలా వ్యవహరించాలో మహాభారత గాథలో ఎంతో గొప్పగా వివరించబడింది. అందుకే, వ్యాస భగవానుడు పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాల విషయంలో ఎటువంటి సందేహం/ సందిగ్ధత/ అనిశ్చితి ఏర్పడినా భారతాన్ని తెరచి చూడండి అని తరతరాలకి భరోసా ఇచ్చాడు.

# అధ్యాయం – 3

# ఆంధ్ర మహాభారతం: మానవ సంబంధాలు

## 3.1. ఉపోద్ఘాతం

ఏ యుగంలోనైనా, ఏ కాలంలోనైనా, ఏ ప్రాంతంలోనైనా మనిషి మనుగడకి అత్యంత ఆవశ్యకమైనవి మానవసంబంధాలు. మానవత్వంలో ఉండే ప్రధానమైన గుణం స్పందించే లక్షణం. మనిషి ఆ స్పందన ద్వారానే తోటి వారి పట్ల ప్రేమని, సహృదయతని వ్యక్తీకరిస్తాడు. ఇలా ప్రతీ ఇద్దరి మధ్య ఉండవలసిన సహృదయతని, సమత్వాన్ని, ప్రేమని నిరంతరం నడిపించేవే మానవ సంబంధాలు.

యుగాలు మారినా, తరాలు మారినా మానవ సంబంధాలని మరింత బలపరుచుకోవడానికి మనిషి ఇంకా ఇంకా ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. మేఘాలు, పక్షులు, దూతలు, సైగలు, చిత్రాలు, మాటలు, చేతలు, రాతల దగ్గర నుండి వైజ్ఞానిక రంగంలో సంచలనం సృష్టించిన ఫోన్ ని కనిపెట్టేవరకు మనిషి ప్రయత్నం సాగుతూనే ఉంది. అంతటితో ఆగకుండా వినూత్నమైన ప్రయోగాల ద్వారా సాంకేతిక ప్రగతి సాధిస్తూ మానవ సంబంధాలను మరింతగా ఉద్ధరించడానికి మరెన్నో అడుగులు పడుతూనే ఉన్నాయి. అయితే, ఆశ్చర్యకరంగా ఈ అడుగులు వేగాన్ని పుంజుకుని పరుగులుగా మారి, అసలు ప్రయత్నం ఎందుకు మొదలయ్యిందో మర్చిపోయే పరిస్థితి నేడు చాలాసార్లు తలెత్తుతోంది.

మనిషికి మనిషి మరింతగా దగ్గరవ్వడానికి పుట్టిన సాంకేతికత, ప్రతీ ఇద్దరి మధ్య దూరాన్ని పెంచుతోంది. మనుషులు తమలో ఉన్న మానవత్వమనే మౌలికమైన ధాతువుని విస్మరించి, సహృదయతని, సమత్వాన్ని మరచి అరిషడ్వర్గాలకు (కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు) బానిసైపోతున్నారు.

నానాటికీ విచ్ఛిన్నమైపోతున్న మానవసంబంధాలను పునరుద్ధరించడానికి విలువలతో కూడిన సాహిత్యాన్ని ఆస్వాదించడం అవసరం. తెలుగు సాహిత్యంలో మానవసంబంధాలను ప్రతిఫలించిన రచనలు ఎన్నో ఉన్నాయి, ఇంకా వస్తూనే ఉన్నాయి. అయితే, ఆంధ్ర మహాభారతం మాత్రం మహాభారత కాలం నుండి నేటి వరకు కూడా చీకట్లపై వెలుగులను చిమ్ముతూనే ఉంది. ఆ బృహద్గ్రంథంలో ఉన్న సార్వకాలికత, సార్వజనీనత అందుకు మూల కారణాలు. ఆంధ్ర మహాభారతంలో వివిధ ఘట్టాలలో రకరకాల పాత్రల నడక, నడత మానవసంబంధాలను అత్యంత వాస్తవికంగా ఆవిష్కరించాయి. ఆంధ్ర మహాభారతంలోని ప్రతీ కథ మానవసంబంధాలను అత్యంత వాస్తవికంగా, హృద్యంగా చిత్రించాయి. సున్నితమైన, వైవిధ్యమైన మానవసంబంధాలను ఎలా నిలుపుకోవాలో వివరించాయి.

## 3.2. సర్పయాగం

నన్నయ రచించిన ఆది పర్వంలో వచ్చే సర్పయాగం కథ, మానవులలో ఉండే ఎన్నో మనఃప్రవృత్తులను చక్కగా ఆవిష్కరించింది. ప్రత్యేకించి మనుషులలో ఉండే రాగద్వేషాలను ఈ ఘట్టం కళ్లకి కట్టిన తీరు అద్భుతం. ఈ ఒక్క ఘట్టం నుండి ప్రతీ మనిషి ఎన్నో విలువైన విషయాలు తెలుసుకోవచ్చు.

వ. 'నీవలనం బరమ సంప్రీత హృదయుండ నయితి; నీవును గుర్వర్థంబునందు ఋణవిముక్తుండ వయితివి; నిజేచ్ఛనుండు' మనినఁ, దదనుజ్ఞ వడసి యుదంకుం డనేకకాలంబు దపంబు సేసె; నట్టి యుదంకుండు తక్షకు చేసిన యపకారంబునకుం బ్రతీకారంబు సేయం జింతించి యొక్కనాఁడు జనమేజయ మహీపాలుపాలికిం బోయి యి ట్లనియె. (*ఆంధ్ర. ఆది. 1: 120*)

'నీయెడ మిక్కిలి ప్రీతీ పొందిన హృదయం కలవాడనైనాను. నీవు కూడా గురువుగారి ప్రయోజనం నెరవేర్చడంలో ఋణవిముక్తుడవైనావు. ఇంక నీ ఇష్టం వచ్చినట్లు ఉండుము. అని గురువు పలుకగా ఉదంకుడు అతని అనుమతి పొంది చాలాకాలం తపస్సు చేశాడు. అట్టి ఉదంకుడు తక్షకుడు కుండలాలను అపహరించి తనకు చేసిన అపకారానికి మారుచేత చేయడానికి తలచి, ఒకరోజున జనమేజయమహారాజు చెంతకు వెళ్లి ఈవిధంగా పలికాడు'.

ఉదంకుడు ఎంత తపస్సు చేసినా తక్షకుడు తనకు చేసిన అపకారాన్ని మరిచిపోలేకపోయాడు. ఎంతటి మహర్షి అయినా తనలో ఉన్న తీవ్రమైన కోపాన్ని జయించలేకపోయాడు. చిన్న తప్పుకే పెద్ద శాపాన్నిచ్చి పౌష్యుడి దగ్గర తన స్వభావాన్ని బయట పెట్టుకున్నాడు. ప్రతిగా తాను కూడా శాపాన్ని పొందాడు. అతడి అంతర్గత తీవ్రకోపస్వభావమే భావికథలో సర్పయాగానికి కారణమైంది.

మనిషిలో ఎన్ని సుగుణాలు ఉన్నా, కోపాన్ని జయించలేనివాడు జీవితంలో చాలా నష్టపోతాడు అని చెప్పడానికి మన చరిత్రలో, సాహిత్యంలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. సాధారణమైన మనుషులు కోపాన్ని జయించడానికి కష్టపడాలి. కానీ, తపస్సు చేసినవారు కోపంతో పాటు అనేకమైన విషయాలను జయించి గొప్ప ఇంద్రియనిగ్రహం కలవారైవుండాలి. అన్నింటినీ జయించినవారు మాత్రమే తపస్సు చేయగలుగుతారు. ఉదంకుడు అంత తపస్సు చేసి కూడా కోపాన్ని విడనాడలేకపోయాడు. ఆ కోపం కేవలం తక్షకుడి మీదకి మాత్రమే మరలలేదు, ఏకంగా సర్పలోకానికి హాని చేసే పరిస్థితికి దారి తీసింది. ఉదంకుడు తనకి తక్షకుడిపై ఉన్న కోపంతో జనమేజయుడికి పరీక్షిత్తు మరణవృత్తాంతం మొత్తం గుర్తుచేసి మహారాజు సర్పయాగం చేసే విధంగా ప్రేరేపించాడు. ఆ యాగం ఎంతటి వినాశనానికి దారి తీసిందో తెలిసిందే.

ఉ. కాదన కిట్టిపాటి యపకారముఁ దక్షకుఁ డేకవిప్రసం
బోధనఁ జేసి చేసె నృపపుంగవనీవు ననేకభూసురా !
పాదిత సర్పయాగమున భస్మము సేయుము తక్షకాదికా
కోదరసంహతిన్ హుతవహోగ్ర సమగ్ర శిఖాచయంబులన్. (*ఆంధ్ర. ఆది. 1: 124*)

ఉ. ప్రల్లదుఁ డైన యొక్కకులపాంసను చేసినదానఁ దత్కులం
బెల్లను దూషితం బగుట యేమి యపూర్వము? గావునన్ మహీ
వల్లభతక్షకాధము నెపంబున సర్పము లెల్ల నగ్నిలోఁ !
ద్రెళ్ళఁగ సర్పయాగ మతిధీయుతచేయుము విప్రసమ్మతిన్ !. (*ఆంధ్ర. ఆది. 1: 125*)

'రాజశ్రేష్ఠుడా! ఇది చేయరాదని నిరాకరించకుండా, శమీకుడిపుత్రుడైన శృంగి అనే ఒక బ్రాహ్మణుడి ప్రేరణ చేత తక్షకుడు ఇంత పెద్ద కీడు చేశాడు (నీ తండ్రిని కాటేసి చంపాడు). దానికి ప్రతీకారంగా నీవు కూడా పలువురు బ్రాహ్మణులచేత నిర్వహింపబడే సర్పయాగంలో అగ్నియొక్క

భయంకరమైన సమస్త జ్వాలల సముదాయం చేత తక్షకుడు మొదలైన పాములసమూహాన్ని బూడిద చేయుము'.

'దుష్టుడైన ఒక కులదూషకుడు చేసిన చెడ్డపనిచేత ఆ కులమంతా నిందింపబడడం ఏమంత వింత? కాబట్టి నీచుడైన ఆ తక్షకుడు కారణంగా పాములన్నీ అగ్నిలో పడి హతమయ్యేటట్లుగా బ్రాహ్మణుల అంగీకారంతో సర్పయాగం చేయుము'.

అపకారికి సైతం ఉపకారం చేయమనే సంస్కృతి భారతీయ సంస్కృతి. ఉపకారం చేయకపోయినా ఫర్వాలేదు కానీ ఉదంకుడంతటి తపస్వి మనస్సులో ఇంతటి రాగద్వేషాలను కలిగి ఉండడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఏ తపస్వి కూడా ప్రతీకారాన్ని కోరుకోడు. మునులలో, యోగులలో, తపస్వులలో ప్రధానంగా కనిపించే గుణం సత్వగుణం. కానీ, ఉదంకుడిలో తమోగుణం కనిపిస్తోంది. కేవలం తక్షకుడి మీద ప్రతీకారం తీర్చుకోవాలనుకోవడం ఒక రకం. కానీ, ఉదంకుడు తక్షకుడు చేసిన హానికి మొత్తం పాములన్నింటినీ హింసించమని జనమేజయుడిని ప్రేరేపిస్తున్నాడు. నిజానికి కథలో తక్కిన పాములు చేసిన తప్పు ఏమీ లేదు, అయినా అవి సర్పయాగంలో బలికావలసివచ్చింది.

సర్పయాగం వృత్తాంతం మొత్తం చదివితే మానవసంబంధాలు ఎంత విలువైనవో, వాటిని ఎలా సంరక్షించుకోవాలో అర్థం అవుతుంది. కేవలం ఒక తప్పుకి, లేదా ఒక చెడు లక్షణానికి మనుషులను దూరం చేసుకోవడం, ఒక వ్యక్తి చేసిన తప్పుకి సమూహాన్ని, కులాన్ని, మతాన్ని లేదా ప్రాంతాన్ని తప్పుపట్టడం చేస్తున్న ఈతరానికి ఉదంకుడి పాత్ర ప్రతినిధిగా కనిపిస్తుంది. ఉదంకుడు తాను ఒక తపస్విలాగా ఉదాత్తంగా ప్రవర్తించి ఉంటే ఇంతటి పరిస్థితి వచ్చేదే కాదు. ఎంతటి మహానుభావులైనా చిన్న తప్పు వల్ల నష్టపోవలసివస్తుందని ఉదంకుడి పాత్ర తెలియజేస్తుంది. మనిషి పూర్తిగా దుర్గుణాలను విసర్జిస్తే తప్ప పరిపూర్ణుడు కాలేడు అనడానికి ఉదంకుడు ఒక ఉదాహరణ. అలాగే, ఉదంకుడి మాటలకు ఉద్వేగానికి లోనై తాను ఒక మహారాజు అయ్యుండి జనమేజయుడు ఇంతటి వినాశనానికి పాల్పడ్డాడు. ఒక్కరు చేసిన తప్పుకి సమూహాన్ని బలి చేయడం ఒక నాయకుడికి తగని పని.

క. ఆతని నత్యుగ్రానల
పాతోన్ముఖుఁ డైన వానిఁ బడకుండఁగ 'నో
హో తక్షక! క్రమ్మఱు' మని
యాతతభయుఁ గ్రమ్మఱించె నాస్తీకుఁ డెడన్. (ఆంధ్ర. ఆది. 2: 232)

'మిక్కిలి భయంకరమైన అగ్నిలో పడడానికి సిద్ధుడై ఉన్నట్టి, అధికమైన భయంతో కూడినట్టి ఆ తక్షకుడిని ఆస్తీకుడు 'ఓహో తక్షకా! మరలిపోమ్ము' అని పలికి అగ్నిలో పడకుండా నడుమనే మరల్చాడు.

సర్పయాగం వృత్తాంతంలో ఇదొక కీలకమైన విషయం. ఎవరైతే పరీక్షిన్మహారాజు మరణానికి కారణమయ్యారో, ఎవరి మరణం కోసమైతే జనమేజయుడు ఇంత మహాయాగాన్ని చేశాడో, అతడు బతికిపోయాడు. మధ్యలో కొన్ని వేల పాములు అకారణంగా బలయ్యాయి.

మనవ సంబంధాల ఎంత విలువైనవో చర్చించుకునే క్రమంలో ఇదొక ముఖ్యమైన అంశం. ఈ ఘట్టాన్ని నేటి జీవనానికి అన్వయించుకుంటే చాలా అవగాహన కలుగుతుంది. మనుషులు ఒక్క కారణం చేత ఒక మనిషిని లేదా బంధుత్వాన్ని, ఒక మనిషి గురించి ఒక కుటుంబాన్ని / కులాన్ని లేదా ఒక సమూహాన్ని దూరం చేసుకునే సందర్భాలు నిత్యం కనిపిస్తూనే ఉంటాయి. ఆశ్చర్యకరంగా ఎందుకోసమైతే ఒక బంధాన్ని తెంచుకున్నారో, ఆ మూలాన్ని మర్చిపోయి వివక్షని పెంచుకుంటూ పోతారు. మధ్యలో సంబంధం లేని వాళ్లని బాధ పెడుతుంటారు. ఇటువంటి వారందరికీ సర్పయాగం కథ ఒక గుణపాఠం.

తాను మరణిస్తానని తెలిసినా చివరి రోజులని సార్థకం చేసుకున్న పరీక్షిత్తు ఒకవైపు, తండ్రిని చంపాడనే కోపంతో తక్షకుడినే కాక మొత్తం నాగులని బలి చేయాలనుకుని, అకారణంగా కొన్ని వేల పాములని బలి తీసుకుని, మూలకారకుడైన తక్షకుడిని ఏమీ చేయలేకపోయిన జనమేజయుడు మరొకవైపు. రెండు పాత్రలూ గొప్ప సందేశాన్నిస్తాయి. ఆవేశంలో మనిషి తీసుకునే నిర్ణయాలకు మనవ సంబంధాలు ఎంతగా ఛిన్నాభిన్నం అవుతాయో ఈ కథ మనకి తెలియజేస్తుంది.

సర్పయాగం ఘట్టాన్ని అధ్యయనం చేయడం వల్ల మనుషులు ఎంత పరిపక్వతతో ప్రవర్తించాలో అర్థం అవుతుంది. తన కోపమే తన శత్రువు, తన శాంతమే తనకు రక్ష అనే విషయం మరోసారి స్పష్టమవుతుంది.

## 3.3. గరుడోపాఖ్యానం

నన్నయ రచించిన ఆదిపర్వంలో వర్ణించబడ్డ గరుడోపాఖ్యానం అసూయాద్వేషాల వల్ల మనుషులు ఎంతగా నష్టపోతారో అత్యంత సహజంగా వర్ణించబడింది. ఆత్మసంతృప్తి అనేది మనిషికి ఎంత అవసరమో తెలుసుకోవడానికి ఈ ఒక్క ఘట్టం చదివితే చాలు. అన్ని ప్రేమలని మించిన ప్రేమ తల్లి ప్రేమనే అని ఈ ఘట్టం ఉద్ఘాటిస్తుంది. తల్లి ప్రేమ తోడుగా ఉంటే మనిషి సాధించలేనిది ఏదీ లేదని ఈ ఉపాఖ్యానం ద్వారా మరొకసారి ఋజువయ్యింది.

చ. 'అనిలుఁడు పక్షయుగ్మ, మమృతాంశుఁడు వీఁపనలుండు మస్తకం,
బినుఁడు సమస్తదేహమును నెప్పుడుఁ గాచుచు నీ కభీష్టముల్
ఘనముగఁ జేయుచుండెడు జగన్నుతజయంబుఁ జే యున్నతియున్ !
కొను' మని యిచ్చె దీవనలు గోరి ఖగేంద్రునకుం బ్రియంబునన్. (*ఆంధ్ర. ఆది. 2: 56*)

'వాయువు రెక్కలజంటను, చంద్రుడు వీపును, అగ్ని తలను, సూర్యుడు ఎల్ల శరీరాన్ని సర్వదా రక్షిస్తూ, నీ కోరికలు గొప్పగా తీరుస్తూ ఉంటారుగాక! లోకాలచేత నుతింపబడేవాడా! గొప్పతనాన్ని, విజయాన్ని గ్రహించుము' అని వినత మనసులో కోరి పక్షులకు రాజైన గరుడునికి ప్రీతితో ఆశీస్సులు ఇచ్చింది'.

స్వర్గంలో ఉండే అమృతాన్ని తెచ్చి పాములకి ఇస్తే, గరుడుని తల్లియైన వినతకి దాసిత్వం నుండి విముక్తి లభిస్తుందని పాములు పలుకగా మహత్తరమైన సాహసానికి గరుడుడు పూనుకున్నాడు. అందుకుగాను, తల్లి ఆశీస్సులను వేడుకున్నాడు. అపారశక్తిమంతుడైన గరుడునికి మరింత బలం కలగాలని వినత ఆశీర్వదించింది. తల్లిని దాసిత్వం నుంచి విడిపించడానికి అనితరసాధ్యమైన సాహసానికి సైతం వెనుకాడని గరుడుని పేరు చరిత్రలో నిలిచిపోయింది. తల్లిదండ్రుల ఆశీస్సులు ఉంటే ఏ బ్రహ్మాండంలోనైనా సాధించలేనిది ఏదీ లేదని గరుడుడు నిరూపించాడు. తల్లిదండ్రులే ప్రత్యక్ష దైవాలని తరతరాలకి ఉద్బోధ చేశాడు. వినత కూడా తన బిడ్డ

ధైర్య సాహసానికి మెచ్చుకుని, తనపై బిడ్డకున్న ప్రేమకు మురిసిపోయి నిండు మనస్సుతో గరుడుని ఆశీర్వదించింది.

"తల్లులు బిడ్డలకు ఉగ్గుపెట్టి వారి శరీరంలోని అంగాలనన్నింటికీ శ్రీరామరక్షలు కోరుతూ వాత్సల్యాన్ని వ్యక్తం చేసినట్లు ఇక్కడ వినత తన కొడుకు రెక్కలకు, వీపుకు, తలకు, శరీరం మొత్తానికి దైవరక్షను నిర్దేశించింది". (*ఆంధ్ర. ఆది. 2. పుట: 124*)

క. 'మనపితృవర్గము వడసిన
ధనము విభాగించి యిమ్ము ధర్మస్థితి నా'
కని యడుగంబోయిన య
య్యనుజునకు విభావసుం డహంకారమునన్. (*ఆంధ్ర. ఆది. 2: 66*)

'మన తండ్రితాతలు పొందిన సంపదను ధర్మప్రకారంగా పాలుపంచి నా కి'మ్మని అడగడానికి వెళ్లిన తమ్ముడైన సుప్రతీకుడికి విభావాసుడు గర్వంతో.

ఆదిపర్వం ద్వితీయాశ్వాసంలో వచ్చే చిన్న ఉపకథ ఇది. స్వర్గం నుండి అమృతం తేవడానికి బయలుదేరిన గరుడునికి బలంకోసం అమితమైన ఆహారం కావలసివచ్చింది. తండ్రియైన కశ్యపుడి ఆజ్ఞ మేరకు గజకచ్ఛపాలను ఆహారంగా స్వీకరించడానికి వెళ్లిన సందర్భంలో ఈ ఉపకథ ప్రస్తావనకి వస్తుంది.

అగ్నితో సమానుడు, నియమాలననుసరించేవాడు, సంపన్న బ్రాహ్మణుడు అయిన విభావసుడు, సుప్రతీకుడనే సోదరులే తర్వాత కాలంలో గజకచ్ఛపాలుగా మారి పోరాడుతూ ఉంటారు. అందుకు కారణం తండ్రి, తాతముత్తాతల నుండి సంక్రమించిన ఆస్తుల విషయంలో తగాదా రావడమే. ధర్మబద్ధంగా ఆస్తిలో తనకి రావలసిన వాటాని ఇవ్వమని అడిగిన సుప్రతీకుడిని గర్వంతో కాదని, తానే ఆస్తిని మొత్తం అనుభవించాలని భావించాడు విభావసుడు. ఇద్దరి మధ్య వాదన పెరిగి ఒకరికొకరు శాపాలనిచ్చుకుంటారు. తత్ఫలితంగా గజకచ్ఛపాలుగా జన్మించి పోరాడుతూ ఉంటారు.

అన్నదమ్ముల మధ్య అన్యోన్య సంబంధాలు ఉండాలే తప్ప, ఆస్తులు మొదలైన విషయాల్లో తగాదాలు ఎంతటి విపరీతాలకైనా దారి తీస్తాయనే విషయాన్ని ఈ కథ బోధిస్తోంది. తండ్రి తర్వాత

తండ్రిలాంటి వాడైన విభావసుడు (అన్న), తన బాధ్యతని విస్మరించి తమ్ముడిని మోసం చేయాలనుకోవడం వారిద్దరి మధ్య సంబంధాన్ని దెబ్బతీసింది. మానవసంబంధాల విలువలు తెలుసుకొని జీవించకపోతే జీవితం ఎంత దుర్భరం అవుతుందో ఈ కథ మనకి తెలియజేస్తుంది. సౌభ్రాతృత్వాన్ని కలిగి ఉండకపోతే మనుషుల మధ్య వచ్చే వైరాలను నివారించడం అసాధ్యం అనే సందేశాన్ని ఆధునిక సమాజానికి ఈ గజకచ్ఛప వృత్తాంతం అందజేస్తోంది.

క. కలహమున నిట్లు సురవీ
రులఁ బల్వుర నోర్చి, యొక్కరుఁడ యమృతముఁ దె
క్కలికొని, యాస్వాదింపక
యలోలుఁ డగు వానిఁ జూచి హరి యి ట్లనియెన్. (*ఆంధ్ర. ఆది. 2:103*)

క. నీ విజయోత్సాహమునకు,
లావునకు, జవంబునకు, నలౌల్యమునకు, స
ద్భావమునకు మెచ్చి, వరం
బీ వచ్చితి, వేఁడు మెద్ది యిష్టము నీకున్. (*ఆంధ్ర. ఆది. 2:104*)

'ఈ విధంగా యుద్ధంలో దేవతావీరులను పెక్కుమందిని జయించి ఒక్కడే అమృతాన్ని దొంగిలించి, రుచి చూడకుండా అనాసక్తుడుగా ఉండే గరుత్మంతుడిని చూచి విష్ణువు ఇలా అన్నాడు. నీ విజయంలోని పూనికకు (ప్రయత్నానికి), బలానికి, వేగానికి, అనాసక్తికి, మంచితనానికి, సంతోషించి నీకు వరమివ్వడానికి వచ్చాను. నీకేది ఇష్టమో కోరుకొమ్ము.

గరుత్మంతుడు తన తల్లియైన వినతకి దాస్య విముక్తిని కలిగించడానికి అనితర సాధ్యమైన సాహసానికి పూనుకుని, అందులో విజయం సాధించి కూడా తాను ఆ విజయ ఫలాన్ని తల్లి ఆనందంలో వెతుకున్నాడే తప్ప, తాను నాగుల కోరిక మేరకు స్వర్గంలో దేవతావీరులతో అసామాన్యంగా పోరాడి తెచ్చిన అమృతాన్ని కొద్దిగా కూడా స్వీకరించడానికి ప్రయత్నం చేయలేదు. ఆశ పడలేదు. నిజానికి గరుత్మంతుడికి ఆ యోగ్యత కూడా ఉంది. తల్లిదండ్రుల, వాలఖిల్యమునుల, దేవతల ఆశీస్సులు కూడా ఉన్నాయి. అయినా, కేవలం తాను వచ్చిన పనిని ముగించుకుని, నాగులకి అమృతాన్ని ఇచ్చినట్టే ఇచ్చి, ఇంద్రుడి అభిమతం మేరకు వారు మళ్లీ అమృతాన్ని తీసుకువెళ్లడానికి అడ్డుపడలేదు. మొత్తం గరుత్మంతుడు చేసిన సాహసంలో ప్రేమ, ఆప్యాయత, పరాక్రమం, యుక్తి,

బాధ్యత, శౌర్యం, త్యాగం వంటి ఎన్నో లక్షణాలను ఆయా సందర్భాల్లో ప్రదర్శించాడు. ఈ ఘట్టం ద్వారా పరిపూర్ణమైన వ్యక్తిత్వానికి గరుత్మంతుడు గొప్ప ఉదాహరణగా నిలిచాడు.

## 3.4. కురుక్షేత్ర సంగ్రామానికి బీజం

కురుక్షేత్ర యుద్ధానికి బీజం ఎక్కడ పడిందో నన్నయ ఈ పద్యంలో వివరించారు. మొత్తం కథని ఒక సీసపద్యంలో సంక్షిప్తంగా వివరించారు. మహాభారతంలో ఉన్న మూలకథకి బీజం ఇక్కడే పడింది. ఇదే క్రమంగా పెరిగి మహాసంగ్రామానికి దారి తీసింది.

సీ. పాండుకుమారులు పాండుభూపతిపరో /క్షంబున హస్తిపురంబునందు
ధృతరాష్ట్రునొద్దఁ దత్సుతులతో నొక్కటఁ /బెరుఁగుచు, భూసురవరులవలన
వేదంబులును ధనుర్వేదాదివిద్యలుఁ /గఱచుచుఁ గడలేనియెఱుకఁ దనరు
చున్నఁ, దద్విపుల గుణోన్నతి సైఁపక /దుర్యోధనుండు దుష్కార్య మెత్తి

ఆ. దుర్ణయమున శకునికర్ణదుశ్శాసనుల్
గఱపఁ బాండవులకు నఱయ చేయఁ
గడఁగెఁ; బాండవులును గడుధార్మికులు గానఁ
బొరయ రైరి వారిదురితవిధుల. (*ఆంధ్ర. ఆది.3:12*)

'పాండురాజు మరణానంతరం పాండవులు హస్తినాపురంలో ధార్తరాష్ట్రులతో పాటు పెరుగుతూ, విప్రవరుల వద్ద వేదాలు, ధనుర్వేదాదివిద్యలు నేరుస్తూ, అపారజ్ఞానసంపన్నులై ఉండగా, వారి సుగుణ సంపదకు, సహించక దుర్యోధనుడు దుష్కార్యాలకు తలపడి, శకుని కర్ణ దుశ్శాసనులు బోధించగా పాండవులకెల్లప్పుడూ కీడే చేయడానికి యత్నించేవాడు. పాండవులు పరమధార్మికులవటం చేత ధార్తరాష్ట్రుల దుష్కార్యాల వలన హాని పొందకుండా ఉండేవారు'.

"తద్విపుల గుణోన్నతి సైపక"– పాండవుల సుగుణసంపదకు సహించలేక దుర్యోధనుడు దుష్కార్యాలకు పాల్పడ్డాడు. అంటే దుర్యోధనుడి మనస్సులో పాండవుల పట్ల జనించిన ఈర్ష్యాద్వేషాలే కురుక్షేత్ర సంగ్రామానికి బీజం వేశాయి. అందుకే, దుర్యోధనుడు పాండవులకి ఎప్పుడూ కీడు తలపెట్టడానికి విశ్వప్రయత్నాలు చేసేవాడు. బీజప్రాయంగా దుర్యోధనుడి మనస్సులో ప్రారంభమైన అసూయ క్రమక్రమంగా పెరిగి యుద్ధానికి దారి తీసింది.

స్వార్థం సొంతవాళ్ల మధ్య కూడా చిచ్చు పెదుతుందనడానికి మహాభారత కథ గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. అన్నాదమ్ముల మధ్య, భార్యాభర్తల మధ్య, స్నేహితుల మధ్య, సోదరుల మధ్య, సహాధ్యాయుల మధ్య, ఎవ్వరి మధ్యనైనా విభేదాలు రావడానికి ప్రధాన కారణం స్వార్థం. అది బీజ ప్రాయంగా మనస్సులో పెరిగి ఎంతటి విధ్వంసాలకు దారి తీస్తుందో మహాభారత కథ చూస్తే అర్థమవుతుంది. మానవ సంబంధాల విలువ తెలిసినవారు స్వార్థానికి దూరంగా ఉండడం మంచిదనే విషయం ఈ కథ ద్వారా స్పష్టమవుతోంది. కేవలం సోదరుల మధ్య పుట్టిన వైరం కొన్ని లక్షల ప్రాణాలు బలి తీసుకుంది. అంటే మహాభారతంలో వ్యక్తిగతమైన వైరం అకారణంగా పెద్ద సమూహాన్ని బలి తీసుకుంది. మహాభారతగాథ తరతరాలకి వర్తిస్తుంది. ఆ కథ ఇచ్చే సందేశం అన్ని యుగాలకీ వర్తిస్తుంది. అందుకే, మహాభారతం సార్వకాలికమైనది. అందులోని సామాజికాంశాలు ఏ కాలానికైనా అవసరమయ్యే సందేశాన్నిస్తాయి.

## 3.5. కచ దేవయానుల కథ

గురుశిష్యసంబంధానికున్న విలువ గురించి, శిష్యుల మధ్య ఉండవలసిన అనుబంధం గురించి కచుడి కథలో చక్కని వచనంలో ప్రస్తావించబడింది.

వ. ఇట్లు గురుశుశ్రూషాకౌశలంబునఁ గచుండు శుక్రునకుం బ్రియశిష్యుం డై యున్న నెఱింగి, దానవులు సహింపనోపక బృహస్పతితోడి యలుకనక్కచు నొక్కనాఁడు హోమధేనువులం గాచుచు వనంబున నేకతంబ యున్న వాని వధియించి, విశాల సాలస్కంధంబున బంధించి చని; రంత నాదిత్యుం డస్తగిరి శిఖరగతుం డగుడు మగుడి హోమధేనువు లింటికి వచ్చిన, వానితోడన కచుండు రాకున్న, దేవయాని తనమనంబున మలమల మఱుంగుచుం బోయి తండ్రి కి ట్లనియె. (*ఆంధ్ర. ఆది.3:111*).

'ఈ విధంగా కచుడు తన సేవానైపుణ్యంతో శుక్రుడికి ప్రియశిష్యుడై ఉండడం తెలిసికొని రాక్షసులు సహించలేక, దేవగురువైన బృహస్పతితో తమకు గల వైరాన్ని పురస్కరించుకుని కోపించి, ఆ కచుడు ఒకరోజు హోమధేనువులను కాస్తూ ఒంటరిగా ఉండగా అతడిని వధించి, ఒక పెద్దచెట్టుబోదెకు బంధించి వెళ్లిపోయారు. గమనించి దేవయాని కలవరపడుతూ తన తండ్రి వద్దకు వెళ్లి ఇట్లా అన్నది'.

కచుడు తన సేవానైపుణ్యంతో, గురుభక్తితో శుక్రుడికి బాగా దగరయ్యాడు. విద్యార్థులందరికంటే చదువులోను, సంస్కారంలోను తక్కిన వారికంటే ముందుండే విద్యార్థిని గురువు అభిమానించడం సహజం. శుక్రుడికి కచుడిపై గురి కుదరడానికి అదే కారణం. అయితే, శుక్రుడి వద్ద రకరకాల విద్యలభ్యసిస్తున్న మిగిలిన విద్యార్థులు కచుడిని చూసి అసూయకి గురయ్యారు. 'స్పర్థయా వర్ధతే విద్యా' అన్న చందంగా వారు పోటీగా భావించి గురుశుశ్రూష చేసి ఉంటే బావుండేది. కానీ, వారు కచుడిని పోటీగా భావించకుండా శత్రువుగా భావించి అతడిని ఏకంగా హత్య చేశారు.

విద్య వినయాన్ని, సమభావాన్ని, సహృదయతని నేర్పిస్తుంది. అటువంటి మంచి గుణాలను విస్మరించి ఇంతటి ఉన్మాదానికి శుక్రుడి శిష్యులు తెగబడడంతో వారు అభ్యసించిన విద్య నిరర్థకంగా మారింది. ఆధునిక కాలంలో ఇటువంటి సంఘటనలు తరచుగా వార్తాపత్రికల్లో కనిపిస్తున్నాయి. విద్యార్థుల మధ్యలో ఉండాల్సింది ఆహ్లాదకరమైన పోటీయే కాని, ఈర్ష్యాసూయలు కాదు. అందుకే, విద్యను కేవలం మార్కులకోసం కాకుండా విమర్శనాత్మక దృష్టితో చదవడం అవసరమనే విషయం ఈ కథ ద్వారా బోధపడుతోంది. నైతికవిలువలతో కూడిన విద్య మాత్రమే విద్యార్థుల వ్యక్తిత్వాలను ఉన్నంతంగా తీర్చిదిద్దగలదు అనే విషయం కూడా స్పష్టమవుతోంది.

కచుడి నడక, నడత, సంస్కారం చూసి శుక్రాచార్యుడి కుమార్తె అయిన దేవయాని అతడి పై మనసు పడింది. ఆ విషయం కచుడికి తెలియజేసింది. ఆ సందర్భంలో కచుడి స్పందన అతడి సంస్కారానికి నిదర్శనంగా కనిపిస్తుంది.

క. గురులకు శిష్యులు పుత్త్రులు
పరమార్థమ లోకధర్మపథ మిది; దీనిం
బరికింపక యీ పలుకులు
తరుణీ! గురుపుత్త్రి! నీకుఁ దగునే పలుకన్. (*ఆంధ్ర. ఆది.3:131*)

'యువతీ! గురుకుమారీ! గురువులకు శిష్యులు కొడుకులతో సమానులు. ఇది పరమసత్యం. లోకమనుసరించవలసిన ధర్మమార్గం. దీనిని చూడక నన్ను పరిగ్రహించు మని పలకడం నీకు ఉచితమా!'

కచుడి వ్యక్తిత్వాన్ని గొప్పగా చిత్రించిన పద్యం ఇది. అతడి సంస్కారం పాఠకులను సైతం ఆశ్చర్యపరుస్తుంది. గురువుగారి కుమార్తె తనకి సోదరితో సమానమని పలికి కచుడు తన ఔన్నత్యాన్ని చాటుకున్నాడు. ఈ విషయాన్ని నన్నయ సూక్తిమౌక్తికంగా పాఠకులకందించాడు.

కోరికలకి బానిసలై, వావి వరుసలు మరచిపోతున్న నేటి యువతరానికి ఈ పద్యం గొప్ప పాఠాన్ని నేర్పిస్తుంది. గురువు దగ్గరకి శిష్యుడు వచ్చేది విద్యనభ్యసించడానికి. అది మాత్రమే విద్యార్థుల బాధ్యత. ఆ బాధ్యతని విస్మరించి, హద్దులు మీరిన వారికి కష్టాలు తప్పవని హితబోధ చేస్తోంది ఈ ఘట్టం. గురుశిష్యుల మధ్య సంబంధం ఎలా ఉండాలో నేటి తరం ఈ ఘట్టంలోని పాత్రల ద్వారా తెలుసుకోవాలి.

## 3.6. యయాతి వృత్తాంతం: మానవ సంబంధాలు

శుక్రాచార్యుడు దేవయానితో పలికిన ఈ మాటలు కోపం ఎంత ప్రమాదమైనదో తెలియజేస్తాయి. మనవ సంబంధాలను సరిగ్గా కాపాడుకోవాలంటే కోపాన్ని త్యజించవలసిందే అంటూ నన్నయ రచించిన ఈ సూక్తిమౌక్తికాలు గొప్ప సందేశానిస్తాయి.

ఉ. నిగ్రహ మేది నన్నుఁ దరణిప్రభ! కూపము వెల్వరించునాఁ
దుగ్రమయూఖసాక్ష్యముగ నున్నతదక్షిణపాణిఁ జేసి భూ
పాగ్రణి! నాదు దక్షిణకరాగ్రము వట్టితి కాన మున్న పా
ణిగ్రహణంబు సేసి; తది నీయెడ విస్మృతిఁ బొందఁ బాడియే. (*ఆంధ్ర. ఆది.3:160*).

'సూర్యుడి యొక్క కాంతి వంటి కాంతి గల ఓ రాజశ్రేష్ఠుడా! నాకు కలిగిన చెర (శిక్ష) నశించేటట్లుగా నన్ను నూతి నుండి బయటకి తీసిననాడే సూర్యుడే సాక్షిగా దీర్ఘమైన నీకుడిచేతితో నాకుడి ముంజేతిని గ్రహించావు. కాబట్టి ఇంతకుముందే నన్ను పెళ్లాడినావు (నా చేయి పట్టుకున్నావు). ఆ విషయం నీ హృదయంలో మరవడం న్యాయమా'!

యయాతికి శర్మిష్ఠపై ఆసక్తి ఉంది. అయితే, తనకు దాసి అయిన శర్మిష్ఠపై యయాతి మనసుపడం దేవయానికి రుచించలేదు. అందుకే తనకి, యయాతికి ముందే పాణిగ్రహణం అయిపోయిందని మనోధర్మాన్ని ప్రతిపాదించింది. యయాతిని ఎలాగైనా తానే దక్కించుకోవాలని భావించింది. మనసులో కోరిక కలిగితే వివాహమయినట్లే అని దేవయాని ఉద్దేశ్యం.

కథ ప్రకారం యయాతికి దేవయాని పట్ల ఆసక్తి లేదు. కానీ, మనసు ఒకసారి ఇచ్చిపుచ్చుకుంటే వివాహం అయినట్టే అనే మనోధర్మం ఇక్కడ గమనించదగింది. అలాంటి ప్రతిపాదన ముందు పెట్టడానికి దేవయానికి వేరే కారణాలు ఉన్నాయి. కానీ, ఆధునిక సమాజానికి ఈ మనోధర్మం అన్వయించుకోవాలి.

నేడు అత్యాధునిక సమాజంలో సహజీవనాలు, విడాకులు వంటి పరిస్థితులు చాలా సహజం అయిపోయాయి. చిన్న చిన్న కారణాలకి యువత విపరీతమైన నిర్ణయాలు తీసుకుంటున్నారు. దేవయాని ప్రతిపాదించిన మనోధర్మం నేటి యువతరానికి మార్గనిర్దేశం చేస్తుంది. ఒకసారి ఇద్దరు వ్యక్తులు మనసులు ఇచ్చిపుచ్చుకున్నప్పుడు అది వివాహం అయినట్టే అనే భావాన నేటి తరంలో పెరిగితే, జీవితాంతం వారు ఆ బంధానికే కట్టుబడి ఉంటారు. వివాహం అయ్యాక కూడా ఎటువంటి సమస్యలు వచ్చినా సామరస్యంగా పరిష్కరించుకోవాలే తప్ప ప్రతీ చిన్న కారణానికి విడాకులు అంటూ న్యాయస్థానాలను ఆశ్రయించడం మన సంస్కృతి కాదనే విషయాన్ని అందరూ గ్రహించాలి. లేకపోతే కేవలం శారీరకమైన వాంఛల కోసమే వివాహం, లేదా సహజీవనాలు అన్నట్టుగా పరిస్థితులు తయారయ్యాయి. శారీరక వాంఛ బంధంలో ఒక భాగం మాత్రమేనని, బ్రతికున్నంతవరకు మనసులు కలిసి ఉండడమే వివాహ వ్యవస్థ వెనక ఉన్న అసలైన ఉద్దేశ్యమని ఈ కథలో లభించిన సందేశాన్ని గ్రహించాలి. ఇంద్రియనిగ్రహం మనిషికి ఎంత అవసరమో యయాతి కథ ద్వారా తెలుస్తోంది.

వ. ఇట్లు జరాక్రాంతుం డైన యయాతి గొడుకులనెల్లరావించి 'నాకు విషయసుఖతృప్తి లేకున్నయది గావున మీయందొక్కరుండు నా ముదిమి గొని తన జవ్వనంబు నా కిచ్చునది' యనిన విని యదు తుర్వసు ద్రుహ్యులు దండ్రి కి ట్లనిరి. (*ఆంధ్ర. ఆది.3:192*).

క. నరలు గల కాము నైనను
దరుణులు రోయుదురు డాయ; ధనపతి యయ్యుం
బురుషుఁడు దుర్వారజరా
పరిభూతి నభీష్టభోగబాహ్యుఁడ కాఁడే. (*ఆంధ్ర. ఆది.3:194*).

'ఈ విధంగా ముసలితనం చేత ఆక్రమించబడిన యయాతి కొడుకులందరినీ దగ్గరకు వచ్చేటట్లు చేయించుకొని 'నాకు ఇంద్రియభోగాలను అనుభవించుటవలన తృప్తి కలగక ఉన్నది.

కావున మీలో ఒకడు నా ముసలితనం గ్రహించి తన యౌవనాన్ని నాకు ఇవ్వవలసింది' అని యయాతి పలుకగా విని యదువు, తుర్వసుడు, ద్రుహ్యు, అనువు అనే కుమారులు యయాతితో ఇలా చెప్పారు.

'నెరసిన వెంట్రుకలు కలిగిన మన్మథుడినైనా యౌవనవతులు సమీపించడానికి అసహ్యించుకుంటారు. పురుషుడు ధనవంతుడైనా కూడా వారించశక్యం కాని ముసలితనంవలన కలిగే రోత చేత ఇష్టములైన భోగాలు పొంద వీలు లేనివాడు కాడా'!

యయాతికి ఉన్న శాపం ప్రకారం, తన కొడుకుల్లో ఎవరైనా తండ్రికి వారి యౌవనాన్ని ధారపోసి, తండ్రి వార్ధక్యాన్ని అతడు స్వీకరించాలి. శాపం మాట ఎలా ఉన్నా, యయాతి ప్రవర్తన ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఇంతటి జీవితాన్ని అనుభవించి కూడా ఇంకా ఇంద్రియనిగ్రహాన్ని సాధించలేకపోవడం గమనార్హం. అయితే, యయాతి కొడుకులు ఇచ్చిన సమాధానం కూడా పాఠకులకి గొప్ప సందేశాన్నిస్తుంది. వార్ధక్యం వచ్చాక, మన్మథుడిని సైతం ఎవ్వరూ దరిచేయనియ్యరు అని యయాతికి సమాధానమిచ్చారు కుమారులు. అంటే, ధనం ఉన్నా కూడా రూపలావణ్యం ప్రధానమనే భావాన వారి మాటల్లో ధ్వనిస్తోంది. కానీ, తార్కికంగా ఆలోచిస్తే రెండూ ఆశాశ్వతమే. రూపం, ధనం చిరకాలం ఉండేవి కావు.

## 3. 7. శకుంతలోపాఖ్యానం

నన్నయ రచించిన ఆది పర్వంలో ఎన్నో సామాజికాంశాలకు నిలయం శకుంతలోపాఖ్యానం. ప్రత్యేకించి, మానవ సంబంధాలను ఈ ఘట్టం ఆవిష్కరించిన తీరు అమోఘం. నన్నయ తన అక్షర రమ్యతతో, నానారుచిరార్థసూక్తినిధిత్వంతో ఈ ఘట్టాన్ని అత్యంత రమణీయంగా మలిచాడు. యావద్భారతీయ సాహిత్యంలోనే ఈ ఘట్టానికి ఒక ప్రత్యేక స్థానం ఉంది.

వ. 'నాజన్మప్రకారంబు మాయయ్య యమ్మునికిం జెప్పినవిధంబు చెప్పెదఁజిత్తగించివిను'మని యాదుష్యంతునకు శకుంతల యి ట్లనియె. (*ఆంధ్ర. ఆది. 4: 35*)

'మా తండ్రిగారైన కణ్వమహర్షి నా జన్మవృత్తాంతాన్ని ఆ మునికి చెప్పిన పద్ధతి నీకు విన్నవిస్తాను. మనసు పెట్టి వినుమ'ని శకుంతల దుష్యంతుడితో ఈ విధంగా అన్నది.

నన్నయ ప్రసన్నకథాకలితార్థయుక్తికి ఈ వచనం ఒక ఉదాహరణ. శకుంతల జన్మవృత్తాంతాన్ని నేరుగా కణ్వమహర్షి ఎప్పుడూ శకుంతలకి చెప్పలేదు. వేరే ఒక మునితో చెప్తూ శకుంతలకి పరోక్షంగా తెలిసేలా చేశాడు. ఆ వృత్తాంతం శకుంతలకి తెలియడం వల్ల తనను కంటికి రెప్పలా పెంచి పోషించిన కణ్వమహర్షిపట్ల, తన జీవితంలో తాను తీసుకునే నిర్ణయాల పట్ల శకుంతల మరింత బాధ్యతగా ఉంటుంది. కణ్వమహర్షి నేరుగా చెప్పకపోవడంలో గొప్ప ఔచిత్యమే కాదు కూతురుపట్ల తనకున్న బాధ్యత కూడా కనిపిస్తుంది.

మానవసంబంధాలు ఎంత విలువైనవో వాటిని ఎంత చక్కగా నిలబెట్టుకోవాలో ఈ ఘట్టం (శాకుంతలోపాఖ్యానం) యావత్తూ మనకు తెలియజేస్తుంది. తండ్రీ కూతుళ్ల మధ్య ఉండే ఆప్యాయత, యుక్త వయస్సులో ఉండే ప్రేమ ఏది ధర్మబద్ధమైనది? ఏది కాదు? ప్రేమని నిలబెట్టుకోవడం ఎలా? కుటుంబ గౌరవాన్ని కాపాడుకోవడం ఎలా? వంటి ఎన్నో విషయాలకు సమాధానాలు శాకుంతలోపాఖ్యానంలో కనిపిస్తాయి.

దుష్యంతుడు శకుంతలని గాంధర్వ వివాహం చేసుకొని, కొంతకాలం శకుంతలతో విహరించి, తాను రాజ్యానికి వెళ్లి శకుంతల కోసం తన పరివారాన్ని పంపిస్తానని చెప్పి ఎంతకీ తిరిగి రాకపోవడంతో, వారి సంతానమైన భరతుడిని తీసుకొని దుష్యంతుడి రాజ్యానికి తానే వెళ్తుంది. నిండు సభలో తాను ఎవరో తెలియనట్టు ప్రవర్తిస్తున్న దుష్యంతుడి ముందు శకుంతల గొప్ప ధార్మికోపన్యాసం చేస్తుంది.

క. సంతతగృహమేధి ఫలం

బంతయుఁ బడయంగ నోపు ననుగుణభార్యా

వంతుం డగువాఁడు క్రియా

వంతుఁడు దాంతుండుఁ బుత్త్రవంతుండు నగున్. *(ఆంధ్ర. ఆది. 4: 83)*

'అనుకూలవతి అయిన భార్యగలవాడు కర్మలు ఆచరించగలుగుతాడు, ఇంద్రియాలను నిగ్రహించగలుగుతాడు, పుత్రసంతానాన్ని పొందగలుగుతాడు, గార్హస్త్యధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించే గృహస్థుడు పొందే ఫలాలనంతటినీ అందుకోగలుగుతాడు'.

అనుకూలవతియైన భార్యకలవాడు ఎంత అదృష్టవంతుడో, అతడు ఎటువంటి ఫలాలను పొందుతాడో ఈ పద్యంలో నన్నయ ప్రస్తావించారు. ఇంద్రియనిగ్రహం అటువంటి భార్యవల్లనే సాధ్యపడుతుంది అని ఈ పద్యంలో భాగంగా నన్నయ చెప్పారు.

సాధారణంగా ఇంద్రియనిగ్రహం అనగానే వివాహం చేసుకోకుండా ఉండడమని నేటితరం వాళ్లు అనుకుంటారు. అది పొరపాటు. ఒక వ్యక్తికే అంకితమై ఉండి, సర్వసుఖాలు అనుభవించడం ధర్మబద్ధమైన జీవన విధానమే.

'ఇంద్రియనిగ్రహం' అన్న మాటలోనే అర్థమంతా ఉంది. ఇంద్రియాలను అదుపులో ఉంచుకోవడం. అది అనుకూలవతియైన భార్య ఉన్నవారికి సాధ్యపడుతుందని ఋషి వంటి నన్నయ చెబుతున్నాడు. అందుకు మన పురాణాల్లో, కావ్యాల్లో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. అల్లసాని పెద్దన విరచితమైన మనుచరిత్రలో సోమిదమ్మ పాత్ర అటువంటిదే. సోమిదమ్మ అంత అనుకూలవతి కాబట్టే, ప్రవరుడు హిమాలయాల్లో, నిర్జనారణ్యంలో వరూథిని తనని ఎంత మభ్యపెట్టినా, ప్రలోభానికి గురి చేసినా లొంగలేదు. శకుంతల అనుకూలవతి కాబట్టే, దుష్యంతుడి పేరుప్రతిష్ఠల గురించి అనుక్షణం తపించింది. గృహస్థాశ్రమధర్మాన్ని తానను ఆచరిస్తూనే తన భర్త కూడా ఆ ధర్మఫలాలను అనుభవించేందుకు తోడ్పడింది.

భార్యాభర్తల మధ్య సంబంధం ఎంత బలంగా ఉండాలో ఈ ఒక్క ఘట్టాన్ని చూసినా చాలు, అది నేటి తరానికి ఎంతో గొప్ప సందేశాన్నిస్తుంది. భారతీయ జీవన విధానానికి పట్టుగొమ్మయైన కుటుంబ వ్యవస్థ మావిడాకుల సంస్కృతి అని, విడాకుల సంస్కృతి కాదని మరొకసారి ఈ ఘట్టం నిరూపణ చేస్తోంది. చిన్న చిన్న గొడవలకే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తున్న నేటితరం దంపతులు, తాము అగ్నిసాక్షిగా చేసిన ప్రమాణాన్ని, తమ విధ్యుక్త ధర్మాలను విస్మరించడం ఎంతవరకు న్యాయం అని ఎవరినివారు ప్రశ్నించుకోవాలి. ఎన్ని కష్టాలు వచ్చినా తన భర్తను, బిడ్డను విడిచిపెట్టని శకుంతలను చూసి మానవసంబంధాలు ఎంత విలువైనవో తెలుసుకోవచ్చు.

సీ. ధర్మార్థకామసాధన కుపకరణంబు / గృహనీతివిద్యకు గృహము, విమల
చారిత్రశిక్ష కాచార్యకం, బన్వయ / స్థితికి మూలంబు, సద్గతికి నూఁత,
గౌరవంబున కేకకారణం, బున్నత / స్థిరగుణమణుల కాకరము, హృదయ
సంతోషమునకు సంజనకంబు భార్యయ / చూవె భర్తకు, నొండ్లు గావు ప్రియము,

ఆ. లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను
నెట్టితీఱములను ముట్టఁబడిన
వంతలెల్లఁ బాయు నింతులఁ బ్రజలను
నొనరఁ జూడఁగనిన జనుల కెందు. *(ఆంధ్ర. ఆది. 4: 85)*

'ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించడానికి అనువైన సాధనము, గృహనీతి అనే విద్యకు నెలవైనది, నిర్మలమైన శీలాన్ని గురించి బోధించే గురుస్థానము, వంశం నిలవడానికి ఆధారమైనది, ఉత్తమగతులను పొందడానికి ఊతకర్రయైనది, మన్ననకు ముఖ్యహేతువైనది, ఆదర్శప్రాయమైనవి, కలకాలం నిలేచేవి అయిన మణులవంటి గుణాలకు నెలవైనది, హృదయానందాన్ని కలిగించేది భర్తకు భార్యయే సుమా! మగనికి ఇల్లాలికంటే ఇంపైనది వేరొకటి లేదు. ఆలు బిడ్డలను ఆప్యాయంగా చూసేవారికి ఏచోటనైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి ఆపదలలోనైనా, ఏ తీరాలలోనైనా చుట్టుముట్టిన దుఖాలన్నీ తొలగిపోతాయి'.

పురుషార్థాలు నాలుగింటిలో మోక్షం తప్ప తక్కినవాటి సాధనకు అనువైన సాధనము గృహిణి అని నన్నయ చెప్పారు. మోక్ష సాధనకు అన్ని బంధాలను త్యజించడం అవసరం, మోక్షం ఎవరికి వారే సాధించుకోవలసినది. అందుకే, నన్నయ మోక్షం తప్ప తక్కినవాటిని పేర్కొన్నాడు. నన్నయని ఋషి అనడం అందుకే సార్థకం. ఈ పద్యంలో గృహిణి గొప్పతనాన్ని నన్నయ చాలా సహజంగా వర్ణించారు. భారతీయ జీవన విధానంలో, అందునా హిందూధర్మంలో ధర్మపత్ని పక్కన లేకుండా భర్త యజ్ఞం, వ్రతం ఏదీ చేయడానికి వీలు లేదు. మన శాస్త్రాల్లో భార్యకి అంత ప్రాధాన్యం ఉంది. ఎవరైతే భార్య, పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకుంటారో వారికి ఎటువంటి పరిస్థితిలోనైనా చుట్టుముట్టిన కష్టాలన్నీ తొలగిపోతాయి అని పద్య సారాంశంగా చెప్పారు.

గృహస్థాశ్రమధర్మరక్షణకు కేంద్ర బిందువు గృహిణి. ఈ సన్నివేశంలో శకుంతల అందుకు ఉదాహరణ. తన కుటుంబ బాధ్యతనంతా శకుంతలే మోస్తోంది. తనని, తన బిడ్డని స్వీకరించనిదే

జీవితంలో ఏ సద్గతులు పొందడం సాధ్యం కాదని శకుంతల దుష్యంతుడికి పరోక్షంగా స్పష్టం చేసింది.

శాకుంతలోపాఖ్యాన ఘట్టం ఆధారంగా నేటితరం గ్రహించవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా మానవసంబంధాలను నన్నయ ఈ ఘట్టంలో చాలా వాస్తవికంగా చిత్రించాడని చెప్పాలి. నేటికీ ఆ పాత్ర చిత్రణ చాలా సహజంగా కనిపిస్తుంది. సహజీవనాల పేరిట, నేటి తరం దంపతులు మానవసంబంధాలకు విలవనివ్వకుండా ఎంతో మంది పిల్లల భవిష్యత్తుని ప్రశ్నార్థకంగా మారుస్తున్నారు. అటువంటి తరుణంలో ఇటువంటి పాఠాలు మానవాళికి అవసరం. కాపురాలను ఎలా నిలబెట్టుకోవాలో ఈ ఘట్టంలోని శకుంతల పాత్ర ద్వారా నన్నయ నేటితరానికి దిశానిర్దేశం చేస్తున్నాడు.

క. తాన తననీడ నీళ్లు ల
లో నేర్పడఁ జూచునట్లు లోకస్తుతత !
త్సూను జనకుండు సూచి మ
హానందముఁ బొందు నతిశయప్రీతిమెయిన్. *(ఆంధ్ర. ఆది. 4: 88)*

వ. 'పున్నామ్నో నరకాత్త్రాయత ఇతి పుత్ర' యను వేదవచనంబు గలదు గావునఁ బుణ్యాచారుం
డయిన పుత్త్రుం డుభయపక్షంబులవారి నుద్ధరించుఁ; గావున. *(ఆంధ్ర. ఆది. 4: 89)*

'రాజా! పురుషుడు నీళ్లలో తన నీడ తాను స్పష్టంగా చూసినవిధంగా తండ్రి కొడుకును చూసి మిక్కిలి సంతృప్తితో మహదానందాన్ని పొందుతాడు'.

'పుత్ అనే పేరుగల నరకం నుండి తల్లిదండ్రులను కాపాడుతాడు కాబట్టి పుత్త్రుడు అనే పేరు ఏర్పడింది అని వేదం చెప్పింది. కాబట్టి ఉత్తమశీలుడైన పుత్రుడు తల్లిదండ్రుల ఉభయవంశాలవారినీ ఉద్ధరిస్తాడు కాబట్టి'.

ముందు దుష్యంతుడికి గృహిణి గొప్పతనం గురించి చెప్పి ఒప్పించడానికి ప్రయత్నం చేసిన శకుంతల, ఇప్పుడు పుత్త్రవాత్సల్య బాణాన్ని దుష్యంతుడిపై సంధించింది. పురుషుడు నీళ్లలో తన నీడని తాను స్పష్టంగా చుసుకున్నట్టే, తండ్రి కొడుకుని చూసి అంతటి మహదానందాన్ని పొందుతాడు. పుత్త్రవాత్సల్యం అంత గాఢమైనది.

"పరమాత్మకు జీవాత్మకు బింబ ప్రతిబింబ భావం అద్వైతంలో చెప్పబడినట్లు ఇక్కడ తండ్రీకొడుకులకు బింబప్రతిబింబ భావం చెప్పబడింది. తత్త్వతః రెండూ ఒకటే అని భావం". (*ఆంధ్ర. ఆది. 4. పుట: 346*)

పుత్రుడు అనే శబ్దానికి పున్నామనరకాల నుండి రక్షించేవాడు అని వ్యుత్పత్త్యర్థం. అది కూడా ఇరువంశాల వారినీ అని నన్నయ స్పష్టం చేస్తున్నాడు. తండ్రి తనని తాను ఎంత ప్రేమిచుకుంటాడో, కొడుకుని కూడా అంత గాఢంగా ప్రేమిస్తాడు. అందుకే బింబప్రతిబింబ భావనని ఉదహరించారు. నన్నయ తర్వాతి పద్యంలో తండ్రీ కొడుకుల సంబంధాన్ని దీపం నుండి మరొక దీపం పుట్టడంతో పోల్చాడు. రూపాంతరం పొందినా రూపసామ్యం తండ్రీపుత్రులలో ఉంటుందని నన్నయ వర్ణించారు. శకుంతల తండ్రీకొడుకుల మధ్య ఉండే గాఢతని వివరించి, కుమారుడి విలువను దుష్యంతుడికి తెలియజెప్పే ప్రయత్నం చేస్తోంది. తేజస్సుతో ప్రకాశిస్తున్న భరతుడిలో తన పోలికలు చూసుకోమని, కుమారుడిని చూసైనా జరిగిన వృత్తాంతాన్ని జ్ఞప్తికి తెచ్చుకొమ్మని కోరింది.

మ. విపరీతప్రతిభాష లేమిటికి నుర్వీనాథయీ పుత్త్రుగా !
త్రపరిష్వంగసుఖంబు సేకొనుము ముక్తాహార కర్పూర సాం
ద్రపరాగ ప్రసరంబుఁ జందనముఁ జంద్రజ్యోత్స్నయుం బుత్త్రగా
త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబే కడున్ శీతమే. *(ఆంధ్ర. ఆది. 4: 91)*

'ఓరాజా! విరుద్ధాలైన మారుమాటలు ఎందుకు? ఈ పుత్రుడిని కౌగిలించుకొని ఈతడి కౌగిలివలన కలిగే సుఖాన్ని అనుభవించుము. ముత్యాలహారాలు, పచ్చకర్పూరపు దట్టమైన పొడి ప్రసారం, మంచి గంధము, వెన్నెలయు జీవులకు పుత్రుని కౌగిలివలె మనసుకు సుఖాన్ని, మంచి చల్లదనాన్ని కలిగించలేవు'.

పుత్రుడి కౌగిలి కలిగించినంత సుఖాన్ని ముత్యాలహారాలు, మంచి గంధం, వెన్నెల మొదలైనవేవీ కలిగించలేవు అని నన్నయ పలికినమాట ప్రత్యక్షర సత్యం. అత్యంత వాస్తవికం. శకుంతల దుష్యంతుడిపై కురిపించిన బాణాలలో ఇది నిజంగా సమ్మోహనాస్త్రమే. తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాచుర్యం పొందిన పద్యాలలో ఈ పద్యం ఒకటి. తండ్రీకొడుకుల మధ్య ఉండే వాత్సల్యాన్ని బహుశా తెలుగు సాహిత్యంలో మరెవ్వరూ ఇంత గొప్పగా వర్ణించలేదు అంటే అతిశయోక్తి కాదేమో!

శకుంతల గృహస్థాశ్రమధర్మ ప్రాశస్త్యాన్ని వివరించే క్రమంలో ఆ ధర్మానికి మూల స్తంభాలైన యజమాని, గృహిణి గురించి ముందు చెప్పింది. ఇప్పుడు కుమారుడి ప్రాధాన్యత గురించి చెప్పి దుష్యంతుడికి జరిగిన కథను గుర్తు చేసే ప్రయత్నం చేస్తోంది.

"స్పర్శ సిద్ధాంతాన్ని ప్రతిపాదించే ఈ పద్యం నన్నయగారి సూక్తిమధురమైన కవిత్వానికి ఉత్తమ ఉదాహరణగా తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందింది. ఇందులో నన్నయ ఎన్నుకున్న ఉపమాద్రవ్యాలన్నీ అమూలకాలే". (*ఆంధ్ర. ఆది. 4. పుట: 347*)

4 అనే సంఖ్యకి ఈ ఘట్టంలో ఒక ప్రాధాన్యత కనిపిస్తుంది. మన ధర్మ శాస్త్ర గ్రంథాలు, చతుర్వేదాలు చెప్పిన ఆశ్రమ ధర్మాలు నాలుగు (4). అవి– బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాసం. గృహస్థాశ్రమ ధర్మానికి మూలస్తంభాలు నాలుగు (4)– యజమాని, గృహిణి, పుత్రుడు/పుత్రిక, సత్యం. 4వ ఆశ్వాసంలోని ఈ ఉపాఖ్యానంలో ఉన్న ప్రధానమైన పాత్రలు నాలుగు (4) – కణ్వమహర్షి, దుష్యంతుడు, శకుంతల, భరతుడు. శకుంతల దుష్యంతుడి వద్దకు చేరడానికి (లక్ష్యానికి) నాలుగు అడుగుల దూరంలో ఉంది. అందుకే ఒక్కొక్క అడుగు ముందుకు వెడుతోంది. యజమాని గొప్పతనం, గృహిణి ప్రాధాన్యత, కుమారుడి ఔన్నత్యాల గురించి వివరిస్తూ, హితబోధ చేస్తూ మూడు అడుగులు వేసింది. ఇక మిగిలినది సత్యమే (సత్య స్వరూపమైన పరమ ధర్మం). అది అన్నింటికంటే గొప్పది, శాశ్వతమైనది. అభిజ్ఞానశాకుంతలం నాటకంలో కూడా చతుర్థాశ్వాసం (4) ప్రసిద్ధం, ప్రత్యేకించి నాలుగు (4) శ్లోకాలు బాగా ప్రసిద్ధమైనవి, రమ్యమైనవి అని కీర్తించబడ్డాయి.

గృహస్థాశ్రమధర్మ ప్రాశస్త్యాన్ని వర్ణించే క్రమంలో నన్నయ రచించిన పద్యాలు (ఆంధ్ర. ఆది. 4: 82 నుండి ఆంధ్ర. ఆది. 4: 97 వరకు) మానవసంబంధాలు ఎంత అమూల్యమైనవో, వాటిని ఎలా నిలబెట్టుకోవాలో అత్యంత సహజంగా, వాస్తవికంగా వివరించాయి.

మధ్యాక్కర.

'తడయక పుట్టిననాఁడ తల్లిచేఁ దండ్రిచే విడువఁ
బడితి; నిప్పుడు పతిచేతను విడువఁబడియెదనొక్కొ!
నుడువులు వేయు నిం కేల? యిప్పాటినోములు తొల్లి
కడఁగి నోఁచితిని గా కేమి' యనుచును గందె డెందమున. (*ఆంధ్ర. ఆది. 4: 103*)

‘పుట్టిననాడే వెంటనే తల్లిదండ్రుల చేత ఆనాడు విడువబడ్డాను. ఇప్పుడు భర్తచేత కూడా విడువబడతాను కాబోలు; ఇక వేయి(పెక్కు) మాటలాడటమెందుకు? పూర్వం ఇటువంటి కొరనోములే నోచాను కాబోలు. ఇంత గాక ఏమి అవుతుంది? – అని శకుంతల మనస్సులో బాధపడింది’.

శకుంతల తన జన్మవృత్తాంతాన్ని కణ్వమహర్షి మరొక మునికి చెబుతూ ఉండగా వింది. చిన్నప్పుడే తనని తల్లి, తండ్రి అనాథని చేసి వెళ్లిపోతే, అటుగా వెళ్తున్న కణ్వమహర్షి తనను ప్రేమతో పెంచి పెద్ద చేశాడు. ఆయన ఆశ్రమ పరిసరాల్లో పరస్పర వైరుధ్యాలను మరచి సామరస్యంగా జీవిస్తున్న జంతువులతో ఆడుకుంటూ శకుంతల పెరిగింది. తోబుట్టువులు కూడా ఎవరూ లేరు. అప్పుడు తల్లిదండ్రులు వదిలేస్తే ఇప్పుడు మాట ఇచ్చి వివాహం చేసుకున్న భర్త, బిడ్డతో సహా ఎదురుగా నిలబడ్డ తనని తిరస్కరిస్తున్నాడు. తాను నోచిన నోములు తనకి ఈపాటి ఫలాన్నే ఇస్తున్నాయి కాబోలు అని మనస్సులో అనుకుని కుంగిపోయింది శకుంతల.

శకుంతల ఎన్ని కష్టాలు వచ్చినా ధర్మాన్ని విడిచిపెట్టలేదు. అయితే, తనని చేరదీసి, ఎంతో ప్రేమగా పెంచిన కణ్వమహర్షి అనుమతి తీసుకోకుండా దుష్యంతుడిని గాంధర్వ వివాహం చేసుకోవడం శకుంతల చేసిన తప్పు. తాను తీసుకున్న నిర్ణయానికి పర్యవసానాలు ఎలా ఉన్నా తానే ఎదుర్కోవాలి. అందుకే, తన జీవితం కోసం తానే పోరాటం చేసింది. భరతుడు భవిష్యత్తుని నిర్మించే బాధ్యత తానే తీసుకుంది. ఎన్నో కష్టాలకి ఒర్చింది. ఎన్ని ఇబ్బందులు వచ్చినా, కన్నవారిని కాని, పెంచినవారిని కాని, అత్తారింటివారిని కాని, భర్తని కాని ఒక్క మాటైనా అనలేదు. దైవ దూషణ చేయలేదు. పైగా ఉభాయవంశాల వారికి ఎటువంటి చెడ్డపేరు రాకుండా జాగ్రత్త పడింది. పెంపకం అంటే ఇలా ఉండాలి, వ్యక్తిత్వం అంటే ఇలా ఉండాలి అని నలుగురు అనుకునేలా ప్రవర్తించింది. అతుకులు బొంతలుగా ఉన్న తన జీవితాన్ని మాలికలాగా తీర్చిదిద్దుకునేందుకు అన్ని ప్రయత్నాలు చేసింది. భరతుడి బంగారు భవిష్యత్తుని తన హస్తాలతో లిఖించింది.

బిడ్డ కోసం తపన పడుతున్న తల్లిగా, భర్తను ప్రాణంగా ప్రేమించే గృహిణిగా, తండ్రి పేరుని దశదిశలా మారుమోగేలా చేసిన తనయగా తాను పోషించిన అన్ని పాత్రలకు పరిపూర్ణ న్యాయం చేసింది. కుటుంబంలో ఒక్కరితో సరిగ్గా ఉండడానికే నానాకష్టాలు పడే నేటితరానికి శకుంతల పాత్ర ఒక గొప్ప జీవిత పాఠం.

శకుంతల క్లిష్ట పరిస్థితులను సైతం తన సంభాషణానైపుణ్యంతో, నిర్వహణ సామర్థ్యంతో, మొక్కవోని ధైర్యంతో నిర్భయంగా ఎదుర్కొంది. వ్యక్తిత్వ వికాసానికి కేంద్ర బిందువుగా నిలిచింది. అటువంటివారికి ముందు కష్టాలు (పరీక్షలు) వచ్చినా విజయం తథ్యం. శకుంతల నమ్ముకున్న ధర్మమే తనని చివరికి రక్షించింది (ధర్మో రక్షతి రక్షితః).

## 3.8. గాంధారి వృత్తాంతం

గాంధారి యొక్క పితృభక్తి, పతిభక్తి ఎంత ఆదర్శప్రాయమో ఈ వచనం తెలియజేస్తుంది.

వ. అనిన వారిపలుకులు విని గాంధారి ధృతరాష్ట్రునకుఁ బితృవచనదత్తఁగాఁ దన్ను నిశ్చయించి, 'నాకుఁ బతి యిమ్మహీపతియ కాని యొరుల నొల్ల' నని యప్పరమపతివ్రత పరపురుషదర్శనంబు పరిహరించి, పతి కను గుణంబుగా నేత్రపట్టంబునఁ దన నేత్రంబులు గట్టికొని యుండె; నంత నక్కన్యం దోడ్కొని దాని సహోదరుం డయిన శకుని మహావిభూతితో హస్తిపురంబునకు వచ్చిన, ధృతరాష్ట్రుండును బరమోత్సవంబున గాంధారిని వివాహంబై దానితోఁ బుట్టిన కన్యకల సత్యవ్రతయు సత్యసేనయు సుదేష్ణయు సంహితయుఁ దేజశ్శ్రవయు సుశ్రవయు నికృతియు శుభయు శంభువయు దశార్ణయు నను పదుండ్ర నొక్కలగ్నంబున వివాహం బయి మఱియును. (*ఆంధ్ర. ఆది.5:12*).

ధృతరాష్ట్రుడు గుడ్డివాడు. తండ్రి తనని అతనికే ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకున్నారని గాంధారికి సుబలుని మాటల ద్వారా తెలిసింది. తండ్రి నిర్ణయాన్ని గౌరవించి గాంధారి ధృతరాష్ట్రుడిని తాన భర్తగా నిశ్చయించుకుంది. అంతేకాకుండా, తనకి కాబోయే భర్త గుడ్డివాడని తెలిసి తాను కూడా జీవితాంతం కళ్లకి గంతలు కట్టుకుంది. అంతటి మహాపతివ్రత గాంధారి. గాంధారి వ్యక్తిత్వం నేటి తరాలకు ఎంతో స్ఫూర్తిదాయకం. భార్యాభర్తలమధ్య సంబంధం ఎంత అన్యోన్యంగా ఉండాలో గాంధారి నేటి తరానికి తన నడవడిక ద్వారా తెలియజేసింది. ఈ సందర్భంలో గాంధారి యొక్క పితృభక్తి, పతిభక్తి రెండూ వ్యక్తమయ్యాయి.

## 3.9. ద్రోణ, ద్రుపదుల కథ

ఆంధ్ర మహాభారతంలో విఫల స్నేహానికి ఒక చక్కటి ఉదాహరణ ద్రుపద, ద్రోణుల స్నేహం. ఆ స్నేహం ఏ కారణాల వల్ల విఫలమయ్యిందో ఈ పద్యంలో వివరించారు.

చ. కొలఁది యెఱుంగ కిట్టి పలుకుల్ పలుకం దగుఁ గాదు నా కనన్

బలుగుఁదనంబునం బలుకఁ బాడియె నీ సఖి నంచుఁ? బేదవి

ప్రులకును ధారుణీశులకుఁ బోలఁగ సఖ్యము సంభవించునే?

పలుకక వేగ పొ; మ్మకట పాఱుఁడు సంగడికాఁడె యెందునన్ ? (*ఆంధ్ర. ఆది. 5: 203*).

'మన ఇద్దరి అంతరం తెలియకుండా, 'నాకు ఈ విధంగా మాట్లాడ తగునా, కూడదా' అని అనుకోకుండా, నన్ను నీ స్నేహితుడినని చెప్పడం న్యాయంగా ఉందా? బీదబ్రాహ్మణులకు, మహారాజులకు స్నేహం ఎలా సాధ్యపడుతుంది? నోరు మూసుకుని పొమ్ము. అయ్యో! బ్రాహ్మణుడు ఎక్కడైనా చెలికాడౌతాడా?'

ద్రుపదుడు చిన్ననాటి స్నేహాన్ని మరిచి అహంకారంతో ఇలా మాట్లాడుతున్నాడు. ద్రోణుడి సాహచర్యంలో ఎన్నో యుద్ధవిద్యలు నేర్చుకున్న ద్రుపదుడికి, తాను మహారాజు అయ్యేసరికి ఇంత గర్వాంధకారం కమ్మేసింది. అన్ని విద్యలూ నేర్చుకున్నాక, స్వయంగా ద్రుపదుడే ద్రోణుడిని తన రాజ్యానికి రమ్మని ఆహ్వానించాడు. ఇప్పుడు అత్యవసర పరిస్థితుల్లో తన వద్దకు వచ్చిన ద్రోణుడిని నానామాటలు అంటున్నాడు. అసలే ద్రోణుడు మెండైన ఆత్మాభిమానం కలవాడు. చాలా రోజులు కష్టాలకి ఓర్చి ఓర్చి, వేరే దారి లేక, ద్రుపదుడిని ఆశ్రయించాడు. తన ఎదుగుదలకి ప్రధానకారణమైన ద్రోణుడిని విస్మరించి, ద్రుపదుడు బీరాలు పలుకుతున్నాడు. పైగా ద్రోణుడి కులాన్ని అవహేళన చేసి మాట్లాడుతున్నాడు. చిన్నప్పుడు కలిసి మెలిసి ఉన్నప్పుడు గుర్తురాని కులం, ద్రుపదుడికి ఇప్పుడు గుర్తురావడం గమనార్హం. వీరిద్దరి స్నేహం చెడిపోవడానికి ద్రుపదుడి అహంకారమే కారణం. తనకి ఎదురైనా పరాభవాన్ని మనస్సులో దాచుకున్న ద్రోణుడు భావికథలో పాండవులను, కౌరవులను వెంటబెట్టుకుని వచ్చి ద్రుపదుడిని దెబ్బకు దెబ్బ తీస్తాడు. ద్రుపద, ద్రోణుల స్నేహం విఫలమైన విధానం నేటి తరానికి పెద్ద గుణపాఠంగా నిలుస్తుంది. ద్రోణ ద్రుపదుల స్నేహం విఫల స్నేహంగా మిగిలిపోతే, కర్ణ దుర్యోధనుల స్నేహం సఫల స్నేహంగానూ, కృష్ణార్జునుల స్నేహం సుఫల స్నేహంగానూ చరిత్రలో నిలిచిపోయాయి.

## 3.10. భీమ హిడింబల సంవాదం

భీముడికీ, హిడింబకీ మధ్య జరిగిన సంవాదంలో భీముడు చెప్పే ఈ మాటలు మానవసంబంధాల విలువను తెలియజేస్తాయి.

క. విను బేల! యెట్టికష్టుఁడుఁ
దన పురుష గుణంబు పెడఁగఁ దల్లిని దోఁబు
ట్టినవారి విడిచి రాగం
బునఁ జపల స్త్రీ సుఖంబుఁ బొందునె చెపుమా. (*ఆంధ్ర. ఆది.6:197*)

‘అమాయకురాలా! ఎంతటి నీచుడైనా తన పురుష లక్షణం పోగొట్టుకుని, తల్లిని, తోబుట్టువులను వదిలి మోహంలో పడి చంచలమైన స్త్రీ సుఖాన్ని పొందుతాడా! చెప్పుము’.

హిడింబాసురుడి ఆజ్ఞ మేరకు వనంలో చిక్కుకున్న పాండవుల వద్దకు చేరుకున్న హిడింబ, భీముడిని చూసి మోహిస్తుంది. తనని వివాహం చేసుకుని ప్రాణాలు దక్కించుకోమని భీముడిని ఆశపెడుతుంది. కానీ, భీముడు పలికిన ఈ మాటలు హిడింబకి గొప్ప పాఠాన్ని నేర్పిస్తాయి. ఏ వ్యక్తికైనా సరే, కుటుంబ బాధ్యతలు ఎంతో ముఖ్యమని భీముడు తన మాటల ద్వారా తెలియజేశాడు. వారణావతం నుండి తప్పించుకుని వచ్చిన తల్లిని, పాండవులను రక్షించవలసిన బాధ్యత భీముడిపై ఉంది. ఆ బాధ్యతని విస్మరించి, తాను స్వార్థానికి లోనై హిడింబతో సుఖిస్తే, వాళ్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది.

ఒక పక్క అందమైన అమ్మాయి భీముడిని తనంతట తాను వరించమని వ్యామోహంలో ముంచెత్తుతున్నా, భీముడు బాధ్యతలకే కట్టుబడ్డాడు తప్ప, వ్యామోహానికి లొంగలేదు. ఈ సన్నివేశంలో భీముడి ప్రవర్తన నేటి తరానికి మార్గదర్శనం చేస్తుంది. నేడు, వయస్సులో ఉన్న అమ్మాయి/ అబ్బాయి ప్రేమలోనో/ వ్యామోహంలోనో పడి బంధాలని, బాధ్యతలని విస్మరించడం ఎంతటి మూర్ఖత్వమో ఈ సన్నివేశం వివరిస్తుంది. మరీ ముఖ్యంగా ప్రేమ/ ఆకర్షణ/ వ్యామోహంలో పడి, కన్న తల్లిదండ్రులని వృద్ధాశ్రమాల్లో పారేసి తమ దారి తాము చూసుకుంటున్న యువతరానికి ఈ సన్నివేశం ఒక మేల్కొలుపు అవుతుంది.

## 3.11. సుందోపసుందుల కథ

ఆదిపర్వంలోని సుందోపసుందుల కథ మానవసంబంధాలను గొప్పగా ఆవిష్కరించింది.

క. అన్యోన్యప్రియభాషణు
లన్యోన్యహితైషు లసుర లన్యులపోలెన్
మన్యుపరిప్రేరితు లై
యన్యోన్యాభిహతిఁ జనిరి యమపురమునకున్ (*ఆంధ్ర. ఆది. 8: 113*)

'ఒకరితో ఒకరు సంతోషకరంగా మాట్లాడేవాళ్లు, ఒకరి మేలు ఒకరు కోరేవాళ్లు అయిన సుందోపసుందులు పరాయివాళ్లవలె కోపంతో రెచ్చిపోయి, ఒకరినొకరు కొట్టుకుని చనిపోయారు'.

వ్యామోహం అనేది ఏర్పడితే ఎంతటి ప్రాణ స్నేహితులైన విడిపోక తప్పదని ఈ కథ ఋజువుచేసింది. అప్పటివరకు ఒకే ఆసనం మీద కూర్చుంటూ, ఒకే ఆహారం భుజిస్తూ, ఒకే వాహనం ఎక్కుతూ, ఒకే ఇంట్లో ఉంటూ, ఒకే పడక మీద పడుకుంటూ, ఒకే పని చేస్తూ, ఒకటిగా ఉన్న బలవంతులు సుందోపసుందులు దైవలీల వల్ల తిలోత్తమను కామించారు. ఇద్దరిలో ఒకరినే వరిస్తానని తిలోత్తమ చెప్పడంతో ఇద్దరూ కయ్యానికి కాలుదువ్వి ఒకరిచేతిలో మరొకరు మరణించారు.

సుందోపసుందుల కథ ఐకమత్యంగా ఉండే అన్నదమ్ములకి, స్నేహితులకే కాక అందరికీ వర్తిస్తుంది. అమ్మాయి విషయంలో ఇద్దరు అబ్బాయిలు, అబ్బాయి విషయంలో ఇద్దరు అమ్మాయిలు, ఆస్తుల విషయంలో అన్నదమ్ములు, వ్యాపారం విషయంలో ఇద్దరు స్నేహితులు, ఇలా బంధాల కంటే ఇహపరమైన విషయాలకి ఎవరైతే ప్రాధాన్యతనిస్తారో, వారి కథ సుందోపసుందుల కథలానే గొడవలకి దారి తీస్తుంది. బంధాలు ఎంత విలువైనవో గ్రహిస్తే మనుషులంతా ఐకమత్యంగా జీవించవచ్చని ఈ కథ ద్వారా తెలుస్తోంది.

## 3.12. రాజసూయయాగం: మానవ సంబంధాలు

ధర్మరాజు రాజసూయయాగాన్ని చేసిన విధానం నేటి తరానికి ఎన్నో విలువలని అందిస్తుంది. ముఖ్యంగా మానవ సంబంధాలను ఈ ఘట్టం కళ్లకు కట్టిన విధానం అజరామరం.

మ. అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వు రుండఁగ ధరిత్రీనాథ! గాంగేయు దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెఱిఁగించి తిందఱకు; దాశార్హుండు పూజార్హుఁడే? (*ఆంధ్ర. సభా.2: 8*)

'ఓ ధర్మరాజా! ఈ సభలో ఎందరో మహారాజులుండగా, విశేషంగా పూజించదగిన పెద్దలు, బ్రాహ్మణులు పెక్కుమంది ఉండగా, భీష్ముని చెడు నిర్ణయాన్ని అనుసరించి, వృష్ణివంశం వాడు, చెడు ప్రవర్తన కలవాడు అయిన శ్రీకృష్ణుని పూజించి, నీ తెలివితక్కువతనాన్ని ఇంతమందికి తెలియజేశావుగాని – ఆ దాశార్హుడు పూజార్హుడా?'

ధర్మరాజు రాజసూయయాగాన్ని దిగ్విజయంగా, అనితరసాధ్యంగా పూర్తి చేసి అర్ఘ్యాన్ని శ్రీకృష్ణుడికి ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయం శిశుపాలుడికి మింగుడు పడలేదు. అందుకే ఈ విధంగా ధర్మరాజు నిర్ణయాన్ని తూలనాడాడు.

యాదవులు యయాతి శాపం చేత రాజ్యానర్హులు. ఆ యాదవవంశాల్లో వృష్ణివంశం ఒకటి. కానీ, జాతిని బట్టీ శ్రీకృష్ణుడిని అవమానిచడం తప్పు. పైగా శ్రీకృష్ణుడి ప్రవర్తన మంచిది కాదని శిశుపాలుడి వాదన. శిశుపాలుడి ప్రవృత్తి అటువంటిది. నిజానికి అందరి ముందు శ్రీకృష్ణుడిని జాతి పేరు మీద దూషించడం అతడి అవివేకాన్ని, స్వభావాన్ని తెలియజేస్తుంది. పైగా శిశుపాలుడు చేసింది దైవనింద. దానికి శిక్షగా అతడు వధించబడ్డాడు.

నేటి సమాజంలో సైతం కులం పేరు మీద దూషణలు, అవమానాలు చాలా చోట్ల జరుగుతూనే ఉన్నాయి. ఈ పరిస్థితి మారకపోతే, అది ఎటువంటి దారుణాలకు దారి తీస్తుందో శిశుపాలవధ ఘట్టాన్ని పరిశీలిస్తే తెలుస్తుంది. మనుషుల మధ్య ఈ అసమానతలు తొలగితేనే మానవ సంబంధాలు సజీవంగా ఉంటాయని ఈ ఘట్టం తెలియజేస్తోంది.

## 3.13. మాయాద్యూతం: మానవ సంబంధాలు

ధర్మరాజును జూదం ఆడించడానికి ఒప్పించే క్రమంలో ధృతరాష్ట్రుడి పుత్రవ్యామోహం ఎంతటి విపత్కర పరిస్థితులకు దారి తీసిందో ఈ పద్యంలో గొప్పగా వివరించారు.

తే. దీని కొడఁబడు; మొడఁబడవేని నేఁడ

యీ క్షణమ సర్వభక్షుచే భక్షితుండ

నగుదుఁ; దెల్ల మే నట్లైన వగపుఁ దక్కి

విదురుఁడును నీవు నుండుఁడు ముదముతోడ (*ఆంధ్ర. సభా. 2: 127*)

'ఈ ప్రయత్నానికి అంగీకరించు. అంగీకరించకుంటే ఈ రోజే, ఈ క్షణమే అగ్నికి ఆహుతి అవుతాను. ఇది నిజం. తరువాత నిశ్చింతగా నీవూ, విదురుడూ సుఖంగా ఉండండి'.

దుర్యోధనుడు ధర్మరాజు సంపాదించిన కీర్తి, ఐశ్వర్యం చూసి అసూయకు లోనై, తన బాధను శకుని ముందు వెలిబుచ్చాడు. శకుని బాగా ఆలోచించి మాయా ద్యూతం ద్వారా ఓడించే ఉపాయం దుర్యోధనుడికి చెప్పాడు. ధృతరాష్ట్రుడి మద్దతు కోసం ఎదురుచూస్తున్న దుర్యోధనుడు తన ఆలోచనని తండ్రికి వివరించాడు.

శకుని, ధృతరాష్ట్రుడు కలిసి పన్నిన పన్నాగం పాండవులకి హాని తలపెడుతుందని ధృతరాష్ట్రుడికి అర్థమయ్యింది. అయినా కూడా నేరుగా దుర్యోధనుడిని వారించకపోవడం ధృతరాష్ట్రుడి పుత్రవ్యామోహాన్ని సూచిస్తుంది. అతడు నేరుగా దుర్యోధనుడి ప్రతిపాదనని తిరస్కరించకుండా విదురుడి సలహా తీసుకుని ఈ పని చేద్దామని పలకడం అతడి బలహీనతని సూచిస్తుంది. విదురుడు నీతిరహస్యాలలో అందరికంటే విద్వాంసుడు. అతడైతే దుర్యోధనుడి ప్రతిపాదనని ఔచిత్యంగా తిరస్కరించగలడని ధృతరాష్ట్రుడు భావించాడు.

ధృతరాష్ట్రుడి సలహా విన్న దుర్యోధనుడు, విదురుడు పాండవపక్షపాతి కాబట్టి అతడి అభిప్రాయం పరిగణలోకి తీసుకోవలసిన అవసరం లేదని ఆ సలహాని తిరస్కరిస్తాడు. పైగా తన మాట కాదంటే ఆత్మాహుతికి పాల్పడతానని తండ్రిని బెదిరిస్తాడు. కేవలం, ధృతరాష్ట్రుడి పుత్రవ్యామోహమే దుర్యోధనుడు ఇలా బెదిరించడానికి కారణమయ్యింది. తర్వాతి కథలో విదురుడు ధృతరాష్ట్రుడిని ఎంత వారించినా ప్రయోజనం లేకపోయింది.

ధృతరాష్ట్రుడి పుత్రవ్యామోహం పాండవులకి శాపంగా మారి, తదనంతరం మహాభారత యుద్ధానికి దారి తీసింది. అతడు దుర్యోధనుడి కుతంత్రాలకి తలొగ్గకుండా ఉంటే పరిస్థితులు అంత తీవ్రంగా పరిణమించేవి కావు. దీన్ని బట్టి తల్లిదండ్రుల బలహీనతల వల్ల పిల్లలు అంతిమంగా పెడదోవ పట్టి పూర్తిగా నాశనమయ్యే పరిస్థితి ఎదురయ్యే ప్రమాదం ఉందని స్పష్టమవుతోంది. పిల్లలు

ఆత్మహత్యలు చేసుకుంటామని బెదిరిస్తే, కాస్త దృఢంగా నిలబడగలిగితే అది పిల్లలకి ఎప్పటికైనా మంచి చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రతీ సారీ తల్లిదండ్రులు భయపడుతూ ఉంటే జీవితాంతం పిల్లలు ఎన్ని తప్పులు చేసినా భరించాల్సివస్తుందని, తగిన తరుణంలో తనయులను దండించకపోవడం/ వారించకపోవడం వల్ల పరిస్థితి విషమించినప్పుడు బాధపడవలసిన దుస్థితి ఏర్పడుతుందని ఈ ఘట్టం ద్వారా తెలుస్తోంది.

మానవస్వభావంలో వ్యసనపరత ఎంత బలీయమో, వ్యసనాలు మానవసంబంధాలను ఎంతగా దిగాజారుస్తాయో, అన్ని ధర్మాలు తెలిసిన ఆ ధర్మరాజు సమతనే వ్యసనపరత ఎంతగా తారుమారు చేసిందో సభాపర్వంలో ఈ పద్యాలు పరిశీలిస్తే అర్థమవుతుంది.

చ. అలయక వెండియుం గడఁగి యక్షరతుండయి ద్రౌపదిన్ మహో
త్పలదళచారునేత్రఁ గులభామఁ బణంబుగఁ జేసి యొడ్డి సౌ
బలఖలుచేత నోటువడి పాండుసుతుం డుడిగెన్ ధనంబు ల
గ్గలముగ నొడ్డలేమి గతగర్వమునం గడు దీనవక్త్రుఁడై. *(ఆంధ్ర. సభా. 2: 197)*

'ఆలస్యం చేయకుండా, పాచికల మీద ప్రీతితో, ధర్మరాజు మళ్లీ ఆటకు పూనుకున్నాడు. కలువరేకులవంటి కన్నులు కలది, కులకాంత అయిన ద్రౌపదిని పణంగా ఒడ్డాడు. దుష్టశకుని చేతుల్లో ఆమెను కూడా ఓడిపోయాడు. ఇంకా ఒడ్డడానికి ధనం లేదు. అందుచేత గర్వాన్ని కోల్పోయాడు. ఎంతో దీనమైన ముఖంతో అప్పుడు ఆట చాలించాడు'.

ధర్మారాజు రాజనీతిజ్ఞుడే అయినా, పరమధర్మమూర్తి అయినా, సకల శాస్త్రాలు తెలిసినవాడే అయినా, అపారమైన అనుభవం కలవాడే అయినా, గొప్ప విచక్షణా జ్ఞానం కలవాడే అయినా, కేవలం అతడికున్న ఒకేఒక్క దుర్వ్యసనం ద్యూతం ఆడడం, అతడికి, పాండవులకి, ద్రౌపదికి తీరని కష్టాలను తెచ్చిపెట్టింది. ఒక ఆట ఆడమని దుర్యోధనుడు, శకుని ధృతరాష్ట్రుడి ద్వారా ధర్మరాజుని పిలిపిస్తే, మరొక్క ఆట, మరొక్క ఆట అంటూ శకుని ధర్మరాజును రెచ్చగొట్టాడు. వ్యసనానికి ఉన్న లక్షణమే అది. ఒక్క సారి రుచి చూశాక, ఇంక దానికి బానిసవ్వడమే తప్ప బయటపడడం కష్టం.

ధర్మరాజు జూదంలో ఏయే సంపదలు ఒడ్డాడో, ఇట్లు యుధిష్ఠిరుండు... *(ఆంధ్ర. సభా. 2: 177)* లో గమనించవచ్చు. నెమ్మదిగా, ఒక్కొక్కటిగా తన సంపదలన్నీ ద్యూతంలో ఒడ్డిన ధర్మరాజు శకుని కల్పించిన మాయ వల్ల ఆడిన ప్రతీసారి ఓడిపోతునే ఉన్నాడు. ప్రతీ ఆటలో నష్టపోతుండడం వల్ల, ధర్మరాజు సమస్త సంపదలూ ఒడ్డి ఓడిపోయాడు. ఇంక ఒడ్డడానికి తన వద్ద ఏం

మిగలకపోవడంతో ధర్మరాజు చివరికి ద్రౌపదిని సైతం పణంగా పెట్టాడు. తన బలహీనత వల్ల మాత్రమే ధర్మరాజుకి ఇంతటి విపత్కరమైన పరిస్థితి ఏర్పడింది.

ధర్మరాజంతటి వాడు వ్యసనపరత వల్ల ఎంత నష్టపోయాడో ఈ ఘట్టం ద్వారా తెలుస్తోంది. సకలనీతిశాస్త్రకోవిదుడు, ధర్మమూర్తి, అనుభవజ్ఞుడు అయిన ధర్మరాజే వ్యసనం బారి నుండి బయటపడలేకపోయినప్పుడు, సాధారణ మానవుల పరిస్థితి ఇంకెంత తీవ్రంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మద్యపానం, జూదం, పేకాట మొదలైన వ్యసనాల వల్ల సర్వస్వం కోల్పోక తప్పదని, మానవసంబంధాలు ఛిన్నాభిన్నం అవుతాయని ఈ ఘట్టం బోధిస్తోంది.

## 3.14. పాండవుల అరణ్యవాసం

మాయాజూదంలో కౌరవుల చేతిలో ఓటమి పాలైన పాండవులు ఆరణ్యవాసానికి సిద్ధపడ్డారు. ఆ సంఘటన చూసి ఉప్పొంగే బాధతో విలపిస్తున్న కుంతీదేవి మాటల్లో సవతి కొడుకైన సహదేవుడిపై ఆమెకి ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుంది.

క. అన్న! సహదేవ! నీవును
నన్నలతో నరిగె దయ్య యట నడవుల కీ
వున్నను సుతు లందఱు నిం
దున్నట్టుల నాకుఁ జిత్త మూఱడి యుండున్. *(ఆంధ్ర. సభా. 2: 288)*

'నాయనా! సహదేవా! నీవు కూడా అన్నలతోపాటు అడవులకు వెళ్లక తప్పదా? నీవు ఒక్కడివే ఉంటే చాలు. కొడుకులందరూ ఇక్కడ ఉన్నట్లే. నా మనస్సు ఊరట చెంది ఉంటుంది'.

కొడుకులు ఆరణ్యవాసానికి వెళ్లిపోతుంటే ఒక తల్లి పడే ఆవేదన ఎలా ఉంటుందో నన్నయ ఈ ఘట్టంలో చాలా హృద్యంగా ఆవిష్కరించారు. అయితే, పాండురాజుకి ఇద్దరు భార్యలు, ఒకరు కుంతీదేవి. మరొకరు మాద్రి. మాద్రి పాండురాజు మరణానంతరం, అప్పటి ఆచారాల ప్రకారం అతడితోనే సతీసహగమనం చేసింది. తన బిడ్డలైన నకుల, సహదేవుల బాధ్యతని కుంతీదేవికే అప్పగించింది.

తల్లికి సహజంగా అందరికంటే చిన్నవాడి మీద మమకారం ఎక్కువగా ఉండడం సహజం. అయితే, సహదేవుడు పాండవుల్లో చిన్నవాడే అయినా, నిజానికి మాద్రి కొడుకు. అంటే కుంతీదేవికి సవతి కొడుకు. కానీ, కుంతీ దేవి కేవలం సహదేవుడు అడవులకి వెళ్లకపోయినా ఎంతో ఊరటగా ఉంటుంది అనేంతగా మాద్రి బిడ్డల్ని ప్రేమించి, లాలించింది. అందుకే, కుంతీదేవి అనురాగం నేటి

తరానికి గొప్ప ప్రేరణగా నిలుస్తుంది. తల్లి ప్రేమ అందరి పట్ల ఒకలానే ఉంటుందని కుంతీదేవి పాత్ర ద్వారా మరొకసారి స్పష్టమవుతోంది.

## 3.15. నలోపాఖ్యానం

ఆరణ్య పర్వంలో భాగంగా చర్చించబడిన నలదమయంతుల కథ ఎన్నో సామాజికాంశాలకు నిలయం. మరీ ముఖ్యంగా మానవ సంబంధాలు ఆ ఘట్టంలో ఎంతో హృద్యంగా ఆవిష్కృతమయ్యాయి. ఎన్ని కష్టాలు వచ్చినా నలదమయంతుల మధ్య అనురాగం చెదిరిపోకపోవడం నేటి తరానికి గొప్ప సందేశంగా నిలుస్తుంది.

తే. 'అధికదుఃఖరోగార్తున కౌషధంబు

సురుచిరంబుగ భార్యయ చూవె యెందు;

నొనర భార్యాసమేతుఁడై యున్నవాని

కెంతలయ్యును నాపద లెఱుకపడవు. *(ఆంధ్ర.* ఆరణ్య. *2: 74*)

క. అలసి నెడ, డస్సి నెడ, నాఁ

కలి దప్పియు నైన యెడలఁ గడుకొని ధరణీ

తలనాథ! పురుషునకు ని

మ్మల భార్యయ పాచుఁ జిత్తమున దుఃఖంబుల్. *(ఆంధ్ర. ఆరణ్య. 2: 75*)

'అన్ని రోగాలలో గొప్ప రోగం దుఖం. గొప్ప దుఖమనే రోగంతో పీడితుడైనవాడికి మంచి మందు భార్యయే సుమా! భార్యతో కూడి ఉన్నవాడికి ఎంతటి కష్టాలైనా అనుభవిస్తునట్లు అనిపించవు. ఓ నలమహారాజా! విసిగి ఉన్న సమయాలలో, బడలిన సమయాలలో, ఆకలి అయిన వేళలో, దాహం వేసినపుడు, మగవాడికి ప్రీతితో తోడ్పడి, భార్యయే అతడి మనస్సులోని పరితాపాలను పోగొడుతుంది'.

నలమహారాజుకి అనుకోకుండా వచ్చిన కష్టాల వల్ల ఘోరమైన దారిద్ర్యం సంభవించింది. దమయంతి పట్ల ఎంతో ప్రేమ కలిగిన నలుడు, తాను చేసిన తప్పుల వల్ల దమయంతి జీవితం ఎందుకు ఇబ్బందుల్లో పడాలని యోచించి, అడవుల్లో తనతో నానా కష్టాలు అనుభవిస్తున్న దమయంతిని పుట్టింటికి వెళ్లమని నచ్చజెప్పే ప్రయత్నం చేశాడు. అయితే దమయంతికి నలుడంటే గొప్ప ఆరాధ్యభావన. తాను భర్తని విడిచిపెట్టి ఉండకూడదని నిర్ణయించుకుంది. కష్టమైనా, సుఖమైనా

భర్తతోనే జీవించాలి అనుకునే సాధ్వి దమయంతి. అందుకే, పై మాటలతో నలుడికి నచ్చజెప్పే ప్రయత్నం చేసింది దమయంతి.

దమయంతి మాటల్లో నలుడి పట్ల తనకున్న ప్రేమ, బాధ్యత వ్యక్తమవ్వడంతో పాటు భార్యాభర్తల మధ్య సంబంధం ఎంత విలువైనదో, వారెంత అన్యోన్యంగా ఉండాలో తెలుస్తోంది. ఇది చిన్న చిన్న కారణాలకే విడాకుల బాట పడుతున్న నేటి యువతరానికి గొప్ప పాఠాన్ని నేర్పిస్తుంది.

భర్త జీవితంలో ఎదురయ్యే కష్టాల వల్ల, సమస్యల వల్ల సతమతమై, విసిగి వేసారిన సమయంలో భార్యే అండగా నిలవాలని, భర్తని కంటికి రెప్పలా కాపాడుకోవాలని దమయంతి తాను ఆచరించి ఆదర్శంగా నిలిచింది. భర్త ఐశ్వర్యంతో ఉన్నప్పుడు ఆయనతో ఉండడం గొప్ప కాదు, అతడు తీవ్రమైన కష్టాల్లో ఉన్నప్పుడు చెంత నిలిచేదే భార్యయని దమయంతి తాను ఆచరించి చూపింది. దమయంతి తన వల్ల అడవుల్లో కష్టాలు పడవలసి వచ్చిందని నలుడు బాధపడితే, మహారాజ వైభాగాలతో రాజ్యమేలాల్సిన నలుడు అడవుల బారిన పడ్డాడని దమయంతి దుఖించింది. ఇద్దరూ తమ ప్రేమని చాటుకున్నారు. దాంపత్యం అంటే నలదమయంతులలా ఉండాలి అని నేటికీ అనుకునే విధంగా వారిద్దరూ జీవించారు.

## 3.16. ధర్మవ్యాధోపాఖ్యానం

ఎర్రన రచించిన భారతభాగమైన ఆరణ్యపర్వంలో మార్కండేయుడు ధర్మరాజుకి చెప్పిన కథల్లో ఎన్నో సామాజికాంశాలకి నిలయం ధర్మవ్యాధోపాఖ్యానం. ధర్మవ్యాధుడి వద్ద ధర్మసూక్ష్మాలు తెలుసుకునేందుకు వచ్చిన కౌశికుడితో ఎన్నో విలువైన విషయాలు చర్చించాక, ధర్మవ్యాధుడు కౌశికుడి పట్ల తనకి ప్రీతీ ఏర్పడకపోవడానికి గల కారణాన్ని ఇలా వివరిస్తాడు. అతడి మాటలు నేడు తల్లిదండ్రులను వృద్ధాశ్రమాల్లో వదిలేస్తున్న యువతరాన్ని తట్టి లేపుతాయి.

ఉ. ఎంతయు వృద్ధు లై తమకు నీ వొకరుండవ తెప్ప గాఁగ న
    త్యంతముదంబునన్ బ్రదుకు తల్లిని దండ్రిని నుజ్జగించి ని
    శ్చింతుఁడ వై సదాధ్యయనశీలత వారియనుజ్ఞ లేక యే
    కాంతమ యెమ్మెయిన్ వెడలి తక్కట! నీవు గరంబు క్రూరతన్. *(ఆంధ్ర. ఆరణ్య.5: 120)*

'నీ తల్లిదండ్రులు మిక్కిలి ముసలివారు. వారికి నీవు ఒకడవే ఆధారం. నీ మీదనే తమ ప్రేముడిని అంతయు పెట్టుకొని బ్రతుకుతున్న నీ తల్లిదండ్రులను వదిలిపెట్టావు. వారిని వదిలివచ్చేటప్పుడు నీవు వారి అనుమతిని తీసుకోలేదు. నీవు వేదాధ్యయనం చేసి జ్ఞానాన్ని ఆర్జించి,

తరింపనెంచావు. కానీ, నీ తల్లిదండ్రుల గతి ఏమవుతుందో అని ఆలోచించలేదు. కఠినమైన నీ ప్రవర్తన నాకు నచ్చలేదు'.

కౌశికుడు తనకి తపస్సు మీద ఉన్న తీవ్రమైన ఆసక్తితో ఇల్లు వదిలి వనభూములకి వచ్చేశాడు. అయితే, వచ్చేటప్పుడు తల్లిదండ్రుల అనుమతి తీసుకోలేదు. వారు వృద్ధాప్యంలో ఉన్నారు. వారి పనులు వారు చేసుకునే ఓపిక వారికి లేదు. బిడ్డ ఎప్పటికైనా తిరిగి రాకపోతాడా అని ఎదురు చూస్తున్నారు. వయోవృద్ధులైన తల్లిదండ్రులకి వారు బ్రతికినంత కాలం సేవ చేయడం పిల్లల బాధ్యత. ఆ బాధ్యతని కౌశికుడు తపస్సు చేయాలనే భావనతో విస్మరించాడు. అందుకే, కౌశికుడి పట్ల తనకి అభిమానం ఏర్పడలేదని ధర్మవ్యాధుడు చెప్పాడు. మరోవైపు ధర్మవ్యాధుడు తన తల్లిదండ్రులను కంటికి రెప్పలా కాపాడుకుంటున్నాడు. తన జీవితం ఇంత ఆదర్శవంతంగా సాగడానికి తన తల్లిదండ్రుల పట్ల తనకున్న భక్తి భావనే ప్రధాన కారణమని ధర్మవ్యాధుడు కౌశికుడికి వివరించాడు. ఆ మాటలు కేవలం కౌశికుడికే కాదు, తల్లిదండ్రులను విస్మరిస్తున్న నేటి తరానికి సైతం వర్తిస్తాయి. తల్లిదండ్రుల బాగోగులు పట్టించుకోనివాడు జీవితంలో ఎంత ఎదిగినా ఆనందంగా ఉండలేడని ఈ కథ ద్వారా ఋజువౌతోంది.  ఇదే సందర్భంలో 'నీక వగచి... *(ఆంధ్ర. ఆరణ్య. 5: 121)*, 'నీయధ్యయనమ్మును ... *(ఆంధ్ర. ఆరణ్య.5: 122)* వంటి పద్యాలు కూడా ఉదహరించినదగినవి.

## 3.17. సావిత్రీసత్యవంతుల కథ

ఎఱ్ఱన రచించిన భారత భాగంలో మానవసంబంధాలని, అందునా భార్యాభర్తల సంబంధాన్ని అత్యంత హృద్యంగా తెరకెక్కించిన కథ సావిత్రీసత్యవంతుల కథ. పాతివ్రత్యం గొప్పదనం గురించి చెప్పాలంటే మహాపతివ్రత సావిత్రి గురించి చెప్పకుండా వర్ణించడం సాధ్యం కాదు. అంతటి సాధ్వి సావిత్రి. భర్త ప్రాణాల కోసం యముడితో వాగ్యుద్ధం చేసి భళీ అనిపించుకున్న ధీరవనిత సావిత్రి.

క. 'వినుము మనోవాక్కాయము

లను మూఁడుతెఱంగులందు నంతఃకరణం

బనఘ ప్రధానము గావున !

మనమునఁ గైకొన్న భర్త మానుటఁ దగునే? *(ఆంధ్ర. ఆరణ్య.7: 183)*

'తండ్రీ! ఆలకింపుము. మనస్సు, వాక్కు, కాయం – ఈ త్రికరణాలలో మనస్సు ప్రధానమైనది. కాబట్టి, మనసార వరించిన మగడిని మానడం పాడి కాదు కదా!'

సావిత్రి ఆశ్వపతి మహారాజు కుమార్తె. సద్గుణ సంపన్నురాలైన సావిత్రికి వివాహం చేయవలసిన సమయం ఆసన్నమైందని నారదమహర్షి, ఆశ్వపతి మహారాజుకు సూచించాడు. క్షత్రియ కాంతలకు భర్తను వారే ఎంపిక చేసుకునే సంప్రదాయం ఉండడం వల్ల సావిత్రి సాళ్వదేశప్రభువు కుమారుడైన సత్యవంతుడిపై మనసు పడింది. సత్యవంతుడు సార్ధకనామధేయుడు. సద్గుణ సంపన్నుడు, సావిత్రికి చక్కటి జోడీ. అయితే, అతడి విషయంలో ఒక పెద్ద ఇబ్బంది ఉంది. అతడు పెళ్లి అయిన ఒక ఏడాదిలోగానే మరణిస్తాడు. ఈ విషయాన్ని నారదుడు ఆశ్వపతి మహారాజు సమక్షంలో సావిత్రికి వివరించాడు. ఆ సందర్భంలో సావిత్రి పలికిన మాటలివి.

సావిత్రి పేరు పతివ్రతల సరసన చిరస్థాయిగా నిలిచిపోవడానికి, సావిత్రి పలికిన ఈ పద్యం (మాటలు) నాందీశ్లోకం వంటిది. సత్యవంతుడు వివాహం చేసుకున్న ఏడాదికే మరణిస్తాడని తెలిసినా సావిత్రి అతడినే వివాహం చేసుకోవాలని నిశ్చయించుకుంది. సావిత్రి తలుచుకుంటే ఎంతో మంది మహారాజులు ఆమెని చేసుకోవడానికి వరుసకడతారు. అంతటి గుణవతి సావిత్రి. కానీ, ఒక్కసారి, ఒకరికి మనసు ఇచ్చాక అతడినే వివాహమాడాలంటూ ఆమె పలికిన మాటలు ఆశ్వపతి మహారాజు, నారదులనే కాదు, దేవతలని సైతం ఆశ్చర్యచకితుల్ని చేస్తాయి. అందుకే, ఆమె ప్రేమ అజరామరంగా నిలిచిపోయింది. భవిష్యత్కథలో సావిత్రికి సత్యవంతుడి పై ఉన్న ప్రేమ అతడికి శ్రీరామరక్షగా మారింది. భర్త ప్రాణాలను తన పాతివ్రత్య మహిమతో సావిత్రి కాపాడుకుంది. పాతివ్రత్యానికి పెట్టింది పేరుగా చరిత్రలో సావిత్రి నిలిచిపోయింది.

## 3.18. యక్ష ప్రశ్నలు

ఎర్రన రచించిన భారత భాగమైన ఆరణ్యపర్వంలో మానవ సంబంధాలను అత్యంతహృద్యంగా ఆవిష్కరించిన ఘట్టం యక్ష ప్రశ్నలు. ఈ ఘట్టం యావద్భారతీయ సాహిత్యంలోనే అత్యంత ప్రాచుర్యం పొందిన ఘట్టాలలో ఒకటి. యక్షుడి మాటలను పెడచెవిన పెట్టి భీమార్జుననకులసహదేవులు సరస్సు ముందు విగతజీవులై పడి ఉంటారు. కానీ, ధర్మనిష్ఠకి పెట్టింది పేరైన ధర్మరాజు యక్షుడి ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పి యక్షుడిని ఆశ్చర్యపరుస్తాడు. ధర్మరాజు ఇచ్చిన సమాధానాలు, తర్వాత అతడు కోరుకున్న వరాలు, మానవసంబంధాల విలువను అత్యంత సహజంగా ఆవిష్కరించాయి.

సీ. పుత్త్రులు దుఃఖార్తిఁ బొగులుట కనిశంబుఁ / బొక్కచునున్న యప్పుణ్యచరిత

మాతల్లి పాండునిమహిషి నా కెదురుగా / వచ్చి కౌఁగిటఁజేర్చి 'వత్సనాఁడు !

నీతమ్ముఁగుఱ్ఱలు నీవును నడవుల / కరిగితి, రిప్పు డయ్యనుజు లెందుఁ

జనిరి? నీ వొకడవ చనుదెంచి; తిది యేమి?' / యనిన నాయమతోడ నప్పు డేమి

ఆ. యనఁగ నేర్చువాఁడ? నాచార్యవిదుర శాం

తనవకృపులు నను ముదంబుతోడఁ

గుశల మడిగి రేనిఁ గుశల మే మనువాఁడ?

నెందుఁ దలఁగరాని యెడరు దగిలె.' (*ఆంధ్ర. ఆరణ్య. 7: 413*)

సీ. 'శ్యామాంగు నారక్తజలరుహనేత్రు సా / లప్రాంశు నున్నతలలితబాహు

నకులుని బ్రదికింపు' నావుడు యక్షుండు / 'భీమఫల్గును లతిభీమబలులు

ప్రియులు నీ కెంతయుఁ బృథివీశ వీరిలో !/ నొకనిఁ గోరక యిట్లు నకులుఁ గోరి?'

తనుడు ధర్మాత్మజుం డనియెను 'మాతండ్రి / యగు పాండువిభునకు మగువ లిరువు:

ఆ. రందు గొంతికొడుకు లైన ముప్వురిలోన

నేను బ్రదికినాఁడ; నింక మాద్రి

తనయు లిరువురందుఁ దగ నొక్కరుం డిపు

బ్రదుకవలదె? చెపుమ పాడితెఱఁగు. (*ఆంధ్ర. ఆరణ్య. 7: 457*)

'తన కొడుకులు శోకం చేత పరితపించి దైన్యాన్ని అనుభవించడానికి ఎల్లప్పుడూ తాను ఆవేదన చెందే తల్లి కుంతీదేవి, పాండురాజు దేవేరి, పుణ్యాత్మురాలు. ఆమె నాకు సంతోషంతో స్వాగతం చెప్తూ వచ్చి నన్ను ఆలింగనం చేసుకుని, 'నాయనా! ఆనాడు నీవు, నీతమ్ములు కలిసి అరణ్యాలకు వెళ్లారు కదా! ఈనాడు నీవు ఒంటరిగా వచ్చావేమిటి? నీ తమ్ములు ఏమయ్యారు? వారు ఎక్కడికి వెళ్లారు?' అని ప్రశ్నిస్తే, నేను ఏమని సమాధానం చెప్పగలను? ద్రోణాచార్యులు, పితామహుడు భీష్ముడు, మహానుభావుడు విదురుడు, గురువు కృపుడు నన్ను చూడగానే నాయోగక్షేమాల గురించి ప్రశ్నిస్తారు కదా! నేను మాత్రం క్షేమంగా తిరిగి వచ్చాను అని ఎలా బదులు పలుకగలను? ఏ విధంగానైనా తీరని ఆపద వచ్చింది కదా!'

'శ్యామల శరీరుడు, చెంగలువసోయగం చిందే కన్నులు కలవాడు ఆజానుబాహువు' మద్దిచెట్టును పోలిన నిడివి కలవాడు, ఉన్నతములు లలితములు అయిన బాహువులు కలవాడు, అయిన నకులుడిని బ్రతికించుము' అని ధర్మరాజు యక్షుడిని అర్థించాడు. అంతట యక్షుడు మహారాజా! నీకోరిక నాకు అర్థం కాలేదు. భీముడు, అర్జునుడు సుప్రసిద్ధులైన లోకోత్తరవీరులు. నీకు ప్రీతి పాత్రులు. వీరిలో ఒకరిని బ్రదికించమని కోరిక కోరకుండా, ఈ నకులుడిని బ్రదికించమని ఎందుకు కోరావు? అని ఆశ్చర్యం ప్రకటించాడు. ధర్మరాజు ఇలా బదులు పలికాడు 'మా తండ్రి పాండుప్రభువుకు ఇద్దరు భార్యలు. కుంతీసుతుల్లో పెద్దవాడను నేను బ్రతికి ఉన్నాను కదా! ఇక, మాద్రీతనయుల్లో ఒకడు బ్రదుకవలెను కదా! నీవే ధర్మం తీరు ఎరిగి దయతో వచించుము.

పైన ప్రస్తావించబడిన రెండు పద్యాలు, మనవసంబంధాలు కొలువైనవి. రెండు పద్యాలు వేర్వేరు సందర్భాల్లో వచ్చినా రెండూ ధర్మరాజుకి సోదరులపట్ల ఉన్న ప్రేమని, తల్లి మాటని నిలబెట్టాలనే బాధ్యతని వ్యక్తీకరిస్తాయి.

మొదటి పద్యంలో, దిగ్గజాల్లాంటి నలుగురు తమ్ముళ్లను శవాలుగా చూసేసరికి చలించిపోయిన ధర్మరాజు పరిస్థితిని ఎర్రన వర్ణిస్తే, రెండవ పద్యంలో నలుగురిలో ఒకరిని బ్రతికిస్తానని యక్షుడు వరాన్నిస్తే, ధర్మరాజు ఎవరిని కోరుకున్నాడో, ఎందుకు కోరుకున్నాడో తెలిపాడు ఎర్రన. రెండింటిలోనూ ధర్మరాజు బాధ్యతని మరింత బాధ్యతగా భావించి ఎర్రన మనకందించాడు.

పాండురాజు రెండవ భార్య అయిన మాద్రి ఆయనతో సతీసహగమనం చేసిన విషయం విదితమే. ఆ సందర్భంలో కుంతీదేవి మాద్రి బిడ్డలైన నకుల, సహదేవులను తన బిడ్డలతో సమానంగా పెంచుతానని మాట ఇచ్చింది.

తన తల్లి కుంతి, మాద్రికి ఇచ్చిన మాటని జవదాటని ధర్మరాజు నేటి తరానికి గొప్ప ప్రేరణగా నిలుస్తాడు. తండ్రి రాజ్యాన్ని, ఆస్తిని ఇద్దరు భార్యలకి సమంగా పంచినా అంగీకరించనివారు చరిత్రలో చాలామందే ఉన్నారు. అటువంటిది తల్లిదండ్రులు ఇచ్చిన మాటకు కూడా ఇంత విలువనిచ్చే కుమారుడు ఉండడం వారి పుణ్యఫలం. నేటితరంలో తండ్రి ఇచ్చిన ఆస్తికే తప్ప అప్పులకు, విలువలకు బాధ్యత వహించే గుణం చాలా అరుదు. ధర్మరాజు అటువంటివారందరికీ అనుసరణీయుడు.

తన – పర భేదం లేకుండా కుంతీదేవి పంచపాండవులను పెంచిందనే విషయం ఈ సందర్భంలో స్పష్టమవుతోంది. కేవలం ఆస్తిపాస్తులనే కాక కుంతీదేవి గుణగణాలను కూడా కొడుకులు పునికిపుచ్చుకున్నారని, కుంతీదేవి కట్టుబడిన విలువలకు పాండవులు, మరీ ముఖ్యంగా ధర్మరాజు కట్టుబడి ఉన్నారనే విషయాలు ఇక్కడ ప్రధానంగా గమనించదగినవి, అన్వయించుకుని ఆచరించదగినవి.

నలుగురు తమ్ముళ్ల శవాలు ఎదురుగా పెట్టకుని కూడా ప్రశ్నల సవాల్ ని స్వీకరించడానికి వెనుకాడని ధర్మరాజు గుండెనిబ్బరం ఇక్కడ అన్నింటికంటే ప్రధానమైన విషయం. జీవితంలో ఎటువంటి పరిస్థితి ఎదురైనా ఎదురొడ్డి మానవ సంబంధాలను నిలబెట్టుకోవడం ప్రధానం. ధర్మరాజు అదే ఆచరించి చూపించాడు. విగతజీవుల్లా పడి ఉన్న తమ్ముళ్లను చూసి కేవలం శోకించకుండా, తక్షణ కర్తవ్యం ఏంటో ఆలోచించాడు. తన తమ్ముళ్లని తన యుక్తితో బ్రతికించుకున్నాడు. ఇదే నేటితరం ధర్మరాజు నుంచి నేర్చుకోవాల్సింది. ఒకవైపు ఆలోచించకుండా చేసిన ఒకే ఒక్క తప్పిదం భీమార్జుననకులసహదేవులని విగతజీవులని చేస్తే, మరోవైపు వేసే ప్రతి అడుగు అలోచించి వేసి, చివరికి అసలైన ప్రజ్ఞ అంటే ఏంటో ధర్మరాజు నిరూపించాడు.

యక్షుడు తన ప్రశ్నలకు ధర్మరాజు ఇచ్చిన సమాధానాలకు ఆశ్చర్యపోయి, కేవలం ఒక తమ్ముడినే బ్రతికిస్తాను అని వరమిస్తాడు. ఇంతవరకు యక్షుడు కురిపించిన ప్రశ్నల వర్షం ఒక ఎత్తైతే, ధర్మరాజు వ్యక్తిత్వానికి, బాధ్యతకి, యుక్తికి, ధర్మాధర్మ వివేచనకి పరీక్ష పెట్టిన ఆ వరం ఒక ఎత్తు. ధర్మరాజు కోరుకున్న కోరిక యక్షుడిని, అయోమయానికి గురిచేసింది. రాబోయే కురుక్షేత్ర సంగ్రామం గురించి ఆలోచించకుండా, లాభాపేక్ష లేకుండా, కేవలం ధర్మానికి మాత్రమే కట్టుబడి నకులుడిని బ్రతికించమని కోరుకుంటాడు ధర్మరాజు. ఆవిధంగా కోరి ధర్మరాజు సార్థక నామధేయుడు అనిపించుకున్నాడు. 'కుంతి సంతానంలో మొదటివాడినైన నేను బ్రతికున్నాను కాబట్టీ, మాద్రి సంతానంలో మొదటివాడైన నకులుడు బ్రతికి ఉండడం ధర్మం' అంటూ ధర్మరాజు ఇచ్చిన సమాధానం యక్షుడిని ఆశ్చర్యచకితుడిని చేసింది. ఆనందపారవశ్యంలో యక్షుడు నలుగురు తమ్ముళ్లనీ బ్రతికించి ధర్మరాజుకి కానుకగా ఇస్తాడు. మానవసంబంధాలు ఎంత విలువైనవో, వాటిని విపత్కర పరిస్థితులు ఎదురైనా కూడా ఎలా నిలబెట్టుకోవాలో ధర్మరాజు ఆచరించి చూపించాడు.

## 3.19. కీచకవధ ఘట్టం

తిక్కన రచించిన విరాటపర్వం మొత్తం ఆంధ్ర మహాభారతానికే శిఖరాయమానమైన పర్వం. అటువంటి విరాట పర్వంలో ఎన్నో సామాజికాంశాలు దర్శనమిస్తాయి. ముఖ్యంగా మానవసంబంధాలను తిక్కన వర్ణించిన తీరు తర్వాత ఎంతో మంది కవులకి ఆదర్శంగా నిలిచిపోయింది.

కీచకవధ ఘట్టంలో ద్రౌపది తన మాటల్లో పాండవుల గొప్పతనాన్ని వర్ణిస్తుంది. ముఖ్యంగా ఆమె పాండవులలో చిన్నవాడైన సహదేవుడి గురించి వర్ణించిన తీరు ఎంతో హృద్యంగా సాగింది. ద్రౌపది తన మాటల్లో సహదేవుడి పరాక్రమాన్ని వర్ణించడంతో పాటు కుంతీదేవి సహదేవుడి గురించి ప్రేమతో పలికిన మాటలను కూడా ఉటంకిస్తుంది.

సహదేవుడిని వర్ణిస్తూ ద్రౌపది, కుంతీదేవి పలికిన మాటలని తిక్కన మలిచిన తీరు మానవసంబంధాలు ఎంత వైవిధ్యంగా ఉంటాయో తెలియజేస్తూనే, తల్లిప్రేమకీ, భార్య అనురాగానికి అద్దం పట్టింది. తిక్కన తన వర్ణనానైపుణ్యంతో ఈ రెండు పద్యాల ద్వారా చక్కటి చర్చకి ఆస్కారం కల్పించాడు.

శా. ఆ రూపం బవికార, మా భుజబలం బత్యంత నిర్గర్వ, మా
శూరత్వంబు దయారసానుగత, మా శుంభత్క్రియాజ్ఞాన మా
ర్యారంభ ప్రతికూల వాదరహితం, బా యీఁ గి సన్మాన వి
స్తారోదాత్తము మాద్రి పిన్నకొడు కేతన్మాత్రుఁడే చూడఁగన్? *(ఆంధ్ర. విరాట.2: 209)*

'మాద్రి చిన్నకొడుకైన సహదేవుడు సామాన్యుడా? (అసామాన్యుడని భావం). అతడి ఆ రూపం నిర్వికారం, ఆ బాహుబలం గర్వం లేనిది, ఆ పరాక్రమం దయారసంతో కూడింది. ఆ కార్య నిర్వహణ పరిజ్ఞానం పెద్దల నడవడికకు వ్యతిరేకం కానిది, వివాదాలకు గురి కానిది. ఆ దానం ప్రపత్తిచేత ఉదాత్తమైనది. కనుక, అతడు వయస్సులో చిన్నవాడైనా గుణాలలో పెద్దవాడే'.

ఒక భార్య భర్తని ఏ కోణంలో చూస్తుందనే విషయం ద్రౌపది మాటల ద్వారా తెలుసుకోవచ్చు. సహదేవుడు పాండవులలో అందరికంటే చిన్నవాడు. చిన్నవాడు అనగానే పరాక్రమం విషయంలో ఏ రకంగా చూసినా అన్నలకి తక్కువ కాదు అని ద్రౌపది ఉద్దేశ్యం. సహదేవుడు అందంలో,

పరాక్రమంలో, ఔదార్యంలో, కార్య నిర్వహణలో, దాన గుణంలో, సత్ప్రవర్తనలో అన్నలకి సమమైనవాడు అని ద్రౌపది మాటల బట్టీ తెలుస్తోంది. పై పద్యాన్ని పరిశీలిస్తే, ద్రౌపది (భార్య) సహదేవుడిలో (భర్తలో) అందం, పరాక్రమం, ఔదార్యం, కార్య నిర్వహణ, దాన గుణం, సత్ప్రవర్తన వంటి గుణాలని దర్శించింది. గుణవంతురాలైన ఏ భార్యయైనా భర్తలో ఈ గుణాలు ఉండాలని కోరుకుంటుంది.

మొదటి పద్యంలో భార్య భర్తని వర్ణించిన తీరుని ఆవిష్కరించిన తిక్కన, రెండవ పద్యంలో తల్లి బిడ్డని వర్ణిస్తే ఎలా ఉంటుందో వివరిస్తున్నాడు.

చ. 'కడుఁ బసిబిడ్డ వీఁ; డొకటి కాదవునా నెఱుఁగండు; ముంద రె
యెయ్యెడ నొకపా టెఱుంగఁ; డెద యెంతయుఁ గోమల; మెప్పుడైన నేఁ
గుడువఁగఁ బిల్తుఁగాని తనకుం గల యాఁకటిప్రొ ద్దెఱుంగఁ డీ
కొడు కిటు పోకకు న్మనము గుందెడు; ని న్గని యూఱడిల్లెడున్. *(ఆంధ్ర. విరాట.2: 2*13)

'ఓ కోడలా! ఈ సహదేవుడు మిక్కిలి పసిబిడ్డ. ఔను, కాదని చెప్పలేని చిరుతడు. ఇంతకుమునుపు ఎట్టి కష్టాలు తెలియనివాడు. మిక్కిలి సున్నిత స్వభావం కలవాడు. ఆకలి వేళ కూడా తెలుసుకొనలేడు. నేను పిలిచి అన్నం పెడతాను కానీ, తనకు తానై అడగడు. అలాంటి కొడుకు ఇలా అడవులకు వెళ్తుంటే మనస్సు విలవిలలాడుతోంది. అయినా నిన్ను చూసి ఊరటపొందుతున్నది'.

సహదేవుడి గురించి ద్రౌపది ముందు తన మాటల్లో వర్ణించాక, అత్తగారైన కుంతీదేవి పాండవులు ద్రౌపదితో ఆరణ్యవాసానికి బయలుదేరే ముందు తన బిడ్డ (సహదేవుడి) గురించి చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేసుకుంది. రెండు వర్ణనల మధ్య తిక్కన చూపించిన వైవిధ్యం మానవ సంబంధాల గురించిన చర్చకి తెరతీసింది.

ద్రౌపది సహదేవుడు గొప్ప పరాక్రమం కలవాడని, గొప్ప బాహుబలం కలవాడని కొనియాడితే, కుంతీదేవి సహదేవుడు చాలా సున్నితమైన స్వభావం కలవాడని, ఏది కావాలో ఏది వద్దో మాటల్లో చెప్పలేనంత అమాయకుడని, మొహమాటం ఎక్కువగా కలవాడని వర్ణించింది. భార్య భర్తలో పరాక్రమాన్ని, రాజసాన్ని గుర్తిస్తే, తల్లి ఎప్పుడూ బిడ్డని అమాయకుడిగానే పరిగణిస్తుంది. తల్లి ప్రేమలో ఉండే లాలిత్యం మరే ఇతర సంబంధాల్లో ఉండదని ఈ పద్యాల ద్వారా స్పష్టమౌతోంది.

రెండు పద్యాలను పరిశీలిస్తే, తల్లి ప్రేమలో ఉండే లాలిత్యానికి, భార్య ప్రేమలో ఉండే అనురాగానికి మధ్య వ్యత్యాసం తిక్కన రచనాశైలి వల్ల గొప్పగా ధ్వనిస్తోంది. దీన్ని బట్టీ మానవ సంబంధాలు ఎంత వివిధ్యమైనవో అర్థం చేసుకోవచ్చు.

## 3.20. ఉత్తరగోగ్రహణం

అజ్ఞాతవాస కాలం పూర్తయ్యాక, 13 ఏళ్ల పాటు ప్రత్యక్షంగా యుద్ధం చేయని అర్జునుడు కౌరవసేనని చూడగానే చెలరేగిపోయాడు. భీకరమైన పోరాట పటిమతో శత్రుసమూహాన్ని కమ్మేశాడు. ఇంత ఆగ్రహావేశాల మధ్య కూడా యుద్ధంలో అర్జునుడు అనుసరించిన వ్యూహాలు, అతడి నడవడిక ఎంతో మానవీయంగా సాగాయి. ముఖ్యంగా భీష్మ, కృప, ద్రోణుల పట్ల యుద్ధరంగంలో అతడు వ్యవహరించిన తీరు వారిని ఎంతో ఆశ్చర్యపరిచింది. ఈ ఘట్టంలో అర్జునుడి వినయం, అర్జునుడి పట్ల ద్రోణుడి అభిమానం వెరసి గురుశిష్యసంబంధాలు ఎంత ఉన్నతంగా ఉండాలో తిక్కన కవిత్వంలో గొప్పగా ఆవిష్కృతమయ్యాయి.

మ. 'విలసద్గాండివ చాలనోద్ధతి కనద్విద్యుల్లతాలీలగా
నలఘుస్ఫార కపిధ్వజ ధ్వని సముద్యద్గర్జ చందంబుగా;
జలదాకారతనొందెఁ దే రితఁడు పర్జన్యాకృతిం బొల్చెఁ; దో
ర్బలతీవ్రారి నిదాఘ దుర్విషహ గర్వస్ఫూర్తి నిర్మూర్తిగాన్. *(ఆంధ్ర.* విరాట. *4: 251*)

'అర్జునుడి గాండీవం యొక్క కదలిక మెరుపుతీగ వలె, కపికేతనం యొక్క ధ్వని మేఘం వలె ఉంది. అర్జునుడు ఇంద్రుడివలె ఉన్నాడు. కనుక, శత్రువు అనే వేసవి గర్వం పూర్తిగా నశించింది. శత్రువు బాహుబలం వేసవివలె ఉందనీ, అర్జునుడు వర్షాధిపతి అయిన దేవేంద్రుడివలె ఉన్నాడని భావం'.

'అర్జునుడు నాకు నమస్కరించినట్లుగా ఇప్పుడు రెండు బాణాలను నా పాదాల ముందర వేసి, ఎంతోకాలం విడిచి దూరంగా ఉన్నాడు. కనుక, కుశలాదికాన్ని అడిగినట్లుగా, చెవులకు తాకీ తాకనట్లుగా రెండు బాణాలు వేశాడు అని ద్రోణుడు ఇంకా ఈ విధంగా అన్నాడు.

అడవులలో పదమూడు సంవత్సరాలు కష్టాలు అనుభవించి, కోపంతో అర్జునుడు ఎంతో ఆవేశంతో వచ్చాడు. ఇప్పుడే సమీపించి ఈ అల్పసేనలమీదికి దూకి వాటిని నాశనం చేసేటట్లున్నాడు.

అరణ్య, అజ్ఞాతవాసాలను రెంటినీ ముగించి, ఎంతో అభివృద్ధి చెంది, అర్జునుడు రాత్రిని గడిపి నూతనంగా ఉదయించే సూర్యుడివలె తేజోమూర్తిగా కనిపిస్తున్నాడు అని ద్రోణుడు అన్నాడు.

కృపాచార్యుడూ, భీష్ముడూ, అర్జునుడు ప్రయోగించిన బాణాలతీరులలో ఉన్న నమస్కార, కుశలప్రశ్నలు అనేవాటిని మనస్సులలోనే గమనించి సంతోషించారు' *(ఆంధ్ర. విరాట. 4: 252 – 255)*. ఇదే సందర్భంలో సింగంబాకటితో…*(ఆంధ్ర. విరాట. 4: 95)* అనే పద్యంలో ద్రోణాచార్యుడికి తన ప్రియశిష్యుడిపై ఉన్న అభిమానాన్ని గమనించవచ్చు.

13 ఏళ్ల తర్వాత ద్రోణాచార్యుడిని దర్శించుకున్న అర్జునుడు ఆనందంతో గౌరవపురస్సరంగా ద్రోణుడి పాదాల వద్ద రెండు బాణాలను వేశాడు. అవి నమస్కార బాణాలు. అలాగే, ద్రోణుడి చెవులకి తాకీ తాకనట్లుగా రెండు బాణాలు వేశాడు. అవి కుశల బాణాలు. యుద్ధరంగంలో బాణాలు ప్రయోగించే తీరు బట్టీ, చదివే మంత్రం బట్టే, గురిపెట్టిన చోటు బట్టీ వాటికి అనేకానేక అర్థాలు, భాష ఉంటాయి. అర్జునుడు ఆ విద్యలన్నీ ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు మొదలైన గురువుల వద్ద అభ్యసించాడు. వారు నేర్పిన విద్యతోనే వారిని గౌరవించి అర్జునుడు వారి ఆశీస్సులు పొందాడు.

ప్రియశిష్యుడైన అర్జునుడి గురించి ద్రోణాచార్యుడి మనస్సులో భావనలు ఇలా ఉండగా, భీష్మ, ద్రోణ, కృపాచార్యులను దూరం నుండి గమనిస్తున్న అర్జునుడు వారి పట్ల మరింత ఉచితంగా వ్యవహరించాడు. తన రథసారథిగా ఉన్న ఉత్తరుడికి కౌరవసేన పరిచయం లేదు. అందుకని, ఉత్తరుడికి అర్జునుడు కౌరవసేనలోని వీరులనందరినీ ఒక్కొక్కరిగా పరిచయం చేయసాగాడు. ముఖ్యంగా కృప, ద్రోణాచార్యులను అతడు ఉత్తరుడికి పరిచయం చేసిన తీరు అర్జునుడి గురుభక్తిని చాటుకుంది.

ఉ. ఈతనితోడి కయ్యమున కియ్యకొనం దగ; దేను దుష్టథ
దూ్యత జయోద్ధతుండగు సుయోధనునిం బరిమార్పఁ బోవుచో
శాతశరోత్కరం బితఁడు చక్కఁగ నేయునొ? నన్ను నేయఁడో?
చూతము; తాన ము న్ననికిఁ జొచ్చినఁ జొత్తముగాక పిమ్మటన్. *(ఆంధ్ర.* విరాట. 5*:* 7)

'ఈ ద్రోణుడితో యుద్ధం ముందుగానే చేయకూడదు. మాయాద్యూతంలో నెగ్గి విర్రవీగే దుర్యోధనుడిని చంపడానికి వెళ్తాను. అప్పుడితడు, బాణాలతో నన్ను కొడతాడో, కొట్టడో చూద్దాం. తానే ముందు యుద్ధానికి దిగితే మనమూ దిగుదాం.

ఉత్తరా! మన రథాన్ని గురువుగారి రథానికి కుడివైపు నుండి పోనిమ్ము, గొప్పవారికి మనం కుడివైపు నుండి దారి ఇవ్వాలి. అది మర్యాద. అది ప్రదక్షిణమౌతుంది. దానికి విపరీతమైతే అది వారినవమానించినట్లు అవుతుంది. ఈ ద్రోణాచార్యుడు కౌరవకులంలో రాజకుమారులందరికీ ధనుర్విద్యలో శిక్షణనిచ్చినవాడు.

ఆయుధాలు వాడడంలో నేర్పరి, అస్త్రాలు తెలిసినవాడు, దూరంగా ఉన్న లక్ష్యాన్ని కొట్టగలవాడు. అతడి ముఖ వర్చస్సు చూడగానే శత్రువులు హడలిపోతారు. ధనుర్విద్యావిజ్ఞానంలో గట్టివాడు. శక్తిలో అతడికి సాటి ఎవ్వరూ లేరు' *(ఆంధ్ర. విరాట. 5: 5 – 6).*

అర్జునుడు యుద్ధరంగంలో ద్రోణాచార్యుడిని చూడగానే నమస్కార బాణాలు, కుశల బాణాలు వేసి ద్రోణుడి ఆశీస్సులు పొందాడు. ఇప్పుడు ద్రోణుడి పరాక్రమం గురించి ఉత్తరుడికి వివరిస్తున్నాడు. అర్జునుడు, ఉత్తరుడు యుద్ధానికి వచ్చిన ప్రధాన ఉద్దేశ్యం గోవులను మరలించడం, అంతే తప్ప కౌరవసేనని నాశనం చేయడం కాదు. అందుకే, యుద్ధరంగంలో పరాక్రమానికి పెట్టింది పేరైన భీష్మ, ద్రోణ, కృపాచార్యులతో అర్జునుడు తన వినయప్రపత్తుల ద్వారా చాకచక్యంగా వ్యవహరించి, వారితో యుద్ధానికి కాలు దువ్వలేదు. గురువుల పట్ల అర్జునుడికి ఉన్న గౌరవం, భయం రెండూ ఇక్కడ ప్రదర్శితమయ్యాయి.

దుర్యోధనుడిని లక్ష్యపెడితే వచ్చిన పని నెరవేరుతుందనేది అర్జునుడి వ్యూహం. అందుకే, ఉత్తరుడితో ఆ దిశగా పోనిమ్మని సైగ చేశాడు. ద్రోణుడు తనపై బాణం వేస్తేనే బదులు ఇవ్వడం మంచిది అంటూ, తనకి ధనుర్విద్యలో ఓనమాలు నేర్పించిన ద్రోణుడిపై అర్జునుడు నేరుగా బాణం వేయకపోవడం అతడి గురుభక్తిని చాటుతోంది.

## 3.21. ముగింపు

మానవ సంబంధాల యొక్క ఆవశ్యకతని వివరిస్తూ, వాటిలో ఉండే వైవిధ్యాన్ని ఆంధ్ర మహాభారతం హృద్యంగా ఆవిష్కరించింది. అత్యాధునిక యుగంలో కూడా మానవసంబంధాలను ఎలా నిలుపుకోవాలో, పెంపొందించుకోవాలో ఆంధ్ర మహభారతంలో వివిధ ఘట్టాల్లోని పాత్రలు వివరించాయి. సహృదయత, సమానత్వం మానవసంబంధాలను పెంపొందించుకునే క్రమంలో విలువైన సాధనాలు అని ఆంధ్ర మహాభారతంలోని సాహిత్యం ద్వారా స్పష్టమౌతోంది. సమాజ

పురోగతికి ఆరోగ్యకరమైన మానవసంబంధాలు ఎంతో అవసరమని ఆంధ్ర మహాభారతం ద్వారా స్పష్టమౌతోంది.

ఆంధ్ర మహాభారతంలోని మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాల ఆధారంగా మానవ సంబంధాలలను ఎలా పెంపొందించుకోవాలో ఈ అధ్యాయంలో వివరించబడింది. నాలుగు పర్వాలలో ఈ దృక్కోణానికి సంబంధించిన సాహిత్యాన్ని సాధ్యమైనంత సమగ్రంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఉదహరించినవి కొన్నే అయినా, మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి. కేవలం, నాలుగు పర్వాలలో ఇన్ని ఉదాహరణలు పరిశోధన దృష్టికి దర్శనమిస్తే, మొత్తం ఆంధ్ర మహాభారతంలో మరెన్నో ఉదాహరణలు దొరికే అవకాశం ఉంది.

## అధ్యాయం – 4

# ఆంధ్ర మహాభారతం: నాయకత్వ లక్షణాలు

### 4.1. ఉపోద్ఘాతం

సమాజంలో ఒక సమూహానికి ఉన్న ఆశలను ఆశయంగా చేసుకుని వాటిని సాకారం చేసేందుకు పోరాటం చేసేవాడు నాయకుడు. ఒక సమూహాన్ని ఒక లక్ష్యం దిశగా ముందుండి నడిపించేవాడు నాయకుడు. తన గుణగణాలతో, వాగ్ధాటితో, ఆలోచనలతో, సిద్ధాంతాలతో ప్రజలను ప్రభావితం చేయగల శక్తి నాయకుడు. ప్రజలలో ఉన్న అపోహలను తొలగించి, మూఢనమ్మకాలను ఖండించి, వారిని సన్మార్గం వైపు నడిపించి, వారిని చైతన్యవంతులను చేసే సాధకుడు నాయకుడు.

సమాజంలో అత్యంత బలమైన శక్తి నాయకుడు. అతడి నడక, నడత ఎంతో మందిని బలంగా ప్రభావితం చేస్తాయి. అటువంటి నాయకుడు ఎటువంటి లక్షణాలను కలిగి ఉండాలి? ఎటువంటి ప్రవర్తన కలిగి ఉండాలి? ప్రజలని బాధ్యతగా ఎలా నడిపించాలి? అన్నింటినీ మించి ఒక వ్యక్తి, సమాజాన్ని శాసించే శక్తిగా ఎలా ఎదగాలి? వంటి ప్రశ్నలకి సమాధానంగా నాయకుడంటే ఇలా ఉండాలి అని నిరూపించిన శాస్త్రేతిహాసం ఆంధ్ర మహాభారతం. ప్రధానమైన కథలో పాఠకులను నిమగ్నం చేస్తూనే, మధ్య మధ్యలో వచ్చే ఉపాఖ్యానాలతో సంపూర్ణమైన జీవనానికి అవసరమైన సాధనాలను ఆంధ్ర మహాభారతం అందిస్తుంది.

మహాభారతంలో ఎంతో మంది నాయకులు ఉన్నారు. ప్రధానమైన నాయకులు పాండవులే అయినా, ఉపకథల్లో ఎంతో మంది ఆదర్శ నాయకుల జీవితాలు ఆవిష్కృతమయ్యాయి. అయితే, ప్రజలని ప్రభావితం చేయగలిగే నాయకుడు ప్రజలని ఎటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనైనా ధర్మమార్గంలోనే నడిపించాలనేది ఆంధ్ర మహాభారతం అందించే ముఖ్యమైన సందేశం. ఆ సందేశాన్ని ఎన్నో సజీవమైన కథల ఆధారంగా ఆంధ్ర మహాభారతం అందించింది.

ఆంధ్ర మహాభారతంలోని సాహిత్యం ఒక సంపూర్ణమైన నాయకుడికి ఉండవలసిన లక్షణాలను రకరకాల ఘట్టాలలో వివరించింది. ఈ లక్షణాలు నేటి రాజకీయ నాయకులకు సైతం చక్కగా వర్తిస్తాయి. 'యథా రాజా తథా ప్రజా' అన్నట్టుగా రాజు / నాయకుడు / రాజకీయ నాయకుడు సంపూర్ణంగా నాయకత్వ లక్షణాలను కలిగి ఉంటేనే ప్రజలు వారి సమాజ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తారు.

## 4.2. రాజరాజ నరేంద్రుడి నాయకత్వ లక్షణాలు

ఆంధ్రమహాభారతం కథలోకి ప్రవేశించక ముందు, మహాభారతాన్ని తెలుగులో రచించమని తనను కోరిన రాజరాజనరేంద్రుడిని స్తుతిస్తూ ఆదికవి నన్నయ రచించిన పద్యం ఇది. ఒక నాయకుడికి ఉండవలసిన ప్రధానమైన లక్షణాలని నన్నయ ఈ పద్యంలో ప్రస్తావించాడు.

ఉ. ఆశ్రితపోషణంబున, ననంతవిలాసమునన్, మనీషివి
ద్యాశ్రమతత్త్వవిత్త్వమున, దానగుణాభిరతిన్, సమస్తవ
ర్ణాశ్రమధర్మరక్షణమహామహిమన్, మహి నొప్పు సర్వలో
కాశ్రయుఁ, డాదిరాజనిభుఁ, డత్యకలంకచరిత్రసంపదన్. *(ఆంధ్ర. ఆది. 1: 6)*

'సర్వలోకాశ్రయుడ'నే కులక్రమాగత బిరుదంతో కూడినవాడు, మిక్కిలి నిర్మలమైన శీలసంపదలో మనువు, నలుడు, నహుషుడు మొదలైన పూర్వపురాజులతో సమానుడూ అయిన రాజరాజు తననాశ్రయించిన వారిని రక్షించటం చేతను, అధికమైన విలాసం చేతను, పండితుల విద్యలలో పరిశ్రమ యొక్క యథార్థాన్ని తెలుసుకోవడం చేత, దానగుణంలో ఆసక్తి చేత, అన్ని వర్ణాల ఆశ్రమాల విధ్యుక్త ధర్మాలను రక్షించడంలో గొప్ప మహిమ చేత, భూమిలో ప్రకాశిస్తూ ఉన్నాడు'.

మహారాజులు, పాలకులు, నాయకులు అంటూ ఎన్ని రకాలుగా పిలిచినా, వారికి ఈ లక్షణాలు తప్పనిసరిగా ఉండాలి. నన్నయ కాలం కాబట్టి రాజు అన్నారు. ఈకాలంలో రాజు అంటే దేశాన్ని పాలించే నాయకుడు/ నాయకులు. నాయకుడికి ప్రధానంగా శీలసంపద చాలా ముఖ్యం. ఎందుకంటే నాయకుడి ప్రవర్తన, నడవడిక ఆధారంగానే ప్రజలు నడుచుకుంటారు. రాజరాజ

నరేంద్రుడు శీల సంపద విషయంలో నలుడు, నహుషుడు మొదలైన రాజులతో సమానుడు అని నన్నయ కీర్తించాడు. ఆయా రాజుల చరిత్రలు కళంకం లేనివి.

నాయకుడికి ఉండవలసిన మరొక ప్రధానమైన లక్షణం దాన గుణం. ఆ గుణం ఉండడం వల్ల మాత్రమే నాయకుడు సొంత లాభం చూసుకోకుండా ప్రజలకి నిర్మలమైన పాలనను అందించగలడు. ప్రజలను పాలించడానికి శిస్తులు, పన్నుల రూపంలో ప్రజలు ఇస్తున్న సంపదనే నాయకుడు వారి అభివృద్ధి కోసం వినియోగిస్తాడు. అందువల్ల, ఏమాత్రం స్వార్థం ఉన్నా ఆ నాయకుడి వల్ల ప్రజలు నష్టపోతారు. అందుకే, నాయకుడికి సేవాగుణం, దానగుణం అత్యంత ఆవశ్యకాలు.

అన్నింటినీ మించి నాయకుడు అన్ని కులాలకి, మతాలకి తగిన ప్రాధాన్యాన్ని ఇవ్వడం చాలా అవసరం. అందరికీ సమప్రాధాన్యాన్నిస్తూ రాజు పరిపాలన చేయాలి. 'సర్వ లోకాశ్రయుడు' అనే మాట రాజరాజు విషయంలో సార్థకం. నాయకుడు ఎవరైనా సరే, లోకమంతటికీ ఆశ్రయం ఇవ్వదగినవాడు కావాలి. అంత సువిశాలమైన మనస్సు నాయకుడికి అవసరం. నన్నయ కూడా రాజరాజుని ఆశ్రయించిన వాడే.

ఈ గుణాలు ఆరంభంలోనే చెప్పడం వల్ల, నన్నయ రాజరాజు పట్ల తనకున్న అభిమానాన్ని చాటుకోవడమే కాక తాను వర్ణించబోయే కథలో పైన పేర్కొన్న లక్షణాలు కలిగిన రాజుల ఎంత ఉన్నత స్థితికి చేరుకుంటారో, ఈ గుణాలను విడిచిపెట్టి మరి కొంతమంది రాజులు స్వార్థంతో జీవితాలను ఎలా తలకిందులు చేసుకోబోతున్నారో నన్నయ సూచనప్రాయంగా ఈ పద్యంలో పలికించాడు. నేటి తరానికి ఇటువంటి లక్షణాలున్న నాయకులను ఎంచుకోవడం ఎంత ముఖ్యమో నన్నయ ఇటువంటి పద్యాలద్వారా, భారత కథ ద్వారా బోధిస్తున్నాడు.

సీ. నిజమహీమండలప్రజఁ బ్రీతిఁ బెంచుచుఁ, / బరమండలంబుల ధరణిపతుల
నదిమి కప్పంబుల ముదముతోఁ గొనుచును, / బలిమి నీయని భూమివలయపతుల
నుక్కడఁగించుచు, దిక్కులఁ దనయాజ్ఞ / వెలిఁగించుచును, విప్రకులము నెల్లఁ
బ్రోచుచు, శర ణన్నఁ గాచుచు భీతుల, / నగ్రజన్ములకు ననుగ్రహమునఁ

ఆ. జారుతరమహాగ్రహారంబు లిచ్చుచు,
దేవభోగముల మహావిభూతిఁ
దనరఁజేయు, చిట్లు మనుమార్గుఁ డగు విష్ణు
వర్ధనుండు వంశవర్ధనుండు. (*ఆంధ్ర. ఆది. 1: 7*)

'తన రాజ్యభూభాగంలోని జనులను ప్రేమతో వృద్ధిపొందిస్తూ, ఇతరరాజ్యాలను ఏలే రాజులను అణచి సామంతరాజులిచ్చే ధనరూపమైన పన్నులను సంతోషంతో గ్రహిస్తూ, బలగర్వం చేత కప్పాలను ఈయ నిరాకరించిన భూమండలాదధిపతుల గర్వమడగిస్తూ, అన్ని దిక్కుల్లోనూ తన ఆజ్ఞ సాగేటట్లుగా చేస్తూ, బ్రాహ్మణసమూహాన్నెల్లా రక్షిస్తూ, భయంతో శరణాగతులైతే అట్టివారిని కాపాడుతూ, భూసురులను దయతో అందమైన అగ్రహారాలనిస్తూ, దైవాలకు జరుగవలసిన ధూపదీప నైవేద్యోత్సవాది కైంకర్యాలను గొప్ప వైభవంతో కొనసాగిస్తూ, ఈ విధంగా వంశాన్ని పెంపొందించేవాడూ, పూర్వం మనువు అనుసరించిన మార్గాన్ని అనుసరించేవాడు అయిన రాజరాజనరేంద్రుడు'.

ఆంధ్ర మహాభారతంలో ఆదిపర్వంలో కథాప్రారంభానికి ముందు నన్నయ తనని ఈ రచనకై ప్రోత్సహించిన రాజరాజనరేంద్రుడిని స్తుతిస్తూ రచించిన పద్యాల్లో ఇదీ ఒకటి. నన్నయ కాలంలో రాజ్య పాలన ఎలా ఉండేది? రాజులు ఏయే విధానాలతో ప్రజలను పాలించేవారు? మహారాజుకి ఎన్నెన్ని బాధ్యతలు ఉండేవి? వంటి ప్రశ్నలెన్నింటికో ఈ పద్యం సమాధానంగా నిలుస్తుంది. అంతేకాకుండా నేటితరం నాయకులకు పాలన ఎలా చేయాలో, ప్రజలను ఎలా చూసుకోవాలో తెలియజేస్తుంది.

పద్యంలో లభిస్తున్న సమాచారం ప్రకారం మహారాజు (రాజరాజనరేంద్రుడు) సమయానికి పన్ను వసూలు చేసేవాడని అర్థం అవుతోంది. ఇది నేటితరం నాయకులకి ప్రధానంగా ఉండవలసిన లక్షణం. పన్ను సక్రమంగా వసూలు చేయడం వల్ల అవినీతి జరిగే అవకాశం చాలా తక్కువ. రాజ్యంలో ఎవరూ కూడా అక్రమంగా ధనాన్ని ఆర్జించడానికి అవకాశం ఉండదు. అంతేకాకుండా మహారాజు ఎప్పుడూ ధర్మానికే కట్టుబడి ఉండడం వల్ల, అతని ఆజ్ఞ రాజ్యంలో అన్ని దిక్కుల్లోనూ అప్రతిహితంగా చెల్లుతోంది. అంటే ధర్మనిష్ఠ అనేది మహారాజుకి ఉండవలసిన ముఖ్యమైన లక్షణం అనే విషయం స్పష్టమవుతోంది.

రాజరాజ నరేంద్రుడి రాజ్యంలో, దైవాలకు ధూపదీప నైవేద్యాలకి ఎటువంటి లోటు రాకుండా గొప్ప వైభవంగా ఉత్సవాలు చేస్తూ దేవాలయ పరిరక్షణ చేసేవారని పైపద్యం స్పష్టం చేస్తోంది. దాన్ని బట్టీ ప్రజల నమ్మకాలకు, మనోభావాలకు రాజ్యంలో పెద్దపీట వేశారని తెలుస్తోంది. ఇది నేటితరం నాయకులు ఆదర్శంగా స్వీకరించవలసిన విషయం. అంతేకాకుండా విద్యావంతులను గౌరవంగా చూసుకునేవారనే విషయం కూడా పైపద్యంలో స్పష్టం చేయబడింది. ఇలా అన్నిరకాలుగా ప్రజల శ్రేయస్సును కాంక్షించే మహారాజులు ఆకాలంలో ఉండేవారు. ఇటువంటి లక్షణాలను ఆదర్శంగా తీసుకుని నేటి నాయకులు, పాలకులు దేశాన్ని పాలించగలిగితే ప్రజలు ఎప్పుడూ సుఖశాంతులతో జీవిస్తారు అనే విషయం బోధపడుతోంది.

## 4.3. పరీక్షిన్మహారాజు గుణగణాలు

అర్జునుడి మనవడైన పరీక్షిన్మహారాజు గుణగణాలు ఈ పద్యంలో వర్ణించబడ్డాయి. అతడి గుణగణాలు నేటికీ ఎంతో ఆదర్శప్రాయమైనవి.

చ. అనవరతార్థ దాన యజనాభిరతున్, భరతాన్వయాభివ
ర్ధను, సకల ప్రజాహిత విధాను, ధనంజయ సన్నిభున్, భవ
జ్జనకుఁ బరీక్షితున్ భుజగజాల్ముఁ డసహ్య విషోగ్రధూమకే
తనహతిఁ జేసి చేసె నతిదాంతుఁ గృతాంతనికేతనాతిథిన్. *(ఆంధ్ర. ఆది. 1: 123)*

'ఎల్లప్పుడూ ధనాన్ని దానం చేయడంలోనూ, యజ్ఞాలు చేయడంలోనూ ఆసక్తి కలవాడు, భరత వంశాన్ని అభివృద్ధి పొందించేవాడు, ప్రజలందరికీ మేలు చేసేవాడు, అర్జునుడితో సమానుడు, నీజనకుడు, మిక్కిలి అంతరింద్రియ నిగ్రహం కలవాడు, అయిన పరీక్షిన్మహారాజును క్రూరుడైన తక్షకుడు సహింపశక్యం కాని విషమనే భయంకరమైన అగ్ని దెబ్బచేత యమునిగృహానికి అతిథిగా (అంటే మరణించిన వాడిగా) చేశాడు'.

రాజుకి (నాయకుడికి) ప్రధానంగా ఉండవలసిన లక్షణాలేంటో, ఆయా లక్షణాలున్న నాయకుడు ఎలా కీర్తించబడతాడో పరీక్షిన్మహారాజు వృత్తాంతం చదివితే అర్థం అవుతుంది. పరీక్షిత్తుకి ఎల్లప్పుడూ యజ్ఞయాగాదులపైన అపారమైన మక్కువ ఉండేది. యజ్ఞయాగాదులు చేయడం వల్ల, సకాలంలో వర్షాలు కురిసి ప్రజలు పంటలు బాగా పండించుకోవాలనే తపన

ఆకాలంనాటి మహారాజుల్లో కనపడేది. పరీక్షిత్తుది కూడా అదే దృష్టి. పరీక్షిత్తులో కనిపించే మరో ప్రధానమైన గుణం దానగుణం. అంతటి దానగుణం, త్యాగభావన ఉన్నవాడు కాబట్టే తనకి ఎప్పుడు, ఎలా, ఎవరివల్ల మృత్యువు వస్తుందో తెలిసి కూడా చేయవలసిన కనీసప్రయత్నం చేసి ప్రశాంతంగా ఉండగలిగాడు. తన సిరిసంపదలపట్ల మమకారం లేనివాడు మాత్రమే అలా ప్రశాంతంగా ఉండగలడు. ఆ మమకారం చావాలంటే 'నా' అనే భావన మనస్సులో ఉండకూడదు. అందుకే, పరీక్షిత్తు ఎప్పుడూ దానాలు చేసేవాడు.

నేటి పాలకులలో పదవుల కోసం కొట్లాడుకునేవాళ్లే తప్ప తృణప్రాయంగా వాటిని వదులుకోవడానికి సిద్ధపడేవారు చాలా అరుదు. స్వార్థం నిండా పేరుకుపోతే నాయకులలో త్యాగభావం పూర్తిగా నశిస్తుంది. ప్రజలు అన్యాయం అయిపోతారు. నేటి సమాజంలో ఎక్కడ చూసినా ఇటువంటి పరిస్థితే ఎక్కువగా కనిపిస్తోంది. అందుకే, పరీక్షిత్తు వంటి పాత్రలను ఆదర్శంగా తీసుకుని నేటి నాయకులు పాలన చేయగలిగితే ప్రజల భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుంది.

## 4.4. కురువంశ మహారాజుల ప్రశస్తి

జనమేజయుడు వైశంపాయనుడిని, కురువంశ గొప్పతనాన్ని గురించి అడగిన సందర్భంలోని ఈ పద్యం నాయకుడికి ఉండవలసిన లక్షణాలను సమగ్రంగా ఆవిష్కరించింది.

సీ. అభ్యస్తవేదవేదాంగులు, విధిదత్త /దక్షిణాప్రీణిత ధరణిదేవు,
లనవరతాశ్వమేధావభృథస్నాన /పూతమూర్తులు, కృతపుణ్యు, లహిత
వర్గజయుల్, ప్రాప్తవర్గచతుష్టయుల్, /సత్త్వాది సద్గుణజన్మనిలయు
లాభరతాది మహామహీపాలకు /లిద్ధయశోర్థు లెందేనిఁ బుట్టి

ఆ. రట్టి కౌరవాన్వయంబుఁ బాండవ నృప
రత్నములకు వారిరాశి యైన
దాని వినఁగ వలతుఁ దద్దయుఁ బ్రీతితో
విప్రముఖ్య! నాకు విస్తరింపు. (*ఆంధ్ర. ఆది. 3: 86*)

'సకల వేదవేదాంగాలు అభ్యసించినవారు, యజ్ఞయాగాలలో భూరి దక్షిణలిచ్చి బ్రాహ్మణులను సంతృప్తి పరిచినవారు, నిరంతరం అశ్వమేధయాగాలాచరించి అవభృథస్నానం చేత పవిత్రమైన దేహం కలవారు, పుణ్యచరితులు, అరిషడ్వర్గాలను జయించినవారు, ధర్మార్థకామాదులను పొందినవారు, సత్త్వగుణసంపన్నులు అయినటువంటి భరతుడు మొదలుగా గల కీర్తికాంక్షులైన మహారాజులు పుట్టిన కౌరవవంశం పాండవులనే రత్నాలకు సముద్రం వంటిది. అటువంటి కౌరవవంశాన్ని గురించి నాకు సవిస్తరంగా ప్రీతితో తెలుపుము. విన వేడుక పడుతున్నాను'.

జనమేజయుడు తాను పుట్టిన కురువంశ గొప్పతనాన్ని వైశంపాయనుడి ద్వారా తెలుసుకోవాలనుకున్నాడు. తెలుసుకునే క్రమంలో, తనకి వారి గురించి తెలిసిన విషయాలను ఈ పద్యంలో ప్రస్తావించాడు.

కౌరవవంశంలో పుట్టిన భరతుడు, పాండవులు, కౌరవులు మొదలైన రాజులు అంతా కూడా వేదవేదాంగాలను అభ్యసించినవారు, అనగా ఋగ్వేద, యజుర్వేద, సామవేద, అథర్వణ వేదాలు మొదల్కొని శిక్ష, వ్యాకరణం, నిరుక్తము, జ్యోతిష్యము, ఛందస్సు, కల్పము అనబడే వేదాంగాల వరకు క్షుణ్ణంగా అభ్యసించినవారు అని అర్థం. ఇప్పటి కాలానికి ఈ విషయాన్ని అన్వయించుకోవాలంటే, పరిపాలించే నాయకుడు సంపూర్ణంగా విద్యాభ్యాసం చేసినవాడు అయ్యుండాలి అని అర్థం. అప్పుడే నాయకుడు తీసుకునే నిర్ణయాలు సమతూకంగా ఉంటాయి. నేటి రాజకీయ నాయకుల్లో పూర్తిగా విద్యాభ్యాసం చేయనివారు వేలల్లో కనిపిస్తున్నారు. ఈ పరిస్థితి సమాజహితానికి దోహదపడకపోగా, సమాజంలో అవినీతికి, అన్యాయాలకి ఆజ్యం పోసినట్లౌతోంది.

కురువంశరాజులు యజ్ఞయాగాదులలో ఇచ్చిన భూరి దక్షిణలు చూస్తే వారు గొప్ప దాన గుణం కలవారని స్పష్టమవుతోంది. నాయకుడికి త్యాగ భావం, దయాగుణం చాలా ముఖ్యమని అర్థమవుతోంది.

కురువంశ రాజులు పుణ్యచరితులుగా కీర్తించబడడం పై పద్యంలో కనిపిస్తుంది. అంటే, నాయకుడికి ఎటువంటి నేరచరిత్ర ఉండకూడదు అనే విషయం స్పష్టమవుతోంది. అటువంటివారే ప్రజలను పాలించడానికి అర్హులు అని తెలుస్తోంది. 'యథారాజా తథా ప్రజా' అన్న చందంగా పాలించే మహారాజు / నాయకుడు పుణ్యచరితుడైతేనే ప్రజలు అతడిని అనుసరిస్తారు.

కురువంశ రాజులు పురుషార్థాలైన ధర్మార్థకామమోక్షాల పట్ల సరైన వ్యవహారణ కలిగినవారని, కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనబడే అరిషడ్వర్గాలను జయించినవారని, ధైర్య, శాంతి, కరుణ, సంతోష, విద్యాదులైన సత్త్వగుణసంపన్నులని స్పష్టమవుతోంది. దీన్ని బట్టి నాయకత్వం అనేది వారసత్వంగా సిద్ధించే ఆస్తి కాదని, పైన పేర్కొన్న లక్షణాలను కలిగి ఉన్న నాయకుడు మాత్రమే ప్రజలను పరిపాలించడానికి అర్హుడని అర్థమవుతోంది. అంతే కాకుండా, ఆ కాలంలో నాయకుడు ఎలా ఉండేవాడో తెలుస్తోంది. ఈ లక్షణాలను మెండుగా పెంపొందించుకున్న నాయకులకి, విస్మరించిన నాయకులకి ఎటువంటి పరిస్థితులు ఎదురయ్యాయో మహాభారత కథ చదివితే సోదాహరణంగా అర్థమవుతుంది.

## 4.5. నాయకత్వ సూత్రాలు: యయాతి బోధన

యయాతి మహారాజు తన కొడుకైన పూరుడికి నాయకత్వ లక్షణాలు ఏంటో, వాటిని ఎలా పెంపొందించుకోవాలో చక్కగా వివరించాడు.

క. ఎఱుక గలవారి చరితలు
గఱచుచు, సజ్జనుల గోష్ఠిఁ గదలక ధర్మం
బెఱుఁగుచు, నెఱిఁగిన దానిని
మఱవ కనుష్ఠించునది సమంజసబుద్ధిన్. (*ఆంధ్ర. ఆది. 3: 203*)

‘జ్ఞానం కలవారి చరిత్రలు అభ్యసిస్తూ సజ్జనులసల్లాపము నందు కదలకుండా ధర్మం తెలుసుకుంటూ, తెలుసుకున్నదానిని మర్చిపోకుండా న్యాయంతో కూడిన బుద్ధితో చేయాలి.

నాయకుడు అనేవాడికి ఉండవలసిన మొదటి లక్షణం, తనకన్నా ముందు పాలించిన రాజుల చరిత్రలు అభ్యసించి, వాటి ద్వారా తప్పొప్పులను బేరీజు వేసుకోవడం, ఆ అనుభవాలని అనుసరించి తాను పరిపూర్ణమైన నాయకుడిగా ఎదగడం. అంతే కాకుండా ధర్మాన్ని, న్యాయాన్ని మహారాజు/నాయకుడు ఎన్నడూ విస్మరించకూడదు అనే విషయం యయాతి మాటల ద్వారా తెలుస్తోంది. నాయకుడు న్యాయానికి, ధర్మానికి కట్టుబడి ఉంటేనే ప్రజలు అతడిని అనుసరిస్తారు. ‘యథా రాజా తథా ప్రజా’ అన్న చందంగా నాయకుడి ప్రవర్తన, నడవడికి ప్రజలపై బలమైన ప్రభావాన్ని చూపిస్తుంది.

“ఈ సందర్భంలో మనం వేదానుశాసనాన్ని స్మరించాలి. “అథ యది తే కర్మ విచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్. యుక్తా ఆయుక్తాః అలూక్షాః ధర్మకామాః స్యుః యథా తే తత్ర వర్తేరన్. తథా వర్తేరన్. తథా వర్తేథాః”. ‘ఒకవేళ నీకు ఒక పనిలో కాని ఒక నడవడిలో గానీ సందేహం ఏర్పడితే ధర్మనిర్వహణలో గట్టి పట్టుదల గలవారు, కఠిన స్వభావం లేనివారు, ధర్మము నందే కామన కలవారు అయిన మహాత్ములు అటువంటి సందర్భాలలో ఎలా ప్రవర్తిస్తారో నీవు అలా ప్రవర్తించు’ అని ఆ వేదవాక్యాల సారాంశం” *(క. భా. జ్యో. 2005: 15).*

క. ఇచ్చునది పాత్రునకు ధన
మచ్చుగ; నొరు వేఁడకుండునది; యభిముఖు లై
వచ్చిన యాశార్థుల వృథ
పుచ్చక చేయునది సర్వభూతప్రీతిన్. (*ఆంధ్ర. ఆది. 3: 204*)

‘అర్హుడికి తగినట్లుగా ధనమివ్వాలి. ఇంకొకరిని అడగకుండా ఉండాలి. ఎదురుగా వచ్చిన యాచకులను నిరాశ పరచక సకలజీవులకు సంతృప్తి చేయాలి’.

నాయకుడికి దాన గుణం చాలా ప్రధానమైనది. అయితే, అపాత్రదానం చేయకూడదు. అంటే నాయకుడు ఎవరు దానాన్ని స్వీకరించడానికి యోగ్యులో, ఎవరు కాదో తెలుసుకుని దానం చేయాలి. యయాతి మరొక ముఖ్యమైన విషయాన్ని ప్రస్తావించాడు. నాయకుడు ఎవరి దగ్గరా యాచించకూడదు, అంటే అప్పులు చేయకూడదు. తన రాజ్యపాలనకి అవసరమైన ధనాన్ని తానే తన విధానాల ద్వారా సమకూర్చుకోవాలి. ఎవరినీ అడగవలసిన పరిస్థితి ఏర్పడకుండా జాగ్రత్తపడాలి.

క. మనమునకుఁ బ్రియంబును హిత
మును బథ్యముఁ దథ్యమును నమోఘము మధురం
బును బరిమితమును నగు పలు
కొనరఁగఁ బలుకునది ధర్మయుతముగ సభలన్. (*ఆంధ్ర. ఆది. 3: 205*)

‘సభల్లో మనసుకు ప్రీతి కలిగించేది, మేలైనది, ఉచితమైనది, సత్యమైనది, తీయనిది, విస్తృతం కానిది అయిన మాట ధర్మంతో కూడుకుని ఉండేటట్లుగా పలకాలి’.

యయాతి మాటల ద్వారా నాయకుడికి ఉండవలసిన మరొక ప్రధానమైన లక్షణం సంభాషణానైపుణ్యం అని తెలుస్తోంది. నాయకుడి మాటనే ప్రజలు అనుసరిస్తారు. అందుకే ఆ మాట

మనసుకు ప్రీతి కలిగించేది, మేలైనది, ఉచితమైనది, సత్యమైనది, తీయనిది, విస్తృతం కానిది, ధర్మంతో కూడుకుని ఉండేటట్లుగా పలకాలని యయాతి పూరుడికి హితబోధ చేశాడు. నాయకుడి సంభాషణల్లో ఇన్ని లక్షణాలు ఉండాలి. అప్పుడే అతడు గొప్ప నాయకుడౌతాడు.

సీ. వదన బాణాసన వ్యక్తముక్తము లైన /పలుకు ల న్కడువాఁడి బాణతతులఁ
బరమర్మలక్ష్యముల్ పాయక భేదించు /చుండెడి దుర్జనయోధవరుల
కడనుండ కున్నది; కరుణ యార్జవమక్ష /జయము సత్యంబును శమము శౌచ
మను నివి యెద నిల్పునది; శత్రుషడ్వర్గ /జయమందునది శుద్ధశాంతబుద్ధి;
తే. మదముఁ గామముఁ గ్రోధంబు మత్సరంబు
లోభమును మోహమును నను లోని సహజ
వైరివర్గంబు నొడిచినవాఁడ యొడుచు
నశ్రమంబున వెలుపలి యహితతతుల. (*ఆంధ్ర. ఆది. 3: 206*)

'ముఖమనే వింటియందు వ్యక్తములై విడువబడిన మాటలనే వాడియైన బాణాల సమూహంతో, ఇతరుల మర్మాలనే గురులను, విడువక చీలుస్తుండే దుష్టులైన యోధశ్రేష్ఠుల చెంత నివసించకూడదు. దయ, ఋజుత్వం, ఇంద్రియజయం, సత్యం, బహిరింద్రియ నిగ్రహం, శుచిత్వం అనే వాటిని హృదయంలో నిలపాలి. నిర్మలమైన శాంతబుద్ధితో కామాది వైరులను ఆరుగురినీ జయించాలి. గర్వం, కామం, కోపం మత్సరం, పిసినారితనం, అజ్ఞానం అనే సహజమైన అంతశ్శత్రువుల సముదాయాన్ని ఓడించినవాడే బహిశ్శత్రువుల సముదాయాన్ని శ్రమలేకుండా ఓడిస్తాడు'.

యయాతి కాబోయే రాజు, తన కుమారుడైన పూరుడికి నాయకత్వలక్షణాలు గురించి చేసిన బోధనలో ఈ పద్యం అత్యంత కీలకమైనది, సమగ్రమైనది. ఒక వ్యక్తి ప్రజలను పాలించే శక్తిగా ఎదగడానికి ఈ లక్షణాలు చాలా అవసరం. నాయకత్వం అనేది వారసత్వంగా సిద్ధించే సంపద కాదు, ఆ కాలంలో ఈ లక్షణాలు నిండుగా కలిగినవాడినే నాయకుడిగా ప్రతిపాదించేవారు. రాజవంశంలో పుట్టినవాడైనా సరే, అతడికి ఈ లక్షణాలను అలవర్చిన తర్వాతే మహారాజుగా ప్రకటించేవారు. ఆనాటి వ్యవస్థని చూసి ఈతరం నాయకులు ఈ విషయాన్ని ఆదర్శంగా తీసుకోవాలి.

పరిపూర్ణమైన నాయకుడికి సంభాషణానైపుణ్యం, నిర్వహణ సామర్థ్యం, వ్యక్తిత్వ వికాసం, ధర్మాధర్మవివేచన వంటి లక్షణాలతో పాటు దయ, త్యాగ భావం, వీరత్వం, అన్నింటినీ మించి బహిరింద్రియ నిగ్రహం (దమం), అంతరింద్రియ నిగ్రహం (శమం) తప్పనిసరిగా ఉండాలి. పూరుడు అనితరసాధ్యమైన ఇంద్రియనిగ్రహశక్తి కలవాడు కాబట్టే తండ్రి కోసం తన యౌవనాన్ని తృణప్రాయంగా ధారపోయగలిగాడు.

నాయకుడు ఎప్పుడూ సత్యానికి కట్టుబడే తన జీవనాన్ని సాగించాలి. సత్యం అన్నింటికంటే గొప్పది. సత్యానికి విలువనిచ్చే నాయకులు ఎంతో మంతి చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోయారు. అంతేకాకుండా నాయకుడు కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యాలనబడే అరిషడ్వర్గాలను జయించినవాడై ఉండాలి. ఇటువంటి అంతశ్శత్రువులను ఏ నాయకుడైతే జయించగలడో అతడు బహిశ్శత్రువుల సముదాయాన్ని సునాయాసంగా ఓడించగలడు అని యయాతి పేర్కొన్నాడు.

యయాతి పూరుడికి చేసిన హితబోధ సార్వకాలికమైనది. నాయకుడు కావలి అని కలలు కంటున్న ప్రతీ వ్యక్తి అనుసరించవలసిన పాఠం ఇది. ముఖ్యంగా నేటి తరంలో సరైన విద్యార్హతలు లేకుండా, న్యాయస్థానాల్లో ఎన్నో ఆరోపణలు ఎదుర్కొంటూ, నాయాకత్వమేదో వారసత్వ సంపద అన్నట్టుగా ఇష్టారాజ్యంగా ఎదుగుతున్న నాయకులు, వారిని ప్రోత్సహిస్తున్న పెద్దలు, అనుచరులు, ప్రజలు అంతా కూడా ఈ పాఠాన్ని గుణపాఠంగా గ్రహించి సరైన  నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి.

## 4.6. దుష్యంతుడి నాయకత్వ లక్షణాలు

నన్నయ రచించిన ఆదిపర్వంలో అత్యంత ప్రసిద్ధమైన ఘట్టం శకుంతలోపాఖ్యానం. ముఖ్యంగా కొన్ని సందర్భాల్లో దుష్యంతుడి నాయకత్వ లక్షణాలు ఎంతో గొప్పగా కనిపిస్తాయి. ఈ ఘట్టానికి ఆయనే నాయకుడు కాబట్టి, నన్నయ దుష్యంతుడిని చిత్రించిన విధానం అత్యద్భుతం.

చ. 'ఇది మునికన్య యేని మఱి యేలొకొ యీలలితాంగియందు నా
హృదయము దద్దయుం దవిలె; నిప్పలు కింకను నమ్మనేర న
య్యెద; విజితేంద్రియుం డనఁగ నిమ్మునిఁ బాయక విందు' నంచుఁ దా
నిది కలరూ పెఱుంగ నవనీపతి యుత్సుకుఁ డయ్యె నాత్మలోన్. (*ఆంధ్ర. ఆది. 4: 30*)

చ. ఇది మునినాథ కన్య యని యెంతయు నిఃస్పృహవృత్తి నున్ననా
హృదయము రాజపుత్త్రి నని యిక్కమలాక్షి నిజాభిజాత్య సం
పద నెఱిఁగించినన్ మదనబాణపరంపర కిప్పు డుండ నా
స్పద మయి సంచలించె నళిపాత వికంపిత పంకజాకృతిన్. (*ఆంధ్ర. ఆది. 4: 51*)

''ఈ శకుంతల మునికన్యయే అయినట్లైతే, ఈ కోమలిపై నా మనస్సు ఎందుకు గాఢంగా లగ్నమైంది? 'నేనీమె మాటను నమ్మజాలకుండా ఉన్నాను. ఈ కణ్వమహర్షి ఇంద్రియాలను జయించినవాడని ఎప్పుడూ వింటూ ఉంటాను' అని భావిస్తూ 'ఈమె యథార్థాన్ని ఉన్నది ఉన్నట్లు తెలుసుకోవాలని' మనస్సులో దుష్యంతుడు ఆసక్తిని పొందాడు'. (*ఆంధ్ర. ఆది. 4. పుట: 320*)

'శకుంతల మునికన్యయేమో అని మిక్కిలి నిరాశతో ఉన్న నా హృదయం ఈ పద్మాక్షి తాను రాజపుత్త్రినని తన వంశౌన్నత్యాన్ని తెలపటం చేత మన్మథబాణ పరంపరకు వశమై తుమ్మెదలు వాలటం చేత కంపించిన పద్మం వలె చలించింది'. (*ఆంధ్ర. ఆది. 4. పుట: 329*)

ఈ రెండు పద్యాల్లో ఒకటి దుష్యంతుడు శకుంతల తన జన్మవృత్తాంతాన్ని తెలపక ముందు నన్నయ రచించినది అయితే, రెండవది శకుంతల జన్మవృత్తాంతం శకుంతల ద్వారానే విన్నాక తను క్షత్రియకాంతే అని దుష్యంతుడికి తెలిశాక దుష్యంతుడి పరిస్థితిని వర్ణించేది.

శకుంతలని చూడగానే మనసుపడ్డ దుష్యంతుడు, తన మనస్సు ఒక మగువపై లగ్నమైంది అంటే ఆమె కచ్చితంగా క్షత్రియ కాంత అయివుండాలి అని భావించాడు. తన అంతఃకరణంపై తనకున్న నమ్మకం అది. ఇది కుల భావన కాదు. క్షత్రియుడు యుద్ధాలు చేస్తాడు. సహజంగా అతడి హృదయం వీరవనితలనే ఇష్టపడుతుంది. కానీ, శకుంతల తాను కణ్వమహర్షి కూతురునని చెప్పింది. అయితే కణ్వమహర్షి అనితరసాధ్యమైన ఇంద్రియనిగ్రహం కలవాడని ప్రసిద్ధి. అందుకే దుష్యంతుడికి ఈ సందేహం కలిగింది.

ఎవరిలో ఏ గుణం ఉందో, ఎవరు ఎలాంటివారో ఒక్క చూపులోనే గ్రహించగలగడం ఉత్తమ నాయకత్వ లక్షణం. నాయకుడు అంత చురుకుగా ఉండాలి. నాయకుడుకి తనపై తనకి ఇంత నమ్మకం, నిగ్రహం ఉండాలి. లోకజ్ఞానాన్ని కలిగి ఉండాలి. ఈ లక్షణాలన్నీ దుష్యంతుడిలో మనకు కనిపిస్తాయి.

దుష్యంతుడికి తన కోరిక ధర్మబద్ధమైనది అని నమ్మకం. ధర్మబద్ధం కాకపోతే, తన మనస్సు శకుంతలవైపు మరలదు అని అతడి విశ్వాసం. ఇది అతడి సంస్కారానికి గుర్తు. దుష్యంతుడి ఇష్టం ధర్మబద్ధమైనది కాబట్టి రెండింటి మధ్య సంఘర్షణ లేదు. అందుకే సంశయించలేదు. శకుంతల గురించి వివరంగా తెలుసుకోవాలని ఆశపడ్డాడు. శకుంతల జన్మవృత్తాంతం గురించి తెలుసుకున్నాక తన సందేహమే నిజమైనందుకు సంతోషించాడు. మరొక్కసారి తన అంతఃకారణంపై, ధర్మబద్ధమైన తన ఎంపికపై తన నమ్మకం ధృఢమైంది.

"మూలభారతంలో తన సంశయాన్ని దుష్యంతుడు సూటిగా శకుంతలతో చెప్పినట్లున్నది. దానిని నన్నయ దుష్యంతుడి ఆత్మగతంగా మార్చాడు. ఈ కల్పనం మీద కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతల నాటకంలోని "ఆసంశయం క్షత్రపరిగ్రహ క్షమా/ యదార్య మస్యా మభిలాష మే మనః", "సందేహపదేషు వస్తుషు, ప్రమాణమంతః కరణ ప్రవృత్తయః" అనే శ్లోకపాదాల ప్రభావం కనబడుతున్నది. తన మనస్సు ఆమెపై లగ్నమైనది కాబట్టి ఆమె క్షత్రియపరిగ్రహయోగ్యమైనదనిన్నీ, దానికి దుష్యంతుడి అంతఃకరణమే సాక్షి అనిన్నీ భావం". (*ఆంధ్ర. ఆది. 4. పుట: 321*)

"రెండు పద్యాలు చంపకమాలలే. అంటే వృత్తైక్యం పాటించబడిందన్నమాట. రెండు పద్యాల ఎత్తుగడలూ సమానమే. ఇటువంటి వృత్త, గతి సామ్యాలు ఛందశ్శిల్పసంబంధి విశేషాలు. ఇవి కూడా వస్తు రస భావాలను ధ్వనింపజేస్తాయి. మొదటి పద్యంలో నాయకుడి హృదయంలో ఏర్పడిన శంక రెండవ పద్యంలో నివృత్తమై రతిభావదీప్తికి ఏర్పడిన అడ్డంకి తొలగి రసస్థితికి చేరే వికాసం ఏర్పడింది. అందువలన ఈ రెండు పద్యాలు నాయకగతమైన స్థాయి పోషణలో రెండు బలమైన బిందువులు". (*ఆంధ్ర. ఆది. 4. పుట: 329*)

## 4.7. బాల్యంలోనే నాయకత్వ లక్షణాలు

నాయకుడికి ప్రధానంగా ఉండవలసిన మరొక గుణం వీరత్వం. శకుంతలాదుష్యంతుల కుమారుడైన భరతుడు బాల్యంలోనే వీరత్వాన్ని ఎలా ప్రదర్శించాడో నన్నయ చక్కటి పద్యంలో వర్ణించారు.

మ. అమితోగ్రాటవిలోనఁ గ్రుమ్మరు వరాహవ్యాళశార్దూల ఖ
డ్గమదేభాదులఁ బట్టి తెచ్చి ఘనుఁడై కణ్వాశ్రమోపాంత భూ
జములం దోలిన కట్టుచుం బలిమిమై శాకుంతలుం డొప్పె వ
న్యమదేభంబుల నెక్కుచుం దగిలి నానాశైశవక్రీడలన్. (*ఆంధ్ర. ఆది. 4: 64*)

'భరతుడు అపారబలంతో అతిభయంకరమైన అడవులలో తిరుగాడే అడవిపందులను, పాములను, పులులను, ఖడ్గమృగాలను, మదించిన ఏనుగులను ఇంకా తదితర మృగాలను అవలీలగా పట్టి తెచ్చి ఘటికుడై ఎక్కి స్వారీ చేస్తూ తన బాల్యక్రీడలను అనేకరకాలుగా ప్రదర్శిస్తూ ఉన్నాడు'.

తండ్రియైన దుష్యంతుడు పెద్దయ్యాక ప్రదర్శించిన వీరత్వాన్ని భరతుడు బాల్యంలోనే ప్రదర్శిస్తున్నాడు. ఇంత చిన్న వయస్సులోనే భరతుడు సింహాలు, పులులు వంటి మృగాలతో ఆటలాడుతున్నాడంటే, పెద్దయ్యాక యుద్ధరంగంలో అతడి పరాక్రమం ఎలా ఉండబోతోందో ఊహించండి అంటూ పాఠకుల ఊహకే వదిలేశాడు నన్నయ. భరతుడు కణ్వమహర్షి ఆశ్రమంలో పెరగడం వల్ల అక్కడ సహజంగా నెలకున్న శాంతపూరితమైన వాతావరణం, సామరస్య గుణం భరతుడిపై ప్రభావాన్ని చూపిస్తాయి. దుష్యంతుడి కుమారుడు కాబట్టి వీరత్వం కూడా సిద్ధించింది. శకుంతల నుండి విపత్కర పరిస్థితుల్లో సైతం పోరాడే నైజం కూడా భరతుడికి సిద్ధిస్తుంది. ఇలా ఎన్నో గుణాల మిశ్రమం భరతుడి వ్యక్తిత్వం. అంత ఉన్నతమైన వ్యక్తిత్వం కాబట్టే తర్వాతి కాలంలో భరతుడు తన నాయకత్వ లక్షణాలతో గొప్పగా రాజ్య పాలన చేశాడు.

## 4.8. భీష్ముడి నాయకత్వం

ఆదిపర్వంలో నన్నయ భీష్ముడి పాలన ఎలా ఉండేదో గొప్పగా వర్ణించారు. భీష్ముడు ఒక్కసారి మాట ఇస్తే ఎలా కట్టుబడి ఉంటాడో తెలిసిందే. అటువంటి భీష్ముడి నాయకత్వంలో ప్రజలు ఎలా ఉన్నారో ఈ పద్యంలో ప్రస్తావించబడింది.

సీ. అమరాపగాసుతు ననుశాసనంబునఁ /గౌరవ రాజ్యంబు గడు వెలింగెఁ,

గురుభూము లుత్తరకురువులకంటెను /నధికలక్ష్మీయుక్తి నతిశయిల్లె,

ధర్మాభిసంరక్షితం బైన భూప్రజ /కెంతయు నభివృద్ధి యెసఁగుచుండె,

వలసినయప్పుడు వానలు గురియుట /సస్యసమృద్ధి ప్రశస్త మయ్యెఁ,

ఆ. బాలు సేఁపెఁ బుష్పఫలభరితంబు లై

తరువనంబు లొప్పె, ధర్మకర్మ

నిరతిఁ జేసి కరము నెమ్మితో నన్యోన్య

హితముఁ జేయుచుండి రెల్ల జనులు. (*ఆంధ్ర. ఆది. 5: 3*)

'భీష్ముని పాలనలో కౌరవరాజ్యం గొప్పగా వెలిగింది. కురుదేశం ఉత్తరకురుదేశాలకంటే అధిక సంపదతో విలసిల్లింది. ధర్మం చేత చక్కగా రక్షించబడిన దేశప్రజలకు అభివృద్ధి కలుగుతూ ఉన్నది. అవసరమైనప్పుడు వానలు కురవటంచేత పంటలు సమృద్ధిగా పండాయి. పాడి ఎక్కువ అయ్యింది. వృక్షాలు పూలతో, పళ్లతో నిండాయి. ప్రజలంతా ధర్మకార్యాలమీద ఆసక్తి కలవాళ్లై మిక్కిలి ప్రేమతో ఒకరికొకరు మేలు చేస్తూ ఉన్నారు'.

భీష్ముడికి నాయకుడికి ఉండవలసిన ప్రతీ లక్షణం ఉన్నాయని ఈ పద్యం తెలియజేస్తోంది. పాలకుడు ఎప్పుడూ సమయానికి పన్నులు వసూలుచేయడం ద్వారా, ఖజానాలో ఉన్న ధనాన్ని సక్రమంగా వినియోగించడం ద్వారా రాజ్యాన్ని (దేశాన్ని) ఎప్పుడూ అప్పులపాలు కాకుండా కాపాడతాడు. సరిగ్గా భీష్ముడి పాలనలో కూడా అప్పుల సమస్య తలెత్తలేదు. ఉత్తరకురుదేశాలకంటే కురుదేశమే ఎక్కువ సిరిసంపదలతో విలసిల్లింది. ఆనాటి కాలంలో ప్రతీ నాయకుడు (మహారాజు) వ్యవసాయానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చేవారనడానికి కవిత్రయ భారతంలోనే చాలా ఉదాహరణలు ఉన్నాయి. భీష్ముడు సైతం పంటలు బాగా పండడానికి అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకున్నట్టు పైపద్యం ద్వారా స్పష్టమవుతోంది. భీష్ముడు పాలనలో పాడి కూడా ఎక్కువ అయ్యింది. అన్నింటినీ మించి భీష్ముడి పాలనలో ప్రజలంతా పరోపకారపరాయణులై, ధర్మంతో జీవించేవారు. పై లక్షణాల మాట ఎలా ఉన్నా ప్రజలు ధర్మంగా జీవించడానికి ప్రధానమైన కారణం పాలకుడి ప్రవర్తన, నడవడిక.

భీష్ముడి తండ్రి కోరికకి ప్రాధాన్యతనిచ్చి జీవితాంతం రాజ్యభోగాలు వదులుకున్నవాడు. భవిష్యత్తులో తాను ఇచ్చిన మాట తన వంశస్థులు కూడా తప్పకుండా సంసారసుఖాలను సైతం

త్యజించినవాడు. అత్యవసర పరిస్థితుల్లో ఒక రక్షకుడిగా మాత్రమే రాజ్యభారాన్ని వహించాడే తప్ప, ఇచ్చిన మాట జీవితాంతం తప్పలేదు. భీష్ముడు అంతటి త్యాగమూర్తి కావడం వల్లనే ప్రజలంతా అతడి పాలనలో సుహృద్భావంతో మెలిగేవారు.

## 4.9. వసిష్ఠ, విశ్వామిత్రుల సంవాదం

ఆదిపర్వంలో విశ్వామిత్రుడికీ, వసిష్ఠుడికీ మధ్య జరిగిన సంవాదంలో భాగంగా వసిష్ఠుడు పలికిన ఈ మాటలు నిజమైన నాయకుడు ఎలా ఉండాలో తెలియజేస్తాయి.

ఆ. పరులవలన బాధ పొరయకుండఁగ సాధు
జనుల ధనము గాచు జనవిభుండు
కరుణ తప్పి తాన హరియించువాఁ డగు
నేని సాధులోక మేమి సేయు? (*ఆంధ్ర. ఆది. 7: 104*)

'ఇతరులవల్ల బాధ కలగకుండా, సాధుజనుల ధనాన్ని కాపాడవలసిన ప్రభువే దయ తప్పి, తాను అపహరించేవాడైతే, సాధు జనుల సమూహం ఏం చేయగలదు?'

వసిష్ఠుని ఆశ్రమానికి అతిథిగా విచ్చేసిన విశ్వామిత్రుడు, ఎంతో మహిమ కలిగిన, వసిష్ఠుడి హోమధేనువైన నందినిని చూసి దానిని దక్కించువాలనే ఆశతో వసిష్ఠుడికి ఒక లక్ష పాడి ఆవులను, అవసరమైతే రాజ్యాన్ని సైతంగా ప్రతిగా ఇవ్వడానికి సిద్ధపడతాడు. అందుకు వసిష్ఠుడు అంగీకరించకపోవడంతో ఆగ్రహించిన విశ్వామిత్రుడు ఆ హోమధేనువును బలవంతంగా దక్కించుకోవాలని ప్రయత్నిస్తాడు. అప్పుడు వసిష్ఠుడు పలికిన ఈ మాటలు నాటి నాయకులకే కాదు, నేటి రాజకీయ నాయకులకి సైతం వర్తిస్తాయి.

సమాజంలో ప్రజలకి, వారి సంపదలకి ఎటువంటి ఆపద వాటిల్లకుండా రక్షించడం నాయకుడి ప్రధాన కర్తవ్యం. వసిష్ఠుడికి ఉన్న సంపద ఆ హోమధేనువే. అందుకే, ఆ మహర్షి అంత తాపత్రయ పడ్డాడు. ప్రజల ఆస్తుల్ని పరిరక్షించాల్సిన ప్రభువే సంపదలు కాజేస్తే, ప్రజలు పరిస్థితి దుర్భరమవుతుంది. దీన్ని బట్టీ చూస్తే, నేటి కాలంలో ప్రజలని సంరక్షించాల్సిన పాలకులే భూకబ్జాల పేరిట ప్రజల ఆస్తులను వశం చేసుకోవడం ఎంతటి నేరమో తెలుస్తోంది. నాయకుడు ఎప్పుడూ తన బాధ్యతలని విస్మరించరాదని అర్థమవుతోంది.

## 4.10. అర్జునుని కర్తవ్యనిష్ఠ

ఆదిపర్వంలో, తనని శరణువేడి వచ్చిన విప్రుడికి అభయమివ్వడానికి పూనుకున్న అర్జునుడు పలికిన ఈ మాటల్లో నాయకుడి కర్తవ్యం ఏమిటో స్పష్టమవుతుంది.

క. ధరణీసురవరులకుఁ గడు

సెరగై నెడ నెఱిఁగి యెడయుఁ జేయుదురె మహా

పురుషు' లని నరుఁడు విలుగొని

యరిగెను ముచ్చులపిఱుంద నవ్విప్రుపనిన్ (*ఆంధ్ర. ఆది. 8: 119*)

'బ్రాహ్మణోత్తములకు ఆపద ఏర్పడిన సంగతి తెలిసి మహాపురుషులు మోహం తప్పించి వెళ్తారా? అని అర్జునుడు ధనుస్సు తీసుకుని ఆ విప్రుని పనిమీద దొంగల వెంట పడ్డాడు'.

అర్జునుడి వద్దకు ఒక బ్రాహ్మణుడు వచ్చి, ఎవరో దొంగలు తన హోమధేనువుని తస్కరించారని మొరపెట్టుకుంటాడు. ఆ సమయంలో పాండవుల ఆయుధాలుండే చోటు ధర్మరాజు, ద్రౌపదుల ఏకాంత మందిరం వద్ద ఉంది. కానీ, విప్రుడిని ఆదుకోవడమే ముఖ్యమని అర్జునుడు నిర్ణయించుకుంటాడు. అతడి నిర్ణయం అతడికి ఎన్నో ఇబ్బందులను తెచ్చిపెడుతుంది. వాటిని ఊహించి కూడా లెక్కచేయకుండా విప్రుడికి న్యాయం చేస్తాడు అర్జునుడు. 'ఉత్తమక్షత్రియులకు/నాయకులకు తమకి సంబంధించిన ధర్మం కంటే సంఘానికి సంబంధించిన ధర్మమే గొప్పది. అంటే నాయకుడికి స్వార్థం ఎప్పుడూ ఉండకూడదు. నాయకుడికి ప్రజల యోగక్షేమాలు చూసుకోవడమే ధర్మం' అనే విషయాన్ని తన చర్య ద్వారా అర్జునుడు నిరూపించాడు. నేటి తరం నాయకులకు దిశానిర్దేశం చేశాడు.

## 4.11. పధ్నాలుగు (14) రాజదోషాలు

ఆంధ్ర మహాభారతంలోని సభాపర్వం రాజనీతిజ్ఞతకి పెట్టింది పేరు. ఆ పర్వంలో ధర్మరాజుకీ, నారద మహర్షికీ జరిగిన సంభాషణలో భాగంగా చర్చకు వచ్చిన విషయాలు ఒక పక్క ఆనాటి రాజకీయ పరిస్థితులకు అద్దం పడుతూనే మరో పక్క నాయకుడికి ఉండాల్సిన లక్షణాలను గురించి అద్భుతంగా ఆవిష్కరించింది.

వ. 'మఱియు నాస్తిక్యం బనృతంబు ప్రమాదం బాలస్యం బనర్థజ్ఞులతోడి చింతనంబు క్రోధంబు దీర్ఘచింత దీర్ఘ సూత్రత యెఱుకగలవారి నెఱుంగమి యర్థంబుల యందనర్థక చింత నిశ్చితకార్యంబులు సేయమి మంత్రంబుల రక్షింపమి శుభంబులఁ బ్రయోగింపమి విషయంబులం దగులుట యనంబరఁగిన పదునాలుగు రాజదోషంబులఁ బరిహరింతె?' యని యడిగిన నారదునకు ధర్మరా జి ట్లనియె. (*ఆంధ్ర. సభా. 1: 56*)

'నాస్తికత, అసత్యమాడడం, ఏమరుపాటు, సోమరితనం, తెలివితక్కువవాళ్లతో కార్యాలోచన చెయ్యడం, అతికోపం, అధికకాలం దుఃఖించడం, చేయవలసిన పనిని గూర్చి అతిదీర్ఘంగా ఆలోచించడం, ఆలస్యంగా చెయ్యడం, జ్ఞానుల్ని గుర్తించకపోవడం, ప్రయోజనకరమైన విషయాల్లో ప్రయోజనభంగకరమైన ఆలోచనలు చెయ్యడం, నిర్ణయించిన పనులు చెయ్యకపోవడం, రహస్యాలోచనలు బయట పడకుండా కాపాడకపోవడం, శుభకార్యాలు చెయ్యకపోవడం, ఇంద్రియ సుఖాల్లో తగుల్కోవడం – అనే పద్నాలుగు రాజదోషాలను విడనాడావు కదా!' అని అడిగిన నారదమహర్షితో ధర్మరాజు ఇలా అన్నాడు.

ఆదిపర్వంలో చాలా చోట్ల నాయకుడికి ఉండాల్సిన లక్షణాల గురించి ప్రస్తావన వస్తే, ఇక్కడ నాయకుడికి ఉండకూడని లక్షణాల గురించి చర్చించారు. నారదుడు, ధర్మరాజు మధ్య జరిగిన సంభాషణలో భాగంగా నారదుడు పైన పేర్కొన్న 14 రాజదోషాలను ప్రస్తావించాడు. ఈ రాజదోషాలను విడనాడని వాడు నాయకుడు కాలేడన్న విషయం ఈ సంభాషణలో స్పష్టమయ్యింది. నాటి నాయకులే కాదు, నేటి రాజకీయ నాయకులకి సైతం ఇది వర్తిస్తుంది. ప్రజలు కూడా ఈ రాజదోషాలను విడిచిపెట్టిన వాడినే నాయకుడిగా ఎన్నుకుంటే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని స్పష్టమవుతోంది. నిజానికి కాస్త లోతుగా గమనిస్తే ఈరోజు ప్రబలుతున్న సాంఘిక దురాచారాలెన్నింటికో నాయకుడి అసమర్థత, బలహీనతలు, బాధ్యతారాహిత్యం మొదలైన దోషాలే కారణమౌతున్నాయి. అందుకే, సమర్థవంతుడైన నాయకుడు ఏయే దుర్గుణాలను త్యజించాలో నారదుడు స్పష్టంగా వివరించాడు. ప్రజలు కూడా ఈ లక్షణాలను నాయకుడిలో గుర్తించి ఎన్నుకోవడం మంచిదని నారదుడు హెచ్చరించాడు.

## 4.12. బలి చక్రవర్తి పేర్కొన్న నాయకత్వ సూత్రాలు

అరణ్యవాసంలో ద్రౌపది, ధర్మరాజుల మధ్య ఒక సంభాషణ జరిగింది. మహారాజభోగాలు అనుభవించవలసిన ధర్మరాజు అరణ్యవాసం చేయడం, నారచీరలు ధరించడం చూసి ద్రౌపది సహించలేకపోయింది. ప్రతీకారం తీర్చుకునేందుకు ధర్మరాజుని ప్రేరేపించింది. ఆ సందర్భంలో ధర్మరాజు ద్రౌపదికి ఇచ్చిన సమాధానం నాయకులందరూ ఆచరణలో పెట్టదగినవి.

ఆ. క్షమయ తాల్చియుండఁ జన దెల్ల ప్రొద్దుఁ దే
జంబ తాల్చియుండఁ జనదు పతికి;
సంతతక్షముండు సంతతతేజుండు
నగుట దోష మందు రనఘమతులు (*ఆంధ్ర. ఆరణ్య. 1: 217*)

'సర్వకాల సర్వావస్థలలోనూ ఓర్పు వహించడం తప్పు. అట్లే ఎప్పుడూ ప్రతాపం చూపడం కూడా తప్పే. ప్రభువైనవాడు సంతతక్షముడు, సంతతతేజుడు కాకూడదని, అది దోషమని పెద్దలు చెబుతారు.

ఎల్లప్పుడూ ఓర్పు చూపేవాడిని సేవకులు గౌరవించరు. దానానికి సంబంధించిన విషయాల్లో నియమించబడిన అధికారులు ధనాన్ని అపహరిస్తారు. ఇక సదా తేజస్సునే ప్రదర్శించేవాడు మిక్కిలి కఠినశిక్షలు విధించడం చేత జనులకందరికీ తీవ్రమైన వేదన కలిగిస్తాడు. అటువంటివాడు ఇంట్లో ఉన్న పాములా, నిరంతరం ఆటంకాలు కలిగిస్తాడు. కాబట్టి సమయానుకూలంగా క్షమా, తేజం ప్రదర్శించేవాడే ఐహికాముష్మిక సిద్ధిని పొందగలడు' అంటూ బలిచక్రవర్తి ప్రహ్లాదుడికి వివరించిన ధర్మాన్ని ధర్మరాజు ద్రౌపదికి వివరించాడు.

ధర్మరాజు ఉదహరించిన మాటల బట్టీ నాయకుడు ఎప్పుడూ క్షమా వహించడం లేదా ఎప్పుడూ పరాక్రమం ప్రదర్శించడం సరైన పద్ధతి కాదని తెలుస్తోంది. క్షమ వహించి, సరైన సమయం (అనువైన సమయం) కోసం ఎదురు చూసి, అవసరాన్ని బట్టి పరాక్రమాన్ని ప్రదర్శించడం తెలివైన పని అని స్పష్టమవుతోంది. నిజానికి పాండవులకి ఉన్న పరాక్రమానికి కౌరవులని జయించడం సాధ్యమే. కానీ, సమయం ప్రస్తుతం వారికి అనుకూలంగా లేదు. అందుకే ధర్మరాజు ఓర్పు వహించడమే ఉత్తమమైన మార్గమని ద్రౌపదికి బోధించాడు. ఈ బోధన అన్ని కాలాల్లోనూ నాయకులకి వర్తిస్తుంది. నాయకుడనేవాడికి ఏ విషయాన్ని/ సమస్యని ఎలా పరిష్కరించాలో సామ,

దాన, భేద, దండోపాయాలు అంటూ నాలుగైదు మార్గాలు ఉంటాయి. ముందు ఓర్పుతో వ్యవహరించి, తప్పకపోతే పరాక్రమాన్ని ప్రదర్శించడం తెలివైన లక్షణం అని ధర్మరాజు మాటల ద్వారా తెలుస్తోంది.

## 4.13. నలుడి నాయకత్వ లక్షణాలు

ఆరణ్యపర్వంలో ఉన్న నలమహారాజు కథ, నాయకుడంటే ఎలా ఉండాలో సోదాహరణంగా వివరించింది. నలుడి పాత్ర సంపూర్ణమైన నాయకత్వ లక్షణాల మేళవింపుగా కనిపిస్తుంది. ముఖ్యంగా నలుడిలో ఉన్న క్షమాగుణం, ఆ కథలోని పాత్రలనే కాదు, పాఠకులని సైతం మెప్పిస్తుంది, ఆశ్చర్యచకితుల్ని చేస్తుంది.

వ. నీవు నా పితృవ్యపుత్త్రుండవు; ని న్నెద్దియుం జేయనోపఁ బొ' మ్మని పుష్కరుని విడిచిపుచ్చి పుష్కలంబయిన రాజ్యంబుతో నలుం డున్నంత. (*ఆంధ్ర. ఆరణ్య. 2: 228*)

'నీవు నా పినతండ్రి కుమారుడవు. కావున నీకు ఎటువంటి కీడును నేను చేయలేను. పొమ్మ' అని నలుడు పుష్కరుడిని విడిచిపెట్టి సర్వసమృద్ధమైన రాజ్యాన్ని పరిపాలించసాగాడు.

పుష్కరుడు నలుడి పినతండ్రి కుమారుడు. నలుడు కలిపురుషుడి ప్రభావంతో పుష్కరుడితో జూదమాడి సమస్తం కోల్పోతాడు. ఎన్నో కష్టాలు పడతాడు. సిరిసంపదలని కోల్పోతాడు, రాజ్యాన్ని కోల్పోతాడు, అడవులపాలవుతాడు. చివరికి తోడుగా ఉన్న దమయంతిని సైతం విడిచిపెట్టవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. భయంకరమైన సర్పం నలుడిని కాటు వేసి కురూపిని చేస్తుంది. కలిపురుషుడి ప్రభావం ఎలా ఉన్నా, తనతో జూదమాడి సర్వం కోల్పోయిన నలమహారాజుపై పుష్కరుడు కనీసం కనికరించడు. పర్యవసానంగా నలుడు అష్టకష్టాలు పడ్డాడు. నలుడికి పుష్కరుడి పట్ల ఉన్న సోదరభావం పుష్కరుడికి లేకపోయింది.

నలమహారాజు చివరికి ఎన్నో కష్టాలకి ఓర్చి కలిప్రభావం నుండి తప్పించుకుని, మళ్లీ పుష్కరుడితో జూదమాడి తన రాజ్యాన్ని తిరిగి కైవసం చేసుకుంటాడు. అయితే, తనకి ఇన్ని కష్టాలు ప్రాప్తించడానికి కారణమైన పుష్కరుడిని నలుడు పగలు, ప్రతీకారాలకి పోకుండా తృణప్రాయంగా విడిచిపెట్టడం అతడి సంస్కారాన్ని, క్షమాగుణాన్ని నిరూపిస్తుంది. నలుడు మహారాజులా హుందాగా

వ్యవహరించి, ఆ తరం నాయకులకే కాదు, నేటి తరం నాయకులకి సైతం ఆదర్శంగా నిలిచాడు. క్షమాగుణం ప్రతీ నాయకుడికీ ఉండవలసిన లక్షణం అని బోధించాడు.

## 4.14. కుబేరుడు పేర్కొన్న పంచ లక్షణాలు

అరణ్యవాసంలో భాగంగా, ద్రౌపది కోరిక మేరకు 'మాల్యవంతం' అనే పర్వతం పై ఉన్న పువ్వులను తేవడానికి వెళ్లిన భీముడు, కుబేరుడి మిత్రుడైన మణిమంతుడితో వీరోచితమైన పోరాటం చేస్తాడు. భీముడిని వెతుక్కుంటూ వచ్చిన ధర్మరాజుతో కుబేరుడు భీముడి పరాక్రమం గురించి వర్ణిస్తాడు. ఆ క్రమంలో నాయకుడికి ప్రధానంగా ఉండవలసిన లక్షణాలను గురించి ప్రస్తావించి, భీముడికి ఆ లక్షణాలు సంపూర్ణంగా లేవని, కాస్త ఆవేశం ఎక్కువని చెప్పి జాగ్రత్తపడమని ధర్మరాజును హెచ్చరిస్తాడు.

వ. మఱియు నీ యక్ష రాక్షస బలంబులు వానిచేత నిహతు లగుదు; రిద్దురితంబు దద్దర్శనంబునం బాయు ననియెం గావున నిట్టి శాపఫలంబునకు నీ యనుజుండు నిమిత్తం బయ్యె' నని చెప్పి, వెండియు ని ట్లనియె 'ధృతియును దాక్ష్యంబును దేశకాలంబులును బరాక్రమంబును మంత్రవిధానంబు నను పంచవిధాంగంబు నెఱింగిన క్షత్రియుండు ధర్మవిదుండై ధరణీచక్రంబు నిర్వక్రమంబుగా రక్షించి పుణ్యలోకంబు పడయుఁ; గర్మవిశేషంబు లెఱుంగక వృథారంభుం డై సాహసంబున వర్తిల్లువానికిం బాతకం బగుట నిశ్చయంబు. (*ఆంధ్ర. ఆరణ్య. 4: 31*)

'ఇంకను ఈ యక్షరాక్షసభటులు ఆ మనుజుడి చేత సంహరించబడతారు. ఆ పాపం అతడిని చూడడం చేత తీరిపోతుంది.' అని చెప్పాడు. కాబట్టి నీ తమ్ముడు మణిమంతుడి చావుకు, నా యక్ష రాక్షస బలాలు చనిపోవడానికి నిమిత్తమాత్రుడే. అది ఆ శాపఫలం'. అని చెప్పి మరలా ఇలా వచించాడు. 1. ధైర్యం 2. సామర్థ్యం 3. దేశకాలాలు 4. శౌర్యం 5. రహస్య మంత్రాంగం అనే పంచవిధమైన రాజనీతి అంగాలను తెలిసిన ప్రభువు భూచక్రాన్ని సవ్యంగా పరిపాలించి పున్యగాతులకు పోగలడు. చేసే కర్మలలోని ఆంతర్యాన్ని తెలుసుకొనక తెగువతో వ్యర్థమైన ప్రయత్నాన్ని చేసేవాడికి పాపం సంక్రమించక తప్పదు'.

కుబేరుడు ధర్మరాజుతో ఈ విధంగా అగస్త్యుడు మణిమంతుడికి విధించిన శాపాన్ని గురించి వివరించి, నాయకుడికి ఉండవలసిన లక్షణాలను ప్రస్తావించాడు. భీముడిలో ధైర్యం, సామర్థ్యం, శౌర్యం మెండుగా ఉన్నాయి. అయితే తక్కిన రెండు గుణాలు అతడు సంపాదించాలి. కుబేరుడి మాటలు నేటి తరం నాయకులకి మహా సూత్రాలుగా ధ్వనిస్తాయి. కుబేరుడి మాటల ద్వారా, నాయకుడికి కేవలం, ధైర్యం, సామర్థ్యం, శౌర్యం మాత్రమే ఉంటే సరిపోదు అని, అవి ఎక్కడ ప్రదర్శించాలో, ప్రదర్శించకూడదో తెలిసి ఉండాలని స్పష్టమౌతోంది. రహస్య మంత్రాంగం ద్వారా, దేశ కాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకోవడం ద్వారా నాయకుడు ధైర్య, శౌర్య, సామర్థ్యాలతో సంబంధం లేకుండా సమస్యని పరిష్కరించవచ్చునని తెలుస్తోంది.

## 4.15. మార్కండేయ మహర్షి నాయకత్వ సూత్రాలు

మార్కండేయ మహర్షి తనకున్న అపారమైన జ్ఞాన సంపదని కథల రూపంలో ధర్మరాజుతో పంచుకున్నాడు. యుగాధర్మాలను, నియమాలను వివరించాడు. చివరిగా ధర్మరాజుని ఆశీర్వదిస్తూ, నాయకత్వం అంటే ఎలా ఉండాలో సూచించాడు. ఆ సూచనలు సంపూర్ణ నాయకత్వ లక్షణ సమాహారంగా కనిపిస్తాయి.

సీ. సకలభూతములందు సదయాత్ముఁడవు గమ్ము; / పాలింపు ప్రజల నీ ప్రజలఁ బోలె;
విశదవృద్ధాచారవేదివై ధర్మంబు / సలుపుము దురితవర్జనము గాఁగ;
నెఱుఁగమిఁ బాప మొక్కించుక దొడరినఁ / జయ్యన ప్రతికారశాలి వగుము;
గర్వంబు విడువుము, గరము ప్రియంబును / నిజమునుగా వచోనియతి నడపు;

తే. కాలగతు లెల్ల నెఱిఁగి యస్ఖలితబోధ
యుక్తుఁడవు గమ్ము; భరతవంశోద్భవుఁడవు
నీవు గావున నత్యంతనిర్మలుఁడవు
ప్రాజ్ఞుఁడవు; నీకు వేఱ చెప్పంగ నేల? (*ఆంధ్ర. ఆరణ్య. 4: 316*)

'ఈ సృష్టిలో ఉన్న చరాచరమైన సమస్తభూతాలపట్ల జాలి కలిగినవాడివి కమ్ము. నీ రాజ్యంలోని పౌరులను నీ కన్నబిడ్డలవలె పరిపాలించుము. ధర్మాన్ని నిర్ణయించుకునేటప్పుడు, లోగడ జ్ఞానవృద్ధులైన మహానుభావులు ఏవిధంగా ఆచరించారో పరిశీలించి, ఆ విధంగా ప్రవర్తించుము.

పాపాన్ని పరిహరించుము. అజ్ఞానాన్ని ప్రబలకుండా చూడుము. అహంభావాన్ని విడిచిపెట్టుము. సత్యాన్ని ప్రియాన్ని మాట్లాడుము. కాలాన్ని అనుసరించి జ్ఞానం పరిణతి చెందుతుందనే విషయాన్ని మరవకుండడం చేత, నీ తెలివితేటలు జారిపడకుండుగాక! నీవు భరతవంశంలో పుట్టినవాడవు కాబట్టి మిక్కిలి పవిత్రుడవు. కల్మషం లేనివాడివి. సర్వవిషయాలు బాగా ఎరిగిన ప్రాజ్ఞుడవు. నీకు ఇంతకంటే విస్తరించి చెప్పనవసరం లేదు.

మార్కండేయ మహర్షి నాయకుడికి ఉండవలసిన అన్ని లక్షణాలను ప్రస్తావించాడు. ప్రధానంగా, నాయకుడు కేవలం మనుషుల పట్ల మాత్రమే కాదు, సకల చరాచరజీవకోటి పట్ల దయ కలిగి ఉండాలని మార్కండేయ మహర్షి సూచించారు. ఈ సూచన బట్టీ సృష్టి సమతౌల్యానికి మిగిలిన జీవకోటి ఎంత అవసరమో తెలుస్తోంది. ఈ సూచన నేటి పాలకులకు సైతం వర్తిస్తుంది. సృష్టికి హాని కలిగించే ఏ నిర్ణయమైనా సరే, పాలకుడు దాన్ని విరమించుకోవాలని స్పష్టమౌతోంది. అలాగే, ప్రజలను కన్నబిడ్డలవలె పాలించమనడం, పక్షపాతధోరణిని విడనాడమని సూచిస్తోంది. మరీ ముఖ్యంగా నాయకుడు ఎప్పటికప్పుడు శాస్త్రీయమైన చైతన్యాన్ని ప్రజలకి అందించడం ద్వారా ప్రజల్లో అజ్ఞానం ప్రబలకుండా జాగ్రత్త వహించడం నాయకుడి ప్రాథమిక కర్తవ్యంగా కనిపిస్తోంది. అన్నింటినీ మించి కాలానుసారంగా సాంకేతికతలో, సమాజంలో వస్తున్న మార్పులకి అనుగుణంగా తన విజ్ఞానాన్ని పెంపొందించుకోవడం, తద్వారా ప్రజలని ముందుకి నడిపించడం నాయకుడికి ఉండవలసిన ప్రధానమైన లక్షణంగా కనిపిస్తోంది.

## 4.16. కీచకవధ ఘట్టం: నాయకత్వ లక్షణాలు

విరాట పర్వంలోని కీచకవధ ఘట్టం సుప్రసిద్ధం. ద్రౌపదికి ఈ ఘట్టంలో ఎదురైన కష్టాలని ఆమె ఎదుర్కొన్న తీరు ఎంతోమందిలో స్ఫూర్తిని రగిలిస్తుంది. ద్రౌపదికి అంత కష్టం ఎదురైనప్పుడు ఆ ప్రాంతానికి ప్రభువైన విరాట మహారాజు ఎలా వ్యవహరించి ఉండాల్సిందో ద్రౌపది తన మాటల్లోనే వివరిస్తుంది. ఆ మాటలు ప్రతీ నాయకుడికి దిశానిర్దేశం చేస్తాయి.

ఉ. ఐనను మత్స్యదేశమున యాజ్ఞ కితం డొడయుండు గాన నా
కీ నరనాథు దూఱఁదగు; నెయ్యది యేని నధర్మ మెవ్వ రెం
దైన నొనర్చినం బ్రభువు లారసి దండన మాచరింతు; రి
చ్చో ననుఁ దన్ను కీచకునిఁ జూచియు నూరక యున్కి పాడియే?' (*ఆంధ్ర. విరాట. 2: 143*)

'ఇంత జరిగినందుకు ఈ మత్స్యదేశాధినేత అయిన ఈ విరాటరాజును నేను నిందించాలి. ఏదైనా ధర్మలోపం ఎక్కడైనా జరిగితే రాజు దానిని గమనించి శిక్షించాలి. ఈ సభలో ఈ విధంగా నన్ను తన్నిన కీచకుడిని చూస్తూ ఊరుకోవడం ధర్మమా?'

రాజుకి(నాయకుడు) ఉండవలసిన ప్రధానమైన లక్షణం తనని ఆశ్రయించిన సజ్జనులను ఆదుకోవడం, వారిని ఎల్లవేళలా రక్షించడం. ద్రౌపదిని కీచకుడు నిండుసభలో అవమానిస్తున్నా కూడా చూస్తూ ఉండిపోవడం విరాటుడి తప్పు. తక్కిన సభికులు ప్రతిఘటించినా ప్రతిఘటించకపోయినా, మహారాజు వెంటనే నేరస్థుడిని శిక్షించేందుకు తగిన చర్యలు తీసుకుని బాధితురాలిని ఆదుకోవాలి.

విరాటుడికి కీచకుడు బంధువు కావడం వల్ల బంధుప్రీతి విరాటుడిని ప్రతిఘటించకుండా అడ్డుకుంది. నాయకుడికి బంధుప్రీతి అసలే ఉండకూడదు. నాయకుడు ఎప్పుడూ తన– పర భేదం లేకుండా ప్రజలను పాలించాలి, నిర్ణయాలు కూడా తదనుగుణంగా తీసుకోవాలి. నిస్వార్థంగా ఉండగలిగితేనే నాయకుడు (మహారాజు) అటువంటి నిర్ణయాలు తీసుకోగలుగుతాడు. ధర్మాన్ని నిలబెట్టడం, అధర్మాన్ని అణచివేయడం నాయకుడి ప్రాథమిక కర్తవ్యాలు. తన సభలో ద్రౌపదికి ఇంత అవమానం జరుగుతున్నా కూడా ఆజ్ఞ ఇవ్వకుండా ఆలస్యం చేయడం రాజుగా విరాటుడు విఫలమయ్యాడనడానికి, అతడు అసమర్థుడనడానికి తార్కాణం.

"లోకంలో రాజులు ఉంటారు. ప్రభువులుంటారు. రాజులు సామంతులు కావచ్చు. కాని ప్రభువులు ఒకరికి తలొగ్గి ఉండరు. విరాటుడు రాజు; పాండవులు ప్రభువులు. రాజు అధర్మాన్ని అణచలేకపోతే, ప్రభువులు మిన్నకుండరాదు. వారు పరిస్థితిని పరిశీలించి, అధర్మపరులకి దండన విధించాలి. అది ధర్మం. కాబట్టి, విరాటుడి ఆజ్ఞ కోసం ఎదురుచూడకుండా మీ ప్రభుత్వాన్ని ప్రదర్శించి నన్ను ఆదుకోండి. ఊరక ఉండడం న్యాయం కాదు.' అని ద్రౌపది గూఢంగా ధర్మజాదులను అధిక్షేపించింది.' (*ఆంధ్ర. విరాట. 2. పుట: 219*)

ద్రౌపది తాను చేసిన ధార్మికోపన్యాసంలో నాయకుడికి ఉండవలసిన ప్రాథమికమైన లక్షణాలను వివరించి, రాజుకి, ప్రభువుకి ఉండవలసిన వ్యత్యాసాన్ని సాధికారికంగా వ్యక్తపరిచింది. ధర్మసంస్థాపన విషయంలో నాయకుడు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘట్టం గుర్తుచేస్తోంది.

## 4.17. చక్రవర్తికి ఉండవలసిన లక్షణాలు

విరాట పర్వంలో వర్ణించబడ్డ కీచకవధ ఘట్టంలో భాగంగా, కీచకుడి వల్ల అవమానించబడిన ద్రౌపది ఆగ్రహంలో భీముడితో తన ఆవేదనని పంచుకుంది. ముందు పాండవుల పై కొంత కోప్పడినా భీముడి మాటలతో కొంత ఊరట చెంది, పాండవుల గొప్పదనాన్ని తన మాటల్లో వర్ణించింది. ప్రధానంగా ధర్మరాజు గురించి ద్రౌపది పలికిన ఈ మాటలు చక్రవర్తికి ఉండవలసిన లక్షణాలని వివరిస్తాయి.

సీ. ఎవ్వని వాకిట నిభమదపంకంబు / రాజభూషణ రజోరాజి నడఁగు;
నెవ్వని చారిత్ర మెల్ల లోకములకు / నొజ్జయై వినయంబు నొఱపుఁ గఱపు;
నెవ్వని కడకంట నివ్వటిల్లెడు చూడ్కి / మానిత సంపద లీనుచుండు;
నెవ్వని గుణలత లేడు వారాసుల / కడపటి కొండపైఁ గలయఁ బ్రాఁకు;
తే. నతఁడు భూరిప్రతాప మహాప్రదీప
దూర విఘటిత గర్వాంధకారవైరి
వీర కోటీరమణి ఘృణివేష్టితాంఘ్రి
తలుఁడు కేవల మర్త్యుఁడె ధర్మసుతుఁడు !(*ఆంధ్ర. విరాట. 2: 191*)

'ఎవరి ముంగిట్లో మదపుటేనుగుల శరీరాల నుండి కారే మదజలధారల వలన ఏర్పడిన బురదను, ఆయనను సేవించడానికి వచ్చే మహారాజుల అలంకారాల ఒరిపిడివలన రాలిన ధూళి రాజిచే కలిగిన దుమ్ము అణచివేస్తుందో, అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి ఉత్తమ ప్రవర్తన లోకాలకన్నింటికీ ఆదర్శమై (గురువై) వినయ వర్తనానికి ఒరవడి పెడుతుందో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి కటాక్ష వీక్షణం గొప్ప సంపదలను కలుగజేస్తుందో, ఎవరి సుగుణాలనే తీవెలు సప్తసముద్రాలు దాటి మేరు పర్వతం మీదకు కలబ్రాకుతాయో అట్టి ధర్మరాజు సామాన్య మానవుడా? ఎవరి మహాపరాక్రమమనే పెద్ద దీపం శత్రువుల గర్వమనే అంధకారాన్ని దూరంగా

పారద్రోలుతుందో, ఎవరి పాదాలు శత్రువీరుల కిరీటాలలోని రత్నకాంతులతో సదా చుట్టబడి వెలిగిపోతూ ఉంటాయో అటువంటి ధర్మరాజు కేవలం మానవుడా? (కాదు – దివ్యమానవ సదృశుడని భావం)

నాయకుడి గురించి, నాయకత్వ లక్షణాల గురించి ఆంధ్ర మహాభారతంలో ఎన్నో సందర్భాల్లో వివరించబడింది. ఇక్కడ ద్రౌపది మాటల్లో ఒక చక్రవర్తి ఎలా ఉంటాడో, అతడి గుణగణాలు ఎలా ఉంటాయో తిక్కన వర్ణించారు. ధర్మరాజు కేవలం నాయకుడు కాదు. అతడు రాజులకే రాజు. దేశాన్ని పాలించబోయే చక్రవర్తి. అతడి గుణగణాలు ఎంత శిఖరాయమానంగా ఉంటాయో ఈ పద్యం ద్వారా తెలుస్తోంది.

ధర్మరాజు ఒక చక్రవర్తి. చక్రవర్తిని సందర్శించడానికి ఎంతోమంది మహారాజులు వస్తారు. వారు ఒకరినొకరు తోసుకోవడం వల్ల, వారు ధరించిన ఆభరణాలు, ఒకరినొకరు తోసుకోవడం వల్ల రాపిడికి గురై, పొట్టుగా రాలిపోతుంది అని వర్ణించడం చూస్తే ధర్మరాజు దర్శనం కొరకు మహారాజులు పడే తాపత్రయాన్ని సూచిస్తుంది. దీన్ని బట్టీ ధర్మరాజు మాహాత్మ్యం ఎంత విశిష్టమైనదో పాఠకుల ఊహకే వదిలేశాడు మహాకవి తిక్కన.

ధర్మరాజు సద్గుణ సంపన్నుడు. అందునా వినయం, శాంత గుణం అతడికి ప్రధానమైన ఆభరణాలు. అతడి ఉన్నతమైన వ్యక్తిత్వమే తక్కిన మహారాజులకి ఆదర్శమయ్యిందని ద్రౌపది ధర్మరాజుని కీర్తించింది. దీన్ని బట్టీ చూస్తే, ధర్మరాజును చూసి తక్కిన మహారాజులంతా ఎలా ప్రవర్తించాలో నేర్చుకుంటారని ద్రౌపది భావం.

దానగుణం, సంపదలు, పరాక్రమం, ఔదార్యం, ధర్మనిష్ఠ, సత్యనిష్ఠ ఇలా ఏ గుణంలోనైనా ధర్మరాజుకి పోటీగా నిలిచేవారే లేరని ద్రౌపది మాటల ద్వారా స్పష్టమౌతోంది. అటువంటి లక్షణాలే ధర్మరాజుని నాయకులను, మహారాజులను సైతం పాలించగలిగే, శాసించగలిగే చక్రవర్తిగా నిలబెట్టాయి.

## 4.18. ఆదర్శ పరిపాలన

అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులని వెతికి గుర్తించి, వారి వ్రతానికి భంగం కలిగించి, మళ్లీ వారికి 12 ఏళ్లు అరణ్యవాసం, ఒక ఏడు అజ్ఞాతవాసం శిక్షగా ఏర్పడేలా చెయ్యాలని దుర్యోధనుడి

నాయకత్వంలో కౌరవసేన పూనుకుంది. అయితే, ఇంత పెద్ద దేశంలో పాండవులు ఎక్కడ ఉన్నారో గుర్తించడం ఎలా? అనే ప్రశ్న ఉత్పన్నమైంది. సభలో కొంతమంది పాండవులు మృగాల చేతిలో మరణించి ఉంటారని, మరికొందరు వారు ఎంత వెతికినా దొరకరని ఇలా అందరూ రకరకాల ఉపాయాలను చర్చించుకుంటూ ఉండగా, కురుపితామహుడైన భీష్ముడు పాండవులను గుర్తించేందుకు ఉపాయాన్ని వివరిస్తాడు. భీష్ముడి మాటల్లో పాండవుల పట్ల ఆయనకున్న నమ్మకం వ్యక్తం కావడంతో పాటు పరిపాలన అంటే ఎలా ఉండాలో కూడా నిర్వచించబడింది.

సీ. బ్రాహ్మణభక్తియుఁ, బరహిత శక్తియు / నిర్మల మతియును, నీతి రతియు,

సత్యభాషణమును, సాధుపోషణమును / జిరవితరణమును, సేవ్యగుణము,

సన్మార్గరక్షయు, నున్మత్తశిక్షయు / నంచితోదయముఁ, గృపాతిశయము,

బంధు సంప్రీతియు, భవ్య విభూతియు / శాస్త్రోపగమము, నస్ఖలితదమము

తే. సజ్జన స్తవనీయ సౌజన్యములును

ధర్మసంచిత బహు ధన ధాన్యములును

గలుగు నక్షీణ పుణ్యదోహలుఁడు ధర్మ

సూనుఁ డున్న దేశంబున మానవులకు. (*ఆంధ్ర. విరాట. 3: 103*)

'ధర్మరాజు నశించని పుణ్యాలను సాధించిన మహానుభావుడు. అతడు ఏ దేశంలో ఉంటే, ఆ దేశ ప్రజలు పున్యవ్రతులుగానే ఉంటారు. వారు బ్రాహ్మణులయందు భక్తి, ఇతరుల సేవ చేసే శక్తి, నిష్కల్మషమైన బుద్ధి, నీతివర్తనంలో అనురక్తి, సత్యం పలకడం, మంచివారిని గౌరవించడం, చాలా కాలం నిలిచే దానాలు చేయడం, సద్గుణశీలం, సన్మార్గ రక్షణం, దుష్ట శిక్షణం, న్యాయమైన అభ్యుదయం, దయావేశం, బంధుజనాభిమానం, మాననీయ వైభవం, శాస్త్ర విజ్ఞానం, జారిపోని ఇంద్రియ నిగ్రహం, మంచివారు మెచ్చుకునే మంచితనం, న్యాయార్జితాలైన బహువిధ ధనధాన్యాల సంభారం కలిగి ఉంటారు'.

భీష్ముడి ఉద్దేశ్యం మేరకు, అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులని కనిపెట్టడం అసాధ్యమైన పని. భౌతికంగా వారిని కనిపెట్టడం కష్టం కాబట్టి, కొన్ని లక్షణాల ద్వారా వారుంటున్న ప్రాంతాన్ని గుర్తించవచ్చని ఆయన ఉద్దేశ్యం.

పాండవులు, అందునా ధర్మరాజు సకలసద్గుణసంపన్నుడు. ధర్మరాజు ఏ రాజ్యంలోనైతే ఉంటాడో అక్కడ ప్రాంతం సస్యశ్యామలాంగా ఉంటుందని భీష్ముడి నమ్మకం. ధర్మరాజు యొక్క సత్ప్రవర్తన, సద్గుణాల ప్రభావం ఆ ప్రాంత ప్రజలపై తప్పకుండా ఉంటుందని అతడి విశ్వాసం. ఒక మహానుభావుడు నివసించే ప్రాంతంపై, అక్కడి ప్రజలపై కచ్చితంగా అతడి ప్రభావం ఉంటుంది. ధర్మరాజు అంతటి పరిపాలకుడు అని భీష్ముడి మాటల్లోని ఆంతర్యం.

ధర్మరాజు ఉండే ప్రాంతం ఎలా ఉంటుందో వివరించిన భీష్ముడి మాటల ద్వారా, అసలు ఒక గొప్ప చక్రవర్తి/ నాయకుడు ఎటువంటి లక్షణాలు కలిగి ఉండాలో తెలుసుకోవచ్చు.

అసలైన నాయకుడు తానుండే ప్రాంతంలో ప్రజలు సత్ప్రవర్తన కలిగి ఉండేలా చూసుకోవాలి. వారు ఎల్లప్పుడూ సత్యనిష్ఠ, ధర్మనిష్ఠ కలిగి ఉండేలా తీర్చిదిద్దాలి. వారిలో భగవద్భక్తి, విద్యావంతుల పట్ల గౌరవం పెంపొందేలా చూసుకోవాలి. ప్రజల్లో దాన గుణం, దయ మొదలైన సద్గుణాలు ఉండేలా వారిని తీర్చిదిద్దాలి. ఆ నాయకుడుండే ప్రాంతంలో న్యాయమైన అభ్యుదయం, శాస్త్ర విజ్ఞానం ఉండేలా ప్రగతి పథంలో ఆ ప్రాంతాన్ని నడిపించాలి. ప్రజలు అతిథి సేవ చేయాలి, బంధువులని ఆదరించాలి, న్యాయంగా సంపాదించిన ధనధాన్యాలను మాత్రమే వినియోగించాలి.

భీష్ముడు ధర్మరాజు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్న కౌరవులకి చెప్పిన ఈ లక్షణాల ద్వారా వారు ఒక అంచనాకి రాగలిగారు. భీష్ముడి మాటల్లో వ్యక్తమైన నాయకత్వ లక్షణాలు ఏ రాజ్యంలో విలసిల్లితే ఆ రాజ్యం అత్యంత ఉన్నతంగా ఉంటుంది. ఈ నాయకత్వ లక్షణాలు ఆధునిక కాలానికి సైతం వర్తిస్తాయి. నేటి పాలకులు, ఈ జాగ్రత్తలు పాటించి, తగిన చర్యలు తీసుకుంటే వారి ప్రాంతం కూడా ధర్మరాజు నివసించిన ప్రాంతంలానే ఆదర్శవంతంగా రూపుదిద్దుకుంటుంది.

## 4.19. ఉత్తమ నాయకుడి వ్యక్తిత్వం

సుశర్మ దక్షిణగోగ్రహణంలో భాగంగా మత్స్యదేశంపై దండెత్తాడు. కంకుభట్టుగా విరాటుడి ఆస్థానంలో అజ్ఞాతవాసం చేస్తున్న ధర్మరాజు కనుసన్నలలో భీముడు, నకుల, సహదేవులు సుశర్మపై దండెత్తారు. అద్భుతమైన పోరాటం చేసి విరాటమహారాజుకి ఆశ్చర్యాన్ని కలిగించారు. చేజారిపోయిందనుకున్న సామ్రాజ్యాన్ని తిరిగి రక్షించిన ధర్మరాజు (కంకుభట్టు) పట్ల విరాట మహారాజుకి ఎనలేని గౌరవం ఏర్పడుతుంది. ఆనందంతో నిండిన హృదయంతో విరాట మహారాజు

మొత్తం మత్స్యదేశాన్ని కంకుభట్టుకి సమర్పించడానికి సిద్ధమౌతాడు. ఆ సమయంలో ధర్మరాజు స్పందన ఉత్తముడైన నాయకుడు ఎలా ఉండాలో నిర్వచిస్తుంది.

చ. 'మనుజవరేణ్యనావలని మన్నన యట్టిదకాదె !; శత్రు మ
ర్దన మొనరించి మత్స్య నగరంబున కుత్సవ ముల్లసిల్ల నీ
చనుటయు నాకుఁ దేజమును సంపదయుం గరిమంబుఁగాక, యి
ట్లనఁ దగునయ్య? యే నిచట నైనది యేటిది? యింత యేటికిన్?' (*ఆంధ్ర. విరాట. 3: 226*)

'ఓ విరాటరాజా! నా మీద మీకున్న గౌరవం అటువంటిది సుమా! శత్రుసంహారం చేసి విజయోత్సాహంతో మత్స్యదేశ రాజధానికి నీవు తిరిగి పోవడం కంటే వేరే తేజస్సు, సంపద, గొప్పదనం మరేమి ఉంటుంది? నీవు ఇట్లా అనవచ్చునా? నేనిక్కడ నీకు చేసింది ఏమున్నది? ఇంత చిన్నపనికి ఇంతగా నీవు చెప్పవలెనా?'

దక్షిణగోగ్రహణం వల్ల ఒక్కసారిగా పోయిందనుకున్న రాజ్యం తిరిగి స్వాధీనమయ్యేసరికి విరాటమహారాజు ఆనందాన్ని పట్టలేకపోయాడు. తనకి ఈ శరీరం, సంపద, రాజ్యం తిరిగి సంపాదించిపెట్టిన కంకుభట్టు వ్యూహాలకి దాసోహమై సర్వం ధారపోయడానికి సిద్ధపడ్డాడు. కానీ, విరాట మహారాజు ఇవ్వదలుచుకున్న రాజ్యాన్ని తృణప్రాయంగా భావించి, సున్నితంగా తిరస్కరించిన ధర్మరాజు వ్యక్తిత్వం చిరస్థాయిలో నిలిచిపోయింది. అటు పరాక్రమంలోనూ తనకి ఎవరూ సాటిలేరని యుద్ధం ద్వారా నిరూపించుకున్న ధర్మరాజు, ఇటు రాజసం, హుందాతనం, ఔదార్యంలోనూ తనకి ఎవరు సాటిరాలేరని నిరూపణ చేసుకున్నాడు. సంపూర్ణమైన నాయకుడనిపించుకున్నాడు.

"ఈ సన్నివేశం ద్వారా నైతికంగా, లౌకికంగా, మత్స్యదేశానికి రాజు ధర్మరాజని తేలింది. ఈ విధంగా సభారంగ సప్తకం అజ్ఞాతవాసంలో కూడా ధర్మరాజు సమ్రాట్టుగానే సమ్మానించబడటాన్ని ధ్వనింపజేస్తున్నది" *(ఆంధ్ర. విరాట. పీ: 39)*.

"ధర్మరాజు దయావీరుడు, యుద్ధవీరుడు, త్యాగవీరుడు, దానవీరుడు, ధర్మవీరుడు. ఈ వీరరసభేదాలు ఆయా సందర్భాల్లో ముందుకు వచ్చి ప్రకాశిస్తూ ఉంటాయి. దక్షిణగోగ్రహణ యుద్ధ విజయానంతరం విరాటుడు కృతజ్ఞతాభావంతో తన రాజ్యాన్ని, సేనలని సమర్పించాలనుకున్నాడు. ధర్మరాజు వాటిని స్వీకరించలేదు. ఉత్తమ ధర్మవీరుడివలె ఉన్నతంగా వ్యవహరించాడు.

విరాటుడు పొగడడం ఆయనకు సహజంగా నచ్చలేదు. అజ్ఞాతవ్రతం విరాటనగరంలో ఆ రాజు నాశ్రయించి నిర్వహిస్తూ ఉండడం వలన శత్రుమర్దనం అతడి కర్తవ్యమనుకున్నాడు. కర్తవ్య నిర్వహణ ప్రతిఫలాన్ని కోరదు. విరాటుడితోడి స్నేహం అద్వైత భావానికి దారి తీసింది. అందువలన విరాటుడి తేజం, సంపద, గరిమం తనవేననుకుని తృప్తిపడి తృష్ణని నిగ్రహించుకోగలిగాడు. మహోపకారం చేసినా దానిని చెప్పుకోకుండా ఉండడం, ప్రతిఫలాన్ని కోరకుండా ఉండడం కర్మయోగి లక్షణం. అంత చేసి 'ఇంత ఏటికిన్?' అనగలిగినవాడు దాన, దయా, త్యాగ వీరస్వభావాలు కలవాడే. 'త్యాగేనైకే అమృతత్వ మానశుః' అని ఉపనిషత్సూక్తి, ఈ పద్యం పలికిన ధర్మరాజు ధర్మవీర, త్యాగవీర, దయావీర రసమూర్తి" *(ఆంధ్ర. విరాట. పీ: 48).*

## 4.20. యోధుడికి ఉండవలసిన లక్షణాలు

దక్షిణగోగ్రహణం జరిగాక, అద్భుతమైన నేర్పుతో విరాట మహారాజుని యుద్ధంలో గెలిచేలా చేశాడు ధర్మరాజు. ఉత్తరగోగ్రహణం ప్రారంభం అయ్యాక, ధర్మరాజు సూచన మేరకు బృహన్నల (అర్జునుడు) ఉత్తరుడితో యుద్ధరంగానికి బయలుదేరాడు. ఉత్తరుడు గొప్ప వీరుడు కాదు. అయితే, అర్జునుడి తన మాటలతో ఉత్తరుడిలో ధైర్యాన్ని నింపే ప్రయత్నం చేశాడు. అర్జునుడి తన మాటల్లో యుద్ధరంగంలో నాయకుడికి ఉండవలసిన లక్షణాలను గురించి ఉత్తరుడికి వివరించాడు.

చ. 'తన భుజశక్తియున్ రిపుల దర్పము నేర్పడఁ జూచి చూచి యె
ట్లును దెగకున్నఁబోక యిది లోకము చక్కటి; శూరులైన దీ
నిని మది మెచ్చ; రీ బలము నీదెస దేఱియుఁ జూడ; దింతకున్
మును భయహేతువైన విధముం దగఁ జెప్పుము నాకు నిత్తఱిన్ .(*ఆంధ్ర. విరాట. 4: 61*)

'తన బలాన్నీ, ఎదుటివాడి బలాన్నీ గమనించి చూచి, కొంతసేపైనా పోరాడి, ఎటూ వీలుకాకపోతే, తిరిగివెళ్లడం లోకంలో మామూలు. వీరులైనవాళ్లు దీన్ని ఒప్పుకోరు. ఇంతదాకా, కురుసేన నిన్ను సరిగ్గా కూడా చూడనే లేదు. ఇంతకూ నీకు ఇంత భయం కలిగే దానికి ఏమిటి కారణం? చెప్పుము'.

ఉత్తరుడు కౌరవసేనని ఇంకా చూడకుండానే వెనకడుగు వేయడం చూసి అర్జునుడు ఇలా పలికాడు. అంతఃపురంలో ఆడవాళ్ల ముందు బీరాలు పలికి ఇప్పుడు ఇలా భయపడడం వీరుడి

లక్షణం కాదని ఉత్తరుడికి బోధించాడు. వీరుడు ఎప్పుడైనా యుద్ధరంగంలోనే పోరాడి తప్పనిసరి పరిస్థితుల్లో వీరమరణం పొందాలే తప్ప, ఇలా రణస్థలికి వెళ్లకముందే భయపడడం తగదని ఉత్తరుడిని వారించాడు.

అర్జునుడు పలికిన మాటలు ఉత్తరుడికే కాదు, ప్రతీ వీరుడికీ (నాయకుడికీ), వర్తిస్తాయి. నాయకత్వ లక్షణాల్లో పరాక్రమం చాలా ముఖ్యమైనది. అర్జునుడు వీరుడికి ఉండవలసిన పరాక్రమం గురించి ఇంకా ఇలా వివరించాడు.

'దిక్కులు పగుళ్లువారేటట్లు మారుమ్రోగే శంఖాల ధ్వనులకు బెదిరిపోకుండా, ఆర్భాటంతో సైన్యాలు దండెత్తి వస్తున్నప్పుడు రేగిన దుమ్ముకు తూలిపడకుండా, చతురంగ బలాలు ముమ్మరంగా కమ్మినప్పుడు భయపడకుండా, శత్రువీరులు ప్రయోగించిన రకరకాలైన శాస్త్రాలతో, అస్త్రాలతో, గుర్రాలూ, సారథీ కూలిపోయినా, కవచం బద్దలుబద్దలుగా చీలిపోయినా, బాణాలు శరీరావయవాలలో లోతుగా గుచ్చుకున్నా, తల్లడిల్లకుండా, యుద్ధరంగంలో ఎదురయ్యే ఉపద్రవాన్నంతా తట్టుకుని, నిశ్చలంగా, ధైర్యంతో నిలిచి శత్రువులను జయిస్తేనే, మంచి పేరు ప్రతిష్టలు వస్తాయి కానీ, సైన్యం నీ పక్క చూడకుండా, ఇంకా దూరదూరంగానే ఉండగా, ఇట్లా పరుగెత్తి పోతానంటే నవ్వరా? (*ఆంధ్ర. విరాట. 4: 62*)'.

అర్జునుడు కేవలం తన మాటలతోనే యుద్ధరంగాన్ని ఉత్తరుడికి కళ్లకు కట్టినట్టుగా వివరించాడు. జరగబోయే యుద్ధం ఎంత భీకరంగా ఉంటుందో వివరించి, ఉత్తరుడిని మానసికంగా సన్నద్ధం చేశాడు. నేటి కాలంలో చక్రవర్తులు, నాయకులు ఇటువంటి యుద్ధాలు నేరుగా చేయకపోయినా, వారికున్న చతురంగ బలాలను ఉపయోగించి ఎలా వ్యూహాలు పన్నవచ్చో ఉత్తరగోగ్రహణ ఘట్టం ద్వారా తెలుసుకోవచ్చు. ముఖ్యంగా చతురంగ బలాలకు నాయకత్వం వహిస్తున్న సైనిక శక్తులకు అర్జునుడి మాటలు గొప్ప ప్రేరణనిస్తాయి. నాయకుడికి కేవలం మానసిక స్థైర్యం చాలదని, శారీరకమైన దృఢత్వం కూడా ఎంతో అవసరమని అర్జునుడు వివరించాడు. ఇటువంటి లక్షణాలు అన్నీ కలిగినవారు మాత్రమే అత్యున్నతమైన నాయకుడిగా ఎదగగలరని అర్జునుడి మాటల ద్వారా స్పష్టమౌతోంది.

## 4.21. ముగింపు

సంపూర్ణమైన నాయకత్వ లక్షణాలు కలిగినవారు మాత్రమే ప్రజలను సక్రమమైన మార్గంలో నడిపించగలరని ఆంధ్ర మహాభారతంలోని వివిధ ఘట్టాల ఆధారంగా స్పష్టమయ్యింది. ఆంధ్ర మహాభారతంలోని కొన్ని నాయక పాత్రలు నాయకుడు ఎలా ఉండాలో నిరూపిస్తే, మరి కొన్ని ప్రతినాయక ఛాయలు కలిగిన పాత్రలు ఎలా ఉండకూడదో నిరూపించాయి. అధర్మ మార్గంలో తాను నడిచి, బంధుగణాన్ని, ప్రజలని నడిపించాలని చూసే నాయకులకి ముందు అవకాశాలు కలిసివచ్చినా, అంతిమంగా ఎటువంటి దుఃస్థితి ఎదురౌతుందో తెలియజేస్తూ, అదే విధంగా ధర్మమార్గంలో తాను నడుస్తూ, ప్రజలను, పరివారాన్ని చైతన్యవంతులను చేసే నాయకులకి ముందు ఇబ్బంది కలిగినా, అంతిమంగా విజయం వరిస్తుందని ఆంధ్ర మహాభారతం వివిధ పాత్రల ద్వారా అత్యంత వాస్తవికంగా వివరించింది. ఇటువంటి వాస్తవ సన్నివేశాల ఆధారంగా ఒక వ్యక్తి తనని తాను ప్రజలను ప్రభావితం చేసే శక్తిగా / నాయకుడిగా ఎలా మలుచుకోవాలో సోదాహరణంగా ఆంధ్ర మహాభారతంలో వివరించబడింది.

ఆంధ్ర మహాభారతంలోని మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాల ఆధారంగా నాయకత్వ లక్షణాలను ఎలా పెంపొందించుకోవాలో ఈ అధ్యాయంలో వివరించబడింది. నాలుగు పర్వాలలో ఈ దృక్కోణానికి సంబంధించిన సాహిత్యాన్ని సాధ్యమైనంత సమగ్రంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఉదహరించినవి కొన్నే అయినా, మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి. కేవలం, నాలుగు పర్వాలలో ఇన్ని ఉదాహరణలు పరిశోధన దృష్టికి దర్శనమిస్తే, మొత్తం ఆంధ్ర మహాభారతంలో మరెన్నో ఉదాహరణలు దొరికే అవకాశం ఉంది.

# అధ్యాయం – 5

# ఆంధ్ర మహాభారతం: ధర్మాధర్మ వివేచన

## 5.1. ఉపోద్ఘాతం

మనిషి సంఘ జీవి. సంఘంలో నలుగురితో మెలిగే క్రమంలో కొన్ని పద్ధతులు, నియమాలు పాటించడం ప్రతీ మనిషికీ అవసరం. ప్రతీ మనిషి తాను సుఖంగా జీవిస్తూనే ఇతరుల జీవనానికి ఆటంకం కలిగించకుండా బ్రతకాలి. అది మనిషి ప్రాథమిక కర్తవ్యం. దీన్ని బట్టీ చూస్తే ఒక మనిషి చర్య సమాజంలోని వేరే ఏ మనిషినీ/ జీవినీ బాధించకూడదు. అంటే మనిషి చర్యలు కొన్ని ధర్మాలకి కట్టుబడి ఉండాలి. ఏది ధర్మమో, ఏది ధర్మమో బేరీజు వేసుకునే శక్తియే ధర్మాధర్మ వివేచన.

భగవంతుడి సృష్టిలో మనిషికి మాత్రమే ఉన్న విశేషం యుక్తాయుక్త విచక్షణ/ ధర్మాధర్మ వివేచన. మిగతా జీవులకి చదువుకునే అవకాశం లేదు కాబట్టి, అవి ఆ జ్ఞానాన్ని, విచక్షణని పొందలేవు. ఈ ధర్మాధర్మవివేచన చేయడానికి మనిషికున్న విలువైన సాధనమే సాహిత్యం.

తెలుగు సాహిత్యంలో ఎన్నో కావ్యాలకు, ఎన్నో కవులకు, ఎన్నో ఆలోచనలకు, మరెన్నో ఒరవడులకు ప్రేరణనిచ్చింది/ ఇస్తున్నది ఆంధ్ర మహాభారతం. భారతంలో మన నిజ జీవితం మొత్తం కనిపిస్తుంది. మనిషి జీవితంలో ఇష్టానికి, ధర్మానికి మధ్య సంఘర్షణ ఏర్పడినప్పుడు అతడు/ ఆమె ఎటువంటి నిర్ణయం తీసుకోవాలో తెలియజెప్పే కథలు మహాభారతంలో ఎన్నో ఉన్నాయి. ప్రత్యేకించి కవిత్రయ భారతం ఈ విషయంలో మనిషికి సరైన దిశానిర్దేశం చేస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

కవిత్రయంగా ప్రసిద్ధికెక్కిన నన్నయ, తిక్కన, ఎర్రన మహాభారతాన్ని తెలుగు వారికి అందించే క్రమంలో గొప్పగా అనుసృజన చేశారు. అందునా, మహా భారతం అత్యంత ప్రామాణికమైన గ్రంథం. ఎంతో మంది ప్రవర్తనని ప్రభావితం చేసే గ్రంథం. ఆ బాధ్యతకి కవిత్రయం అనుక్షణం కట్టుబడి ఆయా ఘట్టాల ద్వారా ధర్మాధర్మ వివేచన ఎలా చేసుకోవాలో వివరించారు. ప్రత్యేకించి రెండు ధర్మాలకి మధ్య సంఘర్షణ ఏర్పడితే ఎటు తేల్చుకోవాలో కూడా వివరించారు. ధర్మమార్గంలో

నడిచేవారికి ఆ ధర్మమే రక్షణగా నిలుస్తుందని తమ కవిత్వ శక్తితో ఆయా ఘట్టాలని వర్ణించి నిరూపించారు.

## 5.2. సరమ వృత్తాంతం

ఆదిపర్వంలోని సరమ వృత్తాంతంలో భాగంగా నన్నయ ఈ పద్యాన్ని రచించాడు. తమ యజ్ఞానికి భంగం కలిగిందని సారమేయుడనే కుక్కని జనమేజయుడి సోదరులు కొట్టిన సందర్భంలో సరమ జనమేజయుడితో ఈ విధంగా పలికింది.

క. తగు నిది తగ దని యెదలో

వగవక, సాధులకుఁ బేదవారల కెగ్గుల్

మొగిఁ జేయు దుర్వినీతుల

కగు ననిమిత్తాగమంబు లయిన భయంబుల్. (*ఆంధ్ర. ఆది. 1: 85*)

'ఈ పని యుక్తమైనది, యుక్తమైనది కాదు అని మనస్సులో ఆలోచించకుండానే బీదవారికి, ఆశక్తులైన వారికి, మంచివారికి అపకారాలు పూనికతో చేసే నీతిరహితులకు కారణం లేకుండానే ఆపదలు వస్తూ ఉంటాయి'.

"ఇక్కడ భయంబుతో అంటే కష్టాలు అని. కష్టాలొచ్చినప్పుడే కదా మనిషిలో త్వరగా ఆలోచించడం, ఆందోళన పడడం, మతిమరుపు వంటి అవలక్షణాలు చోటు చేసుకునేది? కాబట్టి అధికార మదాంధులు సాధువులని బీదవాళ్లను హింసిస్తే ఏదో ఒకనాటికి కష్టాల్లో చిక్కుకోక తప్పదు అని సరమ హెచ్చరించింది" *(గిరిధర్ కుమార్, వడ్లమూడి. 2012: 8).*

ప్రతీ మనిషి తాను ఒక పనిని చేసే ముందు అది ఎంత వరకు ధర్మం, ఎంత వరకు యుక్తం అనే ప్రశ్న వేసుకోవాలి. అనివార్య పరిస్థితుల్లో ధర్మం కాకపోయినా యుక్తమైతే ఆ పనిని చేయడం వేరే సంగతి. కానీ, తక్కిన సందర్భాల్లో మనిషి ఆలోచించి తీరాలి. మనిషి జీవితం ఇష్టానికి ధర్మానికి మధ్య జరిగే సంఘర్షణ. మనిషి కేవలం తన ఇష్టానికి మాత్రమే ప్రాధాన్యతనివ్వకుండా ఆ పని ధర్మమా? కాదా? అని ప్రశ్న వేసుకోవాలి. ఇది తగినదా? కాదా? అని ఆలోచించాలి.

అలా ఆలోచించకుండా ఇతరులకి హాని చేసేవారికి వారి జీవితంలో కూడా ఆపదలు అకారణంగా జనిస్తాయని నన్నయ సరమ పాత్ర ద్వారా హితబోధ చేస్తున్నాడు. నన్నయ రుచిరార్థ సూక్తినిధిత్వానికి ఈ పద్యం చక్కటి ఉదాహరణ. సందర్భమెలా ఉన్నా ఈ పద్యం అందరూ అన్వయించుకోదగినది. ఈ సూక్తి ధార్తరాష్ట్రుల దుర్వృత్తాన్ని, వారి దుర్గతినీ ధ్వనింపజేస్తోంది.

## 5.3. గరుత్మంతుని కథ

ఆదిపర్వంలోని గరుత్మంతుని కథలో తల్లికీ, బిడ్డలకీ మధ్య ధర్మాధర్మాల గురించి అద్భుతమైన చర్చ జరుగుతుంది. స్వయంగా కన్న అధర్మమార్గంలో నడవమని బిడ్డలని ప్రోత్సహిస్తే, బిడ్డలు తల్లి మాట వినాలా? లేక ధర్మానికి కట్టుబడాలా? తల్లి మాట విన్నవారి పరిస్థితి ఏంటి? ధర్మానికే కట్టుబడ్డ వారి పరిస్థితి ఏంటి? వంటి ప్రశ్నలకు ఈ ఘట్టం చక్కటి సమాధానం.

సీ. కద్రువ కొడుకులకడ కేఁగి 'యేను మి / మ్మందఱ వేఁడెద నన్నలార!
నాపంపు సేయుండు, నన్ను రక్షింపుఁడు / కామచారులకు దుష్కరము కలదె!
యుల్ల తెల్లని తురగోత్తము వాలంబు / నల్ల సేసితిరేని నాకు దాసి
యగు మన వినత, మీ రట్లు సేయనినాఁడు / దానికి మఱి యేను దాసి నగుదు;
ఆ. జంట పన్నిదంబు సఱచితి మిట్లుగా'
ననినఁ బాములెల్ల 'ననయ మిదియుఁ
దల్లి పనిచె నని యధర్మువు సేయంగ
నగునె? యెఱుక గలరె మగువ లెందు'! (*ఆంధ్ర. ఆది. 2: 33*)

వ. అని యందరు దమలో విచారించి యధర్మారంభంబునకు సుముఖులు గాకయున్న, గద్రువ కోపోద్దీపితముఖియై. (*ఆంధ్ర. ఆది. 2: 34*)

'కద్రువ కొడుకులయిన పాములచెంతకు వెళ్లి, 'వత్సలారా! నేను మిమ్ములందరినీ ప్రార్థిస్తున్నాను. నా ఆజ్ఞ చేయండి. నన్ను కాపాడండి. ఇచ్చవచ్చినట్లు సంచరించగల మీకు చేయ శక్యంకానిది ఉన్నదా? ఆ తెల్లని అశ్వశ్రేష్ఠంతోకను మీరు మచ్చచేస్తే వినత నాకు దాసి అవుతుంది. మీరు అట్లా తోకను నలుపు చేయకపోతే నేనింక వినతకు దాసినవుతాను. ఈ విధంగా ఒండొరులం పందెం వేసుకున్నాం' అని పలుకగా పాములన్నీ 'ఇది నీతిరహితం. తల్లి ఆజ్ఞాపించిందని అధర్మం

చేయవచ్చా? అని అందరూ తమలో తాము ఆలోచించి అధర్మం చేయడానికి ఇష్టపడనివారు కాగా, కద్రువ కోపం చేత ఎఱ్ఱబడిన ముఖం కలదై'.

కద్రువ వినతతో కాసిన పందెంలో గెలవడం కోసం ఇక్కడ తన బిడ్డల సహాయం కోరుతోంది. ఎక్కడ పందెంలో ఓడిపోతే వినతకు దాసినవుతానో అని భయపడి మోసం చేయడానికి పూనుకుంది. ఆశ్చర్యకరంగా పాములు తమ తల్లియైన కద్రువను వ్యతిరేకించి ఇది నీతిరహితం అని హెచ్చరిస్తాయి. సహాయం అడిగింది తల్లే అయినా, పాములు ఇలా పలకడం గొప్ప విషయం. అజ్ఞాపించింది ఎవరైనా అధర్మం చేయరాదనేది పాముల మాట. ఇది నేటి కాలానికి అన్వయించుకుంటే ఎన్నో మోసాలు తగ్గుతాయి. బంధాలకి, బాంధవ్యాలకి అతీతమైనదిగా ధర్మాన్ని అందరూ భావించి ఆచరించాలనే విషయాన్ని ఈ సన్నివేశం స్పష్టం చేస్తోంది.

పాములు ధర్మానికి కట్టుబడి ఉండి, తల్లి ఆజ్ఞని శిరసావహించనందుకు కద్రువకి కోపం వచ్చి 'పరీక్షిత్తు కుమారుడైన జనమేజయుడనే మహారాజు చేసే సర్పయాగం కారణంగా పాములు మరణం పొందుగాక' అని తన బిడ్డలకి తానే శాపం ఇచ్చుకుంది. తల్లి అంతటి శాపాన్ని ఇచ్చినా, కర్కోటకుడు అనే పాము తప్ప తక్కిన పాములన్నీ వాటి మాటకే కట్టుబడ్డాయి. దీన్ని బట్టీ ఫలితం ఎలా ఉన్నా, పరిస్థితులు ఎలా ఉన్నా, బంధాలు – బంధుత్వాలకి అతీతంగా ధర్మాన్ని ఆచరించి తీరాలి అనే విషయాన్ని ఈ ఘట్టం ఉద్ఘాటిస్తోంది.

సీ. తల్లియు నాసహోదరులును మూర్ఖు లై /ధర్మువు నుచితంబుఁ దప్పి వినత
కావైనతేయున కపకారములు సేసి, /రెప్పుడు వారు సహింప కెగ్గు
సేయుదు, రేను రోసితి, వారితోడిపొ /త్తొల్లఁ, దపంబు సేయుచు శరీర
భారంబు విడిచెదఁ బరమేష్ఠి!' యనవుడు /నాతని సమబుద్ధి కజుఁడు మెచ్చి

ఆ. నిత్యసత్యధర్మనిరతుండ వఖిలంబు
దాల్పనోపు నట్టి ధైర్యయుతుఁడ,
విది యనన్యవిషయ; మిమ్మహీభారంబు
నీవ తాల్పవలయు నిష్ఠతోడ. (*ఆంధ్ర. ఆది. 2: 124*)

ఆదిశేషువు ఇష్టానికి, ధర్మానికి మధ్య సంఘర్షణ ఏర్పడ్డప్పుడు ధర్మంవైపే నిలబడ్డాడు. అధర్మంగా వ్యవహరించారు కాబట్టి నిష్పక్షపాతంగా తనవాళ్లు చేసిన తప్పుని ఖండించాడు. వినతకి,

గరుత్మంతుడికి నాగులు తలపెట్టిన కీడుకి వాళ్ల మీద అసహ్యం కలిగి, వారికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నాడు. ధర్మంవైపు నిలబడ్డ ఆదిశేషువు బుద్ధికి బ్రహ్మదేవుడు మెచ్చి భూభారాన్ని వహించవలసిన బాధ్యతని తన భుజస్కంధాలపై మోపాడు. అంటే, ధర్మంగా ఉంటూ, ఎల్లప్పుడూ ధర్మాన్నే ఆచరిస్తూ ఉండేవాడైనటువంటి ఆదిశేషువు భూభారాన్ని వహిస్తున్నాడు. ధర్మానికి మన పురాణాలు, శాస్త్రాలు అంతటి విలువనిచ్చాయి. దీన్ని బట్టీ చూస్తే, ధర్మం మాత్రమే భూభారాన్ని వహించగలదని తెలుస్తోంది. అధర్మం పెరిగితే అది వినాశనానికి దారి తీస్తుందని మరొకసారి స్పష్టమౌతోంది.

బంధాలు, బంధుత్వాలు కంటే సత్యం, ధర్మం గొప్పవనే విషయం ఈ సన్నివేశం ద్వారా స్పష్టం అవుతోంది. ధర్మానికి కట్టుబడి ఉన్నవారిని అంతిమంగా ధర్మమే రక్షిస్తుందని, ధర్మస్వరూపులకు ఎప్పటికైనా సముచితస్థానాలు లభిస్తాయనే విషయం కూడా అవగతమవుతోంది. నేటి సమాజానికి ఇటువంటి ఘట్టాలు గొప్ప పాఠాలను అందిస్తున్నాయి. మనుషులు స్వార్థాన్ని విడిచిపెట్టి ధర్మమార్గంలో పయనించాలనే సందేశాన్ని ఉదాహరణలతో సహా వివరిస్తున్నాయి.

## 5.4. కచదేవయానుల సంవాదం

కచుడు, దేవయాని మధ్య జరిగిన సంభాషణని గమనిస్తే ధర్మమార్గాన్ని నమ్ముకున్నవారికి/ నమ్ముకోనివారికి ఎటువంటి పరిస్థితులు ఎదురౌతాయో అర్థమవుతుంది.

వ. అనిన నా కచునకు దేవయాని కరం బలిగి 'నీవు నా మనోరథంబు విఫలంబుగాఁ జేసిన వాఁడవు; నీకు సంజీవని పని సేయకుండెడు' మని శాపం బిచ్చినఁ, గచుం 'డేను ధర్మపథంబుఁ దప్పనివాఁడను; నీ వచనంబున నాకు సంజీవని పనిచేయదయ్యెనేనియు నాచేత నుపదేశంబు గొన్నవారికిఁ బనిసేయుంగాక; మఱి నీవు ధర్మ విరోధంబు దలంచితివిగావున నిన్ను బ్రాహ్మణుండు వివాహంబు గాకుండెడు' మని దేవయానికిఁ బ్రతిశాపం బిచ్చి తత్క్షణంబ. (*ఆంధ్ర. ఆది. 2: 132*)

'అని కచుడు పలుకగా దేవయాని మిక్కిలి కోపించి 'నీవు నాకోరిక నిష్ఫలం చేశావు కాబట్టి నీకు సంజీవినీ విద్య ఉపయోగపడకుండును గాక', అని శాపమిచ్చింది. కచుడు 'నేను ధర్మమార్గాన్ని అతిక్రమించనివాడను. నీ శాపవచనమ చేత నాకు సంజీవనీవిద్య పనిచేయకపోయినా నా చేత

ఉపదేశం గ్రహించినవారికి పనిచేస్తుందిగాక. ఇంక నీవు ధర్మం కాని పని (సోదరప్రాయుడైన తండ్రి శిష్యుడిని పెళ్లాడాలని) తలపోశావు కాబట్టి నిన్ను బ్రాహ్మణుడు పెళ్లాడకుండుగాక'.

కచుడు ధర్మమార్గాన్ని ఎంచుకున్నాడు. దేవయాని అధర్మమని తెలిసినా కచుడిని పెళ్లి చేసుకోవాలని ఆశపడింది. కాదన్న కచుడిని శపించింది. అంత గొప్పగా ప్రేమించిన కచుడిని దేవయాని శపించడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ధర్మం కాని పని తలపోసినందుకు, తనకి అన్యాయంగా శాపమిచ్చినందుకు కచుడు దేవయానిని తిరిగి శపించాడు. అయితే, కచుడు మాత్రం వెనకడుగు వేయలేదు. తనకి గురువు ద్వారా సిద్ధించిన సంజీవనీ విద్య, తాను ఉపదేశించినవారికి పనిచేస్తుందని అతడికి తెలుసు. ధర్మమార్గాన్ని నమ్ముకున్నవాడి ధైర్యం ఎలా ఉంటుందో కచుడిని చూస్తే అర్థమవుతుంది. కచుడు ధర్మమార్గాన్ని విడవకుండానే తాను స్వర్గం నుండి వచ్చిన పనిని దిగ్విజయంగా ముగించుకుని తిరిగి వెళ్లిపోయాడు.

## 5.5. లాక్షాగృహదహనం: ధర్మాధర్మవివేచన

ధర్మాన్ని నమ్ముకుని, నిత్యం ధర్మమార్గంలో నడిచేవారిని ధర్మమే రక్షిస్తుంది అని చెప్పడానికి, మొత్తం మహాభారత కథను ఆధారంగా చేసుకుని కింది పద్యంలో వివరించారు.

సీ. వదలక కురుపతి వారణావతమున /లక్కయిల్ గావించి, యక్కజముగ
నందఱఁ జొన్పి, యం దనలంబు దరికొల్పఁ /బనిచినఁ, బాండునందను లెఱింగి
విదురోపదిష్టభూవివరంబునం దప /క్రాంతు లై బ్రదికి నిశ్చింతు లయిరి;
ధర్మువు నుచితంబుఁ దప్పనివారల, /సదమలాచారుల నుదిత సత్య

ఆ. రతుల నఖిలలోకహితమహారంభుల,
భూరిగుణుల, నిర్జితారివర్గు
లై వెలుంగువారి దైవంబ రక్షించు
దురితవిధుల నెపుడుఁ బొరయకుండ. (*ఆంధ్ర. ఆది. 2: 158*)

'తన దురుద్దేశం విడవక, దుర్యోధనుడు వారణావతంలో లక్క ఇల్లొకటి నిర్మించి, అందులో పాండవులు ప్రవేశించేటట్లు చేసి దానికి నిప్పంటించుమని ఆజ్ఞాపించాడు. అది గ్రహించి పాండవులు విదురుడెరిగించిన భూరంధ్రం నుండి బయటపడి బతికి చింత లేనివారైనారు. ధర్మాన్ని, యోగ్యతను

తప్పని సజ్జనులను, ఋజుమార్గవర్తనులను, సత్యసంధులను, సకలజనహితకారులను, గుణసంపన్నులను, జయించబడిన శత్రువుల సమూహం కలవారై ప్రకాశించేవారిని, పాపకార్యాలనుండి దైవమే ఎప్పుడూ రక్షిస్తుంటాడు'.

మనస్సులో పాండవులపట్ల బీజప్రాయంగా జనించిన ఈర్ష్యాద్వేషాలతో దుర్యోధనుడు ఎటువంటి దుశ్చర్యలకు పాల్పడ్డాడో పై పద్యంలో వివరించారు. దుర్యోధనుడు ఎంత హాని తలపెట్టినా, పాండవులు ఏదో ఒక విధంగా రక్షింపబడుతున్నారు. ధర్మాన్ని, యోగ్యతను తప్పని సజ్జనులను, ఋజుమార్గవర్తనులను, సత్యసంధులను, సకలజనహితకారులను, గుణసంపన్నులను పాపకార్యాల నుండి దైవబలమే రక్షిస్తుందని ఉదాహరణ పూర్వకంగా పై పద్యంలో వివరించారు.

పాండవులు ధర్మనిష్ఠ కలవారు. భగవంతుడిపై అపారమైన విశ్వాసం కలవారు. అందుకే, ఎన్ని కష్టాలు ఎదురైనా, ఒక్కొక్కటిగా వాటిని అధిగమించారు. మానవాళి మహాభారతం నుంచి గ్రహించవలసిన విషయం ఇదే. జీవితంలో కష్టాలు రావడం సహజం. కానీ, ఎవరైతే ఆత్మవిశ్వాసం, పరమాత్మవిశ్వాసం కలిగి ఉండి, నిత్యం ధర్మమార్గంలో జీవనం సాగిస్తారో వారికి మొదట్లో ఇబ్బందులు, ఆటంకాలు ఎదురైనా, అంతిమంగా సుఖశాంతులు పొందుతారు అనే నిత్యసత్యమైన సందేశాన్ని ఈ పద్యం అందిస్తోంది.

## 5.6. శకుంతలాదుష్యంతుల కథ

నన్నయ రచించిన ఆదిపర్వంలో వర్ణించబడిన 'శకుంతలోపాఖ్యానం'లో ధర్మసూక్ష్మాల గురించి గొప్ప చర్చ కనిపిస్తుంది. అద్భుతమైన వర్ణనలు చేస్తూనే, శాస్త్ర ప్రతిపత్తితో నన్నయ ఈ ఉపాఖ్యానాన్ని నడిపించారు. ధర్మాధర్మాల పట్ల మనిషి ఎటువంటి దృక్పథంతో వ్యవహరించాలి అనేది ఈ ఘట్టంలో వివరించబడింది.

క. 'జగతీవల్లభ యే న !
తృగణిత ధర్మస్వరూపుఁ డని జనములు దన్
బొగడఁగ జగదారాధ్యుం
డగు కణ్వమహామునీంద్రునాత్మజ' ననినన్. (*ఆంధ్ర. ఆది. 4: 29*)

‘‘ఓ! ప్రభువా! అపారమైన ధర్మమే రూపం దాల్చినవాడని ప్రజలు తనను ప్రశంసిస్తూ ఉండగా లోకపూజ్యుడై ఉన్న కణ్వమహామునీంద్రుడి కూతురుని నేను’ అని అనగా’.

దుష్యంతుడు శకుంతలని ఎవరు నీవు? అని అడిగిన ప్రశ్నకు శకుంతల చెప్పిన సమాధానం ఈ పద్యం. ధర్మమే రూపం దాల్చినవాడని ప్రజలు తనను ప్రశంసిస్తూ ఉండగా లోకపూజ్యుడై ఉన్న కణ్వమహామునీంద్రుడి కూతురుని నేను అంటూ శకుంతల చెప్పిన సమాధానం ఔచితీమంతమైనది. కణ్వమహర్షి శమ దమ సమన్వితుడు కాబట్టి, తన ప్రభావంతో ఆశ్రమ ప్రాంతం మొత్తం ప్రశాంతంగా ఉండేది. ఆశ్రమ ప్రాంతమే అంత ప్రభావితం అయినప్పుడు కూతురు శకుంతల ఇంకెంత సంస్కారవంతురాలు అయ్యుండాలి!

అందుకే, శకుంతల నేను ఎప్పుడూ ధర్మానికి కట్టుబడి ఉండే మనిషిని అని పరోక్షంగా దుష్యంతుడికి చెప్పింది. కణ్వమహర్షి (తండ్రి) పట్ల తనకున్న భక్తి భావాన్ని, వినయాన్ని చాటుకుంది. అయితే, దుష్యంతుడిని చూడగానే శకుంతల మనస్సులో కూడా అనురాగం జనించింది. మొదట్లో కణ్వమహర్షి వచ్చేవరకు వేచి ఉండాలని దుష్యంతుడిని వారించిన శకుంతల, కొంతసేపటికి దుష్యంతుడి గాంధర్వ వివాహ ప్రతిపాదనకి అంగీకరించింది. తనకి ఇంతటి జీవితాన్ని ప్రసాదించిన కణ్వమహర్షి ఇంకా తిరిగి రాక ముందే దుష్యంతుడిని వివాహం చేసేసుకుంది. శకుంతల ఇక్కడ ధర్మాన్ని తప్పింది. అందుకే, పర్యవసానంగా తర్వాత కథలో ఎన్నో కష్టాలు పడవలసి వచ్చింది.

తనకోసం రాజపరివారాన్ని పంపించి తనని తీసుకువెడతానని మాటిచ్చిన దుష్యంతుడు ఎంతకీ తిరిగిరాకపోవడంతో శకుంతల తానే భరతుడిని (వారిద్దరి కుమారుడు) తీసుకొని దుష్యంతుడి వద్దకి వెళ్లింది. దుష్యంతుడు జరిగిందంతా మర్చిపోయినట్లు మాట్లాడడంతో శకుంతల సభామందిరంలో గొప్ప ధార్మికోపన్యాసం చేసింది. తన జీవితం కోసం, బిడ్డ భవిష్యత్తు కోసం పోరాటం చేసింది.

ఆ. ఏల యెఱుక లేని యితరుల యట్ల నీ
వెఱుఁగ ననుచుఁ బలికె దెఱిఁగి యెఱిఁగి;
యేన కాని దీని నెఱుఁగ రిం దొరు లని
తప్పఁబలుక నగునె ధార్మికులకు! (*ఆంధ్ర. ఆది. 4: 79*)

'అన్నీ బాగా తెలిసి కూడా నాకు తెలియదు అని తెలివిలేని ఇతరులవలె ఎందుకు మాట్లాడతావు? ఇక్కడ దీనిని నేనే కాని ఇతరులెవ్వరూ ఎరుగరని (సాక్షులు లేరని) ధర్మాత్ములైనవారు అబద్ధమాడవచ్చునా?'

" 'తప్పబలుక నగునె ధార్మికులకు' అనే వాక్యం సాధారణలోకధర్మంగానూ, దుష్యంతుని పట్ల వర్తించే అధిక్షేపంగానూ గ్రహించవచ్చును" (*ఆంధ్ర. ఆది. 4. పుట: 342*)

ధర్మాత్ముడు అంటే ఎప్పుడూ ధర్మానికి కట్టుబడి ఉండేవాడు. ఎవరైనా చూస్తున్నారా? లేదా? సాక్షులు ఉన్నారా? లేదా? అని చూసుకుని తదనుగుణంగా ప్రవర్తించేవాడు కాదు. జీవితంలో జరిగే ప్రతీ సన్నివేశానికి ఏ సాక్షి ఉన్నా లేకపోయినా మనస్సాక్షి ఎప్పుడూ వెంటే ఉంటుంది. అది మనిషిని ఎప్పుడూ ప్రశ్నిస్తూ ఉంటుంది. ఇతరులను మాటలతో ఒప్పించడం సాధ్యమే కావచ్చు కానీ, మనస్సాక్షిని అలా ఒప్పించడం ఎవరి వల్ల కాదు. శకుంతల దుష్యంతుడిని ధర్మాత్ముడని సంబోధించడం గొప్ప సంభాషణానైపుణ్యం. ఆ మాట వినగానే ఒక్కసారిగా దుష్యంతుడి మనస్సాక్షి అతడిని ప్రశ్నించి తీరుతుంది. అందుకే, శకుంతల అధిక్షేపంగా అలా అంది. ధర్మానికి కట్టుబడని వారి వలె ఇలా మాట్లాడుతున్నావేంటి? అని ప్రశించింది. సన్నివేశం ప్రకారం అధర్మంగా ప్రవర్తిస్తున్నది దుష్యంతుడే. కానీ, ఇది నువ్వు కాదు, ధర్మనందనుడైన దుష్యంతుడు ఇలా ఉండడు అని అధిక్షేపంగా శకుంతల దుష్యంతుడిని ప్రశ్నించింది.

ధర్మాధర్మ వివేచన అందుకే ప్రతీ మనిషికీ అవసరం. దుష్యంతుడు అలా వివేచన చేసుకోగలవాడే అని శకుంతల విశ్వాసం. ఆ విశ్వాసం, ధర్మబద్ధమైన తన నడవడికపై తనకున్న నమ్మకం, తర్వాతి కథలో నిజమయ్యి శకుంతలాదుష్యంతులు ఒకటౌతారు.

క. సతియును గుణవతియుఁ బ్రజా
వతియు ననువ్రతయు నైన వనిత నవజ్ఞా
న్వితదృష్టిఁ జూచు నతి దు
ర్మతి కిహముం బరముఁ గలదె మతిఁ బరికింపన్. *(ఆంధ్ర. ఆది. 4: 82)*

క. సంతతగృహమేధి ఫలం
బంతయుఁ బడయంగ నోపు ననుగుణభార్యా
వంతుం డగువాఁడు క్రియా
వంతుఁడు దాంతుండుఁ బుత్త్రవంతుండు నగున్. *(ఆంధ్ర. ఆది. 4: 83)*

'బుద్ధితో బాగా పరిశీలిస్తే – పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కారభావంతో చూచే మిక్కిలి దుర్బుద్ధి ఇహపరసుఖాలు రెండూ ఉంటాయా? (ఉండవనీ, రెంటికి చెడ్డ రేవడి అవుతాడని భావం)'.

'అనుకూలవతి అయిన భార్యగలవాడు కర్మలు ఆచరించగలుగుతాడు, ఇంద్రియాలను నిగ్రహించగలుగుతాడు, పుత్రసంతానాన్ని పొందగలుగుతాడు, గార్హస్త్యధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించే గృహస్థుడు పొందే ఫలాలనంతటినీ అందుకోగలుగుతాడు'.

దుష్యంతుడికి చాలా సమయం పరోక్షంగా ప్రశ్నలు సంధించిన శకుంతల ఇప్పుడు కాస్త నేరుగా హితబోధ చేస్తోంది. పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కారభావంతో చూసేవాడికి ఇహపరసుఖాలు కలుగుతాయా? (కలగవు) అని దుష్యంతుడిని ప్రశ్నిస్తోంది. అందునా అనుకూలవతి అయిన భార్య దొరకడం ఏ తరంలోనైనా అదృష్టం. శకుంతల గుణవంతురాలు, కణ్వమహర్షి పెంపకంలో పరమసాధ్వీమణిగా శకుంతల ప్రకాశిస్తూ ఉంటే, తనని కాదంటూ దుష్యంతుడు ఎంత తప్పు చేస్తున్నాడో అతడికి తెలియజేస్తోంది శకుంతల.

నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికి ఈ రెండు పద్యాలు చక్కటి ఉదాహరణలు. మొదట అనుకూలవతియైన భార్యను వదులుకోవద్దని హితవు పలికిన శకుంతల అటువంటి భార్యకు భర్త అయినవాడు ఎటువంటి ఫలాలను పొందుతాడో వివరించింది. తన మాటలనేర్పుతో దుష్యంతుడిని క్రమంగా తిరిగి ధర్మమార్గంలో పయనింపజేసేందుకు దోహదపడుతోంది. శకుంతల తాను ధర్మపక్షాన పోరాడుతూనే ధర్మస్వరూపుడిగా ప్రసిద్ధుడైన తన భర్తని తిరిగి ధర్మంవైపు నడిపిస్తోంది. శకుంతల సంస్కారం అటువంటిది.

"గృహస్థాశ్రమధర్మం నాలుగు బలమైన స్తంభాల మీద నిలబడిన వ్యవస్థ. ఆ నాలుగు స్తంభాలేవంటే– 1. యజమాని (భర్త, గృహస్థుడు, గృహమేధి), 2. కులసతి (భార్య, గృహిణి)

3. సంతానం (పుత్రిక, సుతుడు), 4. సత్యం (సత్యస్వరూపమైన పరమధర్మం, దాని వివిధభేదాలు). ఈ నాల్గింటి యొక్క ప్రాశస్త్యాన్ని గురించి చెప్పించడమే శకుంతల ధార్మికోపన్యాసంలోని వ్యాసహృదయం". (*ఆంధ్ర. ఆది. 4. పుట: 344*)

చ. 'గొనకొని వీఁడు నీకును శకుంతలకుం బ్రియనందనుండు; సే
కొని భరియింపు మీతని; శకుంతల సత్యము వల్కె,సాధ్వి, స
ద్వినుత, మహాపతివ్రత వివేకముతో' నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ మందఁగఁ దత్సభాసదుల్. (*ఆంధ్ర. ఆది. 4: 105*)

'ఈ భరతుడు నీకు, శకుంతలకు మిక్కిలి ముద్దుబిడ్డడు. ఈతనిని స్వీకరించి, పోషించుము. ఇల్లాలు, ఉత్తమ కీర్తి కలిగింది, మహాపతివ్రత అయిన శకుంతల వివేకంతో నిజం చెప్పింది' – అని ఆకాశవాణి ఆ సభాలోవారు విని ఆశ్చర్యపడేటట్లు రాజుకు వినిపించింది (ప్రకటించింది)'.

గృహస్థాశ్రమ ధర్మస్థాపనలో కుమారుడి ప్రాధాన్యాన్ని వివరిస్తున్న తరుణంలో శకుంతల ఇలా పలికింది. ' 'పుణ్యాత్ముడైన నీ కుమారుడు వంశకర్తయై పూనికతో నూరువాజపేయ యాగాలను చేస్తా'డని ఆకాశవీధిలో సరస్వతి (ఆకాశవాణి) మునులందరూ వినేటట్లుగా నాతో చేప్పింది' (*ఆంధ్ర. ఆది. 4. పుట: 347*). అయితే, శకుంతల చెప్పిన ఆకాశవాణి సత్యకథనాన్ని అది పరోక్షప్రమాణం కావడం చేత దుష్యంతుడు నమ్మడు. కానీ, ఇప్పుడు నిండుసభలో సభికులంతా వింటుండగా ఆకాశవాణి మరొకసారి సత్యాన్ని పలికింది. ఇది ప్రత్యక్షప్రమాణం కనుక దుష్యంతుడు నమ్మాడు.

దుష్యంతుడు శకుంతలను అడిగిన ప్రశ్నలన్నింటికీ ఆకాశవాణి స్పష్టంగా సమాధానం చెప్పింది. నిండు సభలో అందరి ముందు ఆకాశవాణి పలకడం వల్ల అస్పష్టతకు, విమర్శలకు తావులేదు. ఎన్నో అవరోధాలను అధిగమించి సాధ్వి అనిపించుకున్న శకుంతల దుష్యంతుడి మనస్సుని తిరిగి గెలుచుకుంది. అతడి హృదయ సామ్రాజ్యంలో మహారాణిగా చిరస్థాయిగా నిలిచిపోయింది. భరతుడి భవిష్యత్తుని సువర్ణాక్షరాలతో లిఖించింది. ఆ మహా ఇల్లాలి కఠోర దీక్ష, తపన ఫలించాయి. తాను ఏ ధర్మాన్నైతే బాల్యంలో కణ్వమహర్షి వద్ద అభ్యసించిందో, ఏ ధర్మాన్నైతే అన్ని వేళలా నమ్ముకుందో, ఏ ధర్మం కోసమైతే దుష్యంతుడితో వాదించిందో, ఆ ధర్మమే తనని గెలిపించింది. తన వ్యక్తిత్వానికి, సహనానికి, ధర్మనిబద్ధతకి, మనోనిగ్రహానికి ఎంతో పరీక్ష పెట్టిన

భగవంతుడు తాను నమ్ముకున్న సత్యాన్ని (సత్యస్వరూపమైన పరమ ధర్మాన్ని) గెలిపించాడు. సత్యమే శాశ్వతమని నిర్ధారించాడు. ధర్మో రక్షతి రక్షితః అనే వేదవాక్యాన్ని వాస్తవికంగా నిరూపణ చేశాడు.

"శకుంతల వివేకవతి. ఆమె తన ఉపన్యాసంలో క్రమంగా గృహిణి గొప్పతనాన్ని చెప్పి సాధ్వి అనిపించుకున్నది. చక్రవర్తి కాబోయే కొడుకు గొప్పతనాన్ని చెప్పి సద్వినుత అనిపించుకున్నది. సత్యం మహాపదార్థాలచేత రక్షింపబడుతుందని చెప్పి వంచించిన భర్తను శపించకుండా మహాపతివ్రత అనిపించుకున్నది". (*ఆంధ్ర. ఆది. 4. పుట: 353*)

## 5.7. అణి మాండవ్యుడి కథ

ధర్మాధర్మ వివేచన మనిషికి ఎంత అవసరమో అణి మాండవ్యుడి కథ ద్వారా నన్నయ పాఠకులకి తెలియజేశారు.

క. సొలయక తూనిఁగలం గొ
ఱ్ఱులఁ బెట్టితి నీవు నీచిఱుతకాలము త
త్ఫల మిప్పు డనుభవించితి;
తొలఁగునె హింసాపరులకు దుఃఖప్రాప్తుల్ (*ఆంధ్ర. ఆది. 4: 271*)

'నీవు చిన్నతనంలో తూనీగలను ఎగురనీయకుండా పట్టి మేకులను గుచ్చి ఉంచావు. దాని ఫలాన్నే ఇప్పుడు అనుభావించావు. హింస చేసేవారికి కష్టాలు పొందక తప్పుతుందా!'

మాండవ్యుడు గొప్ప తపస్వి. చేయని తప్పుకి శూలారోపణ అనే శిక్షని అనుభవిస్తాడు. అంత బాధలో సైతం మాండవ్యుడు తన శాంతాన్ని కోల్పోడు. తాను మండవ్యుడి పట్ల చేసింది తప్పు అని తెలుసుకున్న మహారాజు ఆ శూలాన్ని మాండవ్యుడి శరీరం నుండి విడదీయడానికి శతవిధాలా ప్రయత్నిస్తాడు. ఎంత ప్రయత్నించినా ఒక చిన్న శూలభాగం అతడి శరీరంలోనే ఉండిపోతుంది. అందుకే అతడి నామం అణి మాండవ్యుడిగా స్థిరపడింది. ఇంతటి శిక్ష తాను అనుభవించడానికి కారణం ఏంటో తెలుసుకుందామని అణి మాండవ్యుడు యమనగరానికి వెళ్లి, చిన్నప్పుడు తెలియక చేసిన తప్పుకి (తూనీగలని హింసించడం) యముడు ఈ శిక్షని విధించాడని అణి మాండవ్యుడు తెలుసుకుంటాడు.

తెలియని వయస్సులో చేసిన తప్పుకి ఇంత కఠోరమైన శిక్ష వేసినందుకు ప్రతిగా యముడికే శాపం విధించిన గొప్ప వ్యక్తిత్వం మాండవ్యుడిది. ఆ శాపం కారణంగా యముడు విదురుడిగా మానవజన్మ ఎత్తవలసివచ్చింది. దీన్ని బట్టి, ధర్మాధర్మ వివేచన సరిగ్గా చేసుకోలేకపోతే యముడికి సైతం శిక్ష తప్పదనే విషయం స్పష్టమౌతోంది.

## 5.8. ధర్మాధర్మ వివేచన: విదురుడి బోధన

లాక్షాగృహదహనం నుండి తప్పించుకున్న పాండవులకు ఎలా రాజ్యం దక్కకుండా చేయాలి? అని పన్నాగాలు పన్నుతున్న దుర్యోధనుడిని మాట వినవద్దని హితవు పలుకుతూ విదురుడు ధృతరాష్ట్రుడితో పలికిన ఈ మాటలు సగటు మనిషికి ధర్మాధర్మవివేచన ఎంత అవసరమో తెలియజేస్తాయి.

సీ. ధర్మార్థవిత్తముల్ తథ్యవాదులు వయో / వృద్ధులు మధ్యస్థవిమలమతులు
ద్రోణగాంగేయులు దురితవిదూరులు / ని న్నెద్దిగఅపిరి నెమ్మితోడ
దానిన చేయుట ధర్మువు; వారల / కంటె హితుల్ నీకుఁ గలరె యొరులు;
దుర్యోధనుండును దుశ్శాసనుండును / గర్ణుండు శకునియుఁ గరము బాలు;

ఆ. రెఱుఁగ రిదియు ధర్మ విది యధర్మం బని;
యట్టివారిపలుకు లాదరించి
వినక పాండుసుతుల వేగ రావించి వా
రలకుఁ బ్రీతి నర్ధరాజ్య మిమ్ము. (*ఆంధ్ర. ఆది. 8: 43*)

'ధర్మార్థాలను తెలిసినవాళ్లలో శ్రేష్ఠులు, సత్యం చెప్పేవాళ్లు, వయస్సులో పెద్దవాళ్లు, పక్షపాతం లేని వాళ్లు, నిర్మల బుద్ధికలవాళ్లు, పుణ్యాత్ములు అయిన ద్రోణ భీష్ములు నీకేది ఉపదేశించారో దానిని చేయడమే ధర్మం. ఆ ఇద్దరి కంటే నీ మేలు కోరేవాళ్లు ఇంకెవరున్నారు? దుర్యోధనుడు, దుశ్శాసనుడు, శకుని చాలా అవివేకులు. ఇది ధర్మమని, ఇది అధర్మమని వాళ్లకు తెలియదు. అలాంటివాళ్ల మాటలు వినక పాండవులను వెంటనే రప్పించి ప్రేమతో అర్ధరాజ్యాన్ని ఇమ్ము'.

ధర్మం ప్రకారం పాండవులకు అర్ధరాజ్యం దక్కాలి. కానీ, దుర్యోధనుడి కుతంత్రాల వల్ల పాండవులకి ఏదో ఒక అపాయం ఏర్పడుతూనే ఉంది. పుత్రవ్యామోహానికి లోనై ధృతరాష్ట్రుడు

దుర్యోధనుడికి అడ్డు పడలేకపోతున్నాడు. ఆ పరిస్థితిలో రాజనీతిజ్ఞుడైన విదురుడు పలికిన ఈ మాటలు ధృతరాష్ట్రుడినే కాదు ప్రతీ మనిషినీ ఆలోచింపజేస్తాయి. ధర్మాధర్మవివేచన ఎంత ముఖ్యమో తెలియజేస్తాయి. విదురుడు నిక్కచ్చిగా ఎవరు ధర్మ పక్షాన ఉన్నారో, ఎవరు అధర్మ పక్షాన ఉన్నారో స్పష్టంగా ధృతరాష్ట్రుడికి వివరించాడు. పుత్రవ్యామోహంలో పడి ఏన్నో అధర్మమైన పనులు చేస్తున్న ధృతరాష్ట్రుడికి ధర్మమే అన్నింటికంటే గొప్పదని వివరించాడు. తర్కబద్ధంగా నిరూపించాడు. విదురుడి మాటలు విని ముందు అర్ధరాజ్యం పాండవులకి ఇచ్చినా, పుత్రవ్యామోహంతో తర్వాతి కథలో దుర్యోధనుడి కుతంత్రాలకు తలొగ్గి అధర్మ పక్షానే ధృతరాష్ట్రుడు నిలబడతాడు. అది ఎంతటి దారుణానికి దారి తీసిందో విదితమే. దీన్ని బట్టీ, అధర్మమార్గంలో పయనించేవారికి ఎంతటి హీనస్థితి పడుతుందో తెలుస్తుంది.

## 5.9. భీష్ముడి ధర్మ ప్రబోధం

ధర్మరాజు రాజసూయయాగం చేసిన సందర్భంలో భీష్ముడు పలికిన ఈ మాటలు ధర్మ సూక్ష్మాన్ని చాలా గొప్పగా వివరిస్తాయి.

ఉ. పాలితదుర్ణయుండు శిశుపాలుఁడు బాలుఁడు; వీని నేల భూ
పాలక! నీకుఁ బట్టువఱుపన్? మఱి ధర్ము వెఱుంగ వీనికిం
బోలునె రాగకోప పరిభూత మనస్కున కల్పరాజ్య ల
క్ష్మీ లలనాంధబుద్ధి కనిమిత్త మహత్పరివాదశీలికిన్? (*ఆంధ్ర. సభా. 2: 22*)

'ధర్మరాజా! శిశుపాలుడు పెచ్చుపెరిగిన చెడునడత కలవాడు. పరిపక్వం కాని బుద్ధి కలవాడు. ఇలాంటి వీడికి చెప్పి ఒప్పించే ప్రయత్నం నీవు ఎందుకు చేస్తావు? అంతేకాదు, ఇతడు అసూయాక్రోధాలకు వశమైన మనస్సు కలవాడు. కొద్దిపాటి రాజ్యలక్ష్మిచేతనే మదించి వివక్షను కోల్పోయిన బుద్ధి కలవాడు. కారణం లేకుండానే మహాత్ములను నిందించే స్వభావం కలవాడు. ఇలాంటి వీడికి ధర్మతత్త్వం తెలుసుకోవడం సాధ్యమవుతుందా?'

శిశుపాలుడు మహారాజే అయినా చెడు నడవడిక కలవాడు. పరిపక్వత లేని వాడు. అన్నింటినీ మించి రాగద్వేషాలకు లోనయ్యేవాడు. తనకు ధనం ఉందని గర్వించేవాడు. పెద్దవాళ్లకు మర్యాదనిచ్చే

సంస్కారం లేనివాడు. ఇన్ని దుర్గుణాలు శిశుపాలుడికి ఉన్నాయని భీష్ముడు తెలియజేశాడు. భీష్ముడు ధర్మసూక్ష్మం తెలిసినవాడు. తాను స్వయంగా ధర్మమూర్తి.

భీష్ముడు పలికిన ఈ మాటల ద్వారా ధర్మంగా ఉండడమంటే ఎలా? అనే ప్రశ్నకి సమాధానం తెలుస్తోంది. మంచి నడవడిక లేనివాడు, సత్ప్రవర్తన లేనివాడు, పెద్దలకి మర్యాద ఇవ్వనివాడు, డబ్బుందని గర్వించేవాడు, రాగద్వేషాలకు వశమైనవాడు పూర్తిగా అధర్మమార్గంలో పయనిస్తున్నట్టే అని భీష్ముడు నొక్కి వక్కాణించాడు. ఈ దుర్గుణాలు ఉండడం వల్లనే రాజసూయార్ఘ్యాన్ని స్వీకరించడానికి శిశుపాలుడు అసలు అర్హతే లేనివాడు అని భీష్ముడు తన మాటల ద్వారా ఋజువుచేశాడు. అంతేకాకుండా, ధర్మమార్గంలో నడవనివాడు నాయకుడయ్యే అర్హతనే కోల్పోతాడు అని భీష్ముడి మాటల ద్వారా స్పష్టమవుతోంది. నాయకుడు తాను ధర్మమార్గంలో నడుస్తూ, ప్రజలను సైతం ధర్మమార్గంలో నడిపించవలసిన బాధ్యత కలిగి ఉండాలి అని మరొకసారి గుర్తుచేశాడు.

భీష్ముడి మాటలు ధర్మరాజు చేసిన రాజసూయాగానికి విచ్చేసిన మహారాజులను, ప్రజలనే కాదు నేటి తరం నాయకులను సైతం ఆలోచనలో పడేస్తాయి. దిశానిర్దేశం చేస్తాయి.

## 5.10. ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టం

సభా పర్వంలోని ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో ధర్మాధర్మ వివేచన గురించి గొప్ప చర్చ జరిగింది. ధర్మరాజు ఆడిన జూదం వల్ల, అందులో కలిగిన నష్టం వల్ల నిండు సభలోకి ద్రౌపది ఈడ్వబడింది. ఆ అన్యాయాన్ని చూసి ద్రౌపది ఆవేదనతో పలికిన మాటల్లో ధర్మాధర్మ వివేచన గురించి ప్రామాణికమైన చర్చ చేయడం కనిపిస్తుంది.

చ. 'ఇది యుచితంబు గా దనక యిక్కురుముఖ్యులు సూచుచుండ దు
    ర్మదుఁ డయి వీఁడు నన్ను నవమానితఁ జేసెడి; సర్వధర్మ సం
    విదు లన నున్న యీ భరతవీరులవంశము నేఁ డధర్మ సం
    పద నతినింద్య మయ్యె' నని భామిని గృష్ణఁ దలంచె భీతయై. (*ఆంధ్ర. సభా. 2: 219*)

'ఈ విధంగా నన్ను జుట్టుపట్టి ఈడ్చి తేవడం ఉచితం కాదని భావించక, ఈ కురువంశప్రముఖులంతా చూస్తుండగా, క్రొవ్విన ఈ దుశ్శాసనుడు నన్నవమానిస్తున్నాడు. అన్ని

ధర్మాలు పూర్తిగా తెలిసిన వాళ్లని పేరు పొందిన ఈ భరతవీరుల వంశం ఈనాడు అధర్మం పెరగడం చేత ఎంతో నిందించదగినది అయ్యిం' దని కోపించిన ద్రౌపది భయపడి శ్రీకృష్ణున్ని ప్రార్థించింది.

ద్రౌపది పలికిన మాటలు కేవలం పాండవులనే కాదు మొత్తం భరతవంశాన్ని ప్రశ్నిస్తున్నాయి. జూదం సరదాగా ఆడడం కూడా తప్పే. అదొక వ్యసనం. సరదాగా ఆడిన జూదం ఈరోజు ఇంత తీవ్రమైన పరిస్థితులకు దారి తీసింది. జూదంలో సంపదలు ఒడ్డడం ఒక ఎత్తైతే ద్రౌపదిని ఒడ్డడం అత్యంత అమానుషమని పై ఘట్టం ద్వారా అర్థమవుతోంది. ఏది చేయదగినదో, ఏది చేయదగనిదో ఆలోచించుకోవద్దా? అంటూ ద్రౌపది ఆక్రందించడం సభలో ఉన్న అందరినీ ఆలోచింపజేస్తుంది, ధర్మాధర్మవివేచన మనిషికి ఎంత అవసరమో నిరూపిస్తుంది. అంతేకాకుండా ద్రౌపది మాటలబట్టీ ఏ వంశానికైనా కీర్తి, ప్రతిష్టలు వచ్చేవి వారు ఆచరించే ధర్మాన్ని బట్టే తప్ప, వేరే వాటివల్ల కాదని స్పష్టమవుతోంది. మొత్తంగా భరతవంశం అధర్మమార్గంలో నడవడం ద్వారా చెడ్డపేరుని మూటకట్టుకుందని తెలుస్తోంది. ధర్మాధర్మ వివేచన అనేది లేకపోతే ఎంతటి సామ్రాజ్యమైనా పతనమవ్వక తప్పదని ఈ ఘట్టం ద్వారా స్పష్టమవుతోంది.

అదే సందర్భంలో ద్రౌపది ఆవేదన చూసి ఆగ్రహావేశాలకి లోనై ధర్మరాజుని దూషించడానికి పూనుకున్న భీముడిని నివారించడానికి అర్జునుడు పలికిన ఈ మాటలు వాస్తవికతని కళ్లకి కడుతూనే, ధర్మాధర్మాలు ఎన్ని విధాలుగా ఉంటున్నాయో వివరిస్తాయి.

సీ. ధర్మతనూజుండు ధర్మువు దప్పిన / ధరణీతలం బెల్లఁ దల్లడిల్లుఁ;
దగిలి సుహృద్ద్యూత ధర్మయుద్ధములకుఁ / బరులచేఁ బిలువంగఁబడి విభుండు
గడగక విముఖుండు గాఁ జన దని శుభ / క్షాత్త్రధర్మంబు లోకంబునందు
నిలిపెఁ దా; నిది పతినేరమియే? దైవ / వైపరీత్యం బైన వనరఁ దగునె?

ఆ. గురుల ధర్మపరులఁ గోపించి ధీరు ల
తిక్రమింతురే? తదీయనిత్య
ధర్మగౌరవం బధార్మికు లగుచున్న
పరులచేతఁ జెఱుపఁబడియె నిట్లు. (*ఆంధ్ర. సభా. 2: 224*)

'ధర్మరాజే ధర్మం తప్పితే భూమండలమంతా తల్లడిల్లదా? స్నేహంగా ఆడుకునే జూదానికి, ధర్మం కొరకు చేసే యుద్ధానికి ఇతరులు పలుమార్లు పిలిస్తే, ప్రభువైనవాడు అందుకు పూనుకోకుండా, పెడమొగం పెట్టి పోకూడదన్న శుభక్షత్రియ ధర్మాన్ని, ఆయన లోకంలో నిలిపాడు. అంతేగాని ధర్మరాజు ఈ జూదమాడడం అజ్ఞానం వల్లనా? దైవానుగ్రహం తారుమారైతే అందుకు దుఃఖించడం తగునా? ధర్మజుని శాశ్వతమైన ధర్మగౌరవం – ధర్మహీనులైన ఇతరులచేత ఈ విధంగా చెడగొట్టబడింది.

ధర్మరాజు వ్యక్తిత్వం ఎంతో ఉన్నతమైనది. నిజానికి భారతకాలంలో ధర్మరాజు యొక్క ధర్మాధర్మ వివేచన ఎంతో మందికి ఆదర్శంగా నిలిచింది. అటువంటి ధర్మరాజు ఇటువంటి అధర్మమైన పని చేయడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. అయితే, అర్జునుడి మాటల బట్టీ ధర్మాధర్మాలు రెండూ ఒక్కొకసారి పరిస్థితుల బట్టీ, విధిరాత బట్టీ, మనుషుల కర్మఫలాల బట్టీ కూడా ఏర్పడుతున్నాయని తెలుస్తోంది. అంటే, ధర్మరాజు జూదం ఆడడం పూర్తిగా అతడి బలహీనత వల్లనే అని చెప్పడం సరి కాదు. పరిస్థితుల ప్రభావం, జరగవలసిన కథ, దైవలీల అన్నీ అతడిని ప్రభావితం చేశాయనేది సుస్పష్టం. లేకపోతే గొప్ప విచక్షణా జ్ఞానం కలిగిన ధర్మరాజు ఇటువంటి దారుణమైన పరిస్థితికి దిగజారిపోవడం విడ్డూరంగానే అనిపిస్తుంది. ఏది ఏమైనా ఒక వ్యసనం పట్ల వ్యక్తికి ఉండే చాపల్యం ఎంతటి విపత్కర పరిస్థితులకి దారి తీస్తుందో ఈ ఘట్టం ద్వారా అర్థమవుతోంది. అధర్మాలైన వ్యసనాల బారిన పడి బ్రతుకుల్ని నాశనం చేసుకోవద్దని ఈ ఘట్టం హితవు పలుకుతోంది.

వ్యసనం మనిషి జీవితాన్ని ఎంతగా అతలాకుతలం చేస్తుందో వివరిస్తూ, వ్యసనం బారిన పడినవాడి ప్రవర్తనని ఎందుకు పరిగణలోకి తీసుకోకూడదో వికర్ణుడు సభికులందరికీ వివరించిన తీరు ధర్మనిర్ణయం ఎలా ఉండాలో నిర్వచించింది.

వ. 'ఇక్కురువృద్ధు లైన భీష్మ ధృతరాష్ట్ర విదురాదులును నాచార్యులయిన ద్రోణకృపాదులుం బలుకరైరి; యున్న సభాసదులెల్లం గామక్రోధాదులు దక్కి విచారించి చెప్పుం'డనిన నెవ్వరుం బలుకకున్న 'నే నిందు ధర్మ నిర్ణయంబు సేసెద; నెల్లవారును వినుండు; జూదంబును వేఁటయుఁ బానంబును బహుభక్షణాసక్తియు నను నాలుగు దుర్వ్యసనంబులం దగిలిన పురుషుండు ధర్మువుం దప్పివర్తిల్లు; నట్టి వాని కృత్యంబులు సేకొనం దగవు; కిత వాహూతుండై వ్యసనవర్తి యయి పరాజితుం డయిన పాండవాగ్రజుండు పాండవుల కందఱకు సాధారణ ధనంబయిన పాంచాలిఁ

బణంబుఁ జేసెం గావున ద్రౌపది యధర్మవిజిత; యక్కోమలి నేకవస్త్ర నిట దోడ్కొని తెచ్చుట యన్యాయం' బనిన వికర్ణుపలుకుల కొడంబడక కర్ణుండు వాని కి ట్లనియె. (*ఆంధ్ర. సభా. 2: 227*)

కురువంశపు పెద్దలైన భీష్ముడు, ధృతరాష్ట్రుడు, విదురుడు మొదలైనవాళ్లు, గురువులైన ద్రోణుడు, కృపుడు మొదలైనవాళ్లు ద్రౌపదికి నిండు సభలో ఇంత అవమానం జరుగుతున్నా మౌనంగా ఉండిపోయారు. సభికులు సైతం ఎవరూ మాట్లాడకపోయేసరికి వికర్ణుడు ముందుకి వచ్చి తానే ధర్మనిర్ణయం చేయాలని నిర్ణయించుకున్నాడు. 'జూదం, వేట, మద్యపానం, అతిగా తినడం అనే నాలుగూ చెడు వ్యసనాలు. వీటిలో తగుల్కొన్న మానవుడు ధర్మం తప్పి ప్రవర్తిస్తాడు. అలాంటివాడి పనులు లెక్కలోకి తీసుకోకూడదు. జూదగానిచేత ఆహ్వానించబడి, జూదవ్యసనంలో తగుల్కొని ఓడిపోయిన ధర్మరాజు, పాండవులందరికీ ఉమ్మడి సొమ్ము అయిన పాంచాలిని పందెంగా చేశాడు. అందుచేత ఆమె అధర్మం చేత జయించబడింది. ఆ సుకుమారిని ఇలా అవమానించడం అన్యాయం' అంటూ వికర్ణుడు నిండు సభలో ధైర్యంగా తన అభిప్రాయాన్ని తెలియజేశాడు.

కురువంశ పితామహులు ఎవరూ మాట్లాడకపోయినా, గురుదేవులు మాట్లాడకపోయినా, ఒక స్త్రీ మానాన్ని కాపాడడం కోసం వికర్ణుడు చేసిన ప్రసంగం నేటికీ ఎంతో ఆదర్శంగా నిలుస్తుంది. సభలో ఎక్కువశాతం మంది తనని వ్యతిరేకిస్తున్నా, వికర్ణుడు ధైర్యంగా ధర్మనిర్ణయం చేయడం నేటి యువతరంలో స్ఫూర్తిని నింపుతుంది. వికర్ణుడి మాటని కర్ణుడు వ్యతిరేకించడంతో దుర్యోధనుడి దుష్కృతానికి ఇక అడ్డు లేకుండా పోయింది. ధర్మరాజు జూదంలో చివరికి ద్రౌపదిని పందెంగా పెట్టి ఓడిపోవడం సభలో అందరికీ తెలిసిందే. ఇక ద్రౌపదికి జరుగుతున్న అవమానాన్ని చూసి తట్టుకోలేక పాండవులు వారి పైవస్త్రాలను వారే తొలగించుకుని నిండుసభలో నిలబడిపోయారు (*ఆంధ్ర. సభా. 2: 230*).

వికర్ణుడు నిండుసభలో చేసిన ధర్మనిర్ణయాన్ని మెచ్చుకుంటూ, సమర్థిస్తూ విదురుడు పలికిన ఈ మాటలు ధర్మసూక్ష్మాన్ని ఆవిష్కరిస్తాయి.

ఆ. ధర్ము వెఱిఁగి దానిఁ దా నొండుగా లాభ
లోభ పక్షపాతలోలబుద్ధి
సభల నెవ్వఁడేని సభ్యుఁడై పలుకు వాఁ
డనృతదోషఫలము ననుభవించు. (*ఆంధ్ర. సభా. 2: 238*)

'ధర్మాన్ని తెలిసి కూడా లోభం చేతనో, లాభం చేతనో, పక్షపాతం చేతనో, ఊగిసలాడే బుద్ధితోనో సభల్లో ఎవరైనా – దానిని మరొక విధంగా పలికితే, అతడు అసత్యమాడే దోషం వల్ల కలిగే ఫలాన్ని అనుభవిస్తాడు'.

ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో భాగంగా, నిండుసభలో ద్రౌపదిని అవమానించడానికి పూనుకున్న కౌరవులకి, సభలో ఆసీనులైన కురువంశ పితామహులకి, ఆచార్యులైన ద్రోణుడికి, కృపాచార్యులకి, సభికులకి అందరికీ జరుగుతున్నది అత్యంత అమానుషమని, అధర్మమని స్పష్టంగా తెలుసు. కానీ, అందరూ వారి వారి వ్యక్తిగత కారణాల వల్ల దుర్యోధనుడు చేస్తున్న దుశ్చర్యని నివారించడానికి ముందుకు రాలేదు. ఒక్క వికర్ణుడు మాత్రం ముందుకు వచ్చి వ్యతిరేకించాడు. ధర్మమూర్తి అయిన విదురుడు అందుకు గల కారణాన్ని తన మాటల్లో ఇలా వివరించాడు. సభికులందరికీ బుద్ధి చెప్పే ప్రయత్నం చేశాడు.

ధర్మాన్ని తెలిసి కూడా లాభం చేతగాని, లోభం చేతకాని, పక్షపాతం చేతకాని అధర్మాన్ని వ్యతిరేకించకపోతే, అతడికి అసత్యమాడిన దోషం చుట్టుకుంటుందని సభలో స్పష్టం చేశాడు. దీన్నిబట్టే చూస్తే, అసత్యమాడడం ఆ కాలంలో ఎంతటి నేరమో అర్థమవుతోంది. విదురుడు తన మాటల ద్వారా వికర్ణుడిని మెచ్చుకుంటూనే, సభలో అధర్మపక్షాన ఉండిపోయినవారిని మేలుకొలిపే ప్రయత్నం చేస్తున్నాడు.

విదురుడి మాటలు ఆ కాలానికే కాదు, అత్యాధునిక సమాజానికి సైతం చక్కగా వర్తిస్తాయి. ధర్మం కాని పని చేయడం ఎంత తప్పో, కళ్ల ముందు అధర్మం జరుగుతుంటే ఖండించకపోవడం, ఆపే ప్రయత్నం చేయకపోవడం అంతే తప్పులని విదురుడి మాటల ద్వారా స్పష్టమవుతున్నాయి. అంతే కాకుండా ధర్మాధర్మ వివేచన చేసేటప్పుడు మనిషి ఆలోచనని లాభం గాని, లోభం గాని, పక్షపాత ధోరణి గాని ప్రభావితం చేయకూడదని విదురుడి మాటల ద్వారా బోధపడుతోంది. విదురుడి మాటలు న్యాయాన్యాయ నిర్ణయం చేసే సభల్లో కూర్చొన్న పెద్దలందరికీ శిరోధార్యాలు.

## 5.11. అర్జునౌర్వశీ వృత్తాంతం

అరణ్యవాసంలో భాగంగా కొన్ని పరిస్థితుల వల్ల అర్జునుడు దేవతల రాజధానియైన అమరావతికి వెళ్లవలసివచ్చింది. అక్కడ ఊర్వశి అర్జునుడిని చూసి అతడిని రమించింది. కానీ అర్జునుడు ఆమె ప్రతిపాదనను సున్నితంగా తిరస్కరించాడు. అందుకు గల కారణాలని అర్జునుడు విశ్లేషించిన తీరు అతడిలో ఉన్న ధర్మనిష్ఠని ఆవిష్కరించింది.

క. ఓహో! యిమ్మెయి ధర్మ
 ద్రోహోక్తులు పలుకఁ దగునె? దోసం బది గా
 దే? హరి హరి! మనమునఁ దగ
 వూహింపక నన్నుఁ బలుకు టుచితమె నీకున్? (*ఆంధ్ర. ఆరణ్య. 1: 364*)

'ఓహో! ఈ విధంగా ధర్మానికి కీడు చేసే పలుకులు పలకడం నీకు తగునా! విచ్చలవిడి శృంగారం దోషం కాదా? హరి హరి! ఎంతటి మాట వినవలసి వచ్చింది? నీ మనస్సులో ఏ మాత్రం న్యాయం ఆలోచించక ఈ విధంగా మాట్లాడడం నీకు తగునా?'

ఊర్వశి ఆర్జునుడిని నానారకాలుగా మభ్యపెట్టాలని ప్రయత్నించింది. అర్జునుడు లొంగలేదు. అందుకు అర్జునుడు చూపిన కారణాలు అతడిలో ఉన్న ధర్మనిష్ఠని నిరూపిస్తున్నాయి. ఊర్వశి అర్జునుడి వంశకర్తయైన పురూరవుడికి భార్య. అర్జునుడి తండ్రియైన ఇంద్రుడికి పరిచారిక. అందువల్ల ఊర్వశి అర్జునుడికి జనయిత్రి అవుతుంది. ఊర్వశి ప్రతిపాదనకి బదులుగా అర్జునుడు ఈ మాటలు చెప్పి తనని పుత్రవాత్సల్యంతో చూడమని ఊర్వశికి హితవు పలికాడు. ఊర్వశి ఆగ్రహానికి బలై శాపాన్ని పొందాడు. ఆ శాపమే అజ్ఞాతవాస సమయంలో అర్జునుడి పాలిట వరమయ్యింది. తాను శాపానికి బలౌతానని తెలిసి కూడా అర్జునుడు ధర్మానికే కట్టుబడి ఉండడం అర్జునుడి ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సూచిస్తోంది.

పర్యవసానాలు ఎలా ఉన్నా, అర్జునుడు ధర్మానికే కట్టుబడ్డాడు. పైగా స్వేచ్ఛకి, విచ్చలవిడితనానికి ఉన్న తేడాని గుర్తించమని ఊర్వశికి బుద్ధి చెప్పాడు. పైగా వావి వరుస తెలియని శృంగారం జీవితాలను నాశనం చేస్తుందని పలికాడు. పురూరవ వృత్తాంతాన్ని ఊర్వశికి గుర్తుచేసి,

తనపై శృంగార భావంతో వచ్చిన ఊర్వశిని 'తల్లీ!' అని సంబోధించి తన సంస్కారాన్ని, ధర్మం పట్ల అతడికున్న నిష్ఠని అర్జునుడు చాటుకున్నాడు.

అర్జునుడి మాటలు, సత్ప్రవర్తన, ధర్మనిష్ఠ నేటి తరానికి గొప్ప పాఠాన్ని నేర్పిస్తాయి. స్వేచ్ఛకి, విచ్చలవిడితనానికి ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి మనిషి తన నడవడిక పట్ల శ్రద్ధ వహించాలని అర్జునుడు బోధ చేశాడు. అర్జునుడి మాటలు నేడు, వావివరుస పట్టించుకోకుండా ఘోరాలు, అత్యాచారాలు చేస్తున్న యువతరానికి గట్టి పాఠాన్ని నేర్పిస్తాయి.

## 5.12. కౌశిక ధర్మవ్యాధ సంవాదం

పతివ్రత సూచన మేరకు కౌశికుడు ధర్మసూక్ష్మాలను తెలుసుకోవడానికి మిథిలానగరంలో నివాసముండే ధర్మవ్యాధుడిని కలుసుకుంటాడు. ధర్మవ్యాధుడు వృత్తిరీత్యా మాంసం కొట్టేవాడు. ధర్మసూక్ష్మాలను తనతో చర్చించగలిగే ప్రావీణ్యుడు మాంసాన్ని విక్రయించడమేమిటి? అనే సందిగ్ధతలో పడతాడు కౌశికుడు. అప్పుడు ధర్మవ్యాధుడు ఇచ్చిన సమాధానం కౌశికుడికే కాదు, తాము జీవహింస చేయడం లేదని భావించే ఎంతోమందికి జ్ఞానోదయం కలిగిస్తుంది.

తే. జీవహింస యెన్నండును జేయ ననఘ!
యొరులు సంపి తెచ్చిన మాంస మొనర విలిచి
తగిన వెల కమ్మి బ్రదుకుదుఁ; దద్ధనమున
నమలమానసశాంతి నా యర్థ మెందు. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 33*)

మ. హలికుం డెంతయు నోజతో దునఁగ సీరాగ్రంబునం జోఁకి ప్రా
ణు లనేకంబులు సచ్చు, హింస యది యౌనో కాదొ! వేయేల? మ
ర్త్యులు నేలం జరియించుచోఁ బదములం ద్రొక్కంబడుం బెక్కు జం
తులు హింసావిధి గాదనంగ వశమే దోషజ్ఞ! యూహింపుమా! (*ఆంధ్ర. ఆరణ్య. 5: 57*)

'నా అంతట నేను ఎప్పుడూ ఎట్టి జీవహింసకూ పాల్పడను. ఇతరులు మృగాలను చంపి తెచ్చి ఇచ్చిన మాంసాన్ని నేను కొని, కొద్ది లాభాన్ని మాత్రమే చూసుకుని సరైన ధరకి విక్రయిస్తాను. ఆ విధంగా లభించిన ధనం వలన జీవిస్తాను. నా ధనం వలన నాకు మనశ్శాంతి కూడా కలుగుతుంది. అదే నా పరమార్థం.

ఓ పండితోత్తమా! నాగలితో రైతు భూమిని దున్నేటప్పుడు, ఆ నాగలికర్రకు తాకి ఎన్ని జీవాలు చచ్చిపోవడం లేదు? అది హింస కాదని వాదించడానికి వీలున్నదా? తర్జన భర్జనలు అనవసరం. మనుజులు నేలపై నడిచేటప్పుడు కూడా వేలకొద్దీ ప్రాణులు చనిపోతున్నాయి. అది హింస కాదని వాదించడానికి వీలు లేదు కదా! ఈ విషయాన్ని దయచేసి నీవే ఆలోచించి తేల్చుకొనుము'.

ధర్మవ్యాధుడు నేరుగా ఏ హింసకీ పాల్పడలేదు. తనకి వంశపారంపర్యంగా వచ్చిన వృత్తిని మాత్రమే అతడు కొనసాగిస్తున్నాడు. ఎక్కువ లాభాల కోసం ఎవ్వరినీ మోసం చేయకుండా, స్వల్పలాభంతో తాను సంతృప్తిగా జీవనం సాగిస్తున్నాడు, వృత్తిరీత్యా తాను ధర్మంగానే వ్యవహరిస్తున్నాడు. అందువల్ల తాను జీవహింస చేస్తున్నట్టు కాదని ధర్మవ్యాధుడు కౌశికుడికి వివరించాడు. అదే చర్చలో భాగంగా ధర్మవ్యాధుడు పలికిన మాటలు తాము అహింస అసలు చేయమని భావించే ఎంతో మందికి కనువిప్పు కలిగిస్తాయి. కౌశికుడిని సైతం ఆలోచింపజేస్తాయి. సత్యాన్ని ఆవిష్కరిస్తాయి.

మానవుడు వ్యవసాయం చేసే పద్ధతిలో కూడా ఎంతో హింస ఉంది. మనిషి నడిచేటప్పుడు కొన్ని వేల సూక్ష్మజీవులు ఆ భారాన్ని భరించలేక మరణిస్తాయి. కాబట్టి హింస మన జీవన విధానంలో ఒక భాగమని ధర్మవ్యాధుడు కౌశికుడికి వివరిస్తాడు. అయితే, ప్రతీ ఒక్కరు హింస చేస్తూ ఉంటే అది జీవకోటిని నాశనం చేస్తుందనే సందేహాన్ని కౌశికుడు వ్యక్తం చేశాడు. అందుకు ధర్మవ్యాధుడు ఇచ్చిన సమాధానం తరతరాలకి దిశానిర్దేశం చేస్తుంది.

తే. హింస సేయనివాఁడు లేఁ డిజ్జగమున
నొక్కఁడైనను, దమతమ, యోపినట్లు
హింసతెరువున కెడఁగల్గి యేఁగవలయు
నదియ చూవె యహింసనా నతిశయిల్లు. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 60*)

'ఈ లోకంలో హింస చేయనివాడు ఒకడైనా ఉండదు. అయినప్పటికినీ తమకు వీలైనంతమేరకు హింస చేయకయే జీవయాత్ర సాగించాలి. ఆ విధంగా యథాశక్తి ప్రాణిపీడన చేయకయే జీవయాత్ర సాగించాలి. ఆ విధంగా యథాశక్తి ప్రాణిపీడన చేయకపోవడమే 'అహింస' అని చెప్పవచ్చు'.

ధర్మవ్యాధుడి సంభాషణ బట్టీ, ఎవరికి వీలైనంత వారు హింస చేయడాన్ని అదుపు చేసుకోవాలే తప్ప, హింస చేయనివారంటూ ఎవరూ లేరని స్పష్టమౌతోంది. ధర్మవ్యాధుడి సంభాషణ సహేతుకంగా సాగడంతో కౌశికుడు కూడా ఏకీభవించాడు. ధర్మవ్యాధుడు, కౌశికుల సంవాదం ద్వారా వంశపారంపర్యంగా వస్తున్న వృత్తిని చేపట్టడం ధర్మబద్ధమైనదని, హింస అసలే చేయకుండా మానవజీవనం సాగించడం సాధ్యం కాదని స్పష్టమౌతోంది. ఇదే సందర్భంలో 'సలిలము... (*ఆంధ్ర. ఆరణ్య. 5: 58*)', 'పనివాడి... (*ఆంధ్ర. ఆరణ్య. 5: 59*) వంటి పద్యాలు ఉదహరింపదగినవి.

## 5.13. సింహబలీయం: ధర్మాధర్మ వివేచన

తిక్కన రచించిన విరాట పర్వంలోని కీచకవధ (సింహబలీయం) ఘట్టంలో ధర్మాధర్మవివేచన లేకపోవడం వల్ల కీచకుడి ప్రవర్తన ఎంతగా దిగజారిందో గమనించవచ్చు. ద్రౌపది వివాహిత అని తెలిసి, ఆమెకి ఇష్టం లేదని తెలిసి కూడా కీచకుడి ఆమెని వేధిస్తూనే ఉన్నాడు. ధర్మాధర్మ వివేచన అందుకే మనిషికి జీవితంలో ప్రతీ అడుగులోనూ అవసరమని ఈ ఘట్టం ద్వారా తెలుస్తోంది.

క. అని వీడఁగఁ బల్కిన న
మ్మనుజాధముఁ డంతఁ బోక మదనోన్మాదం
బునఁ దన్ను నెదిరి నెఱుఁగక
వనితకు నిట్లనియె గారవంపుఁ బలుకులన్. (*ఆంధ్ర. విరాట. 2: 51*)

ద్రౌపదిని పొందాలని శతవిధాల ప్రయత్నిస్తున్న కీచకుడిని తిక్కన నరాధముడు అని వెరువక... (*ఆంధ్ర. విరాట. 2: 33*)లో, కీచకాధముడు అని తెలిగన్నుగవ... (*ఆంధ్ర. విరాట. 2: 45*)లో, మనుజాధముడు అంటూ ఈ పద్యంలో కీచకుడి పట్ల వాడిన శబ్దాలను గమనిస్తే కీచకుడి ప్రవృత్తి ఎటువంటిదో స్పష్టమవుతోంది. తనపై మోజుపడ్డ కీచకుడిని అన్నా! అని సంబోధించి, కీచకుడికి తన తోబుట్టువులని గుర్తుచేసి, కీచకుడి మనస్సాక్షిని, వ్యక్తిత్వాన్ని ద్రౌపది ప్రశ్నించింది. అన్ని మాటలు చెప్పినా కీచకుడు తిరిగి ద్రౌపది అందాన్ని కీర్తించడం చూస్తే (*ఆంధ్ర. విరాట. 2: 52*) అతడి వ్యక్తిత్వం ఎంతగా దిగజారిందో అర్థమౌతోంది.

కీచకుడికి ధర్మాధర్మవివేచనని పూర్తిగా కోల్పోయి ప్రవర్తిస్తున్నాడనడానికి ఈ సన్నివేశం ఒక ఉదాహరణ. ద్రౌపది మాటలు కీచకుడి మనస్సాక్షిని పదే పదే ప్రశ్నించినా కూడా అతడు తన ప్రవర్తనని మార్చుకోకపోవడం అతడి వినాశనానికి నాంది పలుకుతోంది. కీచకుడి పాత్ర ద్వారా నేటి సమాజం గ్రహించవలసిన సందేశం ఎంతో ఉంది. ఇప్పటికీ ఎక్కడైనా అత్యాచారాలు జరిగితే, అత్యాచారానికి పాల్పడినవాడిని కీచకుడిగా వర్ణించడాన్ని బట్టి చూస్తే కీచకుడి పాత్ర, అతడి దుష్ప్రవర్తన, అతడిని భీముడు వధించిన తీరు నేటికీ ప్రభావాన్ని చూపిస్తున్నాయనేది స్పష్టం. మనిషికి ధర్మాధర్మ వివేచన ఎంత అవసరమో, ఆ వివేచన లేనివాడికి ఎటువంటి దుర్గతి పడుతుందో కీచకుడు మొదలైన దుష్ట పాత్రలు స్పష్టం చేస్తున్నాయి. మన శాస్త్రాల్లో, పురాణాల్లో, కావ్యాల్లో ఉన్న ప్రతికూల, ప్రతినాయక పాత్రలు మనిషికి ఎలా ఉండకూడదో నేర్పిస్తాయి. చెడు మార్గంలో పయనించడం వల్ల మనిషి ఎంతటి వినాశనాన్ని కొనితెచ్చుకుంటాడో ఆయా పాత్రల ద్వారా తరతరాలకి తెలియజెప్పడం, కవుల, పురాణకర్తల ఉద్దేశ్యం.

క. 'చనుఁ జనదని చూడక యం
దని ప్రాఁకులపండ్లు గోయఁ దలఁచుట హితమే?
ముని చెడిన రావణాదుల
విని యెఱుఁగవె యెన్నఁడును వివేకవిహీనా!' (*ఆంధ్ర. విరాట. 2: 58*)

తే. 'ఆయురైశ్వర్య కీర్తుల నపహరించుఁ
బరసతీ సంగమము; ధర్మపథమునందుఁ
బరఁగువారలు పరిహరింపంగఁ గనియు
వినియుఁ దెలియవె యిది దుర్వివేక మగుట. (*ఆంధ్ర. విరాట. 2: 69*)

'పరస్త్రీతోడి పొందు ఐశ్వర్యాన్ని, కీర్తినీ, ఆయుస్సును నశింపజేస్తుందని, ధర్మపరులు దీనిని నిషేధిస్తారని నీవు ఎక్కడా చూచిగాని, వినిగాని ఎరుగవా? అది దుర్వివేకం అని తెలియదా?'

'ఓయీ వివేకం లేని కీచకా! ఈ పని తగునా తగాదా అని ఆలోచించక, అందని చెట్లకు కాసిన పండ్లు కావాలని కోరుకున్నట్లుగా, దుర్లభాలైన వాటిని కోరటం మేలుగాదు. తొల్లి రావణాదులు ఇటువంటి కోర్కెలు కోరి చెడిపోయారని ఎన్నడూ వినలేదా?'

కీచకుడి ప్రవర్తన చూసి విసిగిపోయిన ద్రౌపది, ముందు హితభాషణం చేసి, వినకపోతే తన భర్తల పరాక్రమాన్ని వర్ణించి, తన జోలికి వస్తే మరణం తథ్యమనే విషయాన్ని స్పష్టం చేసింది. అయినా, కీచకుడు వినకపోయేసరికి మనిషికి ధర్మాధర్మ వివేచన అవసరమని రావణుడి కథను ఉదహరించింది. శ్రీరాముడి భార్యయైన సీతని కామించడం వల్ల పరమశివభక్తుడైన రావణుడికి సైతం దుర్మరణం తప్పలేదని హెచ్చరించింది. ధర్మానికి కట్టుబడి ఉండకపోతే భగవంతుడు సైతం మనిషిని కాపాడలేడని మరోసారి కీచకుడికి గుర్తుచేసింది. ధర్మమే అన్నింటికంటే గొప్పదనే విషయాన్ని కీచకుడికి స్పష్టం చేసింది. పరస్త్రీ వ్యామోహం ఎంతటి ఘోరాలపాలు చేస్తుందో వివరించింది. పరస్త్రీ వ్యామోహం కీర్తిని, ఆయుస్సునూ నశింపజేస్తుందంటూ ద్రౌపది కీచకుడికి బుద్ధిచెప్పే ప్రయత్నం చేసింది. కీర్తి నశించాక మనిషి జీవించినా, జీవించకున్నా ఒక్కటేనని, అతడి జీవితం వ్యర్థమనే విషయాన్ని కీచకుడికి గుర్తుచేసింది. (*ఆంధ్ర. ఆది. 8: 31– 32*).

కీచకుడు యుక్తాయుక్త విచక్షణా జ్ఞానాన్ని కోల్పోయి ద్రౌపది పట్ల అమానుషంగా ప్రవర్తిస్తుంటే అతడిని దండించాల్సింది పోయి, స్వార్థానికి లోనై కీచకుడి సోదరి సుదేష్ణ (విరాటుడి భార్య) తాను కూడా కీచకుడికి పరోక్షంగా మద్దతుగా నిలిచింది. ద్రౌపది ఎంతగా ప్రాధేయపడుతున్నా వినకుండా ఆమెని మరింత క్లిష్ట పరిస్థితుల్లోకి నెట్టింది.

ఉ. 'ఆవల వచ్చు నాపదల కన్నిటి కోర్చి లతాంగిఁ గూర్చి కా
కీ వెడ మాటలన్ మరలఁ; డెన్ని విధంబులఁ జూపి చెప్పినం
గావల మైన వీఁడు తగు కార్యము వట్టునె? వీని కెమ్మెయిం
జావు నిజంబు మన్మథునిశాత శరంబులనైన నక్కటా!' (*ఆంధ్ర. విరాట. 2: 78*)

'తర్వాత ఎన్ని ఆపదలు వచ్చినా, ప్రస్తుతానికి సైరంధ్రిని వీడికి కూరిస్తే తప్ప, వట్టి మాటలతో తృప్తిపడి తిరిగిపోయేటట్లు లేదు. మిక్కిలి గర్వం కలవాడు కావున ఎంత చెప్పినా మంచి మాటలు గ్రహించలేడు. వీడు ఎలాగో సైరంధ్రి భర్తలచేత కాకపోయినా, మదన బాణాలచేతైనా చావడం నిజం'.

'తమ్ముడి కొరకు సైరంధ్రిని ఆసవం తెప్పించే మిషతో అతడి ఇంటికి పంపుతానని మాట ఇచ్చింది. ఇంటికి పొమ్మని తొందరపెట్టింది. 'ఆవలవచ్చు నాపదల కన్నిటి కోర్వ'డానికి మానసికంగా సిద్ధమైంది. తమ్ముడికి చావు తప్పదని నిశ్చయించింది. చనిపోయేవాడి చివరి కోరిక

తీర్చబోతున్నట్లుగా జాలిపడింది. **కన్నీటితో పాటు ధర్మదృష్టి కారిపోయింది**. సైరంధ్రికి ఇచ్చిన మాట పక్కనపెట్టింది. వంచనతో తమ్ముడికి తోడ్పడింది'. (*ఆంధ్ర. విరాట. పీ: 45*)

సుదేష్ణ ఈ సందర్భంలో ధర్మాధర్మవివేచన చేసుకోలేకపోయింది. బంధుప్రీతికి లోనై ధర్మదృష్టిని విస్మరించింది. ద్రౌపదికి తానిచ్చిన మాటను జవదాటి ద్రౌపదిని సమస్యల్లోకి నెట్టింది. నిజానికి సుదేష్ణ యుక్తాయుక్త వివేచన చేసుకోలేకపోవడం వల్ల ద్రౌపది సందిగ్ధావస్థలో పడింది. యజమానురాలి ఆజ్ఞకి కట్టుబడాలా? లేక స్వీయధర్మానికి కట్టుబడాలా? అనే ప్రశ్నలు ఎదురైనప్పుడు ద్రౌపది బాధ్యతకే మొగ్గు చూపింది. భగవంతుడిపై తక్కిన భారాన్ని మోపింది. అదే సుదేష్ణకి, ద్రౌపదికి ఉన్న వ్యత్యాసం. ఆ తేడాని తిక్కన స్పష్టంగా వర్ణించి ధర్మాధర్మ వివేచన మనిషికి ఎంత అవసరమో తెలియజేశాడు. భగవంతుడి కృపాకటాక్షాలకి ఎవరు పాత్రులు కాగలరో తెలియజేశాడు.

తే. 'పాండుపుత్రులకేను తప్పని మనంబు
గలుగుదాననయేని నో కమలమిత్ర!
కీచకుని దెస న న్నొక కీడు తెరువు
వొరయకుండఁగ రక్షింపు కరుణతోడ.' (*ఆంధ్ర. విరాట. 2: 109*)

క. తరణియు దుఃఖితయగు న
త్తరుణిం గాచుటకు నత్యుదగ్రభుజావి
స్ఫురణాఢ్యు నొక్క రక్కసుఁ
గరుణా ర్ద్రమనస్కుఁ డగుచు గ్రక్కునఁ బనిచెన్. (*ఆంధ్ర. విరాట. 2: 110*)

'ఓ సూర్యభగవానుడా! నేను పాండవులను తప్ప ఇతరులను భర్తలుగా భావించని పతివ్రతనైతే నాకు కీచకుడి వలన ఎటువంటి అపాయం జరిగే దారులేర్పడకుండా దయతో రక్షించుము.'

ద్రౌపది మొర విన్న సూర్యుడు దయాంతరంగంతో ఆమెను రక్షించడానికి బాహుబలాఢ్యుడైన ఒక రాక్షసుడిని పంపాడు.

'ద్రౌపది మహాభక్తురాలు. ఒకసారి భగవంతుడిని సమాహితచిత్తంతో స్మరిస్తే ఆయన వెంటనే ప్రసన్నుడౌతాడు. ఆమెకు శ్రీకృష్ణుడే శ్రీమన్నారాయణుడు. ఆమె హరినామస్మరణం ఆపదల నుండి కాపాడుతుందని గాఢమైన విశ్వాసం కలది. "యద్భావం తద్భవతి". ఆమె మనఃపద్మంలో

పుండరీకాక్షుడిని స్థిరంగా నిలుపుకున్నది. ఆమె మనసు పుండరీకం. ఆ దేవుడి చూపు పుండరీకం, అతడి కరుణ ఆమె పట్ల ఉండడం సహజసిద్ధం అని ధ్వని'. (*ఆంధ్ర. విరాట. 2. పుట: 202*)

ద్రౌపది ఎప్పుడూ కలలో కూడా తన భర్తలను తప్ప ఎవరి గురించి ఆలోచన కూడా చేయని మహాపతివ్రత. స్వధర్మానికి కట్టుబడిన సాధ్వి. ఎంతటి క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనా, స్వధర్మాన్ని ఎప్పుడూ విడిచిపెట్టలేదు. తన వ్యక్తిత్వాన్ని భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా నిర్మించుకుంది. ద్రౌపదిది గొప్ప మనోనిగ్రహం, ఇంద్రియనిగ్రహం కలిగిన వ్యక్తిత్వం. భగవంతుడి కృపాకటాక్షాలు పొందేందుకు అన్ని అర్హతలు ద్రౌపదికి ఉన్నాయి. అందుకే, తనకి ఎదురైన క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొనేందుకు సూర్యభగవానుడిని ప్రార్థించింది. "ధర్మోరక్షతి రక్షితః" అన్న వేదవాక్కు నిజమయ్యేలా సూర్యభగవానుడు ద్రౌపదిని రక్షించడానికి ఒక రాక్షసుడిని వెంట పంపించాడు.

ధర్మానికి కట్టుబడినవాళ్లకి భగవంతుడి కరుణ ఎప్పుడూ తోడుగా ఉంటుందనేది ఈ సంఘటనతో మరోసారి రుజువయ్యింది. ఎన్ని కష్టాలు వచ్చినా గుండె దిటవు చేసుకొని ధర్మానికే కట్టుబడితే ఆ ధర్మమే మనిషిని రక్షిస్తుంది అనే సందేశం ఈ ఘట్టంలో లభిస్తోంది. ద్రౌపదికి మరింత న్యాయం చేకూరింది అనడానికి కథలో రాబోతున్న భీమ, సింహబలుల యుద్ధమే సాక్ష్యం.

## 5.14. ధర్మ సంఘర్షణ

ధర్మాధర్మాలకి సంఘర్షణ ఏర్పడితే మనిషి ధర్మం వైపు నిలబడాలి అనేది స్పష్టమయ్యింది. అయితే, రెండు ధర్మాల మధ్య సంఘర్షణ ఏర్పడితే మనిషి ఎటువైపు మొగ్గు చూపాలి అనే సందిగ్ధత ఏర్పడినప్పుడు అనుసరించదగిన పరిష్కార మార్గాలను ఆంధ్ర మహాభారతంలో పలు ఘట్టాల ఆధారంగా కవిత్రయం తెలుగు జాతికి అందించారు.

### 5.14.1. జరత్కారుడి కథ

ఆదిపర్వంలో వర్ణించబడిన ఉపకథల్లో ఒక అద్భుతమైన కథ జరత్కారుడి కథ. జరత్కారుడి భార్య జరత్కారువు. ఎప్పుడైనా తనకి కోపం తెప్పిస్తే విడిచి వెళ్లిపోతానని భర్త జరత్కారువుకి వివాహానికి ముందే చెప్పాడు. అయితే, ఒక క్లిష్ట పరిస్థితిలో జరత్కారువు రెండు ధర్మాల మధ్య

సంఘర్షణ ఏర్పడడంతో సందిగ్ధంలో పడుతుంది. ఆ సమయంలో ఆమె తీసుకున్న నిర్ణయం యావద్భారతజాతికి చిరస్మరణీయమైన సందేశాన్నిస్తుంది.

సీ. 'సంధ్యలం దొనరించు సద్విధుల్ గడచిన /ధర్మలోపం బగుఁ దడయ కేల
బోధింప వై తని భూసురప్రవరుండు /పదరునో, బోధింపఁబడి యవజ్ఞ
దగునె నా కిట్లు నిద్రాభంగ మొనరింప /నని యల్గునో, దీని కల్గెనేని
యలుకయ పడుదుఁ గా, కగునె ధర్మక్రియా /లోపంబు, హృదయంబులో సహింప'

ఆ. నని వినిశ్చితాత్మ యై నిజపతిఁ బ్రబో
ధించె; మునియు నిద్ర దేఱి యలిగి
'యేల నిద్రఁ జెఱిచి తీవు' నావుడు జర
త్కారు విట్టు లనియెఁ గరము వెఱచి. (*ఆంధ్ర. ఆది. 2: 157*)

క. 'ఇనుఁ డస్తమింపఁ బోయిన
ననఘా! బోధింపవలసె' ననవుడు, 'నామే
ల్కను నంతకు నుండక యినుఁ
డొనరఁగ నస్తాద్రి కేఁగ నోడఁడె చెపుమా!' (*ఆంధ్ర. ఆది. 2: 158*)

'సంధ్యాకాలాల్లో చేయవలసిన సత్కర్మలు లోపిస్తే ధర్మభంగం అవుతుంది. ఆలస్యం చేయక ఎందుకు నన్ను మేల్కొల్పవయ్యావు అని బ్రాహ్మణ శ్రేష్ఠుడైన జరత్కారుడు కోపిస్తాడో? మేలుకొల్పబడి అవమానంగా భావించి నాకీవిధంగా నిద్రకు ఆటంకం కలిగించటం తగునా? అని కోపిస్తాడో! ఒకవేళ మేల్కొల్పినందుకు కోపిస్తే కోపాన్నే భరిస్తాను గాక! ధర్మకార్యానికి లోపం హృదయంలో సైపదగునా' అని హృదయంలో నిశ్చయించుకుని జరత్కారువు తన భర్తను మేల్కొల్పింది. జరత్కారుడు నిద్ర నుండి మేల్కొని కోపించి 'నీవు ఎందుకు నాకు నిద్రాభంగం చేశావు?' అని అనగా జరత్కారువు మిక్కిలి భయపడి ఇలా పలికింది'.

'ఓ పాపరహితుడా! సూర్యుడస్తమించడానికి సిద్ధంగా ఉండగా, ధర్మకార్యాచరణకి లోపం కలుగుతుందని నిన్ను మేల్కొల్పవలసి వచ్చిం'దని ఆమె అనగా, జరత్కారుడు, నేను మేల్కొనేంతవరకు అస్తమించకుండా ఉండక సూర్యుడు పడమటికొండకు వెళ్లడానికి భయపడడా! చెప్పుము' (అని పలికాడు).

జరత్కారుడు అనే ముని వృత్తాంతంలో భాగంగా ఈ అద్భుతమైన సన్నివేశం వర్ణించబడింది. ఇక్కడ సాధ్వియైన జరత్కారువు మనస్సులో ధర్మ సంఘర్షణ కలిగింది. భర్త నిద్రపోతున్నాడు. సంధ్యాసమయం అయ్యింది. సంధ్యాసమయంలో చేయవలసిన కర్మలు చేయకపోతే ధర్మలోపం అవుతుంది. భర్తయైన జరత్కారుడు గొప్ప ధర్మనిష్ఠ కలవాడు. నిద్ర లేపకపోతే ఆగ్రహిస్తాడు. అలా అని నిద్ర లేపితే నిద్రాభంగం అయ్యిందని కోపించే అవకాశం లేకపోలేదు. గొప్ప సందిగ్ధావస్థలో జరత్కారువు చిక్కుకుంది. రెండూ ధర్మబద్ధమైన విషయాలే. కానీ, జరత్కారువు బాగా ఆలోచించి వైదిక ధర్మంవైపే నిలబడింది. భర్త సుఖంగా నిద్రపోవడం కంటే, అతడు ఆచరించవలసిన ధర్మం ప్రధానమని నమ్మింది. ఈ నిర్ణయం ఆమె వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైందో తెలియజేస్తుంది. భర్త సుఖంగా నిద్రించడం తన మనస్సుకి ఇష్టమైన విషయం. కానీ, అతడు లేచి నిత్యోచిత కర్మలను ఆచరించడం ధర్మం. ఇష్టానికి, ధర్మానికి మధ్య తన మనస్సులో జరిగిన సంఘర్షణలో జరత్కారువు ధర్మంవైపే మొగ్గు చూపింది. వ్యక్తిగతమైన ఇష్టాల కంటే ధర్మం ముఖ్యమనే విషయాన్ని తెలియజేసింది.

స్వార్థం కంటే ధర్మం గొప్పదనే విషయం ఈ సన్నివేశం ద్వారా తెలుస్తోంది. మనిషి ఎల్లప్పుడూ ధర్మానికే కట్టుబడి ఉండాలని, బంధాలు – బంధుత్వాల కంటే కూడా ధర్మం గొప్పదని, ధర్మానికి కట్టుబడి ఉండేవారి పేరు చరిత్రలో చిరస్థాయిలో నిలిచిపోతుందనే విషయాన్ని ఈ సన్నివేశం ఋజువుచేస్తోంది. భర్త ఆగ్రహిస్తే తనని విడిచి వెళ్లిపోతాడనే విషయం తనకి తెలిసి ఉండి కూడా, జరత్కారువు ధర్మానికే కట్టుబడి నేటి తరానికి ఆదర్శంగా నిలిచింది. "ఆమెలోని ధర్మచింతన ప్రవృత్తి ఆమె సంతానమైన ఆస్తీకునిలో ప్రతిఫలిస్తుందని వస్తుధ్వని" (*ఆంధ్ర. ఆది. 2. పుట: 164*).

పరమసాధ్వియైన జరత్కారువు ధర్మనిష్ఠ ఒక ఎత్తైతే, సాక్షాత్తు ఋషిపుంగవుడైన జరత్కారుడి యొక్క ధర్మనిష్ఠ మరొక ఎత్తు. ధర్మానికి లోపం కలుగుతుందేమోనని తనని నిద్ర లేపిన భార్యతో జరత్కారుడు పలికిన మాటలు అతడి ధర్మనిష్ఠ పట్ల అతడికున్న అపారమైన విశ్వాసాన్ని తెలియజేస్తాయి. 'నేను చేయవలసిన నిత్యోచితకర్మలు చేయకుండా, నేను అర్ఘ్యం సమర్పించకుండా అస్తమించడానికి సూర్యుడు సాహసిస్తాడా!' అని జరత్కారుడు అంటాడు. ఈ మాటలు అటు భార్యయైన జరత్కారువును, ఇటు పాఠకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తాయి. భార్య, భర్త ఇద్దరూ అనితరసాధ్యమైన ధర్మనిష్ఠ కలిగినవారే. ఆ ప్రభావం వారి కుమారుడైన ఆస్తీకుడిపై కనిపిస్తుంది.

## 5.14.2. అర్జునుడి ధర్మాధర్మవివేచన

పాండవులు వారి మధ్య విధించుకున్న సమయ నిబంధనను అత్యవసర పరిస్థితిలో తప్పిన అర్జునుడి ధర్మాధర్మవివేచన ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

ఆ. క్రూర కర్ము లయ్యు గో బ్రాహ్మణుల కగు
బాధ లుడుచుజనులఁ బాపచయము
లెట్టియెడలఁ బొంద వింద్రనందన! నీకు
సమయభంగభీతిఁ జనఁగ నేల? (*ఆంధ్ర. ఆది. 8: 121*)

'అర్జునా! ఎంత దుర్మార్గులైనా ఆవులకు, బ్రాహ్మణులకు కలిగిన బాధలను తొలగించే జనులను, పాపాలు ఎటువంటి చోట్ల కూడా పొందవు. అట్లాంటప్పుడు నీవు నియమ భంగం అయిందన్న భయంతో పోవడం ఎందుకు?'

నారదుడి సూచన మేరకు పాండవులు వాళ్లలో వాళ్లకి ఎటువంటి గొడవలూ రాకుండా ద్రౌపది విషయంలో ఒక నిబంధనని ఏర్పరుచుకున్నారు. ఆ నియమానికి ఎవరైనా భంగం కలిగిస్తే అతడు ఏడాది పాటు తీర్థయాత్రలకు వెళ్లడానికి అంగీకరించాలని షరతు విధించుకున్నారు. ఆ మేరకు నారదుడి ఎదుట ప్రమాణం కూడా చేశారు.

ఒకరోజు ఒక విప్రుడు అర్జునుడి వద్దకు వచ్చి, తన హోమధేనువుని ఎవరో తస్కరించారని, ఎలాగైనా విడిపించమని వేడుకుంటాడు. అయితే, ఆయుధాలు ఉండే చోటు ధర్మరాజు, ద్రౌపదుల ఏకాంత మందిరం వద్ద ఉంది. అటు వెళ్తే నియమాన్ని ఉల్లంఘించినట్లు అవుతుంది. వెళ్లకపోతే, శరణు వేడిన విప్రుడిని రక్షించనందుకు క్షత్రియ ధర్మాన్ని తప్పినట్టు అవుతుంది. ఇంతటి సందిగ్ధావస్థలో అర్జునుడు విప్రుడి గోవునే కాపాడాలని నిర్ణయించుకుంటాడు. ఆ పని పూర్తి చేసి, తనకి తానే తీర్థయాత్రలకు వెళ్లాలని శిక్ష విధించుకుంటాడు. అర్జునుడి నిజాయితీకి ఆశ్చర్యపోయిన పాండవులు, ద్రౌపది పెద్ద మనస్సుతో అర్థం చేసుకుని, క్షమించాలని నిర్ణయించుకుంటారు. కానీ, మాట తప్పడానికి ఇష్టపడని అర్జునుడు, పాండవులకి ఎప్పుడూ చెడ్డపేరు రావద్దని, తన నిర్ణయానికే కట్టుబడతాడు. తాను ఎంత ధర్మపరుడో ఋజువుచేసుకుంటాడు.

రెండు ధర్మాల మధ్య అర్జునుడు తీసుకున్న నిర్ణయం చిరస్మరణీయంగా నిలిచిపోతుంది. స్వార్థం కంటే పరమార్థం గొప్పదని తెలియజేస్తుంది. అర్జునుడు, కేవలం ధర్మాధర్మవివేచన

కలిగినవాడిగానే కాదు, ఇరువైపులా ధర్మమే ఉన్నా కూడా తాను పారమార్థికమైన ధర్మానికే కట్టుబడి నేటి తరానికి ఆదర్శప్రాయుడిగా నిలిచాడు.

## 5.14.3. శిబి చక్రవర్తి కథ

ఆరణ్యపర్వంలో వచ్చే శిబిచక్రవర్తి కథ ధర్మాధర్మ వివేచన విషయంలో ఏర్పడే ఎన్నో సందేహాలను నివృత్తి చేస్తుంది. ధర్మాధర్మాల విషయంలో మనిషి ఎప్పుడూ ధర్మానికే కట్టుబడాలనేది తెలిసినదే. అయితే రెండు ధర్మాల విషయంలో చర్చ ఏర్పడితే ఎలాంటి నిర్ణయం తీసుకోవాలో శిబి చక్రవర్తి కథ ద్వారా తెలుసుకోవచ్చు.

క. ధర్మజ్ఞు లైన పురుషులు
ధర్మువునకు బాధ సేయు ధర్మువునైనన్
ధర్మముగా మదిఁ దలఁపరు;
ధర్మువు సర్వంబునకు హితంబుగ వలయున్. (*ఆంధ్ర. ఆరణ్య. 3: 230*)

'ధర్మస్వరూపాన్ని ఎరిగిన జ్ఞానులు ధర్మానికి ఏమాత్రం కీడు కలిగించే ధర్మాన్నైనా, ధర్మంగా మనస్సులో భావించరు. అచ్చమైన ధర్మం జగత్తు కంతటికీ మేలు చేకూర్చాలి'.

శిబి చక్రవర్తి యొక్క గుణగణాలను పరీక్షించడానికి ఒకరోజు అగ్ని ఒక పావురం రూపంలో, ఇంద్రుడు ఆ పావురాన్ని వేటాడే డేగ రూపంలో భువికి వచ్చారు. పావురం శిబి చక్రవర్తి శరణు వేడింది. ఆశ్రయం కోరినవారిని రక్షించడం మనిషి కర్తవ్యం, అందునా రాజుకి పరమ ధర్మం. కానీ, డేగకి పావురం ప్రకృతి విధించిన ఆహారం. డేగ ఆహారానికి అడ్డు పడడం ధర్మం కాదు. క్షత్రియులకి ఇది బాగా తెలిసిన విషయం. ఈ పరిస్థితిని కల్పించి శిబి చక్రవర్తిని సందిగ్ధావస్థలోకి నెట్టారు ఇంద్రుడు, అగ్ని.

శిబి చక్రవర్తితో డేగ సృష్టి ధర్మాన్ని గురించి గొప్ప భాషణం చేసింది. చక్రవర్తి ఆలోచించి, అతడిని ఆశ్రయించిన పావురాన్ని తప్ప అడవిలో వేరే ఎటువంటి ఆహారాన్నైనా తెచ్చి సమకూరుస్తానని డేగకి మాటిచ్చాడు. అందుకు బదులుగా, పావురం బరువుతో సమానమైన తన శరీరమాంసం ఇవ్వాలని డేగ ప్రతిపాదించింది. ఆశ్చర్యకరంగా శిబి చక్రవర్తి అందుకు అంగీకరిస్తాడు. వెంటనే తన తొడ భాగంలో మాంసాన్ని కోసి తూకం వేస్తాడు. ఎంతకీ తూకం

సరిపోకపోవడంతో తానే తక్కెటలో కూర్చుంటాడు. ఒక పావురం ప్రాణం కాపాడడం కోసం ఆత్మార్పణ భావాన్ని ప్రదర్శించిన శిబి చక్రవర్తి తెగింపుకి దేవతలు దసోహమౌతారు. అతడి కీర్తి, మానవులు శబ్ద బ్రహ్మ ఉపాసన చేసినంతకాలం చిరస్థాయిలో మిగిలిపోతుందని ఆశీర్వదించి వెళ్లిపోతారు.

శిబి చక్రవర్తి చేసిన త్యాగం వల్ల అటు ఆశ్రయం కోరుకున్న పావురాన్ని కాపాడినట్లైంది, ఇటు డేగకి మాంసాన్ని సమకూర్చినట్లైంది. అంతిమంగా ప్రాణాలు పణంగా పెట్టైనా సరే, శరణు వేడిన వారిని రక్షించడమే పరమ ధర్మమని శిబి చక్రవర్తి కథ ద్వారా స్పష్టమౌతోంది.

## 5.14.4. ధర్మవ్యాధుడి కథ

ఆరణ్యపర్వంలో, ఎర్రన రచించిన భారత భాగంలో అత్యంత ప్రాచుర్యాన్ని పొంది, అశేష పాఠకులను విశేషంగా అలరించిన ఘట్టం ధర్మవ్యాధోపాఖ్యానం. కౌశికుడు అనే మహాముని ఉదరపోషణార్థం భిక్షాటనకి బయలుదేరతాడు. ఒక ఇంటికి వెళ్లి భిక్షం అడుగుతాడు. ముందు కౌశికుడికి ఇవ్వడానికి ఆహారాన్ని సిద్ధం చేసిన ఆ ఇంటి పతివ్రత, తన భర్త రాకని గమనించి, ముందు అతడికి సపర్యలు చేసి, ఆహారం సిద్ధం చేసి, అతడు విశ్రమించిన తర్వాత కౌశికుడి వద్దకి వచ్చి భిక్ష ఇవ్వడానికి సిద్ధమౌతుంది. అయితే, భిక్ష అడిగి చాలా సమయం అవ్వడంతో కౌశికుడు ఆగ్రహిస్తాడు. అప్పుడు కౌశికుడికి ఆమె చెప్పిన సమాధానం గొప్ప చర్చకి తెరతీస్తుంది.

తే. పతియచూవె నాపాలికిఁ బరమదైవ;
మేను వాఙ్మనఃక్రియలఁ దద్ధితమ యెపుడుఁ
గోరి యొనరింతు; దీని మిగులఁగ నొండు
ధర్మవులు గాన నెందును దలఁచి చూచి. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 21*)

'నా దృష్టిలో నాపాలికి గొప్ప దేవుడు నా భర్త మాత్రమే. నేను త్రికరణశుద్ధిగా, మనస్సు చేత, మాటల చేత, కర్మల చేత, నా పతి శ్రేయస్సునే కాంక్షిస్తాను. ఆ విధంగానే నా ఆచరణను తీర్చిదిద్దుకుంటాను. ఎంత ఆలోచించి తరచి చూసినా, ఇంతకంటే గొప్ప ధర్మాలు నాకు కనిపించడం లేదు సుమా!'

ఈ కథలో పతివ్రత రెండు ధర్మాలలో ఉన్నతమైన ధర్మాన్ని ఎంచుకుంది. అపారమైన జ్ఞాన సంపదతో, తపశ్శక్తితో తన ఇంటి ముందు భిక్ష నిమిత్తం ఎదురుచూస్తున్న కౌశికుడు ఒకవైపు, రోజంతా పని చేసుకుని, అలిసిపోయి అప్పుడే ఇంటికి తిరిగి వచ్చిన భర్త మరొకవైపు. కౌశికుడు ఆగ్రహిస్తే పరిస్థితి ఏమౌతుందో ఆ పతివ్రతకి తెలుసు. కానీ, పతిని సేవించడాన్ని మించిన ధర్మాన్ని ఆమె ఎరుగదు. అందుకే, భర్తని సేవించడానికే ఆమె మొగ్గు చూపింది. భర్తని త్రికరణశుద్ధిగా ప్రేమించడం మాత్రమే ఆమెకి తెలిసిన పరమధర్మం. ఆ ధర్మమే తనని రక్షిస్తుందని ఆమె విశ్వాసం. పైగా, కౌశికుడికి కోపం ఎక్కువని ఆమెకి తెలుసు. అయినా కూడా ఆమె తన పాతివ్రత్యధర్మానికే కట్టుబడింది. ఆమె చర్యకి ఆగ్రహించిన కౌశికుడిని ఆశ్చర్యపరుస్తూ, కౌశికుడు ఇంతకు ముందు కోపంతో ఒక కొంగని దగ్ధం చేసిన సంగతి అతడికి గుర్తుచేసి, ఆ పతివ్రత కౌశికుడిని ఆశ్చర్యంలో ముంచెత్తింది. కోపాన్ని తగ్గించుకోమని కౌశికుడికి హితవు పలికింది. పాతివ్రత్య ధర్మాన్ని మించిన ధర్మం లేదని నిర్ధారణ చేసింది.

## 5.14.5. యుద్ధరంగంలో ధర్మాధర్మవివేచన

అజ్ఞాతవాస కాలం ముగిశాక, ఆకలిగొన్న సింహంలా గర్జిస్తూ యుద్ధరంగంలోకి అడుగుపెట్టిన అర్జునుడికి విచిత్రమైన పరిస్థితి ఏర్పడింది. గోవులను విడిపించడమే అర్జునుడి లక్ష్యమైనా, దుర్యోధనుడిపై అర్జునుడు దండెత్తడం చూసి, భీష్మ, కృప, ద్రోణులు సైతం యుద్ధానికి సిద్ధపడ్డారు. అర్జునుడు మహావీరుడైన కర్ణుడిని సైతం బెదరగొట్టి యుద్ధరంగం నుండి పారిపోయేలా చేశాడు. తప్పనిసరి పరిస్థితుల్లో తనకి ధనుర్విద్య నేర్పించిన ద్రోణాచార్యుడిని ఎదుర్కోవలసివచ్చింది. అటువంటి పరిస్థితిలో అర్జునుడు పడ్డ సంఘర్షణని ఈ పద్యం ఆవిష్కరించింది.

క. 'తన తనయుకంటె నెమ్మన
 మున నాకుం గూర్చు భావమున, గురులకు మా
 ర్కొనియెదము; రాచధర్మం
 బున కీడునఁ జేసి యింత పుట్టఁగ వలసెన్ .(*ఆంధ్ర. విరాట. 5: 120*)

'తన కొడుకైన అశ్వత్థామ కన్నా మిన్నగా నన్నాదరించి చదువు చెప్పాడు. గురువుగారినే ఎదుర్కొనవలసి వస్తున్నది. ఇది రాజధర్మంలోని కీడు. దాని మూలాన ఇలా చేయవలసి వస్తున్నది'.

ద్రోణుడు తన కొడుకైన అశ్వత్థామ కంటే, శిష్యుడైన తననే ఎక్కువగా అభిమానించేవాడని అర్జునుడు పేర్కొనడం, ఆ గురుశిష్యుల మధ్య సంబంధం ఎంత ఆత్మీయంగా ఉందో సూచిస్తోంది. నిజానికి అర్జునుడు గురువైన ద్రోణుడిపై యుద్ధం చేయాలని ఎప్పుడూ అనుకోలేదు. ఈ ఘట్టంలో యుద్ధం ప్రారంభం కాక ముందు అర్జునుడు వినమ్రపూర్వకంగా ద్రోణుడి పాదాల వద్ద రెండు నమస్కార బాణాలు వేశాడు. తర్వాత చెవులకి తాకీ తాకనట్లుగా మరో రెండు బాణాలు వేసి కుశలమడిగాడు. యుద్ధంలో ఎక్కడ ద్రోణుడు ఎదురుపడినా గురువుగారికి కుడివైపు నుండి దారి ఇచ్చి తన విధేయతని చాటుకున్నాడు. తనంతట తాను ద్రోణుడిపై బాణం వేయనని, ఆయన వేస్తే సమాధానం చెప్పక తప్పదని, అది యుద్ధధర్మమని అర్జునుడు ఉత్తరుడితో ముందే పేర్కొన్నాడు. తన వ్యూహం ప్రకారం అర్జునుడు ముందుగా గోవులను మరలించాడు. దుర్యోధనుడిపై దండెత్తాడు. ఆ క్రమంలో అడ్డు వచ్చినవారిని మాత్రమే ఎదుర్కొన్నాడు. ఇప్పుడు అదే క్రమంలో ద్రోణుడు ఎదురయ్యాడు. ఒకవైపు గురుభక్తి, మరొకవైపు రాజధర్మం. రెండూ ధర్మాలే. కానీ, అప్పటి పరిస్థితికి ఆచరించవలసిన ధర్మం రాజ ధర్మం.

ద్రోణుడే స్వయంగా అర్జునుడికి యుద్ధంలో పాటించవలసిన రాజధర్మాలను నేర్పించాడు. గురువు నేర్పించిన ధర్మాన్ని గురువుపట్ల ఆచరించవలసి వచ్చినందుకు అర్జునుడు ఎంతో చింతించాడు. అంతిమంగా రాజధర్మానికి కట్టుబడ్డాడు. అర్జునుడి యుద్ధనీతి, వినయవిధేయతలు, గురుభక్తి చూసి ద్రోణాచార్యుడు ఎంతగానో మనస్సులో గర్వించాడు.

"ద్రోణుడు బ్రహ్మశిరోనామక మహాస్త్రాన్ని అర్జునాశ్వత్థామల కిరువురికిచ్చినా, అశ్వత్థామకు ఉపసంహారం చెప్పలేదు. శిష్యుడికి మాత్రమే చెప్పాడు. అటువంటి వాత్సల్యమూర్తి అయిన గురుమూర్తిపై కోదండం ఎత్తవలసి వచ్చినందుకు అర్జునుడు విచారించాడు. కానీ, రాజధర్మాన్ని అనుసరించి యుద్ధం చేయక తప్పడం లేదని పేర్కొన్నాడు. అర్జునుడి అంతస్సంఘర్షణని చిత్రించిన పద్యమిది" *(ఆంధ్ర. విరాట. 5. పుట: 606).*

## 5.15. ముగింపు

ధర్మాధర్మ వివేచన మనిషికి మాత్రమే భగవంతుడు ఇచ్చిన వరం. మనిషికున్న ధర్మాధర్మ వివేచన/ యుక్తాయుక్త విచక్షణ తోటి మనుషుల పట్ల ఉన్న బాధ్యతనే కాదు, తోటి జీవుల పట్ల ఉన్న బాధ్యతని సైతం గుర్తు చేస్తుంది. ధర్మ మార్గానికి, అధర్మ మార్గానికి ఉన్న వ్యత్యాసాన్ని కవిత్రయ భారతంలోని సాహిత్యం ప్రస్ఫుటంగా ధ్వనింపజేస్తూనే నేటి సమాజాన్ని జాగృతం చేస్తుంది. ఆధునిక సమాజంలో ఎదురౌతున్న సవాళ్లకి సైతం తట్టుకునే విధంగా ఈ సాహిత్యం మనిషిని సిద్ధం చేస్తుంది.

ఆంధ్ర మహాభారతంలోని మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాల ఆధారంగా ధర్మాధర్మ వివేచన ఎలా చేసుకోవాలో ఈ అధ్యాయంలో వివరించబడింది. నాలుగు పర్వాలలో ఈ దృక్కోణానికి సంబంధించిన సాహిత్యాన్ని సాధ్యమైనంత సమగ్రంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఉదహరించినవి కొన్నే అయినా, మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి. కేవలం, నాలుగు పర్వాలలో ఇన్ని ఉదాహరణలు పరిశోధన దృష్టికి దర్శనమిస్తే, మొత్తం ఆంధ్ర మహాభారతంలో మరెన్నో ఉదాహరణలు దొరికే అవకాశం ఉంది.

# అధ్యాయం – 6

# ఆంధ్ర మహాభారతం: నిర్వహణ సామర్థ్యం

## 6.1. ఉపోద్ఘాతం

ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని, దాని వైపు అడుగులు వేస్తూ, మధ్యలో ఎదురయ్యే సవాళ్లను అధిగమిస్తూ అంతిమంగా లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో మనిషికి ఉపయోగపడే సాధనం/ శక్తి నిర్వహణ సామర్థ్యం. ఈ శక్తి ప్రతీ మనిషిలోనూ ఉంటుంది. వ్యక్తులు ఏయే రంగంలో ఉన్నా ఆయా రంగాల్లో అభ్యున్నతిని సాధించేందుకు నిర్వహణ సామర్థ్యం ఎంతో అవసరం.

ఒక పని చేయించే బాధ్యతని తీసుకున్న యజమాని, ఎవరితో ఏ విధంగా వ్యవహరించాలో అలా వ్యవహరిస్తూ, మొత్తం మీద తన తెలివితేటలతో ఆ పనిని పూర్తి చేయడం కూడా నిర్వహణ సామర్థ్యమే అవుతుంది. కాస్త లోతుగా జీవితాన్ని గమనిస్తే, ఎన్నో ఒడుదిడుకులు ఎదురౌతున్నా నిర్దేశించుకున్న లక్ష్యం కోసం కష్టపడుతూ జీవనాన్ని సాగించడమూ నిర్వహణ సామర్థ్యమే.

ఒక కుటుంబంలో ఉంటున్న అందరు వ్యక్తులకీ తగినట్టుగా నడుచుకుంటూ, ఎవరికి కావలసింది వారికి ఏర్పాటు చేస్తూ, అందరి బాగోగుల కోసం ఒక గృహిణి పడే తపన కూడా నిర్వహణ సామర్థ్యమే. ఇలా సమాజమనే కుటుంబంలో నిర్వహణ సామర్థ్యానికి అడుగడుగునా ఒక నిర్వచనం కనిపిస్తుంది. నిర్వహణ సామర్థ్యం లేనిదే ఏ పనీ సక్రమంగా అవ్వదు. ప్రతీ కార్యసాధకుడి తోడు నిర్వహణ సామర్థ్యమే.

వ్యక్తిగత జీవిత నిర్వహణ, కుటుంబ నిర్వహణ, సంస్థల నిర్వహణ ఇలా ప్రతీ కార్యానికి నిర్వహణ సామర్థ్యమే ఇంధనం. మొత్తంగా చూసుకుంటే నిర్వహణ సామర్థ్యం సమాజ పురోగతిని నిర్దేశించే అత్యంత ముఖ్యమైన సామాజికాంశంగా కనిపిస్తుంది. సామాజిక వ్యవస్థలో ప్రతీవ్యక్తికీ అవసరమైన నిర్వహణ సామర్థ్యాన్ని ఎలా పెంపొందించుకోవాలో, ఎలా ఉపయుక్తంగా మలుచుకోవాలో చెప్పేందుకు ఆంధ్ర మహాభారతంలో ఎన్నో ఘట్టాలు, ఎన్నో పాత్రలు ఆదర్శంగా నిలుస్తాయి.

మనిషి 'తలలో నాలుక' లాగా చురకత్తుల లాంటి సవాళ్లు, సమస్యలు బాధిస్తున్నా నిర్వహణ సామర్థ్యం అనే సాధనంతో ఎలా విజయతీరాలను చేరుకోవచ్చో ఆంధ్ర మహాభారతం ఎన్నో కథల, ఎన్నో ఉదాహరణల ఆధారంగా తరతరాలకి అందించింది.

## 6.2. గరుత్మంతుడి కార్యనిర్వహణ

ఆదిపర్వంలో వర్ణించబడిన గరుత్మంతుడి కథలో, గరుత్మంతుడు తన తల్లికి దాస్యవిముక్తి చేయడం కోసం స్వర్గలోకానికి వెళ్లి అమృతాన్ని తీసుకురావడానికి సిద్ధపడతాడు. ఈ ప్రయత్నంలో భాగంగా అతడు వేసిన ప్రతీ అడుగు అతడి నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపిస్తుంది.

వ. 'ఇగ్గరుడండు భువనహితమహారంభుండు బలసమన్వితుండు, మీకు బాధయగునని యిత్తరుశాఖ విడువనేరకున్న వాఁడు; వీనిం గరుణించి మీరొండుకడ కరుగుం' డనిన వాలఖిల్యులు కశ్యపుప్రార్థనం జేసి దాని విడిచి హిమవంతంబునకుం జనిరి; గరుడండును ముఖనిక్షిప్తశాఖాస్ఖలితవచనుం డగుచుఁ దండ్రి కిట్లనియె. (*ఆంధ్ర. ఆది. 2: 75*)

వ. 'ఏను మదీయమాతృదాసీత్వనిరాసార్థం బురగుల కమృతంబుఁ దెచ్చియిత్తు నని కాద్రవేయులతో నొడివి వచ్చినవాఁడ; నీ యమృతంబు గొనిపోయి వారల కిచ్చి మదీయజననీదాస్యంబుఁ బాచికొనిన, నురగు లీ యమృతం బుపయోగింపకుండ ముందఱ నీవు గొనిచను' మనిన, నగ్గరుడని మహానుభావంబునకు మెచ్చి 'నీబలపరాక్రమంబులు వినవలతుం జెప్పు' మనిన నయ్యింద్రునకు గరుడం డి ట్లనియె. (*ఆంధ్ర. ఆది. 2:111*)

"ఈ గరుత్మంతుడు లోకాలకు మేలుచేసే గొప్ప ప్రయత్నం కలవాడు, బలంతో కూడినవాడు. మీకు బాధకలుగుతుందని నోటితో కరుచుకుని ఉన్న ఈ చెట్టుకొమ్మను విడువజాలకున్నాడు. వీడిని అనుగ్రహించి మీరు ఇంకొకచోటికి వెళ్లండి' అని పలుకగా వాలఖిల్యమునులు కశ్యపుడి వేడుకోలుతో ఆ కొమ్మను విడిచి హిమవత్పర్వతానికి వెళ్లారు. గరుడుడు ముఖంలో ఉంచబడిన కొమ్మచేత తొట్రుపాటుతో కూడిన వాక్యాలు కలవాడవుతూ తండ్రి అయిన కశ్యపుడితో ఇలా పలికాడు'.

'నేను నా తల్లియైన వినతదాస్యం తొలగించే నిమిత్తం, మీకు అమృతం తీసుకొని వచ్చి ఇస్తానని కద్రువకుమారులైన పాములతో చెప్పి వచ్చాను. ఈ అమృతం తీసుకునిపోయి ఆ

పాములకిచ్చి నా తల్లిదాస్యం పోగొట్టుకున్న పిమ్మట, పాము లీ అమృతం తాగకముందే నీవు దాన్ని గ్రహించి వెళ్లుము' అని గరుడుడు పలుకగా అతని మహత్త్వం మెచ్చుకొని 'నీ బలాన్ని, పరాక్రమాన్ని వినగోరతాను; చెప్పు' మని అడుగగా ఆ ఇంద్రునితో గరుడుడు ఇట్లా పలికాడు.

గరుత్మంతుడి తల్లియైన వినతని దాసిత్వం నుండి విముక్తురాలిని చేయడానికి గరుడుడు అనితరసాధ్యమైన సాహసానికి పూనుకున్నాడు. ఈ ఘట్టం అంతా కూడా అతడికి ఉన్న నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపించేదే. తల్లి క్షేమం కోరి అత్యున్నతమైన లక్ష్యాన్ని గరుత్మంతుడు నిర్దేశించుకున్నాడు. మధ్యలో ఎన్ని ఆటంకాలు ఎదురైనా, మొక్కవోని ధైర్యంతో, కృషితో వాటిని అధిగమించి కార్యసిద్ధిని పొందాడు.

బృహత్తరమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం వల్ల గరుత్మంతుడికి చాలా ఎక్కువగా ఆహారం అవసరమైంది. అందుకుగాను గజకచ్ఛపాలను స్వీకరించమని తండ్రియైన కశ్యపుడు గరుత్మంతుడిని అనుగ్రహించాడు. అయితే, అవి ఆకారంలో చాలా పెద్దవి కావడం వల్ల వాటిని ఒకచోట పెట్టుకుని భుజించాలి (గరుత్మంతుడు పక్షి గనుక). ఆలంబ తీర్థంలో రోహిణము అనే వృక్షశ్రేష్ఠం గరుత్మంతుడిని చూసి, గౌరవించి ' వందామడల పొడవుగల నా కొమ్మపై నిలిచి ఈ ఏనుగును, తాబేలును తిని వెళ్లు'మని పలికింది. గరుత్మంతుడు అందుకు సంతోషంతో అంగీకరించి కొమ్మపై వాలగానే అతడి పాదాలు మోపగానే ఆ కొమ్మ విరిగిపోయింది. ఆ కొమ్మని ఆశ్రయించి, సూర్యుడి కిరణాలను ఆహారంగా స్వీకరిస్తూ తల్లకిందులుగా తపస్సు చేస్తున్న వాలఖిల్యులను గరుత్మంతుడు చూసి, కొమ్మని కింద పెడితే ఆ మునులకి బాధ కలిగి తపస్సు భంగం అవుతుందని భావించి, తండ్రియైన కశ్యపుడి వద్దకు ఆ మునులున్న కొమ్మను నోటితో కరుచుకుని తీసుకువస్తాడు. కశ్యపుడు భక్తితో వారిని ప్రార్థించడంతో వారు హిమవత్పర్వతానికి వెళ్లి తపస్సు చేసుకున్నారు.

కేవలం తన లక్ష్యాన్ని చేరుకోవడం కోసం గరుత్మంతుడు మొండిగా ముందుకు సాగిపోలేదు. సున్నితంగా వ్యవహరించవలసిన చోట సున్నితంగా వ్యవహరిస్తూ, పరాక్రమం ప్రదర్శించాల్సిన చోట పరాక్రమాన్ని చూపించాడు. వాలఖిల్యమునుల తపస్సుకి భంగం కాకుండా చూడడం వల్ల గరుత్మంతుడికి వారి ఆశీస్సులు నిండుగా లభించాయి. ఈ సన్నివేశాన్ని బట్టి గరుత్మంతుడు గమ్యం కంటే ఎక్కువగా గమనంపై దృష్టి నిలిపాడని తెలుస్తోంది. తాను నిర్దేశించుకున్న లక్ష్యం అనితర సాధ్యమైనదే అయినా కూడా గరుత్మంతుడు అవసరమైన చోట చక్కటి నేర్పుతో వ్యవహరించాడు.

దివ్యమైనటువంటి అమృతాన్ని నాగుల పాలు చేయడం సరి కాదని ఇంద్రుడు గరుత్మంతుడికి వివరించి, దాని వల్ల వచ్చే నష్టాలను తెలియజెప్పాడు. అందుకు గరుత్మంతుడు తెలివిగా, 'నేను అమృత భాండాన్ని నాగుల ముందు ఉంచుతాను. అక్కడితో నా పని పూర్తవుతుంది. అమృతాన్ని స్వీకరించడానికి ముందు నాగులు స్నానమాచరించి వస్తారు. ఆ వ్యవధిలో మీరు తిరిగి అమృతాన్ని తీసుకువెళ్లండి' అని ఇంద్రుడికి ఉపాయం చెప్తాడు. అమృతాన్ని తెచ్చి నాగులకి ఇస్తే తన తల్లికి విముక్తి కలిగించినట్లవుతుందని భీకరమైన పోరాటం చేసి తన బాహుబలాన్ని, పరాక్రమాన్ని నిరూపించుకున్న గరుత్మంతుడు, ఇంద్రుడి మాట విన్నాక, బాధ్యతగా ఆలోచించాడు. కేవలం తన గురించి తాను ఆలోచించకుండా, తర్వాత వచ్చే పర్యవసానాలను దృష్టిలో పెట్టుకుని నేర్పుగా వ్యవహరించాడు. తనకి బుద్ధి బలం కూడా ఉందని నిరూపించుకున్నాడు.

లక్ష్యాలను చేరుకోవడం కోసం ఎదుటివారిని లెక్కచేయనివారికి ఈ ఘట్టం ఒక గొప్ప పాఠంగా నిలుస్తుంది. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో సగటు మనిషికి ఎదురయ్యే అన్ని ఆటంకాలను ఒకే విధంగా దాటాలని ప్రయతించడం సరికాదని, ఒదిగి ఉండవలసిన చోట ఒదిగి ఉండడం ఎంతో అవసరమనే విషయం ఇక్కడ స్పష్టమవుతోంది. నిర్వహణ సామర్థ్యానికి గొప్ప ఉదాహరణగా గరుత్మంతుడి కథ నిలుస్తుంది. అత్యాధునిక సమాజానికి సైతం, కార్య నిర్వహణలో భాగంగా ఎంతో ఓర్పు అవసరమనే విషయాన్ని ఉదాహరణపూర్వకంగా ఈ కథ తెలియజేస్తోంది.

## 6.3. మానవ ప్రయత్నం

శమీకుడి కుమారుడైన శృంగి శాపవశాత్తు, తక్షకుడు అనే పాము కాటు వల్ల తాను మరణించబోతున్నానని తెలుసుకున్న పరీక్షిత్తు, మరణం అనివార్యం అని తెలిసినా, తాను చేయవలసిన మానవ ప్రయత్నం అంతా చేసి, భగవద్సంబంధితమైన కార్యకలాపాలలో నిమగ్నమైపోతాడు. ఈ సందర్భంలో పరీక్షిత్తు ప్రదర్శించిన ధైర్యం అతడి నిర్వహణ సామర్థ్యాన్ని సూచిస్తుంది.

మ. సకలోర్వీశుఁ డతిప్రయత్నపరుఁ డై, సర్వక్రియాదక్ష త

క్షకకోటుల్ పనిసేయఁగా, ఘనతరైకస్తంభహర్మ్యంబుఁ ద

క్షకభీతిన్ రచియింపఁ బంచి, దృఢరక్షన్ దానిలో నుండెఁ బా

యక రాత్రిందివజాగరూకహితభృత్యామాత్యవర్గంబుతోన్. (*ఆంధ్ర. ఆది. 2: 181*)

వ. మఱియు విషాపహరంబులయి వీర్యవంతంబు లయిన మంత్రతంత్రంబులు గలిగి యాజ్ఞాసిద్ధులైన విషవైద్యుల నొద్దఁ బెట్టికొని పరీక్షితుం డుండునంత, నట తక్షకుండు విప్రవచన ప్రచోదితుం డయి పరీక్షితునొద్దకు నెవ్విధంబునఁ బోవనగునో యని చింతించుచుండె; నటఁ దొల్లి. (*ఆంధ్ర. ఆది. 2: 182*)

'సర్వభూమికి ప్రభువైన పరీక్షిత్తు అధికమైన ప్రయత్నంలో ఆసక్తి కలవాడై తక్షకుడి వలని భయం చేత అన్ని పనులను చేయడంలో నేర్పరులైన వడ్రంగుల సమూహాలు పనిచేయగా గొప్పదైన ఒంటికంబపు మేడ నిర్మించడానికి ఆజ్ఞాపించి రాత్రింబవళ్లు మేల్కొని ఉండి శ్రద్ధ వహించే ఆప్తుల, సేవకుల, మంత్రుల సమూహాలతో విడువక దట్టమైన రక్షణతో ఆ ఒంటిస్తంభపు మేడలో నివసించాడు.

అదిగాక, విషాన్ని తొలగించే, శక్తితో కూడినమంత్రాలు క్రియాకలాపాలు కలిగి, ఆజ్ఞాపించడం చేతనే విషాన్ని పోగొట్టడానికి సమర్థులైన విషవైద్యులను దగ్గర ఉంచుకొని పరీక్షిత్తు ఉండగా, అచ్చట తక్షకుడు బ్రాహ్మణుడైన శృంగి వచనం చేత ప్రేరేపించబడి, పరీక్షిత్తు కడకు ఎలా పోవడానికి వీలవుతుందో అని ఆలోచిస్తూ ఉన్నాడు'.

పరీక్షిన్మహారాజుకి శృంగి శాపం ఇచ్చిన విషయమంతా శమీకుడి శిష్యుడైన గౌరముఖుడు తెలియజేశాడు. శాపం ఇచ్చిన శృంగి కూడా తపస్వి, సద్వర్తనం కలిగినవాడు. మునులు ఇచ్చిన వరమైనా, శాపమైనా వారి మాటకి తిరుగు ఉండదని పరీక్షిత్తుకి తెలుసు. అయితే, పరీక్షిత్తు ఆత్మవిశ్వాసం, పరమాత్మవిశ్వాసం రెండూ మెండుగా కలిగినవాడు. విధిరాతని తప్పించడం ఎవరి తరం కాదు. అయినా, మానవప్రయత్నం చేయాలి కాబట్టి అనుభవజ్ఞులైన వడ్రంగులను పిలిపించి వారి చేత పాములు ఎక్కడానికి వీలుపడని ఒంటిస్తంభపు మేడ కట్టించాడు. ఆ భవనానికి పూజలు చేయించాడు. తాను చేయవలసిన మానవప్రయత్నం చేశాక, తక్కిన భారాన్ని భగవంతుడిపై వేశాడు. భాగవతకథలను శుకమహర్షివల్ల తెలుసుకుని తరించాడు.

పరీక్షిన్మహారాజు చేసిన ప్రయత్నం నేటి సమాజానికి గొప్ప పాఠంగా నిలుస్తుంది. మనిషికి చనిపోయే రోజు ముందే తెలిస్తే బతుకుతున్న రోజు నరకమవుతుంది. కానీ, పరీక్షిత్తు అందుకు భిన్నంగా తన జీవితపు చివరి క్షణాలని చాలా గొప్పగా, ఆదర్శప్రాయంగా ఆస్వాదించాడు. ఈ ప్రక్రియ అంతా కూడా పరీక్షిత్తు నిర్వహణ సామర్థ్యానికి నిదర్శనం.

కేవలం జీవితంలో కష్టాలు ఎదురైనంత మాత్రానే కంగారుపడిపోయి, జీవితాలు ఛిన్నాభిన్నం చేసుకుంటున్న నేటి తరానికి, పరీక్షిత్తు చేసిన ప్రయత్నం అద్భుతమైన సందేశాన్నిస్తుంది. పరీక్షిత్తుకి రాబోయేది మామూలు కష్టం కాదు, ఎటువంటి జీవికైనా వెన్నులో వణుకు పుట్టించే మరణం. ఆ వణుకు నుంచి ఉపశమనం పొందేందుకు పరీక్షిత్తు ఎంచుకున్న మార్గం భక్తిమార్గం. అదే అసలైన మార్గమని అతడి కథ, అతడి జీవితం ఋజువు చేశాయి.

మనిషి తన జీవితంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనప్పుడు పరీక్షిత్తు కథని స్ఫూర్తిగా తీసుకుని, తాను చేయగలిగిన మానవప్రయత్నం చేసి, తక్కిన భారాన్ని, ఫలితాన్ని భగవంతుడిపై విడిచిపెడితే అతడి జీవితం ధన్యం అవుతుందని అర్థమవుతోంది. మెండైన నిర్వహణ సామర్థ్యం కావాలంటే మనిషికి ఆత్మవిశ్వాసం, పరమాత్మవిశ్వాసం రెండూ అవసరమనే విషయాన్ని ఈ వృత్తాంతం తెలియజేస్తోంది.

## 6.4. శకుంతల సహనం, ధైర్యం

శకుంతలను గాంధర్వ వివాహం చేసుకున్న దుష్యంతుడు తనకోసం వెతుక్కుంటూ తన రాజ్యానికి కుమారుడితో సహా వచ్చిన శకుంతలను గుర్తుపట్టకపోవడంతో నిశ్చేష్టురాలైన శకుంతల ఇలా అనుకుంది.

క. మఱచినఁ దలఁపింపఁగ నగు;
నెఱుఁగని నాఁ డెల్లపాట నెఱిఁగింప నగున్;
మఱి యెఱిఁగి యెఱుఁగ నొల్లని
కఱటిం దెలుపంగఁ గమలగర్భుని వశమే. (*ఆంధ్ర. ఆది. 4: 72*)

వ. అయినను వచ్చి మిన్నక పోవంగాదు కావున నాపూర్వవృత్తాంతంబెల్ల నెఱింగించి యే నిక్కుమారుం జూపుదు' నని మనంబున నిశ్చయించి శకుంతల యా రాజున కి ట్లనియె. (*ఆంధ్ర. ఆది. 4: 73*)

'ఎవరైనా నిజంగా మరచిపోతే జ్ఞాపకం చేయవచ్చును; అసలు తెలియనప్పుడు ఏ పాటుపడి అయినా తెలియజెప్పవచ్చును, కాగా, తెలిసి కూడా తెలియనివాడి వలె నటించే మోసగాడికి తెలియజేయటం బ్రహ్మతరం కూడా కాదు'.

నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికి ఈ పద్యం ఒక ఉదాహరణ. ఎవరైనా జరిగింది మర్చిపోతే జ్ఞాపకం చేయవచ్చు. అసలు తెలియకపోతే తెలియజేప్పవచ్చు. కానీ, తెలిసి కూడా తెలియనట్లు ఉండేవారికి ఆ బ్రహ్మ కూడా నచ్చజేప్పలేడు. దుష్యంతుడు జరిగింది మర్చిపోయే అవకాశమే లేదు. అతడికి ఇది తెలియని విషయం అసలే కాదు. అలా అని శకుంతల ప్రయత్నం విరమించనూలేదు.

తన బిడ్డను యువరాజుగా ప్రకటిస్తానని రాజు ఇచ్చిన మాట మీద ఉన్న నమ్మకంతో శకుంతల దుష్యంతుడి వద్దకు వచ్చింది. అతడు కాదంటే తిరిగి ఆశ్రమానికి వెళ్లి తన ముఖాన్ని కణ్వమహర్షికి చూపించనూ లేదు. ఇంత దూరం వచ్చాక ఏమీ సాధించకుండా తిరిగి వెళ్లడం తగదు కాబట్టి దుష్యంతుడికి మునుపు జరిగిన కథనంతా తిరిగి గుర్తు చేయాలని నిశ్చయించుకుని శకుంతల మొదటి నుంచి వివరించే ప్రయత్నం చేస్తుంది. పైగా శకుంతలపై బిడ్డ (భరతుడు) భవిష్యత్తు కూడా ఆధారపడి ఉంది. ఆమె ధైర్యాన్ని కోల్పోతే భరతుడి భవిత ప్రశ్నార్థకం అయిపోతుంది. ఇటువంటి క్లిష్ట పరిస్థితిలో కూడా ఆత్మస్థైర్యం కోల్పోని ఆమె వ్యక్తిత్వం, నిర్వహణ సామర్థ్యం ప్రతీ మనిషికీ ఎంతో ప్రేరణగా నిలుస్తాయి.

నిజానికి, మనిషి అసలైన వ్యక్తిత్వానికి, ఆత్మ స్థైర్యానికి ఇటువంటి పరిస్థితులు పరీక్షల వంటివి. వీటిని తట్టుకుని నిలబడగలిగినవారే జీవితంలో ఉన్నతమైన శిఖరాలను అధిరోహిస్తారు.

## 6.5. లావుక పిట్టల సమయస్ఫూర్తి

ఖాండవవన దహన ఘట్టంలో మందపాలుడి కుమారులైన నాలుగు లావుక పిట్టలు ప్రదర్శించిన సమయస్ఫూర్తి, నిర్వహణ సామర్థ్యం నేటికీ ఆదర్శప్రాయంగా నిలుస్తాయి.

క. జ్వలనంబు వాయువశమునఁ
దొలఁగుడు జీవనము మాకు దొరకొనుఁ; గృచ్ఛ్రం
బుల సంశయయుతకార్యం
బులు గర్తవ్యములు; నియతములు వర్జ్యమ్ముల్. (*ఆంధ్ర. ఆది. 8: 310*)

'మంట గాలి వశాన తొలగిపోతే మేము బ్రతుకుతాము. కష్టసమయాల్లో బాధ కలిగితే కలగవచ్చు, లేకుంటే తప్పిపోవచ్చు అని అనిపించే పనులు చేయతగినవి. బాధ తప్పదు అని అనిపించే పనులు విడువదగినవి'.

ఖాండవవనాన్ని అగ్ని, కృష్ణార్జునుల ఆనతితో దహిస్తున్నాడు. అగ్నికి అది తప్పని పరిస్థితి. ఎన్నో జీవులు దహింపబడుతున్నాయి. అదే వనంలో జరిత అనే లావుక పక్షికీ, మందపాలుడనే మునికీ జన్మించిన నాలుగు లావుకపిట్టలను ఎలా అక్కడి నుండి తప్పించాలో తెలియక తల్లి (జరిత) వాటిని ఒక బిలంలో ప్రవేశించమని చెప్తుంది. అయితే, ఆ పిట్టలు ప్రదర్శించిన నేర్పు నేటి సమాజానికి జీవన విధానాన్ని నేర్పిస్తాయి. 'బిలంలోకి దూరితే ఎలుక మమ్మల్ని చంపేస్తుంది. ఇక్కడే ఉంటే అగ్ని దహిస్తాడు. ఎలుకచేత చావడం కంటే అగ్నిజ్వాలల్లో పడితే పుణ్యలోకాలు ప్రాప్తిస్తాయి. అయితే, ఎలుక వల్ల ప్రమాదం ఖాయం. అగ్ని వల్ల ప్రమాదం అనుమానాస్పదం. గట్టి గాలి వీస్తే అగ్ని తొలగిపోయే అవకాశం ఉంది' అంటూ ఆ లావుకపిట్టలు పలికిన మాటలు నిర్వహణ సామర్థ్యానికి నిజమైన నిర్వచనంగా భాసిస్తాయి.

లావుకపిట్టలు తాము చేయవలసిన ప్రయత్నం చేసి, తక్కిన భారాన్ని భగవంతుడిపై మోపాయి. వేదమంత్రాలను గొప్పగా స్తోత్రం చేస్తూ అగ్నిని ప్రార్థించాయి. వాటి ప్రార్థనను, మందపాలుడి కోరికను దృష్టిలో పెట్టుకుని అగ్నిదేవుడు ఆ పక్షులు ఉన్న చెట్టును విడిచిపెడతాడు. ఈ కథ బట్టీ, ఆపద ఎదురైనప్పుడు చేయవలసిన అత్యుత్తమమైన ప్రయత్నం చేసి భగవంతుడిపై భారం వేస్తే, ఏదో ఒక మార్గం ఏర్పడుతుందని అర్థమవుతోంది.

## 6.6. రాజసూయయాగ నిర్వహణ

ధర్మరాజు రాజసూయాగాన్ని దిగ్విజయంగా పూర్తి చేయడంలో గొప్ప నిర్వహణ సామర్థ్యం కనిపిస్తుంది.

వ. అని వారల యనుగ్రహంబు వడసి హిరణ్య రజత రత్న దక్షిణా దాన విషయంబులందుఁ గృపాచార్యునిఁ, గృతాకృత పరిజ్ఞానంబునందు భీష్మద్రోణులను, సకల వస్తు వ్యయంబునందు విదురుని, నానాదేశాగతులైన రాజులు దెచ్చి యిచ్చిన యుపాయనంబులు గైకొన దుర్యోధనుని, భక్ష్యభోజ్యాది వినియోగంబునందు దుశ్శాసనుని నియోగించి. (*ఆంధ్ర. సభా. 1: 288*).

సీ. 'అమ్మహామఖమునం దగ్నిముఖంబున /విపులమంత్రాహుతివితతిఁజేసి
సకలదేవతలును, సంపూర్ణదక్షిణా /దానోత్సవంబున ధరణిసురులు,
సముచితసత్కారశతసహస్రంబుల /నఖిలరాజన్యులు, నభిమతాన్న
దానంబుపెంపున ధరణీజనంబులుఁ /దద్దయుఁ దృప్తులై ధర్మచరితు

ఆ. ననఘు ధర్మతనయు ననుజసమన్వితు
సంస్తుతించి రధికసమ్మదమున'
నని కురుప్రభునకు నట్లు వైశంపాయ
నోక్తమైన కథ రసోత్కటముగ (*ఆంధ్ర. సభా. 1: 294*).

'వచ్చిన బంధుజనులందరి అనుగ్రహం పొంది, బంగారు, వెండి, రత్నాలను దక్షిణలుగా, దానాలుగా ఇచ్చే విషయంలో కృపాచార్యుణ్ణి, కార్యాకార్యాలను గురించి ఆలోచించడంలో భీష్మద్రోణులను, సకల పదార్థాలను వినియోగపరచడంలో విదురుణ్ణి, వివిధ దేశాల రాజులు తెచ్చి ఇచ్చే కానుకలను గ్రహించడంలో దుర్యోధనుణ్ణి, భక్ష్యభోజ్యాది ఆహార పదార్థాలను అందజేయడంలో దుశ్శాసనుడిని ధర్మరాజు నియమించాడు'.

'ఆ రాజసూయయాగంలో అగ్నిహోత్రుడి ముఖంలో మంత్రపూతాలైన ఆహుతుల్ని అధికంగా వేల్చటం చేత దేవతలు, నిండుగా దక్షిణలు, దానాలు ఇవ్వడం చేత బ్రాహ్మణులు, సముచిత సమ్మాన పరంపరలచే వివిధ దేశాధీశులు, అభీష్టమైన అన్నదానం అధికంగా చేయడం చేత సామాన్య ప్రజలు పూర్తిగా తృప్తి పొందారు. ధర్మబద్ధమైన నడవడి కలిగి, పుణ్యాత్ముడై, తమ్ముళ్లతో కూడి ఉన్న ఆ ధర్మరాజును మహదానందంతో అందరు అమితంగా ప్రశంసించారు'.

రాజసూయయాగం చేయడం సాధారణమైన విషయం కాదు. ఆ బృహత్తరమైన కార్యాన్ని తలపెట్టడమే ఒక సాహసం. అంతటి సాహసాన్ని ధర్మరాజు ఎంతో చాకచక్యంగా నిర్వహించాడు. రాజసూయాగాన్ని ధర్మరాజు ఒక్కడే పూర్తిచేయలేదు. అతడి నాయకత్వంలో/ పర్యవేక్షణలో కురువంశ యోధుల సహాయంతో అది సాకారమయ్యింది. అయితే ఎవరికి ఏ పని ఇవ్వాలో ధర్మరాజుకి తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు అనడం అతిశయోక్తి కాదేమో! ఈ క్రమంలో ధర్మరాజు నిర్వహణ సామర్థ్యం, ఉచితజ్ఞత, దూరదృష్టి ఆవిష్కృతమయ్యాయి.

ధర్మరాజు బంగారం, వెండి మొదలైన దానాలను, దక్షిణలను బంధువులకి ఇవ్వడానికి కృపాచార్యుణ్ణి నియోగించడం చాలా సముచితంగా అనిపిస్తుంది. కృపాచార్యుడైతే ఎవ్వరికీ ఎటువంటి లోటు చేసే అవకాశం లేదు. అలాగే, కార్యాకార్యాల విషయంలో భీష్మ, ద్రోణులను నియోగించడం, పదార్థాలను వినియోగపరిచే విషయంలో విదురుడిని నియోగించడం ధర్మరాజు ఎంపిక ఎంత సరైనదో ఋజువు చేస్తుంది.

అన్నింటినీ మించి వివిధ దేశాల రాజులు ఇచ్చే కానుకలను స్వీకరించేందుకు ధర్మరాజు దుర్యోధనుణ్ణి నియోగించడం అతడి నిర్వహణ సామర్థ్యానికి పరాకాష్ఠ. దుర్యోధనుడు ఎక్కడ ఉన్నా పాండవుల పట్ల ఈర్ష్యాసూయలు కలిగి ఉంటాడు. అందుకే, ధర్మరాజు అతడికి కీలకమైన బాధ్యతని అప్పగించాడు. విపరీతమైన అహంకారం కలిగిన దుర్యోధనుడికి అది తగిన బాధ్యతే. రాజసూయాగానికి వచ్చిన రాజులందరూ అక్కడి ఏర్పాట్లను మెచ్చుకుంటూ కానుకలు దుర్యోధనుడికి సమర్పించే పరిస్థితిని ధర్మరాజు కల్పించాడు. ఇది ధర్మరాజు దుర్యోధనుడికి విధించిన గొప్ప మానసిక శిక్ష. దుర్యోధనుడు ఆ పనికి అంగీకరించి తాను అవివేకిని మరొకసారి నిరూపించుకున్నాడు.

అంతేకాకుండా, మూర్తీభవించిన అనంత వేదాలవంటివారైన పైల, ధౌమ్యులు ఋగ్వేద తంత్రాన్ని నిర్వహించే ఋత్విక్కులుగా, యాజ్ఞవల్క్యుడు యజుర్వేద తంత్రాన్ని నడిపే అధర్వుడుగా, వేద వ్యాసుడు ప్రధాన ఋత్విక్కైన బ్రహ్మగా, సుసాముడు సామవేద తంత్రాన్ని నడిపే ఋత్విక్కుగా, ఈ నలువురి యొక్క పుత్ర, శిష్య సమూహాలు, మైత్రావరుణుడు, అచ్ఛావాకుడు, మొదలైనవారు సహాయ ఋత్విక్కులుగా, నారదాది బ్రహ్మర్షులు సదస్యులుగా, భీష్మాది రాజర్షులు సహాయులుగా అన్ని విధాల సమగ్రమై, ఆరు వేదాంగాలైన శిక్షావ్యాకరణాదులతో నిండినదై, సంపూర్ణ దక్షిణలతో

కూడినదై, ధన ధాన్య సమేతమై, జగన్నాథుడైన శ్రీకృష్ణునిచే రక్షితమై, సర్వ ప్రజలకు ఆనందజనకమై రాజసూయం మహా మనోహరంగా జరిగింది. ఇంతమందికి తగిన ఏర్పాట్లు చేయడం అనన్యసామాన్యం. అన్నింటినీ మించి శ్రీకృష్ణుడికి రాజసూయార్ఘ్య ప్రదానం చేయడంతో ధర్మరాజు సంకల్పించిన ఈ బృహత్తరమైన కార్యం దిగ్విజయంగా పూర్తయ్యింది.

ఒక పెళ్లి చేయడానికి ఎన్నో తిప్పలు పడిపోతున్న నేటి తరం ఒక్కసారి రాజసూయయాగాన్ని ధర్మరాజు నిర్వహించిన విధానాన్ని పూర్తిగా చదివి తెలుసుకోవాలి. ఇంట్లో జరిగే శుభకార్యాలను బంధువుల సహాయంతో నిర్వహించకుండా కేటరింగ్ వాళ్లకీ, ఈవెంట్ మేనేజ్మెంట్ వారికీ అప్పజెబుతున్న నేటి తరం ధర్మరాజుని చూసి నిర్వహణ సామర్థ్యం అంటే ఏంటో తెలుసుకోవాలి.

రాజసూయాగాన్ని నిర్వహించే క్రమంలో ధర్మరాజు పాటించిన విధానాలు, అనుసరించిన పద్ధతులు నేటికీ ఎంతో సముచితంగా నిలిచిపోయాయి.

## 6.7. దమయంతి కార్యనిర్వహణ వ్యూహం

నలమహారాజు దమయంతి క్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ఆమెని విడిచిపెట్టి వెళ్లిపోవడంతో దమయంతి నలుడి కోసం వెతికి, వెతికి చివరికి విదర్భ రాజ్యానికి చేరుకుంటుంది. దమయంతి దుఃఖాన్ని చూసి తల్లిదండ్రులు బాధపడి నలమహారాజుని వెతకాలని నిర్ణయించుకుంటారు. బ్రాహ్మణులను ఈ పని నిమిత్తం పురమాయిస్తారు. అయితే, నలుడు ఎక్కడ ఉన్నా, అజ్ఞాతవాసం చేస్తూ ఉంటాడు. ఆత్మాభిమానం కలవాడు కాబట్టి, ఎవరైనా తనకోసం వచ్చినా స్పందించడు. అప్పుడు దమయంతి ఆ బ్రాహ్మణులకి చేసిన సూచనలు ఆమె నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపిస్తాయి.

సీ. 'నిత్యసత్యుండవు; నీ సతి వంచించి / దాని వస్త్రార్ధంబు దఱిగి నీకుఁ
బరిధానముగఁ జేసి పాఁడియే పోవంగ? / భార్య భర్తవ్యనాఁ బరఁగు ధర్మ
మది మిథ్య యయ్యె నీయందు; నీ కిట్టి ని / ర్దయబుద్ధిఁ జేకొనఁ దగునె? యట్టి
సాధ్వికిఁ గరుణఁ బ్రసన్నుండ వగు' మని / యెల్లచోఁ బలికిన నెవ్వఁడేనిఁ

ఆ. బలుకు వడఁగ నోడి ప్రతివచనం బిచ్చు
నతఁడు నలుఁడుగాఁ బ్రియంబుతోడ
నెఱిఁగి నన్ను నతని కెఱిఁగించి తోడ్కొని
రండు; రానినాఁడు రం డెఱింగి.' (*ఆంధ్ర. ఆరణ్య. 2: 158*).

'నిషధ ప్రజలకు రాజైన నలమహారాజును మీరు వెతకడానికి వెళ్లిన ప్రతీ సభలో ఈ విధంగా పలకండి. 'నీవు నిత్యసత్యవ్రతుడివి. నీ భార్యను మోసం చేసి ఆమె చీరను సగం చింపి నీవు కట్టుబట్టగా చేసుకుని పోవడం న్యాయమా? భరించబడేది భార్య అని కదా ధర్మం. ఆ ధర్మం నీ పట్ల అసత్యమైనది కదా! నీవు ఇటువంటి దయలేని కఠినమైన బుద్ధిని అవలంబించదగునా? అటువంటి పతివ్రతా శిరోమణి పట్ల అనుగ్రహం చూపుము.' అని పలకండి. ఎవరైనా ఆ మాటలు విని రోషం చెంది ఎదురు సమాధానం చెబితే అతడు నలుడని గుర్తించి, అతడికి నా విషయం తెలిపి, ప్రియమార తీసుకురండి. ఒకవేళ అతడు ఇక్కడికి రాకపోతే, అతడిని గుర్తుపెట్టుకుని మీరు తిరిగి రండి.

నలమహారాజు ధర్మపరాయణుడు. ఎల్లవేళలా సత్యానికే కట్టుబడ్డవాడు. కేవలం, తాను తీవ్రాతి తీవ్రమైన కష్టాల్లో ఉండడం వల్ల దమయంతిని తిరిగి పుట్టింటికి పంపాలనుకున్నాడే తప్ప, ఆమె పట్ల ద్వేషంతో కాదు. నలమహారాజు గొప్ప ఆత్మాభిమానం కలవాడు. అతడి గుణగణాలన్నీ దమయంతికి తెలుసు. అందుకే, నేరుగా పిలిస్తే నలుడు బయటకి రాకపోవచ్చని ఊహించి దమయంతి తెలివిగా పై మాటలు ఆ బ్రాహ్మణులతో పలికించింది. దమయంతి చేసిన ఆలోచన ఆమె నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపణ చేస్తోంది. ఆమె అనుకున్న విధంగానే ఋతుపర్ణుడి రాజ్యంలో బాహుకుడు అనే పేరుతో వంటవాడిగా, ఆశ్వాలకి శిక్షకుడిగా పనిచేస్తున్న నలమహారాజు ఆ మాటలు విని రోషం చెంది, అక్కడికి చాటింపు వేయడానికి వచ్చిన బ్రాహ్మణులతో స్పందించాడు. అనుకున్నట్టుగానే దమయంతి వ్యూహం ఫలించింది. అయితే నలుడి బాహ్యరూపం పూర్తిగా గుర్తించని విధంగా (కురూపి) ఉండడం వల్ల కొంత అనుమానం మిగిలిపోయింది.

బ్రాహ్మణుల ద్వారా సమాచారం తెలుసుకున్న దమయంతి, ఈ సారి సుబాహుడి రాజ్యంలో ఉండగా తనని గుర్తుపట్టిన సుదేవుడిని పంపించింది. ఈసారి మరింత చాకచక్యంగా ఆలోచించిన దమయంతి తనకి విదర్భమహారాజు ద్వితీయ స్వయంవరం ఏర్పాటు చేస్తున్నాడని ప్రకటించమని సుదేవుడికి సూచించింది. ఆ చాటింపు కేవలం ఋతుపర్ణుడి రాజ్యంలో మాత్రమే జరిగింది. సుదేవుడి

మాటలు విని ఆవేదనతో నలుడు ఋతుపర్ణుడితో తాను కూడా బయలుదేరడానికి అంగీకరిస్తాడు. దమయంతి వ్యూహం అద్భుతంగా పని చేసింది. దమయంతీ దేవి నిర్వహణ సామర్థ్యం వల్లనే నలుడు తిరిగి ఆమె సొంతమయ్యాడు. తన వ్యూహం ప్రకారం విచ్చేసిన నలుడిని రకరకాల ప్రమాణాల (నలుడి రథధ్వని, నలుడి వంట, వారిద్దరి పిల్లల పట్ల నలుడు చూపిన ప్రేమానురాగాలు) ఆధారంగా దమయంతి గుర్తు పట్టింది. చివరికి తన మనస్సుని ప్రమాణంగా విశ్వసించి నలుడిని ఏలుకుంది.

"సంశయాస్పదమైన సందర్భాల్లో మహాపురుషులకు మనసే ప్రమాణమై ఒప్పుతున్నట్లుగా పతివ్రతలైన స్త్రీల విషయంలో కూడా వారి అంతః కరణమే క్షీరనీరాలను విడదీసే హంసవలె వెలుగుదారి చూపుతుంది" *(జానకి, ప్రభల. 2016: 255).*

నలుడి కోసం అన్వేషించే క్రమంలో, తీవ్రమైన కష్టాల్లో సైతం దమయంతి ప్రదర్శించిన నేర్పు, అంకిత భావం, తెలివి మొత్తంగా ఆమె నిర్వహణ సామర్థ్యం నేటికీ ఆదర్శంగా నిలుస్తాయి.

## 6.8. నలుడి ప్రతిభ

దమయంతీ దేవికి స్వయంవరమని తెలిసి ఋతుపర్ణుడు విదర్భ రాజ్యానికి వెళ్లాలని నిర్ణయించుకుంటాడు. అయితే, ఒక్కరోజులో విదర్భ రాజ్యం చేరుకోవడం కష్టసాధ్యమైన పని. అందువల్ల బాహుకుడిని (నలుడిని) తన శిక్షణా నైపుణ్యంతో తనని ఒక్క దినంలోనే విదర్భకి చేర్చాలని ఆజ్ఞాపిస్తాడు. అలా చేయగలిగితే కోరిన కోర్కెలు తీరుస్తానని ఋతుపర్ణుడు బాహుకుడికి మాట ఇస్తాడు. ప్రయాణం ప్రారంభం అయ్యాక ఆ అశ్వాలు ప్రయాణిస్తున్న వేగాన్ని చూసి ఋతుపర్ణుడు, వార్ ష్ణేయుడు ఆశ్చర్యపోతారు. ఆ సందర్భంలో బాహుకుడి రూపంలో ఉన్న నలుడి నిర్వహణ సామర్థ్యం ఆవిష్కృతమౌతుంది.

క. 'ఈతండు శాలిహోత్రుఁడొ!

మాతలియో! నలుఁడొ యొరులు మానవులు జవో

పేతముగ నిట్లు రథహయ

నీతి యెఱుంగుదురె? ధారుణీవలయమునన్. (*ఆంధ్ర. ఆరణ్య. 2: 172*).

వ. వయోవిద్యావైభవంబుల నితండు నలుంబోలియు వికృతరూపధరుం డయిన కారణం బేమియొ? మహాపురుషులు దైవనియుక్తులై ప్రచ్ఛన్నవృత్తి నుండుదురు; వారి నెఱుంగంబోలునె?' యనుచుఁ

జనునప్పుడు ఋతుపర్ణుండు దన యుత్తరీయంబు జారి భూతలంబుపయిం బడిన మలంగి చూచి 'బాహుకా! వార్‌ష్ణేయుండు వోయి యుత్తరీయంబు దెచ్చునంతకు రథగమనం బించుక మందంబు సేయు' మనిన బాహుకుండును 'నయ్యా! నీ యుత్తరీయంబు వడినయెడ యిచ్చోటికి నొక్క యోజనంబు గలదు; దాని వార్‌ష్ణేయుం డెట్లు దే నేర్చు?' నని రథగమనవేగమాహాత్మ్యంబు సెప్పుచు ననేకదేశంబులు గడచి చని యొక్క యెడ నగణ్యపర్ణఫలశాఖాలంకృతంబైన విభీతకవృక్షంబు గని; రంత ఋతుపర్ణుండు బాహుకున కిట్లనియె. (*ఆంధ్ర. ఆరణ్య. 2: 173*).

'ఈ బాహుకుడు ఆశ్వశాస్త్ర కర్తయైన శాలిహోత్ర మునీంద్రుడా? దేవేంద్రుడి రథసారథి అయిన మాతలియా? లేక నలుడా? తదితర మానవులు ఇంత శక్తిమంతంగా ఈ భూలోకంలో రథాలను గురించిన, గుర్రాలను గురించిన దర్శనజ్ఞానం కలవారు ఉన్నారా? ఈ బాహుకుడి వయస్సుకు, చదువుకు సంబంధించిన గొప్పతనంలో నలుడికి సమానుడే! అయితే ఆకారంలో పోలిక లేదు కదా! రూపం మారడానికి వేరే కారణం ఏదైనా ఉందా? అంటూ వార్ ష్ణేయుడు మనస్సులో తర్కించుకుంటూ ఉండగా, ఋతుపర్ణుడి ఉత్తరీయం జారి నేల మీద పడుతుంది. దాంతో ఋతుపర్ణుడు బాహుకుడిని రథాన్ని ఆపమని, వార్ ష్ణేయుడిని పంపిస్తాడు. కానీ బాహుకుడు (నలుడు), 'ఆ ఉత్తరీయాన్ని తెచ్చుకోవడం చాలా కష్టమైన పని. అది కింద పడిన చోటు ఇక్కడికి ఒక ఆమడ దూరంలో ఉంటుంది. ఎవరైనా నడిచి వెళ్లడం చాలా కష్టం' అని చెప్పి తన వేగం యొక్క మహిమను నిరూపిస్తాడు.

బాహుకుడి (నలమహారాజు) వ్యక్తిత్వం, గుణగణాలు, ప్రజ్ఞ అన్నింటినీ మించి అతడి నిర్వహణ సామర్థ్యం ఋతుపర్ణుడిని, వార్ ష్ణేయుడినే కాదు తరతరాలను ఆశ్చర్యపరుస్తాయి, స్ఫూర్తినందిస్తాయి. ఈ ఘట్టంలో ప్రధానంగా గమనించదగ్గ విషయం ఇదే. నలమహారజుని కలిపురుషుడు ఎన్నో కష్టాలు పెట్టాడు. సిరిసంపదలని దూరం చేశాడు, రాజ్యాన్ని దూరం చేశాడు, నలుడిని అడవులపాలుజేశాడు. చివరికి తోడుగా ఉన్న దమయంతిని సైతం దూరం చేశాడు. భయంకరమైన సర్పం చేత కాటు వేయించాడు. ఎన్ని చేసినా నలుడి ప్రజ్ఞా పాటవాలను అతడి నుండి దూరం చేయలేకపోయాడు. దీన్ని బట్టీ సగటు మనిషికి ఉండే ప్రతిభని మాత్రం ఎవరూ దూరం చేయలేరని మరోకసారి స్పష్టమౌతోంది. పైగా నలుడు వంటవాడిగా, అశ్వశిక్షకుడిగా తనని మించినవాడు లేడని నిరూపించుకున్నాడు. తాను రథాన్ని తోలే వేగంతోనే తన పేరు అవతలివారికి

స్ఫురింపజేసేంత ప్రతిభ నలుడి సొంతం. అశ్వశాస్త్రకర్తయైన శాలిహోత్రుడు, దేవేంద్రుడి రథసారథియైన మాతలి మాత్రమే ఈ జగత్తులో నలుడితో సమానంగా రథాన్ని నడపగలరని వార్ ష్ణేయుడి మాటల ద్వారా వెల్లడైంది. దీన్ని బట్టీ నలుడు ప్రతిభ ఎంత గొప్పదో అర్థమౌతోంది.

నలుడి పాత్ర ద్వారా ఏ విద్యయైనా సరే, దాన్ని అత్యంత భక్తిభావంతో అభ్యసించి, తనదైన ముద్రని ఆ రంగంపై వేయగలిగితే ప్రపంచం మొత్తం అతడి ప్రతిభకి దాసోహం అవుతుందని తెలుస్తోంది. నిర్వహణ సామర్థ్యం మనిషి సొంతమైతే, అతడు పొందవలసిన గౌరవాలు, సత్కారాలు అతడిని వెతికి వెతికి వరిస్తాయని స్పష్టమౌతోంది.

## 6.9. అష్టావక్రుడి కథ

అరణ్యవాసంలో ఉన్న పాండవులకి రోమశుడు ఎన్నో కథలు చెప్పాడు. అలా చెప్పిన కథల్లో ఒక ముఖ్యమైన కథ అష్టావక్రుడి కథ. పుట్టుకతోనే శాపవశాత్తు అష్ట వంకరలు కలిగిన దేహంతో జన్మించిన అష్టావక్రుడు, జనకమహారాజు ఆస్థానంలో దానం సంపాదించేందుకు వెళ్లి వరుణకుమారుడైన వందితో వాదించి ఓడిపోయి నీళ్లలో మునిగి ఉండిపోయిన తన తండ్రిని విడిపించిన తీరు అతడి నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపిస్తుంది.

సీ. జనకభూపాలుని సంప్రశ్నముల కెల్ల / నేర్పడ నుత్తరం బిచ్చి వాని
సభయందు భూసురసంఘమధ్యంబున / వరుణపుత్త్రుం డైన వందితోడ
వాదంబు చేసి, గర్వంబున నాతని / నోడిచి, తద్విజితులై యొదిఁగియున్న
ధరణీసురులఁ దన తండ్రితో నిగ్రహ / ముక్తులఁ జేసి సన్మునికుమారుఁ

తే. దధికతేజుఁ డష్టావక్రుఁ డఖిలలోక
పూజితుం డైన జనకుచేఁ బూజ లంది
యేకపాదుఁ దోడ్కొని పేర్మి నేఁగుదెంచె
బుధనుతుండు నిజాశ్రమంబునకు నొప్ప.' (*ఆంధ్ర. ఆరణ్య. 3: 250*).

'జనక మహారాజు అడిగిన చిక్కు ప్రశ్నలన్నింటికీ సరిపడే సమాధానాలు చెప్పి, అతడి కొలువుకూటంలో బ్రాహ్మణ సమూహాల మధ్యనున్న వరుణసుతుడైన వందితో వాదించి, అతడిని

ఓడించి, మునుపు అతడితో వాదించి పరాజితులై అణగి ఉన్న బ్రాహ్మణులను తన తండ్రితోపాటుగా బంధ విముక్తులుగా చేసి, మిక్కుటమైన తేజస్సు గల ఆ ముని కుమారుడైన అష్టావక్రుడు సర్వలోకాలచేత పూజించబడిన జనకమహారాజు చేత సన్మానితుడై, పండితుల చేత ప్రశంసించబడినవాడై, ఏకపాదుడిని తన వెంట పెట్టుకుని శోభాయమానంగా తన ఆశ్రమానికి చేరుకున్నాడు'.

అష్టావక్రుడు తల్లియైన సుజాత కడుపులో ఉన్నప్పుడు, అతడి పోషణార్థం ధనాన్ని సంపాదించడానికి ఏకపాదుడు జనకమహారాజు ఆస్థానానికి వెళ్లాడు. అక్కడ వరుణ కుమారుడైన వందితో జరిగిన వాదనలో ఓడిపోయాడు. తల్లి ద్వారా జరిగిన కథను తెలుసుకున్న అష్టావక్రుడు చిన్నప్పటి నుండి సంపాదించిన అపారమైన జ్ఞానంతో జనకమహారాజు ఆస్థానంలో ఉన్న పండితులతో వాదించి, కేవలం తన తండ్రినే కాక ఇతర బ్రాహ్మణులను సైతం విడిపించాడు.

శరీరం అష్టవంకరలతో ఉన్నా అది జ్ఞాన సంపాదనకి అడ్డు కాదని అష్టావక్రుడు నిరూపించాడు. తనకి శాపాన్ని విధించిన తండ్రినే వేరొకరి చెర నుండి విడిపించాడు. స్వార్థం గురించి మాత్రమే ఆలోచించకుండా తన తండ్రితో పాటుగా నీళ్లలో ఉండిపోయిన ఇతర బ్రాహ్మణులను సైతం విడిపించడం అతడి ఔన్నత్యానికి మచ్చుతునక. తనకి ఏర్పడిన శరీరం అందవికారంగా ఉన్నా అష్టావక్రుడు భగవంతుడిని నిందించలేదు. తన మెదడుకి పదును పెట్టి, అపారమైన పాండిత్యాన్ని సంపాదించాడు. ఏకంగా వరుణుడి కుమారుడైన వందిని వాదనలో గెలిచేంత స్థాయికి ఎదిగాడు. తన విజయం ద్వారా అష్టావక్రుడు, పట్టుదల, ఎదగాలనే కోరిక తీవ్రంగా ఉండాలే కాని, ఈ సృష్టిలో అసాధ్యమనేది ఏదీ లేదని నిరూపించాడు. పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నప్పుడే మనిషి తన సత్తాని చాటుకోవాలని ఋజువు చేశాడు. తన నిర్వహణ సామర్థ్యంతో ఎన్నో తరాలకి ఆదర్శంగా నిలిచాడు. పాండిత్యానికి, జ్ఞాన సముపార్జనతో సంబంధం లేదని తన విజయం ద్వారా లోకానికి చాటిచెప్పాడు.

## 6.10. కార్యసిద్ధి: హనుమంతుడి బోధన

అరణ్యవాసంలో ఉన్న భీముడు ద్రౌపది కోరిక మేరకు సౌగంధికాలు తేవడానికి బయలుదేరతాడు. మార్గమధ్యంలో అతడికి హనుమంతుడు కనిపిస్తాడు. హనుమంతుడి నిజరూప

దర్శనం చేసుకున్నాక, హనుమంతుడు భీముడికి కొన్ని జాగ్రత్తలు చెప్పాడు. అవి భీముడికే కాదు, కార్య సిద్ధి కోసం ప్రయత్నించే ప్రతీ ఒక్కరికీ వర్తిస్తాయి.

ఆ. కార్యసిద్ధిపొంటెఁ గాలంబు దేశంబు
నెఱిఁగి బుద్ధిమంతు లెల్లప్రొద్దు
సాహసంబు విడిచి సామాద్యుపాయప్ర
యుక్తి చేయుదురు యథోచితముగ. (*ఆంధ్ర. ఆరణ్య. 3: 348*)

'ఏ కర్తవ్యాన్ని నెరవేర్చడంలోనైనా బుద్ధిమంతులు తగిన సమయాన్ని తగిన స్థలాన్ని తెలుసుకుని సాహసాన్ని వదిలి సామదాన భేద దండోపాయాలను ఏ విధంగా ప్రయోగించతగునో అట్లాగే ప్రయోగించి విజయాన్ని సాధిస్తారు'.

హనుమంతుడు భీముడి మేలు కోరి ఎన్నో జాగ్రత్తలు చెప్పాడు. భీముడు పొందాలనుకుంటున్న సౌగంధికాలు (బంగారు రేకులు కల తామర పువ్వులు) ఉండే కొలను యక్షుల చేత, రాక్షసుల చేత రక్షించబడుతోంది. అందుకే ఆవేశపడి అక్కడ పరాక్రమాన్ని ప్రదర్శించవద్దని ఆంజనేయుడు భీముడికి సూచించాడు. ముందు సామరస్యంగా మెలగి ప్రార్థన ద్వారా వాటిని సాధించే ప్రయత్నం చేయాలని, తప్పని పక్షంలో మాత్రమే పరాక్రమాన్ని ప్రదర్శించాలని హనుమంతుడు భీముడికి వివరించాడు. సామ దాన భేద దండోపాయాలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా వినియోగించాలో తెలిసినవారు మాత్రమే కార్య సిద్ధిని పొందగలరని హనుమంతుడు స్పష్టం చేశాడు. హనుమంతుడి మాటలు చాలా విలువైనవి. స్వయంగా హనుమంతుడికే సీతాదేవిని వెతికే క్రమంలో ఎన్నో అవరోధాలు ఎదురయ్యాయి. వాటన్నింటినీ హనుమంతుడు తెలివిగా ఎదుర్కొన్నాడు. అవసరమైతే తప్ప పరాక్రమాన్ని ప్రదర్శించలేదు. అందుకే, దిగ్విజయంగా సీతమ్మ జాడ తెలుసుకుని శ్రీరాముడికి తెలియజేయగలిగాడు. తన అనుభవాన్ని రంగరించి హనుమంతుడు భీముడికి దిశానిర్దేశం చేశాడు.

సరిగ్గా అన్వయించుకుంటే హనుమంతుడి మాటలు భీముడికే కాదు, నేటి సమాజానికి సైతం వర్తిస్తాయి. అన్ని చోట్లా శాంత స్వభావం కాని, అన్ని చోట్లా పరాక్రమాన్ని కాని ప్రదర్శించడం కార్యసాధకుడి లక్షణాలు కావని హనుమంతుడి మాటల ద్వారా స్పష్టమౌతోంది. విభిన్నమైన రంగాల్లో వినూత్నమైన లక్ష్యాలను విధించుకుని ఉరకలు వేస్తున్న నేటితరానికి హనుమంతుడి మాటలు గొప్ప పాఠాన్ని నేర్పిస్తాయి.

## 6.11. సత్యాద్రౌపదీ సంవాదం

ఎఱ్ఱన రచించిన ఆరణ్యపర్వంలో అత్యంత ప్రసిద్ధమైన, జనరంజకమైన ఘట్టం సత్యా ద్రౌపదీ సంవాదం. ఈ సంవాదంలో భాగంగా ద్రౌపది సత్యభామకి చెప్పిన విషయాలు ప్రతీ మనిషినీ ఆలోచింపజేస్తాయి. ద్రౌపది మాటల్లో పతిభక్తి, అత్తగారి పట్ల బాధ్యత, ఇంట్లో స్త్రీలు నడుచుకోవలసిన విధానాలు ఇలా ఎన్నో అంశాలు ప్రస్తావించబడ్డాయి. ముఖ్యంగా ద్రౌపది సత్యభామకి చెప్పిన పతివ్రతాధర్మాలు మహిళల నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపణ చేస్తాయి. నిర్వహణ సామర్థ్యమనేది కార్యాలయాల్లోనే కాదు ఇంట్లో సైతం అవసరమేనని వివరిస్తాయి. నిజానికి ఇంట్లో నిర్వహణ బావుంటేనే ఏ మనిషైనా బయట (సంఘ జీవితంలో) ప్రశాంతంగా ఉండగలడు. ఈ కోణంలో పరిశీలిస్తే ద్రౌపది చెప్పిన ధర్మాలు ప్రతీ ఇంట్లో ఆచరించవలసిన సూత్రాలుగా ధ్వనిస్తాయి.

చ. తివిరి మురారి నీకుఁ గడు తీపుగఁ జెప్పిన పల్కు గల్గినం
గువలయనేత్ర! నీ మనసు గూడినవారికి నైన నెప్డుఁ జె
ప్పవలదు; దాన నొండొక నెపంబు ఘటింతు రెఱింగి రేని నీ
సవతులు కృష్ణుబుద్ధి విరసంబగు నీదెసఁ దత్ప్రయుక్తిచేన్. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 318*)

'నల్లకలువలవంటి కన్నులు కల ఓ సత్యభామా! నీయందు మిక్కుటమైన మక్కువ చూపి, శ్రీకృష్ణుడు నీకు సరససల్లాపప్రసంగవశాన ఏదైనా రహస్యం చెబితే, దానిని నీవు నీ అనుగు నెచ్చెలులకు కూడా చెప్పకూడదు. ఒకవేళ ఆ సంగతి నీ సవతులకు తెలిస్తే నీ మీద నింద మోపి ఆ రహస్యాన్ని బట్టబయలు చేయగలరు. అప్పుడు నీ మీద గల ప్రేమాభిమానాలు శ్రీకృష్ణుడు మనస్సులో సన్నగిల్లుతాయి. జాగ్రత్త'.

ద్రౌపది సత్యభామకి ఎన్నో సంసారం విషయంలో ఎన్నో జాగ్రత్తలు చెప్పింది. ఆ జాగ్రత్తలు, సూచనలు ప్రతీ గృహిణికీ ఉపయోగపడేవే. భార్యాభర్తల మధ్య ఎన్నో ఆర్థికపరమైన, వ్యక్తిగతమైన రహస్యాలు ఉంటాయి. వాటిని భర్త ఏదో సమయంలో సరదా మాటల మధ్య చెప్పినా భార్య ఆ రహస్యాలని ఎవ్వరితో పంచుకోకూడదు. ఆ రహస్యాలు తోడుకోడళ్లకి, స్నేహితురాళ్లకి సన్నిహితులకి ఎవ్వరికి తెలిసినా లేనిపోని సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. పైగా ఈ విషయం భర్తకి తెలిస్తే, అతడికి భార్యపై నమ్మకం పోయే ప్రమాదం ఉంది.

భర్త తప్ప మరే ఇతర పురుషులతోనూ భార్య ఏకాంతంగా మాట్లాడం భర్త మనస్సులో అనుమానాలను రేకెత్తించే అవకాశం ఉందని ద్రౌపది సత్యభామకి చెప్పింది. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 320*)

స్నేహితురాళ్లను ఎంచుకునే క్రమంలో కూడా వివాహిత/ గృహిణి జాగరూకతతో వ్యవహరించాలని, వారి ప్రవర్తనని, కుటుంబ నేపథ్యాన్ని పరిగణలోకి తీసుకోవాలని ద్రౌపది సత్యభామని హెచ్చరించింది. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 321*)

నేడు ప్రజల జీవితంలో సామాజిక మాధ్యమాలు ఒక అంతర్భాగమైపోయిన సందర్భంలో, భార్యాభర్తల మధ్య ఉండే ఆంతరంగిక విషయాలు బయటపెట్టడం కొరివితో తల గోక్కోవడమే అవుతుందని ద్రౌపది మాటల ద్వారా తెలుస్తోంది.

## 6.12. సంక్షోభ నివారణ: యక్ష ప్రశ్నల ఘట్టం

ఆరణ్య పర్వంలో వచ్చే యక్ష ప్రశ్నల ఘట్టంలో ధర్మరాజు నిర్వహణ సామర్థ్యం అనితరసాధ్యంగా కనిపిస్తుంది. నలుగురు తమ్ముళ్ల శవాలు ఎదురుగా పెట్టుకొని యక్షుడు వేసిన ఎన్నో ప్రశ్నలకు ధర్మరాజు మొక్కవోని ధైర్యంతో సమాధానాలు చెప్పి, అంతిమంగా తన నలుగురు తమ్ముళ్లనీ బ్రతికించుకుంటాడు. ఈ క్రమంలో ధర్మరాజు వేసిన ప్రతీ అడుగు, చెప్పిన ప్రతీ సమాధానం తరతరాలకి ఆదర్శంగా నిలుస్తాయి.

క. 'నాయనుమతి లేకుండఁగ
నీయుదకము ద్రావిరేని యెవ్వా రైనన్
ధీయుతచతురు !; నీ వటు
సేయవు సమ్యగ్విచారశీలుఁడ వగుటన్. *(ఆంధ్ర. ఆరణ్య. 7: 421)*

వ. కావున మదీయంబులగుప్రశ్నంబుల కుత్తరంబుసెప్పు మనిన నతండు 'మహాత్మానీ ! చిత్తంబునకు వచ్చునట్లుగాఁ జెప్పనాబోఁటివానికి శక్యం బగునే? యైనను నా నేర్చువిధంబునఁజెప్పెద నడుగు' మనిన నయ్యక్షుం డి ట్లనియె. *(ఆంధ్ర. ఆరణ్య. 7: 422)*

'బుద్ధిమంతుడవైన ఓ ధర్మరాజా! నా అనుమతి లేకుండా ఈ సరోవరంలోని నీళ్లు త్రాగినవారు ఎంతటి గొప్పవారయినా మరణించగలరు. నీవు సరైన యోచన చేసేవాడవు కాబట్టి ఆ

రీతిగా చేయలేదు'. 'కావున నేను వేసే ప్రశ్నలకు నీవు సముచిత సమాధానాలు చెప్పాలి' అని యక్షుడు అన్నాడు. అప్పుడు ధర్మనందనుడు 'మహాత్మా! యక్షుడా! నీవు అడిగే ప్రశ్నలకు నేను సమాధానాలు చెప్పగలనా? నేనెంతటివాడను? నా జ్ఞానం ఎంతటిది? అయినను, నాకు తెలిసినమేరకు సమాధానాలు చెప్పగలను. దయచేసి అడుగుము' అని విన్నవించాడు. అంత యక్షుడు ఇలా ప్రశ్నించాడు.

'యక్షప్రశ్నలకు సమాధానం చెప్పే అధికారం ధర్మరాజుకు ఏవిధంగా వచ్చింది? ధర్మరాజు పన్నెండేళ్లు ఆరణ్యవిశ్వవిద్యాలయంలో జిజ్ఞాసువుగా విద్యాభ్యాసం చేసినవాడు. యక్షప్రశ్నలఘట్టం అతడికి స్నాతక పరీక్ష. పరీక్షాధికారి సాక్షాత్తు యమధర్మరాజే. పన్నెండేళ్ల నుండి ధర్మరాజు మహర్షులను వేసిన ప్రశ్నలపరంపరలకు అంతు లేదు కదా! సమాధానం చెప్పే వంతు ఇప్పుడు ధర్మరాజుకు వచ్చింది. ఇది అతడికి అసిధారావ్రతం. అతడి తమ్ముల ప్రాణాలు అతడి సమాధానాలలో ఇమిడి ఉన్నాయి. అంతేకాక, యక్షప్రశ్నపరంపరలో రెండు స్వారస్యాలున్నాయి. అవి అన్నీ చిక్కుముడుల ప్రశ్నలు. అడిగిన యక్షుడికి సముచిత సమాధానాలు తెలుసు. ఇవి జిజ్ఞాసువు అడిగిన ప్రశ్నలు కావు. పరీక్షాధికారి ప్రాగల్భ్యంతో వేసిన ఆదర్శ ప్రశ్నలు. ఆదర్శ ప్రశ్నలకు ఆదర్శ సమాధానాలు ఇందులో ఉన్నాయి. విశ్వసాహితీ జగత్తులో – 'యక్షప్రశ్నలు' నిరుపమానాలు'. (*ఆంధ్ర. ఆరణ్య. 7. పుట: 1217*)

యక్షప్రశ్నల ఘట్టంలో సహదేవుడు చేసిన తప్పుని వరుసగా నకులుడు, అర్జునుడు, భీముడు ఎందుకిలా జరిగింది? అని ఆలోచించకుండా, ఇది అనువుగానిచోటు అని గ్రహించకుండా, అధికులమని భావించి ఆ తప్పుని పునరావృతం చేశారు. తమ్ముళ్లు చేసిన తప్పు ధర్మరాజు చేయలేదు. ఎంతైనా అందరికంటే పెద్దవాడు, అనుభవజ్ఞుడు కాబట్టి ధర్మరాజు యుక్తితో, తెగువతో మార్గాన్ని కనుగొన్నాడు. నిర్వహణ సామర్థ్యానికి ఇంతకంటే చక్కని ఉదాహరణ ఉండబోదు అంటే అతిశయోక్తి కాదేమో! పరిస్థితులు సాధారణంగా ఉన్నప్పుడు నెగ్గుకురావడం పెద్ద విషయం కాదు. ప్రతికూల, విపత్కర పరిస్థితుల్లో సైతం తెగువని, యుక్తిని ప్రదర్శించి సమస్యకి పరిష్కారం కనుక్కోవడం గొప్ప. నిర్వహణ సామర్థ్యం అంటే ఇదే. ధర్మరాజుకి ఆ సామర్థ్యం సహజంగా ఏర్పడింది.

యక్షుడి ఎదుట విగతజీవుల్లా పడివున్న నలుగురూ సాధారణ సైనికులు కాదు, వేల సైనికులని మట్టికరిపించగల యోధులు. అక్కడ యుద్ధం జరిగిన ఆనవాళ్లు కూడా లేవు. అందుకే, తన తమ్ముళ్లని

ఇలా చేసింది భౌతికమైన శక్తి కాదని ధర్మరాజు గ్రహించాడు. ధర్మరాజు తనకు వచ్చిన కష్టానికి చలించిపోలేదు. దాన్ని ఒక పరీక్షగా భావించి సన్నద్ధమయ్యాడు. కష్టం ఎదురుగా ఉన్నప్పుడు దాన్ని ఎదుర్కోవడం ఒకటే మార్గం అని గ్రహించాడు. భగవంతుడిని నమ్ముకుని తన వంతు ప్రయత్నం చేశాడు. ప్రశ్నల సవాల్ ని స్వీకరించడానికి ధర్మరాజు సిద్ధపడడమే ద్వారానే సగం విజయం సాధించాడు.

నేటితరం, యక్షప్రశ్నల ఘట్టం నుంచి, ప్రత్యేకంగా ధర్మరాజు పాత్ర నుంచి గ్రహించవలసింది ఇదే. సమస్య ఎదురయినప్పుడు దానికి పరిష్కారం కనుక్కునేందుకు తన వంతు ప్రయత్నం మనిషి చేయాలి. ఫలితం భగవంతుడికి విడిచిపెట్టాలి.

## 6.13. ధౌమ్యుడి సందేశం: సర్దుబాటు తత్వం.

అజ్ఞాతవాసంలోకి ప్రవేశించబోతున్న పాండవులకి ధౌమ్యుడు ఎన్నో సూచనలు, సలహాలు ఇచ్చాడు. పాండవులు రాజవంశీకులు. వారికి నాయకత్వ లక్షణాలు మెండుగా ఉండచ్చు. కానీ, సేవాధర్మాలు పూర్తిగా తెలియవు. అందుకే, పాండవులకి ధౌమ్యుడు ఈ విధమైన సూచనలు చేశాడు. ధౌమ్యుడి సూచనలు పాండవులకే కాదు, నేడు ఉద్యోగాలు చేస్తున్న ఎంతోమందికి ఉపయోగపడతాయి. ఉద్యోగధర్మాన్ని ఎలా నిర్వర్తించాలి? ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి? యజమానికి ఆగ్రహం రాకుండా, ఉద్యోగాన్ని చక్కగా నిర్వహణ చేసుకోవడం ఎలా? నిర్వహణ సామర్థ్యం అనేది మనిషికి ఎందుకు అవసరం? దాన్ని ఎలా పెంపొందించుకోవాలి? ఇలా ఎన్నో ప్రశ్నలకు ధౌమ్యుడి భాషణం సమాధానంగా నిలుస్తుంది.

ఉ. రాజగృహంబుకంటె నభిరామముగా నిలుగట్టఁ గూడ దే
యోజ నృపాలుఁ డాకృతికి; నొప్పగు వేషము లాచరించు నే
యోజ విహారముల్ సలుప; నుల్లమునం గడు వేడ్క సేయు నే
యోజ విదగ్ధుఁ డై పలుకు; నొద్దులకుం దగ దట్లు సేయఁగన్. (*ఆంధ్ర. విరాట: 1 : 123*).

‘రాజుగారి భవనం కంటే రాజోద్యోగి ఇల్లు అందంగా ఉండకూడదు. రాజుగారితో సమానంగా దర్పం ప్రదర్శించేలా ఉద్యోగి వస్త్రధారణ చెయ్యకూడదు. రాజుగారు విహరించే ప్రదేశాల్లో తానూ విహరించాలని ఉబలాట పడకూడదు. రాజు మాటల్లో కనబడే లౌక్యం, తెలివితేటలు ఉద్యోగి మాటల్లో ఉండవలసిన అవసరం లేదు’.

పాండవుల పురోహితుడైన ధౌమ్యుడు పంచపాండవులకు ఉద్యోగధర్మాలు బోధిస్తూ చెప్పిన మాటలివి. సంస్థ యజమాని ఇంటి కంటే సంస్థలో పని చేసే ఉద్యోగి ఇల్లు కొంచెం తక్కువ స్థాయిలోనే ఉండడం మంచిది. సొంత ఆస్తులతో కట్టుకున్నదే అయినా అది చూడగానే యజమాని మనస్సులో అసూయతో పాటు, అనుమానం కూడా పుట్టే అవకాశం ఉంది. వేషం కూడా అంతే. ఆధునికంగా ధరించే సూటు, బూటు వంటి వాటిల్లో కూడా యజమాని కంటే ఒక్క రవ్వ తక్కువ అందంగా కనిపించడమే మంచిది. యజమాని దంపతులు ఏదైనా విహారయాత్రకు పిలిచినా వారితో వెళ్లకూడదు. ఒక వేళ, తెలియక వెళ్లినా వారు ప్రథమ శ్రేణిలో ప్రయాణం చేస్తే ఉద్యోగి కొంచెం తక్కువ శ్రేణిలో ప్రయాణించాలి. లేకపోతే అపార్థాలు పెరిగే అవకాశం ఉంది.

చివరిదైనా చిన్నది కాని మాట– యజమాని ముందు, ముందు వెనుక ఆలోచించకుండా తన భావాలు వ్యక్తం చేయడం, అధికారి ముందు అనవసరంగా అధికంగా మాట్లాడడం చేయకూడదు. ఆ మాటల్లోంచే ఉద్యోగి బలహీనతలు కనిపెట్టి అదును చూసి యజమానులు ఆడిస్తారు. వివాదస్పద విషయాల్లో ముందు అధికారి అభిప్రాయం తెలుసుకొని దానికి అనుగుణంగా మాట్లాడడం మంచిది.

అయితే, తిక్కన నాటి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన పద్యమిది. ఈ పద్యాన్ని నేటి కాలానికి అన్వయించడంలో చిన్నపాటి మార్పులు చేసుకోవాలి. ప్రపంచం తనను తాను ఆధునీకీకరించుకుంటున్న కొద్దీ మనిషి ఆలోచనావిధానంలో కొత్త మార్పులు రావడం సహజం. ఉద్యోగిని చూసి యజమాని అసూయ పడితే అది యజమాని తప్పు. ఉద్యోగి ఎంత బాగా పని చేస్తున్నాడన్నదే యజమానికి ముఖ్యం. అతడి వ్యక్తిగత విషయాలు యజమానికి అనవసరం. అయితే మాట విషయంలో మాత్రం యజమాని అభిప్రాయం తెలుసుకున్నాక మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడమే మంచిది. మన అవసరానికి తగినట్టు ఔచిత్యంతో, లౌక్యంగా ఉద్యోగాన్ని నెట్టుకురావడం ముఖ్యం. ఎటువంటి పరిస్థితిలోనైనా వ్యక్తిత్వాలను దిగజార్చుకోవలసిన అవసరం లేదు. అది ఉండడం మంచిదే. అయితే పెద్ద వాళ్ల దగ్గర వినయంగా ఉండడం కూడా చాల అవసరం. అలా చేస్తేనే మనం పెద్దవాళ్లమయ్యాక మనకి గౌరవం దక్కుతుందనే విషయం ధౌమ్యుడి ప్రసంగం ద్వారా అర్థమౌతోంది.

ధౌమ్యుడు పాండవులకి ఉద్యోగ ధర్మాల గురించి మరెన్నో సూక్ష్మాలు తెలియజేశాడు. ఆ సూచనలని అనుసరించి మెలిగితే, ఎటువంటి ఇబ్బందులూ రావని ధౌమ్యుడు పాండవులకి భరోసా ఇచ్చాడు. ధౌమ్యుడి ఈ విధంగా సేవాధర్మాల గురించి, నిర్వహణ గురించి తన భాషణాన్ని కొనసాగించాడు.

'ఏదైనా సరే, సాధించుకోగలిగిన సమర్థుడి పనికి అడ్డు వెళ్లకూడదు. అలా అడ్డు వెళ్లి, ఆ కార్యాన్ని మీద వేసుకుని, నేర్పును ప్రదర్శిస్తూ పూసుకుతిరిగితే అసలు స్థితికే ముప్పు వస్తుంది.

రాజుతో సన్నిహితంగా ఉండడంలో తప్పు లేదు. కానీ, రాజువద్ద ఉండే చాలామందికి కష్టం కలిగించే పనులలో మాత్రం జోక్యం పనికి రాదు. అటువంటి పనులవల్ల సేవకుడి 'తేజస్సు' బహిర్గతం కావచ్చు. వాటివల్ల పేరుప్రతిష్టలు రావచ్చు. కానీ, ఆ తర్వాత హాని కలగడం మాత్రం తథ్యం. అందువల్ల, తెలివిగలవారు అటువంటి పనులకు పూనుకోరాదు.

రాజు దగ్గర మౌనంగా ఉండకూడదు. అలా అని పదిమందితో ఆర్భాటంగా మాట్లాడడం పనికి రాదు. తనకు దగ్గరవారైన ఉద్యోగులతో కలిసి తాను రాజుతో మాట్లాడడం సబబు.

తాను రాజు దగ్గర ఉన్నప్పుడు వ్యతిరేకత తోచే విధంగా ఇతరులకు సమాధానం చెప్పకూడదు. అవసరం ఏర్పడితే మాత్రం తనంతట తానే ముందుకు వచ్చి రాజాజ్ఞను నిర్వర్తించాలి.

కొలువులో రాజుకు మరీ ఎదురుగానూ ఉండకూడదు. అలాగని, వెనకవైపూ ఉండకూడదు. ఏదో ఒక పక్కన నిలబడి సేవించాలి. ఏమంటాడో, ఎటు చూస్తాడో, ఎవరిని చూస్తే ఎటువంటి ఆలోచన కలుగుతుందో– మొదలైన భావాలను మనసులో ఉంచుకొని రాజుముఖం మీదనే దృష్టి సారించి సభలో మెలగాలి.

అంతఃపురంలోని మాటలు ఎప్పటికీ బయటపెట్టరాదు. ఇతరత్రా మరెక్కడైనా రాజుకు సంబంధించిన మాటలు వింటే ముందు ఆలోచించాలి. ఆ తర్వాత ఆ మాటలు రాజు వినదగినవైతే చెప్పాలి' (*ఆంధ్ర. విరాట: 1 : 125- 130*).

పాండవులకు ధౌమ్యుడు ఇవే కాకుండా సేవాధర్మాల గురించి, నిర్వహణ సామర్థ్యాన్ని గురించి మరి కొన్ని విషయాలు వివరించాడు.

'రాజు అనుగ్రహిస్తేనే ఆసనాలు అధిరోహించాలి. అలాగే వాహనాలు కూడా. రాజానుగ్రహం లేకుండా శ్రేష్ఠమైన ఆసనాలు, పెద్ద పెద్ద వాహనాలు తమంతట తాము ఎన్నుకోవడం, అధిరోహించడం అనేవి ఎంత రాజగౌరవం పొంది ఉన్నవారికైనా పనికిరాదు.

రాజు తనని గౌరవించాడని ఉబ్బిపోరాదు. అవమానించాడని క్రుంగిపోరాదు. ఆ రెండింటినీ లెక్కించక ఎప్పటిలానే రాజుదగ్గర ప్రవర్తించే సేవకులకు మంచి జరుగుతుంది. ఆపదలు తొలగిపోతాయి.

ఒకవేళ రాజు ఎవరినైనా సంరక్షించాలని అనుకోవచ్చు. లేదా శిక్షించాలని అనుకోవచ్చు. ఆ విషయాలు తనకి తెలిసినా, అవి అమలు కాకముందే సేవకుడైనవాడు తనంతట తాను బయటపెట్టేవాడు మూర్ఖుడు.

ఎండకి, వానకి సహించాలి. తన ఇల్లనీ, పొరుగు చోటని, అనుకోకూడదు. 'ఆకలి వేస్తుంది, అలసిపోతాను, నిద్రకి సమయం మించిపోతుంది, దాహం వేస్తున్నది, ఒక్కడినే ఎలా' అనే ఆలోచనలకు అవకాశం ఎప్పుడూ ఇవ్వకూడదు. అనుకోకుండా రాజు ఒక పని చెప్పినట్లైతే శ్రద్ధతో, భక్తితో చెయ్యాలి.

రాజుకి తాను ఎంత ఆప్తుడైనా కావచ్చు, రాజధనాన్ని పాము ఎముకలవలె భావించాలి. వాటిని పరికించాలి. వాటిని సంగ్రహించే గుణం మానితేగాని మానమూ, ప్రాణమూ నిలువవు' (*ఆంధ్ర. విరాట: 1 : 132 – 136*).

ధౌమ్యుడు పాండవులకి చేసిన సూచనల్లో మరికొన్ని ముఖ్యమైనవి ఉన్నాయి. అవి ప్రతీఉద్యోగికీ ఉపకరిస్తాయి.

'శత్రువుల దూతలుగాని, రాజు ఆగ్రహానికి పాత్రులై నిరాకరించబడిన వారుగాని, పాపాత్ములుగాని, తమకి దగ్గరగా ఉండడం మంచిది కాదు. దీనివల్ల చివరికి కీడు, నింద వస్తాయి.

రాజుదగ్గర మెలిగే ఏనుగుతోనైనా, దోమతోనైనా వైరం కలిగే ప్రవర్తన మంచిది కాదు. భటుడు తానెంత పూజనీయుడైనా రాజు కొలువుకు సంబంధించిన జనులతో స్నేహం కలిగి ఉండడం మేలు.

భోగాల కొరకే కదా అని సంపదలని సేవకుడు విచ్చలవిడిగా భోగించరాదు. రాజుకి కంటగింపు కలుగకుండా నమ్రతతో వేడుకలు చేసుకోవాలి' (*ఆంధ్ర. విరాట: 1 : 138 – 140*).

ధౌమ్యుడి భాషణం ఎన్నో సేవాధర్మాలను గురించి, వాటి నిర్వహణలో వచ్చే సవాళ్ల గురించి ప్రస్తావించి, ఆ సవాళ్లని ఎలా ఎదుర్కోవాలో కూడా వివరించింది. రాజవంశంలో అత్యంత వైభవాల మధ్య ముద్దుగా పెరిగిన పాండవులకి ఈ సూచనలు ఎంతో అవసరం. సేవకుడి కష్టాలు తెలుసుకున్న నాయకులు మాత్రమే వారి వృత్తికి తగిన గౌరవాన్ని ఇస్తారు. అజ్ఞాతవాసం పాండవులకి ప్రాణసంకటమైన పరిస్థితి. ఏ సందర్భంలోనైనా వారు దొరికిపోతే, మళ్లీ మొదటి నుంచి శిక్ష అనుభవించవలసిందే. అందుకే, ధౌమ్యుడు చెప్పిన జాగ్రత్తలు పాండవులు శ్రద్ధగా విన్నారు.

ధౌమ్యుడు పాండవులకి చేసిన సూచనలు కేవలం వారికే కాదు, ఉద్యోగాల్లో కుదురుకోలేక నిత్యజీవితంలో సతమతవుతున్న నేటి తరానికి సైతం గొప్పగా దిశానిర్దేశం చేస్తాయి. పాండవులు ఉండబోయేది రాజుల కొలువుకూటాల్లో కనుక, ధౌమ్యుడు తత్సంబంధితమైన సూచనలు చేశాడు.

అయితే, ధౌమ్యుడు చెప్పిన మాటల్లో రాజు స్థానంలో యజమాని అనే మాటని పెట్టి చూస్తే, ఆ మాటలు నేటి సమాజానికి అతికినట్టు సరిపోతాయి.

సేవాధర్మంలోని సూక్ష్మాలు తెలియకే నేటి తరం ఉద్యోగ జీవితంలో ఎన్నో ఒడిదిడుకులను ఎదుర్కొంటోంది. అందుకే, ధౌమ్యుడి సేవాధర్మ సూత్రాలను అన్వయించుకుని, ఆచరిస్తే జీవితంలో అద్భుతమైన మార్పు రావడం ఖాయంగా కనిపిస్తోంది. ధౌమ్యుడి సూత్రాలు మొత్తంగా ఆకళింపు చేసుకుని ఆచరించగలిగితే నిర్వహణ సామర్థ్యం మనిషి సొంతమైనట్టే.

## 6.14. కీచకవధ ఘట్టం: వ్యూహ నైపుణ్యం

తిక్కన రచించిన విరాట పర్వంలో, తానొక వివాహితనని తెలిసి, తనకి ఇష్టం లేదని తెలిసి కూడా కీచకుడు తనని వెంబడిస్తుంటే, వేధిస్తుంటే, అజ్ఞాతవాస వ్రతం భంగం కాకుండా ద్రౌపది కీచకుడిని ఎదుర్కొన్న తీరు అత్యంత అనుసరణీయం. ఈ ఘట్టంలో ద్రౌపది పాత్ర, నిర్వహణ సామర్థ్యానికి అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది.

ఉ. ఉల్లము దల్లడిల్లఁ దను వుద్గత ఘర్మజలంబు దాల్చుచున్
డిల్లపడంగ 'నా కిది కడింది విచారము పుట్టె; నందుఁ బో
నొల్ల ననంగ రా, దచటి కూరక పోవను రాదు, నేర్పు సం
ధిల్లఁగ దీనిఁ బాపికొను దీమస మెట్టిది యొక్కొ దైవమా!' (*ఆంధ్ర. విరాట. 2: 91*)

'ద్రౌపది మనసు కంపించిపోయింది. దానితో శరీరమంతా చెమటపట్టింది. పైపెచ్చు నీరసించింది. అప్పుడు ఇలా అనుకుంది : 'సుదేష్ణ మాటలవలన నాకు మిక్కిలి దుఖం కలిగింది. అయినా, నేను కీచకుడి ఇంటికి పోలేను అని అనలేను, అక్కడికి ఒంటరిగా పోనూ లేను. ఓ భగవంతుడా! ఈ చిక్కు నుండి బయటపడే ఉపాయం ఏదో నీవే చూపించాలి".

'ఈ పద్యంలోని అలంకారం వికల్పాలంకారం. 'విరోధే తుల్య బాలయో ర్వికల్పాలంకృతి ర్మతా' అని లక్షణం. సమాన బలం గల రెండు విరుద్ధాంశాల మధ్య వికల్పాన్ని చెప్పేది వికల్పాలంకారం' (*ఆంధ్ర. విరాట. 2. పుట: 194*).

ఈ ఘట్టం ప్రారంభం నుండి తాను కీచకుడి బారిన పడకుండా, తన మాటతీరుతో, సద్వర్తనంతో నెట్టుకువచ్చిన ద్రౌపదికి అత్యంత సంక్లిష్టమైన పరిస్థితి ఎదురయ్యింది. కీచకుడి ఇంటికి

ద్రౌపది వెళ్లవలసిన పరిస్థితి ఏర్పడింది. సమానబలం కలిగిన సేవాధర్మానికి, స్వీయధర్మానికి మధ్య సంఘర్షణలో ద్రౌపది ఏదో ఒకవైపు తేల్చుకోవలసిన పరిస్థితి ఏర్పడింది.

ద్రౌపది సేవావృత్తిలో ఉంది కాబట్టి, యజమానురాలి ఆజ్ఞను దాటడానికి వీలులేదు. అంటే ఆమె కీచకుడి ఇంటికి వెళ్లాలి. మరోవైపు ద్రౌపది ఒంటరిగా కీచకుడి వద్దకు వెళ్తే అతడు ద్రౌపదిని బలాత్కరించే ప్రమాదం ఉంది. ఇటువంటి సందిగ్ధావస్థలో ద్రౌపది తప్పనిసరై, సేవాధర్మానికే మొగ్గు చూపింది. అది ఆమెలోని స్వార్థరాహిత్యానికి మచ్చుతునక. ఈ ఘట్టంలో ఇంతవరకు తన సంభాషణానైపుణ్యాన్ని ప్రదర్శించిన ద్రౌపది, ఇప్పుడు తన నిర్వహణ సామర్థ్యాన్ని నిరూపించుకుంది.

అయితే, తాను ధర్మానికి కట్టుబడి ఉంది కాబట్టి, భగవంతుడిపై భారం వేసింది. జీవితంలో విపత్కర పరిస్థితులు ఎదురయినప్పుడు సగటు మనిషి చేయవలసిన ప్రయత్నం అంతా ద్రౌపది చేసింది. వీలైనంతవరకు సమస్యని మూలం నుంచి పరిష్కరించడానికి ప్రయత్నించింది. కీచకుడిని రకరకాలుగా వారించింది. తప్పనిసరి పరిస్థితిలో స్వీయధర్మం కంటే సేవాధర్మానికి మొగ్గు చూపింది. మానవ ప్రయత్నం అంతా చేశాక దేవుడిపై భారం వేసింది. ద్రౌపది పాత్రలో ముందు ఆత్మవిశ్వాసం, ఆపైన పరమాత్మవిశ్వాసం రెండూ కనిపిస్తాయి. ద్రౌపది భగవంతుడిని నమ్ముకుని, ధర్మానికే కట్టుబడి ఉంది కాబట్టి, కీచకుడి ఇంటికి వెళ్ళే క్రమంలో ద్రౌపదిని ఆ ధర్మమే రక్షిస్తుంది. (చూ. *ఆంధ్ర. విరాట. 2: 110*).

కీచకవధ ఘట్టంలో ద్రౌపది పాత్ర ఒక ఎత్తైతే, ధర్మరాజు, భీముల పాత్రలు మరొక ఎత్తు. తనకి జరిగిన అన్యాయాన్ని (కీచకుడి వేధింపు) నిండు సభలో విరాటుడికి చెప్పుకొని, ఆగ్రహాన్ని ఆపుకోలేక ద్రౌపది తన భర్తలని నిందిస్తుంది. ఆ సమయంలో తనలో బద్దలౌతున్న అగ్నిపర్వతాన్ని అణగదొక్కి, ద్రౌపదినీ, భీముడినీ ధర్మరాజు అదుపు చేసిన తీరు అనితరసాధ్యం. అజ్ఞాతవాస వ్రతానికి భంగం వాటిల్లకుండా ధర్మరాజు చాలా నేర్పుగా సభలో వ్యవహారాన్ని నడిపించాడు.

సీ. 'జననాయకుండు నీ సభవారు నీదగు / తెఱఁగెల్ల నెఱిఁగిరి తెఱవయింక !
మానక యీ పలుమాట లాడఁగ నేల? / చనుము నీవు సుదేష్ణ సదనమునకు;
నీ పరాభవమునఁ గోపింప నేరరే / గంధర్వులకుఁ దఱిగాదుగాక;
సమయ మెయ్యది యేనిఁ దమకును నీకుఁ గ / ల్గిన యట్టులైనను గినియ రిచట

తే. గాన నాథుల దూఱంగఁ గాదు వినుము
సతికిఁ; దానెంత వడియును సభలలోనఁ
దడవుగా నిల్చి యిట్టు లుదగ్రవృత్తి
శంక సెడి ధిక్కరింపంగఁ జనునె చెపుమ!' (*ఆంధ్ర. విరాట. 2: 148*)

'ఓ సైరంధ్రీ! నీ సమాచారం రాజుగారికి, సభాసదులకి సవివరంగా తెలిసింది. ఇంక ఎక్కువ మాట్లాడకుండా రాణిగారి ఇంటికి వెళ్లిపొమ్ము. నీకు జరిగిన అవమానానికి నీ భర్తలైన గంధర్వులు కోపించరా? కాని, ఇది తగిన సమయం కాదని ఊరుకున్నారు. నీకూ వారికీ ఏదో నియమం ఉన్నట్లైతే, సమయం కాదని వారిప్పుడు కోపగించరు. కాబట్టి, దానిని గమనించక నీ భర్తలను నీవు నిందించడం ఉచితం కాదు. సతి తానెన్ని పాట్లుపడినా నిండు సభలలో చాలాసేపు నిలబడి ఆవేశంతో సంకోచం లేకుండా ఎదిరించి మాట్లాడడం మంచిదా? నీవే చెప్పుము.'

'ద్రౌపది గూఢోక్తులతో మాట్లాడింది. ధర్మరాజు కూడ గూఢోక్తులతోనే ఆమెకు సమాధానం చెప్పసాగాడు. ఆమె ఉద్వేగకరంగా మాట్లాడింది. ధర్మజుడు నిబ్బరంగా, నిర్వికారంగా మాట్లాడుతున్నాడు. ప్రజలు ధర్మజుడి మాటల తీరులో తేడా లేదు కాబట్టి సభలో ఆమెను మందలిస్తున్నాడనే భావించి ఊరుకుంటారు. ధర్మరాజు మాటలు సభ్యుల దృష్టిలో మందలింపు మాటలుగా, ద్రౌపది దృష్టిలో చేయవలసిన కర్తవ్యాన్ని బోధిస్తున్న విధివాక్యాలుగా స్ఫురించడం గూఢోక్తి అలంకార విశేషం.'

ధర్మరాజు నిర్వహణ సామర్థ్యానికి ఈ పద్యం ఒక చక్కటి ఉదాహరణ. ద్రౌపదిని వెంబడిస్తూ విరాటుడి సభలోకి ప్రవేశించిన కీచకుడిని చూసి వీరావేశంతో రగిలిపోతున్న భీముడిని తన సంభాషణానైపుణ్యంతో వారించిన ధర్మరాజు, ఇక్కడ మరింత చాకచక్యంగా వ్యవహరించి ద్రౌపదిని ఓదార్చే ప్రయత్నం చేశాడు. ద్రౌపదికి జరిగిన అవమానానికి ఆమె అలా ప్రవర్తించడం సహజం. కాని, పాండవులు ఉన్న పరిస్థితుల్లో కోపాన్ని, పరాక్రమాన్ని ఎక్కడ పడితే అక్కడ ప్రదర్శించే అవకాశం లేదు. అలా చేస్తే వారి అజ్ఞాతవాస వ్రతానికి భంగం వాటిల్లుతుంది. ద్రౌపదికి జరిగినా అన్యాయానికి లోపల రగిలిపోతున్నా, ఆ ఆవేశాన్ని బయట పెట్టకూడని పరిస్థితి పాండవులది.

కీచకుడి మీద విరుచుకుపడడానికి ఇది సరైన సమయం కాదు కాబట్టే, ధర్మరాజు ద్రౌపదితో, 'నీ భర్తలకు, నీకు ఏదో నియమం ఉండివుంటుంది. అందుకే నీ భర్తలు ఇప్పుడు వారి కోపాన్ని

ప్రదర్శించడం లేదు' అంటూ అజ్ఞాత వాసవ్రత (నియమం) విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించాడు. 'తగిన సమయం కోసం నీ భర్తలు ఎదురుచూస్తున్నారు' అంటూ ద్రౌపదిని ఊరడించే ప్రయత్నం చేశాడు.

చిన్నచిన్న మనస్పర్థలతో చీటికీ మాటికీ కోపాలు తెచ్చుకుని విడాకుల బాట పడుతున్న నేటితరం ఈ ఘట్టంలో ద్రౌపదిని, ధర్మరాజును చూసి సంసారాన్ని ఎలా నెట్టుకురావాలో నేర్చుకోవాలి. ధర్మరాజు చెప్పగానే, పరిస్థితిని అర్థం చేసుకుని కొంతసేపు వాదించి ద్రౌపది అక్కడి నుండి వెళ్లిపోయింది. అంతేగాని, ఇంటి గుట్టు రట్టు చేయలేదు. అది ద్రౌపది సంస్కారానికి నిదర్శనం. ఎన్ని గొడవలు వచ్చినా అవి భార్యాభర్తల మధ్యనే ఉండాలి కాని, నలుగురిలోనూ ఇంటి విషయాలు బయటపెట్టుకోకూడదు అనే ప్రాథమిక సూత్రాన్ని నేటితరం దంపతులు ఈ ఘట్టం ద్వారా గ్రహించాలి. అటు ఇంటి ఇల్లాలిని ఓదారస్తూనే, వారి అజ్ఞాతవాస వ్రతం భంగం కాకుండా తన సంభాషణానైపుణ్యంతో, నిర్వహణ సామర్థ్యంతో పరిస్థితిని చక్కదిద్దిన ధర్మరాజు నేర్పు, భవిష్యద్వర్తమాన తరాలకు దిశానిర్దేశం చేస్తుంది.

## 6.15. ముగింపు

నిర్వహణ సామర్థ్యం అంటే మొండిగా దూసుకుపోవడం కాదు, చాకచక్యంగా లక్ష్యం వైపు అడుగులు వేసే నేర్పు అని ఆంధ్ర మహాభారతం ద్వారా తెలుస్తోంది. లక్ష్యాన్ని చేరుకునే క్రమంలో ప్రతీ మనిషి సవాళ్లను దేనికి దానికి విడిగా, వైవిధ్యంగా ఎదుర్కోవాలని ఆంధ్ర మహాభారతం సూచిస్తోంది. నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించుకునేందుకు మనిషి తనకి తానుగా చేసుకోవలసిన మార్పులను సూచిస్తూనే, సవాళ్లను, సమస్యలను అధిగమించే విధానాన్ని అత్యంత వాస్తవికంగా ఆంధ్ర మహాభారతం కనుల ముందు ఆవిష్కరించింది.

ఆంధ్ర మహాభారతంలోని మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాల ఆధారంగా నిర్వహణ సామర్థ్యాన్ని ఎలా పెంపొందించుకోవాలో ఈ అధ్యాయంలో వివరించబడింది. నాలుగు పర్వాలలో ఈ దృక్కోణానికి సంబంధించిన సాహిత్యాన్ని సాధ్యమైనంత సమగ్రంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఉదహరించినవి కొన్నే అయినా, మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి. కేవలం, నాలుగు పర్వాలలో ఇన్ని ఉదాహరణలు పరిశోధన దృష్టికి దర్శనమిస్తే, మొత్తం ఆంధ్ర మహాభారతంలో మరెన్నో ఉదాహరణలు దొరికే అవకాశం ఉంది.

# అధ్యాయం – 7

# ఆంధ్ర మహాభారతం: సంభాషణానైపుణ్యం

## 7.1. ఉపోద్ఘాతం

సత్యమే చెబుతున్నప్పటికీ, ఆ సత్యాన్ని ఎదుటివారికి నచ్చే విధంగా, పని జరిగే విధంగా మాట్లాడడమే సంభాషణా నైపుణ్యం. సంభాషణా నైపుణ్యం అంటే దబాయించి అజమాయిషీ చలాయించడం కాదు, గుబాళించేలా మాట్లాడే నేర్పు. 'మాట పెదవి దాటితే పృథివి దాటినట్లే' అన్నట్టుగా మాటని ఎప్పుడు, ఎక్కడ, ఎలా, ఎంతవరకు వినియోగించాలో తెలిసి ఉండడమే సంభాషణా నైపుణ్యం. ఒక్క మాట యుద్ధాన్ని సృష్టించగలదు, అదే యుద్ధాన్ని నివారించనూగలదు.

నేటి అత్యాధునిక సమాజంలో సంభాషణా నైపుణ్యం జీవన పోరాటంలో ఒక ముఖ్యపాత్రని పోషిస్తుంది. ఒక వ్యక్తి మంచి ఉద్యోగం తెచ్చుకోవాలంటే సంభాషణా నైపుణ్యం (Communication skills) ఎంతో అవసరం. ఒక వ్యక్తి నాయకుడిగా ఎదగాలంటే సంభాషణా నైపుణ్యం అవసరం. అదే నాయకుడు ఎన్నో ప్రాంతాల, భాషల, సంస్కృతుల, కులాల, మతాల సమూహంతో నిండిన దేశానికి చక్రవర్తి కావాలంటే సంభాషణా నైపుణ్యం తప్పనిసరిగా కావాలి. అదే నాయకుడు రెండు దేశాల మధ్య దౌత్య సంబంధాలను సవ్యంగా నడిపించాలంటే సంభాషణా నైపుణ్యం తప్ప వేరొక సాధనం కనపడదు.

ఒక సంస్థని నడిపించే యజమానికి సంభాషణానైపుణ్యం ఉండాలి (మాటలతో పని చేయించుకునే నేర్పు). ఒక పాఠాన్ని విద్యార్థులకి అత్యంత ఆకర్షణీయంగా చేరవేయాలంటే అధ్యాపకుడికి సంభాషణా నైపుణ్యం కావాలి. ఒక సాఫ్ట్ వేర్ ఉద్యోగి యజమాని మన్నన పొందాలంటే ప్రతిభతో పాటు సంభాషణా నైపుణ్యమూ అవసరమే. క్రీడల్లో ఒక జట్టుని నడిపించే ఒక నాయకుడికి (Captain)కి సంభాషణా నైపుణ్యం కూడా అవసరమే.

ఒక ఉత్పత్తిని అంగట్లో/ విపణిలో అమ్మడానికి సంభాషణా నైపుణ్యం అత్యంత ఆవశ్యకం. ఇలా ఏ రంగంలో చూసినా సంభాషణా నైపుణ్యం యొక్క ఆవశ్యకత కనిపిస్తుంది. వ్యక్తిగత సాఫల్యాలు, కుటుంబ అనుబంధాలు, సంస్థల నిర్వహణలు అన్నీ సంభాషణా నైపుణ్యంపై ఎంతో

కొంత ఆధారపడతాయి. ఈ రకంగా చూస్తే సమాజ పురోగమనానికి సంభాషణా నైపుణ్యం ఎంతో అవసరమయ్యే సామాజికాంశం అని స్పష్టమౌతోంది.

ఆంధ్ర మహాభారతంలో ఎన్నో పాత్రలు తమ సంభాషణా నైపుణ్యం ద్వారా అత్యాచారాలని, యుద్ధాలని నివారించిన సందర్భాలు ఉన్నాయి, గుబాళించే మాటల ద్వారా సభలో అందరి మనస్సులు గెలుచుకున్న సందర్భాలు ఉన్నాయి. ఆంధ్ర మహాభారతంలో కొన్ని కథల్లో సంభాషణా నైపుణ్యంతో చక్రవర్తుల మన్ననలు పొందిన వ్యక్తులున్నారు. మొత్తంగా సంభాషణా నైపుణ్యాన్ని వ్యక్తిత్వ వికాసంలో ఒక అంతర్భాగంగా ఆంధ్ర మహాభారతం చిత్రించింది.

## 7.2. ఉదంకుడి నాగలోక స్తుతి

ఉదంకుడు నాగలోకానికి కుండలాలను తిరిగి పొందడానికి వెళ్లిన సందర్భంలోని పద్యాలు సంభాషణానైపుణ్యానికి చక్కటి ఉదాహరణలుగా నిలుస్తాయి.

చ. బహువన పాదపాబ్ధి కులపర్వత పూర్ణ సరస్సరస్వతీ
సహిత మహామహీభర మజస్ర సహస్ర ఫణాళిఁ దాల్చి దు
స్సహతర మూర్తికిన్ జలధిశాయికిఁ బాయక శయ్య యైన య
య్యహిపతి దుష్కృతాంతకుఁ డనంతుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. (*ఆంధ్ర. ఆది. 1: 104*).

'పెక్కు అడవులతో, చెట్లతో, సముద్రాలతో, కులపర్వతాలతో, నీటితో నిండిన సరస్సులతో, నదులతో కూడిన గొప్ప భూమి యొక్క బరువును ఎల్లప్పుడూ వేయిపడగల సముదాయంతో ధరించి మిక్కిలి సహింపశక్యం కాని విగ్రహం గల నారాయణుడికి విడువక శయ్యగా ఉండి, పాపాలను అంతరింపజేసే అనంతుడనే పేరుగల ఆ నాగరాజు మా పట్ల అనుగ్రహం కలవాడు అగుగాక'!

నన్నయ రచించిన ఆదిపర్వం, మొదటి ఆశ్వాసంలో, ఈ పద్యం మొదల్కొని 107వ పద్యం వరకు ఉన్న పద్యాలు నాలుగూ సంభాషణానైపుణ్యానికి గొప్ప ఉదాహరణలుగా నిలుస్తాయి. నాలుగు పద్యాలు 'మాకు ప్రసన్నుడయ్యెడున్' అనే మాటతో (మకుటంతో) ముగియడం కూడా నన్నయ రచనలోని అక్షరరమ్యతని సూచిస్తుంది.

ఉదంకుడు తక్షకుడు అపహరించిన కుండలాలను తిరిగి పొందే నిమిత్తం నాగలోకానికి వెళ్లాడు. అనుకున్న పని నెరవేరాలంటే ముందు తగువుకు దిగడం కంటే సున్నితంగా మాటలతో ప్రయత్నించడం మంచిదని ఉదంకుడు భావించాడు. కేవలం మనస్సులో మంచి భావన ఉంటే సరిపోదు. ఆ భావాన్ని మంచి మాటల్లో చెప్పగలగాలి. అదే అసలైన సంభాషణానైపుణ్యం. ఉదంకుడి భావనని తన మనస్సులో నింపుకుని నన్నయ ఈ పద్యాలను రచించాడు.

అనుకున్న పని నెరవేరడం కోసం ఉదంకుడు ముందు పూర్వరంగాన్ని సిద్ధం చేసుకున్నాడు. వచ్చిన పని ఏంటో చెప్పకుండా, ముందు గౌరవసూచకంగా నాగరాజును, నాగలోకాన్ని తన వాక్చతురతతో స్తుతించాడు.

ఉదంకుడు, 'పెక్కు అడవులతో, చెట్లతో, సముద్రాలతో, కులపర్వతాలతో, నీటితో నిండిన సరస్సులతో, నదులతో కూడిన గొప్ప భూమి యొక్క బరువును ఎల్లప్పుడూ వేయిపడగల సముదాయంతో ధరించే ఆదిశేషువుని స్తుతి చేయడంలో ఉద్దేశ్యం అతడి సహనగుణాన్ని మెచ్చుకోవడం. తద్వారా తన పని నెరవేరేందుకు బాటలు వేసుకోవడం ఈ పద్యంలో కనిపిస్తుంది.

చ. అరిది తపోవిభూతి నమరారులబాధలు వొందకుండఁగా
  నురగుల నెల్లఁ గాచిన మహోరగనాయకుఁ డానమత్సురా
  సురమకుటాగ్రరత్నరుచిశోభితపాదున కద్రినందనే
  శ్వరునకు భూషణం బయిన వాసుకి మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. (*ఆంధ్ర. ఆది. 1: 105*).

'చేయ శక్యంగాని తపస్సు యొక్క వైభవం చేత రాక్షసులు పెట్టే బాధలు పొందకుండేట్లుగా నాగులందరినీ రక్షించిన గొప్ప సర్పరాజు, వంగి నమస్కరించే దేవతల యొక్క, రాక్షసుల యొక్క కిరీటాల పైభాగాలనున్న మణులకాంతి చేత ప్రకాశించే పాదాలు కల పార్వతీపతియైన శివుడికి అలంకారమైన వాసుకి అనే సర్పరాజు మాయెడ అనుగ్రహం కలవాడు అగుగాక'!

నాగలోకంలో ఉండే ముఖ్యులనందరినీ ఉదంకుడు స్తుతిస్తున్నాడు. తద్వారా ఎవరి వల్ల తన పనికి ఆటంకం ఏర్పడకుండా ముందే రంగం సిద్ధం చేసుకుంటున్నాడు. ఇది చాలా అనుసరణీయమైన లక్షణం. సంభాషణానైపుణ్యాన్ని పెంపొందించుకునే క్రమంలో నేటి తరం అలవరచుకోవలసిన లక్షణం.

భావానికి తగిన మాటలు పలకగలగడం ఒక వ్యక్తి సంభాషణానైపుణ్యాన్ని సూచిస్తుంది. శివుడి కంఠంలో ఆభరణంగా విలసిల్లే వాసుకిని ఉదంకుడు ఈ పద్యంలో ప్రసన్నుడిని చేసుకుంటున్నాడు.

"అత్యంత ఉదాత్తుడైన వాసుకి స్వభావాన్ని ఊష్మాక్షరాలకంటే అంతస్థాలతోనూ, నాదాక్షరాలతోనూ ధ్వనింపజేయడం ఇందులోని రచనాశిల్పం". (*ఆంధ్ర. ఆది. 1. పుట: 70*).

ఉ. దేవమనుష్యలోకములఁ ద్రిమ్మరుచున్ విపులప్రతాపసం
భావితశక్తిశౌర్యులు నపారవిషోత్కటకోపవిస్ఫుర
త్పావకతాపితాఖిలవిపక్షులు నైన మహానుభావు లై
రావతకోటి ఘోరఫణిరాజులు మాకుఁ బ్రసన్ను లయ్యెడున్. (*ఆంధ్ర. ఆది. 1: 106*).

'దేవతల, మనుష్యుల లోకంలో తిరుగుతూ అధికమైన తేజస్సుచేత పూజింపబడిన సామర్థ్యం, పరాక్రమం కలవారు, అనంతవిషం చేత, అధికమైన కోపంతో ప్రకాశించే అగ్నిచేత తపింపచేయబడిన సర్వశత్రువులు కలవారు అయిన మహాత్ములు ఐరావత నాగవంశంలోని కోటిసంఖ్యాకులైన భయంకర సర్పరాజులు మాపట్ల అనుగ్రహం కలవారు అగుదురుగాక'!

ఆదిశేషువుని, వాసుకిని స్తుతించిన తర్వాత ఉదంకుడు నాగవంశంలోని కోటిసంఖ్యాకులైన భయంకరమైన సర్పరాజులను స్తుతిస్తున్నాడు. ఆదిశేషువు ఔన్నత్యాన్ని, వాసుకిలోని ఉదాత్త గుణాన్ని స్తుతించిన ఉదంకుడు ఇప్పుడు సర్పరాజుల పరాక్రమాన్ని కొనియాడుతున్నాడు. అందుకు తగిన మాటలనే ఎంచుకుని తన స్వరాన్ని కూడా అందుకు అనుగుణంగా మార్చుకున్నాడు. ఎవరిని ఏ విధంగా స్తుతిస్తే ప్రసన్నులవుతారో, ఎవరిలో ఏ గుణాన్ని మెచ్చుకోవాలో ఉదంకుడికి బాగా తెలుసు. ఉదంకుడిలో ఉన్న ఈ నేర్పు, చక్కటి సంభాషణానైపుణ్యాన్ని సంపాదించుకుని లక్ష్యంవైపు అడుగులు వేస్తున్న, వేయాలనుకుంటున్న యువతరానికి మార్గనిర్దేశం చేస్తుంది.

"ఘోర ఫణిరాజులను వర్ణించే ఈ పద్యంలో ఊష్మాక్షరలతోపాటు, పరుషాక్షరాలను, స్థిరాక్షరాలను వాడడం విశేషం". (*ఆంధ్ర. ఆది. 1. పుట: 71*)

ఉ. గోత్రమహామహీధర నికుంజములన్ విపినంబులం గురు
క్షేత్రమునం బ్రకామగతి ఖేలన నొప్పి, సహాశ్వసేనుఁ డై
ధాత్రిఁ బరిభ్రమించు బలదర్ప పరాక్రమదక్షుఁ డీక్షణ
శ్రోత్రవిభుండు తక్షకుఁడు శూరుఁడు మాకుఁ బ్రసన్నుఁ డయ్యెడున్. (*ఆంధ్ర. ఆది. 1: 107*).

'గొప్ప కులపర్వతాల పొదరిళ్లలోను, అడవులలోను, కురుక్షేత్రంలోను ఇష్టం వచ్చినట్లు సంచరించే క్రీడతో అలరి, కుమారుడైన అశ్వసేనుడితో కూడి భూమి మీద తిరుగుతూ బలంలోను, గర్వంలోను, శౌర్యంలోను సమర్థుడైన పరాక్రమవంతుడూ, పాములకు రాజు అయిన తక్షకుడు మాయెడ అనుగ్రహం కలవాడు అగుగాక'!

ఉదంకుడు తక్షకుడి నుంచి కుండలాలను తిరిగి పొందడానికి నాగలోకానికి వచ్చాడు. ఇది అసలైన కారణం. కానీ, ముందు ఆదిశేషువుని, వాసుకిని, సర్పరాజులని స్తుతించిన తర్వాత ఈ పద్యంలో తక్షకుడిని స్తుతిస్తున్నాడు. ఉదంకుడి నాగస్తుతిలో ఒక వరుస క్రమాన్ని అనుసరించడం గమనించవచ్చు.

ఉదంకుడు తను వచ్చిన పనిని నెరవేర్చుకునే క్రమంలో తెలివిగా ఒక పద్ధతిని అనుసరించాడు. ఉదంకుడు తక్షకుడికంటే నాగలోకంలో ముఖ్యులైన ఆదిశేషువును, వాసుకిని, ఇతర సర్పరాజులను ముందు స్తుతించడం ద్వారా వారందరి ఆశీస్సులు పొంది, తర్వాత అసలు విషయాన్ని చెప్పాడు. ఇది ఉదంకుడి నేర్పుని సూచిస్తుంది. పైకి తక్షకుడిని స్తుతించినా, అతడిలో ఉన్న గర్వాన్ని గురించి చెప్పడం పద్యంలో గమనించవచ్చు. అందరిలో తక్షకుడు అభేద్యుడూ, దుష్కరుడూ కాబట్టి అతడిని దుష్కరప్రాసతో పై పద్యంలో స్తుతించాడు.

ఒక్కొక్క వ్యక్తిని/ సమూహాన్ని స్తుతించేటప్పుడు ఒక్కొక్క రకమైన స్వరాన్ని (Tone & Voice Modulation) ఎంచుకోవడం ఉదంకుడి నాగస్తుతిలో మనం గమనించవచ్చు. నన్నయ కూడా అందుకు తగిన మాటలను ప్రయోగించి, తన సహజలక్షణమైన అక్షరరమ్యతని సొంతం ఆపాదించి అత్యంత ఆకర్షణీయంగా ఈ పద్యాలను మలిచాడు. నన్నయ ఈ నాలుగు పద్యాల్లో మాధుర్యోజోగుణాల్లో ప్రసాదాన్ని మిశ్రమం చేసి రచించాడు. అందుకే అవి సాహితీప్రియులను రంజింపజేశాయి.

“నన్నయ పై నాలుగు పద్యాల్లో అనంతుడినీ, వాసుకినీ, ఐరావతకోటిఫణి రాజులనూ, తక్షకుడినీ మాత్రమే ఎందుకు కీర్తించాడనే అంశం లోనారసి తెలిసికోదగినది. నాగమాత అయిన కద్రువకు జన్మించిన సర్పాలలో మొదటి నలుగురి పేర్లు – అనంతుడు, వాసుకి, ఐరావతుడు, తక్షకుడు. అందువలన ఉదంకుడు వారిని స్తుతించాడు”. (*ఆంధ్ర. ఆది. 1. పుట: 72*)

## 7.3. పరీక్షిత్తు కథ

నన్నయ రచించిన ఆదిపర్వంలో వివరించబడిన పరీక్షిత్తు కథలో తన తండ్రియైన శమీకుడి పట్ల పరీక్షిన్మహారాజు ప్రవర్తించిన తీరు, శమీకుడి కుమారుడైన శృంగికి తీవ్రమైన ఆగ్రహాన్ని తెప్పించింది. ఆ ఆగ్రహంలో శృంగి ఏకంగా పరీక్షిత్తుకి మరణాన్ని శాపంగా విధిస్తాడు. ఆగ్రహం వచ్చినప్పుడు మాటని అదుపులో పెట్టుకోకపోతే అది ఎంతటి పరిస్థితులకి దారి తీస్తుందో ఈ కథలో నన్నయ వర్ణించారు.

వ. ‘అతండు మృగయావ్యసనంబున నపరిమితక్షుత్పిపాసాపరిశ్రాంతుం డయి యెఱుంగక నా కవజ్ఞఁ జేసె; నేనును దాని సహించితి; నమ్మహాత్మునకు నీయిచ్చిన శాపంబుఁ గ్రమ్మరింపనేర్తేని లగ్గగు’ ననిన శృంగి యి ట్లనియె. (*ఆంధ్ర. ఆది. 2: 176*)

క. అలుకమెయి మున్న పలికితి
నలుకని నా పలుకు తీక్ష్ణ మై యింతకు ను
జ్జ్వలదహనాకృతిఁ దక్షకుఁ
దలరఁగఁ బ్రేరేప కేల తానెడ నుడుగున్. (*ఆంధ్ర. ఆది. 2: 177*)

‘ఆ పరీక్షిత్తు వేటపై ఆసక్తి చేత అధికమైన ఆకలిచే, దప్పికచే మిక్కిలి అలసి, తెలియక నాకు అవమానం చేశాడు. నేను కూడా దాన్ని సహించాను. ఆ మహనీయుడైన పరీక్షిత్తుకు నీవు ఇచ్చిన శాపం మరల్చగలిగితే మేలవుతుంది’ అని శమీకుడు పలకగా కుమారుడైన శృంగి ఇలా అన్నాడు.

‘కోపంతో పూర్వమే పలికాను. భయపడని నా మాట తీవ్రమై ఈపాటికి మండే అగ్నియొక్క ఆకారంతో తక్షకుడిని కలత పొందేట్లుగా ప్రోత్సహింపక తాను ఎందుకు దూరంగా ఉండిపోతుంది? అంటే తక్షకుడిని తప్పక ప్రేరేపిస్తుందని భావం’.

‘మాట పెదవి దాటితే పృథివి దాటినట్లే’ అని ప్రసిద్ధమైన సామెత ఉంది. తండ్రికి జరిగిన అవమానానికి ఆగ్రహించిన శమీకుడి కుమారుడైన శృంగి, పరీక్షిన్మహారాజుకి శాపమిచ్చాడు. కానీ, శమీకుడు సౌమ్యుడు, శాంతగుణం కలవాడు. ఇచ్చిన శాపాన్ని వెనక్కి తీసుకోమని అడుగుతాడు. అది సాధ్యం కాదని శృంగి పలకగా, శమీకుడు ఎంతో చింతిస్తాడు. పరీక్షిత్తు అంతటి మహారాజుకి ఈ దుస్థితి వాటిల్లినందుకు ఎంతో బాధపడతాడు. శమీకుడిలో ఉన్న శాంతగుణం శృంగికి ఉండి ఉంటే, ఈ పరిస్థితి ఏర్పడేది కాదు. అందుకే, మాట ప్రయోగించే ముందే ఆలోచించి మాట్లాడాలి. ఒక్కసారి అనేశాక, మాటని వెనక్కి తీసుకోవడం అసాధ్యం.

ఆవేశంలో మాట్లాడడం వల్ల ఎంతటి అనర్థాలు వస్తాయో ఈ సన్నివేశం చూస్తే అర్థమవుతుంది. సంభాషించేటప్పుడు ఆలోచించి నేర్పుగా మాట్లడడం అవసరం. శృంగి పాత్ర ద్వారా ఎలా మాట్లాడకూడదో అర్థమైతే, శమీకుడి పాత్ర ద్వారా ఎలా మాట్లాడాలో అర్థమవుతుంది. సంభాషణానైపుణ్యాన్ని సాధించాలంటే భాషించే ముందు ఆలోచించడం అవసరమనే విషయం ఈ కథ ద్వారా తెలుస్తోంది.

## 7.4. ఆస్తీకుడి జనమేజయ యాగస్తుతి

ఆస్తీకుడు చేసిన జనమేజయయాగస్తుతిలో భాగంగా నన్నయ రచించిన పద్యాలు సైతం సంభాషణానైపుణ్యానికి అద్భుతమైన ఉదాహరణలుగా నిలుస్తాయి.

మ. రజనీనాథకు లైన భూషణుఁడ వై, రాజర్షి వై, ధారుణీ
ప్రజ నెల్లన్ దయతోడ ధర్మచరితం బాలించుచుం, దొంటి ధ
ర్మజు నాభాగు భగీరథున్ దశరథున్ మాంధాతృ రామున్ రఘున్
విజయుం బోలితి సద్గుణంబుల జగద్విఖ్యాత పారీక్షితా! (*ఆంధ్ర. ఆది. 2: 221*)

‘ఓ జనమేజయమహారాజా! చంద్రవంశప్రధానాలంకారానివై, ఋషి వంటి రాజువై, దయతో, ధర్మంతో కూడిన ప్రవర్తనతో భూమిలోని ప్రజలందరినీ పరిపాలిస్తూ మున్ను ప్రసిద్ధులైన ధర్మరాజును, నాభాగుడిని, దశరథుడిని, మాంధాతను, రాముడిని, రఘుమహారాజును, అర్జునుడిని ఉత్తమ గుణాలలో సరిపోలినావు’.

ధర్మరాజు, అర్జునుడు జనమేజయుడి పితామహులు, చంద్రవంశానికి అలంకారమైనటువంటివారు. వారిని పద్యానికి మొదట్లో, చివర్లో ప్రస్తావించి జనమేజయుడిని గౌరవించాడు ఆస్తీకుడు. చరిత్రలో మహోన్నతమైన మహారాజులుగా కీర్తికెక్కినవారిని ప్రస్తుతించి జనమేజయుడి మెప్పును పొందే ప్రయత్నం చేస్తున్నాడు ఆస్తీకుడు. జనమేజయుడు చేస్తున్న యాగం ధర్మకార్యం కాదు. అటువంటి యజ్ఞం చేస్తున్న జనమేజయుడిని విమర్శించకుండా ప్రశంసించడం, గొప్ప గొప్ప రాజులతో పోల్చడం ఆస్తీకుడి ఉక్తి నైపుణ్యాన్ని సూచిస్తోంది. ఆస్తీకుడిపై నాగలోకాన్ని రక్షించవలసిన బాధ్యత ఉంది. మొదటి పద్యంలోనే చాలా చాకచక్యంగా వ్యవహరిస్తూ జనమేజయుడిపై ఆస్తీకుడు ఒక ముద్రని వేయగలిగాడు.

"ఈ పద్యం ఉక్తిచమత్కారవిశిష్టమైన మాధుర్యం (పృథక్ పదత్వం) అనే గుణానికి చక్కని ఉదాహరణ. జనమేజయుడి ఆభిజాత్యాన్నీ, ధర్మచరిత్రన్నీ, సద్గుణౌన్నత్యాన్నీ రుచిరార్థసూక్తులతో ఉదాత్తంగా కీర్తించాడు" (*ఆంధ్ర. ఆది. 2. పుట: 193*).

తరలము.

కువలయంబున వారి కోరిన కోర్కికిం దగ నీవు పాం
డవకులంబు వెలుంగఁ బుట్టి, దృఢంబుగా నృపలక్ష్మితో
నవనిరాజ్యభరంబు దాల్చిన యంతనుండి మఖంబులం
దివిరి యిష్టధనంబు లిచ్చుటఁ దృప్తు లైరి మహాద్విజుల్. (*ఆంధ్ర. ఆది. 2: 222*)

'భూవలయంలోని ప్రజలు కోరిన కోరికకు తగినట్లు నీవు పాండవులవంశం ప్రకాశించేటట్లుగా పుట్టి స్థిరంగా రాజ్యలక్ష్మితో భూరాజ్యభారం వహించినప్పటినుండి యజ్ఞాలలో కుతూహలపడి బ్రాహ్మణులకు అభీష్టాలైన ధనాలు ఇస్తుండడం వలన తృప్తి పొందిన వారయ్యారు'.

ఆస్తీకుడు ఈ పద్యంలో జనమేజయుడిని యజ్ఞాలు చేయడంలో అమితమైన ఆసక్తి కలవాడని ప్రస్తుతించాడు. యజ్ఞాలు చేసి బ్రాహ్మణులకు భూరి దక్షిణలు ఇచ్చే ఔదార్యం కలిగినవాడని ప్రస్తావించాడు. అలా చెప్పడం ద్వారా తన మనస్సులో కూడా ఒక పెద్ద కోరిక ఉన్న విషయాన్ని పరోక్షంగా చెప్పాడు. ఆస్తీకుడు, తన వంటి ఎంతో మంది బ్రాహ్మణులకు గొప్ప గొప్ప దానాలు చేసిన జనమేజయుడి దానగుణాన్ని ప్రస్తుతించడం ద్వారా జనమేజయుడిని తన అభీష్టానికి అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఇది ఆస్తీకుడి సంభాషణానైపుణ్యాన్ని సూచిస్తుంది. తాను వచ్చిన

పని నెరవేరేందుకు ముందుగా పరిస్థితులని తన మాటల ద్వారా తనకి అనుకూలంగా మలుచుకోవడం గొప్ప సంభాషకుడి / వక్త లక్షణం. ఆస్తీకుడు నిండుగా ఆ మెళకువలు కలిగినవాడు.

ఉ. అమ్మనుజేంద్రుఁ డైన నలుయజ్ఞము, ధర్మజురాజసూయయ
జ్ఞమ్ముఁ, బ్రయాగఁ జేసిన ప్రజాపతియజ్ఞముఁ, బాశపాణియ
జ్ఞమ్మును, గృష్ణుయజ్ఞము, నిశాకరుయజ్ఞము నీ మనోజ్ఞ య
జ్ఞమ్మును నొక్కరూప విలసన్మహిమం గురువంశవర్ధనా! (*ఆంధ్ర. ఆది. 2: 223*)

'కౌరవవంశాన్ని వృద్ధిపొందించేవాడా! జనమేజయా! ప్రసిద్ధుడైన నలమహారాజుయాగం, ధర్మరాజు చేసిన రాజసూయయజ్ఞం; బ్రహ్మదేవుడు ప్రయాగక్షేత్రంలో చేసిన యజ్ఞం, వరుణదేవుడి యజ్ఞం, కృష్ణుడి యజ్ఞం, చంద్రుడి యజ్ఞం, మనోహరమైన నీ యజ్ఞం, ప్రకాశించే మహత్త్వంలో ఒక్కవిధమే (సమానాలే)'.

పై పద్యంలో పేర్కొన్నట్టుగా నలమహారాజు మొదలైనవారు చేసిన యజ్ఞాలు చాలా గొప్పవి. అటువంటి యజ్ఞాలతో సమానంగా జనమేజయుడు చేస్తున్న సర్పయాగాన్ని కీర్తించడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. సర్పయాగం ధర్మప్రవృత్తితో చేస్తున్న యాగం కాదని నన్నయ ముందు పద్యాల్లో పేర్కొన్నారు. కానీ, ఈ పద్యం చదివిన ఎవరికైనా ఆస్తీకుడు సర్పయాగాన్ని సమర్థిస్తున్నాడు అనే భావన కలుగుతుంది. అదే నిజమని జనమేజయుడు కూడా నమ్మాడు. పాఠకులకి సైతం అటువంటి భావనే కలిగేలా రచించడం నన్నయ ప్రత్యేకత.

ఆస్తీకుడు తెలివిగా తాను యజ్ఞాన్ని ఆపడానికి వచ్చాననే విషయాన్ని ప్రస్తావించకుండా, సర్పయాగాన్ని గొప్ప యజ్ఞాలతో పోల్చడం ద్వారా తనకి ఈ యజ్ఞం పట్ల గొప్ప గౌరవభావన ఉందని జనమేజయుడు అనుకునేలా చేసి, అతడిని తన మాటలతో మాయలో పడేశాడు. 'పాము చచ్చింది. కానీ, కర్ర విరగలేదు' అన్న చందంగా తాను యజ్ఞాన్ని వ్యతిరేకించకుండా, జనమేజయుడు తనంతట తాను సర్పయాగాన్ని విరమించుకునేలా చేశాడు. కేవలం సంభాషణానైపుణ్యం ఎంతటి కార్యాన్నైనా నేరవేర్చగలదు అని ఆస్తీకుడు ఈ ఘట్టం ద్వారా నిరూపించాడు.

"ఈ పద్యరచనలో నన్నయ వస్తుస్వభావస్ఫుటత్వాన్ని స్ఫురింపజేయటానికి అర్థవ్యక్తి (ఝటిత్యర్థప్రతిపత్తిహేతుత్వం) అనే గుణాన్ని సార్థకంగా వాడాడు" (*ఆంధ్ర. ఆది. 2. పుట: 194*).

చ. వితతమఖప్రయోగవిధివిత్తము, లుత్తమధీయుతుల్ జగ
న్నుత సుమహాతపోధను, లనుగ్రహనిగ్రహశక్తియుక్తు లీ
క్రతువున ఋత్విజుల్, కమలగర్భసమానులు పూర్వదిక్పతి
క్రతువున యాజకోత్తములకంటెఁ బ్రసిద్ధులు సర్వవిద్యలన్ (*ఆంధ్ర. ఆది. 2: 224*).

'నీవు చేస్తున్న ఈ సర్పయాగంలోని ఋత్విక్కులు విస్తృతమైన యజ్ఞాచరణవిధానాన్ని బాగా ఎరిగినవారు, అధికబుద్ధిసంపన్నులు, లోకం చేత స్తుతింపబడిన మిక్కిలి గొప్పతపస్సే ధనంగా కలవారు, దయతో చూడడం, శపించి శిక్షించడం అనే శక్తులతో కూడినవారు, బ్రహ్మతో సమానులు, అన్ని విద్యలలోను, తూర్పుదిక్కును ఏలే ఇంద్రుడియజ్ఞంలోని ఉత్తమఋత్విజులకంటే ప్రసిద్ధిని పొందినవారు'.

సర్పయాగం చేయాలన్న జనమేజయుడి సంకల్పం వల్ల వివిధరంగాల్లో, వివిధగుణాలతో భాసించే అంతమంది యాజకోత్తములను చూడడం చాలా అరుదైన, అపూర్వమైన సంఘటన. అంతటి అదృష్టం తనకి దక్కినందుకు ఆస్తీకుడు చాలా సంతోషపడ్డాడు.

జనమేజయుడి చేత సర్పయాగాన్ని విరమింపజేయాలంటే ఆస్తీకుడు కేవలం జనమేజయుడి మెప్పు పొందితే సరిపోదు. ఒకవేళ జనమేజయుడు ఆస్తీకుడి విన్నపానికి అంగీకరించినా, అక్కడ ఉన్న ఋత్విక్కులలో ఉదంకుడు లాంటివాళ్లు అడ్డుకునే అవకాశం లేకపోలేదు. అందుకే, ఆస్తీకుడు యాగంలో భాగస్వాములైన ఋత్విక్కులనందరినీ స్తుతించి వారిపట్ల తనకున్న గౌరవాన్ని చాటుకున్నాడు. తద్వారా వాళ్ల మనసుల్ని సైతం గెలుచుకున్నాడు.

ఆస్తీకుడు తన అభీష్టం మేరకు, తన సంభాషణానైపుణ్యంతో రంగాన్ని మొత్తం తనకి అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేస్తున్నాడు. ఆస్తీకుడు అనుసరిస్తున్న విధానం నేటి తరానికి సైతం ఎంతో స్ఫూర్తిదాయకంగా కనిపిస్తోంది.

ఉ. మానిత సత్యవాక్య! యభిమన్యుకులోద్వహ! శాంతమన్యుసం
తానుఁడ వై దయాభినిరతస్థితి నీవు మదీయబంధు సం
తానమనోజ్వరం బుపరతంబుగ, నాకుఁ బ్రియంబుగా మహో
ర్వీనుత! సర్పయాగ ముడివింపుము; కావుము సర్పసంహతిన్ (*ఆంధ్ర. ఆది. 2: 228*).

'పూజింపబడిన సత్యవాక్యం కలవాడా! అభిమన్యుడి వంశాన్ని ఉద్ధరించేవాడా! విశాలమైన భూమి చేత (భూజనులందరిచేత) పొగడబడేవాడా! జనమేజయా! శమించిన కోపాదుల సమూహం కలవాడివై, దయ పట్ల ఆసక్తికలస్థితితో నా చుట్టాలైన పాములసమూహం యొక్క మనస్సులలోని ఆర్తి మానేటట్లుగా, నాకు ప్రీతి కలిగేటట్లుగా ఈ సర్పయాగాన్ని మానేటట్లు చేయుము, పాములసమూహాన్ని కాపాడుము'.

ఆస్తీకుడి మాటలకి ముగ్ధుడైన జనమేజయుడు అతడి అభీష్టం ఏమిటో తెలియజేయమన్నాడు. అందుకు సమాధానంగా ఆస్తీకుడు పలికిన మాటలని పద్య రూపంలో మనకి అందించారు నన్నయ. ఆస్తీకుడి మాటలలోని నేర్పు వల్ల అతడు వచ్చిన కార్యం నెరవేరిందనాడానికి, ఆస్తీకుడిని అనుగ్రహిస్తూ జనమేజయుడు పలికిన మాటలు నిదర్శనం. సర్పయాగాన్ని ఇక్కడితో విరమించి, తన బంధువులు అయిన పాముల సమూహాన్ని రక్షించవలసిందిగా అస్తీకుడు జనమేజయుడిని కోరాడు.

నిజానికి, జనమేజయుడు నాగలోకానికి తలపెట్టిన హానికి ఆస్తీకుడు తన తపశ్శక్తితో ప్రతిక్రియ చేయవచ్చు. కానీ, ఆస్తీకుడు సాత్వికమైన మార్గాన్ని ఎంచుకున్నాడు. అది అతడికి తల్లిదండ్రుల నుంచి వచ్చిన సంస్కారం. మాటలతోనే సర్పయాగాన్ని ఆపవచ్చునని ఆస్తీకుడు నిరూపించాడు. మొత్తం ఆస్తీకుడు చేసిన సర్పయాగస్తుతిలో ఎక్కడా ఒక్క పరుషమైన మాట కూడా అతడు వాడలేదు. జనమేజయుడు తన బంధువులైన నాగులకి హాని తలపెట్టాడని తెలిసినా ఆస్తీకుడు కఠినంగా మాట్లాడలేదు. అతడి మాటల్లో శాంతం, సౌకుమార్యం మూర్తీభవించాయి.

'మానితసత్యవాక్య'! అనే సంబోధన చాలా విశేషమైనది. జనమేజయుడు ఆస్తీకుడి ఉక్తి చమత్కారానికి, సంభాషణానైపుణ్యానికి ముగ్ధుడై ఏం కోరుకున్నా అనుగ్రహిస్తానని మాటిచ్చాడు. ఇచ్చిన మాట నిలబెట్టుకుని సత్యవాక్యపరిపాలకుడిగా కీర్తి గడించమని ఆస్తీకుడి చెప్పినట్టుగా ఉంది ఈ సంబోధన. అంటే, జనమేజయుడు తీవ్రప్రతీకారవాంఛతో మొదలుపెట్టిన సర్పయాగాన్ని చాలించడం సత్యవాక్యపరిపాలనలో భాగంగా మారుతుంది. నన్నయ ప్రయోగించిన ఇటువంటి సంబోధనలు ఈ ఘట్టానికే కాదు, మొత్తం ఆంధ్ర మహాభారతానికే తలమానికంగా నిలిచాయి.

శాంతమన్యుసంతానుడవై దయాభినిరతస్థితి నీవు– ఇంతటి మహాయాగం జరగడానికి ప్రధానమైన కారణాలు రెండు. మొదటిది, తక్షకుడు పరీక్షిన్మహారాజుని చంపినందుకు జనమేజయుడి మనస్సులో ఉండిపోయిన కోపం. రెండవది, గురువుగారికి ఇవ్వడానికి పౌష్యుడి పట్టపురాణి వద్ద

ఉదంకుడు పొందిన కుండలాలను తక్షకుడు అపహరించడం. తద్వారా ఉదంకుడి మనస్సులో ఉండిపోయిన కోపం. ఈ రెండూ కారణాలు ఒక చోట చేరి ఇంతటి మహాయాగానికి బీజం వేశాయి. ఆ కోపాన్ని విడిచిపెట్టి, దయానిరతుడవై నాగలోకాన్ని అనుగ్రహించమని ఆస్తీకుడి జనమేజయుడిని కోరాడు. మనిషి మనస్సులో ఉండిపోయిన ద్వేషం/ కోపం/ పగ ఎంతటి విపత్కర పరిస్థితులకు దారి తీస్తుందో ఈ కథ చూస్తే అర్థమవుతుంది.

" 'మహోర్వీనుత సర్పయాగం' అనే చోట ఒక చమత్కారం ఉన్నది. దీన్ని సమస్తంగా తీసుకుంటే, 'లోకమంతా కీర్తించిన సర్పయాగం' అని భావం. లోకమంతా కీర్తించే ఈ యాగం జనమేజయుడి ప్రతీకార దృష్టితో చూస్తే ప్రశంసార్హం. కానీ, ఉత్తమవంశజుని ఉత్తమ ధర్మమైన దయాదృష్టితో చూస్తే అది విపరీతం. అప్పుడందులో విపరీతవ్యంగ్యం గమ్యమానం అవుతుంది. కాగా, "మహోర్వీనుత" అనే మాటను జనమేజయుడికి వేసిన సంబుద్ధిగా కూడా గ్రహించవచ్చు. అప్పుడు– 'సర్పయాగం ఆపి, సర్పకులాన్ని రక్షిస్తే నీవు ఈ ప్రపంచంలోని అందరిచేతా కీర్తింపబడతావు' అనే అర్థం ధ్వన్యమానం ఔతుంది" (*ఆంధ్ర. ఆది. 2. పుట: 196*).

ච. అనిన సదస్యులందఱుఁ బ్రియంబున 'నిట్టి విశిష్ట విప్రము
ఖ్యునకు మహాతపోధనునకుం దగుపాత్రున కెద్ది యిచ్చినన్
ఘనముగ నక్షయం బగును గావున నీ ద్విజనాథుకోర్కిఁ బెం
పున వృథ సేయఁగాఁ దగదు భూవలయేశ్వర! యిమ్ము నెమ్మితోన్.' (*ఆంధ్ర. ఆది. 2: 229*).

'అని ఆస్తీకుడు అడగగా సభ్యులందరూ, 'తగినవాడు, అర్హుడు, గొప్పతపస్సును ధనంగా కలవాడు అయిన ఇటువంటి ఉత్తమబ్రాహ్మణుడికి ప్రీతితో ఏది ఇచ్చినా అది మిక్కిలి క్షయం లేనిది అవుతుంది కాబట్టి ఓరాజా! ఈ బ్రాహ్మణ శ్రేష్టుని కోరిక వ్యర్థం చేయడం తగదు. గౌరవంతో, ప్రేమతో ఇతడు అడిగింది ఇవ్వండి (యజ్ఞాన్ని మానేటట్లు చేయండి)'.

ఆస్తీకుడి సంభాషణానైపుణ్యం, సాత్వికమార్గంలో సమస్యని పరిష్కరించాలని అతడు చేసిన ప్రయత్నం ఫలవంతం అయ్యాయనడానికి ఈ పద్యం నిదర్శనం. ఆస్తీకుడు జనమేజయయాగ స్తుతిలో భాగంగా అక్కడ ఉన్న ఋత్విక్కులని సైతం గౌరవించడం ముందు ఒక పద్యంలో గమనించవచ్చు *(ఆంధ్ర. ఆది. 2: 224).* అతడు ఋత్విక్కులకు ఇచ్చిన గౌరవానికి వారు ఎంతో సంతోషపడ్డారు.

అందుకే, వారి వంతు రాగానే, జనమేజయుడి ముందు ఆస్తీకుడి యోగ్యతను, వినయాన్ని, పాండిత్యాన్ని కొనియాడి, అతడిని అనుగ్రహించమని తమ మాటగా చెప్పారు.

వేదపండితుల వాక్కు నిజమయ్యి జనమేజయుడు సర్పయాగాన్ని చాలించడానికి అంగీకరించాడు. దీన్ని బట్టి, ఆస్తీకుడు తన స్తుతిలో భాగంగా పూర్వరంగాన్ని సిద్ధం చేసుకోవడం అతడి అభీష్టం నెరవేరడానికి ఎంతగానో దోహదపడిందని అర్థమవుతోంది. ఋత్విక్కుల వాక్కు, తల్లిదండ్రుల ఆశీస్సులు, ఆస్తీకుడిపై నాగలోకం పెట్టుకున్న నమ్మకం అన్నీ కలిసి సర్పయాగాన్ని విజయవంతంగా నిరోధించగలిగాయి.

## 7.5. శకుంతలోపాఖ్యానం: సంభాషణా చారిమ

నన్నయ రచించిన ఆదిపర్వంలో వర్ణించబడిన శకుంతలోపాఖ్యానం సంపూర్ణమైన సామాజికాంశాల సమ్మేళనం. ముఖ్యంగా ఈ ఘట్టంలోని పాత్రల సంభాషణానైపుణ్యం చాలా ప్రత్యేకంగా గుబాళిస్తుంది. ఈ కోణంలో చూస్తే, కథలో అత్యంత కీలకమైన దుష్యంతుడు, శకుంతల పాత్రలు మరింత ప్రత్యేకంగా కనిపిస్తాయి.

క. ఈ వల్కలాజినములకు
నీ వన్యఫలాశనముల కీ విటపకుటీ
రావాసములకు నుచితమె
నీ విలసిత రూపకాంతి నిర్మలగుణముల్. *(ఆంధ్ర. ఆది. 4: 53)*

'నీ అందమైన రూపం, నీ మేనిప్రకాశం, మచ్చలేని నీ గుణాలు అనేవి ఈ నారచీరలు కట్టటానికీ, అడవిపండ్లు తింటూ ఉండటానికీ, ఈ ఆకుగుడిసెలలో (పర్ణశాలలలో) నివసించడానికీ తగినవి కావు'.

శకుంతల మనస్సుని ఎలా గెలుచుకోవాలో దుష్యంతుడికి బాగా తెలుసు. దుష్యంతుడి మనస్సులో మెదిలిన కోరిక ధర్మబద్ధమైనది. ఆ కోరికని శకుంతలకి వ్యక్తం చేశాడు. అది కూడా చాలా యుక్తితో తెలియజేశాడు. సంసారంలో సత్యభాషణం కంటే సరసభాషణం చాలా ముఖ్యమని పెద్దలు అంటూ ఉంటారు. దుష్యంతుడు అదే పద్ధతిని అనుసరించాడు. తన అభిలాషకు అనుకూలంగా ఆమె అందం ఆశ్రమజీవితానికి అనుకూలం కాదని ప్రబోధించాడు, తన అందాన్నీ ప్రశంసించాడు.

ఇది గొప్ప సంభాషణానైపుణ్యం. దుష్యంతుడు శకుంతల నివసిస్తున్న ఆశ్రమ ప్రాంతాన్ని కించపరచలేదు. తన గొప్పతనాన్ని గురించి బీరాలు పలకలేదు. 'నీ అందానికి ఇది అనుకూలమైన ప్రాంతం కాదు, నీకు మరిన్ని సౌకర్యాలు, సదుపాయాలు అవసరమ'ని చెప్పాడు. శకుంతల స్థాయిని తనకి తెలియజేశాడు. శకుంతల తన కోరికని అంగీకరిస్తే తాను శకుంతలని ఎంత గొప్పగా చూసుకోబోతున్నాడో చెప్పాడు. శకుంతల అభిమానం గల అమ్మాయి అని తెలుసుకుని, తన గౌరవానికి ఎటువంటి భంగం వాటిల్లకుండా తన మనస్సులో ఉన్న ప్రేమని అత్యంత సరసంగా వ్యక్తం చేశాడు. తన హృదయంలో శకుంతల స్థానాన్ని అత్యంత ఔచిత్యంగా ఆవిష్కరించాడు. దుష్యంతుడు ఈ విధంగా తన సంభాషణానైపుణ్యంతో శకుంతల మనస్సును గెలుచుకున్నాడు.

కథ ప్రారంభంలో దుష్యంతుడి సంభాషణానైపుణ్యం గుబాళిస్తే, కేవలం తన సంభాషణానైపుణ్యం ఆధారంగా జీవిత పోరాటం చేసింది శకుంతల. తన భవిష్యత్తుతో పాటు భరతుడి భవిష్యత్తుని కూడా తాన సంభాషణానైపుణ్యంతో రక్షించింది.

క. జననాథ వేఁట నెపమున !
గొనకొని కణ్వాశ్రమమునకున్ వచ్చి ముదం
బున నందు నాకు నీయి
చ్చిన వరము దలంపవలయుఁ జిత్తములోనన్. *(ఆంధ్ర. ఆది. 4: 340)*

క. బాలార్కతేజుఁ డగు నీ
బాలుఁడు నీకొడుకు వీనిఁ బౌరవకుల ర
త్నాలంకారు నుదార గు
ణాలయు యువరాజుఁ జేయు మభిషేకముతోన్. *(ఆంధ్ర. ఆది. 4: 75)*

'ఓ రాజా! వేట అనే మిషతో కావాలని సప్రయత్నంగా కణ్వమహాముని ఆశ్రమానికి వచ్చి, అక్కడ నీవు సంతోషంగా నాకు ఇచ్చిన వరాన్ని మనసులో జ్ఞాపకం చేసికొమ్ము'.

'బాల సూర్యుడివలె వెలుగుతున్న ఈ చిరంజీవి నీ కొడుకు. పౌరవవంశానికి అలంకారమైనవాడు, ఉత్తమగుణాలకు నెలవైనవాడు అయిన ఇతడిని యువరాజుగా అభిషేకించుము'.

గాంధర్వ వివాహం శకుంతలాదుష్యంతుల మధ్య జరిగిన రహస్య ఒప్పందం. అయితే, ఆ వివాహ విషయాన్ని ధ్వనిమయం చేయడం నన్నయ రచనాశిల్పం. దుష్యంతుడు ఇచ్చిన ఈ వరానికి సాక్షులెవరూ లేరు. శకుంతలాదుష్యంతులే సాక్షులు. అయితే, దుష్యంతుడు మర్చిపోయినట్లు నటిస్తూ సత్యాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేస్తున్నాడు. అందుకే శకుంతల ఆవేదన చెందుతోంది.

శకుంతల తన శక్తి మేరకు రాజుకి జరిగిన కథని గుర్తుచేసే ప్రయత్నం చేస్తోంది. ఎక్కడా రహస్యాన్ని బయటపెట్టడం లేదు. మహారాజు పరువు ప్రతిష్టలకి భంగం వాటిల్లకుండా జాగ్రత్త పడుతోంది. ఎంతైనా రాజ్యానికి కాబోయే రాణి శకుంతల. అందుకే అంత ఆవేదనలోనూ తన బాధ్యతని విస్మరించలేదు. ఇది శకుంతల సంస్కారానికి, కణ్వమహర్షి పెంపకానికీ తార్కాణం.

ముందు దుష్యంతుడు తనకిచ్చిన వరాన్ని గుర్తుచేసే ప్రయత్నం చేసిన శకుంతల తర్వాత భరతుడిని చూపించి మరొకమారు వరాన్ని జ్ఞప్తి చేస్తోంది. ఏ తండ్రికైనా సరే పుత్రుడిని చూడగానే వాత్సల్యం పొంగుకొస్తుంది. 'పుత్ర' శబ్దానికి పున్నామ నరకం నుండి రక్షించేవాడు అని వ్యుత్పత్తి. ఈ సన్నివేశం అంతా నిండు సభలో జరుగుతోంది కాబట్టి శకుంతల లోకజ్ఞతను పాటించింది. తన జీవితం కోసం, భరతుడి భవిష్యత్తు కోసం పోరాడుతూనే మెట్టినింటి పరువుకి నష్టం రాకుండా జాగ్రత్త వహించింది. దుష్యంతుడి ఎంపిక ఎంత సరైనదో ఈ సందర్భంగా మరొకసారి గుర్తుచేసుకోవాలి.

శకుంతల తన సంభాషణానైపుణ్యంతో అటు పుట్టింటి గొప్పతనాన్ని చాటుతూనే, మెట్టినింటి పరువు, ప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా నేర్పుగా వ్యవహరించింది. కార్యసిద్ధికి కావలసిన అన్ని లక్షణాలు శకుంతలలో నిండుగా కనిపిస్తున్నాయి. శకుంతలలో నిర్వహణ సామర్థ్యంతో పాటు సంభాషణానైపుణ్యమూ మెండుగా కనిపిస్తోంది.

శకుంతల పాత్ర నేటితరానికి చాలా గొప్ప ఉదాహరణ. చిన్న మాట ఎవరైనా అనగానే కంగారుపడి అసభ్యకర పదజాలంతో దూషించి వ్యక్తిత్వాన్ని దిగజార్చుకునేవారు కచ్చితంగా ఈ ఘట్టాన్ని చదివి శకుంతల నుంచి ప్రేరణ పొందాలి. అంతిమంగా లక్ష్యాన్ని చేరుకోవడానికి నేర్పు, సంభాషణానైపుణ్యం ఎంత అవసరమో ఈ పద్యాలు అత్యంత సహజంగా వివరిస్తున్నాయి.

చ. విమలయశోనిధీపురుషవృత్త మెఱుంగుచునుండుఁ జూవె వే !
దములును బంచభూతములు ధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముఁడును జంద్రసూర్యులు నహంబును రాత్రియు న న్మహాపదా
ర్థము లివి యుండఁగా నరుఁడు దక్కొననేర్చునె తన్ను బ్రుచ్చిలన్. *(ఆంధ్ర. ఆది. 4: 80)*

'నిర్మలమైన కీర్తికి నిధివంటివాడవైన దుష్యంతుడా! వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, హృదయం, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి – అనే మహాపదార్థాలు నరులవర్తనాన్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయి సుమా! ఆ మహాపదార్థాలు ఉండగా నరుడు తనంతట తాను వంచించుకోగలడా! (సత్యాన్ని దాచుకొనగలడా, లేదా, తాను చేసిన దానిని దాచుకొనగలడా?) లేదని భావం.

శకుంతల సంభాషణానైపుణ్యానికి ఈ పద్యం పరాకాష్ఠ. దుష్యంతుడిని శకుంతల విమలయశోనిధీ! అని సంబోధించడం చాలా విశేషం. భర్త తన మాటకి కాదంటున్నాడని శకుంతల దుష్యంతుడిని దూషించలేదు. పైకి ప్రశంసిస్తూనే, లోలోపల ప్రశ్నిస్తోంది. నిండు సభలో సభ్యోక్తిని పాటిస్తూ తాను వచ్చిన పనిని చక్కబెట్టుకునే నేర్పు శకుంతలలో కనిపిస్తుంది.

'వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, హృదయం, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి – అనే మహాపదార్థాలు నరులవర్తనాన్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయి సుమా'! అంటూ దుష్యంతుడి మనస్సాక్షిని ప్రశ్నిస్తోంది. 'ఆ మహాపదార్థాలు ఎప్పుడూ అందరినీ గమనిస్తూ ఉంటాయి, జాగ్రత్తపడు' అని పరోక్షంగా హెచ్చరించింది. శకుంతల మాట్లాడే విధానం చూస్తే దుష్యంతుడు కూడా 'నేను నిండుసభలో ఈమెను కాదు పొమ్మన్నా కూడా నా పరువు, ప్రతిష్ఠలకు భంగం వాటిల్లకుండా ఎంత జాగ్రత్తగా మాట్లాడుతోంది!' అని ఆశ్చర్యపోవాలి.

'నిన్ను ఎవరూ గమనించడం లేదు అనుకుంటున్నావేమో! నీ మనస్సాక్షి, ఆ మహాపదార్థాలు అన్నీ నిన్నే గమనిస్తున్నాయి. నిన్ను నువ్వు మోసం చేసుకోకు. అసత్యమాడి నీ కీర్తికి మచ్చ తెచ్చుకోవద్ద'ని శకుంతల దుష్యంతుడిని వారిస్తోంది. 'అయినా ధర్మస్వరూపుడవైన నీవు, స్వచ్ఛమైన కీర్తి కలిగిన నీవు, ఎల్లప్పుడూ ధర్మానికి కట్టుబడే ఉంటావు' అని పైకి మెచ్చుకుని, దుష్యంతుడి మనస్సుని లోలోపల కలుషితం చేస్తున్న ఆలోచనలని తొలగించే ప్రయత్నం చేస్తోంది. కార్యసాధనకు కావలసిన సంభాషణానైపుణ్యం, నిర్వహణ సామర్థ్యం శకుంతలలో ప్రతీ సన్నివేశంలో

కనిపిస్తున్నాయి. నన్నయ ఆ పాత్రని తీర్చిదిద్దిన విధానం అంత గొప్పగా ఉంది. ఈ పద్యం నన్నయ సూక్తి మౌక్తికం.

చ. నుతజల పూరితంబులగు నూతులు నూటిటికంటె సూనృత
ప్రత!యొక బావి మేలు; మరి బావులు నూటిటికంటె నొక్కస
త్క్రతువది మేలు; తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడగన్. (*ఆంధ్ర. ఆది. 4: 94*)

'సత్యవ్రతం గల ఓరాజా! మంచినీటితో నిండిన చేదుడుబావులు నూరింటికంటే ఒక దిగుడుబావి మేలు; కాగా, బావులు నూరింటికంటే ఒక మంచి యజ్ఞం మేలు; అటువంటి నూరు యజ్ఞాల కంటే ఒక పుత్రుడు మేలు. అట్టి పుత్రులు నూరుమంది కంటే ఒక సత్యవాక్యం మంచిది'.

శకుంతల సంభాషణానైపుణ్యం గురించి ఇంతకు ముందు కొన్ని పద్యాల విశ్లేషణలో చెప్పుకోవడం జరిగింది. అయితే, పద్యం వాటన్నింటినీ మించినది. తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రసిద్ధమైన పద్యాల్లో ఇదీ ఒకటి. ఈ పద్యం శ్రోతలను, పాఠకులను ఉర్రూతలూగించింది.

'సూనృతవ్రత!' అంటూ శకుంతల చేసిన సంబోధన చాలా విశేషమైనది. దుష్యంతుడితో శకుంతల 'నీ కీర్తికి మచ్చ తెచ్చుకోవద్దు అని పలికినప్పుడు నన్నయ 'విమలయశోనిధీ!' అంటూ శకుంతల చేత పలికించాడు. ఇక్కడ అబద్ధం ఆడుతున్నవాడిని 'సూనృతవ్రత!' అని సంబోధన చేయించాడు. అంటే దుష్యంతుడు సత్యం పలకడమే వ్రతంగా కలవాడని అర్థం. నిజానికి తప్పు చేస్తున్నవాడిని దూషిస్తే పరిస్థితి వేరేలా ఉంటుంది. వాడు మొండికేసే ప్రమాదం ఉంది. కానీ, వ్యక్తిని మన దారికి తెచ్చుకోవాలి అన్నప్పుడు ఇలా అధిక్షేపంగా అనడం అత్యంత సమంజసం. అందుకే నన్నయ వాక్చాతుర్యానికి సాహితీలోకం యావత్తు దాసోహమంది. నన్నయ రుచిరార్థసూక్తికి ఈ పద్యం మరొక మంచి ఉదాహరణ.

సత్యం ఎంత గొప్పదో వివరించిన శకుంతల, ఆ సత్యానికి కట్టుబడని వారి పరిస్థితి ఎలా ఉంటుందో దుష్యంతుడి ఊహకే విడిచిపెట్టింది. శకుంతల అంత ఆగ్రహంలో కూడా ఔచిత్యం పాటించింది. గృహస్థాశ్రమ ధర్మాన్ని దుష్యంతుడికి వివరిస్తూనే మాటల్లో నేర్పు ప్రదర్శించింది. శకుంతల తన ధార్మికోపన్యాసంలో ఒక పద్ధతిని అనుసరించింది. ముందు దుష్యంతుడికి గృహస్థుగా

తన బాధ్యతలను తనకి తెలియజేసింది. తర్వాత తనవంటి గృహిణిని వదులుకోవద్దని వారించింది. ఆ తర్వాత కుమారుడిని చూపించి సమ్మోహనాస్త్రాన్ని సంధించింది. చివరికి వీటన్నింటికంటే సంతానం కంటే కూడా సత్యం గొప్పదని హితవు పలికింది. సత్యస్వరూపమైన పరమ ధర్మాన్ని విడిచిపెట్టవద్దని వారించింది. దుష్యంతుడు క్రమంగా తనని అర్థం చేసుకునేలా సంభాషించింది.

శకుంతల ఆగ్రహంలో, ఆవేదనలో కూడా నేర్పుని, ఔచిత్యాన్ని అన్నింటినీ మించి ధర్మాన్ని విడవలేదు. సంభాషణానైపుణ్యం కోసం శిక్షణా కేంద్రాల ముందు అర్రులు చాస్తున్న నేటి యువత కేవలం శకుంతల పాత్రను చూస్తే చాలు జీవితాన్ని ఎలా చక్కదిద్దుకోవాలో తెలుస్తుంది. ఆ పాత్ర అంత చక్కగా రూపొందడానికి వ్యాసుడు, నన్నయ తమ రచనాశిల్పాన్ని నేర్పుగా ప్రదర్శించారు.

## 7.6. విదురుడి సంభాషణానైపుణ్యం

లాక్షాగృహదహన ఘట్టం జరిగాక, అక్కడి నుండి తప్పించుకున్న పాండవులతో యుద్ధం చేయాలని భావిస్తున్న ధృతరాష్ట్రుడికి హితవు పలుకుతూ విదురుడు పలికిన ఈ మాటలు సంభాషణానైపుణ్యానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తాయి.

మ. బలదేవాచ్యుతసాత్యకుల్ దమకు నొప్పన్ మిత్రులుం గూర్చు మం
త్రులుఁగా దైవము మానుషంబుఁ గల నిత్యుల్, నీకు దుర్యోధనా
దులకంటెం గడుభక్తు లెంతయు వినీతుల్, వీరు లప్పాండుపు
త్త్రులు నీపుత్త్రుల కారె! వారిఁ దగునే దూరస్థులం జేయఁగన్. (*ఆంధ్ర. ఆది. 8: 45*).

'పాండవులు తమంతట తామే ఎవరికీ జయింప శక్యం కాని వాళ్లు. మీదు మిక్కిలి శత్రువులందరినీ అణచిన మహాబలవంతుడైన పాంచాలరాజు వాళ్లకు ఇప్పుడు చుట్టం. అతని కుమారుడు దృష్టద్యుమ్నుడు పాండవులతో సమానమైన పరాక్రమం కలవాడు, బాంధవ్య బంధం వల్ల ఇష్ట మిత్రుడై వాళ్లతో చేరాడు'.

పుత్రవ్యామోహంలో పడి ధృతరాష్ట్రుడు దుర్యోధనుడు ఏది చెబితే దానికి సమ్మతిస్తున్నాడు. భీష్ముడు, ద్రోణుడు ఎన్నో రకాలుగా నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది. చివరిగా విదురుడి మాటలు ఫలించాయి. ఇరువర్గాలకి కనీసం తాత్కాలికమైన శాంతిని ప్రసాదించాయి. విదురుడు ధృతరాష్ట్రుడి వద్ద ఎన్నో విషయాలను ప్రస్తావించాడు. పాండవుల పరాక్రమాన్ని కొనియాడాడు. వారితో యుద్ధం

చేస్తే నష్టం కౌరవసేనకే అని అర్థమయ్యేలా చేశాడు. అంతే కాకుండా, 'పాండవులు మాత్రం నీకు పుత్రులు కారా!' అంటూ ధృతరాష్ట్రుడి హృదయంలో పాండవులపై ఉన్న అనుమానాల్ని తొలగించాడు. ధృతరాష్ట్రుడి సేనకి ఎంత బలగం ఉందో, అంతకంటే ఎక్కువ బలగం, దైవ బలం రెండూ పాండవులకే మెండుగా ఉన్నాయని చెప్పి భంగపాటును తన మాటలద్వారా ముందే నివారించాడు.

విదురుడు తన సంభాషణానైపుణ్యంతో ఒకవైపు కౌరవులకు నష్టాన్ని వివరిస్తూనే, ధర్మపరులైన పాండవులకి మేలు చేశాడు. తన వాక్చాతుర్యంతో ధృతరాష్ట్రుడిని ఒప్పించి అందరి ముందు పాండవులకి తమ భాగమైన అర్ధరాజ్యాన్ని ఇప్పించాడు. యుద్ధాన్ని నివారించాడు. విదురుడి సంభాషణానైపుణ్యం నేటికీ ఎంతో ఆదర్శంగా నిలుస్తుంది.

ఆంధ్ర మహాభారతంలో విదురుడి వ్యక్తిత్వం, సంభాషణ చాలా ఉన్నతంగా వర్ణింపబడ్డాయి. ప్రత్యేకంగా, సభా పర్వంలో రాజధర్మాన్ని బోధిస్తూ ధృతరాష్ట్రుడితో విదురుడు పలికిన మాటలు ఎంతో ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

తే. ప్రియము పలికెడువారిన పెద్ద మెత్తు,
రప్రియంబును బథ్యంబునైన పలుకు
వినఁగ నొల్లరు, గావున వేడ్కదానిఁ
బలుక రెవ్వరు నుత్తమప్రతిభు లయ్యు. (*ఆంధ్. సభా. 2: 191*)

తే. మొదల నప్రియ మయ్యును దుదిఁ గరంబు
పథ్య మగు పల్కు ప్రియులందు బలిమి నైనఁ
బలుక వలయు మోమోడక యొలసి యట్టి
వాఁడు దగు సహాయుండు భూవల్లభునకు. (*ఆంధ్. సభా. 2: 192*)

'వినడానికి ఇంపుగా ఉండే మాటను పలికేవాళ్లనే ఎక్కువగా మెచ్చుకుంటారు. మేలు చేసేదైనా వినడానికి ఇంపుగా ఉండని మాటను వినడానికి ఎవరూ ఇష్టపడరు. అందుచేత గొప్ప ప్రతిభావంతులు కూడా అలాంటి కటువైన మాట చెప్పరు. మొదట వినడానికి ఇంపు కానిదైనా, చివరికి మేలు చేసే మాటను, ఇష్టులైనవాళ్ల చెంత చేరి, మొగమాటం లేకుండా, బలవంతంగానైనా చెప్పాలి. అలాంటివాడే రాజుకి తగిన సహాయం చేసేవాడు'.

విదురుడు ధృతరాష్ట్రుడితో పలికిన మాటల్లో గొప్ప దార్శనికత, రాజనీతి ధ్వనిస్తాయి. మనస్సుకి ఇష్టమైన మాట / సలహా పలికే వాడికంటే, ఏది ధర్మమో / ఏది ఉచితమో ఆలోచించి అది మనస్సుకి రుచించకపోయినా సరే, నిర్మొహమాటంగా రాజుకి చెప్పేవాడే గొప్పవాడని విదురుడి మాటల ద్వారా అర్థమవుతోంది. విదురుడు ధర్మమూర్తి. అతడు చెప్పిన మాటలు ధృతరాష్ట్రుడికి రుచించినా, రుచించకపోయినా అతడు ఏది ధర్మమో అదే చెప్తాడు. ధర్మరాజుని మాయాద్యూతంలో ఓడించాలనే పన్నాగం పన్నగానే విదురుడు, ఇది వంశానికి హాని అని, అన్నదమ్ముల మధ్య చిచ్చు పెడుతుందని ధృతరాష్ట్రుడిని వారించాడు. రకరకాల సందర్భాల్లో విదురుడు ఎంత ఒప్పించినా, ధృతరాష్ట్రుడు మళ్లీ దుర్యోధనుడిని చూడగానే పుత్రవ్యామోహానికి లోనై, అతడి కుతంత్రాలకి వత్తాసు పలుకుతున్నాడు. కానీ, విదురుడు మాత్రం పట్టు విడువకుండా తన మాటల ద్వారా ధృతరాష్ట్రుడిని సరైన మార్గంలో నడిపించే ప్రయత్నం చేస్తూనే ఉన్నాడు. అతడు పలికిన మాటలను ధృతరాష్ట్రుడు ఆచరణలో పెట్టకపోయినా, నేటి తరానికి మాత్రం విదురుడి మాటలు, సంభాషణా నైపుణ్యం ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయి.

నాయకుడికి / మహారాజుకి విదురుడిలా ఉన్నతమైన / ధర్మబద్ధమైన సలహాలు ఇచ్చేవారు ఎంత అవసరమో ఈ ఘటం ద్వారా తెలుస్తోంది. ఇదే సందర్భంలో విదురుడి సంభాషణా నైపుణ్యానికి, ఒలసి నీ పుత్త్రులెల్ల... (*ఆంధ్ర. సభా. 2: 131*), ఇమ్మనుజాధమున్... (*ఆంధ్ర. సభా. 2: 181*) వంటి పద్యాలు చక్కటి ఉదాహరణలుగా నిలుస్తాయి.

## 7.7. జరాసంధుడి వధ

జరాసంధుడిని వధించడానికి భీముడిని సిద్ధం చేసిన శ్రీకృష్ణుడి మాటలు సంభాషణానైపుణ్యాన్ని చాటుకున్నాయి.

ఉ. అమ్మగధేశు నుగ్రబలు నాయుధయుద్ధమునన్ జయింపఁగా
నిమ్మహి నోప రెవ్వరు, నుమేశ్వరుఁ డట్టి వరమ్ము వానికిన్
నెమ్మిన యిచ్చెఁ, గావున వినీతుఁడు వాయుసుతుండు మల్లయు
ద్ధమ్మున నోర్చు నాతని నుదగ్రమహాభుజశక్తి యేర్పడన్ (*ఆంధ్ర. సభా. 1: 162*).

‘భయంకరమైన బాహుబల సంపన్నుడైన ఆ జరాసంధుణ్ణి ఆయుధయుద్ధంలో జయించడానికి భూమిమీద ఎవరితరం కూడా కాదు. పరమేశ్వరుడు ప్రేమతో అతనికి ఆ వరం ఇచ్చాడు. అందుచేత అతిభయంకరమైన మల్లయుద్ధంలో తన బాహుబలం ప్రకటమయ్యేటట్లు వినయపరుడైన మన వాయుసుతుడు భీముడే అతణ్ణి ఓడిస్తాడు’.

మగధరాజైన జరాసంధుడు హంసడింభకుల మరణంతో బలాన్ని కోల్పోయి ఉన్నాడు. అతడిని వధించడానికి ఇదే సరైన సమయమని భావించిన శ్రీకృష్ణుడు ధర్మరాజు వద్దకు వచ్చి, భీమార్జునులను తనతో పంపమని అడుగుతాడు. ఆ క్రమంలో శ్రీకృష్ణుడు పలికిన ఈ మాటలు సంభాషణా చతురతని చాటుతాయి. జరాసంధుడి వధకు భీముడిని సిద్ధం చేయడానికి శ్రీకృష్ణుడు ముందు జరాసంధుడి గురించి, అతడి పరాక్రమం గురించి చాలా గొప్పగా వర్ణించాడు. తర్వాత భీముడి పరాక్రమాన్ని వర్ణించి, జరాసంధుణ్ణి వధించగల వీరుడు భీముడేనని కొనియాడాడు.

‘వినయపరుడు’ అని భీముడిని ప్రశంసించడంలో శ్రీకృష్ణుడి ఉద్దేశ్యం భీముడు శిరస్సు వంచి చెప్పిన పని చేస్తాడని పరోక్షంగా ధ్వనింపజేయడమే. పైగా జరాసంధుడికి ఆయుధం వల్ల మరణించకుండా శివుడు వరం ప్రసాదించాడు. అందువల్ల అతడు మరణిస్తే మల్లయుద్ధంలోనే మరణించాలి. భీముడు ఆ విద్యలో అత్యద్భుతమైన ప్రావీణ్యాన్ని సంపాదించాడు. ఈ అంశాలని దృష్టిలో పెట్టుకుని శ్రీకృష్ణుడు చాలా నేర్పుగా భీముడి మనస్సులో జరాసంధుడి వధకి బీజం నాటాడు. ఇక శ్రీకృష్ణుడు ధర్మరాజు వద్ద అనుమతి పొందడమే తరువాయి. ఈ ఘట్టంలో శ్రీకృష్ణుడి మాటలు గొప్పగా పనిచేశాయి. ఆ మాటల్లో నేర్పు నేటికీ ఆదర్శవంతమైనదే.

## 7.8. రాజసూయయాగం: వాక్చాతుర్యం

శ్రీకృష్ణుడికి రాజసూయార్ఘ్యాన్ని ఇచ్చిన ధర్మరాజుని తూలనాడిన శిశుపాలుడితో ధర్మరాజు పలికిన ఈ మాటలు సంభాషణా నైపుణ్యం యొక్క ఆవశ్యకతను వివరిస్తాయి.

క. భూరిగుణోన్నతు లనఁదగు
 వారికి ధీరులకు ధరణివల్లభులకు వా
 క్పారుష్యము చన్నె? మహా
 దారుణ మది విషముకంటె దహనముకంటెన్. (*ఆంధ్ర. సభా. 2: 17*)

‘గొప్ప గుణాల చేత శ్రేష్ఠులని చెప్పదగినవాళ్లకు, పండితులకు, ప్రభువులకు కఠినంగా మాట్లాడడం తగునా? మాట కాఠిన్యం  విషం కంటే, అగ్ని కంటే భయంకరం కదా!’

ధర్మరాజు శ్రీకృష్ణుడికి రాజసూయార్ఘ్యాన్ని సమర్పించడంతో అసూయకి, ఆగ్రహానికి లోనై పరుషమైన మాటలు పలుకుతున్న శిశుపాలుడిని శాంతింపజేసే ప్రయత్నం చేస్తూ ధర్మరాజు పలికిన ఈ మాటలు ప్రాపంచిక సత్యాలు. ప్రధానంగా పండితులకి, నాయకులకి మాట కాఠిన్యం తగదని ధర్మరాజు ఈ సందర్భంగా హితవు పలికాడు.

నాయకుల మాటల్లో పరుషత్వం ఉండకూడదు. ఎందుకంటే, నాయకుడి మాటను ప్రజలు అనుసరిస్తారు. నాయకుడు తీసుకున్న నిర్ణయం కఠినమైనదే అయినా, ఆ నిర్ణయాన్ని వ్యక్తీకరించే విధానం ప్రసన్నంగా ఉండాలి. అలాగే, పండితుడి మాటల్లో సైతం పురుషత్వం మంచిది కాదు. ఒక కవి, పండితుడు జాతిని జాగృతం చేసే శక్తి కలవారు. వారి మాటల్లో బాధ్యత ఉండాలి. లేకపోతే వారి మాటలు విని, చదివి, ప్రభావితమయ్యే ప్రజలు, శ్రోతలు తప్పుదోవ పడతారు.

సందర్భానుసారంగా ప్రభువుల, పండితుల విషయాన్నే ధర్మరాజు ప్రస్తావించినా ఇది అందరికీ వర్తించే విషయమే. మాట కాఠిన్యం  ఎవరికైనా సరే, ఉండకూడని లక్షణమని ఈ పద్యం ద్వారా తెలుస్తోంది. ఈ పద్యం నన్నయ రుచిరార్థ సూక్తి నిధి. ధర్మరాజు నోటి నుండి జాలువారిన ఈ సూక్తిని అంతే చక్కగా, సూటిగా నన్నయ బంధించడం ఈ పద్యంలో గమనించవచ్చు.

శిశుపాలుడు పలికిన ఈ మాటలు సంభాషణ ఏ విధంగా సాగాలో వివరిస్తాయి.

ఆ. అన్యకీర్తనంబు నన్యనిందయుఁ దన్నుఁ
బరఁగఁ బొగడికోలుఁ బ్రబ్బికోలు
నాపగాతనూజ! యార్యవృత్తములు గా
వనిరి వీని నాద్యులయిన మునులు (*ఆంధ్ర. సభా. 2: 49*)

‘గాంగేయా! ఇతరులను పొగడడం, నిందించడం, తని తాను పొగుడుకోవడం, నిందించుకోవడం పెద్దలు చెయ్యదగిన పనులు కావని ప్రాచీనులైన మహర్షులు చెప్పారు కదా!’

శిశుపాలుడు ఈ మాటలు పలకడం ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. అయితే, అందరికీ వర్తింపజేసుకుంటే ఉపకరిస్తాయి. సంభాషణ గుబాళించాలంటే ఏ వ్యక్తి అయినా సరే ఆత్మస్తుతి, పరనింద ఈ రెండూ విడనాడాలని పై పద్యం ద్వారా తెలుస్తోంది. అంతే కాకుండా, ఇతరులను అదే

పనిగా పొగడడం, మనల్ని మనం తక్కువ చేసుకుని దూషించుకోవడం అనే రెండూ కూడా హేయమైన చర్యలు కావని స్పష్టమవుతోంది. ఇవి పెద్దలు సంభాషణలో భాగంగా తీసుకోవలసిన జాగ్రత్తలుగా పైకి కనిపిస్తూ ఉన్నా, అందరూ గమనించదగినవే. ఆత్మస్తుతి, పరనింద మనిషిలో అహంకారానికి దారి తీస్తే, ఇతరులని పొగడడం, మనల్ని మనం తక్కువ అంచనా వేసుకోవడం/ దూషించుకోవడం మనిషి ఆత్మాభిమానాన్ని దెబ్బతీస్తాయి. సంభాషణలో భాగంగా ఈ విషయాలను దృష్టిలో పెట్టుకుంటే ఆ వ్యక్తి మాటల్లో అతని ఉన్నతమైన వ్యక్తిత్వం ప్రతిబింబిస్తుంది.

## 7.9. దుర్యోధనుడి ఘోషయాత్ర

చిత్రసేనుడనే గంధర్వ రాజు చేతిలో దుర్యోధనుడు యుద్ధంలో ఓడిపోయాడని, హస్తినాపురం నుండి అతడి వెంట వచ్చిన మంత్రుల ద్వారా, సైనికుల ద్వారా తెలుసుకుని క్షత్రియ ధర్మం ప్రకారం కౌరవసేనని రక్షించాలని ధర్మరాజు నిర్ణయించుకుంటాడు. భీమార్జుననకులసహదేవులను ఆ పని నిమిత్తం పంపిస్తాడు. ఆ యుద్ధ సందర్భంలో ధర్మరాజు ప్రదర్శించిన సంభాషణానైపుణ్యం నేటికీ ఆదర్శంగా నిలుస్తుంది.

ఉ. అగ్రజువాక్యముల్ దలఁచి యర్జునుఁ డప్పుడు వారితోడ న
త్యుగ్రత దక్కి యెంతయుఁ బ్రియోక్తుల నిట్లను 'మీకు మాయెడన్
విగ్రహ మేల? నెయ్యమున విడ్వుఁడు కౌరవరాజుఁ; బార్థివ
ప్రాగ్రసరుండు ధర్మసుతు ప న్పిది; మీకు నలంఘ్య మిత్తఱిన్.' (*ఆంధ్ర. ఆరణ్య. 5: 416*)

'అప్పుడు అన్నగారైన ధర్మరాజు చెప్పిన హితోపదేశాన్ని స్మరించి, అర్జునుడు ఆ గంధర్వులకు ఈ విధంగా హెచ్చరిక చేశాడు: ఓ గంధర్వులారా! మీకు మాతో విరోధం ఎందుకు? మేం దుర్యోధనుడిని విడిపించడానికి వచ్చాం. మీరు స్నేహపురస్సరంగా అతడిని విడిచిపెట్టండి. ఇది రాజులలో అగ్రేసరుడైన ధర్మరాజుగారి ఆజ్ఞ. ఈ ఆజ్ఞ మీరు జవదాటరానిదిగా గ్రహించండి'.

ధర్మరాజు సత్వగుణ సంపన్నుడు. గంధర్వులతో యుద్ధం పాండవులు కోరుకోలేదు. కేవలం, క్షత్రియ ధర్మాన్ని పాటించడానికి, కౌరవవంశానికి ఎటువంటి కళంకం కలగకుండా ఉండడానికి మాత్రమే ధర్మరాజు దుర్యోధనుడిని చిత్రసేనుడి నుండి విడిపించాలనుకున్నాడు. అంతే తప్ప, పాండవులకి గంధర్వుల పట్ల ఎటువంటి విభేదం, ద్వేషం లేవు. ధర్మరాజు శాంతి కాముకుడు.

అనవసరంగా యుద్ధరంగంలో ప్రాణనష్టం జరగడం అతడికి ఇష్టం లేదు. అందుకే ధర్మరాజు సామవాక్యాలతో సమస్యని పరిష్కరించాలనుకున్నాడు. అందుకే, తమ్ముళ్లకి సమస్యని వీలైనంతవరకు సామరస్యంగా పరిష్కరించుకుని రమ్మని ఆదేశించాడు. ధర్మరాజు రాజనీతిజ్ఞతకి, సంభాషణా నైపుణ్యానికి ఇది ఒక గొప్ప ఉదాహరణ.

మహారాజుకి ఎంతసేపు ఆవేశం ఉండడం శ్రేయస్కరం కాదు. నాయకుడు ఎప్పుడూ సమస్యని పరిష్కరించడానికి సామదానభేదదండోపాయాలను వరుసగా ప్రయత్నించి చూడాలి. ధర్మరాజు సరిగ్గా అదే ప్రయత్నం చేశాడు. అతడి సామవాక్యాలతో గంధర్వులను శాంతపరిచే ప్రయత్నం చేశాడు. మరోవైపు అర్జునుడు సామవాక్యాలతో సమస్యని పరిష్కరించడానికి చూడలేదు. కేవలం అన్నగారి మీద గౌరవంతో ఆయన మాటలు చెప్పి, చివరిలో ఎత్తిపొడుపు మాటలు పలికి గంధర్వులను యుద్ధానికి ఆహ్వానించాడు. అర్జునుడు సోదరుల సహాయంతో యుద్ధంలో జయించి తన పరాక్రమాన్నైతే నిరూపణ చేసుకున్నాడు. కానీ, తన సంభాషణానైపుణ్యంతో యుద్ధాన్ని నివారించలేకపోయాడు. అదే ధర్మరాజుకీ(నాయకుడు) అర్జునుడికీ(వీరుడు) ఉన్న వ్యత్యాసం. ధర్మరాజు సంభాషణా నైపుణ్యం అతడిని సంపూర్ణమైన నాయకుడిగా తీర్చిదిద్దింది.

ధర్మరాజు ఆజ్ఞ మేరకు భీమార్జుననకులసహదేవులు చిత్రసేనుడి బారి నుండి దుర్యోధనుడిని రక్షించి ఇద్దరినీ వెంటబెట్టుకుని ధర్మరాజు వద్దకు వచ్చారు. ధర్మారాజు ఔదార్యం, క్షత్రియ ధర్మం పట్ల అతడికున్న గౌరవం దుర్యోధనుడిని బ్రతికించాయి. చిత్రసేనుడితో యుద్ధం చేసి, ఓడిపోయి అవమానం పాలైన దుర్యోధనుడితో ధర్మరాజు సంభాషించిన తీరు, దాన్ని అద్భుతంగా పద్యరూపంలో ఎర్రన అందించిన తీరు చిరస్మరణీయంగా నిలిచిపోయాయి.

ఉ. 'ఎన్నఁడు నిట్టి సాహసము లింక నొనర్పకు మయ్య! దుర్జనుం
దన్నున సాహసక్రియలయందుఁ గడంగి నశించుఁ; గావునం
గ్రన్నన తమ్ములన్ దొరలఁ గైకొని యిమ్ములఁ బొమ్ము వీటికిన్;
సన్నుత! దీని కొండొకవిషాదముఁ బొందకుమీ మనంబునన్.' (*ఆంధ్ర. ఆరణ్య. 5: 434*)

'నాయనా! దుర్యోధనా! ఎప్పుడైనా సరే ఇటువంటి పరాభవాన్ని చేకూర్చే సాహసకృత్యాలకు ఒడిగట్టకు. ఇప్పుడు జరిగిందేదో జరిగిపోయింది. ఇక మీదనైనా బుద్ధి కలిగి ప్రవర్తించుము. దుర్జనుడు దురభిమానంతో తన అంతరం ఎదిరి గొప్పతనం తెలియక కన్నుమిన్ను కానక

సాహసానికి కడంగి నశిస్తాడు. జాగ్రత్త సుమా! ఇక శీఘ్రంగా తమ్ములను, దొరలను గైకొని నీ రాజధాని నగరానికి వెడలుము. మంచివారి చేత పొగడబడినవాడా! ఇట్టి అవమానం జరిగినందుకు ఎటువంటి దుఃఖాన్ని నీ మనస్సులో అనుభవించవద్దు'.

దుర్యోధనుడి మొత్తం జీవితంలో ఇంతకు మించిన అవమానం మరొకటి జరిగి ఉండదు. ఏ పాండవులనైతే (ధర్మరాజు) మాయాజూదంలో ఓడించి ఆరణ్యవాసానికి పంపించాడో, అదే పాండవులు ఇవాళ అతడికి ప్రాణభిక్ష పెట్టారు. ధర్మరాజు ఆజ్ఞ ప్రకారం భీమార్జుననకులసహదేవులు దుర్యోధనుడిని విడిచిపెట్టారే కానీ, దుర్యోధనుడిని చంపడం వారికెంత పని? దుర్యోధనుడు చిత్రసేనుడి చేతిలో ఓడిపోతే, అతిడిని రక్షించి తిరిగి రాజధానికి పంపడం పాండవుల రాజసాన్ని ఆవిష్కరిస్తోంది.

ధర్మరాజు దుర్యోధనుడితో అన్న ప్రతీ మాట, బ్రతికున్నంత కాలం దుర్యోధనుడిని వెంటాడాయి. యుద్ధంలో ఓడిపోయిన దుర్యోధనుడిని రక్షించి, ప్రాణ భిక్ష పెట్టడం ధర్మరాజు రాజసానికి ఉదాహరణగా నిలిస్తే, అతడు దుర్యోధనుడితో పలికిన మాటలు అతడి సంభాషణా నైపుణ్యానికి గొప్ప ఉదాహరణగా నిలుస్తాయి. ధర్మరాజు పలికిన ప్రతీ మాటకి రెండు అర్థాలున్నాయి. అత్యంత వ్యంగ్యంగా మాట్లాడి, దుర్యోధనుడిని మాటలతోనే చంపినంత పని చేశాడు ధర్మరాజు.

ధర్మరాజు దుర్యోధనుడితో, 'ఇంకెప్పుడూ ఇటువంటి దుస్సాహసాలు చేయవద్దు' అనడంలో దుర్యోధనుడికి ఇంతకు ముందు అతడు చేసిన దుస్సాహసాలు స్ఫురణకి వస్తాయి. పైగా, దుస్సాహసాలు చేస్తే ఇలాగే అవమానాల పాలౌతావని హెచ్చరించినట్లైంది. అంతే కాకుండా, తమ పట్ల దుర్యోధనుడు చేసిన దుస్సాహసానికి కూడా ఇటువంటి బదులే (అవమానమే) అతడికి ప్రాప్తిస్తుందని వారించినట్లైంది.

'దుర్జనుడు దురభిమానంతో దుస్సాహసాలకు ఒడిగట్టి నశిస్తాడ'ని ధర్మరాజు చెప్పడం దుర్యోధనుడి నీచ ప్రవృత్తిని హేళన చేయడంతో పాటు దుర్జనులకు నాశనం తప్పదనే హెచ్చరిక కూడా వ్యక్తమయ్యింది.

'ఇక్కడ జరిగిందేదో జరిగిపోయింది. ఈ సంఘటనని మర్చిపోయి, పరివారాన్ని వెంటబెట్టుకుని హస్తినకి జాగ్రత్తగా వెళ్లమ' ని చెప్పడం ధర్మరాజు మెత్తగా అంటించిన చురక. అలా చెప్పడంలో, 'ఇక్కడ ఏం సాధించావని హస్తినలో చెప్పుకుంటావు? అక్కడి వారికి జరిగింది తెలిస్తే

మహారాజుగా నీ పరువు భూస్థాపితం అయిపోతుంది’ అని ధర్మరాజు ఉద్దేశ్యం. జరిగింది మర్చిపొమ్మని ధర్మరాజు చెప్పాడు. కానీ, దుర్యోధనుడి ఈ సంఘటనని జీవితాంతం గుర్తుపెట్టుకునే విధంగా ధర్మరాజు ఎత్తిపొడుపు మాటలు సంధించాడు.

ధర్మరాజు అసలు యుద్ధానికి దిగలేదు. నలుగురు తమ్ముళ్లూ మొత్తం కార్యాన్ని దిగ్విజయంగా ముగించుకుని వచ్చారు. భీమార్జుననకులసహదేవులు చేసిన యుద్ధం వల్ల పాండవుల పరాక్రమం వెల్లడైంది. ధర్మరాజు దుర్యోధనుడికి పెట్టిన ప్రాణభిక్షతో అతడి రాజసం ఆవిష్కృతమయ్యింది, అసలైన నాయకుడంటే ఎలా ఉండాలో అర్థమయ్యింది. ధర్మరాజు పలికిన మాటల్లో అతడి సంభాషణా నైపుణ్యం వ్యక్తమయ్యింది. మొత్తంగా చూసుకుంటే ఈ ఘట్టంలో ధర్మరాజు సామదానభేదదండోపాయాలను ప్రయోగించడం ద్వారా, అతడి రాజనీతిజ్ఞత మూర్తీభావించింది. ధర్మరాజు ఉపాయాలన్నీ దుర్యోధనుడిని అటు మానసికంగా, ఇటు శారీరకంగా నిర్వీర్యం చేశాయి.

## 7.10. సావిత్రీసత్యవంతుల కథ

ఎర్రన రచించిన భారత భాగంలో (ఆరణ్య పర్వంలో) వర్ణించబడిన ఒక అద్భుతమైన కథ సావిత్రీసత్యవంతుల కథ. తన పాతివ్రత్య మహిమతో, భర్త పట్ల తనకున్న అమితమైన ప్రేమతో, అన్నింటినీ మించి తన సంభాషణానైపుణ్యంతో సావిత్రి సత్యవంతుడిని బ్రతికించుకున్న తీరు, నేటికీ ఎంతో ఆదర్శంగా నిలుస్తుంది.

వ. సకలమార్గంబులయందును ధర్మమార్గంబు ప్రధానం; బట్టి ధర్మంబునకు నాధారంబు సజ్జనుల యని వినంబడు; సజ్జనసందర్శనం బెప్పుడువృథగాదు గావున సజ్జనశేఖరుండ వనంజను నీదైన సందర్శనంబునం బరమశుభంబు నొందక యేను రిత్తజనంబులతెఱంగున నూఱక యెట్లు మగుడుదు?’ ననిన దాని ప్రగల్భవచనంబులకు నద్భుతం బంది ధర్ముం డిట్లనియె .(*ఆంధ్ర. ఆరణ్య. 7: 223*).

‘అన్ని దారులలో ముఖ్యమైన దారి ధర్మమే. కాగా, ధర్మాన్ని నిత్యం ఆచరించేవారు సజ్జనులు మాత్రమే కదా! అందుచేత, సజ్జనులే ధర్మానికి ఆధారం – అని పెద్దల ప్రవచనం. సజ్జనులలో నీవు శ్రేష్ఠుడవు, ధర్మరాజువు – అని చెబుతారు. సజ్జన సందర్శనం ఎన్నడూ వ్యర్థం కాదు. నీ దివ్య దర్శనం నాకు లభించింది కదా! దానివల్ల నేనేదైనా గొప్ప మేలు పొందకుండా వ్యర్థజనులవలె ఊరక

తిరిగిపోగలనా? అని సావిత్రి విన్నవించింది. తెలివితేటలతో నిండిన ఆమె వాక్కులకు అచ్చెరువొంది, యమధర్మరాజు ఇలా బదులు పలికాడు'.

సత్యవంతుడి ప్రాణాలు గైకొని వెళ్తున్న యమధర్మరాజుని సావిత్రి వెంబడించింది. తన వెంట రావద్దని యముడు ఎంత చెప్పినా ఆమె వినలేదు. భర్త శరీరాన్ని భద్రంగా ఒక చోట దాచిపెట్టి, యముడి వెంట వెడుతూనే ఉంది సావిత్రి. అందుకు కారణం అడిగితే, 'నా భర్త పై నాకున్న ప్రేమ నన్ను ఎక్కడికైనా తీసుకెళ్తుంది. ఎల్లప్పుడూ భర్త మార్గాన్ని అనుసరించడమే భార్య కర్తవ్యం' అని పలికింది.

సావిత్రి ఏకంగా యమధర్మరాజుకే పరమధర్మాన్ని బోధించింది. తన వాక్చాతుర్యంతో యముడి మన్నన పొందింది. తన సంభాషణానైపుణ్యానికి మెచ్చి యమధర్మరాజు, సత్యవంతుడి ప్రాణాలు తప్ప వేరే ఏదైనా కోరుకోమని వరమిచ్చాడు. సావిత్రి 'సాళ్వదేశాధిపతి అయిన ద్యుమత్సేనుడు కన్నులు తిరిగి పొందాల'ని కోరుకుంది. అంతటితో ఆగక యముడిని వెంబడిస్తూనే ఉంది. మార్గమధ్యంలో యమధర్మరాజుతో ఎన్నో ధర్మసూక్ష్మాలను సావిత్రి పంచుకుంది. ప్రధానంగా త్రికరణశుద్ధి గురించి, దాన గుణం యొక్క ప్రాశస్త్యాన్ని గురించి ప్రస్తావించింది.

సావిత్రి యమధర్మరాజుకి ఉన్న విలక్షణమైన నామాలని (ధర్మదేవత, సమవర్తి, శమనుడు), వాటి విశిష్టతని గురించి యమధర్మరాజుకే మళ్లీ గుర్తుచేసి అతడిని సంతోషపెట్టింది. సావిత్రి మాటలు యమధర్మరాజుకి ఎంతో సంతృప్తినిచ్చాయి.

క. 'తృషితుఁ డగు వాని శీతల
తుషారతోయములు మోదితునిఁ జేయుగతిన్
హృషితాత్ముఁ జేసె ననుఁ గ
ల్మషహరణము లైన నీ సమంజసభణితుల్. (*ఆంధ్ర. ఆరణ్య. 7: 233*).

'దప్పిగొన్నవాడిని చల్లని మంచు నీళ్లు సంతోషసంభరితుడిని చేసేటట్లుగా పాపాలను పారద్రోలే నీ మాటలు చక్కగా సందర్భశుద్ధి కలిగి నన్ను సంతృప్తి పరచాయి'.

సావిత్రి మాటలు యమధర్మరాజుని ఎంతగా సంతృప్తి పరచాయో ఈ పద్యం చదివితే అర్థమౌతుంది. సావిత్రి ఒక మానవ రూపం. మాటల ద్వారా తప్ప, వేరే ఏ మార్గంలోనైనా యముడిని

జయించడం ఆమెకి అసాధ్యం. అందుకే, కేవలం మాటలతోనే ఆమె యముడి మన్నన పొందిన తీరు అత్యద్భుతం, అనుసరణీయం.

సావిత్రి మళ్లీ తన వాక్చాతుర్యంతో యముడి వల్ల మరొక వరాన్ని పొందింది. సత్యవంతుడి ప్రాణాలు మాత్రం ఇవ్వనని యముడు మళ్లీ షరతు విధించాడు. ఈసారి ద్యుమత్సేనుడి రాజ్యం తిరిగి అతడికి లభించేటట్లు దీవించమని సావిత్రి కోరింది. కొద్దికొద్దిగా యముడిని మాటలతో జయించే ప్రయత్నం చేస్తూనే ఉంది సావిత్రి. యముడు రెండు వరాలిచ్చినా భర్త ప్రాణాల కోసం సావిత్రి తన ప్రయత్నం ఆపలేదు. ఆమె సంభాషణానైపుణ్యానికి, ధర్మం పట్ల ఆమెకున్న అవగాహనకి ఆశ్చర్యపోయిన ధర్మరాజు మూడవ వరాన్ని అనుగ్రహించగా, సావిత్రి తన తండ్రికి వందమంది కొడుకులని అనుగ్రహించమని కోరుకుంది. మొదటి రెండు వరాలను మెట్టినింటి క్షేమం కోసం వెచ్చించిన సావిత్రి, మూడవ వరాన్ని పుట్టింటి సంక్షేమం కోసం వెచ్చించింది. ఎన్ని వరాలిచ్చినా భర్త ప్రాణాల కోసం యముడిని విడిచిపెట్టలేదు సావిత్రి.

తే. 'ఏడుమాట లాడినయంత నెట్టివారు
నార్యజనులకుఁ జుట్టంబు లగుదు రనినఁ
జిరసమాలాపసంసిద్ధిఁ జేసి నీకు
నేను జుట్టమ నని చెప్ప నేల వేఱ? (*ఆంధ్ర. ఆరణ్య. 7: 246*).

'ఏడు మాటలు మాట్లాడితే ఎటువంటివారైనా బంధువులు అవుతారు – అని పెద్దల ప్రవచనం. మనం చాలా సంభాషణ కొనసాగించాం. కాబట్టి నేను నీకు ఈ విధంగా చుట్టాన్ని ఐతిని కదా!'

'"సఖ్యం సాప్తపదీనమ్" అన్న సంస్కృత లోకోక్తికి ఇది అనుసరణ' (*ఆంధ్ర. ఆరణ్య. 7. పుట: 1146*).

యమధర్మరాజుతో ఎన్నో ధర్మసూక్ష్మాల గురించి చర్చించిన సావిత్రి పలికిన ఈ మాటకి యముడు పూర్తిగా సంతృప్తి చెందాడు. సావిత్రి పట్టుదలకి, సంభాషణానైపుణ్యానికి, పాతివ్రత్యానికి దాసోహమన్నాడు. షరతులేవీ విధించకుండా వరాన్ని కోరుకోమని అవకాశం ఇచ్చాడు. సావిత్రి తనకి అత్యంత ప్రీతిపాత్రమైన తన భర్త ప్రాణాలను వెంటనే వేడుకుంది.

పతి ప్రాణాల కోసం ఏకంగా సమవర్తినే మాటలతో ఒప్పించి, తన పాతివ్రత్యాన్ని నిరూపించుకున్న సాధ్వి సావిత్రి. అదే క్రమంలో అటు మెట్టినింటి క్షేమాన్ని, పుట్టినింటి సంక్షేమాన్ని తన మాటల ద్వారా సాధించింది సావిత్రి. సావిత్రి ధర్మనిష్ఠ, పతిభక్తి, పట్టుదల అన్నింటినీ మించి ఆమె సంభాషణానైపుణ్యం తరతరాలకి ఆదర్శంగా నిలుస్తాయి.

## 7.11. కీచకవధ ఘట్టం: సంభాషణానైపుణ్యం

తిక్కన రచించిన విరాట పర్వంలో భాగంగా వచ్చే కీచకవధ ఘట్టంలో ద్రౌపది సంభాషణానైపుణ్యం ఆమె కీచకుడి బారి నుండి తప్పించుకునేందుకు ఎంతగానో ఉపకరించింది.

క. 'నాయున్నబాముఁ దలఁపవ;
  యీ యొడ లీ చీర యిట్టి యేవపుఁజందం
  బో యన్న మదన వికృతిం !
  జేయు ననుట యెంతయును నిషిద్ధము గాదే! (*ఆంధ్ర. విరాట. 2: 49*)

తే. చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁదుఁ
  బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ;
  వట్లుగాకయు హీనవంశాభిజాత
  నై పతివ్రతనగు నన్ను నడుగఁ దగునె?'(*ఆంధ్ర. విరాట. 2: 50*)

' ఓ అన్నా! కష్టాల్లో ఉన్న నా పరిస్థితిని నీవు ఊహించడం లేదు. నా మేను, నా కట్టు, బొట్టు తీరు ఎంత అసహ్యంగా ఉన్నాయో ఆలోచించుము. ఈ పరిస్థితిలో కూడా నీకు మదనవికారం కలిగిందనడం ఏమీ భావ్యం కాదు. మంచివారు ఇటువంటి మాటలు మాట్లాడవచ్చునా? నీవా తోబుట్టువులు ఉన్నవాడివి. అందువలన అందరినీ ఆడుబడుచులుగా భావించి అసలే అలా మాట్లాడకూడదు. అది అలా ఉండగా, నేను హీనురాలను (వంశాభిజాతను), పతివ్రతనూ అయిన నన్ను ఇలా అడగవచ్చునా?'

తనపై మోజుతో బుసలుకొడుతున్న కీచకుడిని ద్రౌపది వారించిన తీరు, సంబోధించిన విధానం అద్భుతం. ఎంత పెద్ద యుద్ధానికి ముందైనా మాటల యుద్ధం జరగడం సహజం. అప్పటికీ ఏమి తేలకపోతే అప్పుడు ఇరువర్గాలు యుద్ధానికి సిద్ధమవుతాయి. ద్రౌపది వివాహిత అని కీచకుడికి

తెలిసికూడా ఆశపడడం కీచకుడి నీచప్రవృత్తికి తార్కాణం. తన పరిస్థితి తెలిసి కూడా కీచకుడు మోహించడం ద్రౌపదికి అసహ్యభావనని, భయాన్ని కలిగిస్తుంది.

ద్రౌపది ఈ సందర్భంలో చేసిన సంబోధన గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. తనపై మోజుపడి కామంతో ప్రవర్తిస్తున్న కీచకుడిని (సింహబలుడిని) 'అన్నా!' అని సంబోధించడం ఒక పక్క ద్రౌపది సంస్కారాన్ని, సౌశీల్యాన్ని సూచిస్తూనే మరోవైపు కీచకుడిని దెప్పిపొడుస్తున్నట్టు స్పష్టమవుతోంది. అంతే కాక, ఆ సంబోధన కీచకుడి వ్యక్తిత్వాన్ని తట్టిలేపే విధంగా ఉంది, కీచకుడి మనస్సాక్షిని ప్రశ్నించే విధంగా ఉంది. ద్రౌపది తన మాటల్లో భాగంగా కీచకుడికి తన తోబుట్టువులను, ఆడపడుచులను గుర్తుచేయడం ద్వారా అతడి విచక్షణాజ్ఞానానికి, ధర్మాధర్మ వివేచనకి పరీక్ష పెట్టింది. నీ ఆడపడుచులకి ఇటువంటి పరిస్థితి ఎదురైతే ఏం చేస్తావంటూ ద్రౌపది కీచకుడిని సూటిగా ప్రశ్నించింది. ఇదంతా కూడా ద్రౌపది యొక్క గొప్ప సంభాషణానైపుణ్యమే. తన వంతుగా కీచకుడికి తాను చేస్తున్నది తప్పనే విషయాన్ని వీలైనంత మర్యాదగా చెప్పింది. అప్పటికీ వినకపోతే తర్వాత స్వరం ఎలా పెంచాలో ద్రౌపదికి తెలుసు. తన భర్తలు ఎంతటి వీరులో లోకానికంతటికీ తెలిసిన విషయమే.

నేటితరంలో ఒకరికి హాని తలపెట్టాలని తలచిన ప్రతీ ఒక్కరు ఇటువంటి సన్నివేశాల నుంచి గుణపాఠాలు నేర్చుకోవాలి. కేవలం తోటి మహిళలని సోదరిగా భావించకపోవడంవల్లే ఇవాళ ఆడవాళ్లపై ఇన్ని అత్యాచారాలు జరుగుతున్నాయి. అటువంటి చెడు ఆలోచన మనస్సులో మెదిలిన ప్రతీ ఒక్కరు తమ తోబుట్టువులకి ఇటువంటి పరిస్థితి ఎదురైతే ఎలా ఉంటుందో తలుచుకుంటే ఎటువంటి అత్యాచారాలు జరిగే అవకాశం లేదు. ఏది ఏమైనా, తనకి ఎదురైన విపత్కర పరిస్థితిని ద్రౌపది ఎదుర్కొన్న తీరు నేటికీ ఆదర్శనీయం. ఆ పరిస్థితిలో ద్రౌపది వ్యవహరించిన తీరు, ఆమె సంభాషణానైపుణ్యం అనుసరణీయమైనవి. ముందు నెమ్మదిగా నచ్చజెప్పే ప్రయత్నం చేసిన ద్రౌపది, తర్వాత తన భర్తల పరాక్రమాన్ని వర్ణించి బెదిరించే ప్రయత్నం చేసింది.

శా. 'దుర్వారోద్యమ బాహు విక్రమ రసాస్తోక ప్రతాపస్ఫుర
ద్గర్వాంధ ప్రతివీర నిర్మథన విద్యాపారగుల్ మత్పతుల్
గీర్వాణాకృతు లేవు రిప్డు నిను దోర్లీలన్ వెసం గిట్టి గం
ధర్వుల్ మానముఁ బ్రాణముం గొనుట తథ్యం బెమ్మెయిం గీచకా!' (*ఆంధ్ర. విరాట. 2: 55*)

'ఓయి కీచకా! వారించడానికి వీలులేని భుజబల పరాక్రమం కలిగి, గర్విష్ఠులైన శత్రువులను అవలీలగా వధించి కీర్తి గాంచిన ఐదుగురు గంధర్వులు నా భర్తలు. వారు ఇప్పుడే అవలీలగా నీ మానప్రాణాలు హరిస్తారు సుమా!'

'ద్రౌపదికి బాగుగ గోపము గుదిరినది. వీడు నీచుడు గావున జంకించినగాని పోడని తలంచినది. ఆ స్థితిలో కీచకుని జంకించుటకును, ద్రౌపదికి గదిరిన కోపమును వెలిపుచ్చుటకును తిక్కన యెట్టి గంభీరమగు శైలిని, దానికి దగిన వృత్తము నవలంబించినాడో చూడుడు. శార్దూల వృత్తమును వాడినాడు. అందులో ద్రౌపది 'కీచకా!' అని సంబోధించినది. 'ఓ యన్న' యను సమయము దాటినది గదా యిపుడు. అత్యంత గంభీరము, భయంకరమునగు 'దుర్వారోద్యమ' మేత్యాద్యతిదీర్ఘ సమాసముతో పాటు – 'మత్పతుల్; గీర్వాణాకృతుల్; గంధర్వుల్' అను నీ హలంత పదములన్నియు నెదుటివారిని జంకించి యదల్చి వేయుటకు దగినవియై యున్నవి'. (*ఆంధ్ర. విరాట. 2. పుట: 176*)

ద్రౌపది పాత్ర చిత్రణ, ఆమె సంభాషణానైపుణ్యం ఎన్నో తరాలకి సందేశాన్నిస్తాయి. కీచకుడు ద్రౌపదిపై తనకున్న కోరికను వ్యక్తం చేసిన సందర్భంలో ద్రౌపది మొదట కాస్త మెత్తగా మాటలతో నచ్చజెప్పే ప్రయత్నం చేసింది. 'అన్నా!' అని సంబోధించి, కీచకుడి తోబుట్టువులను గుర్తుచేసి అతడిలో ఉండే మానవత్వాన్ని, సౌభ్రాతృత్వాన్ని తట్టి లేపే ప్రయత్నం చేసింది. కానీ, సింహబలుడు (కీచకుడు) మనిషి రూపంలో ఉన్న మృగం అని స్పష్టమయ్యాక తన భర్తల పరాక్రమాన్ని ఆవిష్కరించింది.

ద్రౌపది పలికే పరుష వచనాలు కీచకుడికి వణుకు పుట్టించాలి. అటు తన భర్తల పరాక్రమాన్ని వర్ణిస్తూనే తన శీలాన్ని రక్షించుకోవాలి. అంటే పదాల్లో లాలిత్యం ఉంటే కుదరదు. పద్యం చదివినంత మాత్రానే, అటు కీచకుడికి ఇటు పాఠకులకు, శ్రోతలకు పరిస్థితి విషమిస్తే భవిష్యత్తులో కీచకవధ ఎంత ఘోరంగా ఉండబోతోందో అర్థమవ్వాలి. ఒక్క మాటలో చెప్పాలంటే ద్రౌపది క్రోధాన్ని వాగ్రూపంలో వ్యక్తం చేయాలి. ఈ అంశాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని తిక్కన రచించిన పద్యం తెలుగువారి హృదయాల్లో ఒక పద్యరత్నంగా నిలిచిపోయింది. కేవలం పాఠకులకే కాదు తిక్కనకి సైతం ఈ పద్యం విపరీతంగా నచ్చి, ద్రౌపది భీముడికి కీచకుడి చేష్టల గురించి చెప్పిన సందర్భంలో మళ్లీ ఇదే పద్యాన్ని యథాతథంగా పునరుక్తం చేశాడు.

ద్రౌపదిని వెంబడిస్తూ కీచకుడు విరాటుడి సభలోకి ప్రవేశించాడు. భీముడు మదమెక్కి హద్దులు మీరుతున్న కీచకుడిని చూశాడు. అతడి మనసులో కోపం తీవ్రంగా రేగడం వల్ల కన్నుల నుండి నిప్పులు రాలాయి. భీముడు కోపవేగంతో ఒక పెద్ద వృక్షాన్ని పెరికి అటు కీచకుడినీ ఇటు విరాటునీ వధించడానికి యత్నిస్తూ ఆ చెట్టువైపు చూసి గురి నిలిపాడు. కానీ, ఆ పని చేయడానికి ధర్మరాజు అనుమతి కావాలి. ధర్మరాజు వద్దని కనుసైగతో వారించాడు.

మ. 'వలలుం డెక్కడఁ జూచె నొండెడ ననేవ్యక్ష్మాజముల్ పుట్టవే?
ఫలితంబై వరశాఖ లొప్పఁగ ననల్పప్రీతి సంధించుచున్
విలసచ్ఛాయ నుపాశ్రిత ప్రతతికిన్ విశ్రాంతి గావింపఁగాఁ
గల యీ భూజము వంటకట్టియలకై ఖండింపఁగా నేటికిన్?' (*ఆంధ్ర. విరాట. 2: 136*)

'వంటలవాడైన వలలుడు ఎక్కడ చూచాడో కాని అక్కడ కాక మరొకచోట పనికిమాలిన చెట్లు పుట్టవా? పండ్లు బాగా పండిన పెద్దకొమ్మలతోగూడి, విశాలమై నీడనిచ్చి ఆశ్రయించిన వారికి శ్రమను పోగొట్టే ఈ చెట్టును వంటకట్టెల కొరకు నరికివేయడం దేనికి?'

ధర్మరాజు భీముడు బయటకి మాట్లాడుకునే అవకాశం లేదు. ఇద్దరూ వారి ఉద్దేశ్యాలను బయటపెట్టలేరు. ఎందుకంటే, వాళ్లు అజ్ఞాతవాసంలో ఉన్నారు. కాని, విరాటమహారాజు పక్కనే ఉన్న ధర్మరాజు భీముడిని వారించాలి. వారిస్తున్న విషయం సభికులకు అర్థం కాకూడదు. సంభాషణానైపుణ్యం అంటే ఎలా ఉండాలో ధర్మరాజు పాత్రా ద్వారా ఈ సందర్భంలో తిక్కన నిరూపించాడు. తిక్కన చతురతకి, నాటకీయతకి ఈ పద్యం పరాకాష్ఠ.

'వంటలవాడు కట్టెలకోసం కూల్చడానికి చెట్టుని చూశాడు. నలుగురికీ నీడనిస్తూ విశాలంగా ఉన్న ఈ వృక్షం కాకపోతే పనికిమాలిన చెట్లు ఎన్ని లేవు? అందరికీ ఆశ్రయం ఇచ్చే ఈ చెట్టుని కొట్టేయడం ఎందుకు?' అనే అర్థాన్ని పైకి స్ఫురింపజేస్తూ ధర్మరాజు, చెట్టుని విరాటమహారాజుకి అన్యాపదేశం చేశాడు. 'భీమసేనా! విరాటుడు అజ్ఞాతవాసంలో ఉన్న మనందరికీ ఆశ్రయమిచ్చి, కొలువులిచ్చి చక్కగా చూసుకుంటున్నాడు. ఇప్పుడు ఆ చెట్టుని (విరాటుడిని) కూల్చేయడం ధర్మమేనా? అదే జరిగితే మనందరి పరిస్థితి ఏంటి? మన అజ్ఞాతవాస వ్రతం భంగం అవుతుంది. ఆవేశపడితే, కూర్చున్న కొమ్మనే నరికేసుకున్నవాళ్లం అవుతాం. ఆలోచించు' అని నర్మగర్భంగా పలికి ధర్మరాజు భీముడిని వారించాడు. ఒకే మాటని విరాటుడికి ఒకలా భీముడికి ఒకలా అర్థమయ్యేలా

చేసి ధర్మరాజు తన సంభాషణానైపుణ్యంతో పాటు తన నిర్వహణ సామర్థ్యాన్ని సైతం నిరూపించుకున్నాడు. విచిత్రమైన ఇటువంటి పరిస్థితిలో ధర్మరాజు పలికిన మాటలకి రెండు అర్థాలు స్ఫురించేలా పద్యాన్ని రచించి తిక్కన తన ప్రత్యేకతని మరొకసారి చాటుకున్నాడు.

నిండుసభలో తనకి జరిగిన అవమానాన్ని ఖండిస్తూ ద్రౌపది చేసిన ధార్మికోపన్యాసానికి బదులుగా ధర్మరాజు పలికిన మాటల్లోనూ చక్కటి సంభాషణానైపుణ్యం కనిపిస్తుంది.

## 7.12. ఉత్తరగోగ్రహణం: వాక్చతురత

ఉత్తరగోగ్రహణం ప్రారంభమయ్యాక అర్జునుడు, బృహన్నల రూపంలో ఉత్తరుడిని సారథిగా చేసుకుని భీకరమైన యుద్ధం చేయడానికి దండెత్తుతున్నాడు. ఆ సమయంలో కౌరవసేనలో కొంతమంది బృహన్నల యొక్క నపుంసక రూపం చూసి భయభ్రాంతులకు లోనయ్యారు. ద్రోణుడి మనస్సులో మాత్రం తన ప్రియశిష్యుడైన అర్జునుడి విషయంలో ఒక సందిగ్ధత ఏర్పడింది. అజ్ఞాతవాసం గడువు ముగియకుండానే అర్జునుడు ఇలా బయటకి వస్తే, మళ్లీ శిక్ష అనుభవించవలసి వస్తుందని ద్రోణుడు భయపడ్డాడు. సందేహ నివృత్తి కోసం భీష్ముడితో నర్మగర్భంగా తన అనుమానాన్ని వెలిబుచ్చాడు. సేనలు, కౌరవులు, ముఖ్యంగా దుర్యోధనుడు చెంతనే ఉండడం వల్ల ఇలా గోప్యంగా మాట్లాడవలసివచ్చింది. ద్రోణుడి సందిగ్ధతని అర్థం చేసుకుని భీష్ముడు మరింత సంభాషణానైపుణ్యాన్ని తన మాటల్లో ప్రదర్శించాడు. ఒకే మాట ద్వారా రెండు అర్థాలు, ఒకటి ద్రోణుడికీ, రెండవది దుర్యోధనుడికి అర్థం అయ్యేలా సంభాషించాడు.

క. 'తలఁపఁగ రిపులకు నిమ్మగు
కొలఁది గడచి వచ్చితిమి; యకుంఠిత బాహా
బలము నెఱపఁ దఱియయ్యెను
జలింపవల దింక మనకు శత్రులవలనన్.' (*ఆంధ్ర. విరాట. 4: 93*).

'శత్రువులకు అనుకూలమైన చోటుని దాటాం (మనకి అనుకూలం కాని చోటుని దాటాం అని). ఇంక మన బాహుబలాన్ని చూపవలసిన సమయం వచ్చింది. శత్రువులకు ఇంక మనం భయపడవలసిన పనిలేదు' (ఇది దుర్యోధనుడు, కౌరవసేనకి స్ఫురించే అర్థం).

'శత్రువులకు అనుకూలంగా ఉన్న అజ్ఞాతవాస సమయం కడచిపోయింది. అఖండమైన తన బాహుబలాన్ని ప్రదర్శించడానికి, (అర్జునుడికి – ప్రకృత – అర్థాన్ని బట్టి) ఇదే సమయం. అతడు అజ్ఞాతవాస సంబంధమైన విషయంగా, శత్రువులకు జంకవలసిన అవసరం లేదు' (ఇది ద్రోణుడికి అందవలసిన అర్థం).

భీష్ముడి సందర్భోచిత సంభాషణా నైపుణ్యం అటు ద్రోణుడి సందేహాన్ని నివృత్తి చేస్తూనే, దుర్యోధనుడికి వేరే అర్థం స్ఫురించేలా చేసింది. యుద్ధరంగంలో సంభాషణానైపుణ్యం ఎంతో అవసరం. చుట్టూ ఎంతమంది ఉన్నా, అందవలసిన వారికి మాత్రమే విషయం అందేలా మాట్లాడం నాయకుడికి ఎంతో అవసరం. భీష్ముడి మాటల వల్ల దుర్యోధనుడికి ఎటువంటి సందేహం కలగలేదు. అలాగే, అర్జునుడి పట్ల భీష్మద్రోణులకి ఉన్న అభిమానం కూడా వ్యక్తమయ్యింది.

సగటు మనిషికి కూడా నిత్యజీవితంలో ఇటువంటి పరిస్థితులు ఎదురౌతూనే ఉంటాయి. ఆయా పరిస్థితుల్లో సంభాషణానైపుణ్యం ఎంతో అవసరమౌతుంది.

ఇంతటి రసవత్తరమైన సన్నివేశాన్ని అత్యంత నేర్పుగా పాఠకులకి అందించిన తిక్కన రచనాశిల్పం అనితరసాధ్యం. తిక్కన సంభాషణ ప్రతిభా విశేషం ఈ సన్నివేశం. 'తెలుగు పలుకులకి ఎంత నిగూఢత, పదునూ ఉన్నదో అది అంతా తిక్కన సంభాషణలలో ఉన్నది' (*ఆంధ్ర. విరాట. 4. పుట: 476*).

ఉత్తరగోగ్రహణ ఘట్టంలో అర్జునుడు తన వ్యూహం ప్రకారం ముందుగా గోవులను మరలించాడు. దుర్యోధనుడిపై దండెత్తాడు. ఆ క్రమంలో కౌరవసేనని, కర్ణుడినీ, ద్రోణాచార్యులని, అశ్వత్థామని, కృపాచార్యులని ఇలా ఎంతో మంది మహామహులను ఎదుర్కొని తనంతటి పరాక్రమం వేరెవ్వరికీ లేదని నిరూపించుకున్నాడు. చివరికి దుర్యోధనుడితో ద్వంద్వ యుద్ధానికి సిద్ధపడ్డాడు. తన ధనుర్విద్యానైపుణ్యంతో, పోరాటపటిమతో దుర్యోధనుడిని సైతం భీతావహుడిని చేశాడు. అర్జునుడి పరాక్రమానికి తాళలేక దుర్యోధనుడు సైతం రణరంగంలో వెనకడుగు వేశాడు. అది చూసి అర్జునుడు హేళన చేశాడు. ఇప్పటివరకు బాణాలతో దుర్యోధనుడిని సగం చంపిన అర్జునుడు ఇప్పుడు వాడియైన తన వాగ్బాణాలతో మరింత బాధిస్తున్నాడు. తిక్కన అర్జునుడి మాటలను వర్ణించిన తీరు ఈ ఘట్టాన్ని మరింత రసవత్తరంగా మలిచింది. అర్జునుడి మాటలని తిక్కన రెండు పద్యాలుగా మలిచాడు.

ఉ. 'క్షత్రియుఁ డోడునే? తగదు కౌరవరాజయొకండ నేఁ బృథా !

పుత్రులలోనఁ బిన్న; నినుఁ బోరికిఁ బిల్వఁగ, మాని నాఁగ ని

ద్ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కి బలదర్పసమగ్రుఁడవైన నీవు నీ

మిత్రులుఁ గూడ నిట్లయిన మెత్తురె? వత్తురె కొల్వ భూభుజుల్? (*ఆంధ్ర. విరాట. 5: 203*).

'ఓ దుర్యోధనా! నీవు కౌరవరాజువి. క్షత్రియుడైనవాడెవడైనా ఓడిపోయి పారిపోతాడా? ఇలా పారిపోవడం ఉచితం కాదు. నేనొక్కడను. అనగా నిస్సహాయుడను. నీవా పెద్ద సైన్యంతో మిత్రులతో ఉన్నావు. పైగా నేను కౌంతేయులలో చిన్నవాడను. నీవు కౌరవులలో అగ్రజుడవు. నాకన్న పెద్దవాడవు కూడా. నిన్ను యుద్ధానికి పిలుస్తుంటే రావడం లేదు. నీవా లోకంలో అభిమానధనుడవని చాలా పేరు పొందావు. బలం గర్వం దండిగా ఉన్నవాడివైనా నీవూ, నీ మిత్రులూ ఇలా (రణరంగం వదిలి పారిపోయేటట్లు) అయితే రాజులు నిన్ను మెచ్చుకొంటారా? నిన్ను సేవించడానికి (నీ కొలువు చేయడానికి) ఇక వస్తారా?'

ఈ సన్నివేశం ద్వారా అర్జునుడి పరాక్రమం ఎంత భీకరంగా ఉంటుందో స్పష్టమయ్యింది.

అర్జునుడి బాణాలే కాదు, వాగ్బాణాలు సైతం పదునైనవే ఈ సన్నివేశం మరొకసారి ఋజువు చేస్తోంది. నాయకుడికి కేవలం పరాక్రమం ఉంటే సరిపోదు. సంభాషణానైపుణ్యం కూడా ఎంతో అవసరం. అర్జునుడు తన సంభాషణానైపుణ్యం ద్వారా తనలో నాయకత్వ లక్షణాలు మెండుగా ఉన్నాయని మరొక్కసారి నిరూపించుకున్నాడు.

తిక్కన సంభాషణాశిల్పంతో అర్జునుడి మాటలు మరింతగా పదునెక్కాయి. పై పద్యంలో గమనిస్తే అర్జునుడి ప్రతీ మాటలోనూ ఎత్తిపొడుపు కనిపిస్తుంది.

క్షత్రియుడోడునే? – ఉత్తరగోగ్రహణ ఘట్టం ప్రారంభంలో యుద్ధానికి బయలుదేరినప్పుడు, కౌరవసేనలను చూసి బెదిరిపోయిన ఉత్తరుడికి అర్జునుడు ధైర్యం చెప్పాడు. 'వీరుడనేవాడు యుద్ధరంగంలో పోరాడి ప్రాణాలు వదలాలే కానీ, తప్పించుకుని పారిపోకూడదు' అంటూ అర్జునుడు నాయకుడికి రణరంగంలో ఉండవలసిన లక్షణాల గురించి వివరించాడు. ఉత్తరుడంటే ఎప్పుడూ యుద్ధంలో పెద్ద సైన్యాన్ని చూసి ఉండకపోవడం వల్ల భయపడ్డాడు. కానీ, ఇక్కడ స్వయంగా కౌరవసైన్యానికి మహారాజు అయిన దుర్యోధనుడు యుద్ధరంగంలో వెనకడుగు వేయడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ఈ మాట ద్వారా అర్జునుడు దుర్యోధనుడి వీరత్వాన్ని ప్రశ్నించాడు.

ఒకండన్ – అర్జునుడు ఒక్కడే యుద్ధానికి వచ్చాడు. భీష్మ, ద్రోణ, కృప, కర్ణ, దుర్యోధన, అశ్వత్థామ వంటి మహామహులతో నిండిన అత్యంత భయంకరమైన కౌరవసేనని ఒక్కడే ఎదుర్కొన్నాడు. తన యుద్ధనీతితో చాకచక్యంగా వ్యవహరించి యుద్ధంలో విజయబావుటా ఎగురవేశాడు. ఒక్కడినే వచ్చాను అని చెప్పడం ద్వారా 'నీవెనక ఇంత సైన్యం ఉండి కూడా యుద్ధంలో వెన్ను చూపావ'ని దుర్యోధనుడిని గేలి చేయడం అర్జునుడు ఉద్దేశ్యం.

నే పృథా పుత్రులలోన బిన్న– అర్జునుడు కుంతీ దేవికి మూడవ సంతానం, కౌంతేయులలో అర్జునుడు అందరికంటే చిన్నవాడు. దుర్యోధనుడు గాంధారి కుమారులలో పెద్దవాడు. చిన్నవాడికి బెదిరి పెద్దవాడు పారిపోవడం న్యాయమా! అని ఎగతాళి చేశాడు అర్జునుడు. పైగా చిన్నవాడినైన నా పరాక్రమానికే నువ్వు ఇలా బెదిరిపోతే, పాండవులు ఐదుగురం వస్తే నీ గతి ఏంటి? అని ఎత్తిపొడుపు.

'మాని నాఁగ నిద్ధాత్రిఁ బ్రసిద్ధి కెక్కి బలదర్పసమగ్రుఁడవైన నీవు' – ఇది దుర్యోధనుడికి ఉన్న ప్రశస్తి. మానం కలవాడు ప్రాణం కన్నా మానమే శ్రేష్ఠమని భావించాలి. కానీ దుర్యోధనుడికి ఉన్న ప్రాణభీతి ఇంకొకరికి లేదు. బలం, దర్పం రెండూ నాయకుడికి ఉండాలి. అయితే, దుర్యోధనుడు వాటిని స్వయంగా రక్షించుకోలేనివాడు. దుర్యోధనుడు ఇతరుల (భీష్మ, ద్రోణ, కర్ణ, కృప, అశ్వత్థామ మొదలైన వారు) పరాక్రమంపై ఆధారపడిన వీరుడు. ఈ మాట ద్వారా దుర్యోధనుడి స్వాభిమానం పై దెబ్బ కొట్టాడు అర్జునుడు.

దుర్యోధనుడి మిత్రులు, (కర్ణుడు మొదలైన వీరులు) అర్జునుడి పరాక్రమానికి తాళలేక అతడిని వదిలి వెళ్లిపోయారు. ఇప్పుడు దుర్యోధనుడు కూడా వెన్ను చూపడంతో, ఏ మహారాజు అయినా నీ చర్యని మెచ్చుకుంటాడా? అని ఎత్తిపొడుపు.

అంతే కాకుండా అర్జునుడు యుద్ధరంగంలో వెన్ను చూపిన దుర్యోధనుడిపై మరిన్ని వాగ్బాణాలు సంధించాడు.

సీ. ఏనుంగు నెక్కి పె క్కేనుంగు లిరుగడ / రాఁ బురవీథులఁ గ్రాలఁ గలదె?
మణిమయంబైన భూషణ జాలముల నొప్పి / యొడ్డోలగంబున నుండఁ గలదె?
కర్పూర చందన కస్తూరికాదుల / నింపు సొంపార భోగింపఁ గలదె?
యతిమనోహర లగు చతురాంగనలతోడి / సంగతి వేడ్కలు సలుపఁ గలదె?

తే. కయ్యమున నోడి పాఱినఁ గౌరవేంద్ర
వినుము నా బుద్ధి; మరలి యీ తనువు విడిచి
సుగతి వడయుము తొల్లింటిచూఱ గలదె?
జూద మిచ్చట నాడంగరాదు సుమ్ము !(*ఆంధ్ర. విరాట. 5: 204*).

'ఓ కౌరవరాజా! యుద్ధంలో ఓడిపోతే, ఏనుగునెక్కి ప్రకాశిస్తూ రెండువైపులా ఎన్నో ఏనుగులు రాగా పురవీథులలో వెళ్లగలవా? మణులు తాపిన భూషణాలు పెట్టుకుని నిండు సభలో కూర్చుండగలవా? కర్పూర, చందన, కస్తూరికాదులతో ఇష్టంగా భోగాలనుభవించగలవా? అందమైన సుందరులతో వేడుకగా కులుకగలవా? నేను చెప్పేది వినుము; వెనుకకు తిరిగి యుద్ధం చెయ్యి, లేదంటే శరీరం విడిచిపెట్టి అయినా పుణ్యలోకాలు పొందుము. ఇతరుల సొమ్ములను దోపిడీ చేసే నీ పూర్వపు అలవాటు (అవకాశం) ఇంకా ఉన్నదా? మునుపటి ఆటలు ఇప్పుడు సాగవు. ఇక్కడ యుద్ధరంగంలో జూదం మాత్రం ఆడే వీలు లేదు సుమా!'

మొదటి పద్యంలో యుద్ధరంగంలో దుర్యోధనుడు పారిపోవడం వల్ల కలిగే ఫలితాలను వర్ణించి, ఈ పద్యంలో హస్తినాపురం చేరిన తర్వాత దుర్యోధనుడికి ఎదురయ్యే అవమానాలను ఈ పద్యంలో వర్ణించాడు తిక్కన.

గజారోహణం ఒక గొప్ప రాజవైభోగం. ఏనుగు మీద ఊరేగడం అంటే అతడు అందరికంటే ఉన్నతుడు అని ప్రకటించడం. మహారాజులు పురవీథులలో ఏనుగునెక్కడం పరిపాటి. అయితే, యుద్ధరంగంలో వెన్ను చూపి, పారిపోయి దుర్యోధనుడు ఏ మొహం పెట్టుకుని గజారోహణం చేస్తాడని అర్జునుడు అవహేళన చేశాడు.

రత్నాలు, వజ్రాలు, మణులు ధరించి మహారాజ సింహాసనం మీద ఆసీనుడయ్యే అర్హతని దుర్యోధనుడు కోల్పోయాడని అర్జునుడు దుర్యోధనుడిని తన మాటలతో గేళి చేశాడు. అంతేకాక, 'యుద్ధరంగంలో దుర్యోధనుడికి జరిగిన అవమానం గురించి హస్తినాపురంలో తెలిస్తే పట్టపురాణులు, సుందరులు, చెలికత్తెలు దుర్యోధనుడిని అపహాస్యం చేస్తారు, సరససల్లాపాల కోసం దగ్గరకి రారు' అంటూ దుర్యోధనుడిని అర్జునుడు అపహాస్యం చేశాడు.

యుద్ధంలో పాండవులను ఓడించే దమ్ము లేక, మాయాజూదం ద్వారా పాండవులపై పైచేయి సాధించి, దుర్యోధనుడు రాజ్యాన్ని స్వాధీనం చేసుకున్నాడన్న విషయం జగద్విదితం. ఆ విషయాన్ని

దుర్యోధనుడికి ఈ సందర్భంగా గుర్తుచేసి, 'ఇది మాయాజూదం కాదు. రణరంగం. ఇక్కడ పరాక్రమానికి, వీరత్వానికి మాత్రమే చోటుంది. నీకు బాగా అలవాటైన సొమ్ములను దోపిడీ చేయడం ఇక్కడ వీలుపడదు. ఇప్పటికైనా అటువంటి బుద్ధి మానుకుంటే మంచిది' అంటూ దుర్యోధనుడిని ఎత్తిపొడిచాడు.

ఉత్తరగోగ్రహణ యుద్ధ ఘట్టంలో దుర్యోధనుడిని అర్జునుడు రెండు దశల్లో నిర్వీర్యుడిని చేశాడు. మొదటి దశలో, తన పరాక్రమంతో, ధనుర్విద్యా ప్రావీణ్యంతో, యుద్ధనీతితో, వ్యూహాలతో దుర్యోధనుడిని, అతడి పరివారాన్ని పారిపోయేలా చేశాడు. రెండవ దశలో పారిపోతున్న దుర్యోధనుడిని ఆపి, యుద్ధరంగంలో, హస్తినాపురంలో పర్యవసానాలు ఎలా ఉండబోతున్నాయో చెప్పి అర్జునుడు చావు దెబ్బ కొట్టాడు. మొదటి దశలో దుర్యోధనుడిని శారీరకంగా నిర్వీర్యుడిని చేసి, రెండవ దశలో మానసికంగా నిర్వీర్యం చేశాడు.

అర్జునుడి అసమాన సంభాషణానైపుణ్యానికి తిక్కన సంభాషణాశిల్పం తోడై ఉత్తరగోగ్రహణ ఘట్టంలోని యుద్ధరంగం రసవత్తరంగా ఆవిష్కృతమయ్యింది. అర్జునుడి సంభాషణానైపుణ్యం ప్రత్యేకంగా నిలిచిపోయింది.

## 7.13. ముగింపు

సంభాషణా నైపుణ్యం పాఠాలు చదువుకునే పిల్లల నుండి దేశాన్ని నడిపించే ప్రధాన మంత్రి వరకు ప్రతీ ఒక్కరికీ అవసరమేనని ఆంధ్ర మహాభారతంలోని పాత్రలు నిరూపిస్తున్నాయి. సమాజంలో అందరితో నడుచుకునే క్రమంలో సంభాషణా నైపుణ్యం ఎలా ఉపయోగపడుతుందో ఈ సాహిత్యం ద్వారా తెలుస్తోంది. ఒక మాట యుద్ధాన్ని నివారించగలదని, అదే మాట యుద్ధ వాతావరణాన్ని సృష్టించగలదని మరొకసారి ఆంధ్ర మహాభారతం ద్వారా స్పష్టమౌతోంది.

ఆంధ్ర మహాభారతంలోని మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాల ఆధారంగా సంభాషణా నైపుణ్యాన్ని ఎలా పెంపొందించుకోవాలో ఈ అధ్యాయంలో వివరించబడింది. నాలుగు పర్వాలలో ఈ దృక్కోణానికి సంబంధించిన సాహిత్యాన్ని సాధ్యమైనంత సమగ్రంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఉదహరించినవి కొన్నే అయినా, మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి. కేవలం, నాలుగు పర్వాలలో ఇన్ని ఉదాహరణలు పరిశోధన దృష్టికి దర్శనమిస్తే, మొత్తం ఆంధ్ర మహాభారతంలో మరెన్నో ఉదాహరణలు దొరికే అవకాశం ఉంది.

# అధ్యాయం – 8

# ఆంధ్ర మహాభారతం: వ్యక్తిత్వ వికాసం

## 8.1. ఉపోద్ఘాతం

తన గురించి తాను ఆలోచించుకోవడం స్వార్థం. పదిమంది గురించి ఆలోచిస్తూ వారి మంచి కోరుకోవడం పరమార్థం. స్వార్థాన్ని విడనాడి పరమార్థాన్ని చేరుకునే క్రమంలో మనిషి మనస్సు పొందే వికాసమే 'వ్యక్తిత్వ వికాసం (Personality Development)'. అయితే, ఈ క్రమంలో వ్యక్తి తన జీవితాన్ని కోల్పోకూడదు. తన జీవితాన్ని కోల్పోకుండా ఇతరుల మంచి కోరుకోవడం అన్నమాట.

ఒక వ్యక్తి తన అవసరాలను తాను తీర్చుకునే స్థాయి నుండి, సామాజిక అవసరాలు గుర్తించి, తన ద్వారా సమాజం అభివృద్ధి చెందే విధంగా విశాలభావంతో ప్రవర్తించడమే వ్యక్తిత్వ వికాసం. వ్యక్తుల కలయికే సమాజం. వ్యక్తులలో ఉండే విశాలభావాలే సామజిక పురోగమనానికి పునాది అవుతాయి. అందువల్ల వ్యక్తిత్వ వికాసం సామాజికాభ్యుదయానికి దోహదపడే చాలా ముఖ్యమైన అంశం.

శ్లో॥ సమష్టి వ్యష్టి రూపౌ ద్వౌ పదార్థౌ సర్వ సమ్మతౌ
సమష్టిరీస్వరౌ, వ్యష్టిర్జీవో వేదాంత డిండిమః (*వేదాంత. 1993: 5*)

అంటూ ఆదిశంకరాచార్యుల వారు ఇదే భావనని '*వేదాంత డిండిమం*'లో వ్యక్తం చేశారు. వ్యష్టి జీవుడు, సమష్టి దేవుడు. ఈ పరిణామంలో మనిషి మనస్సు సంకుచితత్వాన్ని విడనాడి విశాల దృక్పథాన్ని అలవర్చుకుంటుంది. వ్యక్తిత్వం వికసించినప్పుడే, 'మానవత్వం కలవాడే మనిషి' అన్న మాటకి సార్థకత.

వికసించడం అనే పదాన్ని సాధారణంగా పువ్వుల విషయంలో వాడతారు. 'పువ్వు వికసించింది' అంటారు. నిజానికి మొగ్గ వికసించి పువ్వుగా మారుతుంది. మొగ్గగా ఉన్నప్పుడు అది ముడుచుకుని ఉంటుంది. మనిషి మనస్సు కూడా సంకుచిత భావంతో నిండి ఉన్నప్పుడు మొగ్గ లాగే

ఉంటుంది. మొగ్గ వికసించి పువ్వుగా మారి పరిమళాన్ని వెదజల్లినట్టు, మనస్సు కూడా వికసించి విశాల భావంతో సువిశాల విశ్వాన్ని అక్కున చేర్చుకోవాలి. అలా భావించడమే వ్యక్తిత్వం వికసించేందుకు మనిషి వేసుకునే పునాది.

## 8.2. ఉదంకుడి గురుభక్తి

నన్నయ రచించిన ఆదిపర్వంలో ఉదంకోపాఖ్యానంలో విద్యార్థుల వ్యక్తిత్వం ఎలా ఉండాలో వివరించారు. విద్యార్థులకి గురువుల పట్ల ఉండవలసిన గౌరవం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు.

క. కర మిష్టము సేసితి మా
కరిసూదనదీన నీకు నగు సత్ఫలముల్ !;
గురుకార్యనిరతు లగు స
త్పురుషుల కగు టరుదె? యధికపుణ్యఫలంబుల్. (*ఆంధ్ర. ఆది. 1: 119*)

'శత్రువులను సంహరించువాడా! మాకు మిక్కిలి ప్రియాన్ని కలిగించావు. ఈవిధంగా చేయడం వలన నీకు మంచి ఫలితాలు కలుగుతాయి. గురువుల పనులందు ఆసక్తులయ్యే సజ్జనులకు గొప్ప పుణ్యాలు చేసిన ఫలాలు కలగడంలో వింత లేదు'.

"అథసేవామనిచ్ఛంతం గురు మర్థేన తోషయేత్! గుర్వర్థే యతమానం తం అనుగృహ్ణంతి దేవతాః" (*ఆంధ్ర. ఆది. 1. పుట: 78).*

ఉదంకుడు తన గురువు ఆజ్ఞ మేరకు ఎంతో శ్రమించి కుండలాలను తెచ్చి గురుదక్షిణగా సమర్పించాడు. గురువుల ఆశీస్సులు పొందినవారు అనుకున్నది సాధిస్తారు. అంతే కాకుండా వారికి గొప్ప పుణ్యాలు చేసిన ఫలాలు కలుగుతాయి అని పై పద్యంలో స్పష్టం చేశారు. నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికి ఈ పద్యం ఒక ఉదాహరణ. గురువుల ఆశీస్సులు ఉండడం వల్లే ఉదంకుడికి కార్యసిద్ధి కలిగింది. ఒక విద్యార్థి / విద్యార్థిని జీవితంలో ఎన్ని విజయాలు సాధించినా, ఎంత గొప్పవాడైనా తనకి విద్య నేర్పించిన గురువుల ఆశీస్సులు అతడికి / ఆమెకి మెండుగా ఉండడం వల్లే అనే విషయాన్ని అందరూ గుర్తుపెట్టుకోవాలి అనే విషయాన్ని ఈ ఘట్టం ద్వారా తెలుసుకోవచ్చు.

## 8.3. కద్రూవినతల కథ

నన్నయ రచించిన ఆదిపర్వంలో వచ్చే కద్రువ, వినతల కథ ఎన్నో సామాజికాంశాలకి నిలయం. ముఖ్యంగా ఈ కథలోని పాత్రల వ్యక్తిత్వాలు విభిన్నమైనవి. ప్రతీ పాత్ర పాఠకులకి చక్కటి సందేశాన్నిస్తుంది. వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకునేందుకు దోహదపడుతుంది.

తర. అనలతేజులు, దీర్ఘదేహులు నైనయట్టి తనూజులన్
వినుతసత్త్వులఁ గోరెఁ గద్రువ వేవురం గడువేడ్కతో;
వినత గోరె సుపుత్త్రులన్ భుజవీర్యవంతుల, వారికం
టెను బలాధికు లైన వారిఁ, గడిందివీరుల, నిద్దఱన్. *(ఆంధ్ర. ఆది. 2: 3)*

'అగ్నివలె ప్రకాశించేవారు, పొడవైన దేహాలు కలవారు, ప్రసిద్ధి పొందిన బలం కలవారు అయిన వేయిమంది కుమారులను కద్రువ మిక్కిలి సంతోషంతో కోరింది. వినత ఆ కద్రువ కుమారులకంటే బలంలో గొప్పవారు, బాహువుల బలం కలవారు, అయిన ఇద్దరు మంచి కుమారులను కోరింది'.

కశ్యపబ్రహ్మ భార్యలైన కద్రువ, వినతలు అతడిపట్ల చూపించిన అంకిత భావానికి మెచ్చి కశ్యపుడు ఇద్దరికీ వరాలను అనుగ్రహిస్తాడు. అప్పుడు వారు పైవిధంగా కోరుకుంటారు. నన్నయ శాకుంతలోపాఖ్యానంలో రచించిన "నుతజల పూర్తంబులగు...*(ఆంధ్ర. ఆది. 4: 94)*" అనే పద్యాన్ని ఈ సందర్భంలో గుర్తుచేసుకోవాలి. వంద క్రతువుల (యజ్ఞాలు) కంటే ఒక మంచి కొడుకు ఎంతో ప్రయోజనాన్ని చేకూరుస్తాడని మంచి పుత్రుడి యొక్క గొప్పతనాన్ని వర్ణించాడు నన్నయ.

కద్రువ పైన పేర్కొన్న లక్షణాలతో ఉన్న వెయ్యి మంది సంతానాన్ని కోరితే వినత తెలివిగా వారికంటే అన్నింటిలోనూ మిన్నయైన ఇద్దరు కుమారులను కోరుకుంది. కోరికలు మానవసహజం. అయితే అవకాశం వచ్చినప్పుడు మనిషి ఏది కోరుకుంటాడు అనేది అసలైన సమస్య. మన పురాణ కథల్లో, ఇతిహాసాల్లో భక్తులు కోరుకున్న కోరికలు చాలా సందర్భాల్లో ఎలా తిరిగి సమస్యగా పరిణమించాయో తెలిసిందే. ముఖ్యంగా రాక్షసులు తెలియక వరాలు కోరి ఇబ్బందుల పాలయ్యారు. ఆ కోరికలు అన్నింటికీ స్వార్థం మూలం. ఎవరైతే నిస్వార్థంగా ఆలోచించి, స్వచ్ఛమైన కోరికలు

కోరారో భగవంతుడు వారికి మోక్ష సిద్ధిని కలుగజేశాడు. స్వార్థం కోసం పరితపించినవారికి తగిన శిక్ష విధించాడు. వ్యక్తిత్వ వికాసం అంటే  మనిషి స్వార్థాన్ని విడనాడి పరమార్థాన్ని చేరుకోవడమే.

కద్రువతో పోల్చుకుంటే వినతకి యుక్తి చాలా ఎక్కువని చెప్పాలి. కద్రువ కంటే కూడా వినత తన ఆశలకు కొంతలో కొంత కళ్లెం వేసింది. వినత ఈ సందర్భంలో యుక్తిగా, కాస్త ఆత్మ సంతృప్తితో ప్రవర్తించింది. ఇద్దరిలోనూ ఒకరిపై ఒకరికి ఆధిక్య భావన కనిపిస్తుంది. ఈ రెండు పాత్రల ప్రయాణం ఎలా ఉండబోతోందో పరోక్షంగా నన్నయ పద్యంలో ధ్వనింపజేశాడు.

క. తన గర్భాండంబులరెం
టను బ్రియనందనులు వెలువడమి, నతిలజ్జా
వనత యయి వినత పుత్త్రా
ర్థిని యొకయండంబు విగతధృతి నవియించెన్. *(ఆంధ్ర. ఆది. 2: 5)*

‘తన గర్భం నుండి పుట్టిన గుడ్లు రెండింటినుండి ముద్ద కుమారులు బయటపడని కారణంగా, మిక్కిలి సిగ్గుచేత కుంగినదై, కొడుకులను కోరే వినత ధైర్యం కోల్పోయి ఒక గుడ్డుని బద్దలు అయ్యేటట్లు చేసింది’.

కద్రువకి తనకంటే ముందు కుమారులు జన్మించేసరికి సహించలేకపోయిన వినత అసూయకు లోనై తన కుమారుడి భవిష్యత్తును తానే కాలరాసింది. అసూయ అన్ని దురాక్రమాలకు మూలం అని మరొకసారి రుజువయ్యింది. కోరికను కోరే సమయంలో యుక్తిని చూపించిన వినత, ఫలాన్ని అనుభవించే ముందు సంయమనం పాటించలేకపోయింది.

ఒకరి ఎదుగుదల మరొకరిపై ఆధారపడి ఉండదనే విషయాన్ని ఈ ఘట్టం ధృవీకరిస్తోంది. పక్కవాళ్ల ఎదుగుదలను చూసి అసూయ పడితే మొదటికే మోసం వచ్చే ప్రమాదం ఉందనే విషయాన్ని స్పష్టం చేస్తోంది. నిజానికి తాను కోరుకున్న కోరికకు వినత కట్టుబడి సంయమనం పాటించి ఉంటే ఇంత సమస్య వచ్చేదే కాదు.

వ్యక్తిత్వ వికాసం అంటే వ్యక్తి తాను ఒక్కడూ ఎదగడం కాదు, నలుగురిలో మమేకం అవుతూ తన ప్రత్యేకతను చాటుకోవడం, తనతోపాటు నలుగురి ఎదుగుదలను కాంక్షించడం. వినత చేసిన తప్పు నేటితరంలో చాలామంది చేస్తూనే ఉన్నారు. ముఖ్యంగా విద్యార్థులు ‘స్పర్థయా వర్ధతే విద్యా’

అనే మూలాన్ని విస్మరించి భవిష్యత్తును ఛిద్రం చేసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు ఆధిక్యాన్ని నిరూపించుకునే క్రమంలో వారి భవిష్యత్తును వారే పాడుచేసుకుంటున్నారు.

వినత కడుపుని మోదుకోవడం వల్ల కాళ్లు లేకుండా జన్మించిన అనూరుడు, తన భవిష్యత్తును నాశనం చేసిన తల్లిని కద్రువకి దాసీగా ఉండమని శపిస్తాడు. కేవలం అసూయ వల్ల, వినత ఎవరిపైనైతే తన ఆధిక్యాన్ని ప్రదర్శించాలనుకుందో, ఆ కద్రువకే దాసీగా మారాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్వార్థాన్ని విడనాడకపోతే పరిపూర్ణ వ్యక్తిత్వ వికాసం సిద్ధించదని ఈ ఘట్టం ఉద్ఘాటిస్తోంది.

## 8.4. క్షీరసాగర మథనం

క్షీరసాగరమథన సందర్భాన్ని వర్ణిస్తూ నన్నయ రచించిన పద్యం ఇది. ఈ ఘట్టం నిజంగా ఒక జీవిత పాఠం. అమృతాన్ని పొందడం కోసం దేవతలు, రాక్షసులు క్షీరసాగరాన్ని మథించనారంభించారు. ఆ క్రమంలో మధ్యలో ఈ విశేషాన్ని ఎవరు స్వీకరించారు, అని తరచి చూస్తే మన నిత్యజీవితానికి అన్వయించుకోదగిన విషయాలు తెలుస్తాయి. అమృతం కోసం దేవతలు, అసురులు చేసిన క్షీరసాగరమథనం మానవులకు జీవిత పాఠం.

చ. ఉడుగక యొండొరుం జఱచి యొక్కబలంబున దేవదానవుల్
వడిగొని వార్ధి నిట్లు దరువం దరువన్ విష ముద్భవిల్లి నల్
గడలను విస్ఫులింగములు గప్పఁగఁ బర్విన, దానిఁ జెచ్చెరన్
మృడుఁడు గడంగి పట్టుకొని మ్రింగి గళంబున నిల్పెఁ బొల్పుగన్. *(ఆంధ్ర. ఆది. 2: 15)*

'దేవాసురులు మానక ఉత్సాహంతో ఒండొరులను చేతులతో చరచుకుంటూ ఏకధాటిగా వేగం పెంచి సముద్రాన్ని ఇలా మథించగా, విషం పుట్టగా నాలుగు దిక్కులా నిప్పుకణాలు ఆవరించేటట్లు వ్యాపించగా, దాన్ని వేగంతో శివుడు పట్టుకుని మింగి పొందికగా అందంగా ఉండేటట్లు కంఠం లోపల నిలిపాడు.'

అమృతాన్ని స్వీకరించడానికి అందరూ సిద్ధమయ్యారు. కానీ, ముందు విషం ఉద్భవించేసరికి అంతా పరమశివుడిని ప్రార్థించారు. ఇక్కడ లోతుగా గమనించదగిన విషయాలు రెండు. ఒకటి,

సుఖాల(అమృతం) కోసం మనం చేసే ప్రయత్నంలో ఎన్నో దుఖాలు(విషం..మొదలైనవి) ఎదురవ్వడం. సుఖాన్ని స్వీకరించినంత తేలికగా దుఖాన్ని మనం స్వీకరించలేకపోవడం రెండు.

మనిషికి సుఖాన్ని పొందే క్రమంలో కష్టాలు, లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అవరోధాలు ఎదురవ్వడం సహజం, అనివార్యం. ఆ అవరోధాలని, దుఖాలని అధిగమించినవారు మాత్రమే కార్యసిద్ధిని పొందుతారు. ఆ అవరోధాలని పరీక్షగా భావించి ముందడుగు వేయడం కార్యసాధకుల లక్షణం.

మనిషి సుఖాన్ని స్వీకరించినంత తేలికగా దుఖాన్ని స్వీకరించకపోవడం తెలిసినదే. నిజానికి ఆ రెండింటికీ మనిషి మనస్సులో ఉండే భావనే మూలమనే విషయాన్ని గ్రహించాలి. మనిషి గమ్యంపై కాక గమనంపై దృష్టి నిలిపితే ఆ అవరోధాలను సునాయాసంగా అధిగమించవచ్చు.

ఒక కుటుంబం సాగించే జీవిత ప్రయాణంలో ఎన్నో సుఖాలు, దుఖాలు రావడం సహజం. ఆయా పరిస్థితులు ఎదురైనప్పుడు ఒకరిపై ఒకరు సమస్యని నెట్టేయకుండా కుటుంబ సభ్యులు అంతా సమష్టిగా ఆలోచించి సమస్యకి పరిష్కారాన్ని సూత్రీకరించడం ప్రధానం. జట్టుగా ఏర్పడి ఆడే ఆటలు, మనిషి కుటుంబ జీవన పోరాటంలో సమష్టిగా రాణించి అమృతతుల్యమైన విజయాన్ని ఎలా ఆస్వాదించాలో నేర్పిస్తాయి. సమష్టి భావనని ప్రతి వ్యక్తిలోనూ జ్వలింపజేసి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే 'వసుధైక కుటుంబకం' అనే భారతీయ సిద్ధాంతం సదా ఆచరణీయం.

క్షీరసాగరమథన సందర్భంలో అమృతం కోసం దేవాసురులు అమితమైన ఉత్సాహంతో పోరాడుతుంటే, వెలువడిన విషాన్ని పరమశివుడు స్వీకరించాడు. నలుగురి శ్రేయస్సు కోసం తాను విషాన్ని స్వీకరించడానికి సైతం వెనుకాడలేదు శంకరుడు. ఈ ఘట్టంలో శివుడు పరిపూర్ణ వ్యక్తిత్వ వికాస సాధనకి ప్రేరణ. శివుడు స్వార్థాన్ని విడిచి సర్వలోకాశ్రయుడయ్యాడు.

దేశ రక్షణ కోసం తమ స్వార్థాన్ని విడిచి సరిహద్దుల్లో పోరాడే సైనికుల్లాగా, ప్రతీ మనిషి సువిశాలమైన విశ్వాన్ని గుప్పెడు మనస్సులో బంధించగలిగితే అదే వ్యక్తిత్వ వికాసం. ఇంతటి అర్థాన్ని క్షీరసాగరమథన ఘట్టం ఆధారంగా నన్నయ తన పద్యాల్లో ధ్వనింపజేశాడు.

## 8.5. పరీక్షిత్తు కథ: వ్యక్తిత్వ వికాసం

నన్నయ రచించిన ఆదిపర్వంలోని పరీక్షిత్తు కథ విభిన్నమైన వ్యక్తిత్వాల సమ్మేళనం. ఈ ఘట్టంలోని ప్రతీ పాత్ర గొప్ప సందేశాన్నిస్తుంది. ఒక్కోసారి జీవితంలో చేసే చిన్న చిన్న తప్పులవల్ల మనిషి ఎంతగా నష్టపోవాల్సి వస్తుందో ఈ కథ చదివితే తెలుస్తుంది.

వ. కని 'మునీంద్రా! నాచేత నేటువడి మృగం బమ్ముతోన యిటవచ్చె, నది యెక్కడంబాఱె? నీ వెఱుంగుదేని చెప్పుమనిన, నమ్ముని మౌనవ్రతుండు గావునఁ బలుకకున్నం గినిసి, తత్సమీపంబున నపగతప్రాణం బై పడియున్నపాముం దనవింటికొప్పున నెత్తి, యమ్మునియఱుతం దగుల వైచి, క్రమ్మఱి హస్తిపురంబునకు వచ్చియున్నంత. (*ఆంధ్ర. ఆది. 2: 166*)

'చూచి, 'ఓముని శ్రేష్ఠ! నా చేత బాణపు దెబ్బ తిన్న లేడి ఆ బాణంతో కూడా ఇక్కడికి వచ్చింది. అది ఎక్కడికి పారిపోయింది? నీకు తెలిసి ఉంటే చెప్పుము' అని అడుగగా ఆ ముని మౌనవ్రతం కలవాడు. కావున, సమాధానం ఏమీ చెప్పకుండా ఉండగా, కోపించి అతనిచెంత చచ్చి పడి ఉన్న ఒక పామును తనవింటి కొనచే పైకితీసి ఆ శమీకముని మెడలో తగిలించి తిరిగి హస్తినాపురానికి వచ్చి ఉండగా'.

శమీకమహాముని మౌనవ్రతంలో ఉండడం వల్ల పరీక్షిత్తు ప్రశ్నకి ఆయన సమాధానం చెప్పలేదు. ఒక మహారాజు అయ్యుండి, మునులతో ఎలా నడుచుకోవాలో ఆలోచించకుండా పరీక్షిన్మహారాజు ఆగ్రహించాడు. మునుల అనుగ్రహం రాజులకి, రాజ్యపాలనకి అవసరం. అసలు, తపస్సు చేసుకుంటున్న మునిని పలకరించడమే అధర్మం. ఒకవేళ అంతటి అవసరమే వచ్చినా, ముందు వారికి నమస్కరించి, ఆశీస్సులు వేడుకుని, వారు ప్రసన్నులు అయిన తర్వాత ఏమైనా అడగాలి. పరీక్షిత్తు అంతటి మహారాజు ఇలా ప్రవర్తించడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది.

శమీకమహాముని సమాధానం చెప్పనప్పుడైనా పరీక్షిత్తు ఆలోచించుకుని ఉండవలసింది. కానీ, ఆగ్రహాన్ని అదుపు చేసుకోలేక, చచ్చిన పాముని తెచ్చి మునిపై పడేయడం అతడి మూర్ఖ ప్రవృత్తినీ, అహంకారాన్నీ, గర్వాన్నీ తెలియజేస్తోంది. అందుకు తగిన ఫలితాన్నే పరీక్షిత్తు తర్వాతి కథలో అనుభవించవలసివచ్చింది. ఏ పామునైతే శమీకుడిపై వేసి వెళ్లాడో, అదే జాతి(నాగులు) వల్ల, శాపవశాత్తూ తక్షకుడి విషానికి బలికావలసివచ్చింది.

మనిషి ఆగ్రహాన్ని అదుపుచేసుకోకపోతే, అది ఎంతటి పరిస్థితులకు దారి తీస్తుందో ఈ చిన్న కథ ద్వారా తెలుస్తోంది. వినయం ఎల్ల వేళాలా మనిషికి ఉండవలసిన లక్షణం అని అర్థం అవుతోంది. వినయం వ్యక్తిత్వ నిర్మాణంలో చాలా కీలకమైన గుణంగా కనిపిస్తోంది.

క. క్రోధమ తపముం జెఱుచును;
   గ్రోధమ యణిమాదు లైన గుణములఁ బాపుం:
   గ్రోధమ ధర్మక్రియలకు
   బాధ యగుం; గ్రోధిగాఁ దపస్వికిఁ జన్నే? (*ఆంధ్ర. ఆది. 2: 172*)

క. క్షమ లేని తపసితపమును,
   బ్రమత్తుసంపదయు, ధర్మబాహ్యప్రభురా
   జ్యము భిన్నకుంభమున తో
   యములట్టుల యధ్రువంబు లగు నివి యెల్లన్. (*ఆంధ్ర. ఆది. 2: 173*)

'కోపమే తపస్సును చెడగొడుతుంది. కోపమే అణిమ, లఘిమ మొదలైన అష్టసిద్ధులను పోగొడుతుంది. కోపమే ధర్మంతో కూడిన కార్యాలకు బాధ కలిగిస్తుంది. కావున, తపస్సు చేసే ముని కోపం కలవాడు అవ్వడం తగునా!'

'ఓర్పు లేని ముని తపస్సు, ప్రమాదపడేవాడి ధనం, ధర్మం నుండి తొలగిన రాజ్యం, ఇవన్నీ బద్దలైన కుండలో నీళ్లవలె అస్థిరాలవుతాయి'.

శమీకుడు ఎంత గొప్ప మునో ఈ పద్యాలు చూస్తే అర్థమవుతుంది. మునికి ఉండాల్సిన అన్ని లక్షణాలు శమీకుడిలో కనిపిస్తాయి. మునులు, మహర్షులలో ప్రధానంగా కనిపించే గుణం శాంతగుణం. అది శమీకమహామునికి సంపూర్ణంగా ఉంది. తనపై చచ్చిన పామును పడేసిన పరీక్షిత్తుపై ఆయన ఆగ్రహించకపోగా, ఆవేశానికి లోనై పరీక్షిత్తుకి శాపాన్నిచ్చిన తన కుమారుడిని శాపాన్ని వెనక్కి తీసుకొమ్మని అడగడం అత్యంత ఉన్నతమైన అతడి వ్యక్తిత్వానికి నిదర్శనం.

శమీకుడు చెప్పిన మాటలు అతడి కొడుకుకే కాదు, నేటి సమాజానికి కూడా గొప్ప జీవిత పాఠాన్ని నేర్పిస్తాయి. కోపం వల్ల మనిషి అన్నింటినీ కోల్పోవలసి వస్తుందని, కోపం వల్ల ధర్మ కార్యాలకు అడ్డంకి కలుగుతుందని, కోపం మనిషికి నిజమైన శత్రువని శమీకుడు తెలియజేశాడు.

రెండు పద్యాల్లోనూ నన్నయ సూక్తివైచిత్రి స్పష్టంగా కనిపిస్తుంది. ధర్మం నుండి తొలగిన రాజ్యం, ఓర్పు లేని తపస్సు పగిలిన కుండలో నీటివంటివి అని శమీకుడి అతడి కుమారుడికి చెప్పినట్లుగా నన్నయ మనకి తెలియజేశారు. ఈ మాటలు నేటి సమాజానికి గొప్ప సందేశాన్నిస్తాయి. మనిషి వ్యక్తిత్వం సంపూర్ణంగా ఉండాలంటే ఓర్పు, ధర్మదృష్టి వంటి లక్షణాలు అవసరమనే విషయం ఈ పద్యాల ద్వారా అర్థమవుతోంది.

సీ. అడవిలో నేకాంతమతి ఘోరతపమున /నున్న మా గురులపై నురగశవము
వైచుట విని యల్గి, వారి తనూజుండు /శృంగి యన్వాఁడు కార్చిచ్చునట్టి
శాపంబు నీ కిచ్చె, సప్తాహములలోన /నా పరీక్షితుఁడు నాయలుకఁ జేసి
తక్షకవిషమున దగ్ధుఁ డయ్యెడు మని, /దానికి గురులు సంతాప మంది
ఆ. భూతలేశ! నన్నుఁ బుత్తెంచి రిప్పుడు,
తద్భయంబులెల్లఁదలఁగునట్టి
మంత్రతంత్రవిధు లమర్చి యేమఱకుండు
నది నిరంతరంబు ననియుఁ గఱప. (*ఆంధ్ర. ఆది. 2: 179*)

'అడవిలో ఏకాగ్రమైన మనస్సుతో తీవ్రమైన తపస్సు చేస్తున్న పూజ్యులైన మా గురువుగారిపై నీవు చచ్చిన పామును వేయడం విని కోపించి శృంగి అనే పేరుగల వారి కుమారుడు 'ఏడు రోజులలో ఆ పరీక్షిత్తు నా కోపం చేత తక్షకుడనే పాము విషం చేత దహింపబడుగాక! అని దావాగ్ని వంటి శాపం నీకిచ్చాడు. అలా అతడు శాపమివ్వడానికి మా గురువుగారు శోకించి, 'ఓ రాజా! దానివల్ల కలిగే భయాలన్నీ తొలగించేటి మంత్రాలు, తంత్రాలు మొదలైన విధానాలన్నీ ఏర్పరిచి సంతతం జాగురూకతతో ఉండాలని నీకు బోధించే కొరకు నన్నిప్పుడు నీ కడకు పంపారు'.

కొడుకు పరీక్షిన్మహారాజుకి ఇచ్చిన శాపానికి ఎంతో చింతించిన శమీకమహాముని, ఎంతో బాధ్యతగా ఆలోచించి తన శిష్యుడైన గౌరముఖుడిని పరీక్షిత్తు వద్దకు పంపాడు. ఇది శామీకమహాముని ఔదార్యాన్ని, బాధ్యతని మనకి తెలియజేస్తుంది. శాపం ఇచ్చిన విషయం రాజుకి తెలియజేస్తే, అతడు ఈ ఏడు రోజుల్లో చేయవలసిన పనులు పూర్తి చేసుకుంటాడని, మహారాజుగా చేయవలసిన బాధ్యతలు చేస్తాడని శమీకమహాముని ఆలోచించి ఈ విధంగా చేశాడు. ఈ చర్య శమీకుడి క్షమాశక్తిని, సౌజన్యాన్ని సూచిస్తుంది. తనని అవమానించినవాడిని క్షమాగుణంతో

విడిచిపెట్టేంత గొప్ప వ్యక్తిత్వం శమీకుడిది. శమీకుడు ముందు శృంగిని ఇచ్చిన శాపం వెనక్కి తీసుకోమని అడిగాడు. అది వీలు కాదని తెలిశాక, కనీస బాధ్యతగా గౌరముఖుడిని మహారాజు వద్దకు పంపించి శమీకుడు అత్యున్నతమైన తన వ్యక్తిత్వాన్ని చాటుకున్నాడు. శమీకుడి వ్యక్తిత్వం నేటికీ ఎంతో ఆదర్శంగా నిలుస్తుందనడంలో సందేహం లేదు.

క. కొని వ్రచ్చుడు, లోపల న

ల్లనిక్రిమి యై తోఁచి, చూడ లత్తుక వర్ణం

బునఁ బామై, విషవహ్నులు

దనుకఁగఁ గురువీరుఁ గఱచి తక్షకుఁ డరిగెన్. (*ఆంధ్ర. ఆది. 2: 197*)

'ఆ పండును గ్రహించి చీల్చిన వెంటనే నల్లని పురుగై కనబడి, చూస్తుండగానే పారాణివంటి ఎర్రనిరంగుతో పామై, విషం యొక్క అగ్నులు జ్వలించగా వీరుడైన పరీక్షిత్తును తక్షకుడు కరచి వెళ్లాడు'.

ఎంత ప్రయత్నించినా సరే, విధిరాతను ఎవరూ మార్చలేరు అనే విషయాన్ని పరీక్షిత్తు కథ మనకి తెలిజేస్తుంది. పరీక్షిత్తు తాను ముని శాపవశాత్తూ ఏడు రోజుల్లో పాము విషం వల్ల మరణిస్తాడని తెలుసుకుని, మానవప్రయత్నం చేయాలి కాబట్టి, పాము ఎక్కడానికి వీలుపడని ఒంటిస్తంభపు మేడ కట్టించుకుని, ఆ భవనానికి పూజలు చేయిస్తాడు. చివరి రోజుల్లో భాగవత శ్రవణం వల్ల మోక్షం లభిస్తుందని గ్రహించి భాగవత కథలను ఆస్వాదిస్తాడు. ఏది ఎలా ఉన్నా, ముని వాక్కుకి తిరుగు ఉండే అవకాశం లేదు. అందుకే, పండులో సూక్ష్మ రూపంగా చేరి తక్షకుడు పరీక్షిత్తుని తన విషానికి బలి చేశాడు.

మరణం నుంచి తప్పించుకోవడానికి మహత్తరమైన ప్రయత్నం చేసిన పరీక్షిత్తు, తాను అసలు శమీకుడిపై గర్వించి, చచ్చిన పామును పడేసి అవమానించకుండా ఉంటే ఇటువంటి పరిస్థితే వచ్చేది కాదు. ఆవేశంలో తీసుకున్న నిర్ణయాలు మనిషి జీవితాన్ని అతలాకుతలం చేస్తాయనడానికి పరీక్షిత్తు వృత్తాంతం ఒక ఉదాహరణ. పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని సంపాదించుకోవాలంటే ఆగ్రహావేశాలకు పోవద్దని ఈ కథ మనుషులందరికీ బోధిస్తోంది.

## 8.6. యయాతి వృత్తాంతం

యయాతి కథలోని ఈ పద్యం ఇంద్రియనిగ్రహం లేని మనిషి ఎలా ఇహపరమైన సుఖాలకు బానిసౌతాడో వివరిస్తుంది.

సీ. విషయోపభోగాభిలషణ మింకను నాకు /వదలక పెరుఁగుచున్నదియుఁ గాన
నందనులార! మీయం దొక్కరుండు నా /దగు జరాభారంబు దగిలి తాల్చి
తనజవ్వనంబు నా కొనరంగ నెవ్వఁ డీ /నోపు నాతండ సద్వీపసకల
ధారుణీసామ్రాజ్యభారయోగ్యుం డగు' /నని యడిగిన నగ్రతనయుఁ డయిన.

ఆ. యదువుఁ దొట్టి సుతులు ముదిమికి నోపక
తలలు వాంచి యున్న వెలయఁ దండ్రి
పనుపుఁ జేసి ముదిమి గొని జవ్వనం బిచ్చెఁ
బూరుఁ డనుసుతుండు భూరికీర్తి. (*ఆంధ్ర. ఆది. 3: 95*)

క. పూరుఁడు గొండుక యయ్యును
భూరిగుణజ్యేష్ఠుఁడును సుపుత్త్రుఁడు నవనీ
భారసహిష్ణుఁడు నాతఁడ
కోరినకార్యంబు దీర్చి కుశలుం డగుటన్. (*ఆంధ్ర. ఆది. 3: 200*)

'ఇంద్రియసుఖాభిలాష నన్నింకా వదిలిపెట్టక పెరుగుతున్నది. కాబట్టి ఓ కుమారులారా! మీలో ఒక్కడు నా ముసలితనాన్ని తీసికొని అతని యౌవనాన్ని నాకు ఇవ్వండి. ఆ విధంగా ఇవ్వగలిగినవాడే ఈ సకలసామ్రాజ్యభారాన్ని వహించేందుకు యోగ్యుడు' అని యయాతి ఈ విధంగా అడుగగా యదువు మొదలైన కొడుకులు మారు మాట్లాడక తలలు వంచుకుని ఉన్నారు. అప్పుడు పూరుడనే కొడుకు తండ్రి ఆజ్ఞతో అతడి ముసలితనాన్ని తాను తీసికొని తన యౌవనాన్ని తండ్రికి ఇచ్చాడు'.

'పూరుడు తండ్రినైన నేను, పూరుడు కోరినపని నెరవేర్చిన నేర్పరి అవ్వడం చేత, వయస్సులో చిన్నవాడైనా అధికములైన గుణాలచేత అగ్రజుడు, యోగ్యుడైన పుత్రుడు, భూమి బరువును వహించే సహనం కలవాడు అతడే అని భావిస్తున్నాను'.

ఆంధ్ర మహాభారతంలో ఎన్నో ఉపకథలు ఉన్నాయి. అందులో యయాతి వృత్తాంతం చాలా విచిత్రమైనది. యయాతి శుక్రుడి శాపం వల్ల ముసలితనాన్ని పొందాడు. కానీ, అతడికి ఇహపరమైన సుఖాలపట్ల ఆశ చావలేదు. తాను ఒక మహారాజు అయ్యుండి కూడా విషయవాంఛలకు లొంగి తనకు శాపవశాత్తూ లభించిన వృద్ధాప్యాన్ని అంగీకరించలేకపోయాడు. అయితే, తన కుమారులలో ఎవరైనా తన వార్ధక్యాన్ని తీసుకుని, వారి యౌవనాన్ని యయాతికి ఇస్తే, అతడు కావలసినంత కాలం యౌవనాన్ని అనుభవించి, తిరిగి ఆ కొడుకుకి తన యౌవనాన్ని ధారపోయవచ్చు. అందువల్ల తన కుమారులైన యదువు, తుర్వసుడు, ద్రుహ్యు, అనువు, పూరుడు అనే ఐదుగురినీ పిలిచి, ఈ షరతుకి అంగీకరించినవారికి మాత్రమే రాజ్యభారాన్ని అప్పగిస్తానని అంటాడు.

యయాతి ప్రవర్తన చూస్తే ఆశ్చర్యం కలగక మానదు. యయాతికి ఇద్దరు భార్యలు. వారి ద్వారా లభించిన సంతానం ఐదుగురు కుమారులు. అంతమంది కుమారులను కలిగిన తర్వాత కూడా యయాతికి ఇంద్రియసుఖాభిలాష తగ్గకపోవడం ఆశ్చర్యంగా అనిపిస్తుంది. ప్రజలను పాలించే నాయకుడు నిజానికి అరిషడ్వర్గాలను జయించి ఉండాలి. యయాతి వాటికి బానిస అయ్యాడు. ఏ తండ్రి అయినా తన బిడ్డలు సకల సుఖాలను ఆస్వాదించాలని కోరుకుంటాడు. యయాతి అందుకు భిన్నంగా కొడుకులని తన ముసలితనాన్ని స్వీకరించమని కోరుతున్నాడు. యయాతి మహారాజుగానే కాక, తండ్రిగా సైతం తన బాధ్యతను విస్మరించినవాడిగా కనిపిస్తున్నాడు.

యయాతి మహారాజు కథలో అతడి ప్రవర్తన ఒక ఎత్తైతే, అతడి షరతుకి అంగీకరించిన పూరుడి పాత్ర మరొక ఎత్తు. తండ్రి కోరికని అర్థం చేసుకుని, తన యౌవనాన్ని అతడికి ధారపోయడం సాధారణమైన విషయం కాదు. ఇటువంటి త్యాగం చేయడం ద్వారా పూరుడు రాజ్యభారాన్ని వహించడానికి సంపూర్ణమైన అర్హతని సంపాదించడంతో పాటు తండ్రి ఆశీస్సులను సైతం నిండుగా పొందాడు. ఒకవైపు యయాతి పాత్ర, మరొకవైపు పూరుడి పాత్ర రెండూ విభిన్నమైన సందేశాలను నేటితరానికి అందిస్తున్నాయి. వ్యక్తిత్వం వికసించాలంటే మనిషి ఇహపరమైన విషయాల పట్ల క్రమక్రమంగా ఆసక్తిని తగ్గించుకోవాలని, ఇంద్రియనిగ్రహాన్ని కలిగి ఉండాలని ఈ ఘట్టం బోధిస్తోంది.

## 8.7. భీష్మ ప్రతిజ్ఞ

మహాభారతంలో అత్యంత ఉన్నతమైన వ్యక్తిత్వం కలవాడిగా ప్రసిద్ధికెక్కిన భీష్ముడి ఔన్నత్యం గురించి చెప్పడానికి ఈ సంఘటన ఒక ఉదాహరణ.

చ. వినుఁడు ప్రసిద్ధులైన పృథివీపతు లిందఱు నే గురుప్రయో
జనమునఁ జేసితిన్ సమయసంస్థితి; యీలలితాంగి కుద్భవిం
చిన తనయుండ రాజ్యమును జేయఁగ నర్హుఁడు; వాఁడ మాకు నె
ల్లను బతి; వాఁడ కౌరవకులస్థితికారుఁ డుదారసంపదన్. (*ఆంధ్ర. ఆది. 3: 187*)

క. హిమకరుఁడు శైత్యమును, న
ర్యముఁడు మహాతేజమును, హుతాశనుఁ డుష్ణ
త్వము విడిచిరేని గుర్వ
ర్థము నాచేకొనిన సద్వ్రతంబు విడుతునే? (*ఆంధ్ర. ఆది. 3: 224*)

'ఇచ్చట సమావేశమైన ప్రసిద్ధ ప్రభువులందరూ వినండి. నేను తండ్రిగారి ప్రయోజనం కొరకు స్థిరమైన ఒక ప్రతిజ్ఞ చేశాను. అదేమంటే, ఈమెకు పుట్టిన కొడుకే రాజ్యం చేయడానికి హక్కు గల వాడౌతాడు. అతడే మాకందరికీ ప్రభువుగా పరిగణింపబడతాడు. అతడే గొప్పదైన సంపత్తితో కౌరవవంశాన్ని నిలిపేవాడు అవుతాడు'.

'చంద్రుడు చల్లదనాన్ని, సూర్యుడు అత్యంత ప్రకాశాన్ని, అగ్ని వేడితనాన్ని వదులుకున్నప్పటికీ నేను మాత్రం తండ్రి కొరకు చేపట్టిన ఈ ఉత్తమవ్రతాన్ని విడుస్తానా! (విడువనని భావం)'.

భీష్ముడి అసలు పేరు దేవవ్రతుడు/ గాంగేయుడు. దేవవ్రతుడి తండ్రియైన శంతనుడు సత్యవతిని వివాహం చేసుకోవాలని ఆశపడ్డాడు. కానీ, ఆమె తండ్రి, తన బిడ్డకి పుట్టిన బిడ్డలు మాత్రమే శంతనుడి తర్వాత మహారాజుగా పాలన చేయాలని షరతు పెట్టాడు. ఎటూ తేల్చుకోలేక శంతనుడు తిరిగి వెళ్లిపోయాడు. తండ్రి మనస్సులో ఉన్న కోరికను తెలుసుకున్న దేవవ్రతుడు అందరు మహారాజులు చూస్తుండగా, తాను తన తండ్రి ఆనందం కోసం రాజ్యాన్ని త్యజిస్తున్నానని ప్రకటించాడు. అంతే కాకుండా, తాను బ్రహ్మచర్య వ్రతాన్ని స్వీకరిస్తున్నట్టు కూడా ప్రకటించాడు. తండ్రి కోసం రాజ్యాన్ని, సంసార సుఖాలను శాశ్వతంగా, తృణప్రాయంగా త్యజించిన దేవవ్రతుడి

సత్యనిష్ఠకి, తండ్రిపై ఉన్న అపారమైన గౌరవానికి ఆశ్చర్యపోయిన దేవతలు, మహారాజులు, దేవవ్రతుడిని 'భీష్ముడు' అని కీర్తించారు.

భీష్ముడి పాత్ర, వ్యక్తిత్వం కేవలం మహాభారతానికే కాదు, యావత్భారతదేశానికే తలమానికమైనది. నాయకత్వం ఏదో వారసత్వ సంపదగా భావించి గద్దెనెక్కడానికి ఎగబడుతున్న నేటితరం నాయకులు భీష్ముడిని చూసి నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. అన్నింటినీ మించి, భవిష్యత్తులో తాను ఇచ్చిన మాటకి ఎటువంటి ఎదురు లేకుండా భీష్ముడు బ్రహ్మచర్యవ్రతాన్ని స్వీకరించడం అత్యంత ఆశ్చర్యకరమైన విషయం. ఇచ్చిన మాటకి కట్టుబడి జీవితాంతం భీష్ముడు అలాగే ఉండిపోయాడు. దేవవ్రతుడికి 'భీష్ముడు' అని పేరు అందుకే సార్థకమైంది.

సత్యవతి సంతానమైన చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు మరణించాక, అనివార్యమైన పరిస్థితుల్లో స్వయంగా సత్యవతి భీష్ముడిని రాజ్యభారం వహించమని అడిగినా, భీష్ముడి అంగీకరించలేదు. పంచభూతాల సాక్షిగా ప్రమాణం చేసిన భీష్ముడు ఆ మాటకే కట్టుబడి ఉండిపోయి చరిత్రలో నిలిచిపోయాడు. అందుకే, భీష్ముడి వ్యక్తిత్వం అటు భరతవంశానికే కాదు. యావత్భారతదేశానికే ఆదర్శప్రాయమైంది.

## 8.8. కణ్వమహర్షి ఆశ్రమ వాతావరణం

నన్నయ రచించిన ఆదిపర్వంలో వర్ణించబడిన శకుంతలోపాఖ్యానంలో కణ్వమహర్షి ఆశ్రమాన్ని నన్నయ వర్ణించిన తీరు అద్భుతం. వేట నిమిత్తం అడవికి వెళ్లిన దుష్యంతుడు, కణ్వమహర్షి ఆశ్రమ పరిసరాలని చూసి ఆశ్చర్యపోతాడు. ప్రపంచంలో శాంతి సంపూర్ణంగా నెలకొంటే జీవుల మధ్య సంబంధాలు ఎంత ఉన్నతంగా ఉంటాయో ఈ వర్ణన చూస్తే అర్థమౌతుంది.

సీ. శ్రవణ సుఖంబుగా సామగానంబులు /చదివెడు శుకముల చదువు దగిలి
కదలక వినుచుండు కరులయు గరికర /శీతలచ్ఛాయ దచ్చీకరాంబు
కణముల చల్లని గాఢ్పాపబడి దాని /జెంది సుఖంబున్న సింహములయు
భూసురప్రవరులు భూతబలుల్ తెచ్చి /పెట్టు నీవారాన్న పిండితతులు

తే. గడగి భక్షింప నొక్కట గలసియాడు
చున్న యెలుకలు బిల్లుల యొందు సహజ
వైరి వర్ణంబులయు సహవాసమపుడు
సూచి మునిశక్తి కెంతయు జోద్య మంది. (*ఆంధ్ర. ఆది. 4: 23*)

'చెవులపండువుగా చిలుకలు సామవేదాన్ని సస్వరంగా పాడే పద్ధతులలో ఆసక్తి పొంది తన్మయత్వంతో కదలకుండా వింటున్న ఏనుగులు, ఏనుగుల తొండాల చల్లని నీడలతో వాటి నీటితుంపురుల చల్లని గాలిపై ఆశపడి దాన్ని పొంది సుఖంగా ఉన్న సింహాలు, బ్రాహ్మణశ్రేష్ఠులు భూతబలులు తెచ్చి వివిధ ప్రదేశాల్లో నీవార ధాన్యపు అన్నపిండాలను ఉంచగా వాటిని తినాలని వేగిరపడుతూ ఒకచోట కలిసిమెలిసి తిరుగుతున్న ఎలుకలు, పిల్లులు, అవి తమతమ మధ్య పరస్పరం సహజంగా ఉన్న వైరిస్వభావంగల వర్గాలైనప్పటికీ కలిసిమెలిసి మసలే వాటి స్నేహప్రవృత్తిని మునిమహిమకు ఎంతగానో ఆశ్చర్యపడి'

శాకుంతలోపాఖ్యానంలో భాగంగా కణ్వమహర్షి ఆశ్రమ పరిసరాలను వర్ణిస్తూ నన్నయ రచించిన పద్యం ఇది. వేట నిమిత్తం అడవికి వచ్చిన దుష్యంతుడు తన పరివారం అలిసిపోగా అక్కడే ఉన్న ఆశ్రమ ప్రాంతాన్ని సందర్శిస్తాడు. అక్కడ చాలా విచిత్రమైన విషయాలు గమనిస్తాడు. ఆశ్రమ ప్రాంతంలో ఉన్న చిలుకలు సామవేదాన్ని సుస్వరంగా ఆలపిస్తూ ఉంటే ఏనుగులు తన్మయత్వంతో వింటున్నాయట. చిలుకలకే అంత జ్ఞానం ఉంటే కణ్వమహర్షి శిష్యులకి, ఆ ప్రాంతంలో ఉంటున్న మునులకి ఇంకెంత జ్ఞానసంపద ఉండాలి!

జ్ఞానులు ఉండే ప్రాంతంపై వారి ప్రభావం ఎలా ఉంటుందో నన్నయ అత్యంత సహజంగా వర్ణించాడు. ఏనుగుల తొండాల నుంచి చల్లని నీటి తుంపురుల చల్లని గాలికి సింహాలు సేదతీరుతున్నాయట. నిజానికి ఈ రెండు జంతువుల మధ్య వైరం ఉంటుంది. కానీ అక్కడ ఆ వైరం కనిపించడం లేదు. అంతే కాదు, నీవారధన్యాపు గింజలని తినడానికి పిల్లులు, ఎలకలు పోటీ పడుతున్నాయట. ఇలా ఆ ఆశ్రమ ప్రాంతంలో ఉన్న అన్ని జంతువులు తమతమ వైరాన్ని మర్చిపోయి కలిసిమలిసి ఉంటున్నాయట. తపోనిష్ఠలో ఉన్నవారు జీవాత్మని మరచి, సమష్టి ఆత్మలో లీనమౌతారు. అందువల్ల, వారి ప్రభావం ఆ పరిసరాలపై పడుతుంది.

మహనుభావులు ఉండే ప్రాంతంలో ఎప్పుడూ ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటుందని ఈ పద్యంలో నన్నయ వివరించాడు. అటువంటి ప్రాంతంలో హింసకు తావు లేదు. కణ్వమహర్షి తపశ్శక్తి వీటన్నిటికీ కారణం. ఆయన మనస్సులో ఏ కల్మషం ఉండదు కాబట్టే ఆయన ప్రభావం ఆశ్రమ పరిసరాల్లో అడుగడుగునా కనిపిస్తోంది. భారతీయ జీవనవిధానంలో ఉండే ప్రత్యేకతల్లో ఇదీ ఒకటి.

కణ్వమహర్షి ఆశ్రమప్రాంతంలో ఉన్న జంతువులు తమమధ్య ఉన్న వైరాన్ని మర్చిపోయి ఎలా సహజీవన శాంత ప్రవృత్తిని కలిగి ఉన్నాయో, అలాగే మనుషులు కూడా తమ మధ్య ఉన్న విభేదాలను మర్చిపోయి కలిసిమెలిసి జీవించాలి. అదే అసలైన వ్యక్తిత్వ వికాసం. కణ్వమహర్షిలా ఈ జగత్తుని ప్రభావితం చేయడానికి ఎందరో మహానుభావులు జన్మించారు, జన్మిస్తూనే ఉంటారు. అయితే, ఎవరో పుట్టే దాకా ఎదురుచూడకుండా ప్రతీ మనిషి శమ దమ సమన్వితుడు కాగలిగితే 'మానవుడు' అన్న మాటకి సార్థకత చేకూర్చినట్టే.

"ప్రకృతి పురుషుల పరస్పరప్రభావాన్ని వర్ణించడం ఉత్తమకావ్యకళ. శమ దమ సమన్వితుడు, కరుణాహృదయుడు, సమచిత్తుడు అయిన కణ్వమహర్షి తన మహిమను తపోవన జీవులపై వేసి వాటిమధ్య లేని సహజీవన శాంత ప్రవృత్తిని కలిగించాడు. కణ్వమహర్షి మాహాత్మ్యాన్ని ఆశ్రమప్రకృతివర్ణనం ద్వారా వ్యజింపజేస్తున్న ఈ పద్యం ధ్వనికావ్యరచనకు చక్కని ఉదాహరణం. శకుంతలాదుష్యంతుల విరుద్ధభావాలకు సంఘర్షణ ఏర్పడగా శాంతిని ప్రసాదించేది కణ్వమహర్షి సహనధర్మశీలమే" (*ఆంధ్ర. ఆది. 4. పుట: 318*).

## 8.9. శకుంతల ధర్మసూక్ష్మ దర్శనం

దుష్యంతుడి మాటలకి ముగ్ధురాలై శకుంతల దుష్యంతుడిని గాంధర్వ వివాహం చేసుకుంది. ఆ సమయంలో శకుంతల తండ్రియైన కణ్వమహర్షి అక్కడ లేరు. ఇది తండ్రి అభిప్రాయం కోసం ఎదురు చూడకుండా శకుంతల తీసుకున్న నిర్ణయం కాబట్టి, పర్యవసానాలు ఎలా ఉన్నా తానే ఎదుర్కోవడానికి సిద్ధపడింది. నిండు సభలో తన జీవితం కోసం తానే పోరాటం చేసింది.

చ. నుతజలపూరితంబు లగు నూతులు నూఱిటికంటె సూనృత
వ్రతయొక బావి మేలు !; మఱి బావులు నూఱిటికంటె నొక్కస
త్క్రతువది మేలు; తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలు; త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్. (*ఆంధ్ర. ఆది. 4:94*).

'మంచినీటితో నిండిన చేదుడు బావులు నూరిటి కంటే ఒక దిగుడుబావి మేలు; కాగా, బావులు నూరిటి కంటే ఒక మహాయజ్ఞం మేలు; అటువంటి నూరు మహాయజ్ఞాలు కంటే ఒక పుత్రుడు మేలు; అట్టి పుత్రులు నూరుమంది కంటే ఒక సత్యవాక్యం మంచిది'.

గృహస్థాశ్రమ ధర్మానికి మూలమైన నాలుగు స్తంభాలలో గృహస్థుడు, గృహిణి, పుత్రుడు/ పుత్రికల ప్రాధాన్యాన్ని దుష్యంతుడికి వివరించిన శకుంతల చివరిగా సత్యం (సత్య స్వరూపమైన పరమ ధర్మం) గురించి దుష్యంతుడికి చెప్పింది. సత్యం ఈ ప్రపంచంలో అన్నింటికంటే గొప్పది. కుమారుడి గొప్పతనం గురించి ముందే వివరించిన శకుంతల, అటువంటి కుమారులు వందమంది కంటే సత్యమే గొప్పది అని ఉద్ఘాటించింది. 'నీవు నాకిచ్చిన మాటని తప్పుతున్నావ్! ఇచ్చిన మాట తప్పడం అది పెద్ద నేరం. అందునా నువ్వు దేశానికి మహారాజువి. నీ నడవడికను ఎంతోమంది అనుసరిస్తారు. ఇప్పటికైనా ఆలస్యం చేయకుండా నన్ను, నా బిడ్డను స్వీకరించు' అని ధ్వనిమయంగా నన్నయ శకుంతల చేత పలికించాడు. గాంధర్వ వివాహం సందర్భంగా దుష్యంతుడు శకుంతలకి చేసిన ప్రమాణాలు అతడికి గుర్తువచ్చే విధంగా శకుంతల హితబోధ చేసింది.

నేటి తరానికి అన్వయించుకుంటే ఈ పద్యం ఎంత ప్రాచీనమో అంత ఆధునికం, వాస్తవికం. నేటి తరంలో ఈ ఒక్కటే కదా అనుకుంటూ రోజూ కొన్ని వందల అబద్ధాలు చెబుతుంటారు. వాటి వల్ల జరిగే నష్టం పెద్దగా ఏం లేదు అనుకుంటారు. కానీ, అది ఇతరుల ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని గ్రహించరు. చుట్టూ ఉండేవారు కూడా అందరూ చేసేదే కదా అని వాళ్లు కూడా చాలా తేలికగా అబద్ధాలు చెప్పేస్తుంటారు. ఇలా అబద్ధాలు చెప్పడం ముఖ్యంగా పిల్లల్ని, యువతరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

చిన్న చిన్న అబద్ధాలే అలవాటుగా మారి, ఎప్పుడూ సత్యాన్ని బయటకు రానివ్వవు. నిజం మాట్లాడేది అవతల వారి మెప్పు కోసం కాదు, మన ఆత్మ సంతృప్తి కోసం అనే విషయాన్ని అందరూ గ్రహించడం చాలా ముఖ్యం. సత్యమార్గంలో నడిచేవారికి ముందు కష్టాలు తప్పవు. అబద్ధాలు

అప్పటికి హాయిగా అనిపించినా దీర్ఘకాలికంగా తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. కానీ, అంతిమంగా జయించేది సత్యమే. సత్యాన్ని నమ్ముకుని వారి దైనందిన జీవితాల్లో ఆచరించిన వారి గురించి నేటికీ మాట్లాడుకుంటున్నామంటే సత్యం మాట్లాడడంలో ఉండే సంతృప్తి ఏంటో అర్థం అవుతూనే ఉంది. ఎప్పుడూ సత్యాన్నే నమ్ముకునే వారి వ్యక్తిత్వాలు చిరకాలం నిలిచిపోతాయన్న విషయం కూడా స్పష్టమవుతోంది. నిత్యజీవితంలో నిజాలే మాట్లాడితే అది అలవాటుగా మారుతుంది. మన చుట్టూ ఉన్నవారికి సైతం స్ఫూర్తిని కలిగిస్తుంది.

ఈ ఘట్టంలో నిండుసభలో శకుంతల చేసిన ధార్మికోపన్యాసంలోని వ్యాస హృదయాన్ని గ్రహించడం ప్రధానం. మహాకవులు వ్యాసుడు, నన్నయ చెప్పిన విధంగా గృహస్థాశ్రమ ధర్మాన్ని అర్థం చేసుకుని, అన్వయించుకుని ఆచరించగలిగితే నిత్యజీవితంలో సగటు యజమానికి ఎదురయ్యే ఎన్నో సమస్యలకు పరిష్కారాలను సాహిత్యమే సూచిస్తుంది.

క. వెలయంగ నశ్వమేధం
బులు వేయును నొక్కసత్యమును నిరుగడలం
దుల నిడి తూఁపఁగ సత్యము
వలననములుసూపు గౌరవంబున పేర్మిన్. *(ఆంధ్ర. ఆది. 4: 95)*
తే. సర్వతీర్థాభిగమనంబు సర్వవేద
సమధిగమము సత్యంబుతో సరియుఁ గావు
ఎఱుఁగు మెల్ల ధర్మంబుల కెందుఁ బెద్ద
యండ్రు సత్యంబు ధర్మజ్ఞు లైన మునులు. *(ఆంధ్ర. ఆది. 4: 96)*

'ఒక త్రాసులో బాహాటంగా వేయి అశ్వమేధాల (ఫలాన్ని)ను ఒకవైపు, ఒక సత్యాన్ని మాత్రమే మరొకవైపు ఉంచి రెండువైపుల తూచగా సత్యంవైపు బరువు వలన ములుచూపి (మొగ్గు చూపి) సత్యమే గొప్పదని నిరూపిస్తుంది'.

'తీర్థాలన్నింటినీ సేవించడం, వేదాలన్నింటినీ అధ్యయనం చేయడం సత్యంతో సాటి కావు. ధర్మం బాగా తెలిసిన ఋషులు ఎల్లప్పుడూ అన్ని ధర్మాల కంటే సత్యమే గొప్పదని అంటారు. దీన్ని గమనించుము'.

సత్యం యొక్క గొప్పతనాన్ని దుష్యంతుడికి బోధపరిచే క్రమంలో నన్నయ మరిన్ని విషయాలను పాఠకులకు, పరిశోధకులకు అందించాడు. వెయ్యి అశ్వమేధ యాగాల ఫలం, తీర్థాలన్నింటినీ సేవించడం, వేదాధ్యయనం కూడా ఒక సత్య వాక్యానికి సాటి రావు అంటున్నాడు నన్నయ. సత్యానికి ఉన్న విలువ అటువంటిది. సత్యానికి భగవంతుడి కంటే ఉన్నతమైన స్థానాన్నిచ్చాయి మన వేదశాస్త్రాలు. అటువంటి సత్యాన్ని విస్మరించి అబద్ధమాడి నీ కీర్తికి మచ్చ తెచ్చుకోవద్దని శకుంతల దుష్యంతుడికి తన శక్తి మేరకు బోధన కావించింది.

"సత్యమేశ్వర లోకే/ సత్యే ధర్మః ప్రతిష్ఠితః/ సత్యమూలాని సర్వాణి/ సత్యాన్నాస్తి పరమపదం" అని పురాణోక్తి. లోకంలో సత్యమే ఈశ్వరుడు; సత్యంలోనే ధర్మం నిత్యంగా నిలిచి ఉంటుంది; సర్వజగత్తుకూ సత్యమే మూలం; సత్యం కంటే ఉత్తమపదం మరొకటి లేదు. సత్యమంటే సత్యవాక్యమని, నిత్యసత్యమని రెండర్థాలున్నాయి. ఈ రెండూ ఈ సందర్భంలో గృహస్థాశ్రమపరంగా అన్వయిస్తాయి". (*ఆంధ్ర. ఆది. 4. పుట: 349*)

## 8.10. బకాసుర వధ

ఏకచక్రపురంలో ఒక విప్రుడి ఇంట్లో ఉంటున్న పాండవులు, ఆ ఊరికి బకాసురుడి వల్ల ఏర్పడిన ఆపదను తొలగించే క్రమంలో కుంతీదేవి పలికిన ఈ మాటలు సూక్తిరత్నాలు.

క. కృత మెఱుఁగుట పుణ్యము; స
నృతి దానికి సమముసేఁత మధ్యము; మఱి త
త్కృతమున కగ్గలముగ స
త్కృతిసేయుట యుత్తమంబు కృతబుద్ధులకున్. (*ఆంధ్ర. ఆది. 6: 244*)

'బుద్ధిమంతులైన వాళ్లు ఎదుటివాళ్లు చేసిన ఉపకారాన్ని గుర్తించడమే గొప్ప పుణ్యకార్యం. మంచి బుద్ధితో దానికి సమానమైన ప్రత్యుపకారం చేయడం మధ్యమ మార్గం. అలా కాకుండా, చేసిన ఉపకారం కంటే ఎక్కువగా ప్రత్యుపకారం చేయడం ఉత్తమ పద్ధతి'.

ఏకచక్రపురంలో పాండవులకి ఆశ్రయమిచ్చిన బ్రాహ్మణులకి, ఆ ఊరిలో వారికి పెద్ద ఆపద ఏర్పడుతుంది. ఎప్పుడూ సందడిగా ఉండే విప్రుడి ఇంట్లో ఏడుపు వినిపించేసరికి, వారి కష్టం ఏంటో తెలుసుకుని రక్షించాలని కుంతి పాండవులకి హితవు పలుకుతుంది. ఆ సందర్భంగా కుంతీదేవి

పలికిన ఈ మాటలు నేటికీ ఆచరణీయాలు. ఇటువంటి పరిస్థితిలో బుద్ధిమంతుల ప్రవర్తన మూడు రకాలుగా ఉంటుందని, అత్యుత్తమ పద్ధతిలో వ్యవహరించాలని కుంతీదేవి పాండవులకే కాదు, నేటి సమాజానికి హితవు పలుకుతోంది. తల్లి మాటని అనుసరించి పాండవులు తమంత తాము ఆ సమస్యని తెలుసుకుని బకాసురవధ ద్వారా కేవలం ఆ ఇంట్లోనే కాదు, మొత్తం ఏకచక్రపురంలో ఆనందాన్ని నింపుతారు. నన్నయ రుచిరార్థ సూక్తినిధిత్వానికి ఈ పద్యం గొప్ప ఉదాహరణ.

## 8.11. ఔర్వుడి వృత్తాంతం

ఘోరమైన తపస్సు చేస్తూ లోకాలని స్తంభింపజేస్తున్న ఔర్వుడిని శాంతింపజేసేందుకు అతడి పితృదేవతలు పలికిన ఈ మాటలు గొప్ప సందేశాన్నందిస్తాయి.

తే. ఎఱుక గలఁ డేని మఱి శక్తుఁ డేని యన్యు
లన్యులకు హింస గావించునపుడు దానిఁ
బూని వారింపకున్న నప్పురుషుఁ డేఁగు
హింస చేసినవారల యేఁగుగతికి. (*ఆంధ్ర. ఆది. 7: 146*)

'జ్ఞానవంతుడు, సమర్థుడు అయినవాడు – ఒకరు మరొకరిని హింసించే సమయంలో ప్రయత్నించి ఆ హింసను నివారించకుంటే, అతడు కూడా ఆ హింస చేసిన వాళ్ల గతినే (నరకాన్ని) పొందుతాడు'.

మహాభారతం అన్వయించుకుంటే ఏ కాలానికైనా వర్తిస్తుందనడానికి ఈ పద్యం చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది. ఔర్వుడిని శాంతింపజేయడానికి అతడి పితృదేవతలు పలికిన ఈ మాటాలు నేటి మానవులకి తమ బాధ్యతలను గుర్తుచేస్తాయి. పితృదేవతలు చెప్పిన మాట విని తన ప్రయత్నాన్ని ఔర్వుడు విరమించుకుంటాడు. అయితే, నవీన సమాజానికి ఈ పద్యాన్ని అన్వయించుకుంటే సంపూర్ణమైన వ్యక్తిత్వ వికాసం అంటే ఏంటో అర్థమవుతుంది.

సాంకేతికత రోజురోజుకీ ఎంత అభివృద్ధి చెందుతున్నా, ఒక వైపు మనుషుల మధ్య దూరం పెరుగుతూనే ఉంది. 'ఎవరికి వారే యమునా తీరే' అన్నట్లుగా జీవిస్తున్న నేటి తరానికి మనిషి యొక్క ప్రాథమిక కర్తవ్యాన్ని ఈ పద్యం మళ్లీ గుర్తుచేస్తుంది. ఈరోజుల్లో సాటి మనిషికి సమస్య వస్తే కనీసం మాట సాయం చేసే మనుషులు కూడా కరువయ్యారు. ఎక్కడైనా హింస జరిగితే, 'మనకెందుకులే?

మనవాళ్లంతా బాగానే ఉన్నారు కదా! మనదాకా వస్తే చూసుకుందాం’ అని భావించి తప్పించుకునే వాళ్లకు ఈ పద్యం ఒక గుణపాఠం. ఏదైనా అత్యాచారం, హింస, అన్యాయం, నేరం కళ్ల ముందు జరుగుతున్నప్పుడు ఆ ఘోరానికి కారణమైన వారికి ఎంతటి దుర్గతి పడుతుందో, ‘మనకనవసరం’ అనుకుని ఆ ఘోరాన్ని/ నేరాన్ని ఆపే ప్రయత్నం చేయనివారికి కూడా అదే గతి పడుతుందని, నన్నయ ఔర్వుడి పితృదేవతల మాటల రూపంలో బోధించాడు. అంటే నేరం చేయడం, అన్యాయానికి ఒడిగట్టడం ఎంత తప్పో, ఆ అన్యాయాన్ని చూస్తూ కూడా ఖండించకపోవడం అంతే తప్పు.

మనిషి ఎప్పుడైతే ఎదుటివారి కష్టాన్ని తన కష్టంగా భావించి సహాయపడతాడో, ఆరోజు అన్యాయాలు, అక్రమాలు, అత్యాచారాలు, నేరాలు సహజంగానే తగ్గిపోతాయనే గొప్ప సందేశాన్ని ఈ కథ అందిస్తోంది.

## 8.12. భీమార్జునుల ఆత్మస్థైర్యం

రాజసూయయాగం చేయడానికి పూనుకుని, దాన్ని దిగ్విజయంగా పూర్తి చేయగలనో, లేదో అని సంశయిస్తున్న ధర్మరాజులో ఉత్సాహాన్ని నింపేందుకు భీముడు, అర్జునుడు పలికిన మాటలు ఎంతో స్ఫూర్తివంతంగా ఉంటాయి.

క. ఆరంభరహితుఁ బొందునె
యారయ సంపదలు? హీనుఁ డయ్యును బురుషుం
డారంభశీలుఁ డయి యకృ
తారంభుల నోర్చు నెంత యధికుల నయినన్ (*ఆంధ్ర. సభా. 1: 123*)

‘లోకంలో ప్రయత్నమే చేయనివాడికి సంపదలు సమకూరవు. బలహీనుడైనా సరే మనిషి తాను ప్రయత్నం చేసే స్వభావం కలవాడైతే, ప్రయత్నమే చేయని ఎంత బలవంతులనైనా జయించగలడు.

మానవ ప్రయత్నానికి ఉన్న గొప్పతనం గురించి ఈ పద్యంలో ప్రస్తావించారు. మనిషి ఎంత తాపత్రయ పడినా, ఎన్ని ప్రార్థనలు చేసినా, ప్రయత్నం లేనిదే సంపదలు సమకూరవు అనే విషయం ఇక్కడ గమనించదగినది. మనిషి తాను ప్రయత్నం చేశాక మాత్రమే భగవంతుడి కృపకి పాత్రుడు కాగలడనే విషయం కూడా ఇక్కడ స్పష్టమవుతోంది. అసలు ప్రయత్నమే చేయకుండా కేవలం అదృష్టం మీద ఆధారపడే ఎంతటి బలవంతుడికన్నా సంపూర్ణ ప్రయత్నం చేసిన బలహీనుడే

గొప్పవాడని ఈ పద్యం బట్టే తెలుస్తోంది. తాము ఏ ప్రయత్నం చేయకుండా పూర్తిగా భగవంతుడిపైనే భారం వేసే నేటి తరం యువత ముఖ్యంగా ఈ సందేశాన్ని గమనించాలి.

రాజసూయయాగం ఒక బృహత్తరమైన కార్యం. అయితే, ప్రయత్నం చేస్తే మనిషి సాధించలేనిది ఏదీ లేదనే విషయం భీమార్జునుల మాటల్లో, తర్వాతి కథలో ధర్మరాజు చేతల్లో ఋజువయ్యింది.

## 8.13. ద్రౌపది వ్యక్తిత్వం

ద్రౌపదీ వస్త్రాపహరణ ఘట్టంలో దుశ్శాసనుడు ద్రౌపదిని అవమానించడానికి పూనుకున్నాక ఆమె శీలాన్ని, ఆమె ఎంతగానో ఆరాధించే శ్రీకృష్ణుడు కాపాడతాడు. ఇంతటి దారుణానికి ఒడిగట్టిన కౌరవులపై విరుచుకుపడుతున్న భీముడిని భీష్ముడు శాంతింపజేశాడు. ద్రౌపదిని ఓదార్చేందుకు ధృతరాష్ట్రుడు ఒక వరం కోరుకొమ్మని అవకాశం ఇస్తాడు. ఆ సందర్భంలో ద్రౌపది కోరిన కోరికలు ఆమె ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని ఆవిష్కరిస్తాయి.

ఆ. కరుణతోడ నాకు వరము ప్రసాదింప
బుద్ధియేని లోకపూజితుండు
మనునిభుండు ధర్మతనయుండు దాస్యంబు
వలనఁ బాయవలయు వసుమతీశ! (*ఆంధ్ర. సభా. 2: 259*)

ద్రౌపదికి జరిగిన అవమానం చరిత్రలో ఒక మచ్చగా నేటికీ మిగిలిపోయింది. అంతటి దారుణానికి ఒడిగట్టింది కౌరవులే అయినప్పటికీ అసలు జూదం అనే వ్యసనం పట్ల ధర్మరాజుకున్న చాపల్యం ఈ విపత్కర పరిస్థితులకి దారి తీసింది. విధి రాత ఎలా ఉన్నా, ధర్మరాజు జూదానికి బానిస కాకుండా ఉంటే ఈ దారుణం జరగడానికి కనీసం అతడైతే కారణం కాకపోయేవాడు.

నిండు సభలో ద్రౌపదికి జరిగిన అవమానాన్ని ఏ స్త్రీ సహించలేదు. ఆమె తన ఆగ్రహాన్ని తన భర్తలపై, కురువంశ యోధులపై బాహాటంగానే వెళ్లగక్కింది. కానీ, పరమాత్మ అయిన శ్రీకృష్ణుడి పట్ల ఆమెకున్న అపారమైన నమ్మకం ఆమెని కాపాడింది. ఇటువంటి పరిస్థితిలో ధృతరాష్ట్రుడు ఒక వరం కోరుకోమని అడిగినప్పుడు వేరే ఎవరైనా ప్రతీకారం కోరుకునేవారు. కానీ. ద్రౌపది కోరిన కోరిక అక్కడి సభికులనే కాదు నేటి పాఠకులను, పరిశోధకులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తుంది.

కొన్ని ఘడియల క్రితం తన భర్తల పట్ల ఆగ్రహంతో రగిలిపోయిన ద్రౌపది, ధృతరాష్ట్రుడు వరం కోరుకొమ్మనగానే, ధర్మరాజుకి దాస్య విముక్తి కలగాలని మొదటి వరంగా కోరుకుంది. మరొక కోరిక కోరుకోమని ధృతరాష్ట్రుడు అడగగా 'సంతోషంతో ధర్మరాజు నలుగురు తమ్ములు, తమ ఆయుధాలతో, కవచాలతో, గృహాలతో అందరికీ మేలు కలిగేటట్లు దాస్యం నుండి విముక్తి పొందాలి' అని కోరుకుంది (*ఆంధ్ర. సభా. 2: 261*). మూడవ వరాన్ని సైతం కోరుకోమని ధృతరాష్ట్రుడు పాంచాలిని అనుగ్రహించగా, క్షత్రియ కన్యలకు రెండు వరాలు మాత్రమే కోరుకునే యోగ్యత ఉంటుంది ధర్మసూక్ష్మాన్ని ప్రతిపాదించి, సభికులను ఆశ్చర్యంలో ముంచెత్తింది ద్రౌపది (*ఆంధ్ర. సభా. 2: 263*). ఇంతటి ఉన్నతమైన సంస్కారాన్ని కలిగి ఉండడం కేవలం ద్రౌపదికే చెల్లింది. ద్రౌపది పాతివ్రత్యం, నేటి తరానికి దిశానిర్దేశం చేస్తుంది. ద్రౌపది ఉన్నతమైన వ్యక్తిత్వం, పాండవులను సైతం స్ఫూర్తి పొందేలా చేసింది.

## 8.14. గృహస్థాశ్రమ ధర్మం: ఔన్నత్యం

పాండవులు అరణ్యవాసం చేయడానికి పూనుకుని తమ వెంట అభిమానంతో వచ్చిన బ్రాహ్మణోత్తములను ఎలా పోషించాలి అని ఆలోచనలో పడ్డారు. ఆ సందర్భంలో శౌనకుడు ధర్మరాజుకి కొన్ని ధర్మసూక్ష్మాలు వివరించాడు. ఆ చర్చలో భాగంగా ప్రకటితమైన విలువలు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తాయి. సగటు గృహస్థుడుకి ఉండవలసిన బాధ్యతలను గుర్తుచేస్తాయి.

సీ. 'ఆత్మోపభోగార్థ మర్థలాభేచ్ఛ నా / కెన్నండు లేదు; మహీసురాగ్ర
గణ్యుల నత్యుగ్ర కాననాంతరమున / నెవ్విధంబున భరియింతు నొక్కొ
యని యిప్డు వగచెద; ననవద్యగుణయుక్తి / ననఘ! మాయట్టి గృహస్థతతికిఁ
బోష్యుల నెయ్యెడఁ బ్రోవక యుండను / విప్రుల నతిథుల వృథయ పుచ్చఁ

ఆ. జనునె? నిజధనంబు సంవిభాగించి యీ
వలయు, సాధురక్ష వలయుఁ జేయ,
నభిమతాశ్రమంబులందు గృహస్థాశ్ర
మంబకాదె యుత్తమంబు వినఁగ. (*ఆంధ్ర. ఆరణ్య. 1: 30*)

‘నేను నా స్వార్థం కొరకు, భోగాల కొరకు ధనాన్ని కోరుకొనడం లేదు. బ్రాహ్మణోత్తములను ఈ మహారణ్యంలో నేను ఏ విధంగా పోషించాగాలను- అని మాత్రమే నా దిగులు. నాబోటి గృహస్థుడికి అవశ్య కర్తవ్యం అతిథి పూజ. అందులో నా దగ్గరకి అతిథులుగా విచ్చేసినవారు బ్రాహ్మణోత్తములను, సాధుపురుషులు. అట్టివారిని ఊరక పంపవచ్చునా? గృహస్థులైనవారు తమ సంపదలో కొంతభాగం అతిథుల కొరకు వెచ్చించాలి. సజ్జనులను సంరక్షించాలి. ఈ రీతిగా అన్ని ఆశ్రమాలలో గృహస్థాశ్రమమే మేల్తరమని పెద్దలు చెబితే వింటున్నాం కదా! ఇచట సాధు సంరక్షణం, అతిథి సేవ కలిసి వచ్చాయి. కనుక గృహస్థాశ్రమధర్మం నెరవేర్చాలి కదా!

ఆర్తుడికి శయ్యాసౌఖ్యం, భయపడినవాడికి శరణం, దప్పికగొన్నవాడికి నీరు, ఆకలిగొన్నవాడికి తిండి, డస్సినవాడికి ఆసనం సమకూర్చడం గృహస్థుడు నిర్వహించవలసిన సనాతన ధర్మాలు. పక్కన విస్తరి లేకుండా భుజించడం, తన కోసమే మాత్రమే వంట చేయించడం, నిష్కారణంగా పశువులను హింసించడం పాతకాలు’.

శౌనకుడికి, ధర్మరాజుకి మధ్య జరిగిన సంభాషణలో చాలా విలువైన విషయాలు, నేటి తరానికి ఆదర్శప్రాయమైన విషయాలు చర్చించబడ్డాయి. ఆ సంభాషణలో భాగంగా, గృహస్థాశ్రమ ధర్మాలను ధర్మరాజు వివరించిన తీరు ఎంతో స్ఫూర్తివంతంగా ఉంది. తన వెంట అభిమానంతో వచ్చిన బ్రాహ్మణోత్తముల పోషణార్థం ధర్మరాజు ధనాన్ని కోరుకున్నాడే తప్ప మరొక ఉద్దేశ్యంతో కాదు. ఈ విలువలతో కూడిన ధర్మరాజు సంభాషణ అతడి బాల్యం, విద్యాభ్యాసం ఎంత ఉన్నంతంగా సాగాయో తెలియజేస్తాయి. అతడి సంభాషణ వల్ల అతడి పరిపూర్ణమైన వ్యక్తిత్వం ఆవిష్కృతమైంది.

గృహస్థుడు అంటే ఏదో తన దారిన తాను బ్రతకడమే అనుకుని జీవితం సాగిస్తున్న నేటి తరానికి ధర్మరాజు మాటలు బాధ్యతలను గుర్తెరిగేలా చేస్తాయి. ప్రతీ గృహస్థుకీ అతిథి సత్కారం, అతిథి సేవ ప్రాథమిక కర్తవ్యాలని, దైనందిన జీవితంలో భాగాలని ధర్మరాజు ఈ సందర్భంగా గుర్తుచేశాడు. ధర్మరాజు మాటల బట్టీ ఆర్తులను ఆదుకోవడం, సజ్జనులను సంరక్షించడం వంటి బాధ్యతలు కూడా గృహస్థువేనని స్పష్టమవుతోంది. సమాజంలో ఉండే ప్రతీ గృహస్థు ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తే మనుషులందరి మధ్య గొప్ప సామరస్యం, సుహృద్భావం ఏర్పడతాయి.

గృహస్థు వ్యక్తిత్వం ఉన్నతంగా ఉంటే, అది సమాజంలోని అందరిపై ప్రభావం చూపించి ఉన్నతమైన విలువలు, సమరసతతో నిండిన సమాజం ఏర్పడుతుంది. ధర్మరాజు మాటల ద్వారా,

వ్యక్తిత్వ వికాసం అంటే వ్యక్తిగత వికాసం కాదని (స్వార్థం కాదని), సమష్టి వికాసమని మరొకసారి ఋజువౌతోంది.

## 8.15. పాండవులు – కౌరవులు: వ్యత్యాసం

పాండవులు అరణ్యవాసం చేస్తూ ఉండగా, వాళ్లని సందర్శించిన మైత్రేయ మహర్షి వ్యాసుడి అభిమతం మేరకు దుర్యోధనుడికి ధర్మోపదేశం చేయడానికి వస్తాడు. ఆ సందర్భంలో ధృతరాష్ట్రుడు మైత్రేయ మహర్షితో, పాండవులు మాట తప్పి ఆరణ్యవాసాన్ని విడిచిపెడతారేమోనని సందేహాన్ని వ్యక్తం చేస్తాడు. దానికి బదులుగా మైత్రేయుడు పలికిన మాటలు, పాండవులకి, కౌరవులకీ మధ్య వ్యక్తిత్వం పరంగా ఉన్న వ్యత్యాసాన్ని వివరిస్తాయి.

క. వారలు సమయము దప్పిన
వారిజరిపుహితుల గతు లవశ్యముఁ దప్పున్;
వారికి నకారణంబ ని
కారము నీ కొడుకు సేసెఁ గడు నహితుండై.' (*ఆంధ్ర. ఆరణ్య. 1: 100*)

'ఓ రాజా! మహర్షులు నిరంతరం వచ్చి ప్రియం కలిగేటట్లుగా పాండవులకు దీవెనలు ఇవ్వడం చేత, వారు ధర్మబుద్ధితో కూడినవారు కావడం చేత, వారు క్షేమంగా ఉన్నారు. పాండవులు చేసిన ప్రతిజ్ఞను మీరితే సూర్యచంద్రులే గతి తప్పుతారు, అలాంటి వారిని నీ కొడుకు నిష్కారణంగా వైరి వహించి వంచించాడు'.

పాండవుల ఆరణ్యవాస సమయంలో ఎంతో మంది మహర్షులు, మునులు, యోగులు ఇరువర్గాల వారిని సందర్శించి మైత్రి కోసం వారి వంతు ప్రయత్నం చేశారు. కానీ, పాండవులను రాజ్యం కోసం నిష్కారణంగా కౌరవులు, అందునా దుర్యోధనుడు మోసం చేశారనేది జగద్విదితం. తాము చేసింది మోసమనే విషయం కౌరవుల మనస్సులో, ప్రత్యేకించి ధృతరాష్ట్రుడి మనస్సులో ఉండడం వల్ల, పాండవులు అరణ్యవాసం పూర్తి కాక ముందే తిరిగి వస్తారేమోనన్న సందేహాన్ని ధృతరాష్ట్రుడు వెలిబుచ్చాడు. అయితే, 'పాండవులు మాట తప్పితే సూర్యచంద్రులు గతి తప్పినట్టే' అని మైత్రేయుడు పలకడం పాండవుల వ్యక్తిత్వాన్ని నిరూపిస్తుంది. సత్యవాక్పరిపాలకులైన పాండవులతో వైరం పెట్టుకుని, వారిని అకారణంగా దుర్యోధనుడు, కౌరవసేన మోసం చేశారని మైత్రేయుడు

పలకడం కౌరవుల నీచమైన వ్యక్తిత్వాలను బయటపెడుతోంది. అంతేకాక, అంతటి ఉన్నతమైన వ్యక్తిత్వాలు కలిగిన పాండవులతో వైరం వంశ పతనానికి దారి తీస్తుందని మైత్రేయుడు ధృతరాష్ట్రుడిని పరోక్షంగా హెచ్చరించినట్టు తెలుస్తోంది.

## 8.16. దమయంతి సౌశీల్యం

ఆరణ్యపర్వంలో భాగంగా చర్చించబడ్డ నలదమయంతుల కథలో అటు నలుడి వ్యక్తిత్వం, ఇటు దమయంతి వ్యక్తిత్వం అనుపమానమైనవి. ఒకరి క్షేమం కోసం మరొకరు పరస్పరం త్యాగం చేసుకొనేంతగా వారి మధ్య అన్యోన్యత వెలసింది. దమయంతి తన వెంట తిరుగుతూ అడవుల్లో కష్టాలు పడకూడదని నలుడు కలిపురుషుడి ప్రభావం వల్ల ఆమెని విడిచి వెళ్ళిపోయాడు. కానీ, దమయంతి నలుడి అభీష్టం మేరకు పుట్టింటికి వెళ్ళకుండా నలుడినే వెతుకుతూ అడవుల్లోనే ఉండిపోయింది. ఆ సందర్భంలో ఒక కిరాతుడు ఆమెని చూసి కామించి, కోరుకున్నాడు. ఆ ఘట్టంలో ఆవిష్కృతమైన దమయంతి వ్యక్తిత్వం తరతరాలకి, మరీ ముఖ్యంగా స్త్రీమూర్తులకి ఆదర్శంగా నిలుస్తుంది.

ఆ. అగ్నిశిఖయుఁ బోలె నంటను డాయను
జూడ రానియట్టి శుభచరిత్ర
నెఱుక లేని కఱకుటెఱు కపేక్షించెఁ గా
దనక తనకు నాయు వల్పమైన. (*ఆంధ్ర. ఆరణ్య. 2: 91*)

'దమయంతి పరమ పవిత్రచరిత్ర. అగ్ని జ్వాల వంటిది. ముట్టుకోవడానికి కాని, సమీపించడానికి కాని వీలు కానటువంటిది. తేరిపార చూడడానికి వీలు లేనిది. అటువంటి అనింద్య చరిత్రను ఆ మొరటు కిరాతుడు తగదని తలచక, తనకు ఆయుర్దాయం తక్కువ కావడం చేత కామించి కోరుకున్నాడు'.

దమయంతి ఆ కిరాతుడిపై కోపించి చూసి, 'నేను పతివ్రతనే అయితే దుష్టుడైన ఈ కిరాతుడు ఇప్పుడే ఇచట చనిపోవునుగాక' అని శపించింది. దాంతో కిరాతుడు నిప్పుచేత దహించబడిన చెట్టులా నేలపై కూలి మరణించాడు.

దమయంతి సర్వకాల, సర్వావస్థలలోనూ నలుడినే మనస్సులో ధ్యానిస్తూ, ప్రేమిస్తూ ఉంటుంది. ఆమెకి భర్త అంటే అంతటి ప్రీతి ఉండబట్టే ఆమె అన్న మాట ఫలించింది. దమయంతి పాతివ్రత్యం, ప్రేమ, అంకిత భావం ఈరోజు సహజీవనాల పేరిట, శారీరక సంబంధాలే శాశ్వతం అనుకుని జీవితాలను నాశనం చేసుకుంటున్న యువతకి గొప్ప సందేశాన్ని అందిస్తాయి. దమయంతి పాత్ర జీవితంలో ఒకే వ్యక్తికి అంకితం కావడంలో ఉన్న ఔన్నత్యాన్ని, ఆనందాన్ని తెలియజేస్తుంది.

దమయంతి పాత్ర ద్వారా ప్రాచీన కావ్యాల్లో, ఇతిహాసాల్లో మహిళల పాత్రలు, వ్యక్తిత్వం ఎంత ఉన్నతంగా, ఆదర్శవంతంగా చిత్రించబడ్డాయో అర్థమవుతోంది.

## 8.17. సంపూర్ణమైన వ్యక్తిత్వం

ఆరణ్యపర్వంలో ధర్మరాజు కోరిక మేరకు నారదుడు అనేకానేక ప్రశ్నలకు సమాధానాలు చెబుతాడు. ప్రత్యేకించి పుణ్యఫలాల గురించి పులస్త్య మహర్షి భీష్మడికి ఉపదేశించిన సూత్రాలని నారదుడు ధర్మరాజు వద్ద ప్రస్తావించి అతడి అనుమానాలను నివృత్తి చేశాడు.

సీ. కడఁగి బుద్ధీంద్రియ కర్మేంద్రియంబుల / యందు సంయతచిత్తు లైనవారు
ధృతి నహంకారప్రతిగ్రహాపేక్షల / యందు నివృత్తాత్ము లైనవారు
నల్పభోజనులు ననారంభకులు నయ్యు / నత్యంతసంతోషు లైనవారు
సత్యవ్రతులు శుభాచారు లక్రోధను / లగుచు ధర్మాన్వితు లైనవారు

ఆ. నఖిలతీర్థశతము లాడిన ఫలములు
నఖిలయజ్ఞవిధుల నైన ఫలముఁ
బడయుదురు విహీనభాగ్యదుష్కృతులకుఁ
బరమతీర్థసేవఁ బడయ నగునె? (*ఆంధ్ర. ఆరణ్య. 2: 241*)

'బుద్ధీంద్రియ, కర్మేంద్రియాల్లో నిగ్రహం కల మనస్సు కలవారు, అహంభావం నుండి మనస్సును మరల్చిన ధృఢచిత్తులు, ఇతరుల నుండి ఎటువంటి ప్రయోజనాన్ని అపేక్షించక, అపరిగ్రహవ్రతాన్ని వైరాగ్యంతో ఆచరించేవారు, అల్పభోజనంతో సంతృప్తి చెంది, ఎటువంటి ప్రయత్నాలు చేయకుండా ఉండి మిక్కిలి సంతోషంతో ఉండేవారు, సత్యసంధులు, సదాచారులు, శాంతస్వభావులు, ధర్మాత్ములు అయినవారు అఖిలతీర్థాలలో క్రుంకులిడిన పుణ్యఫలం, సమస్త

యజ్ఞాలు చేసిన ఫలితం పొందగలరు. దురదృష్టవంతులైన పాపాత్ములకు గొప్ప తీర్థయాత్రలు చేసే పుణ్యం లభించడం సాధ్యమా!'

నారదమహర్షి ధర్మరాజుకి చెప్పిన విషయాలు సంపూర్ణమైన వ్యక్తిత్వం అంటే ఎలా ఉండాలో వివరిస్తాయి. మనిషి ప్రవర్తన సరిగా లేనప్పుడు ఎన్ని పూజలు, వ్రతాలు చేసినా, ఎన్ని తీర్థాలలో స్నానమాచరించినా సద్గతులు కలగవని నారదుడి మాటలు స్పష్టం చేస్తున్నాయి. ఈ కోణంలో పరిశీలిస్తే సనాతన ధర్మంలో కూడా అభ్యుదయ భావన కనిపిస్తుంది. బుద్ధీంద్రియాలు ఐదు, కర్మేంద్రియాలు ఐదు, మనస్సుతో కలిపి మొత్తం ఏకాదశేంద్రియాలు. ఆ ఇంద్రియాలను ఎవరైతే నిగ్రహించుకోగలరో వారి జన్మ సార్థకం అయినట్టేనని నారదుడు ఉగ్గడించాడు. కేవలం, ఇంద్రియ నిగ్రహ లేమి ఈరోజు ఎన్నో నేరాలకు, ఘోరాలకు, అత్యాచారాలకు కారణమౌతోంది. అందుకే, నారదుడు ధర్మరాజుకి బోధించిన విలువలు నేటి జీవనానికి అన్వయించుకోవాలి. భీష్ముడు, ధర్మరాజు పులస్త్య మహర్షి, నారద మహర్షుల ద్వారా ఇటువంటి విలువలని తెలుసుకుని, అన్వయించుకుని, ఆచరించడం వల్లనే వారి జీవితాలు, తరతరాలకి పాఠాలుగా నిలిచాయి.

ఇంద్రియ నిగ్రహం, నిస్వార్థ స్వభావం, సత్యనిష్ఠ, ధర్మనిష్ఠ, శాంతికాముకత వంటి గుణాలు సంపూర్ణంగా పెంపొందించుకోగలిగితే మనిషి పరిపూర్ణమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకున్నట్టేనని నారదుడి మాటల్లో స్పష్టమయ్యింది.

## 8.18. యువక్రీత చరిత్ర

అరణ్యవాసంలో ఉన్న పాండవులకి రోమశుడు చెప్పిన కథల్లో మరొక కీలకమైన కథ యువక్రీత చరిత్ర. విజ్ఞానాన్ని సంపాదించడం మనిషి ప్రాథమిక కర్తవ్యం. అయితే, ఆ విజ్ఞానాన్ని గురుముఖతః నేర్చుకోకపోతే విద్యార్థి ప్రవర్తనలో ఎటువంటి మార్పులు వస్తాయో యువక్రీతు చరిత్ర వివరించింది.

క. 'గురుముఖమునఁ బడయక దు
ష్కరతపమునఁ జేసి పడయఁగాఁబడు విద్యల్
పరమార్థము మదమును మ
త్సరమును గావించు నెట్టిసాధుల కైనన్. (*ఆంధ్ర. ఆరణ్య. 3: 256*)

'అధ్యాపకుడి నోటి ద్వారా జరిగే ప్రబోధాన్ని పొందక తీవ్రమైన తపస్సు వలన పొందేటటువంటి విద్యలు పరమార్థంలో ఎటువంటి మంచివారికైనా కూడా గర్వాన్ని, అసూయను రేకెత్తిస్తాయి'.

యువక్రీతుడు భరద్వాజుడి కుమారుడు. భరద్వాజుడి మిత్రుడైన రైభ్యుడు అతడి కొడుకులతో కలిసి జగత్ప్రసిద్ధం కావడంతో యువక్రీతుడికి మాత్సర్యం ఏర్పడింది. అందువల్ల తాను వేదాలను, శాస్త్రాలను అభ్యసించి అంత పేరు తెచ్చుకోవడం ఆలస్యం అవుతుందని తలపోసి, తపస్సు ద్వారా ఆ విజ్ఞానాన్ని సంపాదించాలని తపస్సు చేస్తుంటాడు. అతడి తపస్సుకి ప్రత్యక్షమైన ఇంద్రుడు గురువు లేకుండా ఈ విద్యలు తెలుసుకుంటే గర్వం వస్తుందని పై పద్యంలో చెప్పినట్టుగా హెచ్చరిస్తాడు. ఎవరు ఎన్ని విధాలుగా నచ్చజెప్పినా వినకపోవడంతో ఇంద్రుడు తప్పనిసరి పరిస్థితుల్లో యువక్రీతుడికి అభయమిచ్చి వెళ్లిపోతాడు. భరద్వాజుడు యువక్రీతుడికి 'బాలధి' అనే మునివరేణ్యుడి కథని వివరించాడు. రైభ్యుడి పట్ల శాంతస్వభావంతో మెలగమని హితవు పలికాడు. యువక్రీతుడు అందుకు అంగీకరించాడు. కానీ, ఒకరోజు రైభ్యుడి కోడలైన కృష్ణని చూసి ఆమెపై అనురాగాన్ని పెంచుకుని మనస్సులో ఉన్న మాటని చెప్పాడు. ఆమె తిరస్కార భావంతో రైభ్యుడికి విషయాన్ని తెలియజేసింది. రైభ్యుడు ఆగ్రహంతో రగిలిపోయి తన తపశ్శక్తితో యువక్రీతు మరణాన్ని శాసించాడు.

గురువు వద్ద విద్యాభ్యాసం చేయకపోవడం వల్ల యువక్రీతు అహంకారానికి, గర్వానికి, మాత్సర్యానికి లోనై, చివరికి ప్రాణాలు పోగొట్టుకున్నాడు. యువక్రీతు కథ నేటి తరానికి ఎంతో విలువైన సందేశాన్నిస్తోంది. యువక్రీతు చరిత్ర విద్యావ్యవస్థలో గురువు యొక్క ప్రాధాన్యతని వివరిస్తూనే, సరైన పర్యవేక్షణ లేకపోతే అరిషడ్వర్గాలు మనిషి వ్యక్తిత్వాన్ని ఎంతగా నాశనం చేస్తాయో కళ్లకి కట్టినట్టుగా వివరించింది.

## 8.19. తార్క్ష్య మహర్షి కథ

ఎర్రన రచించిన భారత భాగంలో (ఆరణ్య పర్వంలో) ఎన్నో ఉప కథలు కనిపిస్తాయి. వాటిలో ఒక ముఖ్యమైన కథ తార్క్ష్య మహర్షి కథ. మార్కండేయుడు ధర్మరాజుకి చెప్పిన కథల్లో భాగంగా ఈ కథ వివరించబడింది. హైహయవంశానికి చెందిన ధుంధుమారుడు అనే రాజకుమారుడు వేటకి వెళ్లినప్పుడు తార్క్ష్య మహర్షి కుమారుడిని చూసి జింకగా భ్రమించి

సంహరిస్తాడు. విషయం తెలుసుకున్న రాజ వంశీకులు పాపపరిహార నిమిత్తం తార్క్ష్యుడి వద్దకే వస్తారు. ధుంధుమారుడు చంపింది తార్క్ష్యుడి కుమారుడినే అని తెలుసుకుని, అతడు ఆ ఆశ్రమంలో తిరుగుతుండడం చూసి ఆశ్చర్యపోతారు. ఈ మహిమ ఎలా ఏర్పడిందని రాజవంశీకులు తార్క్ష్యుడిని అడుగుతారు. మహర్షి చెప్పిన విషయాలు వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా ఎలా నిర్మించుకోవాలో తెలియజేస్తాయి.

శా. ఆలస్యం బొక యింత లేదు, శుచి యాహారంబు, నిత్యక్రియా
జాలం బేమఱ, మర్చనీయు లతిథుల్, సత్యంబ పల్కంబడున్,
మేలై శాంతియు బ్రహ్మచర్యమును నెమ్మిం దాల్తు; మట్లౌట నె
క్కాలంబుం బటురోగమృత్యుభయశంకం బొంద మే మెన్నఁడున్. (*ఆంధ్ర. ఆరణ్య. 4: 190*)

'ఈ ఆశ్రమంలో మేము కొన్ని నియమాలను నిష్ఠతో ఆచరిస్తాం. ఇక్కడ మేం ఎన్నడూ కాలహరణం చేయం. ఆహారం పరిశుభ్రంగా ఉంచుతాం. అతిథులను పూజిస్తాం. సత్యవ్రతాన్ని సదా పాటిస్తాం. శాంతి, బ్రహ్మచర్యం మాకు మేలైన అనుష్ఠానాలు. ఇట్టి నియమాలను నిష్ఠతో పాటించడం చేత ఇక్కడ మాకు మృత్యుభయమే లేదు. అలాగే ఎటువంటి భయాందోళనలకూ ఈ ఆశ్రమంలో తావు లేదు'.

మనిషి తన వ్యక్తిత్వాన్ని సంపూర్ణంగా నిర్మించుకోవడానికి అవసరమైన ప్రతీ ఒక్క విషయాన్ని, మహర్షి తార్ క్ష్యుడి మాటల్లో గమనించవచ్చు. వారి ఆశ్రమంలో అన్ని పనులు సమయం ప్రకారం అవుతాయి. క్రమశిక్షణకి వారి ఆశ్రమంలో పెద్దపీట వేశారు. ఆహరం విషయంలో వారి ఆశ్రమంలో చాలా జాగ్రత్త వహించారు. వారి ఆశ్రమంలోని వారంతా తాజా ఆహారాన్ని శుచిగా స్వీకరిస్తున్నారు. తద్వారా ఎవ్వరూ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించారు. అతిథులని గౌరవించడం, సత్యవ్రతాన్ని పాటించడం, శాంతంగా ఉండడం, బ్రహ్మచర్యవ్రతాన్ని నిష్ఠగా ఆచరించడం ద్వారా ఆశ్రమంలోని వారందరికీ తార్క్ష్యుడు ఉన్నతమైన సంస్కారం అలవడేలా తీర్చిదిద్దాడు. ఆశ్రమవాసులు ఎల్లప్పుడూ సత్యానికే కట్టుబడి ఉండడం వల్ల మోసాలకి, నమ్మకద్రోహాలకి తావు లేకుండా చేశాడు తార్క్ష్య మహర్షి. అందరూ శాంత గుణాన్ని అవలంబించడం ద్వారా రాగద్వేషాలకు ఆస్కారం లేకపోయింది.

తార్క్ష్య మహర్షి ఆశ్రమాన్ని నేటి విద్యాసంస్థలు ఆదర్శంగా తీసుకోవాలి. ఇటువంటి విలువల మధ్య విద్యాభ్యాసం జరిగితే నేడు సమాజంలో జరుగుతున్న ఎన్నో నేరాలకి, ఘోరాలకి, అత్యాచారాలకి స్వస్తి పలకవచ్చు. ఈ విలువలు విద్యార్థుల్లో ప్రధానంగా ఉన్నతమైన వ్యక్తిత్వ నిర్మాణానికి దోహదపడతాయి. కేవలం విద్యార్థులకే కాదు. విలువలని విస్మరించి జీవితంలో సమస్యలను కొనితెచ్చుకుంటున్న నేటి తరానికి తార్ క్ష్యుడి మాటలు ఔషధ గుళికల్లా పనిచేస్తాయి. పై లక్షణాలను పెంపొందించుకోవడం ద్వారా మనిషి మృత్యువుకి సైతం భయపడనివాడై మృత్యుంజయుడు అవుతాడు.

"కాలం యొక్క విలువను గుర్తించి ఒక్క నిమిషం కూడా వృథాపుచ్చకపోవడం, ఆహార పరిశుభ్రత, అతిథి సత్కారం, సత్యవ్రతం, బ్రహ్మచర్య దీక్ష, శాంతి – అలనాటి ప్రాచీన భారతీయ ఆశ్రమ జీవితంలో మృత్యుంజయ సిద్ధిగా అనుష్ఠానం గావించబడ్డాయని స్పష్టం" (*ఆంధ్ర. ఆరణ్య. 4. పుట: 579).*

## 8.20 సత్యనిష్ఠ

అరణ్యవాసంలో ఉన్న పాండవుల శిబిరాన్ని సందర్శించిన మార్కండేయ మహర్షి ధర్మరాజుకి ఎన్నో కథలతో పాటు యుగధర్మాలు కూడా వివరంగా తెలియజేశాడు. ప్రధానంగా కలియుగంలో ధర్మం క్షీణించి ఒక పాదంలో మాత్రమే ఉంటుందని చెప్పి, ధర్మం, సత్యనిష్ఠ తప్పితే సమాజం ఏ విధంగా పతనమౌతుందో మార్కండేయుడు ధర్మరాజుకి వివరించిన తీరు నేటి సమస్యలకి బీజం ఎక్కడ పడిందో స్పష్టం చేస్తుంది.

సీ. సత్యంబు నరులకు సంక్షిప్త మగు; సత్య / హాని నాయువు గడు నఱిగిపోవు;
నాయువు దఱిఁగిన నల్పంబు లగు విద్య; / లల్పవిద్యలను మోహంబు మిగులు;
మోహంబువలనఁ బై ముసురు లోభంబు; లో / భావేశమునఁ గామ మగ్గలించుఁ;
గామంబుపెంపునఁ గడఁగుఁ గ్రోధంబు; క్రో / ధనంబున వైర మెంతయును బెరుఁగు;

ఆ. వైరమున నశేషవర్ణులు నన్యోన్య
పీడ సేయుచును విభిన్నబుద్ధి
నొక్కఁడొకని మేర నుండక వర్ణ సం
కరము సేయఁగలరు కలియుగమున (*ఆంధ్ర. ఆరణ్య. 4: 287*)

'మనుజులలో సత్యం తరగిపోతుంది. సత్యహానిమూలంగా ఆయుర్దాయం తరుగుతుంది. ఆయుస్సు క్షీణించడం వల్ల చదువులు తరిగిపోతాయి. అల్పవిద్యవలన మోహం ప్రబలుతుంది. మోహం ప్రబలడం వలన లోభం పెరిగిపోతుంది. లోభం కమ్మేస్తుంది. లోభం వల్ల కామం అధికమౌతుంది. కామం వలన కోపం ఏర్పడుతుంది. క్రోధం అతిశయించడం వలన పగ ఏర్పడుతుంది. పగ ఏర్పడడం వలన భిన్నకులాల వారు అన్యోన్య హింసకి పాల్పడతారు. ఈ విధంగా ఎవరి హద్దులలో వారు ఇమడకపోవడం చేత వర్ణసాంకర్యం ఏర్పడుతుంది'.

పురాణాలు, శాస్త్రాల ప్రకారం కలియుగంలో ధర్మం ఒక్క పాదం మీదనే నడుస్తుంది. మార్కండేయుడి మాటల ద్వారా, సత్యవ్రతాన్ని విడనాడడం ఎంతటి విపత్కర పరిస్థితులకి దారి తీస్తుందో అర్థమౌతోంది. సత్యహాని అల్పాయుర్దాయానికి, అల్పాయుర్దాయం అల్ప విద్యకి, అల్పవిద్య మోహానికి, మోహం లోభానికి, లోభం తీవ్రమైన కామానికి, కామం క్రోధానికి, క్రోధం పగకి, పగ హింసకి, హింస మనుషుల మధ్య చిచ్చులకి కారంమౌతోందని మార్కండేయ మహర్షి ధర్మరాజుకి వివరించాడు. యుగచక్రం ఎలా పరిభ్రమించినా మనిషి తన జీవితాన్ని సరైన మార్గంలో నడిపించుకోవడం ఎప్పుడూ అతడి చేతుల్లోనే ఉంది. సత్యనిష్ఠ లేకపోవడం ఎంత ప్రమాదకరమో మార్కండేయుడి మాటల ద్వారా తెలుస్తోంది. ఆ మాటలని పాఠంగా స్వీకరించి మనిషి సత్యవ్రతాన్ని అవలంబిస్తే, అదే క్రమంలో దుర్గుణాల అవలంబనకి స్వస్తి పలికే అవకాశం ఎప్పుడూ మనిషి చేతిలోనే ఉందని స్పష్టమౌతోంది.

మార్కండేయుడి మాటలను ధర్మరాజు ఎప్పుడూ ఆచరిస్తూనే ఉన్నాడు. "కౌరవులు ఎంత వేధించి ఎన్ని ఇక్కట్లకు గురిచేసినా ధర్మరాజు తన క్షమాగుణంతో, ఓరిమితో సహించి తన సాత్విక భావాన్ని చూపిస్తాడు. పరిహాసానికైనా అసత్యం పలకడం అధర్మమని తన మనస్సు అందుకు ఇయ్యకోనదని కృష్ణద్వైపాయనుని సన్నిధిలో వెల్లడించిన సత్యవాక్ప్రియుడతడు. సత్యం, త్యాగం,

అక్రోధనం, దయ అనే నాలుగు సాత్విక గుణాలను అనుక్షణం ఆచరణలో పాటించిన వ్యక్తి ధర్మరాజు" *(విద్యేశ్వరి. డి. 1998: 73)*.

## 8.21. జీవన విధానం

అరణ్యవాసంలో ఉన్న పాండవుల శిబిరాన్ని సందర్శించిన మార్కండేయ మహర్షి, ధర్మరాజుకి ఎన్నో విశేషమైన కథలు, ధర్మసూక్ష్మాలు బోధించాడు. అటువంటి కథల్లో ఎన్నో సామాజికాంశాలకి నిలయమైన కథ ధర్మవ్యాధోపాఖ్యానం. ఈ కథ ఎఱ్ఱన రచించిన భారతభాగంలో ఉంది. ఎఱ్ఱన ఈ ఘట్టాన్ని అత్యంత హృద్యంగా ఆవిష్కరించాడు.

ధర్మవ్యాధుడు కౌశికిడికి ఎన్నో ధర్మసూక్ష్మాలను వివరించాడు. ధర్మవ్యాధుడు తన వ్యక్తిత్వం ఆదర్శవంతంగా రూపొందడానికి తాను చేసిన సత్కర్మలని ఇలా వివరించాడు.

చ. వినయము విస్తరిల్ల గురువృద్ధజనాతిథి విప్ర దేవతా
ర్చన లొనరింతు, సత్యమును శౌచము నేమఱ, నీగి మన్ననం
దనుపుదు భృత్యబంధుతతిఁ, దాల్మి వహింతు, నసూయఁ జేయ, నెం
దును మదిఁ దృష్ణ సొన్పఁ, బరదోషకథావిముఖుండ నెప్పుడున్. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 34*)

క. సతతోపవాసనియమ
వ్రతములఁ జరియింతు నేకవనితాప్రియుఁడన్
ఋతుకాలరతుఁడ నిందా
స్తుతులందు మనంబు నాకుఁ దుల్యత నుండున్. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 35*)

'నేను మిక్కిలి అణకువతో కూడిన ప్రవర్తనతో గురువులను, పెద్దలను, అతిథులను, బ్రాహ్మణులను, దేవతలను పూజిస్తాను. సత్యవ్రతాన్ని పాటిస్తాను. పరిశుభ్రతను ఎన్నడూ మరవను. సేవకులకు దానాలిస్తాను. బంధువులను మర్యాదలు చేసి మన్నిస్తాను. ఓర్పును వహిస్తాను. అసూయ చెందను. ఎట్టి విషయలలోను మిక్కుటమైన కోరికలను పెంచుకోను. ఎప్పుడూ ఇతరుల దోషాలను గూర్చిన ప్రసంగాలను వినను.

నేను ఎల్లప్పుడూ ఆహార విహారాలలో నిష్ఠ, నియమాలను పాటిస్తాను. ఉపవాస వ్రతాలను పాటిస్తాను. ఏకపత్నీవ్రతుడను. ఋతుకాలాలను అనుసరించి సంభోగిస్తాను. నా మనస్సులో పొగడ్తకు ఉబ్బను. తెగడ్తకు వెత చెందను'.

ధర్మవ్యాధుడిని కేవలం మిథిలానగర వాసులే కాదు, చుట్టు పక్కల ప్రాంతాల వారంతా ఎంతో గౌరవిస్తారు. అతడి వ్యక్తిత్వం అంత మందిని ప్రభావితం చేసింది. అందుకే, ఎక్కడో ఉంటున్న పతివ్రత కూడా ధర్మసూక్ష్మాల విషయంలో సందేహం వస్తే ధర్మవ్యాధుడే తీర్చగలడని చెప్పి కౌశికుడిని మిథిలానగరానికి పంపించింది. అంతటి ఉన్నతమైన వ్యక్తిత్వం తనకి ఏర్పడడానికి గల కారణాలను ధర్మవ్యాధుడు పై పద్యాల్లో వివరించాడు.

ధర్మవ్యాధుడికి పెద్దలన్నా, గురువులన్నా, అతిథులన్నా అపారమైన భక్తి. వారిని సేవించి, వారు ఆచరణలో పెడుతున్న విషయాలను తెలుసుకుని తాను కూడా ఆచరిస్తుంటాడు. దీన్ని బట్టే అతడి ప్రవర్తన చాలా వినయంతో కూడుకున్నదని తెలుస్తోంది. ధర్మవ్యాధుడు గొప్ప దైవబలం కలవాడు. ఎప్పుడూ అసత్యం మాట్లాడి ఎరుగడు. తనకున్న సంపదతోనే శుచిగా, శుభ్రంగా, సంతృప్తిగా జీవనాన్ని సాగిస్తున్నాడు. అంతే కాకుండా అతడు ఆహార విహారాల్లో తీసుకునే జాగ్రత్తలు, అతడికి భౌతికమైన ఆరోగ్యం పట్ల ఉన్న శ్రద్ధని సూచిస్తున్నాయి. ధర్మవ్యాధుడు ఆత్మస్తుతి, పరనింద ఎన్నడూ చేయడు, పొగడ్తకి పొంగడు, తెగడ్తకి దిగులు చెందడు. ఈ గుణం చాలా ఉన్నతమైనది, ఆదర్శప్రాయమైనది. ఈ గుణమే ధర్మవ్యాధుడి మానసిక ఆరోగ్యం చక్కగా ఉండడానికి దోహదం చేసింది.

ధర్మవ్యాధుడు బంధువులను గొప్పగా ఆదరించడం అతడి సహృదయతని, కలుపుగోలుతనాన్ని సూచిస్తోంది. అతడిలో ఉన్న దాన గుణం, అతడికి జీవితం పట్ల ఉన్న సంతృప్తిని, దయా గుణాన్ని సూచిస్తోంది. అన్నింటినీ మించి ధర్మవ్యాధుడు ఏకపత్నీవ్రతుడు. దీన్ని బట్టీ ధర్మవ్యాధుడు ఎంతటి అంకితభావం కలవాడో ఇక్కడ స్పష్టమౌతోంది.

ధర్మవ్యాధుడు తన జీవితంలో ఆచరించిన ఈ విషయాలను అర్థం చేసుకుని, అన్వయించుకుని, ఆచరిస్తే ఎవ్వరి వ్యక్తిత్వమైనా అత్యంత ఉన్నతంగా రూపుదిద్దుకుంటుంది. ఈ సందర్భంలో 'దానంబు... (*ఆంధ్ర. ఆరణ్య. 5: 44*)' అనే పద్యం గమనించదగినది.

## 8.22. ఇంద్రియ నిగ్రహం

ఎఱ్ఱన రచించిన ఆరణ్యపర్వ భారత భాగంలో మార్కండేయ మహర్షి ధర్మరాజుకి ఎన్నో ధర్మ సూక్ష్మాలు వివరించాడు. ఈ సూక్ష్మాలన్నీ భవిష్యత్కథలో ధర్మరాజు మహారాజు అయ్యాక అతడికి పరిపాలనలో ఉపయోగపడాలనే ఉద్దేశ్యంతో చెప్పినవి. ముఖ్యంగా గ్రహపీడల గురించి మార్కండేయుడు చెప్పిన సూక్ష్మాలు అత్యాధునిక సమాజానికి చక్కగా ఉపయోగపడతాయి.

క. నియతి గలిగి యింద్రియముల

జయించి శుచులైన శాంతిసంపన్నులకున్

భయ మొనరింపఁగ లే వ

వ్యయ పుణ్యా! గ్రహము లే యవస్థల యందున్. (*ఆంధ్ర. ఆరణ్య. 5: 255*)

'గొప్ప పుణ్యాన్ని ఆర్జించిన ఓ ధర్మరాజా! ఇందులో ఒక కిటుకు ఉన్నది. ఈ గ్రహబాధలు పిశాచపీడలు దుర్బల మనస్కులకు హాని చేయగలవే. కానీ, నీతి నియమ నిష్ఠలు కలిగి ఇంద్రియాలను గెలువగలిగిన వారికి ఎట్టి భీతిని కలిగించనేరవు'.

మార్కండేయుడు ముందుగా ధర్మరాజుకి గ్రహపీడల గురించి, వాటి ప్రభావం గురించి వివరించాడు. తర్వాత వాటి నుండి ఎలా ఉపశమనం పొందవచ్చో వివరిస్తున్నాడు. ఈ సందర్భంలో మార్కండేయుడి మాటలు కేవలం గ్రహాలని, రాశి ఫలాలని నమ్ముకుని జీవితాన్ని సాగిస్తున్నవారికి ఒక పాఠాన్ని బోధిస్తాయి. గ్రహపీడలు, గ్రహ దోషాలు కేవలం దుర్బల మనస్కులనే ప్రభావితం చేయగలవు తప్ప నీతి, నియమాలు కలిగి ఇంద్రియనిగ్రహం కలిగినవారిని ఏం చేయలేవని ఈ సందర్భంగా స్పష్టమౌతోంది.

మార్కండేయుడు ధర్మరాజుతో మారొక ముఖ్యమైన సూక్ష్మాన్ని ఈ సందర్భంగా పంచుకున్నాడు. కేవలం, ఇంద్రియ నిగ్రహం గ్రహ పీడలకి విరుగుడు కాదంటాడు మార్కండేయ మహర్షి. ఇంద్రియ నిగ్రహంతో పాటు భగవద్భక్తి ఉన్నవారికి మాత్రమే గ్రహపీడల నుండి విముక్తి కలుగుతుందని మార్కండేయుడి భాషణ ద్వారా అర్థమౌతోంది. ఇంద్రియ నిగ్రహం కలిగినవారు మాత్రమే భగవంతుడి కృపకి పాత్రులు కాగలరని ఆదిశంకరాచార్య రచించిన సౌందర్య లహరిలో పురారాతే... *( సౌ. 2004: 113)* అనే శ్లోకంలో నిర్దిష్టమైన ప్రమాణం చూపబడింది.

## 8.23. యక్ష ప్రశ్నలు: ఉన్నత వ్యక్తిత్వం

ఎర్రన రచించిన భారత భాగమైన ఆరణ్యపర్వంలో ఎన్నో విశేషమైన ఘట్టాలు అత్యంత హృద్యంగా ఆవిష్కరింపబడ్డాయి. వాటన్నింటిలో తలమానికమైన ఘట్టం 'యక్షప్రశ్నలు'. తెలుగు సాహిత్య ప్రియులని ఉర్రూతలూగించిన ఘట్టం ఇది. ప్రత్యేకించి ఈ ఘట్టంలో ధర్మరాజు విశ్వరూపం ఆవిష్కృతమయ్యింది. చక్రవర్తికి ఉండవలసిన అర్హతలు, గుణాలు తనకి మాత్రమే ఉన్నాయని ధర్మరాజు నిరూపించుకున్న ఘట్టం ఇది.

వ. నన్నాశ్రయించిన జనంబులు దుర్గతిం బొరయరు గావున నభిమతంబు లైన వరంబు లిచ్చెద' నడుగు మనినఁ బాండవాగ్రజుండు సంభ్రమభక్తిపరుం డగుచు దండప్రణామంబు సేసి, యద్దేవోత్తముం బ్రస్తుతించి, 'దేవామదీయాశ్రమవాసుండైన భూసురవరునరణి ! యొక్కహరిణంబుచేత నపహృతంబయ్యె; నతనికిం గర్మలోపంబు గాకుండ నయ్యరణిం గరుణింపవే' యనినఁ బ్రీతచిత్తుం డగుచు ధర్మదేవుండు .(*ఆంధ్ర. ఆరణ్య. 7: 463*).

'నన్ను ఆధారంగా చేసుకున్న మనుజులు దుర్గతిని పొందరు. నీవు నన్ను ఆశ్రయించితివి. కావున నీవు కోరే వరాలను ఇస్తాను. కోరుకొనుము' అని యముడు వచించాడు. ధర్మరాజు తత్తరపాటుతో కూడిన పూజ్యభావంతో తనభుజాలు భూమికి సోకేటట్లుగా ధర్మదేవుడికి నమస్కరించి, అతడిని కీర్తించి, 'దేవా! నా ఆశ్రమంలో నివసిస్తున్న బ్రాహ్మణోత్తముడి అరణిని ఒక లేడి హరించింది. అతడి నిత్యానుష్ఠానానికి భంగం కలగకుండా దయచేసి ఆ అరణిని ప్రసాదించుము' అని ప్రార్థించాడు. ఆ ధర్మదేవుడు సంతృప్తిచెందినవాడై..'

పాండవుల రాజనీతిజ్ఞతకి, ధర్మనిష్ఠకి పాండిత్యానికి పరీక్ష పెట్టడానికి యముడే యక్షుడి రూపంలో బ్రాహ్మణోత్తముడి అరణిని మాయం చేశాడు. యక్షుడి రూపంలో ప్రశ్నలు అడిగాడు. పాండవులలో ధర్మరాజు మాత్రమే సమాధానాలు ఇవ్వగలిగాడు. ధర్మరాజు అత్యంత ధర్మనిష్ఠ కలిగినవాడు, యుక్తి కలిగినవాడు, ఎక్కడ ఎలా నడుచుకోవాలో తెలిసినవాడు కావడం వల్లనే యమధర్మరాజు పెట్టిన ధర్మపరీక్షలో నెగ్గగలిగాడు. తన యుక్తితో, గుండె నిబ్బరంతో తన నలుగురు తమ్ముళ్లనీ బ్రతికించుకున్నాడు.

చివరిగా యముడు ప్రత్యక్షమై ధర్మరాజుకి అంతా వివరించి, ధర్మరాజు యుక్తికి మెచ్చి వరాలు కోరుకోమంటే, ధర్మరాజు బ్రాహ్మణుడి అరణిని కోరాడే తప్ప, వ్యక్తిగతమైన కోరికలు కోరలేదు. ఇది అతడి ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సూచిస్తుంది. మొదట, ఒక తమ్ముడిని బ్రతికిస్తానని యక్షుడు పలికినప్పుడు నకులుడు బ్రతకాలని కోరుకుని, తన ధర్మనిష్ఠతో, బాధ్యతతో యక్షుడిని ఆశ్చర్యచకితుడిని చేసిన ధర్మరాజు, ఇప్పుడు బ్రాహ్మణుడి అరణిని కోరుకుని మరింత ఆశ్చర్యపరిచాడు. యముడు తానే ఆ అరణిని మాయం చేసిన విషయాన్ని చెప్పి, అరణిని తిరిగి ఇచ్చేశాడు. ఈ ఘట్టంతో పాండవుల అరణ్యవాసం 12 ఏళ్లు పూర్తవుతుంది కనుక, యమధర్మరాజు పాండవులకి అజ్ఞాతవాసంలో ఉపయోగపడే విధంగా వారు కోరుకున్న వేషాలను ప్రసాదించాడు. ఇంకా మరొక కోరికని కోరుకోమని సమవర్తి అవకాశం ధర్మరాజు కోరిన కోరిక యావద్భారతజాతికీ విలువైన సందేశాన్నిస్తుంది. తన చిత్తం ఎల్లవేళలా ధర్మంపైన మాత్రమే లగ్నమై ఉండేటట్లు దీవించమని ధర్మరాజు కోరుకున్నాడు. అవకాశం ఉండాలే కానీ, ఎన్నో కోరికలు కోరుకునేవారంతా ధర్మరాజుని చూసి నేర్చుకోవాలి. తాను నమ్ముకున్న ధర్మమే తనని రక్షిస్తుందని ధర్మరాజు విశ్వాసం. అదే సత్యం కూడా. మొత్తంగా ఈ ఘట్టం ద్వారా, ధర్మరాజు సంభాషణానైపుణ్యం, నిర్వహణ సామర్థ్యం, ధర్మాధర్మ వివేచన, నాయకత్వ లక్షణాలు కలగలిపి అత్యున్నతమైన వ్యక్తిత్వం ఆవిష్కృతమయ్యాయి.

## 8.24. కీచకవధ ఘట్టం: వ్యక్తిత్వ వికాసం

తిక్కన రచించిన విరాట పర్వంలోని పాత్రలు కొన్ని మనిషి వ్యక్తిత్వం ఎలా ఉండాలో వివరిస్తే, మరికొన్ని ఎలా ఉండకూడదో వివరిస్తాయి.

ఉ. సాధులు సేరి నెమ్మిగ నిజస్థిర వృత్తము దుష్టకోటిచే
బాధలఁ బొందకుండఁ దమపాల వసించినఁ బెద్దవారు ది
క్కై ధరియించి వారికొక యాపద వుట్టకయుండఁ గాచు టొ
ప్పై ధరఁ గీర్తి కెక్కదె? యపాయము సేసిన నింద వుట్టదే? (*ఆంధ్ర. విరాట. 2: 95*)

‘సజ్జనులైనవారు తమ సత్ప్రవర్తన చెడ్డవారి చేత చెరచబడకుండా కాపాడుకోడానికి పెద్దలను ఆశ్రయిస్తే వారు వారికి ఆశ్రయమిచ్చి, వారి యోగక్షేమాల భారం వహించి, వారికి ఎటువంటి ఆపదలు కలగకుండా కాపాడి, అన్నివిధాల రక్షిస్తే కీర్తి పొందుతారు. అలా కాకుండా, వారిని అపాయానికి గురిచేస్తే నిందల పాలవుతారు’.

కీచకవధ ఘట్టంలో నన్నయ రచించిన పద్యాల్లో ఒక మేలిముత్యం ఈ పద్యం. నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికి ఈ పద్యం చక్కటి ఉదాహరణ. సజ్జనులు తమ గుణాలను ఎప్పుడూ పెంపొందించుకోవడం అవసరం. ఆ క్రమంలో వారు దుర్జనులకు వీలైనంత దూరంగా ఉండడం మంచిది. దానివల్ల దుర్జనులను సజ్జనులు సంస్కరించలేకపోయినా కనీసం సజ్జనులు తమని తాము దుర్జనుల బారినుంచి కాపాడుకోగలుగుతారు. అందుకే సజ్జనులు తమ సద్వర్తనాన్ని నిలబెట్టుకొనేందుకు పెద్దవాళ్లను ఆశ్రయిస్తారు. సజ్జనసహవాసం వల్ల ఆ సద్గుణాలు ద్విగుణీకృతం అవుతాయి.

అజ్ఞాతవాసంలో ఉన్న పాండవులు, ద్రౌపది విరాట మహారాజు కొలువులో రకరకాల కొలువుల్లో చేరి ధర్మబద్ధంగా జీవిస్తున్నారు. కాబట్టి, శరణాగతులైన పాండవులను రక్షించడం, యోగక్షేమాలు చూసుకోవడం విరాట మహారాజు ధర్మం. వారికి ఎటువంటి ఆపదలు కలగకుండా కాపాడి అన్నివిధాల రక్షిస్తే విరాటరాజు కీర్తి పొందుతాడు. కీచకుడి దుష్ప్రవర్తన వల్ల ఆత్మరక్షణలో పడిన ద్రౌపదిని రక్షించడం రాజధర్మం, మహారాజు ప్రాథమిక బాధ్యత. ద్రౌపదిని రక్షించకపోగా, సాక్షాత్తు మహారాణి అయిన సుదేష్ణ దేవియే ద్రౌపదిని ఒక పని నిమిత్తం కీచకుడి ఇంటికి పంపాలనుకోవడం అమానుషం. ఆ పరిస్థితిలో మహారాణికి తన కర్తవ్యాన్ని, బాధ్యతని గుర్తుచేస్తూ ద్రౌపది పలికిన ఈ సూక్తివచనాలు నేటికీ అనుసరణీయమైనవి. ఆ సూక్తివచనాలు అటు మహారాణికే కాదు ఇటు పాఠకులకి సైతం వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించే విధంగా ఉన్నాయి.

క. అనిన విని యనుచితంబున
కనయము శంకించియును లతాంగి మదిన్ త
మ్ముని వలవంత దలఁచి యి
ట్లనియెం బాంచాలితోడ సాదర వృత్తిన్. (*ఆంధ్ర. విరాట. 2: 97*)

ఉ. 'అక్కటయేను వేడ్కపడి యానెడు నాసవ మర్థిఁ దేర నొం !
డొక్క నికృష్టఁ బంచుటకు నోపక చెప్పిన దీని నీవు గో
సెక్కఁగఁజేసి నిన్ను నతిహీన విధాన నియుక్తఁ జేఁతగా
నిక్కమ యుమ్మలించి; తిది నెయ్యము తియ్యము కల్మియే? సఖీ! (*ఆంధ్ర. విరాట. 2: 98*)

'ద్రౌపది చెప్పిన మాటలు విని చెడుపనిమీద పంపుతున్నందుకు సందేహించినా తమ్ముడైన కీచకుడి విరహబాధను స్మరించి గౌరవపురస్సరంగా సుదేష్ణ ఇలా అన్నది. 'ఓ చెలీ! నేను ఎంతో మనసుపడి తాగే మద్యాన్ని తెచ్చేందుకు నీచస్త్రీని ఎవ్వరినీ పంపడం ఇష్టంలేక నీకు చెప్తే, నీవేమో దానిని ఒక పెద్ద దోషంగా భావించి నీచకార్యం చెప్పానని నిజంగా భావించి లోలోన బాధపడుతున్నావు. ఇది స్నేహమాధుర్యం కలిగి ఉండడమనిపించుకుంటుందా?'

కీచకుడు సైరంధ్రికి పరపురుషుడు. సైరంధ్రికి కీచకుడి ఇల్లు పరాయి ఇల్లు. కానీ, సుదేష్ణ, అదేమైనా పరాయి ఇల్లా? అంటూ ద్రౌపదిని కీచకుడి ఇంటికి పంపే ప్రయత్నం చేసింది. సోదరుడిపై ఉన్న ప్రేమ ఆమె ధర్మదృష్టిని కప్పేసింది. మద్యం తీసుకురావడం అనే సాకు చెప్పి ద్రౌపదిని కీచకుడి వద్దకు పంపించే ప్రయత్నం చేసిన సుదేష్ణ, తాను చేస్తున్న తప్పును గ్రహించుకోలేకపోగా, అది నీచమైన కార్యం కాదని తన చేష్టలని సమర్ధించుకుంటోంది. అది సుదేష్ణకి నీచమైన కార్యం కాకపోవచ్చునేమో కాని, సైరంధ్రికి నీచమైనదే. ఇటువంటి నీచానికి దిగజారి స్నేహ మాధుర్యం అంటూ మాట్లాడడం సుదేష్ణకి తగని పని. 'స్నేహితుడు/ స్నేహితురాలు' అన్న పదాల్లోనే హితం కోరేవారు అని అర్థం. ద్రౌపదికి సుదేష్ణ తలపెట్టినది హితం కాకపోగా అన్యాయం. ఎప్పుడైతే మనిషి స్వార్థాన్ని విడిచిపెడతాడో, అప్పుడే అతడి వ్యక్తిత్వం వికసిస్తుంది. సుదేష్ణ పాత్ర ద్వారా మనిషి బంధుప్రీతికి, స్వార్థానికి లోనై ధర్మాన్ని తప్పితే ఎంతటి నష్టం వాటిల్లుతుందో అర్థమవుతుంది.

## 8.25. ఉత్తరగోగ్రహణం

ఉత్తరగోగ్రహణ ఘట్టంలో అర్జునుడు యుద్ధరంగంలో ఉత్తరుడిని రథసారధిగా చేసుకుని మొత్తం కౌరవసేనని ఒక్కడే ఎదుర్కొని, అనుకున్న వ్యూహం ప్రకారం గోవులను మరలించి, దిగ్విజయంగా మత్స్యదేశానికి బృహన్నలగా తిరిగి వచ్చాడు. విరాట మహారాజు యుద్ధం చూడనందువల్ల యుద్ధంలో గెలవడానికి ఉత్తరుడే కారణమని అనుకున్నాడు. నగరమంతా ఈ

విషయమై చాటింపు వేయించాలి అనుకున్నాడు. కానీ, కంకుభట్టుకి (ధర్మరాజు) అర్జునుడి వల్లనే విజయం సాధ్యమైందని తెలుసు. దీనివల్ల కంకుభట్టుకి, విరాట మహారాజుకి ఒక చర్చ సాగింది. ధర్మరాజు బృహన్నల వల్లనే విజయం సాధ్యమైందని చాటింపు వేయించాలని విరాట మహారాజుతో వాదించాడు. విరాట మహారాజుకి ఆగ్రహం వచ్చి కంకుభట్టుని పాచికతో కొట్టాడు. వెంటనే కంకుభట్టు సైరంధ్రికేసి చూశాడు. ఆమె వెంటనే పైటతో ఆ రక్తం కారే గాయాన్ని ఒత్తింది. ఈ సన్నివేశం చూసి విరాటుడు ఆశ్చర్యపోతాడు. కంకుభట్టుకీ, సైరంధ్రికీ ఉన్న సంబంధం ఏంటి అని నివ్వెరపోతాడు. అందుకు సమాధానంగా సైరంధ్రి (ద్రౌపది) పలికిన మాటలు ధర్మరాజు వ్యక్తిత్వాన్ని, మంచి వాళ్ల వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించాయి.

తే. 'విమల వంశంబునను బుణ్యవృత్తమునను
వఱలు నీతని రక్తంబు వసుమతీశ!
ధరణిపై నెన్ని బిందువుల్ దొరఁగె నన్ని
వర్షములు గల్గు నిం దనావర్షభయము.' (*ఆంధ్ర. విరాట. 5: 261*).

'ఓ రాజా! స్వచ్ఛమైన వంశంలో పుట్టి ధర్మంగా జీవించే ఇతడి రక్తపు బిందువులెన్ని భూమి మీద పడితే అన్నేళ్లు ఈ దేశంలో అనావృష్టి కలుగుతుంది'.

"స్వీయవర్తనానికి ఒక ధార్మిక న్యాయాన్ని చూపుతున్న ద్రౌపది ప్రజ్ఞ ఇందులో ప్రదర్శితమయ్యింది. ఇందులో ధర్మజుడి వంశం, శీలం చెప్పబడ్డాయి. నిర్మలత్వం చంద్రవంశ సూచకం, పుణ్యవృత్తం అతడి సార్థకనామ సూచకం. అటువంటి వారిని బాధిస్తే భూమి బాధపడుతుందని హెచ్చరిక" *(ఆంధ్ర. విరాట. 5. పుట: 662).*

ధర్మరాజు పరమధర్మమూర్తి, అనితరసాధ్యమైన సద్వర్తనం కలిగినవాడు, సత్యనిష్ఠ కలవాడు. ఏకంగా యమధర్మరాజు అడిగిన యక్షప్రశ్నలకి సమాధానాలు చెప్పి, తన తమ్ముళ్లని బ్రతికించుకున్నాడు. సంపూర్ణమైన నాయకత్వ లక్షణాలు కలవాడు. అటువంటి ధర్మరాజు రక్తం ఎన్ని బొట్లు నేల చిందితే అన్ని సంవత్సరాలు అనావృష్టి ఏర్పడుతుందని సైరంధ్రి చెప్పింది. దీన్ని బట్టీ చూస్తే భారతకాలం నాటికి సద్వర్తనానికి ఎంతటి ప్రాధాన్యముందో అర్థమౌతోంది. ధర్మరాజు వ్యక్తిత్వం ఎంత పవిత్రమైనదో తెలుస్తోంది. అసలు సిసలైన చక్రవర్తి అంటే ఎలా ఉండాలో ధర్మరాజు నిరూపించాడు.

యుద్ధం ముగించుకుని వచ్చిన బృహన్నల, ఉత్తరుడు విరాట మహారాజు సభలో ప్రవేశించారు. ఉత్తరుడి వల్లే విజయం సాధ్యపడిందని భావించి కంకుభట్టుని పాచికతో కొట్టిన విరాటమహారాజుకి జరిగిన కథంతా చెప్పాడు. తన తప్పు తెలుసుకున్న విరాట మహారాజు ధర్మరాజుని క్షమించమని ప్రార్థించాడు. పాండవుల అజ్ఞాతవాస కాలం ఎలాగో ముగిసిపోవడంతో ధర్మరాజు మహారాజుగా సింహాసనం పై ఆసీనుడయ్యాడు. అనితరసాధ్యమైన పరాక్రమాన్ని ప్రదర్శించి, అతిభీకరమైన కౌరవసేనని యుద్ధంలో ఓడించి, మత్స్యదేశాన్ని విరాటమహారాజుకి తిరిగి కానుకగా ఇచ్చిన అర్జునుడి పట్ల కృతజ్ఞతాభావంతో తన కూతురు అయిన ఉత్తరని అర్జునుడికి ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకుంటాడు. ఆ ప్రతిపాదనకి అర్జునుడు ఇచ్చిన సమాధానం అతడి వ్యక్తిత్వం ఎంత ఉన్నతమైందో సూచిస్తుంది.

క. 'ఈ కన్నియఁ గోడలిఁగా
గైకొనియెదఁ గాని యిది దగ దుచితవృత్తిన్
నాకడన యబల మెలఁగుట
లోకము శంకించు నన్ను లోలాత్మునిఁగన్ (*ఆంధ్ర. విరాట. 5: 361*) .

'ఈ ఉత్తరను నేను కోడలుగా స్వీకరిస్తాను, కానీ, భార్యగా చేసుకోను. ఈమె నా వద్ద తగిన రీతిగా మెలగింది. అందుచేత లోకులు నన్ను చంచలమైన స్వభావం కలవాడిగా సందేహిస్తారు'.

అర్జునుడి వద్ద (బృహన్నలవద్ద) ఉత్తర నాట్యం నేర్చుకుంది. అర్జునుడితో చాలా చక్కగా మెలిగింది. ఒక మహావీరుడిగా తన ప్రవర్తనని ఎంతో మంది అనుసరిస్తారనే బాధ్యత అర్జునుడికి ఉంది. అందుకే, తన నడవడిక ఎప్పుడూ స్వచ్ఛంగా ఉండాలని అర్జునుడు భావించాడు. తాను ఉత్తరని వివాహం చేసుకోవడం ఉచితం కాదని అర్జునుడు భావించి, తమకి ఇంతకాలం ఆశ్రయమిచ్చి, గౌరవంగా చూసిన విరాటమహారాజు ముందుంచిన బంధుత్వ ప్రతిపాదనని తిరస్కరించకుండా ఉత్తరని కోడలిగా చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. తన ప్రియపుత్రుడైన అభిమన్యుడికి ఉత్తరని ఇచ్చి వివాహం చేయాలని ప్రతిపాదించాడు. అర్జునుడి వ్యక్తిత్వం అందరినీ ఆశ్చర్యపరిచింది. మొత్తం ఉత్తరగోగ్రహణ ఘట్టంలో అర్జునుడి వ్యక్తిత్వం ఎంతో ఆదర్శవంతంగా సాగింది.

## 8.26. ముగింపు

మనిషి ఎదుగుదలలో వ్యక్తిత్వ నిర్మాణం చాలా కీలకమైన అంశం. వ్యక్తిత్వాన్ని ప్రాథమిక దశ నుండి సరైన దిశగా పెంపొందించుకోకపోతే అది జీవితం పై చూపే దుష్ప్రభావాలను వివరిస్తూ, మంచి పెంపకం వల్ల, స్వతహాగా వ్యక్తిత్వ నిర్మాణం పట్ల తీసుకున్న జాగ్రత్తల వల్ల వికసించిన వ్యక్తిత్వాలు ఎలా ఉన్నత స్థితికి చేరుకుంటాయో ఆంధ్ర మహాభారతం కళ్ల ముందు అత్యంత వాస్తవికంగా ఆవిష్కరించింది. ఉన్నతమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తుల సమూహమే సమాజ పురోగతిని నిర్దేశిస్తుందని ఆంధ్ర మహాభారతం ద్వారా స్పష్టమౌతోంది. వ్యక్తిత్వ వికాసం అంటే వ్యక్తిగత ఎదుగుదల కాదని, వ్యక్తి సామాజిక అవసరాలను గుర్తించి, తన ద్వారా సమాజం అభివృద్ధి చెందే విధంగా విశాలభావంతో ప్రవర్తించడమే 'వ్యక్తిత్వ వికాసం' అని కవిత్రయ భారతంలోని సాహిత్యం ధృవీకరించింది.

ఆంధ్ర మహాభారతంలోని మొదటి నాలుగు పర్వాలైన ఆది, సభా, ఆరణ్య, విరాట పర్వాల ఆధారంగా వ్యక్తిత్వాన్ని ఎలా వికసింపజేసుకోవాలో ఈ అధ్యాయంలో వివరించబడింది. నాలుగు పర్వాలలో ఈ దృక్కోణానికి సంబంధించిన సాహిత్యాన్ని సాధ్యమైనంత సమగ్రంగా ఈ అధ్యాయంలో చర్చించడం జరిగింది. ఉదహరించినవి కొన్నే అయినా, మరెన్నో ఉదాహరణలు ఉన్నాయి. కేవలం, నాలుగు పర్వాలలో ఇన్ని ఉదాహరణలు పరిశోధన దృష్టికి దర్శనమిస్తే, మొత్తం ఆంధ్ర మహాభారతంలో మరెన్నో ఉదాహరణలు దొరికే అవకాశం ఉంది.

# 9. ముక్తాయింపు

పరిశోధన (Research) అన్న పదానికి మళ్లీ శోధించడం అని అర్థం. అప్పుడు, మళ్లీ మళ్లీ శోధించడం ఎందుకు? అనే ప్రశ్న ఉత్పన్నమౌతుంది. ఒక అంశంపై లేదా ఒక గ్రంథంపై అప్పటికే కొన్ని పరిశోధనలు వచ్చి ఉన్నప్పటికీ, మళ్లీ మరొక పరిశోధకుడు అదే గ్రంథాన్ని మరొక కోణంలో పరిశోధించాలి అనుకుంటాడు. అది ఆ గ్రంథానికి ఉన్న బాహుళ్యం మీద, వ్యాప్తి మీద, సమగ్రత మీద ఇంకా అనేకానేక అంశాలపై ఆధార పడి ఉంటుంది.

ఒక కవి, రచయిత లేదా గ్రంథ కర్త కొన్ని ప్రయోజనాల దృష్ట్యా రచన చేస్తారు. అయితే, చాలాసార్లు వారు ఊహించిన దాని కంటే ఎక్కువ ప్రయోజనాలు ఆ రచన వల్ల కలుగుతూ ఉంటాయి. ఆచార్య బేతవోలు రామబ్రహ్మంగారు రచించిన పద్యకవితా పరిచయానికి శ్రీ చేకూరి రామారావుగారు రాసిన చారిత్రాత్మకమైన పీఠికలోని మాటలు ఇక్కడ గుర్తుచేసుకోవాలి.

“కవి ఆలోచనను పరీక్షించి పట్టుకోవడానికి సాహిత్యంలో లిట్మస్ టెస్టులు ఉండవు. కవి పాఠ్యాన్ని రచిస్తాడు. దాని అర్థగ్రాహణకు దొరికిన మార్గాలన్నింటినీ పాఠకుడు అన్వేషిస్తాడు” *(ప. క. ప. 1997: 8).*

ఒక పాఠకుడికి ఆ అవకాశం ఉన్నప్పుడు పరిశోధకుడికి విభిన్న కోణాల్లో ఆలోచించవలసిన బాధ్యత ఉండనే ఉందనే విషయం స్పష్టమయ్యింది. కొంత మంది కవులు చేసిన రచనలు వంద ఏళ్ల తర్వాత కూడా సమాజంపై ప్రభావాన్ని చూపిస్తాయనడానికి తెలుగు సాహిత్యంలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ఒకే గ్రంథాన్ని వేరు వేరు కాలాల్లో పరిశోధన చేసినప్పుడు ఇంతకు ముందు వెలుగు చూడని అంశాలు ఈసారి వెలుగు చూసే అవకాశం ఎప్పుడూ ఉంది. అందుకే, పరిశోధకుడు ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయాన్ని శోధించాలి అనే దృష్టితో మళ్లీ మళ్లీ శోధన చేస్తూనే ఉండాలి. అదే పరిశోధకుల కర్తవ్యం. ఆ పరిశోధనల వల్ల ఆయా రచనల్లో మరెన్నో ఆవిష్కృతం కాని విషయాలు, అంశాలు, కోణాలు వెలుగులోకి వస్తాయి.

ఆంధ్ర మహాభారతం ఒక విశిష్టమైన గ్రంథం. ఎన్నో ఉపఘట్టాలతో, ఎన్నో వినూత్నమైన వర్ణనలతో ఆంధ్ర మహాభారతం తెలుగు సాహిత్యంలో అత్యుత్తమమైన స్థానాన్ని, ఖ్యాతిని

సంపాదించింది. ఎందుకంటే, ఆంధ్ర మహాభారతం సార్వకాలికమైనది, సార్వజనీనమైనది. ఏ కాలానికైనా ఉపయోగపడేది. ఆంధ్ర మహాభారతంపై నేటి వరకు 170 పైచిలుకు పరిశోధనలు జరిగాయి. ఇంకా మరి కొన్ని జరుగుతూ ఉన్నాయి. భవిష్యత్తులో మరెన్నో జరుగవలసిన అవసరం కూడా ఉంది. 170 మంది పరిశోధకులు సమగ్రమైన పరిశోధన చేశాక, ఇంకా పరిశోధించడానికి ఆంధ్ర మహాభారతంలో ఏం మిగిలింది అని సందేహం కలగవచ్చు. ఎన్ని పరిశోధనలు జరిగినా, కాలం మారుతున్న కొద్దీ ఆంధ్ర మహాభారతం యొక్క ప్రయోజనాలు మరింతగా బయట పడుతూ ఉంటాయి. ఉదాహరణకి, చంద్రుడిని కవులు వర్ణించిన తీరుని గమనిస్తే, నన్నయ కాలం నుండి నుండి నేటి అత్యాధునిక తరం కవుల వరకు ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఒకే చంద్రుడు ఒక్కొక్క కవికి ఒక్కొక్క రకంగా అనిపించాడు. దీన్ని బట్టీ చూస్తే చూసే వారి దృష్టి మారుతున్న కొద్దీ ఒకే వస్తువులో సరికొత్త విషయాలు కనిపిస్తూనే ఉంటాయి. మహాభారతం కూడా అటువంటిదేనని వ్యాసుడు ప్రారంభంలోనే స్పష్టం చేశాడు.

సాంకేతికత అభివృద్ధి చెంది, సమాజం మరింత పురోగామించాక కూడా అప్పటి సమస్యలకి మహాభారతం పరిష్కారాలను సూచించగలదు. అర్థం చేసుకునే ఓపిక, అన్వయించుకొనే ఆసక్తి ఉండాలే కాని, ఆంధ్ర మహాభారతం ఎప్పుడూ ఉపయోగపడుతూనే ఉంటుంది. ఆంధ్ర మహాభారతంపై సామాజిక కోణంలో జరిగిన పరిశోధనలని గమనిస్తే చాలా సమగ్రంగానే కనిపిస్తాయి. కానీ, ఇంకా విభిన్నమైన సామాజికాంశాల గురించి చర్చించే ఆస్కారం ఎప్పుడూ ఉంది, ఆవశ్యకత కూడా ఉంది. ఆంధ్ర మహాభారతంలోని కొన్ని విభిన్నమైన సామజికాంశాలను చర్చించడమే ఈ పరిశోధన ప్రధాన లక్ష్యం. అయితే, మొదటి నాలుగు పర్వాల వరకే ఈ పరిశోధన పరిమితం. తర్వాతి పర్వాలపై ఈ కోణంలో పరిశోధన జరగవలసి ఉంది. మరెన్నో వినూత్నమైన సామాజికాంశాలను శోధించవలసి ఉంది. భావి పరిశోధకులకు ఇది గొప్ప అవకాశం.

***ఆంధ్ర మహాభారతం: సామాజికాంశాల పరిశీలన*** (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు) అనే ఈ సిద్ధాంత గ్రంథాన్ని మొత్తం 8 అధ్యాయాలుగా విభజించడం జరిగింది. అధ్యాయాల కంటే ముందు ప్రవేశికలో ఈ పరిశోధనకి సంబంధించిన లక్ష్యాలు, పరిధి, పరిశోధన ఆవశ్యకత, ప్రయోజనాలు, పూర్వ పరిశోధనలు మొదలైన విషయాల గురించి చర్చించాను.

**మొదటి అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: వైశిష్ట్యం.**

మొదటి అధ్యాయమైన ***ఆంధ్ర మహాభారతం: వైశిష్ట్యం*** లో సంస్కృత భారతం గురించి, సంస్కృత భారతాన్ని ఆంధ్ర మహాభారతంగా రచించడానికి కవిత్రయం అనుసరించిన అనువాద విధానం గురించి అందులో చర్చించాను. ఆంధ్ర మహాభారతం గురించిన సమగ్రమైన పరిచయం, ఆంధ్ర మహాభారత యజ్ఞాన్ని గురించి, వైశిష్ట్యాన్ని గురించి కవిత్రయం యొక్క అనుభవాలు, అభిప్రాయాల గురించి ఈ అధ్యాయంలో చర్చించాను. అంతే కాకుండా, ఆంధ్ర మహాభారతం యొక్క లక్ష్యాలు, ప్రయోజనాలు, ప్రత్యేకతల గురించి ప్రత్యేకమైన చర్చ చేశాను.

**రెండవ అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికాంశాలు**

ఆంధ్ర మహాభారతం సామాజికాంశాలకు నిలయమైనది. అయితే, అందులో ప్రధానంగా గుర్తించదగిన సామాజికాంశాలను ముందే కొంత మంది పరిశోధకులు చర్చించారు. వారు ప్రధానంగా ఆంధ్ర మహాభారతంలోని ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికం వంటి అంశాలే కాక, కులాలు, ఆచారాలకి సంబంధించిన అంశాలు మొదలైనవాటిని ఎక్కువగా చర్చించారు. నేను ఎంచుకున్న సామాజికాంశాలు వీటికి భిన్నమైనవి. అయినా సమగ్రంగా నా సిద్ధాంత గ్రంథాన్ని రూపొందించే క్రమంలో ***ఆంధ్ర మహాభారతం: ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయాది సామాజికాంశాలు*** అనే అధ్యాయాన్ని ఏర్పరచి అందులో ఇంతకు ముందు ఆంధ్ర మహాభారతంపై జరిగిన పరిశోధనల్లో ప్రత్యేకంగా ప్రస్తావించని విషాయలను చర్చించాను.

**మూడవ అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: మానవ సంబంధాలు**

ఆంధ్ర మహాభారతంలో ఎన్నో పాత్రలున్నాయి. ఆయా పాత్రల మధ్య ఉన్న సంబంధ బాంధవ్యాలను ప్రస్తావించి, కవిత్రయం వాటిని వర్ణించిన/నిలబెట్టిన విధానాన్ని అనుసరించి మానవ సంబంధాల విలువలను/ఆవశ్యకతను ***ఆంధ్ర మహాభారతం: మానవ సంబంధాలు*** అనే అధ్యాయంలో చర్చించాను. కవిత్రయ భారతంలో చూపించిన మానవ సంబంధాలను అనుసరించే క్రమంలో నేటి సమాజం గ్రహించవలసిన విషయాలను కూడా ఈ అధ్యాయంలో ప్రస్తావించాను.

**నాల్గవ అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: నాయకత్వ లక్షణాలు**

నాయకుడు ఎలా ఉండాలో తెలిపి, నాయకుడి లక్షణాలు ఎలా ఉండాలో సోదాహరణంగా, సవివరంగా తెలియజేసి నాటి సమాజాన్ని ప్రతిఫలింపజేస్తూనే నేటి సమజంలో నాయకులకు

దిశానిర్దేశం చేసే విధంగా ఉన్న అంశాలను ***ఆంధ్ర మహాభారతం: నాయకత్వ లక్షణాలు*** అనే అధ్యాయంలో చర్చించాను.

**ఐదవ అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: ధర్మాధర్మ వివేచన**

విద్య వల్ల మనిషికి విచక్షణాజ్ఞానం వస్తుంది. అదే మానవుడిని తక్కిన జీవుల నుంచి వేరు చేసే ప్రధానమైన లక్షణం. విచక్షణాజ్ఞానం, యుక్తాయుక్త ఆలోచనావిధానం అన్నింటికీ మించి ధర్మాధర్మవివేచన సంఘజీవియైన మనిషికి చాలా అవసరం. ఆంధ్ర మహాభారతంలోని పాత్రలు ఆయా పరిస్థితుల్లో ధర్మాధర్మ వివేచనను ఎంతవరకు కలిగివున్నాయో, అది వారికి ఎటువంటి ఫలాలను అందించిందో ***ఆంధ్ర మహాభారతం: ధర్మాధర్మవివేచన*** అనే అధ్యాయంలో చర్చించాను.

**ఆరవ అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: నిర్వహణ సామర్థ్యం**

ప్రతికూల పరిస్థితులు ఎదురయినప్పుడు ఆంధ్ర మహాభారతంలోని పాత్రలు ప్రవర్తించిన విధానాలను గుర్తిస్తూ, ఆయా పరిస్థితులను ఎదుర్కోవడానికి ఆయా పాత్రలు ప్రదర్శించిన నేర్పు, చూపించిన తెగువ, చాతుర్యం, గాంభీర్యం మొదలైన గుణాలను కవిత్రయం వివరించిన తీరును ***ఆంధ్ర మహాభారతం: నిర్వహణ సామర్థ్యం*** అనే అధ్యాయంలో చర్చించాను. అంతే కాకుండా, ఆంధ్ర మహాభారతం ద్వారా నిజ జీవితంలో సంక్షోభ నివారణ (crisis management) ఎలా చేసుకోవాలో సోదాహరణంగా ఈ అధ్యాయంలో చర్చించాను.

**ఏడవ అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: సంభాషణానైపుణ్యం**

ఆంధ్ర మహాభారతాన్ని సామాజిక దృష్టికోణంలో అధ్యయనం చేసే క్రమంలో ఆయా ఘట్టాల్లో, ఆయా పాత్రలు సందర్భోచితమైన సంబోధనలతో, చక్కటి సంభాషణావిలువలు కలిగిన అంశాలను ***ఆంధ్ర మహాభారతం: సంభాషణానైపుణ్యం*** అనే అధ్యాయంలో చర్చించాను. ఆంధ్ర మహాభారతంలోని పాత్రల సంభాషణల ద్వారా నేటి సమాజం గ్రహించవలసిన విషయాలను, విలువలను ఈ అధ్యాయంలో ప్రస్తావించాను.

**ఎనిమిదవ అధ్యాయం – ఆంధ్ర మహాభారతం: వ్యక్తిత్వ వికాసం**

మనిషి పరిపూర్ణ వ్యక్తిత్వాన్ని సాధించే క్రమంలో అలవరచుకోవలసిన లక్షణాలను, పెంపొందించుకోవలసిన గుణాలను ఆంధ్ర మహాభారతం ద్వారా గుర్తించి, ఆ మహేతిహాసంలోని పాత్రలు వ్యక్తిత్వ వికాసం కోసం చేసిన సాధనను గురించి ***ఆంధ్ర మహాభారతం: వ్యక్తిత్వ వికాసం*** అనే

అధ్యాయంలో చర్చించాను. మనిషి పరమార్థాన్ని చేరుకునే క్రమంలో స్వార్థాన్ని విడనాడడం అవసరమని కవిత్రయంలోని పాత్రల నడవడిక ఆధారంగా సమగ్రంగా చర్చించి, నేటి కాలానికి అన్వయించుకోదగిన విషయాలను ప్రత్యేకంగా ఈ అధ్యాయంలో ప్రస్తావించాను.

# 10. పరిశోధన ఫలితాలు

**ఆంధ్ర మహాభారతం: సామాజికాంశాల పరిశీలన** (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు) అనే ఈ పరిశోధనని సిద్ధాంత గ్రంథంగా రూపొందించే క్రమంలో 8 అధ్యాయాలుగా విభజించడం జరిగింది. ఆ అధ్యాయాల ఆధారంగా నేను క్రోడీకరించిన పరిశోధన ఫలితాలను, పరిశోధన వల్ల కలిగిన ప్రయోజనాలను ఇక్కడ పొందుపరుస్తున్నాను.

1. 'ఆంధ్ర మహాభారతంపై ఎన్నో పరిశోధనలు జరిగాయి, ఇంక కొత్తగా పరిశోధించడానికి ఏమీ మిగలలేదు' అనే అభిప్రాయం సమర్థించదగినది కాదు. ఏ కాలానికైనా ఆంధ్ర మహాభారతాన్ని అన్వయించుకోవచ్చు. ఆంధ్ర మహాభారతంలో పరిశీలించదగిన అంశాలు ఇంకా ఎన్నో ఉన్నాయి. కొత్తగా ఆలోచించే పరిశోధకులు ఉన్నంత కాలం ఆంధ్ర మహాభారతంలో మరెన్నో కొత్త విషయాలను గుర్తించవచ్చు.
2. వ్యక్తుల కలయికే సమాజం. సామాజికాంశాలు అంటే కేవలం కులాలు, ఆచారాలు, సంప్రదాయాలు, వస్త్రధారణ, కులవృత్తులు మొదలైనవి మాత్రమే కాదు, ఇంకా విభిన్నమైన సామాజికాంశాలను పరిగణలోకి తీసుకోవలసి ఉంది. ముఖ్యంగా నిర్వహణ సామర్థ్యం, సంభాషణానైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం మొదలైన అంశాలని సామాజికాంశాలుగా పరిగణించాలి. ఇటువంటి అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ పరిశోధనలో అధ్యాయ విభజన చేయడం జరిగింది.
3. పరిశోధన ఏ రంగానికి సంబంధించినది అయినా, నేటి కాలానికి ఆ పరిశోధన చేయడం వల్ల కొంతైనా ప్రయోజనం ఉండాలి. లేనప్పుడు ఆ పరిశోధన చేయడం వృథా ప్రయాస అవుతుంది. అదే విధంగా, ఆంధ్ర మహాభారతం లోని సామాజికాంశాలను కేవలం గుర్తించి, పరిశీలిస్తే ఆ ఉద్గ్రంథం యొక్క లక్ష్యం పూర్తిగా నెరవేరదు. ఆ సామాజికాంశాలను అర్థం చేసుకొని, వాటిలో నేటి కాలానికి ఉపయోగపడే అంశాలను అన్వయించుకొని, ఆచరించే విధంగా పరిశోధన సూత్రీకరించబడాలి. ఈ పరిశోధన ఇటువంటి మూలాలకి కట్టుబడి సాగింది.

4. ఆంధ్ర మహాభారతంలోని సభాపర్వంలో, నారద మహర్షి ధర్మరాజు వద్ద రాజ్యపరిపాలన గురించి సుదీర్ఘమైన ఉపన్యాసం చేసి, ఎన్నో సూచనలు చేశాడు. కాలం మారుతున్న కొద్దీ ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో మార్పులు రావడం సహజం. అయితే, నారదుడి సూత్రాలు మూలాలకి సంబంధించినవి. అవి ఏ కాలానికైనా, ఏ ప్రభుత్వానికైనా ఉపయోగపడతాయి. నారదుడి ఆర్థిక సూత్రాలని, రాజనీతి సూత్రాలని నేటి కాలానికే కాదు, తరతరాలకి అన్వయించుకోవలసిన అవసరం కనపడుతోంది.
5. మహాభారతం నాటి కాలంలో గోవులు, గుర్రాలు, ఏనుగులు, ఒంటెలు ప్రధానమైన సంపదగా భావించబడేవి. ముఖ్యంగా గోవులు అత్యంత ప్రధానమైన సంపదగా భావించబడేవి. గోవుల ద్వారా ఉత్పత్తి అయ్యే పాలు, పాల పదార్థాలను ఆధారంగా చేసుకొని ఎక్కువ శాతం ప్రజలు జీవించేవారు. ప్రభువులు వాటి సంరక్షనార్థం ప్రత్యేకమైన చేర్యలను తీసుకునేవారు. ఇక ఒంటెలు, గుర్రాలు, ఏనుగులను క్షత్రియులు వివాహాల్లో భాగంగా అరణంగా ఇచ్చి పుచ్చుకునే సంప్రదాయం ఉండేది.
6. మహాభారత కాలంలో ఆర్థిక నేరస్థులకి కఠినమైన శిక్షలు అమలు చేసేవారు. అసలు, ఆర్థిక నేరాలు జరిగేందుకు ఆస్కారమే లేకుండా ముందస్తు చర్యలు తీసుకునేవారు. నేటి సమాజంలో నానాటికీ పెరుగిపోతున్న ఆర్థిక నేరాల దృష్ట్యా మహాభారత కాలంలో వీటి నివారణకి తీసుకున్న చర్యలని పునఃపరిశీలన చేయవలసిన అవసరం కనపడుతోంది.
7. దేశాన్ని పాలించే చక్రవర్తి, సామదానభేదదండోపాయాలను పరిస్థితులకి అనుగుణంగా ఎలా ప్రయోగించి ఫలితాలని రాబట్టాలో ఆంధ్ర మహాభారతంలోని పాత్రల నడత ఆధారంగా సమగ్రంగా ఈ పరిశోధనలో చర్చించబడింది.
8. మహాభారత కాలంలో పాలకులు ప్రధానంగా జ్యోతిష్య శాస్త్రం ఆధారంగా దేవతా, అంతరిక్ష, భూ సంబంధిత ఉత్పాతాలను, విపత్తులను ముందుగానే తెలుసుకుని వాటికి ప్రతిక్రియలు జరిపించేవారు. దీన్ని బట్టీ చూస్తే, నేటి వాతావరణ శాఖ చేస్తున్న పనిని ఆ కాలంలో జ్యోతిష్యం చేసేది. అంతటి శక్తి, ఆ శాస్త్రానికి ఉందని, జ్యోతిష్యం మూఢ నమ్మకం కాదని దీన్ని బట్టీ స్పష్టమౌతోంది. పైగా జ్యోతిష్యాన్ని వ్యక్తుల భవిష్యత్తులు అంచనా కట్టడం కోసం కాకుండా సామాజిక శ్రేయస్సు కోసం ఆ కాలంలో వినియోగించారు.

9. మహాభారత కాలంలోనే మంత్రులు ధనవ్యామోహంతో, పదవీవ్యామోహంతో ఒక రాజ్యం నుండి మరొక రాజ్యానికి మారిన సందర్భాలు కొన్ని ఉండడంతో, అటువంటివి జరగకుండా మూలాలని సరిచేస్తూ ఆనాటి పాలకులు తీసుకున్న నిర్ణయాలు ఈ కాలంలో పరిశీలించదగినవి. పార్టీలు మారే సంస్కృతి పెచ్చుమీరుతున్న తరుణంలో ఆనాటి విధివిధానాలు ఈ సమస్యకి పరిష్కారాన్ని సూచించగలవు.

10. నేరస్థులకు శిక్షలు అమలు చేయడంలో జాప్యం వల్ల, శిక్షలు కఠినంగా లేకపోవడం వల్ల చట్టంలో ఉండే వెసులుబాట్లను అవకాశంగా చేసుకొని నేరస్థులు తప్పించుకునే అవకాశం ఉంది. తద్వారా ప్రజల్లో భీతి నశించి, వారు దుశ్చర్యలకు పాల్పడే అవకాశాలు ఎక్కువ. మహాభారత కాలం నాటి పరిస్థితులను గమనిస్తే, శిక్షాస్మృతి, దండనీతి, న్యాయవ్యవస్థలను కఠినతరం చేయడం ద్వారా నేరాలకు, ఘోరాలకు, ముఖ్యంగా అత్యాచారాలకు బలంగా అడ్డుకట్టు వేయవచ్చునని తెలుస్తోంది.

11. ధర్మార్థకామమోక్షాల విషయంలో మహాభారతంలో చెప్పిందే ప్రామాణికమని వ్యాసభగవానుడు చెప్పాడు. ఈ పరిశోధనలో, ఆది పర్వంలోని ప్రతీపుడి కథ ఆధారంగా, వివాహ సంప్రదాయంలో ఒక విశేషమైన సంప్రదాయం గురించి చర్చించబడింది. వివాహ సందర్భంలో, పుణ్య కార్యాలలో, ఏ సందర్భంలోనైనా సరే భార్య ఎప్పుడూ భర్తకి ఎడమవైపున కూర్చోవాలి అని స్పష్టం చేయబడింది. నేడు చాలా వివాహాలలో ఇందుకు వ్యతిరిక్తంగా జరుగుతోంది. ఈ విషయమై పునరాలోచించుకోవాలని మహాభారతం నొక్కి వక్కాణిస్తోంది.

12. మహాభారత కాలం నాటి సంస్కృతిని ఈ పరిశోధనలో భాగంగా పరిశీలించడం ద్వారా, ఆనాటి వివాహాలు, ఉత్సవాలు అన్నీ ప్రకృతి హితంగానే జరిగాయని తెలుస్తోంది. సహజసిద్ధంగా ప్రకృతి నుండి ఏర్పడిన వనరులను మాత్రమే ఏర్పాట్ల నిమిత్తం వినియోగించడం జరిగింది. తద్వారా ప్రకృతిలో సమతౌల్యం దెబ్బతినకుండా జాగ్రత్తలు వహించినట్లుగా తెలుస్తోంది. ప్రకృతి పరిరక్షణ ఆనాటి జీవన విధానంలో ఒక అంతర్భాగంగా కనిపిస్తుంది. నేడు, జీవకోటిని నిర్లక్ష్యం చేయడం ద్వారా, ప్రకృతి విరుద్ధమైన చర్యలు చేపట్టడం ద్వారా, మనుషులు ఎన్నో సమస్యలను, ప్రాణాంతకమైన వ్యాధులను,

తద్వారా వినాశనాన్ని కొని తెచ్చుకొంటున్న తరుణంలో ఆంధ్ర మహాభారతం మనుషులని జాగృతం చేస్తుంది.

13. రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, మనుషుల్ని మరింత దగ్గర చేయాల్సింది పోయి, దూరాన్ని మరింతగా పెంచడం తెలిసిందే. అయితే, మానవ సంబంధాలని నిలబెట్టుకోవడానికి కావలసింది సాంకేతిక పురోగతి కాదని అరిషడ్వర్గాలను జయించడం, ఇంద్రియ నిగ్రహాన్ని కలిగి ఉండడం అనే విషయం పరిశోధనలో భాగంగా స్పష్టమయ్యింది.

14. శకుంతలోపాఖ్యానం ఘట్టంలో వివరించినట్టుగా, గృహస్థాశ్రమ ధర్మం నాలుగు పాదాల పై ఆధారపడి ఉంటుంది. భర్త, భార్య, సంతానం, సత్యం. ఈ నాలుగింటిలో ఏ ఒక్కటి సవ్యంగా లేకపోయినా మానవ సంబంధాలు ఛిద్రమైపోతాయనే విషయం పరిశోధనలో భాగంగా స్పష్టమయ్యింది. ప్రతీ కుటుంబం సత్యానికి కట్టుబడి ఉంటే అదే సమష్టి రూపంలో సమాజమనే కుటుంబాన్ని సైతం చక్కగా సంరక్షిస్తుందని తెలుస్తోంది.

15. వ్యక్తిగతమైన స్వార్థాలకి పోయి మానవ సంబంధాలను ఛిద్రం చేసుకుంటున్న నేటి తరానికి, ఆంధ్ర మహాభారతంలోని పాత్రల ద్వారా, వివిధ ఘట్టాల ద్వారా బంధాలను, బాంధవ్యాలను నిలబెట్టుకునే విధానాన్ని గురించి సవివరంగా ఈ పరిశోధనలో చర్చించడమే కాక పరిష్కార మార్గాలను సూచించడం జరిగింది.

16. నాయకత్వం అనేది వారసత్వంగా సిద్ధించే ఆస్తి కాదు. నాయకుడు కావడానికి, ఒక వ్యక్తి జాతిని శాసించే శక్తిగా ఎదగడానికి కొన్ని లక్షణాలను కలిగి ఉండాలి. పరిస్థితులకి అనుగుణంగా ఆయా లక్షణాలను పెంపొందించుకోవాలి. ప్రజలను పాలించే నాయకుడికి సమాజంలో ఎన్నో విషయాల పట్ల సంపూర్ణమైన అవగాహన ఉండాలి. నాయకుడికి ఉండవలసిన లక్షణాల గురించి, నాయకులని కనుసైగలతో శాసించగలిగే చక్రవర్తికి ఉండవలసిన లక్షణాల గురించి ఆంధ్ర మహాభారతంలోని వివిధ మహారాజుల ఘట్టాల ఆధారంగా ప్రత్యేకంగా ఈ పరిశోధనలో చర్చించడం జరిగింది.

17. ఈ పరిశోధనలో భాగంగా, కుబేరుడు పేర్కొన్న పంచ లక్షణాలు, మార్కండేయ మహర్షి పేర్కొన్న నాయకత్వ సూత్రాలు, ఇంకా అనేకానేక మహనీయులు ప్రస్తావించిన

సూత్రాలు, లక్షణాలు వంటి వాటి గురించి విపులంగా చర్చించడమే కాక, నారద మహర్షిపేర్కొన్న 14 రాజ దోషాల గురించి కూడా సమగ్రంగా చర్చించడం జరిగింది. ఈ లక్షణాలను, సూత్రాలను నేటి తరం రాజకీయ నాయకులు, భవిష్యత్తులో నాయకులు కావాలనుకునేవారు అన్వయించుకునేందుకు వీలుగా ఈ పరిశోధనలో సూత్రీకరించడం జరిగింది.

18. ఈ పరిశోధనలో భాగంగా ధర్మాధర్మాల పట్ల మనిషి వైఖరి ఎలా ఉండాలో వివరిస్తూ, ఎన్ని సమస్యలు వచ్చినా, ఆటంకాలు ఎదురైనా ధర్మ పక్షాన నిలిచేవారి పరిస్థితి ఎలా ఉంటుందో, అధర్మ పక్షాన నిలిచేవారి పరిస్థితి ఏమౌతుందో ఆంధ్ర మహాభారతంలోని పాత్రల నడవడిక ఆధారంగా విపులంగా చర్చించబడింది. రకరకాల ధర్మసూక్ష్మాల గురించి సవివరంగా ఈ పరిశోధనలో చర్చించడం జరిగింది. ధర్మాధర్మాల మధ్య సంఘర్షణ ఏర్పడితే మనిషి ధర్మ పక్షాన నిలబడాలని ఆంధ్ర మహాభారతంలోని ప్రధానమైన కథ ద్వారా, వివిధ ఉపాఖ్యానాల ద్వారా ఉద్ఘాటించబడింది.

19. రెండు ధర్మాల మధ్య సంఘర్షణ ఏర్పడితే మనిషి ఎలా తేల్చుకోవాలనే ప్రశ్న ఈ సందర్భంలో ఉత్పన్నమౌతుంది. అందుకే, ఈ పరిశోధనలో భాగంగా, ఆంధ్ర మహాభారతంలో ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు ప్రస్తావించబడిన వివిధ ఘట్టాలను సమగ్రంగా పరిశీలించి, వాటిలో రెండు ధర్మాల మధ్య సంఘర్షణను చిత్రించిన ఘట్టాలను ప్రత్యేకమైన ఉపవిభాగంలో విపులంగా చర్చించడం జరిగింది. అత్యాధునిక కాలానికి సైతం వర్తింపజేసుకునే విధంగా ఈ అంశాలను పరిశోధనలో క్రోడీకరించడం జరిగింది.

20. నిర్వహణ సామర్థ్యం (Managing ability) అనేది ఏదో ఉద్యోగ జీవితంలో మాత్రమే మనిషికి అవసరమనే భావన చాలా మందిలో స్థిరపడిపోయింది. కానీ, ఈ పరిశోధన ద్వారా నిర్వహణ సామర్థ్యం నిత్య జీవితంలో సైతం ఎంతో అవసరమనే విషయం స్పష్టం చేయబడింది. నిజానికి, దైనందిన జీవితంలో ప్రతీ అడుగులోనూ మనిషికి నిర్వహణ సామర్థ్యం అవసరమనేది ఆంధ్ర మహాభారతంలోని వివిధ ఘట్టాల ద్వారా స్పష్టం చేయబడింది.

21. నిర్వహణ సామర్థ్యాన్ని మనిషి పెంపొందించుకునే విధానాన్ని, తద్వారా నిత్య జీవితంలో కలిగే ప్రయోజనాలని ఈ పరిశోధనలో భాగంగా చర్చించడం జరిగింది. వంద పనులు ఉన్నా కూడా ఎటువంటి మానసిక ఒత్తిడికి గురి కాకుండా అన్నింటినీ దిగ్విజయంగా ఎలా పూర్తిచేయవచ్చో సోదాహరణంగా ఈ పరిశోధనలో వివరించబడింది. ఈ పరిశోధనలో మహాభారత కాలం నాటి పరిస్థితులను సమీక్షించడం ద్వారా సంక్షోభ నివారణ (Crisis Management) ఎలా చేయవచ్చో ప్రత్యేకంగా ప్రస్తావించబడింది.

22. అవయవ లోపాల వల్ల, ఆరోగ్యపరంగా ఎదురయ్యే సమస్యల వల్ల మనిషి దిగులు చెందవలసిన అవసరం లేదని, మానసిక సన్నద్ధతతో ప్రతికూల పరిస్థితుల్లో సైతం మనిషి దేన్నైనా సాధించవచ్చునని ఆంధ్ర మహాభారతంలోని వివిధ ఘట్టాలు వివరిస్తున్నాయి. వాటిని పరిశీలించడం ద్వారా దివ్యాంగులకు స్ఫూర్తి కలిగించే విధంగా కొన్ని జీవిత సూత్రాలను పరిశోధనలో భాగంగా చర్చించడం జరిగింది.

23. సంభాషణానైపుణ్యం కేవలం సాఫ్ట్ వేర్ ఉద్యోగాలు సంపాదించడానికే ఉపయోగపడుతుందనుకుంటే పొరపాటు. ఇంట్లో పని చేసే పనిమనిషి దగ్గర నుండి ప్రధాన మంత్రి వరకు ప్రతీ ఒక్కరికీ సంభాషణానైపుణ్యం ఎంతో అవసరమని పరిశోధనలో భాగంగా స్పష్టం చేయబడింది. కేవలం మాటలతో ఎన్నో సమస్యలని పరిష్కరించవచ్చునని నిరూపించబడింది. సంభాషణానైపుణ్యం సామాజిక జీవితంలో ఒక అంతర్భాగమని తెలియవస్తోంది.

24. పరాక్రమ ప్రదర్శన, దండన, హింస ఇటువంటి మార్గాల ద్వారా కాకుండా, కేవలం చక్కటి సంభాషణానైపుణ్యాన్ని ప్రదర్శించడం ద్వారా ఒక పనిని (కార్యాన్ని) దిగ్విజయంగా పూర్తి చేయవచ్చునని, లక్ష్యాన్ని ఛేదించవచ్చునని ఆంధ్ర మహాభారతంలోని ఉదంకుడి కథ, ఆస్తీకుడి కథ, శకుంతలోపాఖ్యానం మొదలైన కథలు నిరూపిస్తున్నాయి. వీటిని ఈ పరిశోధనలో ప్రత్యేకంగా పరిశీలించడం ద్వారా నేటి తరానికి ఉపయోగపడే విధంగా సంభాషణానైపుణ్యాన్ని పెంపొందించుకునే విధానాన్ని సూత్రీకరించడం జరిగింది.

25. వ్యక్తిత్వ వికాసం అంటే వ్యక్తిగత వికాసం కాదని, స్వార్థాన్ని విడిచి సమష్టి భావనని మనిషి పెంపొందించుకోవడమని ఈ పరిశోధనలో భాగంగా నిరూపించబడింది. నిర్వహణ

సామర్థ్యం, సంభాషణానైపుణ్యం వంటి అంశాలు సంపూర్ణమైన వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే సామాజికాంశాలని ఈ పరిశోధనలో స్పష్టం చేయబడింది. ఆంధ్ర మహాభారతంలోని వివిధ పాత్రల ద్వారా, వాటి నడత ద్వారా, వివిధ ఘట్టాల ద్వారా మనిషి సమగ్రమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకునేందుకు అవసరమైన విధానాలని సూత్రీకరించి, జీవితాన్ని పరిపూర్ణం చేసుకునే మార్గాలను పరిశోధనలో భాగంగా సవివరంగా చర్చించడం జరిగింది.

*ఆంధ్ర మహాభారతం: సామాజికాంశాల పరిశీలన* (ఆది పర్వం నుండి విరాట పర్వం వరకు) అనే ఈ పరిశోధనలో భాగంగా కవిత్రయ మహాభారతంలోని మొదటి నాలుగు పర్వాల సాహిత్యం ఆధారంగా పూర్వ పరిశోధకులు ప్రస్తావించని సామాజికాంశాలను ప్రతిపాదించి, వాటిపై సమగ్రమైన అధ్యయనం చేయడం జరిగింది. ఈ పరిశోధనలో భాగంగా వెలువడిన ప్రధానమైన ఫలితాలను, ప్రయోజనాలను ఇక్కడ పొందుపరచడం జరిగింది. మరెన్నో విశేషాలు, పరిశోధనలో గుర్తించిన ప్రత్యేకమైన అంశాలు, అత్యాధునిక తరాలు అన్వయం చేసుకుని, ఆచరించే విధంగా 8 అధ్యాయాల్లో చర్చించబడ్డాయి. ఈ కోణంలోనే తర్వాతి పర్వాలను పరిశోధించే సువర్ణావకాశం భావి పరిశోధకుల ముంగిట ఉందని సవినయంగా తెలియజేసుకుంటున్నాను.

# 11. ఉపయుక్త గ్రంథాలు

## ఆంగ్ల గ్రంథాలు


1. Narayana Rao, V. 2002. ***Classical Telugu Poetry***. New Delhi: Oxford University Press.
2. Sitansu. S. Chakravarti. 2006. ***Ethics in the Mahabharata*** (A Philosophical Inquiry for Today). New Delhi: Munshiram Manoharlal Publishers Pvt. Ltd.
3. Suryanarayana sastri, Malladi. 1915. ***A critical introduction to Andhra Maha Bharatam***. Madras: Vavilla Ramaswami Sastrulu & Sons.
4. Thadani, N. V. 1931. ***The Mysteries of Mahabharata***. Karachi: Bharat Publishing House.


## తెలుగు గ్రంథాలు


5. అనంతరామశాస్త్రి, నేతి. 1988. ***కవిత్రయ భారతం: రాజనీతి***. నాగార్జున సాగర్: రచయిత స్వీయ ప్రచురణ.
6. అమరనాథశర్మ, ముదిగొండ. 2009. ***మహాభారతంలో యక్షప్రశ్నలు***. హైదరాబాద్: నిశ్చింత ఛారిటబుల్ ప్రచురణ.
7. అరుంధతి, ఎం. 2008. ***ఆంధ్ర మహాభారతములో యుద్ధ షట్కము – నీతి***. (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం).
8. ***ఆంధ్ర మహాభారతము***. 2000. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.
9. ***ఆంధ్ర మహాభారతోపన్యాసములు***. 2007. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

10. ఆదిశంకరాచార్యులు. 1993. *వేదాంత డిండిమస్తోత్రం* (శంకర గ్రంథరత్నావళి, ఒకటవ సంపుటం). తెనాలి: సాధన గ్రంథ మండలి.

11. ఆరుద్ర. 1990. *సమగ్రాంధ్ర సాహిత్యం*. మద్రాస్: ప్రజాశక్తి బుక్ హౌస్.

12. ఉషశ్రీ, పురాణపండ. 1976. *భారతం (ఆది, సభా, అరణ్య, విరాట పర్వాలు)*. మద్రాస్: ఎం. శేషాచలం & కో.

13. కవిత్రయం (నన్నయ, తిక్కన, ఎర్రన).2014. *శ్రీమదాంధ్రమహాభారతము.* ( 15 సంపుటములు) తిరుపతి: తిరుమల తిరుపతి దేవస్థానములు.

14. కవిత్రయం (నన్నయ,తిక్కన, ఎర్రన.). 1964. *ఆంధ్రమహాభారతము*. మద్రాసు: వావిళ్ల ప్రెస్.

15. కవిత్రయం (నన్నయ,తిక్కన, ఎర్రన.). 1968. *శ్రీమదాంధ్రమహాభారతము* (సంశోధిత ముద్రణము). హైదరాబాద్: ఉస్మానియా విశ్వవిద్యాలయం.

16. కృష్ణమూర్తి, నాయుని. 2016. *జయమ్ (?)*. చౌడేపల్లి: విజయ వాణి ప్రింటర్స్.

17. కృష్ణస్వామి, ఎం. 1984. *తిక్కన భారతం – ధర్మాద్వైతం – వ్యాస దర్శనం – తిక్కన సందర్శనం*. అమలాపురం: ది వరల్డ్ టీచర్ ట్రస్ట్ ప్రచురణలు.

18. గణపతి శాస్త్రి. 1986. *మహాభారతం (విరాట, ఉద్యోగ పర్వములు)*. మచిలీపట్నం: త్రివేణి బుక్ ట్రస్ట్.

19. గిరిధర్ కుమార్, వడ్లమూడి. 2012. *మహాభారతం: సామాజిక ప్రబోధం*. హైదరాబాద్: తెలుగు అకాడమి.

20. గురజాడ, గరికిపాటి. 2015. *మనుచరిత్ర: వ్యక్తిత్వ వికాసం*. (హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం).

21. గోపాలకృష్ణ, రెంటాల. 1992. *వచన మహాభారతం విరాట, ఉద్యోగ పర్వాలు*. విజయవాడ: జయంతి పబ్లికేషన్స్.

22. గోపాలాచార్యులు, డి. 2007. *నన్నయ భారతము – వివాహ ధర్మ నిరూపణము*. (నాగార్జున విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం).

23. చంద్రశేఖరం, కె. 2009. ***ఆంధ్ర మహాభారతం – మానవ సంబంధాలు***. (ఆంధ్ర విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం).

24. చంద్రశేఖరశర్మ, మూలంపల్లి. 1989. ***మహాభారతము – విశ్వవిజ్ఞానకోశము***. హైదరాబాద్: రచయిత స్వీయ ప్రచురణ.

25. జయదయాల్, గోయందకా. 2014. ***మహాభారతములోని కొన్ని ఆదర్శపాత్రలు***. గోరఖ్పూర్: గీతాప్రెస్.

26. జానకి, ప్రభల. 2016. ***మహాభారత ప్రమదావలోకనం.*** హైదరాబాద్: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.

27. నరసింహారావు, గరికిపాటి. 1988. ***మన భారతము***. గుంటూరు: శంకర్ ప్రింటర్స్.

28. నాగయ్య, జి. 2009. ***తెలుగు సాహిత్య సమీక్ష*** (1వ సంపుటం). తిరుపతి: నవ్యపరిశోధక ప్రచురణలు.

29. నారాయణాచార్యులు, పుట్టపర్తి. 2001. ***మహాభారత విమర్శనం***. హైదరాబాద్: విశాలాంధ్ర ప్రచురణలు.

30. నిత్యానందరావు, వెలుదండ. 2013. ***విశ్వవిద్యాలయాల్లో తెలుగు పరిశోధన***. హైదరాబాదు: శ్రీమతి వి. గీతారాణీ పబ్లికేషన్స్.

31. ప్రభాకర శాస్త్రి, వేటూరి. 1990. ***వ్యాస ప్రభాకరము***. హైదరాబాద్: ఆంధ్ర సారస్వత పరిషత్తు.

32. ప్రసాదరావు, వై. ఎఫ్. డబ్ల్యు. 2012. ***విద్యామనోవిజ్ఞానశాస్త్ర ఆధారాలు***. హైదరాబాదు: తెలుగు అకాడమి.

33. బలరామమూర్తి, ఏటుకూరి. 1972. ***భారతీయ సంస్కృతి***. హైదరాబాద్: విశాలాంధ్ర ప్రచురణలు.

34. భారతి, ముక్తేవి. 2012. ***భారతంలో నీతి కథలు***. హైదరాబాద్: శ్రీశ్రీశ్రీ భారతీతీర్థ సేవాసమాఖ్య.

35. భూమయ్య, అనుమాండ్ల. 2010. ***ఆంధ్ర మహాభారత పీఠికలు***. హైదరాబాద్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం.

36. ***మనోవిజ్ఞాన పరిచయము***. 1977. హైదరాబాదు: తెలుగు అకాడమి.

37. రఘునాథశర్మ, శలాక. 2014. ***కవిత్రయ భారత జ్యోత్స్న***. రాజమహేంద్రవరం: ఆనందవల్లీ గ్రంథమాల.

38. రామకృష్ణ, ప్రయాగ. 2017. ***భారతంలో చిన్న కథలు***. హైదరాబాద్: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.

39. రామకృష్ణమూర్తి, తిప్పాభట్ల. 2010. ***వ్యాస మహాభారతం*** (తెలుగు వచనం). విజయవాడ: శ్రీలలితాత్రిపురసుందరీ ధార్మిక పరిషత్.

40. రామబ్రహ్మం, బేతవోలు, 2004. ***వ్యాసగౌతమి***. USA: అప్పాజోస్యుల– విష్ణుభొట్ల– కందాళం ఫౌండేషన్.

41. రామబ్రహ్మం, బేతవోలు. 2000. ***పద్యకవితాపరిచయం***. రాజమండ్రి: అప్పాజోస్యుల – విష్ణుభొట్ల ఫౌండేషన్.

42. రామబ్రహ్మం, బేతవోలు. 2001. ***నన్నయ భారతి***. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

43. రామబ్రహ్మం, బేతవోలు. 2004. ***పద్యారామం***. రాజమండ్రి: రచయిత స్వీయ ప్రచురణ.

44. లక్ష్మణస్వామి, దాసరి. 2012. ***వర్ణన రత్నాకరము*** (సంకలనం). హైదరాబాద్: ప్రాచీన తెలుగు అధ్యయన కేంద్రం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం.

45. లక్ష్మీకాంతం, పింగళి (సంపాదకులు). 1988. ***ప్రాచీన కవితా వైజయంతి***. హైదరాబాద్: తెలుగు విశ్వవిద్యాలయం.

46. లక్ష్మీకాంతం, పింగళి. 2005. ***ఆంధ్ర సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

47. లక్ష్మీనారాయణ, గంగిశెట్టి. 2017. ***సాహిత్య పరిశోధనా కళ: విధానం***. హైదరాబాద్: హిమాలయ గ్రాఫిక్స్.

48. లక్ష్మీనారాయణరాజు, పి. వి. 2006. ***పంచమవేదపరామర్శ అనే కవిత్రయ భారత కథామథనం.*** ఏర్పేడు: శ్రీ పారాశర్య ప్రెస్.

49. విజయకుమార్, ఎన్. 2010. ***ఆంధ్ర మహాభారతోపాఖ్యానాలు – ఆదర్శ దాంపత్య చిత్రణ***. (హైదరాబాద్ విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం).

50. విద్యేశ్వరి, డి. 1996. ***ఆంధ్ర మహాభారతం – ధర్మతత్త్వము***. (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం).

51. విద్యేశ్వరి, డి. 1998. ***ఆంధ్ర మహాభారతం – ధర్మతత్త్వం***. హైదరాబాద్: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్.

52. వెంకట సుబ్బయ్య, ఎ. 1971. ***మహాభారతం – మానవ స్వభావ చిత్రణ***. (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం).

53. వెంకట హరనాథ్, గానుగపాటి (సంకలనకర్త). 2014. ***ప్రాచీన సాహిత్య మంజూషిక***. హైదరాబాద్: తెలుగు అకాడమి.

54. వేంకట సుబ్బయ్య, అప్పజోడు. 1977. ***మహాభారతము – మానవ స్వభావ చిత్రణ***. హైదరాబాద్: ప్రగతి గీత ప్రెస్.

55. వేంకట సుబ్బయ్య, అప్పజోడు. 1984. ***సజీవ శిల్పాలు భారత పాత్రలు***. కర్నూల్: సరోజినీదేవి, ఎ.

56. వేంకట సుబ్బయ్య, వల్లంపాటి. 2002. ***విమర్శ శిల్పం***. హైదరాబాద్: విశాలాంధ్ర పుబ్లిషింగ్ హౌస్.

57. వేంకట సుబ్రహ్మణ్యము, త్రోవగుంట. 2018. ***యాజ్ఞసేని***. హైదరాబాద్: కర్షక్ ప్రింటర్స్.

58. వేంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, పెండ్యాల. 1991. ***మహాభారత చరిత్ర***. హైదరాబాద్: విశాలాంధ్ర ప్రచురణలు.

59. వేంకటేశ్వరరావు, కాటూరి. 1986. ***తెలుగు కావ్యమాల*** (సంకలనం). న్యూఢిల్లీ: సాహిత్య అకాడెమి.

60. ***వ్యాస సాహితీ సంహిత***. 1985. సికింద్రాబాద్: యువభారతి ప్రచురణ.

61. శాంతమ్మ, ఎన్. 2010. ***మహాభారత మహిళాదర్శనం***. హైదరాబాద్: ప్లానో గ్రాఫర్స్.

62. శారద, పి. 2010. ***నన్నయ భారతంలో గురుశిష్య సంబంధాలు***. (కాకతీయ విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం).

63. శాస్త్రి, ద్వా. నా. 2008. ***తెలుగు సాహిత్య చరిత్ర***. హైదరాబాద్: ప్రగతి పబ్లిషర్స్.

64. శ్రీనివాసరావు, ఎల్లంరాజు. 1992. ***మహాభారత వైభవము***. ప్రొద్దుటూరు: మురళీకృష్ణ ప్రింటర్స్.

65. శ్రీరామ చంద్రుడు, పుల్లెల. 2012. ***మహాభారత సారసంగ్రహము***. హైదరాబాద్: సంహిత గ్రాఫిక్స్.

66. శ్రీరామచంద్రుడు, పుల్లెల. 2015. ***పుల్లెల వారి వ్యాస మంజరి***. హైదరాబాద్: సంహిత గ్రాఫిక్స్.

67. శ్రీరామశాస్త్రి, ముదిగొండ. 2009. ***తరతరాల తెలుగు పద్యము***. ఖమ్మం: శ్రీ కవిత ఆఫ్సెట్ ప్రింటర్స్.

68. సత్యనారాయణ, విశ్వనాథ. 1978. ***కావ్య పరిమళము***. హైదరాబాదు: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

69. సరస్వతీ దేవి, ఎం 1990. ***భారత కాలం నాటి విద్యావిధానం***, (మద్రాసు విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం).

70. సావిత్రి, ఎం. 1978. ***నన్నయ భారతం – ఉపదేశాంశం***, (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ఎం. ఫిల్. పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత వ్యాసం).

71. సీతారామాచార్యులు, బహుజనపల్లి. 2011. *శ్రీ శబ్దరత్నాకరము*. విజయవాడ: శ్రీ వెంకటేశ్వర బుక్ డిపో.

72. సుప్రసన్నాచార్య, కోవెల. 2012. *ప్రాచీన తెలుగు సాహిత్యం: తాత్త్విక భూమిక*. హైదరాబాద్: తెలుగు అకాడమి.

73. సుబ్రహ్మణ్య శర్మ, జి. వి. ఎస్. 2006. **శ్రీకాళిదాసవిరచితమ్ అభిజ్ఞాన శాకుంతలమ్** (నాటకం). హైదరాబాద్: అపర్ణా గ్రాఫిక్స్.

74. సుబ్రహ్మణ్యం, జి. వి. 1987. *సారస్వత వ్యాసములు* (ప్రథమ సంపుటము). హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి.

75. సుబ్రహ్మణ్యం, జి.వి. 2012. *సాహిత్య చరిత్రలో చర్చనీయాంశాలు*. హైదరాబాద్: తెలుగు అకాడమి.

76. సుభద్ర, బొప్పంగి. 2015. *ఆంధ్ర మహాభారతం: సామాజిక వ్యవస్థ*, (ఉస్మానియా విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం).

77. సురేష్ బాబు, జి. 1990. *ఆంధ్ర మహాభారతం – సూక్తి రత్నాకరం*. (మద్రాసు విశ్వవిద్యాలయానికి పిహెచ్. డి పట్టం కోసం సమర్పించిన సిద్ధాంత గ్రంథం).

78. సూర్యనారాయణ శాస్త్రి, శిష్ట్లా. 1938. *మహాభారత రహస్యము*. మద్రాసు: వావిళ్ళ ప్రచురణ.

79. సూర్యనారాయణ, ధూళిపూడి. 1939. *శ్రీమదాంధ్ర మహాభారత సంశయ విచ్ఛేదము*. తెనాలి: లక్ష్మీ పవర్ ప్రెస్.

80. హనుమంతరావు, కాళూరి. 2002. *మహాభారతం విరాట పర్వం*. హైదరాబాద్: రచయిత స్వీయ ప్రచురణ.

RNI No. APTEL/2003/12253

# భావ వీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 8(2) Monthly August 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500



# డా|| సి.నారాయణరెడ్డి




మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

Journal of Telugu Literary, Culture & Language Study

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 8(2) - August 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San).,
M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil
(Computational Linguistics) (Ph.D)
Research Scientist, Centre for Applied Linguistics
and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
HOD, Dept. of Telugu,
Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.

BHAVAVEENA
Vol. 16, Issue. 8(2), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)

| | | |
|---|---|---|
| 1. ఆముక్త మాల్యద - భక్తి తత్వం | - డా॥. బూసి వెంకటస్వామి | 5 |
| 2. తెలంగాణ సాహిత్య కరదీపిక కోవెల సంపత్కుమారాచార్య | - డా॥ చవ్వా వెంకటరెడ్డి | 8 |
| 3. వచన కవిత్వంపై స్త్రీవాద ప్రభావం | - డా. గోనిపాటి ధర్మారావు | 11 |
| 4. జాషువా కావ్య ఖండికలు | - డా॥ గంగు కిషన్ ప్రసాద్ | 18 |
| 5. గురజాడ 'ముత్యాల సరాలు' | - డాక్టర్ ఎం.మునిరత్నం | 24 |
| 6. అరుదైన సొలొమోను సామెతలు | - జి.యన్.శ్యామలరాణి | 29 |
| 7. శకుంతలోపాఖ్యానం : మానవసంబంధాలు | - గరికిపాటి గురజాడ | 33 |
| 8. ద్రావిడభాషా కుటుంబ అంతర్భాగం - ఎరుకుల భాష | - డా॥ గరికపాటి హరిబాబు | 37 |
| 9. లంబాడీ పిల్లల ఆటలు - పాటలు | - కొర్ర ఝాన్సీ | 40 |
| 10. సుగాలీల పుట్టుపూర్వోత్తరాలు | - డా. ఇస్లావత్ భీమానాయక్ | 45 |
| 11. కాళోజీ స్వగత కవితలు - అవలోకనం | - డా॥ లావుడ్య సుజాత | 51 |
| 12. బోయి భీమన్న 'ధర్మవ్యాధుడు' నాటకం - స్త్రీ పాత్ర చిత్రణ | - సిహెచ్. రేవతి | 55 |
| 13. పురాణం సుబ్రహ్మణ్య శర్మ గారి "మధురవాణి ఇంటర్వ్యూలు" | - కర్రి వి.వి. యం.కె. కుమార్ | 58 |
| 14. "శ్రీ శివభారతము" విశ్లేషణ | - కె. లలిత & - డా. యన్. నరసింహులు | 60 |
| 15. రాయలసీమలో బహుజన సాహిత్యం | - డా॥ మేడికుర్తి ఓబులేసు | 64 |
| 16. తెలుగు నాటక వికాసం | - డాక్టర్ కొత్తిరెడ్డి మల్లారెడ్డి | 72 |
| 17. ఆధునిక సాహిత్యంలో - బాలికల సమస్యలు | - డా॥ పి.వి. రమణారెడ్డి | 75 |
| 18. శ్రీనాథుని క్రీడాభిరామం | - వేముల శరణ్య | 78 |
| 19. కొండపల్లి కోటేశ్వరమ్మ నిర్జనవారధి : జండర్ దృక్పథం | - డా. వెంకటరామయ్య గంపా | 80 |
| 20. తెలుగు మాటల పుట్టుక, ఇతర బాషా పదాల కలయిక | - డా. జి. వెంకటరమణ | 86 |
| 21. అనంతపద్మనాభరావు జీవితం, వ్యక్తిత్వం | - బోయపల్లి చిట్టెమ్మ | 91 |
| 22. తెలుగు వాగ్గేయ పద కవితా త్రిమూర్తుల్లో - క్షేత్రయ్య | - డా॥ ఎ. సిల్మా నాయక్ | 96 |
| 23. కరీంనగర్ జిల్లా సాహిత్య వైభవం (ప్రాభవం) | - డా॥ కలవకుంట రామకృష్ణ | 99 |

BHAVAVEENA
Vol. 16, Issue. 8(2), August - 2019.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# శకుంతలోపాఖ్యానం - మానవసంబంధాలు

- గరికిపాటి గురజాడ, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాదు, తెలంగాణ.

## పరిచయం :

మహాభారతంసామాజికాంశాలకు నిలయం. ఎన్ని భాషల్లోకి అనువదించినా, మహాభారతం విలువ పెరిగిందే తప్ప తరగలేదు. దానికి ప్రధానమైన కారణాలు రెండు. సార్వకాలికత, సార్వజనీనత.భారతాన్ని ఎవరు ఏ ద ృష్టితో దర్శిస్తే ఆ ద ృష్టితో దర్శనమిస్తుందని వ్యాసభగవానుడు స్వయంగా చెప్పాడు. మహాభారతంలో ఎన్నో ఉపాఖ్యానాలు ఉన్నాయి. మనవసంబంధాల విలువలను ఆయా ఘట్టాలు తరతరాలకు అందిస్తూనే ఉన్నాయి. మరీ ముఖ్యంగా కవిత్రయ భారతంలోని శకుంతలోపాఖ్యానం మానవ సంబంధాలు ఎలా ఉండాలో, వాటిని ఎలా నిలబెట్టుకోవాలో అద్భుతంగా ఆవిష్కరించింది. అందునా, గ ృహస్థాశ్రమ ధర్మాలను వివరించిన తీరు అత్యంత ఆస్వాదయోగ్యమైనది,ఆచరణీయమైనది.

## శకుంతలధార్మికోపన్యాసం : గృహస్థాశ్రమ ధర్మాలు.

కణ్వమహర్షి ఆశ్రమంలో శకుంతలని చూసి మనసు పడి గాంధర్వ వివాహం చేసుకున్న దుష్యంతుడు, తనని తీసుకువెళ్ళడానికి తిరిగి రాకపోవడంతో భరతుడిని తీసుకుని నిండు సభలోకి శకుంతల ప్రవేశించింది. దుష్యంతుడు జరిగిందంతా మర్చిపోయి, ఏమీ తెలియనివాడిలా మాట్లాడుతుంటే, శకుంతల గొప్పధార్మికోపన్యాసం చేస్తుంది. అందులో భాగంగా గ ృహస్థాశ్రమ ధర్మాన్ని సవివరంగా బోధిస్తుంది. అది మొత్తం మానవాళికి గొప్ప సందేశాన్నిస్తుంది.

గృహస్థాశ్రమధర్మం నాలుగు బలమైన స్తంభాలమీద నిలువబడిన వ్యవస్థ. ఆస్తంభాలేవంటే -1. యజమాని (భర్త, గృహస్థుడు), 2. కులసతి(భార్య, గృహిణి), 3.సంతానం (పిల్లలు), 4. సత్యం(సత్యస్వరూపమైన పరమధర్మం).(ఆంధ్ర. ఆది. 4. పుట: 344).

చ. విమలయశోనిధీ! పురుష వ్రుత్తమెరుంగు చునుండు జూవె వే
దములునుబంచభూతములుధర్మువు సంధ్యలు నంతరాత్మయున్
యముడునుజంద్రసూర్యులునహంబును రాత్రియు న న్మహాపదా
ర్థములివియుండగా నరుడు దక్కొననేర్చునే తన్ను ప్రుచ్చిలన్. (ఆంధ్ర. ఆది. 4: 80)

శకుంతల సంభాషణానైపుణ్యానికి ఈ పద్యం పరాకాష్ఠ. దుష్యంతుడిని శకుంతల విమలయశోనిధీ! అని సంబోధించడం చాలా విశేషం, సార్థకం. భర్త తన మాటకి కాదంటున్నాడని శకుంతల దుష్యంతుడిని దూషించలేదు. పైకిప్రశంశిస్తూనే, లోలోపల ప్రశ్నిస్తోంది. నిండు సభలో సభ్యోక్తిని పాటిస్తూ తాను వచ్చిన పనినిచక్కబెట్టుకునే నేర్పు శకుంతలలో కనిపిస్తుంది.

'వేదాలు, పంచభూతాలు, ధర్మం, ఉభయసంధ్యలు, హ ృదయం, యముడు, చంద్రసూర్యులు, పగలు, రాత్రి - అనే మహాపదార్థాలునరులవర్తనాన్ని ఎప్పుడూ గమనిస్తూనే ఉంటాయి సుమా'! అంటూ దుష్యంతుడి మనస్సాక్షిని ప్రశ్నిస్తోంది. 'ఆమహాపదార్థాలు ఎప్పుడూ అందరినీ గమనిస్తూ ఉంటాయి, జాగ్రత్తపడు'అని పరోక్షంగా హెచ్చరించింది. శకుంతల మాట్లాడే విధానం చూస్తే దుష్యంతుడు కూడా 'నేనునిండుసభలో ఈమెను కాదు పొమ్మన్నా కూడా నా పరువు, ప్రతిష్టలకు భంగం వాటిల్లకుండా ఎంత జాగ్రత్తగా మాట్లాడుతోంది!' అని ఆశ్చర్యపోవాలి.

'నిన్ను ఎవరూ గమనించడం లేదు అనుకుంటున్నావేమో! నీ మనస్సాక్షి, ఆమహాపదార్థాలు అన్నీ నిన్నే గమనిస్తున్నాయి. నిన్ను నువ్వు మోసం చేసుకోకు. అసత్యమాడి నీ కీర్తికి మచ్చ తెచ్చుకోవద్ద'ని శకుంతలదుష్యంతుడిని

వారిస్తోంది. 'అయినా ధర్మస్వరూపుడవైన నీవు, స్వచ్ఛమైన కీర్తి కలిగిన నీవు, ఎల్లప్పుడూ ధర్మానికి కట్టుబడే ఉంటావు' అని పైకి మెచ్చుకుని, దుష్యంతుడి మనస్సుని లోలోపల కలుషితం చేస్తున్న ఆలోచనలని అతడి మనస్సు నుంచి తొలగించే ప్రయత్నం చేస్తోంది. కార్య సాధనకు కావలసిన సంభాషణానైపుణ్యం, నిర్వహణ సామర్థ్యం శకుంతలలో ప్రతీ సన్నివేశంలో కనిపిస్తున్నాయి. నన్నయ ఆ పాత్రని తీర్చిదిద్దిన విధానం అంత గొప్పగా ఉంది. ఈ పద్యం నన్నయ సూక్తి మౌక్తికం.

సీ. ధర్మార్థకామసాధనకుపకరణంబు/ గృహనీతివిద్యకు గృహము, విమల
చారిత్రశిక్షకాచార్యకం, బన్వయ/స్థితికి మూలంబు, సద్గతికి నూఁత,
గౌరవంబునకేకకారణం, బున్నత/స్థిరగుణ మణులకాకరము, హృదయ
సంతోషమునకు సంజనకంబుభార్యయ/చూవె భర్తకు, నొండ్లుగావు ప్రియము

ఆ. లెట్టి ఘట్టములను నెట్టి యాపదలను/ నెట్టి తీఱములనుముట్టఁబడిన
వంతలెల్లఁ బాయు నింతులఁబ్రజలను/నొనరఁ జూడఁగనిన జనుల కెందు. (ఆంధ్ర. ఆది. 4: 85)

'ధర్మం, అర్థం, కామం అనే పురుషార్థాలను సాధించడానికి అనువైన సాధనము,గృహనీతి అనే విద్యకు నెలవైనది, నిర్మలమైన శీలాన్ని గురించి బోధించే గురుస్థానము, వంశం నిలవడానికి ఆధారమైనది, ఉత్తమ గతులను పొందడానికి ఊతకర్రయైనది, మన్ననకు ముఖ్యహేతువైనది,ఆడర్శప్రాయమైనవీ, కలకాలం నిలేచేవి అయిన మణులవంటి గుణాలకు నెలవైనది, హృదయానందాన్నికలిగించేది భర్తకు భార్యయే సుమా! మగనికిఇల్లాలికంటే ఇంపైనదివేరొకటి లేదు. ఆలుబిడ్డలను ఆప్యాయంగా చూసేవారికిఏచోటనైనా, ఎటువంటి పరిస్థితులలోనైనా, ఎటువంటి ఆపదలలోనైనా, ఏ తీరాలలోనైనా చుట్టుముట్టినదుఖాలన్నీ తొలగిపోతాయి'.

పురుషార్థాలునాలుగింటిలో మోక్షం తప్ప తక్కినవాటి సాధనకు అనువైన సాధనము గృహిణి అని నన్నయ చెప్పారు. మోక్ష సాధనకు అన్ని బంధాలను త్యజించడం అవసరం, మోక్షం ఎవరికి వారే సాధించుకోవలసినది. అందుకే, నన్నయ మోక్షం తప్ప తక్కినవాటిని పేర్కొన్నాడు. నన్నయని ఋషి అనడం అందుకే సార్థకం. ఈ పద్యంలో గృహిణి గొప్పతనాన్ని నన్నయ చాలా సహజంగా వర్ణించారు. భారతీయ జీవన విధానంలో, అందునా హిందూధర్మంలోధర్మపత్ని పక్కన లేకుండా భర్త యజ్ఞం, వ్రతం ఏదీ చేయడానికి వీలు లేదు.మన శాస్త్రాల్లో భార్యకి అంత ప్రాధాన్యం ఉంది. ఎవరైతే భార్య, పిల్లలనుకంటికి రెప్పలా కాపాడుకుంటారో వారికి ఎటువంటి పరిస్థితిలోనైనా చుట్టుముట్టిన కష్టాలన్నీ తొలగిపోతాయి అనిపద్య సారాంశంగా చెప్పారు.

గృహస్థాశ్రమధర్మరక్షణకు కేంద్ర బిందువు గృహిణి. ఈ సన్నివేశంలో శకుంతల అందుకు ఉదాహరణ. తన కుటుంబ బాధ్యతనంతా శకుంతలే మోస్తోంది. తనని, తన బిడ్డని స్వీకరించనిదే జీవితంలో ఏ సద్గాతులు పొందడం సాధ్యం కాదని శకుంతల దుష్యంతుడికి పరోక్షంగా స్పష్టం చేసింది.

మ. విపరీతప్రతిభాషలేమిటికినుర్వీనాథ! యీ పుత్త్రగా
త్రపరిష్వంగసుఖంబుసేకొనుముముక్తాహార కర్పూర సాం
ద్రపరాగప్రసరంబుఁజందనముఁజంద్రజ్యోత్స్న యుంబుత్త్రగా
త్రపరిష్వంగమునట్లు జీవులకు హృద్యంబేకడున్ శీతమే.(ఆంధ్ర. ఆది. 4: 85)

పుత్రుడి కౌగిలి కలిగించినంత సుఖాన్ని ముత్యాల హారాలు, మంచి గంధం, వెన్నెలమొదలైనవేవీ కలిగించ లేవు అని నన్నయ పలికినమాటప్రత్యక్షర సత్యం. అత్యంత వాస్తవికం. శకుంతలదుష్యంతుడిపై కురిపించిన బాణాలలో ఇది నిజంగా నవ్మోహనాస్త్రమే. తెలుగు సాహిత్యంలో అత్యంత ప్రాచుర్యం పొందిన పద్యాలలో ఈ పద్యం ఒకటి. తండ్రీకొడుకుల మధ్య ఉండే

వాత్సల్యాన్ని బహుశా తెలుగు సాహిత్యంలో మరెవ్వరూ ఇంత గొప్పగా వర్ణించలేదు అంటే అతిశయోక్తి కాదేమో!

శకుంతల గృహస్థాశ్రమధర్మ ప్రాశస్త్యాన్ని వివరించే క్రమంలో ఆ ధర్మానికి మూల స్తంభాలైన యజమాని, గృహిణి గురించి ముందు చెప్పింది. ఇప్పుడు కుమారుడి ప్రాధాన్యత గురించి చెప్పి దుష్యంతుడిని సమ్మోహితుడిని చేసే ప్రయత్నం చేస్తోంది.

చ. నుతజలపూరితంబులగునూతులునూఱిటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలుబీ మఱి బావులు నూఱిటి కంటెనొక్కస
త్క్రతువది మేలుబీ తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలుబీ త
త్సుతశతకంబుకంటెనొకసూనృతవాక్యము మేలు సూడఁగన్. (ఆంధ్ర. ఆది. 4: 94)

'సూనృతవ్రత!' అంటూ శకుంతల చేసిన సంబోధన చాలా విశేషమైనది. దుష్యంతుడితో శకుంతల 'నీ కీర్తికి మచ్చ తెచ్చుకోవద్దు అని పలికినప్పుడు నన్నయ 'విమలయశోనిధీ!' అంటూ శకుంతల చేత పలికించాడు. ఇక్కడ అబద్ధం ఆడుతున్నవాడిని 'సూనృతవ్రత!' అని సంబోధన చేయించాడు. అంటే దుష్యంతుడు సత్యం పలకడమే వ్రతంగా కలవాడని అర్థం. నిజానికి తప్పు చేస్తున్నవాడిని దూషిస్తే పరిస్థితి వేరేలా ఉంటుంది. వాడుమొండికేసే ప్రమాదం ఉంది. కానీ, వ్యక్తిని మన దారికి తెచ్చుకోవాలి అన్నప్పుడు ఇలా అధిక్షేపంగా అనడం అత్యంత సమంజసం. నన్నయ వాక్చాతుర్యానికి అందుకే సాహితీలోకం యావత్తు దాసోహమంది. నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికి ఈ పద్యం మంచి ఉదాహరణ.

సత్యం ఎంత గొప్పదో వివరించిన శకుంతల, ఆ సత్యానికి కట్టుబడని వారి పరిస్థితి ఎలా ఉంటుందో దుష్యంతుడి ఊహకే విడిచిపెట్టింది. శకుంతల అంత ఆగ్రహంలో కూడా ఔచిత్యం పాటించింది. గృహస్థాశ్రమ ధర్మాన్ని దుష్యంతుడికి వివరిస్తూనే మాటల్లో నేర్పు ప్రదర్శించింది. శకుంతల తన ధార్మికోపన్యాసంలో ఒక పద్ధతిని అనుసరించింది. ముందు దుష్యంతుడికి గృహస్థుగా తన బాధ్యతలను తనకి తెలియజేసింది. తర్వాత తనవంటి గృహిణిని వదులుకోవద్దని వారించింది. ఆ తర్వాత కుమారుడిని చూపించి సమ్మోహనాస్త్రాన్ని సంధించింది. చివరికి వీటన్నింటికంటేసత్యం గొప్పదని హితవు పలికింది. సత్యస్వరూపమైన పరమ ధర్మాన్ని విడిచిపెట్టద్దని బోధించింది. దుష్యంతుడు క్రమంగా తనని అర్థం చేసుకునేలా సంభాషించింది.

## కొసమెరుపు :

4 అనే సంఖ్యకి ఈ ఘట్టంలో ఒక ప్రాధాన్యత కనిపిస్తుంది. మన ధర్మ శాస్త్ర గ్రంథాలు, చతుర్వేదాలుచెప్పిన ఆశ్రమ ధర్మాలునాలుగు (4). అవి- బ్రహ్మచర్యం, గృహస్థాశ్రమం, వానప్రస్థం, సన్యాసం. గృహస్థాశ్రమ ధర్మానికి మూలస్తంభాలు నాలుగు (4)- యజమాని, గృహిణి, పుత్రుడు/పుత్రిక, సత్యం. ఈ ఉపాఖ్యానంలో ఉన్న ప్రధానమైన పాత్రలు నాలుగు (4) - కణ్వమహర్షి, దుష్యంతుడు, శకుంతల, భరతుడు. శకుంతల దుష్యంతుడి వద్దకు చేరడానికి (లక్ష్యానికి) నాలుగు (4)అడుగుల దూరంలో ఉంది. అందుకేఒక్కొక్క అడుగు ముందుకు వెడుతోంది. యజమాని గొప్పతనం, గృహిణి ప్రాధాన్యత, కుమారుడి ఔన్నత్యాల గురించి వివరిస్తూ,హితబోధ చేస్తూ మూడు అడుగులు వేసింది. ఇక మిగిలినది సత్యమే (సత్య స్వరూపమైన పరమ ధర్మం). అది అన్నింటికంటే గొప్పది, శాశ్వతమైనది.కాళిదాసు రచించిన అభిజ్ఞాన శాకుంతలంలో 4వ అంకంచాలా ప్రసిద్ధమైనది,అందునా ఆ ఆశ్వాసంలో శ్లోక చతుష్టయం (4) చాలాప్రసిద్ధమైనవి. ఆశ్చర్యకరంగా ఆంధ్ర మహాభారతంలో కూడా శకుంతలోపాఖ్యానం చతుర్థాశ్వాసంలోనే(4) వచ్చింది.

## ముగింపు :

శకుంతల చేసిన ధార్మికోపన్యాసం ఏకాలానికైనా అన్వయించుకోదగినది, ఆదర్శప్రాయమైనది, ఆచరణ యోగ్యమైనది. పరిస్థితులు తనకి పూర్తి ప్రతికూలంగా ఉన్నా కూడా మొక్కవోని ధైర్యంతో, బిడ్డ భవిష్యత్తు కోసం,

న్యాయం కోసం పోరాడిన శకుంతల స్త్రీచైతన్యానికి గొప్ప ఉదాహరణగా నిలిచింది. నిండు సభలో దుష్యంతుడితో తర్కించి, శకుంతల మహారాణి అనిపించుకుంది. తన సంభాషణానైపుణ్యంతో, నిర్వహణ సామర్థ్యంతో దుష్యంతుడి ప్రేమనే కాదు, సభికుల మన్ననల్ని, భగవంతుడి ఆశీస్సులను సైతం మెండుగా పొందగలిగింది.

## ఆధార గ్రంథాలు :

1. ఆంధ్ర మహాభారతం (తిరుమల తిరుపతి దేవస్థానం వారి ప్రచురణ)
2. తిక్కన భారతం - ధర్మాద్వైతం - వ్యాస దర్శనం - తిక్కన సందర్శనం, ఎం. కృష్ణస్వామి (పరిశోధన), సి. సుబ్రహ్మణ్యశాస్త్రి (పర్యవేక్షణ),1981, ఆంధ్ర విశ్వవిద్యాలయం.
3. శ్రీరామ చంద్రుడు, పుల్లెల. 2012. మహాభారత సారసంగ్రహము. హైదరాబాద్: సంహిత గ్రాఫిక్స్.
4. శాంతమ్మ, ఎస్. 2010. మహాభారత మహిళాదర్శనం. హైదరాబాద్: ప్లానోగ్రాఫర్స్.

# పరిశోధన: నాడు, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)



సంపాదకులు

ఆచార్య మాడభూషి సంపత్ కుమార్

# పరిశోధన:
# నాడు, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)


సంపాదకులు

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్,** డి.లిట్.

తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-600005

సహసంపాదకులు

**డాక్టర్ కోదండ లక్ష్మణ**

# PARISOODHANA: NINNA, NEEDU, REEPU

(Research Papers Presented in the International Seminar
"Research : Yesterday, Today and Tomorrow")

**Editor: Dr. M. Sampath Kumar**
Prof. & Head, Department of Telugu
University of Madras
Chennai-600 005
Mobile:09444075128
email: madabhushisk@gmail.com

First Edition: February 2016

(c) Editor

Cover Design: Thy Designers, Chennai

**ISBN No. : 978-93-81992-32-6**

# పరిశోధన: నిన్న, నేడు, రేపు

(అంతర్జాతీయ సదస్సు పత్రాలు)

**సంపాదకులు:**

**ఆచార్య మాడభూషి సంపత్ కుమార్,** డి.లిట్.

తెలుగు శాఖాధ్యక్షులు, మద్రాసు విశ్వవిద్యాలయం, చెన్నై-600 005

హక్కులు : సంపాదకులు

మొదటి ప్రచురణ : ఫిబ్రవరి 2016
ముఖపత్ర అలంకరణ: థై డిజైనర్స్
వెల: రూ. 400/-

ప్రతులకు:

**పాలపిట్ట బుక్స్**

16-11-20/6/1/1, 403, విజయసాయి రెసిడెన్సీ
సలీంనగర్, మలక్‌పేట, హైదరాబాదు-500 036
ఫోను: 040-27678430

# పత్ర క్రమం


| | | | |
|---|---|---|---|
| 001. | ఆరాల లింగమల్లయ్య | గంగిరెద్దులాట | 001 |
| 002. | ఆరాల సైదులు | తెలుగు పత్రికలలో బాల సాహిత్య ఆవిర్భావం-వికాసం | 004 |
| 003. | ఈశ్వరబాబు.కె. | ఆంధ్ర మహాభాగవతం-శ్రీకృష్ణుని అష్టభార్యలు | 007 |
| 004. | కంబాల మురళీకృష్ణ | తెలుగు దినపత్రికలు ఆధునిక ధోరణుల అనుశీలన | 011 |
| 005. | కదిరి కృష్ణయ్య | విద్వాన్ విశ్వం 'పెన్నేటి పాట' - భాషా పరిశీలన | 015 |
| 006. | కళ్యాణి జిల్లా | తెలంగాణ రచయిత్రుల నవలలు-స్త్రీల జీవిత చిత్రణ | 018 |
| 007. | కాశింబాబు.ఎ. | కారకవిశేషాలు-తిక్కనగారి ఉద్యోగ పర్వం | 021 |
| 008. | పి.కాళియప్ప | ఆధునికానంతర సాహిత్య విమర్శ-ధోరణులు | 025 |
| 009. | కుంజం శ్రీనివాస్ | కోయతెగ-పండుగలు | 029 |
| 010. | కృష్ణారెడ్డి.సి.యన్ | సీమ కథాశిల్పి - సింగమనేని | 031 |
| 011. | కొక్కిలిగడ్డ వాణి | స్వాతంత్ర్య పోరాటంలో తెలుగు స్త్రీలు | 034 |
| 012. | కోదండ లక్ష్మణ | లకుమ 'గోరింటాకు చందమామ' కవితా వైభవం | 038 |
| 013. | గంధసిరి వీరన్న | బందూక్ నవల- సామాజిక పరిశీలన | 042 |
| 014. | గరికిపాటి గురజాడ | ఆంధ్ర మహాభారతంలో యక్ష ప్రశ్నలు : మానసిక పరిపక్వత | 047 |
| 015. | గరిగె రాజేష్ | కరీంనగర్ జిల్లా కవిత్వం - వస్తు విశ్లేషణ | 049 |
| 016. | గల్లా జ్యోత్స్న | కొలకలూరి ఇనాక్ 'ఊరబావి' - వస్తువైవిధ్యం | 054 |
| 017. | గాదిరాజు రంగరాజు | సాహిత్యంలో చారిత్రక నాటకాల విశిష్టత | 060 |
| 018. | గాయత్రి.ఎస్ | కడుపు కోత కథా సంపుటి- సామాజిక విశ్లేషణ | 063 |
| 019. | గిన్నారపు ఆదినారాయణ | దళిత సాహిత్యంలో ఆత్మకథలు | 066 |
| 020. | గొంగులూరి కృష్ణవేణి | గంగుల శాయిరెడ్డి కాపుబిడ్డ-రైతు జీవిత చిత్రణ | 070 |
| 021. | గోపాల్.పి | గోపిచంద్ వ్యక్తిత్వం | 073 |
| 022. | గోపాల్ ఆర్. | కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సాహిత్య ప్రస్థానం | 075 |
| 023. | గోపినాథ్ రాథోడ్.పి | మహబూబ్ నగర్ జిల్లా పత్రికలు - సాహిత్య సేవ | 078 |
| 024. | గోవిందు.హెచ్ | మానవల్లికవి మనోహర కల్పనాకావ్యం 'మృగావతి' | 082 |
| 025. | గౌతమ.బి.వి.ఎస్ | సూర్య దినపత్రికలో కవిత్వం : చర్చనీయాంశాలు | 085 |
| 026. | చంద్రమౌళి మొరవపల్లి | కవి జీవిత పరిశోధనల్లో డా:సి.ఆర్.రెడ్డి జీవితం, రచనలు | 087 |
| 027. | చంద్రయ్య.ఎస్ | తిమ్మాజిపేట మండల మౌఖిక భాష-వర్ణనాత్మక వ్యాకరణం | 090 |
| 028. | చెన్నకేశవులు.సి | కథామహల్ కథల్లో వస్తువైవిధ్యం | 093 |
| 029. | డుంగావత్ నరేష్ కుమార్ నాయక్ | గోర్‌బోలి భాషా - వ్యాకరణం | 096 |
| 030. | తిరుపతి కల్లెబోయిన | నాడు తెలుగు పరిశోధనకు దీప్తి తెలుగు పరిశోధన పత్రిక | 103 |
| 031. | దస్తగిరి.పి | ఆధునిక తెలుగుసాహిత్యం - చాకలివారి జీవిత ప్రస్తావన | 105 |
| 032. | దార సుమన్ | సినిమాలుగా రూపొందిన తెలుగు నవలలు-నాటకీయత | 108 |
| 033. | దాసరి విజయ లక్ష్మి | కొలకలూరి ఇనాక్ కథానికలలో మానవత | 112 |
| 034. | దుర్గ.సి | సర్వజగన్నాథ రెడ్డిగారి 'కచ్ఛపి కావ్యం' - ప్రబోధాంశాలు | 116 |
| 035. | దైద వీరయ్య | దక్కలికుల సాంస్కృతిక సామాజిక జీవనం | 119 |
| 036. | నగరి చాముండేశ్వరరావు | తరికొండ వెంగమాంబ రచనలు-యోగదర్శనం | 121 |

# ఆంధ్ర మహాభారతంలో యక్ష ప్రశ్నలు : మానసిక పరిపక్వత

గరికిపాటి గురజాడ, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

శ్లో. యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తి న కుత్రచిత్
ధర్మేచార్థే చ కామేచ మోక్షేచ భరతర్షభ.

'భారతంలో ఉన్నదే లోకంలో అంతటా ఉంది. భారతంలో లేనిది ఈ లోకంలో ఎక్కడా లేదు' అని వ్యాస మహర్షి భారతం ప్రారంభంలోనే చెప్పాడు. ఈ మాట ఆ కాలానికే కాదు, ఏ కాలానికైనా వర్తిస్తుంది. ఆంధ్ర మహాభారతంలో ఈనాడు మన జీవితం ఆదర్శప్రాయంగా సాగించడానికి అవసరమైన విషయాలు ఎన్నో ఉన్నాయి. ముఖ్యంగా రచించిన అరణ్యపర్వశేషంలో వచ్చే యక్షప్రశ్నల ఘట్టం అందుకు చక్కటి ఉదాహరణగా నిలుస్తుంది.

వనవాసంలో భాగంగా ద్వైతవనంలో ఉన్న పాండవుల వద్దకు ఒకనాడు ఒక విప్రుడు వచ్చి తన నిత్యానుషా'నానికి అవసరమైన అరణిని ఒక లేడి తీసుకుని పారిపోయిందని, అరణిని తిరిగి తెచ్చివ్వమని అడుగుతాడు. అప్పుడు పాండవులు ఆ లేడిని వెంబడిస్తూ దట్టమైన అడవిలోకి ప్రవేశిస్తారు. అలసిపోయి ఒక మఱ్ఱిచెట్టు కింద విశ్రమిస్తారు. అప్పుడు ధర్మరాజు నకులుడిని తాగడానికి నీళ్ళు తీసుకురమ్మని పంపిస్తాడు. నకులుడు ఒక తటాకాన్ని సమీపించి నీరు తాగబోతుండగా ఒక అశరీర వాణి వినిపిస్తుంది. "ఈ చెరువులో నీరు తాగాలంటే తాను అడిగే ప్రశ్నలకి సమాధానం చెప్పాలి" అని పలుకుతుంది. నకులుడు ఆ హెచ్చరికను చులకన చేసి నీళ్ళు తాగి అక్కడే పడిపోతాడు. నకులుడిని వెతుక్కుంటూ వచ్చిన సహదేవుడు, అర్జునుడు, భీముడు కూడా అనాలోచితంగా ప్రవర్తించి నీళ్ళు తాగి అక్కడే స్పృహ తప్పి పడిపోతారు.

తమ్ముళ్ళను వెతుక్కుంటూ వచ్చిన ధర్మరాజు చెరువు గట్టు వద్ద కూలిపోయి ఉన్న వాళ్ళను చూసి నిశ్చేష్టుడైపోతాడు. చాలాసేపు దుఃఖించి మనస్సుని క్రమంగా కుదుటపరుచుకుని వీరులు, పరాక్రమశూరులు అయిన తన తమ్ముళ్ళు ఇలా అయిపోవడానికి కారణమేమైవుంటుందని ఆలోచిస్తూ చెరువులోకి దిగుతాడు. అశరీరవాణి మళ్ళీ ధర్మరాజుని వారిస్తుంది. ధర్మరాజు ఆ అశరీరవాణి ఒక యక్షుడిదని తెలుసుకుంటాడు. పరిస్థితిని అర్థం చేసుకుని యక్షుడి ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి సిద్ధపడతాడు. తనకున్న అవగాహన మేరకు సమాధానాలు చెప్పగలనని యక్షుడితో పలుకుతాడు.

యక్షుడు వేసే ఎన్నో ప్రశ్నలకు ధర్మరాజు చాలా ఓపికగా, నేర్పుతో సమాధానాలు చెప్తాడు. అయితే, ప్రశ్నలు చాలా తికమక పెట్టేవి. సమాధానాలు కూడా విభిన్నంగా ఉండాలనేది షరతు. మహాభారతంలో ఈ ఘట్టం తరతరాల మేధావులను ఉర్రూతలూగించింది.

పోటీపరీక్షల్లో విజేతలయ్యేందుకు తపించిపోతున్న నేటితరానికి ఈ ఘట్టం గొప్ప పాఠాన్నే నేర్పిస్తుంది. ఒక ప్రశ్న ఇచ్చి దానికి నాలుగు సమాధానాలు ఇచ్చి సరైన జవాబును గుర్తించడానికి అవిశ్రాంతంగా శ్రమిస్తున్న విద్యార్థులకి ధర్మరాజు అత్యంత ఆదర్శంగా నిలుస్తాడు. నలుగురు తమ్ముళ్ళ శవాలను ఎదురుగా ఉంచుకుని కూడా చలించకుండా ప్రశ్నల సవాల్ ని స్వీకరించి మానసిక పరిపక్వతని చాటుకుంటాడు ధర్మరాజు. నాలుగు మార్గాలు ఉన్నప్పుడు ఒక మార్గాన్ని ఎంచుకోవడంలో గొప్పతనం లేదు. జీవితంలో ఏ మార్గం లేనప్పుడు కూడా ఒక నిర?యం తీసుకోవాలి అనే సందేశాన్ని తన నడవడిక ద్వారా నవతరాలకి అందిస్తున్నాడు ధర్మరాజు.

'Think Different' అనే నినాదంతో యువతరానికి ప్రతీరోజూ శిక్షణ ఇస్తున్న అత్యాధునిక సమాజానికి ధర్మరాజు ఇచ్చే సమాధానాలు నిరుపమానాలుగా నిలుస్తాయి. యక్షుడు అడిగే వైవిధ్యభరితమైన ప్రశ్నలకి ధర్మరాజు అత్యంత విభిన్నంగా సమాధానాలు ఇస్తాడు.

భూమికంటే ఉదాత్తమమైనది తల్లి, ఆకాశం కంటే ఉన్నతుడు తండ్రి అంటూ ధర్మరాజు చెప్పే సమాధానాలు అతడికి తల్లిదండ్రుల పట్ల ఉన్న అపారమైన ప్రేమని, గౌరవాన్ని సూచిస్తాయి.

తృణసమూహం కంటే విరివి అయినది - చింత, మరణించిన వాడికి చుట్టం చేసిన దానధర్మాలు, కీర్తికి ఆధారమైనది దానం, స్వర్గానికి మార్గం- సత్యం, సమస్త సుఖాలకు నెలవైనది- శీలం వంటి సమాధానాలు, సత్యం, శీలం, దానం ప్రతీ మనిషి జీవితంలో ఎంత ముఖ్యమైనవో తెలియజేయడమే కాకుండా మనిషికి తన ప్రాథమిక కర్తవ్యాన్ని గుర్తుచేస్తాయి.

ఏది వదిలిపెడితే సంతోషం కలుగుతుంది? అహంభావం, అన్ని ధర్మాల్లోకి మేటి ధర్మం అహింస, ఎప్పటికీ భగ్నం కానిది సజ్జనసహవాసం. ప్రశ్నలు కొన్ని సాధారణంగా ఉన్నా ధర్మరాజు మాత్రం ఎవ్వరి ఊహకి తట్టని సమాధానాలు ఇస్తాడు. యక్షుడు "దేనిని విడనాడితే మానవుడు సర్వజనులకు ఇష్టుడౌతాడు? శోకము లేనివాడౌతాడు? సంపన్నుడౌతాడు? సౌఖ్యం కలవాడు అవుతాడు"? అని అడిగితే ధర్మరాజు ఒక్క క్షణం కూడా ఆగకుండా "మనిషి గర్వాన్ని విడనాడితే అందరికీ ఇష్టుడౌతాడు, కోపాన్ని విడిస్తే శోకం దరిచేరదు, లోభాన్ని విడిచిపెడితే సంపన్నుడౌతాడు, ఆశని విడిస్తే సుఖంగా ఉంటాడు" అని సమాధానమిస్తాడు.

ఎవరు అందరికంటే ధనవంతుడు? అన్న ప్రశ్నకి ధర్మరాజు ఇచ్చిన సమాధానం అతడి మానసిక పరిపక్వతకి పరాకాష్ఠ. "ప్రియం, అప్రియం, సుఖం, దుఖం, భూత, భవిష్యత్, వర్తమానాలు ఎవరికి సమానములో అతడు అత్యంత ధనవంతుడు" అంటాడు ధర్మరాజు. ఎప్పుడూ మనిషి వెంటే ఉండేది ఏది? అనే ప్రశ్నకి ధర్మరాజు ఇచ్చిన సమాధానం యక్షుడినే కాదు పాఠకులని సైతం ఆశ్చర్యానికి లోనుచేస్తుంది. ఎల్లప్పుడూ మనిషి వెంటే ఉండేది అతడి గుండె ధైర్యం అంటాడు ధర్మరాజు. ఆ గుండె ధైర్యమే నలుగురు తమ్ముళ్ళ శవాలు ఎదురుగా ఉన్నా పరీక్షకి ధర్మరాజుని మానసికంగా సన్నద్ధం చేసింది. నిజానికి మనిషి మానసికంగా దృఢంగా ఉంటే ఎటువంటి సమస్యనైనా ఎదుర్కోగలడు, శరీరాన్ని పీడించే ఏ వ్యాధి నుంచైనా కోలుకోగలడు. తెలిసిన ప్రశ్నలు కావు. తన సమాధానాలపైనే తన తమ్ముళ్ళ జీవితం, తన భవిష్యత్తు ఆధారపడి ఉంది. అయినా ధర్మరాజు వెనకడుగు వేయలేదు, తన తమ్ముళ్ళలాగా అనాలోచితంగా ప్రవర్తించలేదు. ఆ తెగింపే తన విజయానికి బాటలు వేసింది. మనిషి ఎప్పుడైనా కష్టాలు ఎదురుకావద్దని కోరుకోకూడదు. వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని అలవర్చుకోవాలి. గెలిచినా, ఓడిపోయినా మనిషి తన ప్రయత్నాన్ని మాత్రం విరమించకూడదు.

ధర్మరాజు ఇచ్చిన సమాధానాలకు ఎంతో ఆశ్చర్యపోయిన యక్షుడు, ఒక తమ్ముడిని బ్రతికిస్తాను. ఎవరు కావాలో కోరుకోమంటాడు. ఆశ్చర్యకరంగా ధర్మరాజు ఒక క్షణమైనా ఆలోచించకుండా నకులుడిని బ్రతికించమని కోరుకుంటాడు. అప్పుడు యక్షుడు ధర్మరాజుతో "ఇన్ని ప్రశ్నలకి విభిన్నాతి విభిన్నంగా సమాధానాలు చెప్తే నువ్వు చాలా తెలివైనవాడివి అనుకున్నాను. త్వరలో కౌరవులతో యుద్ధం ఉంది. భీముడినో, అర్జునిడినో కోరుకుంటే అండగా ఉంటారు. నకులుడిని ఎందుకు కోరుకున్నావు"? అని ప్రశ్నిస్తాడు. ధర్మరాజు "యుద్ధం గురించి నేనెప్పుడూ ఆలోచించలేదు. ధర్మం గురించే నేనెప్పుడూ ఆలోచిస్తాను. మా తండ్రికి ఇద్దరు భార్యలుబీ కుంతి, మాద్రి. కుంతీసుతులలో పెద్దవాడిని నేను బ్రతికే ఉన్నాను. మాద్రి సంతానంలో మొదటి వాడు నకులుడు బ్రతకడం ధర్మం కదా!" అంటాడు. ధర్మరాజు ధర్మజ్ఞతకి తన్మయుడైన యక్షుడు నలుగురు తమ్ముళ్ళనీ బ్రతికిస్తాడు. ఆశ్చర్యపోయిన ధర్మరాజు, యమధర్మరాజే యక్షుడి రూపంలో వచ్చి తనని పరీక్షించాడని తెలుసుకుంటాడు. యమధర్మరాజు ధర్మరాజుని అనుగ్రహించి వరాన్ని ప్రసాదిస్తాడు. ధర్మరాజు విప్రుడి వద్ద లేడి అపహరించిన అరణిని ఇవ్వమని అడుగుతాడు. తర్వాత లేడి రూపంలో వచ్చింది కూడా యముడేనని తెలుసుకుంటాడు. యముడే అదనంగా అజ్ఞాతవాసంలో భాగంగా పాండవులు ఏ రూపాన్నైనా ధరించేవిధంగా వరాన్నిస్తాడు. ధర్మరాజు మాత్రం తన చిత్తం ఎల్లవేళలా ధర్మమందే లగ్నమయ్యేలా వరాన్ని ప్రసాదించమని కోరుకుంటాడు. అత్యంత ప్రతికూలమైన పరిస్థితుల్లో సైతం, పరీక్షని తట్టుకుని, జయించి, ఏ దశలోనూ గుండె ధైర్యాన్ని, స్వధర్మాన్ని విడనాడని వ్యక్తిగా భారతంలో ధర్మరాజు తరతరాలపై చెరగని ముద్ర వేస్తాడు. మనిషికి మానసిక పరిపక్వత ఉంటే ఏ రంగంలోనైనా వీరంగం ఆడడం ఖాయమనే విషయాన్ని యక్షప్రశ్నలు ఘట్టం మరొక్కసారి రుజువు చేసింది.

అత్యాధునిక యుగంలో సాంకేతికతకి బాగా దగ్గరగా నైతికమైన విలువలకి బాగా దూరంగా పెరుగుతున్న నేటి యువతరం ఒత్తిడికి లోనై మానసిక రుగ్మతలకు తలొగ్గుతోంది. చిన్నపాటి కష్టం రాగానే ఆత్మహత్యలకు పాల్పడుతున్నవారి సంఖ్య రోజు రోజుకీ పెరిగిపోతోంది. ఇటువంటి తరుణంలో యక్షప్రశ్నలు వంటి ఘట్టాలు మనిషికి మానసిక స్థైర్యాన్ని ప్రసాదిస్తాయి, జీవితంలో ఎదురయ్యే సవాళ్ళను ఎదుర్కోవడానికి కావలసిన ధైర్యాన్నిస్తాయి. మనిషి జీవించినంత కాలం ధర్మాన్ని విడనాడకుండా, దానధర్మాలు చేస్తూ నలుగురికీ సహాయపడుతూ జీవించడంలో ఉన్నంత ఆనందం, సంతృప్తి మరెందులోనూ లేదని ధర్మరాజు తన జీవితం ద్వారా నిరూపించాడు. ప్రతీ మనిషి మానసిక పరిపక్వతని కలిగి ఉంటే ఎటువంటి కష్టాన్నైనా తట్టుకుంటే, ఎంతటి క్లిష్ట పరిస్థితిలోనైనా విజయం తప్పక వరిస్తుంది అనే సందేశం కేవలం యక్షప్రశ్నల ఘట్టంలోనే కాదు, ఆంధ్ర మహాభారతంలో మరెన్నో ఘట్టాల్లో ధ్వనిస్తుంది.

# అనేకం

## సాహిత్య వ్యాస సంకలనం



భూక్యా గోపీ నాయక్

# అనేకం

## సాహిత్య వ్యాస సంకలనం

సంపాదకులు

భూక్యా గోపీ నాయక్

ప్రచురణ

భూక్యా పబ్లికేషన్స్,

గుంటూరు.

అనేకం

సాహిత్య వ్యాస సంకలనం

- భూక్యా గోపీ నాయక్,

అసిస్టెంట్ ప్రొఫెసర్,

డిపార్ట్మెంట్ ఆఫ్ తెలుగు,

పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల,

చిత్తూరు - 517 002.

సెల్ : 9989159196,

9493243034.

ప్రథమ ముద్రణ : 2017

© భూక్యా పబ్లికేషన్స్

ISBN : 978-81-927315-9-9

వెల : రూ. 200/-

ప్రచురణ : భూక్యా పబ్లికేషన్స్,

ISBN 978-81-927315-9-9

9 788192 731599

# విషయ సూచిక


1. బహుజనుల సంవేదన - 'అవేద' కవిత్వం — బి. మాధవీలత
2. రాయలసీమ దళిత నవలల్లో సాంస్కృతికాంశాలు — ఆర్. బాలిరెడ్డి
3. ఆధునిక కవిత్వంలో దళిత బాలికల సమస్యల చిత్రణ — సి. వేణుమాధవ్
4. బాలసాహిత్య భావుకుడు భరద్వాజ — అడపా కేధారి
5. అనంత జానపద కళారూపాలు - తోటబొమ్మలాట - ఒకపరిశీలన — డా॥ జింకా లక్ష్మీనారాయణ
6. సాక్షి సాహిత్యవ్యాసాలు - కవి జీవిత కావ్య విమర్శ — వేముల హర్షిత
7. శ్రీనాధుని కవితామార్గం — వేముల శరణ్య
8. "మెదక్ జిల్లా కవిత్వం - వస్తు విశ్లేషణం" — విట్టబోయిన వెంకటేష్
9. అస్తిత్వం - పరిశీలన — జెన్నే. యోగీశ్వర్ నాయుడు
10. "అతడు అడవిని జయించాడు" - ఒక పరిశీలన — సి. హిమాచలం
11. చివరకు నువ్వే గెలుస్తావు - కవితానైపుణ్యం — డాక్టర్ కోదండ లక్ష్మణ
12. అక్కినేని కుటుంబరావు నవలా సాహిత్యం - వస్తు వైవిధ్యం — కె.గౌరీశంకర్
13. గ్రామదేవతలు - పరిశీలన — మోహన జయలక్ష్మి
14. ఆంధ్ర మహాభారతం : ఆధునిక జీవితం — గరికిపాటి గురజాడ
15. మలుపు తిరిగిన రథచక్రాలు: స్త్రీల జీవిత చిత్రణ — జిల్లా కళ్యాణి
16. మెకంజీ కైఫీయత్తుల్లో పంచలింగాల ప్రస్తావన (కడపజిల్లా) — ఎం. లక్ష్మయ్య
17. నిడదవోలు మాలతిగారి కథలు విశ్లేషణ — యస్.లలిత
18. 'మాదిగ దండోరా' ఉద్యమ నేపథ్యమే నల్ల మిరియం చెట్టు — కట్టా సుబ్బారావు
19. యన్. రామచంద్ర కథలలో పాత్ర చిత్రణ - విశిష్టత — బాలినేని రాజేష్
20. కూచిమంచి తిమ్మకవి రచనలు : సంధి విజ్ఞానం — మల్లిపూడి రవిచంద్ర
21. సాహిత్యం - పర్యావరణ - వర్ణన — డా॥ టి. మాలకొండయ్య
22. ధూర్జటి శ్రీకాళహస్తీశ్వర శతక వైశిష్ట్యం — డా॥ ఎన్. అనిత మార్గరెట్
23. తెలుగు సాహిత్యంలో "సర్పం" — కొక్కిలిగడ్డ వాణి
24. తిరువళ్ళువర్ - తెలుగు కవుల జ్ఞానతత్వం: తులనాత్మక పరిశీలన — డా॥ డి. వేలాయుధం
25. తొండనాడు తెలుగుకతలు - వస్తువైవిధ్యం — ఆర్. బాలసుబ్రమణ్యం
26. భక్తవత్సలుడు - శ్రీవేంకటేశ్వరుడు — బసెట్టి ఉపేంద్ర
27. కృష్ణాజిల్లా, పామర్రు మండలం - స్త్రీల శ్రామిక గేయాలు — డి. భాగ్యవేణి
28. వాస్తవ జీవితాలకు అద్దం పట్టే లక్ష్మీరాఘవ గారి కథలు — డా॥ గుమ్మనూరు ఉషారాణి
29. సన్నెచోడుని 'కుమార సంభవము'లో తరువోజ ఛందస్సు — ఉషారాణి. పి, విజయ్‌కుమార్ బందారు

# ఆంధ్ర మహాభారతం: ఆధునిక జీవితం

– గరికిపాటి గురజాడ

పరిచయం:

'హితేన సహితం సాహిత్యం"– హితాన్ని చేకూర్చేది సాహిత్యం. సాహిత్యం యొక్క ప్రయోజనం అనంతమే, పరిధి అనంతమే. ఒక కాలం నాటి సాహిత్యం మరొక కాలానికి ఉపయోగపడదు అనుకుంటే పొరపాటు. తరాలు మారినా, యుగాలు మారినా సాహిత్యం ఎప్పుడూ హితాన్నే కోరుకుంటుంది. సాహిత్యం యొక్క ప్రాథమిక లక్ష్యం అదే, పరమార్థం కూడా అదే. ఈరోజు ఆధునికం అనుకున్నది కొంతకాలానికి ప్రాచీనం అవ్వక తప్పదు. సాహిత్యం ఒక కాలం నాటి పరిస్థితులకు అద్దం పట్టినా, ఎన్నో కాలాలకు అది మార్గదర్శకమే అవుతుంది.

కాలంతో పాటు కలం ఎప్పుడూ ప్రయాణిస్తూనే ఉంటుంది. భౌతిక, రాజకీయ, సాంఘిక, ఆర్థిక, భౌగోళిక పరిస్థితులు ఆ కలం యొక్క కదలికని ఎప్పటికప్పుడు ప్రభావితం చేస్తూనే ఉంటాయి. ఆ పరిస్థితులకి అనుగుణంగా కలం గళమెత్తుతుంటుంది. అయితే, ఒక నాటి అనుభవాలకు, చరిత్రకు సాక్షిగా నిలుస్తూ, విలువలను అందిస్తున్న సాహిత్యాన్ని ఆధునికత పేరుతో విస్మరిస్తే మనిషి తాను కూర్చున్న చెట్టు కొమ్మని తానే నరికేసుకున్నట్టే. "పాత క్రొత్తల మేలు కలయిక క్రొమ్మెరంగులు చిమ్మగా…" అని మహాకవి గురజాడ పలికినట్టు సాహిత్యంలో కూడా పాత కొత్తల మేళవింపు అవసరం.

ప్రాచీన తెలుగు సాహిత్యం అత్యాధునిక సమాజానికి సైతం ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుంది. మనం చేయవలసిందల్లా చూసే దృష్టిని మార్చుకోవడమే. ప్రాచీన తెలుగు సాహిత్యాన్ని అత్యాధునిక దృక్పథంతో వీక్షించడం అవసరం. ఆ సాహిత్యంలో ఉన్న మౌలికమైన విషయాలు, నైతికపు విలువలు, ఒత్తిడికి తలొగ్గి జీవితాలను చిన్నాభిన్నం చేసుకుంటున్న నేటి తరానికి మానసిక వైద్యం చేయగలవు. ఎన్నో శిక్షణ కేంద్రాలు చేయలేని పని ఒక చిన్న తెలుగు పద్యం చేయగలదు. చిన్న వయస్సులోనే తెలుగు పద్యాలు చదవడం, చదివించడం చేయగలిగితే సగటు మనిషికి జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు ఆ పద్యాలే పరిష్కార మార్గాలను సూచిస్తాయి.

కవిత్రయ భారతానికి ముందు కూడా సాహిత్యం ఉంది అనడానికి తగిన ఆధారాలు ఉన్నప్పటికీ, కవిత్రయ భారతానికి తెలుగు సాహిత్యంలో ఉన్న స్థానం విశిష్టమైనది. మొత్తం తెలుగు సాహిత్యానికి ఒక దిశానిర్దేశం చేసింది ఆంధ్ర మహాభారతమే.

'భారతంలో ఉన్నదే లోకంలో అంతటా ఉంది. భారతంలో లేనిది ఈ లోకంలో ఎక్కడా లేదు' అని వ్యాస మహర్షి భారతం ప్రారంభంలోనే చెప్పాడు. ఆ మాట ఆనాటి లోకానికే కాదు, ఈనాటి లోకానికి సైతం వర్తిస్తుంది. ఎందుకంటే రామాయణ, భారత, భాగవతాలు శాశ్వతమైన విలువల్ని ప్రకటించే గ్రంథాలు. అందువల్ల, మహాభారతంలో ఈనాడు మన జీవితం ఆదర్శప్రాయంగా సాగించడానికి అవసరమైన విషయాలు ఎన్నో ఉన్నాయి.

ముఖ్యంగా, పసితనం నుండి పట్టభద్రులయ్యే వరకు ఆంగ్ల మాధ్యమంలోనే చదువుకుని, భారతీయ సంప్రదాయాలకు,

సంస్కృతికి, సాహిత్యానికి, ప్రత్యేకించి తెలుగు సాహిత్యానికి దూరమైపోతున్న యువతరానికి ఆంధ్ర మహాభారతం గొప్ప జీవిత పాఠంగా నిలుస్తుంది.

History of Indian Literature అనే గ్రంథంలో వింటర్ నిట్జ్ గారి మాటలు ఇక్కడ ప్రస్తావించదగినవి. "It is in a very restricted sense that we may speak of the Maha Bharath as an Epic or a poem. Indeed in a certain sense the Mahabharath is not one poetic production as all, but rather, a whole literature."

'మనం ఒకానొక దృష్టితో భారతాన్ని కేవలం ఒక ఇతిహాసంగానో, కావ్యంగానో చూస్తుంటాం. కానీ, భారతం కేవలం ఒక కావ్యేతిహాసం మాత్రమే కాదు. అంతకు మించి అది యావత్ప్రపంచ సాహిత్యం'. సమాజాన్ని ప్రతిబింబించేదే సాహిత్యం. భారతం మొత్తం సాహిత్యానికి సరితూగేదే అయితే, దాంట్లో ఉండే సామాజికాంశాలు ప్రతీ సమాజానికీ వర్తిస్తాయి.

సీ. ధర్మతత్త్వజ్ఞులు ధరశాస్త్రంబని /యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతి విచక్షణుల్ నీతి శాస్త్రంబన / కవి వృషభులు మహాకవ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్య సంగ్రహమని / యైతిహాసికులితి హాసమనియు
పరమ పౌరాణికుల్ బహుపురాణ సముచ్చ / యంబని మహిఁ గొని యాడు చుండ

ఆ.వె. వివిధ వేదతత్త్వ వేది వేదవ్యాసు
దాదిముని పరాశరాత్మ జుండు
విషు? సన్నిభుండు విశ్వ జనీనమై
పరగుచుండఁజేసె భారతంబు. (ఆంధ్ర మహాభారతం.ఆది: 32)

భారతం ఒక్కొక్కరికి ఒక్కో విధంగా కనిపిస్తుంది. మనం ఏ దృష్టితో వెతికితే అలాగే కనిపిస్తుంది. ప్రతీ మనిషి తనని తాను భారతంలో చూసుకోవచ్చు. భారతానికి ఉన్న ప్రత్యేకత అటువంటిది. యావత్ప్రపంచ సాహిత్యంలో ఇటువంటి గ్రంథం లేదు అనడం అతిశయోక్తి కాదు.

'తింటే గారెలే తినాలి వింటే భారతమే వినాలి' అని ప్రసిద్ధి. ఈ మాట మనలో చాలా మంది అంటుంటారు. కానీ, దాని వెనుక ఉన్న ఆంతర్యం ఏంటో చాలా మందికి తెలియదు. ఈ మాటకి కొంత మంది 'గారెలు ఎంత తిన్నా ఇంకా తినాలనిపిస్తుంది. భారతం కూడా అటువంటిదే, ఎన్ని సార్లు విన్నా ఇంకా వినాలనిపిస్తుంది' అని అర్థం చెబుతుంటారు. నిజానికి గారెలు ఎంత ఇష్టమైన వారికైనా ఎక్కువ తింటే చిరాకు వస్తుంది. అందుకే, 'తినగా తినగా గారెలు గండరెక్కాయి' అంటారు. అసలు ఉద్దేశ్యం అది కాదు. గారెలకి ప్రత్యేకమైన రుచి అంటూ ఉండదు. గారెలు కమ్మగా ఉన్నాయి అంటాం. కానీ, కమ్మదనం షడ్రుచులలో ఒకటి కాదు.

గారెలు ఏ పదార్థంతో కలుపుకొని తింటే ఆ పదార్థంలానే రుచిస్తాయి. పైగా గారెలను పెరుగు, చారు, బెల్లం వంటి ఎన్నో పదార్థాలలో కలుపుకుని తింటారు.గారెలు పదార్థాన్ని బట్టి రుచించినట్టే, భారతం కూడా ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. భారతంలో ఏది వెతికితే అది దొరుకుతుంది. 'భారతంలో ఉన్నదే లోకంలో అంతటా ఉంది. భారతంలో లేనిది ఈ లోకంలో ఎక్కడా లేదు'. నేటి సమాజానికి అన్వయించుకోదగిన పద్యాలు ఆంధ్ర మహాభారతంలో ఎన్నో ఉన్నాయి.

ఆంధ్రమహాభారతం విరాట పర్వంలో తిక్కన రచించిన ఈ కింది పద్యం నేడు ఎన్నో కీలకమైన ప్రశ్నలకు సమాధానంగా కనిపిస్తుంది, ముఖ్యంగా మానసికంగా మనుషులను వేధిస్తున్న కొన్ని కీలకమైన సమస్యలకు మూలాలు ఎక్కడున్నాయో వివరిస్తుంది, పరిష్కారాన్ని సైతం సూచిస్తుంది.

శా. సింగం బాఉకటితో గుహాంతరమునం జేడ్పాటుమై నుండి మా
తంగసూర్జిత యూథ దర్శన సముద్యత్క్రోధమై వచ్చునో
జంగాంతార నివాసఖిన్నమతి న స్మత్సేనపై వీఁడెె వ
చ్చెం గుంతీసుత మధ్యముండు సమర స్థేమాభి రామాకృతిన్. (భారతం. విరాట. 4:95)

'పన్నెండేళ్ళ వనవాసం, రెండేళ్ళ అజ్ఞాత వాసం పూర్తయ్యాక అర్జునుడు, ఆకలితో గుహలో ఉన్న సింహం తానున్న గుహ ముందు ఏనుగుల గుంపు కనిపిస్తే ఒక్కసారిగా ఎలా దూకుతుందో, అలా కౌరవసేనపైకి దూకాడు' అని ఈ పద్యంలో తిక్కన గారు అర్జునుడి ప్రతాపం గురించి వర్ణించారు.

లోతుగా పరిశీలించి, ఈ కాలానికి ఈ పద్యాన్ని అన్వయిస్తే, నేటి యువతరం ప్రవర్తన వెనుక ఉన్న కారణాలు కనిపిస్తాయి. పాఠశాలలో చేర్చింది మొదలు సుమారుగా పద్నాలుగేళ్ళు పిల్లల్ని ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా పెంచి, వాళ్ళని రోజంతా చదువు పేరు మీద రుబ్బేయడం ఈ రోజుల్లో సర్వ సాధారణమైపోయింది. వారికి చదువు తప్ప వేరే లోకం తెలియనట్టుగా పెంచేసరికి వారు ఒత్తిడికి గురవుతున్నారు. ఈ విద్యావిధానం వారి ప్రవర్తనపై తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోంది. ఆ ఒత్తిడిని తట్టుకోలేక వారిలో పైశాచిక ధోరణి ప్రబలుతోంది. ఈనాడు ముఖ్యంగా విద్యార్థి లోకంపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తున్న Ragging వంటి వాటికి ఈ పైశాచిక ధోరణే ప్రధాన కారణంగా కనిపిస్తోంది.

నైతికమైన విలువలను పిల్లలకు బోధించడంలో ఈనాటి విద్యావిధానం సఫలీకృతం కాలేకపోతోందన్నది కాదనలేని సత్యం. సాధారణంగా వ్యవస్థతో పాటే విద్యావిధానం కూడా ఆధునీకీకరించబడుతుంది. అది అనివార్యం. కానీ, నైతికమైన విలువలు ఈతరానికి అందించడంతో పాటు ఒత్తిడి లేని విద్యా విధానాన్ని ప్రవేశపెట్టకపోతే పరిస్థితి మరింత విషమిస్తుంది. పిల్లల ప్రవర్తనని చాలా జాగ్రత్తగా మలచాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, గురువులపై ఉంది. మార్కుల పేరు చెప్పి పిల్లల్ని మూరు?లుగా తయారు చేయకూడదు. గెలుపోటములు రెండింటినీ సమానంగా తీసుకోగలిగేలా పిల్లల్ని తీర్చిదిద్దాలి. అప్పుడే జీవితంలో ఎన్ని ఒడుదిడుకులు ఎదురైనా వారి ఆలోచనలు వారిని పక్కదోవ పట్టనియ్యవు. ఏది చేయాలో ఏది చేయకూడదో నిరయించుకునే విచక్షణాజ్ఞానం వారి నడవడికను ఎప్పటికప్పుడు సరిచేస్తుంటుంది.

ప్రాథమిక విద్యలో వ్యక్తిత్వ వికసాన్ని పెంపొందించే మన కావ్యాలనీ, వాటిలోని పద్యాలని ఎక్కువగా బోధిస్తే, జీవితంలో ఒక్కొక్క సంఘటన ఎదురవుతుంటే మస్తిష్కం ఒక్కొక్క పద్యాన్ని ఉటంకిస్తూ ఊరటనిస్తుంది, దిశానిర్దేశం చేస్తుంది. పిల్లల్ని చిన్నప్పటినించి జైల్లో పెట్టినట్టు చదువు పేరు చెప్పి బంధించేస్తే, డిగ్రీ చదివే సమయానికి ఒక్కసారిగా అంత స్వేఛను చూసేసరికి, వారి ప్రవర్తనలో వింత మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రత్యక్షంగా చెప్పకపోయినా పరోక్షంగా తిక్కన నేటి సమస్యకి మూలాలు ఎక్కడున్నాయో పైపద్యంలో చెప్పారు. సరిగ్గా అన్వయించుకోవాలే కానీ ఆంధ్ర మహాభారతంలో ఎన్నో పద్యాలు నేటి సమాజంలో కీలకమైన సమస్యలకు పరిష్కారాలుగా కనిపిస్తాయి.

చ. నుతజల పూరితంబులగు నూతులు నూటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలుబీ మరి బావులు నూటికంటె నొక్కస
త్క్రతువది మేలుబీ తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలుబీ త
త్సుత శతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడఁగన్ (భారతం. ఆది. 4:94).

ఆదికవి నన్నయ రచించిన ఆంధ్ర మహాభారతంలోని ఈ పద్యం ఎంతో గొప్ప సందేశాన్ని ఇస్తుంది. 'మంచినీటితో నిండిన చేదుడు బావులు నూరిటి కంటే ఒక దిగుడుబావి మేలుబీ కాగా, బావులు నూరిటి కంటే ఒక మహాయజ్ఞం మేలుబీ అటువంటి నూరు మహాయజ్ఞాలు కంటే ఒక పుత్రుడు మేలుబీ అట్టి పుత్రులు నూరుమంది కంటే ఒక సత్యవాక్యం మంచిది'.

సత్యం మాట్లాడడంలో ఉండే గొప్పతనం గురించి నన్నయ పై పద్యంలో చెప్పాడు. ఈ ఒక్కటే కదా అనుకుంటూ మనం రోజూ కొన్ని వందల అబద్ధాలు చెప్పేస్తుంటాం. వాటి వల్ల జరిగే నష్టం పెద్దగా ఏం లేదు అనుకుంటాం. కానీ, అది ఇతరుల ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని గ్రహించం. మన చుట్టూ ఉండేవారు కూడా అందరూ చేసేదే కదా అని, అబద్ధాలు చెప్పేస్తుంటారు. ఇది ముఖ్యంగా పిల్లల్నీ, యువతరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. నిజానికి, సమాజంలో జరిగే ప్రతీ మోసం వెనుక ఉన్నవి అబద్ధాలే.

చిన్న చిన్న అబద్ధాలే అలవాటుగా మారి, ఎప్పుడూ సత్యాన్ని బయటకు రానివ్వవు. మనం నిజం మాట్లాడేది అవతల వారి మెప్పు కోసం కాదు, మన ఆత్మ సంతృప్తి కోసం అనే విషయాన్ని గ్రహించడం చాలా ముఖ్యం. ఎన్ని కష్టాలు ఎదురైనా హరిశ్చంద్రుడు తన జీవితం మొత్తం సత్యాన్ని విడవలేదు. అందుకే 'సత్యం' ఇంటిపేరుగా హరిశ్చంద్రుడి ముందు ఒదిగిపోయింది. తన జీవితం మొత్తం గాంధీగారు సత్యం మాట్లాడడంలో ఉండే సంతృప్తి గురించే బోధించారు. సత్యమార్గంలో నడిచేవారికి ముందు కష్టాలు తప్పవు. అబద్ధాలు అప్పటికి హాయిగా అనిపించినా దీర్ఘకాలికంగా తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. కానీ, అంతిమంగా జయించేది సత్యమే. సత్యాన్ని నమ్ముకుని వారి దైనందిన జీవితాల్లో ఆచరించిన వారి గురించి మనం నేటికీ మాట్లాడుకుంటున్నామంటే సత్యం ఎంత గొప్పదో అర్థం అవుతుంది.

మనం కూడా మన నిత్య జీవితంలో నిజాలే మాట్లాడితే అది అలవాటుగా మారడమే కాకుండా మన చుట్టూ ఉన్నవారికి సైతం స్ఫూర్తిని కలిగిస్తాయి. ఇప్పటి యువతరం ఈరోజు ఆనందంగా ఉండడం కోసం ఏదైనా చేయవచ్చు అనే భావనలో ఉన్నారు. ఆనందంగా
ఉండడం తప్పు కాదు. హరిశ్చంద్రుడు ఆ రోజు కోసం బతికి ఉంటే, అప్పటి సుఖాన్నే కోరుకుని ఉంటే, ఈనాటి సమాజానికి స్ఫూర్తిగా నిలిచేవాడా? మనం నిజాలే మాట్లాడడం వల్ల నేటి యువతరం సత్యం మాట్లాడడంలో ఉండే సంతృప్తి గురించి, గొప్పతనం గురించి ఆలోచిస్తారు.

**ఉ. రాజగృహంబుకంటె నభిరామముగా నిలుగట్టఁ గూడ దే**
**యోజ నృపాలుఁ డాకృతికిబీ నొప్పగు వేషము లాచరించు నే**
**యోజ విహారముల్ సలుపబీ నుల్లమునం గదు వేడ్క సేయు నే**
**యోజ విదగ్ధుఁ డై పలుకుబీ నొద్దులకుం దగ దట్లు సేయఁగన్. (భారతం. విరాట: 1 : 123).**

'రాజుగారి భవనం కంటే రాజోద్యోగి ఇల్లు అందంగా ఉండకూడదు. రాజుగారితో సమానంగా దర్పం ప్రదర్శించేలా ఉద్యోగి వస్త్రధారణ చెయ్యకూడదు. రాజుగారు విహరించే ప్రదేశాల్లో తానూ విహరించాలని ఉబలాట పడకూడదు. రాజు మాటల్లో కనబడే లౌక్యం, తెలివితేటలు ఉద్యోగి మాటల్లో ఉండవలసిన అవసరం లేదు'.

పాండవుల పురోహితుడైన ధౌమ్యుడు, పంచపాండవులకు ఉద్యోగిధర్మాలు బోధిస్తూ చెప్పిన మాటలివి. నేటి ఉద్యోగులు సైతం ఈ మాటలు వర్తిస్తాయి. సంస్థ యజమాని ఇంటి కంటే సంస్థలో పని చేసే ఉద్యోగి ఇల్లు

కొంచెం తక్కువ స్థాయిలోనే ఉండడం మంచిది. సొంత ఆస్తులతో కట్టుకున్నదే అయినా అది చూడగానే యజమాని మనస్సులో అసూయతో పాటు; అనుమానం కూడా పుట్టే అవకాశం ఉంది. వేషం కూడా అంతే. ఆధునికంగా ధరించే సూటు, బూటు వంటి వాటిల్లో కూడా యజమాని కంటే ఒక్క రవ్వ తక్కువ అందంగా కనిపించడమే మంచిది. యజమాని దంపతులు ఏదైనా విహారయాత్రకు పిలిచినా వారితో వెళ్ళకూడదు.

ఒక వేళ, తెలియక వెళ్ళినా వారు ప్రథమ శ్రేణిలో ప్రయాణం చేస్తే ఉద్యోగి కొంచెం తక్కువ శ్రేణిలో ప్రయాణించాలి. లేకపోతే అపార్థాలు పెరిగే అవకాశం ఉంది. చివరిదైనా చిన్నది కాని మాట– యజమాని ఎదుట, ముందు వెనుక ఆలోచించకుండా తన భావాలు వ్యక్తం చేయడం, అధికారి ముందు అనవసరంగా అధికంగా మాట్లాడడం చేయకూడదు. ఆ మాటల్లోంచే ఉద్యోగి బలహీనతలు కనిపెట్టి అదును చూసి యజమానులు ఆడిస్తారు. వివాదాస్పద విషయాల్లో ముందు అధికారి అభిప్రాయం తెలుసుకొని దానికి అనుగుణంగా మాట్లాడడం మంచిది.

ఆంధ్ర మహాభారతంలో మరెన్నో పద్యాలు ఆధునిక సమాజానికి దిశానిర్దేశం చేయగలవు. ఆంధ్ర మహాభారతంపై ఎన్నో పరిశోధనలు వచ్చినా కొత్తవి వస్తూనే ఉన్నాయి, ఇంకా వస్తాయి. అది ఒక్కొక్కరికి ఒక్కోలా అర్థమవుతుంది. ఆంధ్ర మహాభారతంపై సామాజిక దృష్టితో మరిన్ని పరిశోధనలు రావలసిన అవసరం ఎంతైనా ఉంది. అలాంటి పరిశోధనలే నేటి సమాజానికి సరైన దిశానిర్దేశం చేస్తాయి.

**గరికిపాటి గురజాడ**
పిహెచ్.డి. పరిశోధక విద్యార్థి
హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం
చరవాణి: 9010176407
విద్యుల్లేఖ: gurajada.garikipati@gmail.com

# ఆంధ్రభారతి

# ANDHRA BHARATHI

## వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య వైభవం

### అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

### 2 & 3 ఏప్రియల్ 2018

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం సౌజన్యంతో

A SPECIAL ISSUE ON "THE GLORY AND POMP OF ONE THOUSAND YEARS OLD TELUGU LITERATURE

NATIONAL SEMINAR RESEARCH PAPERS
HELD ON 2, 3 APRIL 2018.




తెలుగు విభాగం

యస్.వి.కె.పి. & డా॥ కె.యస్. రాజు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల

Recognised by UGC as "College with Potential for Excellence" Accredited by NAAC with Grade "A"

పెనుగొండ - 534 320. ప॥గో॥జిల్లా. ఆంధ్రప్రదేశ్

# ఆంధ్రభారతి

వెయ్యేళ్ళ తెలుగు సాహిత్యంపై అంతర్జాతీయ సదస్సు జరిగిన సందర్భంగా ప్రచురించిన

## ప్రత్యేక సంచిక

## 2 & 3 తేదీలు, ఏప్రియల్ 2018

**Volume - II**


గౌరవ సంపాదకులు

**డా॥ నడింపల్లి సూర్యనారాయణరాజు, పిహెచ్.డి.,**

ప్రిన్సిపాల్ & చైర్మన్

ప్రధాన సంపాదకులు

**డా॥ రంకిరెడ్డి రామమోహనరావు, ఎం.ఏ. పిహెచ్.డి.,**

రీడరు & తెలుగుశాఖాధ్యక్షులు

సంపాదకులు

**డా॥ కె.వి.యన్.డి.వరప్రసాద్, ఎం.ఏ. పిహెచ్.డి.,**

సహాయ ఆచార్యులు, తెలుగుశాఖ

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం



**తెలుగు విభాగం**

**యస్.వి.కె.పి. & డా॥ కె.యస్.రాజు ఆర్ట్స్ & సైన్స్ కళాశాల**

College with Potential for Excellence *** Accredited by NAAC with 'A' grade

పెనుగొండ - 534 320, ప॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్.

International Seminar papers on 'The Glory and Pomp of One Thousand Years Old Telugu Literature' named as a **"Andhra Bharathi"**

First Edition : 2018
Copyright © Chief Editor

Hon'ble Editor : **Dr. N. Suryanarayana Raju**

Chief Editor : **Dr. R. Rama Mohana Rao**

Editor : **Dr. K.V.N.D. Varaprasad**

ISBN No. **978–93–5300–753–9**

Copies : **500**

Price : Rs.**300/-**

D.T.P. :
**Rama Krishna Koppula**
**Cell: 94947 20463 & 94915 74733**

Cover page design:
**S.R. DTP**
**Rajahmundry**
**Cell: 99669 32012**

Publisher:
**Department of Telugu**
**S.V.K.P. & Dr. K.S. Raju Arts & Science College**
**Penugonda – 534 320, W.G.Dist. A.P.**

Printers :
**S.R. DTP**
**Rajahmundry**
**Cell: 99669 32012**

For Copies :
**Department of Telugu**
**S.V.K.P. & Dr. K.S. Raju Arts & Science College**
**Penugonda – 534 320, W.G.Dist. A.P.**

International Seminar papers on 'The Glory and Pomp of One Thousand Years Old Telugu Literature' named as a **"Andhra Bharathi"**

First Edition : 2018
Copyright © Chief Editor

Hon'ble Editor : **Dr. N. Suryanarayana Raju**

Chief Editor : **Dr. R. Rama Mohana Rao**

Editor : **Dr. K.V.N.D. Varaprasad**

ISBN No. **978–93–5300–753–9**

Copies : **500**

Price : Rs.**300/-**

D.T.P. :
**Rama Krishna Koppula**
**Cell: 94947 20463 & 94915 74733**

Cover page design:
**S.R. DTP**
**Rajahmundry**
**Cell: 99669 32012**

Publisher:
**Department of Telugu**
**S.V.K.P. & Dr. K.S. Raju Arts & Science College**
**Penugonda – 534 320, W.G.Dist. A.P.**

Printers :
**S.R. DTP**
**Rajahmundry**
**Cell: 99669 32012**

For Copies :
**Department of Telugu**
**S.V.K.P. & Dr. K.S. Raju Arts & Science College**
**Penugonda – 534 320, W.G.Dist. A.P.**

# విషయ సూచిక


1. శ్రీనాథయుగసాహిత్యం - ఆహారపానీయాలు - **రాంభట్ల వేంకటరాయశర్మ** 1-4
2. తెలుగుజాతి మెచ్చిన కథకుడు శ్రీరమణ - **కంపసాటి ఉదయలక్ష్మి** 5-7
3. రణగొణధ్వనులు (దీర్ఘకవిత) - సామాజికత - **కూకట్ల హనుమంతరావు** 8-12
4. కరుణశ్రీ పుష్ప విలాపం - సమాజ హితం - **డా॥ వై.వి.సిహెచ్. లీలా పద్మజ** 13-15
5. వందేళ్ళ తెలంగాణచరిత్ర-సంస్కృతికి నిలువెత్తుసాక్ష్యం-కాళోజీ - **అగపాటి రాజ్‌కుమార్** 16-18
6. కాకతీయ విశ్వవిద్యాలయం - తెలుగు శాఖ పరిశోధన - **డా॥ కర్రె సదాశివ్** 19-22
7. నాగార్జున సాగరము - కవితా వైశిష్ట్యము - **డా. కె.ప్రభాకర్‌రెడ్డి** 23-26
8. వెయేళ్ళ తెలుగు సాహిత్యంలో - స్త్రీ - **డా. ఎన్.సంధ్యారాణి** 27-29
9. నిడదవోలు మాలతి కథలు - వస్తు విశ్లేషణ - **డా॥ పలివెల చిరంజీవిరావు** 30-33
10. డాక్టర్ నాయని కృష్ణకుమారి సాహితీ జీవితం - **మురహరరావు ఉమాగాంధి** 34-37
11. బోయ జంగయ్య జీవితం - సమగ్ర సాహిత్య పరిశీలన - **డా॥ తాళ్ళపల్లి యాకమ్మ** 38-41
12. మధుర కవి - **డా॥ శ్రీపాద సీతామహాలక్ష్మి సత్యవతీ పేరమాంబ** 42-46
13. రాజా మంత్రిప్రెగడ భుజంగరావుబహదూర్ జమిందార్‌గారి రచనల్లో వార్ధక్యం, వేదాంతం **- డా॥ గురజాడ శోభా పేరిందేవి** 47-51
14. విశ్వవిద్యాలయాలు-తెలుగు సాహిత్యాభివృద్ధి(1917-2017) **- డా॥ గోవిందారం వెంకటరాజం** 52-56
15. తెలుగు రచయితలు-రచనల పరిచయం (1022-2017) - **డా॥ సుమలత సనాతన** 57-63
16. వెయ్యేళ్ళ తెలుగు సాహిత్య వైభవం - వచనకవిత పరిణామం : డా॥ సి.నా.రె. సాహిత్యం - **అన్నపూర్ణ బత్తుల** 64-67
17. ఆంధ్ర మహాభారతం: వ్యక్తిత్వ వికాసం - **గరికిపాటి గురజాడ** 68-71
18. తెలుగు సాహిత్యానికి పాలమూరు సాహితి సంస్థ సేవ -**డా॥ భీంపల్లి శ్రీకాంత్** 72-74
19. అగరం వసంత్ గారి కథల్లో - వస్తువైవిధ్యం - **కె.సతీష్ కుమార్** 75-78
20. మధునాపంతుల వేంకట పరమయ్య గారి సాహిత్య కృషి - **డా॥ గుర్లింక ధర్మరాజు** 79-83
21. శ్రీమద్భాగవతం - ఉత్తమశిష్యులు - **డా॥ రొట్ట గణపతిరావు** 84-88
22. హేమలతా లవణం సామాజికత - **యం.శంకరబాబు** 89-91
23. అనిరుద్ధ చరిత్ర పరిచయం - **శ్రీమతి వి.ఎ.ఎస్. శారదా కుమారి** 92-96
24. కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీ నరసింహం - **మణినాథ్ కోపల్లె** 97-102
25. గురజాడ కవిత్వం - సమకాలీనత - **రచ్చ సుమతీదేవి** 103-106
26. ప్రపంచీకరణ నేపథ్యంలో అంతర్జాలం-నేటి విద్యావిధానం-**డా॥ పెద్దింటి ముకుందరావు** 107-110
27. కవయిత్రి మొల్ల 'రామాయణం' - అభివ్యక్తి నైపుణ్యం - **డా॥ పి.వి. లక్ష్మణరావు** 111-116
28. తెలుగు పరిశోధన సేవా రథానికి జోడు గుర్రాలు పాశ్చాత్యపరిశోధకులు, దేశీయ పండితులు - **డా॥ జి. ప్రకాశరావు** 117-121
29. మానత్వపు మార్గ నిర్దేశిక "పథేర్ పాంచాలి" - **డా॥ జె. సీతాపతిరావు** 122-126
30. ఎండ్లూరి మానస కథలు - దళిత వస్తు వైవిధ్యం - **డా॥ సి.సరళాదేవి** 127-131

ISBN : 978-93-5300-753-9

# 17. ఆంధ్ర మహాభారతం: వ్యక్తిత్వ వికాసం

గరికిపాటి గురజాడ
పిహెచ్. డి. పరిశోధక విద్యార్థి(తెలుగు శాఖ)
హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం
చరవాణి: 9010176407
విద్యుల్లేఖ: gurajada.garikipati@gmail.com

యావత్ప్రపంచ సాహిత్యంలో భారతీయ సాహిత్యానికి ఒక ప్రత్యేకమైన స్థానం ఉంది. అందులో తెలుగు సాహిత్యం మరింత ప్రత్యేకమైనది.ఎంతో మంది కవులు ఎన్నో ప్రక్రియల ద్వారా మన సాహిత్యాన్ని సుసంపన్నం చేశారు. అడుగడుగునా వైవిధ్యంతో తెలుగు సాహిత్యం మిగతా భాషల సాహిత్యం కంటే ఎంతో విభిన్నంగా కనిపిస్తుంది. నన్నయతో మొదల్కొని నేటి కవుల వరకూ అందరూ వివిధ ప్రక్రియాల్లో ఎన్నో రచనలు చేశారు. మార్గాలు వేరైనా ప్రతీ ఒక్కరూ సమాజానికిఏదో ఒక రకంగా మంచి చేయడానికే రచనలు చేశారు.

వ్యక్తిత్వ వికాసానికి భారతీయ సాహిత్యం చిరునామా అయితే, మన తెలుగు సాహిత్యం యావతా రతీయ సాహిత్యానికే తలమానికమైనటువంటిది. వ్యక్తిత్వం వికసించే దిశగా మన సాహిత్యం ఎంతగానో తోడ్పడుతుంది. ముఖ్యంగా మన ప్రాచీన సాహిత్యం, మన ప్రాచీన కావ్యాలు వ్యక్తిత్వ వికాసంపైనేఎక్కువగాద ృష్టి సారించాయి. కొన్ని కావ్యాల్లో అది ప్రత్యక్షంగా కనిపిస్తే, కొన్నింటిలో అది పరోక్షంగా ధ్వనిస్తుంది.

ఈ కాలం వారికి పద్య సాహిత్యం చదవడానికి కష్టంగా అనిపించినా, ఇష్టంతో చదివితే వ్యక్తిత్వ వికాసానికి ప్రాచీన సాహిత్యం ఎంతగానో దోహదపడుతుంది.ప్రాచీన సాహిత్యం 'నారికేళ పాకం' వంటిది. కాస్త శ్రమిస్తే గొప్ప జ్ఞానాన్ని పొందగలుగుతాం. ఈ రోజుల్లో మనం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలను మన కవులు దూర ద ృష్టితో ముందే ఊహించి వాటికి పరిష్కారాలను వారి రచనల్లో సూచించారు. కవిత్రయ భారతం మొదల్కొని ప్రాచీన సాహిత్యంలో ఎన్నో కావ్యాల్లో వ్యక్తిత్వ వికాసానికి దోహదం చేసే అంశాల గురించి విస్తారమైన చర్చ కనిపిస్తుంది.

వ్యక్తిత్వ వికాసం అనేది ఏదో ఒక రంగంలో మనిషి ప్రగతిని సూచించేది కాదు. రకరకాల కోణాల్లో మనిషి సాధించే అభివ ృద్ధి వ్యక్తిత్వ వికాసం. తనలో ఉన్న చిన్నపాటి లోపాలను సైతం సవరించుకొని సంపూర్ణమైన వ్యక్తిగా మనిషి ఎదగడమే వ్యక్తిత్వ వికాసం. మన తెలుగు పద్యాల్లో ఒకవ్యక్తి సంపూర?ంగా ఎదగడానికి ఏవి అవసరమో చెప్పడమే కాకుండా, వ్యక్తి ఎదుగుదలకు ఉన్న అడ్డంకులను, వాటి మూలాలను వివరించి పరిష్కారాలు సైతంసూచించారు మన ప్రాచీన తెలుగు కవులు.

 ISBN : 978-93-5300-753-9

వ్యక్తిత్వ నిర్మాణంలో సత్యభాషణం చాలా ముఖ్యమైనది. 'సత్యం' చాలా గొప్పది, కఠినమైనది. సత్యానికి కట్టుబడి ఉండడం వల్ల ముందు కొన్ని కష్టాలు వచ్చినా, అంతిమంగా విజయం తప్పక వరిస్తుంది. సత్యం ఎంత గొప్పదో ఈ కింది పద్యం వివరిస్తుంది. (భారతం.ఆది. 4:94)

చ. నుతజలపూరితంబు లగు నూతులు నూటికంటె సూనృత
వ్రత! యొక బావి మేలుబీ మరి బావులు నూటికంటె నొక్కస
త్క్రతువది మేలుబీ తత్క్రతుశతంబునకంటె సుతుండు మేలుబీ త
త్సుత శాతకంబుకంటె నొక సూనృతవాక్యము మేలు సూడఉగన్

ఆదికవి నన్నయ రచించినఆంధ్ర మహాభారతంలోని ఈ పద్యం ఎంతో గొప్ప సందేశాన్ని ఇస్తుంది. 'మంచినీటితో నిండిన చేదుడు బావులు నూరిటి కంటే ఒక దిగుడుబావి మేలుబీ కాగా, బావులునూరిటి కంటే ఒక మహాయజ్ఞం మేలుబీ అటువంటి నూరు మహాయజ్ఞాలు కంటే ఒక పుత్రుడు మేలుబీ అట్టి పుత్రులు నూరుమంది కంటే ఒక సత్యవాక్యం మంచిది'.

సత్యం మాట్లాడడంలో ఉండే గొప్పతనం గురించి నన్నయ పై పద్యంలో చెప్పాడు. ఈ ఒక్కటే కదా అనుకుంటూ మనం రోజూ కొన్ని వందల అబద్ధాలు చెప్పేస్తుంటాం. వాటి వల్ల జరిగే నష్టం పెద్దగా ఏం లేదుఅనుకుంటాం. కానీ, అది ఇతరుల ప్రవర్తనను ప్రభావితం చేస్తుందని గ్రహించం. మన చుట్టూ ఉండేవారు కూడా అందరూ చేసేదే కదా అని వాళ్ళు కూడాచాలా తేలికగా అబద్ధాలు చెప్పేస్తుంటారు. ఇలాఅబద్ధాలు చెప్పడం ముఖ్యంగా పిల్లల్ని, యువతరాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తుంది.

చిన్న చిన్న అబద్ధాలే అలవాటుగా మారి, ఎప్పుడూ సత్యాన్ని బయటకు రానివ్వవు. మనం నిజం మాట్లాడేది అవతల వారి మెప్పు కోసం కాదు, మన ఆత్మ సంతృప్తి కోసం అనే విషయాన్ని గ్రహించడం చాలా ముఖ్యం. ఎన్ని కష్టాలు ఎదురైనా హరిశ్చంద్రుడు తన జీవితం మొత్తం సత్యాన్ని విడవలేదు. అందుకే'సత్యం' హరిశ్చంద్రుడి ఇంటిపేరుగా స్థిరపడిపోయింది. తనజీవితంమొత్తం గాంధీగారు సత్యం మాట్లాడడంలో ఉండే సంతృప్తి గురించే బోధించారు.

సత్యమార్గంలో నడిచేవారికి ముందు కష్టాలు తప్పవు. అబద్ధాలు అప్పటికి హాయిగా అనిపించినా దీరకాలికంగా తీవ్రమైన దుష్ప్రభావాన్ని చూపిస్తాయి. కానీ, అంతిమంగా జయించేది సత్యమే. సత్యాన్ని నమ్ముకుని వారి దైనందిన జీవితాల్లో ఆచరించిన వారి గురించి మనం నేటికీ మాట్లాడుకుంటున్నా మంటే సత్యం మాట్లాడడంలోఉండే సంతృప్తి ఏంటో అర్థం అవుతూనే ఉంది. ఎప్పుడూ సత్యాన్నే నమ్ముకునే వారి వ్యక్తిత్వాలు చిరకాలం నిలిచిపోతాయన్న విషయం కుడా స్పష్టమవుతోంది. మనం కూడా మన నిత్యజీవితంలో నిజాలే మాట్లాడితే అది అలవాటుగా మారుతుంది. మన చుట్టూ ఉన్నవారికి సైతం సూర్తిని కలిగిస్తుంది.

ISBN : 978-93-5300-753-9

'ఈ కాలంలో మంచికి రోజుల్లేవు', 'సత్యం మాట్లాడితే బ్రతకలేం' అని మనలో చాలామంది అంటుంటారు. మంచికి రోజులు ఉన్నాయో లేదో నిర?యించేది ఎవరు? మనమే. మనుషులు స్వతఃసిద్ధంగా బద్ధకస్తులు. వారికున్న బద్ధకాన్ని సమూహానికి మప్పేసి సంత ృప్తి పడుతుంటారు. వారి చేతగానితనాన్ని పరిస్థితులుబాలేవు అంటూ, సమాజంపై తోసేసి సమర్థించుకుంటూ ఉంటారు. అందరూ సత్యమే మాట్లాడితే మంచికి రోజులు ఎందుకుండవు? మనుషులకి మాట్లాడడంలో, వాదించడంలో ఉండే ఆసక్తి ఆచరించడంలో ఉండదు. 'ఆ! మనం ఒక్కరం చేస్తే ఈ సమాజం మారుతుందా?' అంటూ చేతులు దులిపేసుకుంటే ఈ సమాజం ఇలాగే ఉంటుంది. మనం ఆచరించడం అనేది మన సంత ృప్తికి సంబంధించిన విషయం.'సత్యమేవ జయతే' అని జాతీయ చిహ్నంపైనైతేరాసుకున్నాం కానీ, మనమే సమష్టిగా సత్యాన్ని ఓడిపోయేలా చేస్తున్నాం. ఇదిభారతీయతకి గొడ్డలిపెట్టు.

ఎప్పటికైనా సరే సత్యమార్గంలో నడిస్తేనే ఉన్నతమైన వ్యక్తిత్వాన్ని సాధించగలుగుతాం. మనం చేసే తప్పులకి వ్యవస్థనినిందించడం సరి కాదు. వ్యవస్థ అంటే మనుషులందరూ కలిసిందే. ఏ దేశమైనా గొప్పది ఎలా అవుతుంది? ఆ దేశ పౌరులుగొప్పవారైనప్పుడే. అందుకే సత్యమార్గంలో నడిచి ప్రతీ ఒక్కరు వారి వ్యక్తిత్వాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలి. అప్పుడే మన మువ్వన్నెల జెండా సగర్వంగా భారత దేశపు కీర్తి పతాకమై రెపరెపలాడుతుంది.

నిర్వహణ సామర్థ్యం (Managing Ability) వ్యక్తిత్వ వికాసంలో అత్యంత కీలకమైన విషయం. కేవలం సరైన నిర్వహణ లేకే ఇవాళ మనుషులు సమస్యలతో సతమతమవుతున్నారు. చిన్నపాటిమార్పులు చేసుకుంటే ఎటువంటి సమస్యనైనా పరిష్కరించగలిగే నేర్పు మనిషి సొంతమవుతుంది.

ఉ. రాజగ ృహంబుకంటె నభిరామముగా నిలుగట్టఁ గూడ దే
యోజ నృపాలుఁ డాక ృతికిబీ నొప్పగు వేషము లాచరించు నే
యోజ విహారముల్ సలుపబీ నుల్లమునం గడు వేడ్క సేయు నే
యోజ విదగ్ధుఁ డై పలుకుబీ నొడ్డులకుం దగ దట్లు సేయఁగన్.

(భారతం. విరాట: 1 : 123).

'రాజుగారిభవనం కంటే రాజోద్యోగి ఇల్లు అందంగా ఉండకూడదు. రాజుగారితో సమానంగా దర్పం ప్రదర్శించేలా ఉద్యోగి వస్త్రధారణ చెయ్యకూడదు. రాజుగారు విహరించే ప్రదేశాల్లో తానూ విహరించాలని ఉబలాట పడకూడదు. రాజు మాటల్లో కనబడే లౌక్యం, తెలివితేటలు ఉద్యోగి మాటల్లో ఉండవలసిన అవసరం లేదు'.

పాండవుల పురోహితుడైన ధౌమ్యుడు పంచపాండవులకు ఉద్యోగిధర్మాలు బోధిస్తూ చెప్పిన మాటలివి. సంస్థ యజమాని ఇంటి కంటే సంస్థలో పని చేసే ఉద్యోగి ఇల్లు కొంచెం తక్కువ

 ISBN : 978-93-5300-753-9

స్థాయిలోనే ఉండడం మంచిది. సొంతఆస్తులతో కట్టుకున్నదే అయినా అది చూడగానే యజమాని మనస్సులో అసూయతో పాటు, అనుమానంకూడా పుట్టే అవకాశం ఉంది. వేషం కూడా అంతే. ఆధునికంగా ధరించే సూటు, బూటు వంటి వాటిల్లో కూడా యజమాని కంటే ఒక్క రవ్వ తక్కువ అందంగా కనిపించడమే మంచిది. యజమాని దంపతులు ఏదైనా విహారయాత్రకు పిలిచినా వారితోవెళ్ళకూడదు. ఒక వేళ, తెలియక వెళ్ళినా వారు ప్రథమ శ్రేణిలో ప్రయాణం చేస్తే ఉద్యోగి కొంచెం తక్కువ శ్రేణిలో ప్రయాణించాలి. లేకపోతే అపార్థాలు పెరిగే అవకాశం ఉంది.

చివరిదైనా చిన్నది కాని మాట– యజమాని ముందు,ముందు వెనుక ఆలోచించకుండా తన భావాలు వ్యక్తం చేయడం, అధికారి ముందు అనవసరంగా అధికంగా మాట్లాడడం చేయకూడదు. ఆ మాటల్లోంచే ఉద్యోగి బలహీనతలు కనిపెట్టి అదును చూసి యజమానులు ఆడిస్తారు. వివాదస్పద విషయాల్లో ముందు అధికారి అభిప్రాయం తెలుసుకొని దానికి అనుగుణంగా మాట్లాడడం మంచిది.అయితే, తిక్కన నాటి కాలాన్ని ద్రృష్టిలో పెట్టుకుని రాసిన పద్యమిది. ఈ పద్యాన్ని నేటి కాలానికి అన్వయించడంలో చిన్నపాటి మార్పులు చేసుకోవాలి. ప్రపంచం తనను తాను ఆధునీకీకరించుకుంటున్న కొద్దీ మనిషి ఆలోచనావిధానంలో కొత్త మార్పులు రావడం సహజం. ఈ కాలంలో మనుషులు ఎవరి కోసమైనా సరే తమ individualityని కోల్పోడానికి సిద్ధంగా లేరు. ఉద్యోగిని చూసి యజమాని అసూయ పడితే అది యజమాని తప్పు. ఉద్యోగి ఎంత బాగా పనిచేస్తున్నాడన్నదే యజమానికి ముఖ్యం. అతడి వ్యక్తిగత విషయాలు యజమానికి అనవసరం. అయితేమాట విషయంలో మాత్రం యజమాని అభిప్రాయం తెలుసుకున్నాక మన అభిప్రాయాన్ని వ్యక్తం చేయడమే మంచిది. మన అవసరానికి తగినట్టు ఔచిత్యంతో, లౌక్యంగాఉద్యోగాన్ని నెట్టుకురావడం ముఖ్యం. ఎటువంటి పరిస్థితిలోనైనా వ్యక్తిత్వాలను దిగాజార్చుకోవలసిన అవసరం లేదు. దీన్నే ఇప్పుడు Attitude అంటున్నారు. అది ఉండడం మంచిదే. అయితే పెద్ద వాళ్ళ దగ్గర వినయంగా ఉండడం కూడా చాల అవసరం.

కేవలం సత్యభాషణం, నిర్వహణ సామర్థ్యమే (Managing ability) కాదు, వ్యక్తిత్వ వికాసానికి (Personality Development) దోహదపడే సంభాషణా నైపుణ్యం (communication skills), నైతికమైన విలువలు (Moral values and ethics) మొదలైన ఎన్నో అంశాల గురించి ఆంధ్ర మహాభారతంలో ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి.వ్యక్తిత్వ వికాసం కోసం 3నెలల శిక్షణ, 3 వేల భక్షణ చేసే శిక్షణా కేంద్రాల వెంటబడే యువతరం ప్రాచీన సాహిత్యాన్ని, వ్యక్తిత్వ వికాస కోణంలో పరిశీలిస్తే అంతకు పదింతలు మనోధైర్యాన్ని, అపారమైన జ్ఞానాన్ని సంపాదించుకోవచ్చు.

# SIR C R REDDY COLLEGE

**(AIDED & AUTONOMOUS)**

**ELURU - 534 007, W.G. DIST. A.P. INDIA**

## కందుకూరి వీరేశలింగం శతవర్ధంతి సందర్భంగా

## అంతర్జాతీయ సదస్సు International Conference

# సాహిత్యం - సంస్కరణ దృక్పథం

## साहित्यस्य संस्करणदृक्पथः साहित्य-सुधारवादी दृष्टिकोण

**14th & 15th December 2018**

**Sponsored by UGC (Autonomous Grants)**



in Association with
**Department of Language & Culture, Govt. of A.P.**

## భావవీణ ప్రత్యేక సంచిక

International Journal of Telugu, Literary, Culture & Language Study
Special Edition. Vol - VI. Dec - 2018
ISSN No. 2456-4702 (UGC approved Journal No. 42500)

**Organised by Telugu & Oriental Languages
(Sanskrit & Hindi)**

*Affiliated to Adikavi Nannaya University, Rajamahendravaram*

(THRICE ACCREDITED AT 'A' LEVEL BY NAAC, BENGALURU : COLLEGE WITH POTENTIAL FOR EXCELLENCE)

AN ISO - 9001:2015 CERTIFIED INSTITUTION

ISSN : 2456-4702

UGC Approved Journal No. 42500

# భావవీణ

## *International*

# PEER REVIEW RESEARCH JOURNAL

**Vol. VI** (ప్రత్యేక సంచిక) **2018 డిసెంబర్**

ప్రత్యేక సంచిక సంపాదకులు

**డా. కొండ రవి**

## అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

సంపాదక వర్గం

**కుమారి లంకపల్లి జయశ్రీ**, తెలుగు అధ్యాపకులు

**శ్రీ మేడసాని శ్రీనివాసరావు**, తెలుగు అధ్యాపకులు

**శ్రీ బొట్ట శంకర్**, తెలుగు అధ్యాపకులు

**శ్రీ సంగినీడి రవి కుమార్**, తెలుగు అధ్యాపకులు

## సర్ సి ఆర్ రెడ్డి కళాశాల

(ఎయిడెడ్ & అటానమస్)

ఏలూరు - **534 007**, పశ్చిమగోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్

AFFILIATED TO ADIKAVI NANNAYA UNIVERSITY, RAJAMAHENDRAVARAM

(THRICE ACCREDITED AT 'A' LVEL NAAC, BENGALURU,

COLLEGE WITH POTENTIAL FOR EXCELLENCE)

భావవీణ - అంతర్జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

**ISSN : 2456-4702**

**Price : 800/-**

**Editorial Address :**

HOLY HOMES APARTMENTS
POSTAL COLONY, 4TH LINE - 522002
GUNTUR DISTRICT, A.P.
CELL : 7386529274,7989781963

DTP & Printed By

**ANDHRA PRINTERS**

POWERPET STATION ROAD
ELURU - 534 002
PHONE : 08812-252812
CELL : 9393174813
email : andhraprinters812@gmail.com

భావవీణ ప్రత్యేక సంచిక
ISSN : 2456 - 4702

BHAVA VEENA SPECIAL EDDITION
UGC Approved Journal No. 42500



మా తెలుగు తల్లికి మల్లెపూదండ - మా కన్న తల్లికి మంగళారతులు

# BHAVA VEENA (భావ వీణ)

International Journal of Telugu Literary, Culture & Language Study

అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయ పత్రిక

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2

**Vol. 16 - Issue. 01 - Spl, Edition - Monthly - Dec 2018 - ISSN No. : 2456 - 4702**

## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
*M.A.(Tel), M.Sc(Psy).M.Ed.,M.Phil(Edu),(Ph.D).,*
C/o. **Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
Dept. of Telugu,
Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jvothi,** M.A., PhD.
Dept. of Telugu,
Sri Padmavathi Mahila University,
Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
Dept. of Telugu, Faculty of Arts,
Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr Bust Venkataswatny,** M.A. (Tel)., M.A (San).,
M.A (Ling)., PhD.
HOD & Research Guide, Dept. of Telugu
PAS College, Pedammdipadu.

## ASSOCIATE EDITORS

1. Dr.**N. R. SADASIVA REDDY,** M.A.,M.Phil,PhD.
Asst. Professor,
Dept. of Telugu & Comparative Literature,
Sri Krishna Deva Raya University,
Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO,** M.A.,M.A.,M.Phil,PhlD.
Associate Professor, Dept. of Telugu,
Madras University,
CHENNAI, Tamiinadu.
3. **Dr. D. SESHUBABU,** M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept.of Hindi,
Moulana Azad National Urdu University,
HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.Phil., PhD.
Board of Studies Chairman,
Telangana University, Dichpally,
Nizansabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO**, M.A.,M.Phil,PhD.
Dept. of Telugu & O.L.,
Acharya Nagarjuna University,
Najarjuna Nagar, Guntur District.
6. **Dr A. JYOTHI**, M.A.,M.Phil,PhD.
Associate Professor, Dept. of Telugu,
Kakatiya University, Warangal District.
Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PbD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai
Tamilnadu.
8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University; Kadapa.

# శకుంతలోపాఖ్యానం: సంస్కరణ దృక్పథం

గరికిపాటి గురజాడ

పిహెచ్. డి. పరిశోధక విద్యార్థి(తెలుగు శాఖ)
హైదరాబాదు కేంద్రీయ విశ్వవిద్యాలయం
చరవాణి: 9010176407
విద్యుల్లేఖ: gurajada.garikipati@gmail.com

సాహిత్యం, సంస్కరణరెండూ అవిభక్తమైనవి. సమాజంలో జరుగుతున్న అన్యాయాలని, దురాక్రమణని, దురాచారాలనిఖండించడానికి కవులు తమ కలాన్ని సైతం ఖడ్గంగా వినియోగించారు. తెలుగు సాహిత్యంలోకి సంస్కరణ మార్గం ఈ కాలంలోనే వచ్చిందని స్పష్టంగా చెప్పలేము. కందుకూరి వీరేశలింగం పంతులుగారి కాలంలో సంస్కరణవాద రచనలు ఎక్కువగా వెలువడడం వల్ల, అంతకుముందు సాహిత్యంలో సంస్కరణ మార్గం లేదనుకుంటే పొరపాటే. ఒక వాదం అని పేరు పెట్టకపోయినా, కవులు ఎప్పుడూ సంస్కరణ దృష్టితోనే రచనలు చేశారు. మొత్తం ఇతివృత్తానిది అదే దృష్టి కాకపోయినా, కవులు వారి రచనల్లో భాగంగా చాలా చోట్ల ఆయా పాత్రల ద్వారా సంస్కరణవాదాన్ని బలంగా వినిపించారు. కవులు కొన్ని చోట్ల నేరుగా, కొన్నిచోట్ల అంతర్లీనంగా సంస్కరణ దృక్పథాన్ని ధ్వనింపజేస్తునే ఉంటారు.

తెలుగు సాహిత్యానికి అంతర్జాతీయ ఖ్యాతిని గడించిపెట్టిన రచనాల్లో ఆంధ్ర మహాభారతం అగ్రగణ్యమైనది. ఆంధ్ర మహాభారతం ఏ కాలంలో చదివినా ఆ కాలానికి అన్వయించుకుని, ఆచరించదగిన విషయాలుఎన్నో ఉన్నాయి. నన్నయ రచించిన భారతభాగంలో శకుంతలోపాఖ్యానం చాలా ప్రసిద్ధమైనది. తనని వివాహం చేసుకుని, భారతదేశానికి కాబోయే మహారాజుని బిడ్డగా కానుకనిచ్చి రాజ్యానికి వెళ్లి, తిరిగి వస్తాను అని శకుంతలకి మాటిచ్చిన దుష్యంతుడు ఎంతకీ తిరిగి రాకపోవడంతో తానే, బిడ్డని తీసుకుని దుష్యంతుడి వద్దకు వెళ్తుంది శకుంతల. దుష్యంతుడు సభలో కొలువుదీరి ఉండగా, తనకు జరిగిన అన్యాయాన్ని అందరికీ చెప్పుకుని, ఎంతో గొప్ప పోరాటం చేసి శకుంతల సాధించిన విజయం అనితరసాధ్యమైనది. శకుంతల పోరాడిన విధానం నేటి మహిళలకు గుండెనిబ్బరాన్ని, చైతన్యాన్ని కలిగిస్తూ తరతరాలకు నిలిచిపోయే సందేశాన్ని అందిస్తుంది.

ఆ. ఏల యెరుక లేని యితరుల యట్ల నీ
వెరుగ ననుచు బలికె దెరిగి యెరిగిబీ
యేన కాని దీని నెరుగ రిందొరు లని
తప్పబలుక నగునె ధార్మికులకు. (ఆంధ్ర. ఆది. 4: 79)

'అన్నీ బాగా తెలిసి కూడా నాకు తెలియదు అని ఎవరూ తెలివిలేని ఇతరులవలె ఎందుకు మాట్లాడతావు? ఇక్కడ దీనిని నేనే కాని ఇతరులెవ్వరూ ఎరుగరని (సాక్షులు లేరని) ధర్మాత్ములైనవారు అబద్ధమాడవచ్చునా?'

" 'తప్పబలుక నగునె ధార్మికులకు' అనే వాక్యం సాధారణలోకధర్మంగానూ, దుష్యంతుని పట్ల వర్తించే అధిక్షేపంగానూ గ్రహించవచ్చును" (ఆంధ్ర. ఆది. 4. పుట: 342)

ధర్మాత్ముడు అంటే ఎప్పుడూ ధర్మానికి కట్టుబడి ఉండేవాడు. ఎవరైనా చూస్తున్నారా? లేదా? సాక్షులు ఉన్నారా? లేదా? అని చూసుకుని తదనుగుణంగా ప్రవర్తించేవాడు కాదు. జీవితంలో జరిగే ప్రతీ సన్నివేశానికి ఏ సాక్షి ఉన్నా లేకపోయినా మనస్సాక్షి ఎప్పుడూ వెంటే ఉంటుంది. అది మనిషిని ఎప్పుడూ ప్రశ్నిస్తూ ఉంటుంది. ఇతరులను మాటలతో ఒప్పించడం సాధ్యమే కావచ్చు కానీ, మనస్సాక్షిని అలా ఒప్పించడం ఎవరి వల్ల కాదు. శకుంతల దుష్యంతుడిని ధర్మాత్ముడని సంబోధించడం గొప్ప సంభాషణానైపుణ్యం. ఆ మాట వినగానే ఒక్కసారిగా దుష్యంతుడి మనసాక్షి అతడిని ప్రశ్నించి తీరుతుంది. అందుకే, శకుంతల అధిక్షేపంగా అలా అంది. ధర్మానికి కట్టుబడని వారి వలె ఇలా మాట్లాడుతున్నావేంటి? అని ప్రశించింది. సన్నివేశం ప్రకారం అధర్మంగా ప్రవర్తిస్తున్నది దుష్యంతుడే. కానీ, ఇది నువ్వు కాదు, ధర్మనందనుడైన దుష్యంతుడు ఇలా ఉండదు అని అధిక్షేపంగా శకుంతల దుష్యంతుడిని ప్రశించింది.

ధర్మాధర్మ వివేచన అందుకే ప్రతీ మనిషికీ అవసరం. దుష్యంతుడు అలా వివేచన చేసుకోగలవాడే అని శకుంతల విశ్వాసం. ఆ విశ్వాసం, ధర్మబద్ధమైన తన నడవడికపై తనకున్న నమ్మకం తర్వాతి కథలో నిజమయ్యి శకుంతలాదుష్యంతులు ఒకటౌతారు.

క. సతియును గుణవతియు బ్రజా
వతియు ననువ్రతయు నైన వనిత నవ జ్ఞా
న్వితి ద్రృష్టి జూచు నతి దు
ర్మతి కిహముంబరము గలదె మతి బరికింపన్. (ఆంధ్ర. ఆది. 4: 82)

క. సంతత గృహమేధి ఫలం
బంతయు బడయంగ నోపు ననుగుణభార్యా
వంతుం డగువాడు క్రియా
వంతుడు దాంతుండు బుత్త్రవంతుండు నగున్. (ఆంధ్ర. ఆది. 4: 83)

'బుద్ధితో బాగా పరిశీలిస్తే %--% పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కారభావంతో చూచే మిక్కిలి దుర్బుద్ధి ఇహపరసుఖాలు రెండూ ఉంటాయా? (ఉండవనీ, రెంటికి చెడ్డ రేవడి అవుతాడని భావం)'.

'అనుకూలవతి అయిన భార్యగలవాడు కర్మలు ఆచరించగలుగుతాడు, ఇంద్రియాలను నిగ్రహించగలుగుతాడు, పుత్రసంతానాన్ని పొందగలుగుతాడు, గార్హస్థ్యధర్మాన్ని ఎల్లప్పుడూ ఆచరించే గృహస్థుడు పొందే ఫలాలనంతటినీ అందుకోగలుగుతాడు'.

దుష్యంతుడికి చాలా సమయం పరోక్షంగా ప్రశ్నలు సంధించిన శకుంతల ఇప్పుడు కాస్త నేరుగా హితబోధ చేస్తోంది. పతివ్రత, గుణవంతురాలు, సంతానవతి, అనుకూలవతి అయిన భార్యను తిరస్కారభావంతో చూసేవాడికి ఇహపరసుఖాలు కలుగుతాయా? (కలగవు) అనిదుష్యంతుడిని ప్రశ్నిస్తోంది. అందునా అనుకూలవతి అయిన భార్య దొరకడం ఏ తరంలోనైనా అదృష్టం. శకుంతలగుణవంతురాలు, కణ్వమహర్షి పెంపకంలో పరమసాధ్వీమణిగా శకుంతల ప్రకాశిస్తూ ఉంటే, తనని కాదంటూ దుష్యంతుడు ఎంత తప్పు చేస్తున్నాడో అతడికి తెలియజేస్తోంది శకుంతల.

నన్నయ రుచిరార్థసూక్తినిధిత్వానికి ఈ రెండు పద్యాలు చక్కటి ఉదాహరణలు. మొదట అనుకూలవతియైన భార్యను వదులుకోవద్దని హితవు పలికిన శకుంతల అటువంటి భార్యకు భర్త అయినవాడు ఎటువంటి ఫలాలను పొందుతాడో వివరించింది. తన మాటలనేర్పుతో దుష్యంతుడినిక్రమంగా తిరిగి ధర్మమార్గంలో పయనింపజేసేందుకు దోహదపడుతోంది. శకుంతల తాను ధర్మపక్షాన పోరాడుతూనే ధర్మస్వరూపుడిగా ప్రసిద్ధుడైన తన భర్తని తిరిగి ధర్మంవైపు నడిపిస్తోంది. శకుంతల సంస్కారం అటువంటిది.

"గృహస్థాశ్రమధర్మం నాలుగుబలమైన స్తంభాల మీద నిలబడిన వ్యవస్థ. ఆ నాలుగు స్తంభాలేవంటే- 1. యజమాని(భర్త, గృహస్థుడు, గృహమేధి), 2. కులసతి (భార్య, గృహిణి) 3. సంతానం (పుత్రిక, సుతుడు), 4. సత్యం (సత్యస్వరూపమైనపరమధర్మం, దాని వివిధభేదాలు). ఈ నాల్గింటి యొక్క ప్రాశస్త్యాన్ని గురించి చెప్పించడమే శకుంతల ధార్మికోపన్యాసంలోని వ్యాసహృదయం". (ఆంధ్ర. ఆది. 4. పుట: 344)

చ. 'గొనకొని వీడు నీకును శకుంతలకుం బ్రియనందనుండుబీ సే
కొని భరియింపు మీతనిబీ శకుంతల సత్యము వల్కె సాధ్విస
ద్వినుత మహాపతివ్రత వివేకముతో' నని దివ్యవాణి దా
వినిచె ధరాధినాథునకు విస్మయ మందగ దత్సభాసదుల్. (ఆంధ్ర. ఆది. 4: 105)

'ఈ భరతుడు నీకు, శకుంతలకు మిక్కిలి ముద్దుబిడ్డడు. ఈతనిని స్వీకరించి, పోషించుము. ఇల్లాలు, ఉత్తమ కీర్తి కలిగింది, మహాపతివ్రత అయిన శకుంతల వివేకంతో నిజం చెప్పింది' %--% అని ఆకాశవాణి ఆ సభాలోవారు విని ఆశ్చర్యపడేటట్లు రాజుకు వినిపించింది (ప్రకటించింది)'.

గృహస్థాశ్రమ ధర్మస్థాపనలోకుమారుడి ప్రాధాన్యాన్ని వివరిస్తున్న తరుణంలో శకుంతల ఇలా పలికింది. ' 'పుణ్యాత్ముడైన నీ కుమారుడు వంశకర్తయై పూనికతో నూరువాజపేయ యాగాలను చేస్తా'దని ఆకాశవీధిలో సరస్వతి (ఆకాశవాణి) మునులందరూ వినేటట్లుగా నాతో చేప్పింది' (ఆంధ్ర. ఆది. 4. పుట: 347). అయితే, శకుంతల చెప్పిన ఆకాశవాణి సత్యకథనాన్నిఅది పరోక్షప్రమాణం కావడం చేత దుష్యంతుడు నమ్మడు. కానీ, ఇప్పుడు నిండుసభలో సభికులంతా వింటుండగా ఆకాశవాణి మరొకసారి సత్యాన్ని పలికింది. ఇది ప్రత్యక్షప్రమాణం కనుక దుష్యంతుడు నమ్మాడు.

దుష్యంతుడుశకుంతలను అడిగిన ప్రశ్నలన్నింటికీ ఆకాశవాణి స్పష్టంగా సమాధానం చెప్పింది. నిండు సభలో అందరి ముందు ఆకాశవాణి పలకడంవల్ల అస్పష్టతకు, విమర్శలకు తావులేదు. ఎన్నో అవరోధాలను అధిగమించి సాధ్వి అనిపించుకున్న శకుంతల దుష్యంతుడి మనస్సుని తిరిగి గెలుచుకుంది. అతడి హృదయ సామ్రాజ్యంలో మహారాణిగా చిరస్థాయిగా నిలిచిపోయింది. భరతుడి భవిష్యత్తుని (దేశ భవిష్యత్తు) సువర్ణాక్షరాలతో లిఖించింది. ఆ మహా ఇల్లాలి కఠోర దీక్ష, తపనఫలించాయి. తాను ఏ ధర్మాన్నైతే బాల్యంలో కణ్వమహర్షి వద్ద అభ్యసించిందో, ఏ ధర్మాన్నైతే అన్ని వేళలా నమ్ముకుందో, ఏ ధర్మం కోసమైతే దుష్యంతుడితో వాదించిందో, ఆ ధర్మమే తనని గెలిపించింది. తన వ్యక్తిత్వానికి, సహనానికి, ధర్మబద్ధతకి, మనోనిగ్రహానికి ఎంతో పరీక్ష పెట్టిన భగవంతుడు తాను నమ్ముకున్న సత్యాన్ని (సత్యస్వరూపమైన పరమ ధర్మాన్ని) గెలిపించాడు. సత్యమే శాశ్వతమని నిర్ధారించాడు. ధర్మో రక్షతి రక్షితః అనే వేదవాక్యాన్నివాస్తవికంగా నిరూపణ చేశాడు.

"శకుంతలవివేకవతి. ఆమె తన ఉపన్యాసంలో క్రమంగా గ ృహిణి గొప్పతనాన్ని చెప్పి సాధ్వి అనిపించుకున్నది. చక్రవర్తి కాబోయే కొడుకు గొప్పతనాన్ని చెప్పి సద్వినుత అనిపించుకున్నది. సత్యం మహాపదార్థాలచేత రక్షింపబడుతుందని చెప్పి వంచించిన భర్తను శపించకుండా మహాపతివ్రత అనిపించుకున్నది". (ఆంధ్ర. ఆది. 4. పుట: 353)

నిజానికి ఆంధ్ర మహాభారతంలో శకుంతలాదుష్యంతుల మధ్య సంవాదం చాలా వివరంగా వర్ణించబడింది.అయితే ఈ పరిశోధన పత్రానికి ఉన్న పరిమితుల ద ృష్ట్యా కేవలం మూడు పద్యాలను మాత్రమే ఉటంకించడం జరిగింది.నిండు సభలో అద్భుతమైన, అనితరసాధ్యమైన విధంగా శకుంతల చేసిన ధార్మికోపన్యాసం భవిష్యాత్తరాలకి దిశానిర్దేశం చేస్తుంది, ప్రత్యేకించి స్త్రీలకి, నేటి గ ృహిణులకి చైతన్యాన్ని కలిగిస్తుంది.శకుంతల చేత ధర్మబోధ చేయించిన నన్నయకి ఉన్న సంస్కరణ ద ృక్పథం అణువణువునా ధ్వనిస్తుంది.

# DEPARTMENT OF TELUGU, UNIVERSITY OF MADRAS

## INTERNATIONAL SEMINAR

## Certificate

This is to certify that G. GURAJADA has participated / presided a session / presented a paper on Andhra Mahā Bhāratamlo Yaksha Prasnalu: Mānasika Pari Pakvatha. in the International Seminar on " RESEARCH: YESTERDAY, TODAY AND TOMORROW " organized by the Department of Telugu, University of Madras, Chennai-600 005 on 24-25 February 2016.

Dr. M. SAMPATH KUMAR, M.A.,Ph.D.,D.Litt.
PROFESSOR & HEAD
DEPARTMENT OF TELUGU
UNIVERSITY OF MADRAS
MARINA CAMPUS, CHENNAI - 600 005.

M. S——

(M.SAMPATH KUMAR)
Seminar Director

Scanned with CamScanner

# S.V.K.P. & Dr. K.S. RAJU Arts & Science College

Recognised by UGC as "College with Potential for Excellence" Accredited by NAAC with Grade "A"

Penugonda. W.G.Dist. A.P.

## INTERNATIONAL SEMINAR

దేశభాషలందు తెలుగు లెస్స

## CERTIFICATE

This is to Certify that Prof. / Dr. /Mrs. / Mr G. GURAJADA has participated and presented the paper entitled Andhra Mahā Bhāratam: Vyaktithva Vikāsam in the International Seminar "The glory and pomp of one thousand years old telugu literature (వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వైభవం) organised by Dept. of Telugu, S.V.K.P. & Dr. K.S. Raju Arts & Science College, Penugonda in collaboration with Adikavi Nannaya University, Rajamahendravaram.

During 2nd & 3rd April. 2018.

| | | |
|---|---|---|
| Dr. K.V.N.D. Vara Prasad | Dr. R. Rama Mohana Rao | Dr. N. Suryanarayana Raju |
| Convener, International Seminar | Director, International Seminar | Principal & Chairman |
| Asst. Professor, Dept. of Telugu | Reader & H.O.D, Telugu | International Seminar |
| Adikavi Nannaya University | | |

Scanned with CamScanner

# SIR C R REDDY COLLEGE

(AIDED & AUTONOMOUS), ELURU, W.G. DIST. A.P. INDIA

AFFILIATED TO ADIKAVI NANNAYA UNIVERSITY, RAJAMAHENDRAVARAM, THRICE ACCREDITED AT 'A' LEVEL BY NAAC

## INTERNATIONAL CONFERENCE అంతర్జాతీయ సదస్సు

*Sponsored by UGC (with Autonomy Grants)*

Organised by Telugu & Oriental Languages (Sanskrit & Hindi)

In Association with Department of Language & Culture, Govt. of A.P.

## సాహిత్యం-సంస్కరణ దృక్పథం

## साहित्यस्य संस्करणदृक्पथः साहित्य-सुधारवादी दृष्टिकोण



# *Certificate*

This is to certify that Dr. / Prof. / Mr. / Ms. G. GURAJADA

Professor / Assoc. Prof. / Asst. Prof. / Research Scholar / Student of PhD Telugu

University / College University of Hyderabad has participated

/ Presented a paper entitled Shakunthalopakhyanam: Samskarana Drikpatham

He / She also chaired a session / delivered invited talk on 14th & 15th December 2018.

Dr. Konda Ravi
CONVENER

Dr. K.V.S.P.B. Acharya
ORGANISING SECRETARY

Dr. K.A. Rama Raju
CHAIRMAN & PRINCIPAL